సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 2 । జూలై । 2025

ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

సీలేరులో నిలిచిన విద్యుత్ సరఫరా

జలవిద్యుత్ కేంద్రం నుంచి గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్తులైన్‌లో సాంకేతిక సమస్య వల్ల సరఫరా నిలిచిపోయింది. 8లో

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

84.69 శాతం మేర పింఛన్ల పంపిణీ

సామాజిక పింఛను సొమ్మును పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో మంగళవారం సాయంత్రానికి 84.69 శాతం మేరక సామాజిక పింఛన్లను పంపిణీ చేసినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. పాడేరు మండలం లగిశపల్లి పంచాయతీ ఉగ్గంగొయ్యి పీవీటీజీ గ్రామంలో పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,21,659మంది సామాజిక పింఛన్‌దారులకు రూ.51కోట్ల 13లక్షల 96వేల 500 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో ఈనెలలో అన్ని మండలాల కన్నా మారేడుమిల్లి టాప్‌లో ఉందన్నారు. 1904 మంది పింఛనుదారుల్లో తొలిరోజు 99శాతం పంపిణీ చేశారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గూడెంకొత్తవీధి: ఆధునిక విధానంలో సాగు చేపట్టాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి సూచించారు. మొండిగెడ్డలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఆయన కోరారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సందీప్, సేద్య విభాగం శాస్త్రవేత్త వెంకటేష్ పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్

అనంతగిరి (అరకులోయ టౌన్): అనంతగిరి మండలం పెదకోటలో అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జీవో నంబరు 51 ఉత్తర్వుల జారీ ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించడమే అన్నారు. పెసా గ్రామ సభను సంప్రదించకుండా ఏకపక్షంగా అనుమతులు జారీ చేసిన ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు చట్టం, అటవీ హక్కుల చట్టం, పెసా చట్టం ఆదివాసీలకు ప్రత్యేకమైన హక్కులున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 51ను రద్దు చేయకుంటే ఆదివాసీ ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆదివాసీ చట్టాల అమలుకు ఉద్యమం

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను
- యువత ముందుకు రావాలని పిలుపు

చింతూరులో జరిగిన సమావేశంలో నినాదాలు చేస్తున్న యువత

చింతూరు: ఆదివాసీ చట్టాల అమలు, హక్కుల సాధనకు యువత ఉద్యమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. మంగళవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అక్రమ కట్టడాలు కూల్చేవరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన చట్టాలు, హక్కులు దక్కాలంటే యువత మేలుకోవాలని, గ్రామస్థాయి నుంచి ఉద్యమానికి నాంది పలకాలని కోరారు. అక్రమ కట్టడాల వ్యవహారంలో న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించి అధికారులు సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నారని, గిరిజనేతరులకు మద్దతు ఇస్తూ ఏజెన్సీ చట్టాలను అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. అధికారులు అక్రమ కట్టడాల కూల్చివేతను త్వరితగతిన పూర్తిచేయాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన తెలిపారు.

ఆషాఢం.. వైవిధ్యం

ఆషాఢ మాస పండుగకు ఏర్పాటు చేసిన పందిరి వద్ద పూజలు చేస్తున్న బొడిపుట్టు గిరిజనులు

ఆదివాసీ గిరిజన గూడేలు భిన్నమైన సంస్కృతులు, విభిన్నమైన సంప్రదాయాలు, ఆచారాలకు నిలయాలు. ఏటా ఈ గ్రామాల్లో నిర్వహించే ఆషాఢ మాస పండగకు ఎంతో ప్రత్యేకత ఉంది. పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని.. ఎటువంటి అరిష్టం దరిదాపులకు రాకుండా ఉండాలని వేడుకుంటూ గ్రామ పొలిమేరల్లో శంకుదేవుడికి పూజలు చేస్తూ పూర్వీకుల ఆచార వ్యవహారాలను కొనసాగిస్తున్నారు.

- గిరిజన గూడాల్లో పండగ సందడి
- వ్యవసాయం కలిసిరావాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని పూజలు
- పూరీ జగన్నాథుని రథయాత్ర తరువాత నిర్వహణ
- గ్రామ పొలిమేరల్లో ఆధ్యాత్మిక వాతావరణం
- పూర్వీకుల నుంచి ఆనవాయితీ
- సంస్కృతీ సంప్రదాయాలను ప్రాధ్యాన్యమిస్తున్న ఆదివాసీ గిరిజనులు

ముంచంగిపుట్టు: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తారు. తూచ తప్పకుండా పాటిస్తారు. పూర్వీకులు చూపించిన దిశ నిర్దేశాన్ని నేటికీ ఆచరిస్తున్నారు. ఇదే కోవకు చెందినది ఆషాఢమాస పండగ. పూరీ జగన్నాథుని రథయాత్ర ముగిసిన తరువాత గ్రామపెద్దలు పండగ తేదీ నిర్ణయిస్తారు. ఈ ప్రకారం గ్రామాల్లో పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పందిరి ఎదుట ఏర్పాటుచేసిన దుక్కిటెద్దుల బండికి పూజలు

అరిష్టాల నుంచి గట్టెక్కి..

ఆదివాసీ తండాల్లో పూర్వం అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో రైతులు పంటలు వేసుకునే సమయంలో దుక్కిటెద్దులు, పెంపుడు జంతువులు, అందరికీ ఆరోగ్య సమస్యలు ఎదురయ్యేవి. ఈ మాసంలో అరిష్టాలు ఎక్కువై ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించేవి. వీటి నుంచి బయటపడేందుకు ఆషాడ మాసంలో ఊరి పొలిమేర వద్ద మేక, కోడిని బలి దానం చేసి ప్రత్యేక పూజలు చేసేవారు. అప్పటి నుంచి అన్నీ నష్టాలు తొలగిపోతూ రావడంతో సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తున్నారు. తరాలు మారినా పూర్వీకుల ఆచార వ్యవహారాలను ఆచరిస్తున్నారు. ఏటా ఈ పండగ చేయడం వల్లే తమకు ఎంతో మేలు జరుగుతోందని ఆదివాసీలు చెబుతున్నారు.

గ్రామ పొలిమేరలో..

గిరిజన గ్రామాల్లో పొలిమేరలోని రహదారి పక్కన ఆవు పేడతో అలికి శుద్ధి చేస్తారు. నాలుగు కర్ర పుల్లలతో పందిరి ఏర్పాటు చేసి శంకుదేవుడిని ప్రతిష్టిస్తారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి పందిరి కింద అరటి దిక్కుకు పెడతారు. ఇళ్ల వద్ద పనికిరాని పాత తట్టలు, బుట్టలు, చేటలు, చీపుళ్లను తీసుకు వచ్చి దిష్టి తీస్తారు. ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తారు. అనంతరం కోడి లేక మేకను బలి ఇస్తారు. మాంసాన్ని గ్రామంలో ప్రతి ఇంటికి కొద్ది కొద్దిగా పంచుతారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో ఎటువంటి అరిష్టాలు ఎదురు కావని, పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా జరుగుతాయని ఆదివాసీ గిరిజనుల నమ్మకం. ప్రస్తుతం గ్రామాల్లో పండగ ప్రారంభం కావడంతో సందడి నెలకొంది.

దోషాలు పోతాయని నమ్మకం

గ్రామాల్లో ఎటువంటి అరిష్టాలు కలగకుండా ఉండేందుకు ఆషాఢ మాస పండుగను ఏటా జరుపుకుంటున్నాం. జగన్నాథుని రథయాత్ర మొదలైన వారంలో ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. గ్రామ పొలిమేర వద్ద శంకుదేవుడికి పూజలు చేయడం వల్ల అన్ని దోషాలు పోయి మంచి జరుగుతుంది. – బొరిబొరి లచ్చన్న, గిరిజన రైతు, బొడిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

గ్రామ పొలిమేరలో దిష్టి తీసిన పాత చాపలు, చేటలు, చీపుర్లు

మొక్కను పాతుతారు. సాగుకు ఉపయోగించే కొత్త విత్తనాలను పందిరిపై చల్లుతారు. అలాగే మట్టితో కుండలు, ప్రమిదలు తయారు చేసి వాటిలో వత్తులు పెట్టి దీపం వెలిగిస్తారు. మట్టితో తయారుచేసి రెండు ఎద్దుల విగ్రహాలకు చెక్క, కర్రతో సిద్ధం చేసిన రెండు చక్రాల బండిని అమర్చుతారు. దీనిని పందిరి ఉత్తర

పూర్వీకుల నుంచి జరుపుకుంటున్నాం

పూర్వీకులు ఆచరించిన సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ వారి అడుగుజాడల్లో నడుస్తున్నాం. నాటి తరం నుంచి నేటి తరం వరకు ఈ ఆషాఢమాస పండగను జరుపుకుంటున్నాం. వ్యవసాయానికి, ఆరోగ్యానికి, గ్రామానికి ఎటువంటి నష్టం జరగకుండా ఈ పండగ నిర్వహిస్తున్నాం. – రెయ్యల మత్స్యరావు, గిరిజన రైతు, బొడిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

రైతుల ఆదాయం పెంపే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ

సాక్షి,పాడేరు: అధిక దిగుబడులతో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రోత్సహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని, వ్యవసాయానుబంధ రంగాల్లో 15శాతం వృద్ధి సాధించాలన్నారు. రైతులకు పంట రుణాలు పంపిణీ చేయడమే కాకుండా రిజర్వాయర్లలో చేపపిల్లల పెంపకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాఫీ రైతులు పార్చిమెంట్ కాఫీ గింజలు తయారీకి ప్రణాళికలు రూపొందించాలని, బేబీ పల్పర్ యూనిట్లు, మిరియాల శుద్ధి యంత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీడితోటల విస్తరణతో పాటు వై.రామవరం మండలంలో అవకాడో పండ్లతోటలు పెంచాలని సూచించారు. 40 హెక్టార్లలో పసుపు, కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రెండు వేల ఎకరాల్లో సూక్ష్మ సాగునీటి సదుపాయాలు లక్ష్యంగా నిర్దేశించామని వెల్లడించారు. ఈనెల 10వతేదీ నాటికి పశువులకు వ్యాక్సినేషన్, గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు పాల్గొన్నారు.

స్కూళ్లకు సెలవు ప్రకటించాలి

పాడేరు రూరల్: వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షంలో తడవడం వల్ల వ్యాధులు, రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని ఆయన కోరారు.

ఆశ్రమ విద్యార్థిని ఆకస్మిక మృతి

జిల్లా ఆస్పత్రి వద్ద వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

బంధవీధి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

విద్యార్థిని లక్ష్మి మృతదేహం

జి.మాడుగుల: మండలంలోని బంధవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మర్రి లక్ష్మి మృతి చెందింది. సొలభం పంచాయతీ చరుబయలు గ్రామానికి చెందిన పీవీటీజీ తెగకు చెందిన ఈమె 8వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం ఆమె తరగతి గదికి వెళ్తూ అకస్మాత్తుగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరింది. దీంతో ఆమెను ఉపాధ్యాయులు, నిర్వాహకులు హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేస్తున్నారు.

మృతికి కారణాలను తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు : బందవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మర్రి లక్ష్మి మృతికి గల కారణాలను వైద్యులనుంచి స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలుసుకున్నారు. ఆమె మరణ వార్తను తెలుసుకున్న ఆయన మంగళవారం జిల్లా ఆస్పత్రికి వచ్చారు. మార్చురీలోని విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. అక్కడి నుంచి బందవీధి ఆశ్రమ పాఠశాలకు వెళ్లారు. 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. లక్ష్మి మృతికి కారణాలను తెలుసుకున్నారు. వసతి గృహంలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులకు సిక్ లీడర్ మాత్రలు ఇస్తాందని వారు వివరించారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ధ్వజమెత్తారు. గత ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడి మృతి చెందినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చి ఏడాది పూర్తయిందన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి పాఠశాలలు, వసతి గృహాల్లో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

విస్తారంగా వర్షాలు

గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వానతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం వేకువజాము నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. మరో వైపు ఈదురుగాలులు విజృంభిస్తున్నాయి. వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డ, దిగుడుపుట్టు, కురిడి గెడ్డల ప్రవాహం ప్రమాదకరంగా మారింది. గెడ్డ అవతల గ్రామాల గిరిజనులను రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేసింది.

329.2 ఎంఎం వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం 329.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 62.8, కూనవరంలో 22.2, పెదబయలులో 20.6, మారేడుమిల్లిలో 19.2, జి.మాడుగులలో 19.2, వీఆర్‌పురంలో 16.4, అడ్డతీగలలో 16, గంగవరంలో 14.8, చింతూరులో 14.6, హుకుంపేటలో 14.6, పాడేరులో 13.2, ఎటపాకలో 12.8, వై.రామవరంలో 12.2, అరకులోయలో 11.8, అనంతగిరిలో 10.8, డుంబ్రిగుడలో 10.2, రాజవొమ్మంగిలో 9.6, రంపచోడవరంలో 9.4, దేవీపట్నంలో 7.8, చింతపల్లిలో 5.6, కొయ్యూరులో 3, జీకేవీధిలో 2.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.

హుకుంపేట ప్రాంతంలో వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లగెడ్డ

ఆర్‌అండ్‌ఆర్ ఇచ్చి తరలించండి

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వరద బాధితుల వినతి

కూనవరం: ఏటా సంభవించే వరదల వల్ల ఎన్నో విధాలుగా నష్టపోతున్నామని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి తరలిస్తే ఈ బాధలు ఉండవని సర్పంచ్‌లు, పలు పార్టీల నేతలు విన్నవించారు. స్థానిక సినిమాల్‌లో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన వరద సమీక్ష సమావేశంలో పలువురు మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా సోలార్ లైట్లు ఉపయోగించాలని, అత్యవసర రోడ్లు బాగు చేయాలని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని వారు కోరారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ నెల 30నాటికి పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఫేజ్ 1బీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ డ్రాఫ్ట్ అవార్డ్ నోటిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. గోదావరి వరదల సమాచారం ఎప్పటికప్పుడు ప్రతిఒక్కరికీ తెలిసేలా యాప్ రూపొందించామని చెప్పారు. ఏ సమస్య అయినా ఆ యాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. వరదల సమయంలో పై అంతస్తు లేని లాంచీలను ఉపయోగించాలని కోరారు. వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు ఇచ్చిన సలహాలు, సూచనలను మినిట్‌లో నమోదు చేయించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్ కె. శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్, సివిల్‌సప్లై ఆఫీసర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో వరద సమీక్షలో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

ముందస్తుగా ప్రణాళికలతో ఆదుకోండి

వీఆర్‌పురం: ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు కోరారు. మంగళవారం రేఖపల్లిలో మండల పరిషత్ ప్రాంగణంలో తహసీల్దార్ సరస్వతి అధ్యక్షతన గోదావరి వరదలపై నిర్వహించిన సమీక్షలో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బఫర్ స్టాక్, నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచడమే కాకుండా పడవలు, కిరోసిన్, డీజిల్‌ను సిద్ధం చేయాలని వారు కోరారు. వీఆర్‌పురం బీసీ కాలనీ నుంచి రేఖపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టి, కల్వర్టుల ఎత్తు పెంచితే పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. వరద పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో గుడారాలు వేసుకునేందుకు రైతులు అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వరద సహాయ కేంద్రాల్లో ఉన్న వారికి అటవీ అధికారులతో మాట్లాడి అటవీ ప్రాంతంలో తాగునీటి బోర్లు, మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సెల్ ఫోన్ టవర్లు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ వాళ్ల రంగరెడ్డి, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, సోడె నరసమ్మ, పిట్టా రామారావు, వడ్డనపు శారద, ఎంపీటీసీలు పునెం ప్రదీప్ కుమార్, బంధం విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో పుల్లయ్య, ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీరామగిరిలో స్థానికులతో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్

అందుబాటులో లేకుంటే చర్యలు

వరదల సమయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ హెచ్చరించారు. ముంపునకు గురయ్యే గ్రామాలను మంగళవారం ఆయన పరిశీలించారు. దీనిలో భాగంగా శ్రీరామగిరి, వడ్డెగూడెం, చింతరేగిపల్లి, రాజుపేట, రామవరం గ్రామాలను సందర్శించారు. అధికారులకు సూచనలు చేశారు.

విద్యుత్ వినియోగదారులకు 'హైవోల్టేజీ' షాక్

- పలుచోట్ల విలువైన గృహోపకరణాలు, పరికరాలు, మెషీన్లు దగ్ధం
- అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్లే నష్టం
- పలువురు బాధితుల ఆవేదన

పూర్ణ ఇంటర్నెట్ షాపులో కాలిపోయిన కంప్యూటర్, జెరాక్స్ మెషీన్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ముంచంగిపుట్టులో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల వినియోగదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. హైవోల్టేజీ కారణంగా గృహోపకరణాలు, పరికరాలు దగ్ధమయ్యాయి. మంగళవారం హైవోల్టేజి సరఫరా కావడంతో పూర్ణ ఇంటర్నెట్ షాప్‌లో కంప్యూటర్, జెరాక్స్ మెషీన్ కాలిపోయాయి. సుమారు రూ.30 వేల వరకు నష్టం జరిగిందని యజమాని పూర్ణారావు తెలిపారు. ప్రెస్ మార్ట్ షాప్‌లో రెండు ప్రిజ్‌లు, ఇన్వెర్టర్ కాలిపోయాయి. రుత్విక ఫ్యాన్సీ దుకాణంలో ఇంటర్నెట్ మోడమ్, నాలుగు బల్బులు దెబ్బతిన్నాయి. లక్ష్మి, శంకరారావు ఇళ్లల్లో కుక్కర్, ఫ్యాన్, నాలుగు విద్యుత్ బిల్బులు కాలిపోయాయి. పలు చోట్ల స్విచ్ బోర్డుల్లో మంటలు రావడంతో కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

ప్రెస్ మార్ట్ షాప్‌లో కాలిపోయిన ఫ్రిజ్‌లు

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వారం రోజులవుతున్నా..

స్థానిక ఇంజినీరింగ్ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైర్ మరమ్మతులకు గురవడంతో వారం రోజులుగా మండల కేంద్రంలో హైవోల్టేజీ నెలకొంది. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పట్టించుకోలేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వల్ల తాము నష్టపోవాల్సి వచ్చిందని వారు ధ్వజమెత్తుతున్నారు.

క్లుప్తంగా

సీలేరులో నిలిచిన విద్యుత్ సరఫరా

- చెట్ల కొమ్మలు పడి కాలిపోయిన జంపర్లు
- కొత్తవి అమర్చిన జెన్‌కో సిబ్బంది

సీలేరు: స్థానిక జలవిద్యుత్ కేంద్రం నుంచి గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్తులైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. స్విచ్ యార్డు లో 33/11 కేవీ విద్యుత్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు 11 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్ల కొమ్మలు పడటంతో స్విచ్ యార్డులో 33/11 కేవీ సంబంధించిన రెండు జంపర్లు కాలిపోయాయి. జెన్‌కో సిబ్బంది వెంటనే చెట్ల కొమ్మలను తొలగించి కాలిపోయిన జంపర్ల స్థానంలో కొత్తవి అమర్చి సరఫరా పునరుద్ధరించారు.

రేపు ప్రైవేట్ పాఠశాలలు బంద్

ఆరిలోవ(విశాఖ): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 3న బంద్‌కు పిలుపునిచ్చాయి. అపుస్మా ఉత్తరాంధ్ర రీజనల్ అధ్యక్షుడు ఎం.వి.రావుతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల యూనియన్ నాయకులు ఈ విషయాన్ని మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలపై త్రీమెన్ కమిటీలు తనిఖీలు చేపట్టడం, జిల్లా విద్యాశాఖ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ఆర్టీఈ 12.1.సి దరఖాస్తుదారులను చేర్చుకోవాలని ఒత్తిడి చేయడం, తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా నోటీసులు, హెచ్చరికలు జారీ చేయడం, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు దురుసుగా ప్రవర్తించడం, తదితర అంశాలపై నిరసనగా గురువారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయనున్నట్లు వారు ప్రకటించారు.

వాల్తేరు డీఆర్‌ఎం స్టీల్‌ప్లాంట్ సందర్శన

సమావేశంలో పాల్గొన్న ఉన్నత స్థాయి అధికారుల బృందం

ఉక్కునగరం: వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం లలిత్ బోహ్రా మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. రైల్వే, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ల మధ్య సహృద్భావ సంబంధాల పెంపు, సరుకు రవాణా కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల సమన్వయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఆయన రైల్వే అధికారుల బృందంతో సహా స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేశారు. సమావేశంలో సరుకుల రవాణా పెంపు, రేక్ నిర్వహణలో సామర్థ్యం పెంచడం, ప్రణాళికాయుతంగా ఇరు సంస్థల మధ్య వాణిజ్యం అభివృద్ధి తదితర అంశాలను చర్చించారు. రేక్ రిటెన్షన్ టైమ్ తగ్గించడం, మొత్తం కార్యాచరణ పనితీరును పెంచడానికి లాజిస్టిక్స్‌ను మెరుగుపరచడం వంటి విషయాలపై సమావేశంలో చర్చకు వచ్చాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీతో పాటు ఉన్నత స్థాయి అధికారుల బృందంతో జరిగిన సమావేశంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పాల్గొన్నారు.

మబ్బుల ముసుగులో సింహగిరి!

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి మంగళవారం మబ్బుల ముసుగులో సరికొత్త అందాలను సంతరించుకుంది. అల్పపీడనం కారణంగా విశాఖలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ సందర్భంగా సింహచలం కొండపైన, అడవివరం గ్రామంపై మేఘాలు కమ్ముకున్నాయి. పచ్చదనం కప్పుకున్న కొండలను మేఘాలు తాకుతున్న దృశ్యం అందరికీ కనువిందు చేసింది. – ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 32 కి.మీ.పరిధిలో లైట్లు, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు
- 132 పాయింట్లలో తాగునీటి సదుపాయం
- స్నానఘట్టం వద్ద గజ ఈతగాళ్లు, హైమాస్ లైట్ల ఏర్పాటు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి

గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, దేవస్థానం, ఇతర శాఖల అధికారులతో ఆయన గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న తెల్లవారు జాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు కొండ దిగువ తొలిపావంచా వద్ద భక్తుల రద్దీని, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూలు, రద్దీ ప్రదేశాల వద్ద తోపులాటలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

సౌకర్యాలు, వైద్య సేవలు

లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 32 కిలోమీటర్ల మేర 132 పాయింట్లలో తాగునీటి సౌకర్యం, 400 మరుగుదొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన అంబులెన్సులు, 32 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, ప్రతి శిబిరం వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్‌ఎం లేదా ఆశ కార్యకర్తను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తులు ప్రదక్షిణ చేసే మార్గంలో, రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులను సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశారు. సింహగిరిపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రణ పరికరాలతో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ తీగలు వేలాడకుండా చూసుకోవాలని, గిరి ప్రదక్షిణ జరిగే దారిలో వాహనాలు అడ్డదిడ్డంగా నిలపకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, డీసీపీలు, జేసీ

భక్తులకు సాంకేతిక సాయం

అత్యవసర సమయాల్లో ప్రత్యేక యాప్ ద్వారా సహాయం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి 'అస్త్రం'యాప్ ద్వారా సహాయం పొందవచ్చని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వాలని సీపీ ఆదేశించారు. పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, హనుమంతువాక, ఇసుకతోట జంక్షన్ల వద్ద తాత్కాలిక వంతెనలు నిర్మించాలని సీపీ సూచించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే కౌంటర్లు భక్తులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథరావు, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, రెవెన్యూ, దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ సమీక్ష

సింహాచలం: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్.. దేవస్థానం అధికారులతో కలిసి మంగళవారం ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. సింహాచలంలోని కొండదిగువ తొలిపావంచా, అడవివరం జంక్షన్, ముడసర్లోవ, విశాలాక్షినగర్, తెన్నేటి పార్క్, లుంబినీ పార్క్, బీచ్, వెంకోజీపాలెం, సీతమ్మధార, నరసింహనగర్, మాధవధారలోని మాధవ స్వామి ఆలయం, హైవే, ఎన్‌ఏస్టీఎల్, లక్ష్మీనగర్, గోపాలపట్నం మీదుగా తిరిగి సింహాచలం చేరుకునే గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల కోసం ప్రదక్షిణ మార్గంలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి పాయింట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర పారిశుధ్య పర్యవేక్షణకు సిబ్బందిని, డస్ట్‌బిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి వేళలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చీకటి ప్రదేశాల్లో వీధి దీపాలు, ముఖ్య కూడళ్లలో సూచిక బోర్డులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్గమధ్యలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ, దేవస్థానం అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లను పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ రమణ, జోనల్ కమిషన్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

సింహాచలం: గిరి ప్రదక్షిణకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. నగర సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథరావుతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గిరి ప్రదక్షిణ జరిగే అప్పుఘర్, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవదార, మురళీనగర్, ప్రహ్లాదపురం, కుమారి కల్యాణమండపం మీదుగా సింహాచలంలోని తొలిపావంచా వరకు ఆయన సందర్శించి.. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. సింహాచలం తొలిపావంచా వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలు

పాడేరులో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పుట్టినరోజు కేక్‌ను కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లిలో కేక్ కట్‌చేసి పాడేరు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్‌తో పార్టీ శ్రేణులు

పాడేరు : స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలను మంగళవారం పాడేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, తదితరులు బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

చింతపల్లి: స్థానిక ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో పాడేరు శాసన సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోరాబు అనూషదేవి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్,సర్పంచ్ దురియా పుష్పలత,మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంచి మనస్సుతో విశ్వేశ్వరరాజు అందరి మన్ననలు పొందారని చెప్పారు.పార్టీ ప్రారంభం నుంచి అనేక పదవులు అలంకరించి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఎంపీటీసీలు నాగలక్ష్మి, జయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, మాజీ ఎంపీపీ బూసరి కృష్ణారావు, పార్టీ నాయకులు సాగిన గంగన్నపడాల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జీకే వీధిలో..

గూడెంకొత్తవీధి: పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు జన్మదిన వేడుకలను మంగళవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో మండలకేంద్రం జీకే వీధిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని వారంతా ఆకాంక్షించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్,దామణాపల్లి సర్పంచ్ రామకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత్ రాజు, యువజన విభాగం అధ్యక్షుడు గబ్బాడి శేఖర్, లంబసింగి నరేశ్, అరకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రేగం శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త

డాబాగార్డెన్స్(విశాఖ): ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. విశాఖ నుంచి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్, ఎంజీబీఎస్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి వెళ్లే ఏసీ బస్సుల్లో చార్జీలు 10 శాతం తగ్గించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు వెల్లడించారు.

అమరావతి బస్సు

విశాఖ నుంచి బీహెచ్‌ఈఎల్ అమరావతి బస్సు సాధారణ చార్జీ రూ.1,870, 10 శాతం తగ్గింపుతో రూ.1,690, విశాఖ నుంచి ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,810, తగ్గింపుతో రూ.1,650, విశాఖ నుంచి విజయవాడ సాధారణ చార్జీ రూ.1,070, తగ్గింపుతో రూ.970, విశాఖ నుంచి రాజమండ్రి సాధారణ టికెట్ ధర రూ.600, 10శాతం తగ్గింపుతో రూ.550గా నిర్ణయించారు.

నైట్‌రైడర్ సీట్

విశాఖ నుంచి బీహెచ్‌ఈఎల్‌కు రూ.1,670 ఉన్న చార్జీ, 10 శాతం తగ్గింపుతో రూ.1,480, ఎంజీబీఎస్‌కు రూ.1,590 టికెట్ ధర, తగ్గింపుతో రూ.1,520, విజయవాడకు సాధారణ చార్జీ రూ.960, 10 శాతం తగ్గింపుతో రూ.870, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.540, తగ్గింపుతో రూ.520 కానుంది.

నైట్ రైడర్ బెర్త్

విశాఖ నుంచి బీహెచ్‌ఈఎల్‌కు సాధారణ చార్జీ రూ.1,940, 10 శాతం తగ్గింపుతో రూ.1,730, ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,860, తగ్గింపుతో రూ.1,680, విజయవాడకు రూ.1,110 కాస్తా, తగ్గింపుతో రూ.1010, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.630 కాస్తా తగ్గింపుతో రూ.600 అయింది.

ఇంద్ర బస్సు

విశాఖపట్నం నుంచి అమలాపురానికి సాధారణ చార్జీ రూ.550 కాగా, 10 శాతం తగ్గింపుతో రూ.500గా ధర నిర్ణయించారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

దివ్య అలంకరణలో వారాహి అమ్మవారు

అమ్మవారి సన్నిధిలో భక్తులు నిర్వహిస్తున్న సిరిజ్యోతి పూజ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం అమ్మవారికి చిత్ర కంకణ అలంకారం సర్వాంగ సుందరంగా జరిపారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ, రాత్రి శ్రీరుద్ర సహిత–శ్రీవారాహి హోమం నిర్వహించారు. ఈ హోమం ద్వారా కొత్త వ్యాపారాలు, ప్రాజెక్టుల్లో విజయాలు కలుగడంతోపాటు, కర్మ దోషాలు, ప్రతికూలతలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. బుధవారం రాత్రికి ఖడ్గమాల సహిత వారాహి హోమం నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో గురుమాత చేతుల మీదుగా అన్నసమారాధన చేశారు.

కారులో 107 కేజీల గంజాయి పట్టివేత : ఇద్దరి అరెస్టు

చోడవరం: కారులో తరలిస్తున్న 107 కేజీల గంజాయిని చోడవరం పోలీసులు పట్టుకున్నారు. చోడవరం ఏఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం బీఎన్‌రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గౌరీపట్నం జంక్షన్ వద్ద వడ్డాది నుంచి చోడవరం వైపు వస్తున్న కారును ఆపి సోదా చేశారు. అందులో మూడు బస్తాల్లో నింపిన 107 కేజీల గంజాయిని గుర్తించారు. దాంతో పాటు కారును స్వాధీనం చేసుకుని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితులు జితేంద్ర, వహీద్ అహ్మద్‌లను అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించామన్నారు.

గెడ్డలో పడి ఆటోడ్రైవర్ మృతి

8 గంటలు శ్రమించిన రెస్క్యూ బృందం

కట్ట వడ్డీకాసులు మృతదేహం

విషాదంలో భార్య రుక్మిణి

ఆటోడ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న రెస్క్యూ సిబ్బంది

కంచరపాలెం: బహిర్భూమికి వెళ్లిన ఆటోడ్రైవర్ నలందనగర్ ప్రధాన గెడ్డ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. రెస్క్యూ(జీవీఎంసీ, ఫైర్, పోలీస్) బృందం సుమారు 8 గంటలు శ్రమించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధిలోని నలందనగర్‌లో నివాసముంటున్న కట్ట వడ్డీకాసులు(48) ఆటో డ్రైవర్. తన భార్య రుక్మిణితో కలిసి స్క్రాప్ వ్యాపారం కూడా చేస్తుంటాడు. మంగళవారం ఉదయం సుమారు 6.30 గంటల ప్రాంతంలో నలందనగర్ జాతీయ రహదారి వంతెన కింద గెడ్డ పక్కకు బహిర్భూమికి వెళ్లాడు. తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం పడుతుండటంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. ఈ క్రమంలో ఆయన గెడ్డలోకి జారిపడ్డాడు. ఈ క్రమంలో వడ్డీకాసులు గట్టిగా కేకలు వేయడంతో.. భార్య రుక్మిణి వెంటనే అక్కడకు చేరుకుని తన చున్నీని అందించి కాపాడే ప్రయత్నం చేసింది. అయితే నీటి ప్రవాహానికి వడ్డీకాసులు కొట్టుకుపోయి వంతెన కింద గెడ్డలో చిక్కుకుపోయాడు.

సహాయక చర్యలు.. మృతదేహం వెలికితీత

సమాచారం అందుకున్న జీవీఎంసీ, ఫైర్, పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యవేక్షణలో మూడు క్రేన్లు, పొక్లెయిన్ల సహాయంతో వడ్డీకాసులును రక్షించేందుకు ప్రయత్నాలు చేశారు. సుమారు 8 గంటలు శ్రమించినప్పటికీ.. వడ్డీకాసులు ప్రాణాలు కాపాడలేకపోయారు. చివరికి రెస్క్యూ బృందం ఆయన మృతదేహాన్ని వెలికి తీసింది. కంచరపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జోనల్ కమిషనర్ రాము దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కళ్లముందే తన భర్త కాలువలో గల్లంతవడంతో భార్య రుక్మిణి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK ఫ్లాట్ 52 లక్షలకే అమ్మకం. ఫోన్ : 98663 21992 [V- 14019]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/- మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర।। 96032 16460/63007 25191. [V- 3577]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జూలో ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణకు చర్యలు

రాష్ట్ర అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే

జూలో నీటి ఏనుగు ఎన్‌క్లోజరు పరిశీలిస్తున్న అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అవసరమైన ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణకు నివేదిక సిద్ధం చేయాలని జూ అధికారులకు రాష్ట్ర అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే సూచించారు. జూ పార్కును మంగళవారం ఆయన సందర్శించారు. విశాఖ సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులతో కలసి ఆయన జూలో ఎన్‌క్లోజర్లు, వన్యప్రాణులను పరిశీలించారు. ఇటీవల జూలో నిర్మించిన కొత్త ఎన్‌క్లోజర్లు, మరమ్మతులు చేపట్టిన ఎన్‌క్లోజర్లను పరిశీలించి వాటి కోసం ఎంత నిధుల ఖర్చుచేశారు.. సీఎస్ఆర్ నిధులు ఏఏ సంస్థలు నుంచి వచ్చాయి.. తదితర వాటిపై ఆరా తీశారు. ఇటీవల పునరుద్ధరించిన సీతాకోక చిలుకల పార్కు, కొత్తగా నిర్మించిన అడవి కుక్కల పునరుత్పత్తి కేంద్రం అదనపు విభాగాన్ని పరిశీలించారు. వన్యప్రాణులు ఆరోగ్యం, వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన జూ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రాబందుల ఎన్‌క్లోజరు పనులు వేగవంతం చేయాలని సూచించారు. అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని రాబోయే ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విభాగంలో అవసరమైన ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణ, సీఎస్ఆర్ నిధుల ద్వారా మరమ్మతులు, సుందరీకరణ చేపట్టడానికి నివేదిక తయారు చేయాలన్నారు. వాటితో పాటు జూలో అక్వేరియం, స్లాత్‌బేర్, రెడ్‌నెక్డ్ వాల్లబీ, అడవి పిల్లుల ఎన్‌క్లోజర్‌ను పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్శనలో జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, జూ వైద్యుడు డాక్టర్ భాను, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కశింకోట: మండలంలోని చెరకాం గ్రామం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలు(70) మృతదేహాన్ని వెలికి తీసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు మంగళవారం తెలిపారు. 156 సెంటీమీటర్ల పొడవుతో ఆమె చామన ఛాయ రంగు కలిగి ఉందన్నారు. శరీరంపై ఎరుపురంగు రవిక ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కశింకోట: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.3.50 లక్షల విలువైన నాలుగు తులాల బంగారు గొలుసు, మంగళ సూత్రాలు చోరీ చేశారు. మంగళవారం సాయంత్రం కశింకోటలో ఈ ఘటన జరిగింది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. కశింకోటలోని భవానీకాలనీకి చెందిన చదరం సత్యవతి స్థానిక సంతబయల నుంచి తన ఇంటికి సాయంత్రం 6 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తోంది. ఈ సమయంలో సినీ ఫక్కీలో బైక్‌పై వచ్చి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను అడ్డుకొని బెదిరించి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు, మంగళ సూత్రాలను లాక్కొని జాతీయ రహదారి వైపు పరారయ్యారు. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు.

రాజీమార్గమే శ్రేయస్కరం

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ నెల 5న జరగనున్న మెగా లోక్ అదాలత్ సందర్భంగా.. న్యాయమూర్తి బ్యాంకు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాజీపడటానికి వీలున్న అన్ని కేసులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని వారికి సూచించారు. బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసుల్లో ఇరువర్గాలు రాజీ చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. చిట్‌ఫండ్ కంపెనీలు కూడా తమ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన జయప్రకాష్

మాజీ సీఎం వైఎస్ జగన్‌తో జయప్రకాష్

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దండి జయప్రకాష్ మంగళవారం కలిశారు. తాడేపల్లిలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు.

హిరమండలం గ్రామసభ

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం గ్రామసభ సర్పంచ్ డి.సుందరమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పలువురు కోరారు. వీధిలైట్ల సమస్యకు పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మీసాల వెంకటరామకృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

ఆమదాలవలస: శక్తి యాప్‌తో మహిళలకు అన్ని సమయాల్లో రక్షణ లభిస్తుందని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ జి.వాసుదేవరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. అనంతరం డ్రోన్ కెమెరా ద్వారా కాలేజీ, లక్ష్మీనగర్ పాఠశాల ఆవరణను పరిశీలించి అనుమానాస్పదంగా కనిపించిన ఆకతాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ సనపల బాలరాజు, జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన

హిరమండలం: మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫారుక్ హుస్సేన్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి నుంచి సుభలయలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జలుమూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గొళివి సుజాత అన్నారు. మంగళవారం జలుమూరు కేజీబీవీ, కరవంజ మోడల్ స్కూల్, బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణకు మందులను పిచికారీ చేసి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు..!

అమ్మకానికి సిద్ధంగా ఉన్న రసాయనిక ఎరువులు

- రసాయనిక ఎరువులతో తగ్గుతున్న భూసారం
- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- రైతులకు అవగాహన కల్పిస్తే మేలు

హిరమండలం: గత కొన్నేళ్లుగా వ్యవసాయం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పంటల సాగులో పశువుల ఎరువులు, పచ్చిరొట్ట వంటివి వాడేవారు. కానీ మారుతున్న కాలానుగుణంగా అధిక దిగుబడుల కోసం కొన్నేళ్లుగా ఏ పంట సాగు చేయాలన్నా రసాయనిక ఎరువులనే ఎక్కువగా వాడుతూ అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వాలు, వ్యవసాయ పరిశోధకులు సేంద్రియ సాగుతో రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. దీనిపై రైతుల్లో ఇప్పుడిప్పుడే కొంతమార్పు కనిపిస్తున్నా, ఇంకా పూర్తిస్థాయిలో సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపడం లేదు.

పాతపట్నం నియోజకవర్గంలో వరిసాగు వివరాలు		
మండలం	సాగుభూమి (హెక్టార్లలో)	రైతులు
హిరమండలం	3,364	6,716
పాతపట్నం	8,699	14,726
కొత్తూరు	10,374	13,914
ఎల్ఎన్‌పేట	4,464	8,487
మెళియపుట్టి	7,741	12,235

ప్రచారమేదీ..?

సేంద్రియ వ్యవసాయంపై అధికారులు సరైన ప్రచారం చేయకపోవడంతో వీటిపై రైతుల దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతులు రసాయన ఎరువులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు కనిపిస్తోంది. పాతపట్నం నియోజకవర్గంలోని ఎక్కువ గ్రామాల్లో ఇంకా రసాయనిక ఎరువులనే వాడుతున్నారు. దీనివలన భూసారం ఏటా తగ్గుతుండడంతో రైతులు నష్టాల బారినపడుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గం. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగంతో కలిగే ప్రయోజనాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సేంద్రియ ఎరువులు సహజ వనరుల నుంచి తయారయ్యే ఎరువులు. ఇవి మొక్కల పెరుగుదల, నేల ఆరోగ్యం మెరుగుపర్చడానికి ఉపయోగపడతాయి. సాధారణ సేంద్రియ ఎరువుల్లో కంపోస్టు, పశువుల ఎరువు, చేపల ఎరువు, ఎముకల పొడి ఇతర జంతు, మొక్కల వ్యర్థాలు ఉంటాయి.

సేంద్రియ ఎరువులతో లాభాలు

- సేంద్రియ ఎరువుల్లోని పోషకాలు నెమ్మదిగా విడుదల అవుతాయి. ఇవి మొక్కలకు క్రమంగా లభిస్తాయి.
- నేలను సారవంతం చేసి, నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.
- నేల భౌతిక, రసాయన, జీవ లక్షణాలను మెరుగుపరుస్తాయి.
- సేంద్రియ ఎరువుల వాడకంతో పర్యావరణానికి మేలు జరుగుతుంది.
- సేంద్రియ ఎరువుల వలన చీడపీడల బెడద తప్పడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు.
- ఆరుతడి పంటలకు, కూరగాయల సాగుకు ఎంతో ఉపయోగపడతాయి.
- సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడతాయి.

అవగాహన కల్పిస్తున్నాం

రసాయన ఎరువుల వాడకంతో భూమిలోని సారం తగ్గడంతో పాటు ఖర్చు పెరుగుతోంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏడాదికి ఏడాది సేంద్రియ వ్యవసాయం సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తోంది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలి.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, హిరమండలం

ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోంది

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు అన్నివిధాలుగా మేలు జరిగిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే రైతు భరోసా పథకం అందించామన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు ముంగిటకే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఏటా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా పథకం అమలుచేసి పారదర్శకత చాటుకున్నామన్నారు.

కానీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇంతవరకూ అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టకపోవడంతో రైతులు పెట్టుబడి సాయంకోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు మేలుచేసే ఒక్క నిర్ణయం కూడా తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అన్నదాతకు మేలు చేసేందుకు నిర్ణయాలు చేయాలని సూచించారు.

అంబేడ్కర్ అందరివాడు

విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, చింతాడ రవికుమార్ తదితరులు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ వ్యవహారాల రాష్ట్ర కమిటీ సభ్యుడు, పార్టీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలసలోని గాంధీనగర్‌లో యువకులు ఏర్పాటు చేసిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరండి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన జిల్లా పార్టీ అధ్యక్షతన జరిగే సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని హిరమండలం, ఎల్ఎన్‌పేట మండల పార్టీ అధ్యక్షులు మీసాల వెంకటరామకృష్ణ, పెనుమజ్జి విష్ణుమూర్తిలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగరంలోని అరసవల్లికి వెళ్లే రహదారిలో సన్‌రైజ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం 3 గంటలకు 'రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో' కార్యక్రమంపై సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఆధ్వర్యంలో కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ విద్యా బోధనతోనే గుర్తింపు

అప్పలనాయుడును సత్కరిస్తున్న ఎంఈవో రాంబాబు, తదితరులు

హిరమండలం: ఉత్తమ విద్యా బోధనతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈవో రాంబాబు అన్నారు. స్థానిక కోరాడ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ అసిస్టెంట్ ఎం.అప్పలనాయుడు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు ఆత్మీయంగా సత్కరించారు. రిటైర్మెంట్ అనేది ప్రతి ఉద్యోగికి సాధారణమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లంక రోజారాణి, హెచ్ఎం సాహు, ఉపాధ్యాయులు నారరామశంకరరావు, రాజారావు, సీఆర్పీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ధనుంజయను సత్కరిస్తున్న దృశ్యం

హిరమండలం: మొక్కలు నాటడమే కాకుండా, సంరక్షణ బాధ్యత తీసుకోవాలని రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు అన్నారు. మండలంలోని ఎం.అవలంగి పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ధనుంజయరావును మంగళవారం సన్మానించారు. ధనుంజయరావు ఉత్తమ విద్యాబోధన అందిస్తూనే, పర్యావరణ హితం కోసం మొక్కలు నాటించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సరోజిని, రమేష్, మాధవరావు, కృపానందం, జయ, రత్నకుమార్, దిలీప్, జ్యోతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



షేక్ పీరుసాహెబ్‌ను అభినందిస్తున్న రవికుమార్

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడిగా బురిడికంచరాం గ్రామానికి చెందిన షేక్ పీరుసాహెబ్‌ను నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను షేక్ పీరుసాహెబ్‌తో పాటు ఎంపీటీసీ సభ్యుడు బొత్స రమణ, నాయకుడు వండాక సూరపునాయుడు తదితరులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా షేక్ పీరుసాహెబ్‌కు రవికుమార్‌అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలి

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో పారిశుద్ధ్యంపై పంచాయతీ ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డు సభ్యులతో పాటు స్థానికులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పంచాయతీ వద్ద సర్పంచ్ బి.శంకర్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్(బుజ్జి), బీఎల్ శర్మలతో పాటు పలువురు గ్రామసభ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు.

రోగులతో కిటకిట

పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాల్లోని కొత్తబొన్ని, చింతగూడ, బెన్నగూడ, రేంగూడ, బైదలాపురం, లక్ష్మిగూడ, రంకిణి, సూర్యనారాయణపురం, ఎస్.ఎస్.మనుగు, ఎగువ మనుగు, బొన్ని, రామన్నగూడ, బగంతర తదితర గిరిజన గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడుతున్నారు. దీంతో వీరంతా వైద్యం కోసం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి వస్తుండడంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అలాగే సబ్ సెంటర్ల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వంచాలని పలువురు కోరుతున్నారు.

– పాతపట్నం

పారిశుద్ధ్య కార్మికుల గైర్హాజరు

నరసన్నపేట మేజరు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం పనులకు గైర్హాజరయ్యారు. దీంతో ఒక్కరోజుకే వీధుల్లో చెత్త పేరుకుపోయింది. జీతాలు చెల్లించాలంటూ విజ్ఞప్తి చేస్తూ పనులకు రాలేదు. పంచాయతీలో ఉన్న 60 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు గత వారం రోజులుగా ఆందోళనలో ఉన్నారు. వేతనాలు చెల్లించడానికి సంబంధించి అటు అధికారులు, ఇటు పాలకవర్గం నుంచి సరైన హామీ లేకపోవడంతో పనులకు హాజరు కాలేదు. వేతనాలు చెల్లించే వరకు పనులకు వచ్చేదిలేదని స్పష్టం చేశారు.

– నరసన్నపేట

తవ్వారు.. వదిలేశారు

కొత్తూరు మండలంలోని మెట్టూరు సమీపంలో అలికాం-బత్తిలి రోడ్డు మరమ్మతుల్లో భాగంగా రోడ్డు పాడైన ప్రాంతాలు వద్ద రోడ్డును తవ్వారు. అయితే తవ్విన రోడ్డు మరమ్మతులు చేయడంలో ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రోడ్డు తవ్వి సుమారు మూడు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– కొత్తూరు

మండల కమిటీల నియామకం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఆమదాలవలస నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ కమిటీల నియామకం చేపట్టింది.

ఆమదాలవలస మున్సిపాలిటీ

ఉపాధ్యక్షుడు	సాదు కామేశ్వరరావు
ఉపాధ్యక్షుడు	బగాది రాజేశ్వరి
జనరల్ సెక్రటరీ	సంపదరావు అరుణ్‌కుమార్
జనరల్ సెక్రటరీ	మద్దేల రంజిత్
జనరల్ సెక్రటరీ	కిల్లి సతీష్
జనరల్ సెక్రటరీ	సువ్వారి కోటేశ్వరరావు
కార్యదర్శి	హనుమంతు ధనుంజయ్
కార్యదర్శి	కుప్పిలి సత్యనారాయణ
కార్యదర్శి	ముచ్చా జగన్
కార్యదర్శి	నున్నగాపుల చిన్నారావు
కార్యదర్శి	లింగిబేరి అప్పన్న
ఎగ్జిక్యూటివ్ మెంబర్	బగాది ఆదిమహేష్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పెంకి వేణు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	అన్నెపు సంజయ్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సంపతిరావు గోవిందరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సూరపురెడ్డి అనిల్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పేడాడ సాయి
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సింగారపు సుజాత
ఎగ్జిక్యూటివ్ మెంబర్	జొన్నాడ నాగరాజు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సాదు భాస్కర్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పొన్నాడ విజయ్‌కృష్ణ

ఆమదాలవలస మండలం

ఉపాధ్యక్షుడు	చల్లా సింహాచలం
ఉపాధ్యక్షుడు	కె.సన్యాసిరావు
జనరల్ సెక్రటరీ	ఎంవీ రమణ
జనరల్ సెక్రటరీ	పొన్నాడ రాము
జనరల్ సెక్రటరీ	మెట్ట శారద
జనరల్ సెక్రటరీ	ఎన్ని భారతమ్మ
సెక్రటరీ	సనపల ధనుంజయరావు
సెక్రటరీ	సీపాన కృష్ణ
సెక్రటరీ	మంతేన రామారావు
సెక్రటరీ	తిర్లంగి శ్రీనివాసరావు
సెక్రటరీ	గురుగుబెల్లి తేజేశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	తమ్మినేని రాజారావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సింతు జగన్నాథం
ఎగ్జిక్యూటివ్ మెంబర్	అంబటి లక్ష్మణరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	దన్నాన సత్యనారాయణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	దాసరి బాస్కరరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	దుంగ పోలయ్య
ఎగ్జిక్యూటివ్ మెంబర్	దివనపు విష్ణుమూర్తి
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పేడాడ శ్రీరామ్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	మట్ట వసంత్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	బొడ్డేపల్లి అప్పలనాయుడు

సరుబుజ్జిలి మండలం

వైస్ ప్రెసిడెంట్	కోరాడ కృష్ణారావు
జనరల్ సెక్రటరీ	కొవిలాపు చంద్రశేఖర్
జనరల్ సెక్రటరీ	మామిడి తిరుపతిరావు
జనరల్ సెక్రటరీ	అదపాక గౌరినాయుడు
జనరల్ సెక్రటరీ	చల్ల యర్రయ్య
సెక్రటరీ	కరణం చిరంజీవి
సెక్రటరీ	బెండి జగ్గారావు
సెక్రటరీ	ఇల్లాకుల ప్రకాశరావు
సెక్రటరీ	సిరిపల్లి శ్రీనివాసరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	సిర్ల సింహాచలం
ఎగ్జిక్యూటివ్ మెంబర్	రుంకాన అప్పలనాయుడు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వండాన కృష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	ఊటపల్లి రామకృష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గొంటి ఈశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పనపల తవిటయ్య
ఎగ్జిక్యూటివ్ మెంబర్	మెండ సూర్యరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గొండు రామకృష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గొద్దు గడ్డెయ్య
ఎగ్జిక్యూటివ్ మెంబర్	కుసుమంచి హరీష్

బూర్జ మండలం

వైస్ ప్రెసిడెంట్	కొరికాన వెంకటరావు
వైస్ ప్రెసిడెంట్	కొంచాడ వెంకటరావు
జనరల్ సెక్రటరీ	లఖినేని కృష్ణమూర్తి
జనరల్ సెక్రటరీ	బెవర సూర్యారావు
జనరల్ సెక్రటరీ	దేవాడ మహేశ్వరరావు
జనరల్ సెక్రటరీ	ఈదు కోమలి
సెక్రటరీ	సిరిపురం శ్రీనివాసరావు
సెక్రటరీ	శివ్వాల బాలరాజు
సెక్రటరీ	నున్నగొప్పల రామకృష్ణ
సెక్రటరీ	గండ్రేటి రాము
సెక్రటరీ	సాకేటి శ్రీనివాసరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	మూడడ్ల సుదీష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గురుగుబెల్లి శ్రీనివాసరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	ఇల్లిపిల్లి నాగేశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పైల రామకృష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	చీడి మన్మథరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	కింజరాపు ఆనందరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పనుకు గంగాధర్‌రావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	నిమ్మక దైవాదీనం
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గార రాంబాబు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వియ్యపు భాగ్యారావు

పొందూరు మండలం

ఉపాధ్యక్షుడు	తమ్మినైన వాసుదేవరావు
ఉపాధ్యక్షుడు	పెద్దింటి రవిబాబు
జనరల్ సెక్రటరీ	కూన అన్నంనాయుడు
జనరల్ సెక్రటరీ	అనకాపల్లి గోవిందరావు
జనరల్ సెక్రటరీ	గార వెంకటరమణ
జనరల్ సెక్రటరీ	వడగ మోహనరావు
కార్యదర్శి	సింగూరు తేజేశ్వరరావు
కార్యదర్శి	మొకర శంకరరావు
కార్యదర్శి	కిల్లాన రమణ
కార్యదర్శి	గొలగాన రామినాయుడు
కార్యదర్శి	కంబాపు సూర్యారావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	అల్లంశెట్టి గిరిబాబు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గుడ్ల సాయిరాజ్
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వండాన శ్రీదేవి
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పోతురాజు ధర్మారావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వావిలపల్లి ధనుంజయరావు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వండాన అప్పలనాయుడు
ఎగ్జిక్యూటివ్ మెంబర్	వాల్ల సత్యనారాయణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	గూనాన కృష్ణ
ఎగ్జిక్యూటివ్ మెంబర్	పిట్ట రాము
ఎగ్జిక్యూటివ్ మెంబర్	కొన్న రాములు

కళాసీలకు అన్యాయం చేస్తున్నారు

మెళియాపుట్టి: వెట్టి చాకిరీ చేయిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సూరయ్య అన్నారు. మండలంలోని చాపర సీఐటీయూ కార్యాలయంలో కళాసీల మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ కూలీ రేట్లు ఇస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దూరవాసులు, దామోదర్, వెంకటరావు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

పాతపట్నం: స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన జెమ్స్ ఆస్పత్రి, విజయశ్రీ బ్లడ్ బ్యాంకు, సైలాడ సతీష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 96 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. అలాగే విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో 30 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ రామారావు, కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తు సాంకేతికతదే

నరసన్నపేట: భవిష్యత్తు అంతా సాంకేతికతదేనని, నైపుణ్యాలు సాధించే విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకొని స్కూల్ కనెక్ట్ ప్రోగాం ద్వారా కోర్సులు పూర్తి చేసిన పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆయన తన కార్యాలయంలో మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
అనకాపల్లి
బుధవారం । 2 । జూలై । 2025

ఏసీ బస్సుల్లో రాయితీ 8లో

ప్రయాణికులకు శుభవార్త. దూర ప్రాంతాలకు వెళ్లే ఏసీ బస్సుల్లో చార్జీలు 10 శాతం తగ్గించినట్లు విశాఖ ప్రజా రవాణా శాఖ అధికారి తెలిపారు.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.8/23.6

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.

పడుతూ.. లేస్తూ.. పాఠశాలకు..

- అధ్వానంగా సీతంపాలెం-పెదబోదిగల్లం రోడ్డు
- బురద రోడ్డులో విద్యార్థుల రాకపోకలు

నక్కపల్లి: శివారు గ్రామాల విద్యార్థులు రోజూ కిలోమీటర్ల మేర నడుచుకుంటూ పాఠశాలలకు చేరుకుంటున్న పరిస్థితులు ప్రమాదకరంగా పరిణమించాయి. వర్షం పడితే పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఇటువంటి దుస్థితినే నక్కపల్లి మండలంలో పెదదొడ్డిగల్లు, సీతంపాలెం(శివారు) గ్రామాల విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్నారు. సీతంపాలెం గ్రామంలో ఉన్న యూపీ పాఠశాలను ఇటీవల ప్రభుత్వం రేషనలైజేషన్‌లో పెదబోదిగల్లం పాఠశాలలో విలీనం చేసింది. గ్రామస్తులంతా ఆందోళన చేయడంతో తిరిగి యూపీ పాఠశాలను గ్రామంలోనే కొనసాగిస్తున్నారు. అయితే 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబోదిగల్లం పాఠశాలకు నిత్యం వెళ్లొస్తున్నారు. ఈ రెండు గ్రామాలకు మధ్యలో పోలవరం కాలువ ఉంది. కాలువ నిర్మాణపు పనులు చేసే కాంట్రాక్టర్ రోడ్డును ఇష్టానుసారం తవ్వేసి గ్రావెల్‌తో అప్రోచ్ రోడ్డు వేయకుండా తూతూమంత్రంగా మట్టి రోడ్డు వేసి వదిలేశారు. వర్షం పడితే ఈ రోడ్డు అంతా చెరువులా తయారై బురదగా మారుతోంది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో సీతంపాలెం, బోదిగల్లం రోడ్డు అధ్వానంగా తయారైంది. మంగళవారం బోదిగల్లం పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు నరకయాతన పడ్డారు. రోడ్డుపై చేరిన వర్షపు నీటిలో నుంచే ఇబ్బందులు పడుతూ పాఠశాలకు చేరుకున్నారు. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు బురదలో జారి పడి గాయాలు పాలవుతున్నారు. మట్టి రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఏమాత్రం ఆదమరిచినా బురదలో జారి పోలవరం కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. బడికెళ్లిన పిల్లలు ఇంటికి తిరిగొచ్చే వరకు భయాందోళనతో ఎదురు చూడాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు.

సీతం పాలెం, బోదిగల్లం గ్రామాల మధ్య బురదగా ఉన్న రోడ్డులో ఒకరి చేయి ఒకరు పట్టుకుని వస్తున్న విద్యార్థులు

బురద రోడ్డులో నీరు చేరడంతో గట్లపై నుంచి పడుతూ లేస్తూ రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

రోజంతా ముసురు..

అనకాపల్లిలో అత్యధికంగా 28.4 మి.మీ. వర్షపాతం

కె.జె.పురం జంక్షన్‌లో వర్షానికి ఇళ్లలోకి చేరిన నీరు

అనకాపల్లి టౌన్: జిల్లా అంతటా మంగళవారం తడిసి ముద్దయింది. ఇటీవల కాలంలో అక్కడక్కడ మాత్రమే కురిసిన వర్షం ఈసారి జిల్లా మొత్తాన్ని తడిపేసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులతో వాన కురుస్తూనే ఉంది. జిల్లాలో 215 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనకాపల్లిలో 28.4 మి.మీ., రావికమతంలో 21.4, ఎస్.రాయవరం 12.4, దేవరాపల్లి 11.2, కె.కోటపాడు 10, నక్కపల్లి 10, మాడుగుల 9.8, మునగపాక 9.4, బుచ్చెయ్యపేట 9.2, పరవాడ 9, చోడవరం 8, చీడికాడ 7.8, అచ్యుతాపురం 7.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. తమ పొలాలను దుక్కు దున్ని నారుమడులకు సిద్ధం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ ప్రతినిధుల పర్యటన

క్యాప్టివ్ పోర్టు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మిట్టల్ కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి: ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం మండలంలో పర్యటించారు. కంపెనీ కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను వారు పరిశీలించారు. అమలాపురం, డీఎల్ పురం, వేంపాడు, బోయపాడు తదితర గ్రామాల్లో స్టీల్‌ప్లాంట్ కోసం మొదటి విడతలో 2080 ఎకరాలను కేటాయించింది. జాతీయ రహదారి కాగిత నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. దీంతో కంపెనీ ప్రతినిధులు తమకు కేటాయించిన భూములను, అక్కడ ఏపీఐఐసీ వారు చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించిన భూములు, వాటి వివరాలు, భౌగోళిక స్వరూపాన్ని కంపెనీ ప్రతినిధులకు చూపించారు. ముఖ్యంగా డీఎల్‌పురం వద్ద కంపెనీ నిర్మించే క్యాప్టివ్ పోర్టు పరిసరాలను పరిశీలించారు. వెసల్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ కోసం మొదటి విడతలో పోర్టు నిర్మాణం కోసం 168 ఎకరాలు అవసరం కానుంది. వీరి మిట్టల్ కంపెనీ ప్రతినిధుల వెంట తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి ఉన్నారు.

లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారికి అర్చన

వీరవల్లి అగ్రహారం మోదమాంబను లక్ష పసుపు కొమ్ములతో అలంకరించిన దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారంలోని మోదమాంబ ఆలయ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని.. మంగళవారం మోదమాంబ అమ్మవారిని లక్ష పసుపు కొమ్ములతో పూజించారు. ఆలయ ప్రధాన అర్చకుడు డి.భరణిశర్మ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పసుపు కొమ్ములతో పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గౌరవప్రదమైనది వైద్య వృత్తి

- అంకితభావం, సేవా దృక్పథంతో మెలగాలి
- డాక్టర్స్ డే వేడుకలో కలెక్టర్ విజయ కృష్ణన్

వైద్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రజారోగ్యమే ధ్యేయంగా అంకిత భావంతో వైద్య సేవలందజేయాలని, రోగుల పట్ల సేవా దృక్పథంతో మెలగాలని కలెక్టర్ విజయ కృష్ణన్ వైద్యులందరికీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవంలో ఆమె జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ కృష్ణారావు తదితర వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో వైద్యుని పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని, ఆవశ్యకమైనదని, ప్రజారోగ్య శ్రేయస్సుకు వైద్యులందరూ కృషి చేయాలని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి సామాజిక ప్రగతికి దోహదపడతాయని ఆమె అన్నారు. జిల్లాలో గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల ఆవశ్యకత చాలా ఉందని, ఇప్పటికే చాలామంది వైద్యులు కృషి చేస్తున్నారని ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. సమాజంలో తమ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా వైద్య సేవలందజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జ్యోతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంతి, ఇతర ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

డీటీలకు తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు

తుమ్మపాల: డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం కలెక్టర్ విజయ కృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జూన్ 9వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన తహసీల్దార్ల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో అనకాపల్లి, పరవాడ, కశింకోట, మునగపాక మండల తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఆ తరువాత అక్కడ ఎవరినీ నియమించకపోవడంతో అక్కడే పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జీవో జారీ చేశారు. అనకాపల్లి డిప్యూటీ తహసీల్దార్ కె.కుమారస్వామి, పరవాడలో డీటీ ఎం.ఎస్.అరుణ్‌కుమార్, కశింకోటలో డీటీ జి.వి.రామకృష్ణ, మునగపాకలో డీటీ ఆర్.వి.మురళీధర్‌లకు అక్కడే తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

‘తొలి అడుగు’.. రసాభాస

- గ్రామ కమిటీలపై నిలదీసిన టీడీపీ నేతలు
- ప్రశ్నిస్తే.. సస్పెండ్ చేస్తానని ఎమ్మెల్యే బండారు చిందులు
- రెండు వర్గాలుగా విడిపోయి కార్యకర్తల కుమ్ములాట
- దేవరాపల్లిలో చెప్పులు విసురుకున్న పార్టీ నేతలు
- రచ్చరచ్చగా ‘సుపరిపాలనలో తొలి అడుగు’ సమావేశం

గ్రామ కమిటీల వివరాలపై ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే బండారు ఆగ్రహం

దేవరాపల్లి: తొలి అడుగే తడబడింది. అట్టహాసంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ నేతల ప్రశ్నలతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కంగుతిన్నారు. ఆగ్రహంతో ఊగిపోయారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహ ఆవరణలో టీడీపీ ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ సమావేశం రసాభాసగా మారింది. గ్రామాల్లో ఇంటింటా పర్యటనపై ఎమ్మెల్యే బండారు కేడర్‌కు దిశానిర్దేశం చేస్తుండగా.. సీనియర్ టీడీపీ నాయకుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ జోక్యం చేసుకొని ఏకపక్షంగా, రహస్యంగా జరిగిన టీడీపీ గ్రామ కమిటీల వివరాలు తెలిపాలని కోరారు. ఆయా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు చర్చిద్దామని ఎమ్మెల్యే మాట దాటవేశారు. మళ్లీ కొద్దిసేపటి తర్వాత దేవరాపల్లికి చెందిన మరో నాయకుడు గొర్లి దేముళ్లు సైతం నూతన కమిటీలలో ఎవరి పేర్లు ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొందని ప్రస్తావించడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే బండారు సహనం కోల్పోయారు. తీవ్ర ఆగ్రహావేశంతో ‘నీకు పార్టీతో సంబంధం లేదు, నిన్ను పార్టీ నుంచి ఎప్పుడో సస్పెండ్ చేశాన’ంటూ విరుచుకుపడ్డారు. సమావేశం ముగుస్తున్న క్రమంలో మళ్లీ చిటిమిరెడ్డి సూర్యనారాయణ గ్రామ కమిటీలపై నెలకొన్న గందరగోళంపై స్పష్టత ఇవ్వాలని కోరగా ‘ముందు నీ గ్రామంలో సమస్య పరిష్కరించుకో’ అంటూ ఎమ్మెల్యే శివాలెత్తిపోయారు. తనను పదేపదే ప్రశ్నిస్తే నిన్ను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని చిటిమిరెడ్డిపై కేకలు వేయడంతో అక్కడున్న పార్టీ శ్రేణులంతా నివ్వెరపోయారు. పదే పదే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని బెదిరింపులకు దిగడం పట్ల వారు తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంతమందిని సస్పెండ్ చేస్తారో చేసేయండి అంటూ బాహాటంగా ఒక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎదురుతిరిగారు. దీంతో సమావేశం ముగించి అక్కడి నుంచి ఎమ్మెల్యే కారు ఎక్కి వెళ్లిపోయారు. కేడర్ తప్పు చేస్తే సర్ది చెప్పాల్సిన ఎమ్మెల్యే బండారు సహనం కోల్పోయి మాట్లాడటాన్ని పార్టీ నాయకులు పలువురు బాహాటంగా తప్పు పట్టారు. అనంతరం టీడీపీలోని రెండు వర్గాలకు చెందిన టీడీపీ నేతలు పరస్పర దూషణలతో బాహాబాహికి దిగారు. ఒకరిపై మరొకరు చెప్పులు విసురుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. అరుపులు కేకలతో ఆ ప్రాంగణమంతా దద్దరిల్లిపోయింది.

దేవరాపల్లిలో రెండు వర్గాలుగా విడిపోయి కుమ్ములాటకు దిగిన టీడీపీ శ్రేణులు

ఆషాఢం.. వైవిధ్యం

ఆదివాసీ గిరిజన గూడేలు భిన్నమైన సంస్కృతులు, విభిన్నమైన సంప్రదాయాలు, ఆచారాలకు నిలయాలు. ఏటా ఈ గ్రామాల్లో నిర్వహించే ఆషాఢ మాస పండగకు ఎంతో ప్రత్యేకత ఉంది. పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని.. ఎటువంటి అరిష్టం దరిదాపులకు రాకుండా ఉండాలని వేడుకుంటూ గ్రామ పొలిమేరల్లో శంకుదేవుడికి పూజలు చేస్తూ పూర్వీకుల ఆచార వ్యవహారాలను కొనసాగిస్తున్నారు.

ఆషాఢ మాస పండుగకు ఏర్పాటు చేసిన పందిరి వద్ద పూజలు చేస్తున్న బొడిపుట్టు గిరిజనులు

- గిరిజన గూడాల్లో పండగ సందడి
- వ్యవసాయం కలిసిరావాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని పూజలు
- పూరీ జగన్నాథుని రథయాత్ర తరువాత నిర్వహణ
- గ్రామ పొలిమేరల్లో ఆధ్యాత్మిక వాతావరణం
- పూర్వీకుల నుంచి ఆనవాయితీ
- సంస్కృతీ సంప్రదాయాలను ప్రాధాన్యమిస్తున్న ఆదివాసీ గిరిజనులు

ముంచంగిపుట్టు: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తారు. తూచ తప్పకుండా పాటిస్తారు. పూర్వీకులు చూపించిన దిశ నిర్దేశాన్ని నేటికీ ఆచరిస్తున్నారు. ఇదే కోవకు చెందినది ఆషాఢమాస పండగ. పూరీ జగన్నాథుని రథయాత్ర ముగిసిన తరువాత గ్రామపెద్దలు పండగ తేదీ నిర్ణయిస్తారు. ఈ ప్రకారం గ్రామాల్లో పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అరిష్టాల నుంచి గట్టెక్కి..

ఆదివాసీ తండాల్లో పూర్వం అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో రైతులు పంటలు వేసుకునే సమయంలో దుక్కిటెద్దులు, పెంపుడు జంతువులు, అందరికీ ఆరోగ్య సమస్యలు ఎదురయ్యేవి. ఈ మాసంలో అరిష్టాలు ఎక్కువై ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించేవి. వీటి నుంచి బయటపడేందుకు ఆషాఢ మాసంలో ఊరి పొలిమేర వద్ద మేక, కోడిని బలి దానం చేసి ప్రత్యేక పూజలు చేసేవారు. అప్పటి నుంచి అన్నీ నష్టాలు తొలగిపోతూ రావడంతో సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తున్నారు. తరాలు మారినా పూర్వీకుల ఆచార వ్యవహారాలను ఆచరిస్తున్నారు. ఏటా ఈ పండగ చేయడం వల్లే తమకు ఎంతో మేలు జరుగుతోందని ఆదివాసీలు చెబుతున్నారు.

గ్రామ పొలిమేరలో..

గిరిజన గ్రామాల్లో పొలిమేరలోని రహదారి పక్కన ఆవు పేడతో అలికి శుద్ధి చేస్తారు. నాలుగు కర్ర పుల్లలతో పందిరి ఏర్పాటు చేసి శంకుదేవుడిని ప్రతిష్ఠిస్తారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి పందిరి కింద అరటి మొక్కను పాతుతారు. సాగుకు ఉపయోగించే కొత్త విత్తనాలను పందిరిపై చల్లుతారు. అలాగే మట్టితో కుండలు, ప్రమిదలు తయారు చేసి వాటిలో వత్తులు పెట్టి దీపం వెలిగిస్తారు. మట్టితో తయారుచేసి రెండు ఎద్దుల విగ్రహాలకు చెక్క, కర్రతో సిద్ధం చేసిన రెండు చక్రాల బండిని అమర్చుతారు. దీనిని పందిరి ఉత్తర దిక్కుకు పెడతారు. ఇళ్ల వద్ద పనికిరాని పాత తట్టలు, బుట్టలు, చేటలు, చీపుళ్లను తీసుకు వచ్చి దిష్టి తీస్తారు. ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తారు. అనంతరం కోడి లేక మేకను బలి ఇస్తారు. మాంసాన్ని గ్రామంలో ప్రతి ఇంటికి కొద్ది కొద్దిగా పంచుతారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో ఎటువంటి అరిష్టాలు ఎదురు కావని, పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా జరుగుతాయని ఆదివాసీ గిరిజనుల నమ్మకం. ప్రస్తుతం గ్రామాల్లో పండగ ప్రారంభం కావడంతో సందడి నెలకొంది.

గ్రామ పొలిమేరలో దిష్టి తీసిన పాత చాపలు, చేటలు, చీపుర్లు

రూ.1.2 కోట్ల విలువైన సెల్‌ఫోన్ల రికవరీ

రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను లబ్ధిదారునికి అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

రికవరీ చేసిన సెల్‌ఫోన్లు పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: చోరీకి గురైన 625 సెల్‌ఫోన్లను పదో విడతలో రికవరీ చేశామని, వీటి విలువ సుమారు రూ.1.20 కోట్లు ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5,600 ఫిర్యాదులు నమోదు కాగా.. 9 విడతల్లో 2,711 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. 10వ విడతతో కలిపి మొత్తం 3,336 మొబైల్ ఫోన్లను (రూ.5.27 కోట్ల విలువైన) రికవరీ చేశామన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో ఫోన్లను కనుగొని రికవరీ కోసం జిల్లా పోలీసులతో ప్రత్యేకంగా ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండా, పోలీస్ స్టేషన్‌కు రాకుండా, మొబైల్ వివరాలను తెలియజేసి రికవరీ చేసే విధానాన్ని అమలు చేసి ప్రజలకు సౌలభ్యం కల్పించామన్నారు. ఫోన్ పోయిన వెంటనే సెల్ నంబర్ 93469 12007కు హాయ్ అని వాట్సప్ మెసేజ్ పంపి వచ్చే లింకు ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చన్నారు. www.ceir.gov.in వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, సైబర్ సెల్–సోషల్ మీడియా సీఐ బెండి వెంకటరావు, ఎస్‌బీ సీఐలు బాల సూర్యారావు, లక్ష్మణమూర్తి, టి.లక్ష్మి, రమేష్, గఫూర్, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేష్ బాబు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

బి.కె.పల్లిలో పింఛను సొమ్ము అందిస్తున్న హోం మంత్రి అనిత

కోటవురట్ల: బి.కె.పల్లిలో పింఛను పంపిణీ కార్యక్రమాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం ప్రారంభించారు. లబ్ధిదారుకు నేరుగా నగదు అందజేస్తున్నామని, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పట్టాభిరామ్ సూచనలు అమూల్యం

పట్టాభిరామ్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న మాజీ వీసీ ముర్రు, ఖాసిమ్ (ఫైల్)

కె.కోటపాడు : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ మృతి పట్ల అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ సంతాపం తెలిపారు. తమ విద్యా సంస్థలతో పట్టాభిరామ్‌కు మంచి అనుబంధం ఉందని తెలిపారు. గతంలో ఇక్కడ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయాందోళనలను తొలగించి మానసికంగా సిద్ధం చేసేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అమూల్యమైన సూచనలు అందించారని తెలిపారు. పట్టాభిరామ్ మృతి పట్ల ఖాసిమ్‌తో పాటు రాజమండ్రి నన్నయ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు సంతాపాన్ని ప్రకటించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు అభినందన

రావికమతం: ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పి.వి.ఎన్. మాధవ్‌ను భాజపా స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన మాధవ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాధవ్‌ను కలిసిన రాజేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేశ్వరరావు ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ సహకారంతో రావికమతం మండలం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

మాధవ్‌ను అభినందిస్తున్న బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు

అల్లూరి జయంతి ఏర్పాట్ల పరిశీలన

పార్కులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలను ఈ నెల 4న కృష్ణదేవిపేటలో అల్లూరి సమాధుల వద్ద ఘనంగా నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. ఇక్కడ అల్లూరి పార్కును ఆయన మంగళవారం పరిశీలించారు. పార్కులో ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అధికారులు, కమిటీ సభ్యులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీఓ వి.వి. రమణ, అధికారులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 32 కి.మీ.పరిధిలో లైట్లు, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు
- 132 పాయింట్లలో తాగునీటి సదుపాయం
- స్నానఘట్టం వద్ద గజ ఈతగాళ్లు, ఫ్లైమాస్ట్ లైట్ల ఏర్పాటు
- కలెక్టర్ హరేందిర ప్రసాద్ వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, డీసీపీలు, జేసీ

గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, దేవస్థానం, ఇతర శాఖల అధికారులతో ఆయన గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న తెల్లవారుజాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తుల రద్దీ, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూలు, రద్దీ ప్రదేశాల వద్ద తోపులాటలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

సౌకర్యాలు, వైద్య సేవలు

లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 32 కిలోమీటర్ల మేర 132 పాయింట్లలో తాగునీటి సౌకర్యం, 400 మరుగుదొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన అంబులెన్సులు, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశా కార్యకర్తను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తులు ప్రదక్షిణ చేసే మార్గంలో, రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమైనచోట జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులను సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశారు. సింహాచలంలో అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రణ పరికరాలతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ తీగలు వేలాడకుండా చూసుకోవాలని, గిరి ప్రదక్షిణ జరిగే దారిలో వాహనాలు అడ్డదిడ్డంగా నిలపకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

భక్తులకు సాంకేతిక సాయం

అత్యవసర సమయాల్లో ప్రత్యేక యాప్ ద్వారా సహాయం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి 'అస్త్రం'యాప్ ద్వారా సహాయం పొందవచ్చని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వాలని సీపీ ఆదేశించారు. పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, హనుమంతవాక, ఇసుకతోట జంక్షన్ వద్ద తాత్కాలిక వంతెనలు నిర్మించాలని సీపీ సూచించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే కౌంటర్ల వద్ద భక్తులు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథ రావు, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, భీమిలి ఆర్డీవో సంగీత మాధుర్, రెవెన్యూ, దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ సమీక్ష

సింహాచలం: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్.. దేవస్థానం అధికారులతో కలిసి మంగళవారం ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. సింహాచలంలోని కొండదిగువ తొలిపావంచా, అడవి వరం జంక్షన్, ముడసర్లోవ, విశాలాక్షినగర్, తెన్నేటి పార్క్, బుంటినీ పార్క్, బీచ్, వెంకోజీపాలెం, సీతమ్మధార, నరసింహనగర్, మాధవధారలోని మాధవస్వామి ఆలయం, హైవే, ఎన్ఏడీ, లక్ష్మీనగర్, గోపాలపట్నం మీదుగా తిరిగి సింహాచలం చేరుకునే గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. భక్తుల కోసం ప్రదక్షిణ మార్గంలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి పాయింట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర పారిశుధ్య పర్యవేక్షణకు సిబ్బందిని, డస్ట్‌బిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చీకటి ప్రదేశాల్లో వీధి దీపాలు, ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్గమధ్యలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ, దేవస్థానం అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లను పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ రమణ, జోనల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: గిరి ప్రదక్షిణ సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ హరేందిర ప్రసాద్.. నగర సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథరావుతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గిరి ప్రదక్షిణ జరిగే అప్పుఘర్, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవధార, మురళీనగర్, ప్రహ్లాదపురం, కుమారి కల్యాణమండపం మీదుగా సింహాచలంలోని తొలిపావంచా వరకు సందర్శించి.. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. సింహాచలం తొలిపావంచా వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత

- కలెక్టర్ విజయ కృష్ణన్

జాతీయ డెంగ్యూ మాసోత్సవ గోడపత్రిక, కరపత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జూలై నెలను డెంగ్యూ నివారణ మాసంగా పాటించాలని, డెంగ్యూ వ్యాప్తి పట్ల ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో జాతీయ డెంగ్యూ మాసోత్సవం –2025 పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా డెంగ్యూపై అవగాహన కల్పించేందుకు మాసోత్సవాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో బాలాజీని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా వ్యాప్తంగా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచడం, తాగునీటి నిల్వల వద్ద చెత్త తొలగించడం, దోమల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవడం వంటి అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. నెల రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా మలేరియా అధికారి కె.వి. దొరను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, గ్రామీణ శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని సమష్టిగా డెంగ్యూపై జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ ఆస్పత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ కృష్ణారావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జ్యోతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంతి, అధికారులు పాల్గొన్నారు.

హోం మంత్రి రైతులను మభ్యపెట్టడం తగదు

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు ధ్వజం

మాట్లాడుతున్న అప్పలరాజు

నక్కపల్లి: మండలంలో రెండో విడత భూములు సేకరిస్తున్న గ్రామాల్లో రైతులకు హోం మంత్రి వంగలపూడి అనిత వాస్తవాలు చెప్పాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో మాట్లాడుతూ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం మొదటి విడతలో 2080 ఎకరాలు కేటాయించగా, రెండో విడతలో 3,800 ఎకరాల సేకరణ కోసం కాగిత, నెల్లిపూడి, డీఎల్‌పురం, వేంపాడు గ్రామాల్లో రైతులతో గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సోమవారం హోం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో రైతులతో సమావేశమై మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. భూములిస్తేనే అభివృద్ధి జరుగుతుందని రైతులను ఒప్పించే ప్రయత్నం చేశారన్నారు. దీన్ని వారంతా వ్యతిరేకించడంతో మాట మార్చారన్నారు. నోటిఫికేషన్ ఇంకా విడుదల చేయలేదని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక పక్క ఏపీఐఐసీ వారు గ్రామాల వారిగా సేకరించే భూములను సర్వే నంబర్లతో సహా గుర్తించి కలెక్టర్‌కు లేఖ రాస్తే, ఇంకా నోటిఫికేషన్ ఎందుకన్నారు. భూములు తీసుకునే ఉద్దేశం లేనప్పుడు గ్రామసభలు ఎందుకు పెడుతున్నారని నిలదీశారు. ఆర్సెలర్ మిట్టల్ కంపెనీకి డీఎల్‌పురం వద్ద క్యాప్టివ్ పోర్టు నిర్మించేందుకు అనుమతి ఇచ్చారన్నారు. దాంతో మత్స్యకారులు వేట సాగించే పరిస్థితి ఉండదన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేస్తే పక్కనే క్యాంపు కార్యాలయం వద్ద నుంచి హోం మంత్రి వచ్చి వారి సమస్య తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. ఓట్లేసి గెలిపించిన రైతుల కంటే కార్పొరేట్ వర్గాలే ముఖ్యమనే ధోరణితో వ్యవహరించారన్నారు. సమావేశంలో సీపీఎం మండల కన్వీనర్ మనబాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

9న భవన నిర్మాణ కార్మికుల సమ్మె

అనకాపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన ఒక రోజు సమ్మె తలపెట్టినట్టు ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. మండలంలో మూలపేట గ్రామంలో మేస్త్రి సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. సహజ, ప్రమాదంలో చనిపోయిన కార్మికులు కుటుంబాలకు ఇచ్చే బీమా పరిహారం, పెండింగ్ క్లెయిమ్స్‌కు తక్షణమే నిధుల విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్ అప్పలరాజు, కార్యదర్శి మారేడిపూడి సత్యనారాయణ, నాయకులు గుమ్మాల నాగేశ్వరరావు, సత్తిబాబు, గణేష్, రామునాయుడు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ

చెరకు నాట్లు ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం

అనకాపల్లి: వర్షాధార రైతులు ఈ నెల 15వ తేదీ లోపు చెరకు విత్తుకోవాలని, లేకుంటే ఆలస్యంగా నాటితే గణనీయంగా దిగుబడులు తగ్గుతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ టి.శ్రీలత తెలిపారు. నాటే ముందు 10 శాతం సున్నంనీటి ద్రావణంలో ముచ్చెలను ముంచి నాటుకోవాలన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాల కారణంగా వరి సాగులో కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున్న పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరాకు 80–100 గ్రా. చొప్పున 20–25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4–7 రోజులలో వేసుకోవాలన్నారు. వెద సాగులో కలుపు నివారణకు పెండిమిథాలిన్ సీఎస్ 38.7, 700 మి.లీ ను 200 లీటర్ల నీటిలో కలిపి వరి విత్తిన 2 రోజులలోపు పిచికారీ చేయాలన్నారు. రుతుపవనాలు కాలం కాబట్టి రైతులు వారి పశు సంపదకు నట్టల నివారణకు కచ్చితంగా చేయించుకోవాలని, దీని కోసం మార్కెట్లో దొరికే ఆల్బెండజోల్ లేదా ఫైన్బెండజోల్ మందులను పశువైద్యుని సలహా వేరకు వాడవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, శాస్త్రవేత్తలు బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

కారులో 107 కేజీల గంజాయి పట్టివేత

- యూపీకి చెందిన ఇద్దరు నిందితులు అరెస్టు

గంజాయితోపాటు నిందితులను అరెస్టు చేసిన చోడవరం పోలీసులు

చోడవరం: కారులో అక్రమంగా తరలిస్తున్న 107 కేజీల గంజాయిని చోడవరం పోలీసులు పట్టుకున్నారు. చోడవరం ఎఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం బీఎన్‌రోడ్డులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గౌరీపట్నం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా, వడ్డాది నుంచి చోడవరం వైపు వస్తున్న కారును ఆపి సోదా చేశారు. అందులో మూడు బస్తాల్లో నింపిన 107 కేజీల గంజాయిని గుర్తించారు. దాంతోపాటు కారును స్వాధీనం చేసుకుని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితులు జితేంద్ర, వహీద్ అహ్మద్‌లను అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు. వీరి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించామన్నారు.

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో రాయితీ

డాబాగార్డెన్స్: ప్రయాణికులకు ఏపీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. విశాఖ నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్, ఎంజీబీఎస్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి వెళ్లే ఏసీ బస్సుల్లో చార్జీలు 10 శాతం తగ్గించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు వెల్లడించారు.

అమరావతి బస్సు

విశాఖ నుంచి బీహెచ్ఈఎల్ అమరావతి బస్సు సాధారణ చార్జీ రూ.1,870, 10 శాతం తగ్గింపుతో రూ.1,690, విశాఖ నుంచి ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,810, తగ్గింపుతో రూ.1,650, విశాఖ నుంచి విజయవాడ సాధారణ చార్జీ రూ.1,070, తగ్గింపుతో రూ.970, విశాఖ నుంచి రాజమండ్రి సాధారణ టికెట్ ధర రూ.600, 10శాతం తగ్గింపుతో రూ.550గా నిర్ణయించారు.

నైట్‌రైడర్ సీట్

విశాఖ నుంచి బీహెచ్ఈఎల్‌కు రూ.1,670 ఉన్న చార్జీ, 10 శాతం తగ్గింపుతో రూ.1,480, ఎంజీబీఎస్‌కు రూ.1,590 టికెట్ ధర, తగ్గింపుతో రూ.1,520, విజయవాడకు సాధారణ చార్జీ రూ.960, 10 శాతం తగ్గింపుతో రూ.870, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.540, తగ్గింపుతో రూ.520 కానుంది.

నైట్ రైడర్ బెర్త్

విశాఖ నుంచి బీహెచ్ఈఎల్‌కు సాధారణ చార్జీ రూ.1,940, 10 శాతం తగ్గింపుతో రూ.1,730, ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,860, తగ్గింపుతో రూ.1,680, విజయవాడకు రూ.1,110 కాస్తా, తగ్గింపుతో రూ.1010, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.630 కాస్తా తగ్గింపుతో రూ.600 అయింది.

ఇంద్ర బస్సు

విశాఖపట్నం నుంచి అమలాపురానికి సాధారణ చార్జీ రూ.550 కాగా, 10 శాతం తగ్గింపుతో రూ.500గా ధర నిర్ణయించారు.

వన్‌టౌన్ కానిస్టేబుల్ సస్పెన్షన్

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ కానిస్టేబుల్ చెక్క అప్పలకొండ(పీసీ–3937)ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మద్యం దుకాణాలపై దాడి చేసి, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయించినందుకుగానూ చర్యలు తీసుకున్నారు. ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు.

స్నేహితురాలి ఇంటికే కన్నం

- ఇంటికి కబుర్లు చెప్పడానికి వచ్చి 18 తులాల బంగారు ఆభరణాల చోరీ
- నిందితురాలి అరెస్ట్, రూ.15 లక్షల విలువైన సొత్తు రికవరీ

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి : స్నేహితురాలి ఇంటికే కన్నం వేసింది ఓ ఘనురాలు. కబుర్లు చెబుదామని రోజూ ఇంటికి వచ్చి నగలు భద్రపరిచే ప్రదేశాన్ని కనిపెట్టి చాకచక్యంగా ఎత్తుకుపోయింది. దాదాపు మూడు నెలల తరువాత స్నేహితురాలిపై అనుమానం రావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెస్ట్ జోన్ క్రైం విభాగం ఏసీపీ డి.లక్ష్మణరావు ఆయా వివరాలను వెల్లడించారు. సింహాచలం సమీపంలోని విరాట్‌నగర్‌కు చెందిన రెయ్య జ్యోతి, చినముషిడివాడకు చెందిన ఎస్.వాణి స్నేహితులు. జ్యోతి భర్త కెనరా బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. కాగా వాణి తరచూ జ్యోతి ఇంటికి వచ్చేది. కబుర్లు చెబుతూ ఇంటిలో కలియతిరిగేది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 15న వాణి జ్యోతి ఇంటికి వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లిపోయింది. రాత్రికి ఇంట్లో పడకగదిలో బంగారం మాయం అయినట్లు జ్యోతి గుర్తించింది. తొలుత ఎవరో ఎత్తుకుపోయారని భావించారు. కొద్దిరోజులకు తన స్నేహితురాలు వాణి తన ఇంటికి రావడం మానేసింది. దాంతో పాటు ఆమె నడవడికలో మార్పులు రావడాన్ని గమనించిన జ్యోతి ఆమెను అనుమానించి జూన్ 9న పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల సూచనలతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పెందుర్తి క్రైం పోలీసులు వాణిపై నిఘా ఉంచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వాణి నేరం చేసినట్లు నిర్ధారించుకున్న పోలీసులు.. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకుంది. నిందితురాలిని అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 228.73 గ్రాములు(సుమారు 18 తులాలు) బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. కేసులో ప్రతిభ కనబరిచిన క్రైం విభాగం వెస్ట్ జోన్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీలు జి.నాగరాజు, టి.పద్మజ, పీసీలు పి.పైడిరాజు, జీవీవీ కిషోర్, టి.శివప్రసాద్, బి.దేముడుబాబు, ఎల్.కె తాతారావు, ఆర్.సంతోషిలను ఉన్నతాధికారులు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK ఫ్లాట్ 52 లక్షలకే అమ్మకం. ఫోన్ : 98663 21992 [V- 14019]

Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :– బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :– 98484 88068/ 77992 23300 [V- 14035]

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

Wanted

సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/– మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర।। 96032 16460/63007 25191. [V- 3577]

Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కశింకోట: మండలంలోని చెరకాం గ్రామం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలు(70) మృతదేహాన్ని వెలికి తీసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు మంగళవారం తెలిపారు. 156 సెంటీమీటర్ల పొడవుతో ఆమె చామన ఛాయ రంగు కలిగి ఉందన్నారు. శరీరంపై ఎరుపురంగు రవిక ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు. మృతురాలి సంబంధికులు 9440796088, 9493992223 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాజమండ్రి వద్ద రోడ్డు ప్రమాదంలో రావికమతం వ్యక్తి మృతి

మృతి చెందిన నాగేశ్వరరావు (ఫైల్)

రావికమతం: రాజమండ్రి వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో రావికమతం గ్రామానికి చెందిన ముక్కా నాగేశ్వరరావు(53) మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముక్కా నాగేశ్వరరావు కడియం నర్సరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా వ్యాన్‌లో వెళుతుండగా రాజమండ్రి వద్ద టైర్ పాంక్చర్ అయ్యింది. పంక్చర్ వేయించడానికి నాగేశ్వరరావు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని రాజమండ్రి ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సత్యవతి, కుమారుడు హేమంత్ (25), కుమార్తె (22) ఉన్నారు. ఈ ఘటనపై రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కశింకోట: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.3.50 లక్షల విలువైన నాలుగు తులాల బంగారు గొలుసు, మంగళ సూత్రాలు చోరీ చేశారు. మంగళవారం సాయంత్రం కశింకోటలో ఈ ఘటన జరిగింది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. కశింకోటలోని భవానీకాలనీకి చెందిన చదరం సత్యవతి స్థానిక సంతబయల నుంచి తన ఇంటికి సాయంత్రం 6 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తోంది. ఈ సమయంలో సినీ ఫక్కీలో బైక్‌పై వచ్చి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను అడ్డుకొని బెదిరించి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు, మంగళ సూత్రాలను లాక్కొని జాతీయ రహదారి వైపు పరారయ్యారు. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. నిందితుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ కె. లక్ష్మణరావు కేసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేవా లోపానికి పరిహారం చెల్లించాలి

విశాఖ లీగల్: వినియోగదారునికి సేవా లోపం కలిగించినందుకు వస్తువు ఖరీదుతోపాటు రూ.2 లక్షలు జరిమానా చెల్లించాలని విశాఖ జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్–2 న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి తీర్పునిచ్చారు. జరిమానాతోపాటు వస్తువు ఖరీదు రూ.225, కేసు ఖర్చులు రూ.20 వేలును 12 శాతం వడ్డీతో వాపస్ చేయాలని పేర్కొన్నారు. న్యాయవాది ధనలక్ష్మి అందించిన వివరాలు.. డాబా గార్డెన్స్‌కు చెందిన ఫిర్యాది టీవీ సాయి కృష్ణ భార్గవ 2024 డిసెంబర్ 5న 9.45కు స్విగ్గీలో 5 కాఫీలకు ఆర్డర్ ఇచ్చారు. అరగంటలో కాఫీ డెలివరీ అయింది. వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చిన విధంగా కాఫీ సరిపోలేదని చెప్పినా, కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. ఫిర్యాది తనకు జరిగిన సేవా లోపాన్ని ఈమెయిల్ రూపంలో కంపెనీ యాజమాన్యానికి వెంటనే తెలిపారు. యాజమాన్యం ఫిర్యాదును తిరస్కరించింది. దీంతో వినియోగదారుడు కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి కమిషన్ సభ్యులు పి.విజయ దుర్గ, డాక్టర్ వెంకటరమణలు వినియోగదారుడు చెల్లించిన కాఫీ ఖరీదు రూ.225, రూ.2 లక్షల నష్టపరిహారం, రూ.20 వేలు ఖర్చులు ఇవ్వాలని తీర్పునిచ్చింది.

రౌడీషీటర్ హత్య

మద్దిపాలెం : జ్ఞానాపురం శ్మశానవాటికలో రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అల్లిపురం ప్రాంతానికి చెందిన నాగమణి ఎల్లాజీ(35)పై గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇటీవల జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన ఎల్లాజీ జ్ఞానాపురం శ్మశానవాటిక సిబ్బందితో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో తనతో తీసుకువచ్చిన పాకెట్ కత్తిని చూపించి బెదిరించాడు. దీంతో సహనం కోల్పోయిన సిబ్బందిలో ఒకరు చేతిలో ఉన్న గెడ్డపారతో ఎల్లాజీ తలపై బలంగా మోదడంతో రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. అయితే మృతదేహానికి దహనసంస్కారాలు నిర్వహించేందుకు సదరు సిబ్బంది పన్నాగం పన్నారని సమాచారం. ఈ క్రమంలో కంచరపాలెం పోలీసులు రంగప్రవేశం చేసి మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.

క్లుప్తంగా

బాలికల పాఠశాలలో 110 మంది చేరిక

విద్యార్థినులకు ఉపాధ్యాయుల అభినందన

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూలులో ఈ విద్యా సంవత్సరం 110 మంది బాలికలు కొత్తగా చేరారు. 6 నుంచి 10వ తరగతి వరకు వీరు ఉన్నారు. వీరితో పాటు గతంలో ఉన్న వారితో కలిపి మొత్తం 560 మంది ఉన్నారు. మండలంలోని హైస్కూళ్లలో ఇక్కడే అత్యధిక మంది విద్యార్థినులు ఉన్నారు. ఇంకా వచ్చే నెల వరకు విద్యార్థినులు చేరడానికి అవకాశం ఉండటంతో వీరి సంఖ్య ఇంకా పెరగనుంది. ఇదిలా ఉండగా కొత్తగా చేరిన బాలికలకు స్వాగతం చెబుతూ మంగళవారం అభినందనలు తెలిపారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, జిల్లా సైన్స్ అధికారి డి. కాళిదాసు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. రవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జీఎస్టీ దినోత్సవం

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీఎస్టీ ప్రవేశపెట్టడంలో ప్రధాన ఉద్దేశం, దాని అవసరం, ప్రయోజనాలు, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, తెలుగు అధ్యాపకులు ఎస్.సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకులు ఎం.గోవిందరావు, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని శెట్టిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది 29 మంది విద్యార్థులు చేరారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఈవో ఈ పాఠశాలను సందర్శించారు. ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దేవి కుమార్తెను ఈ పాఠశాలలో చదివించడంపై అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలంటూ సర్పంచ్ అల్లు రామునాయుడు డీఈవోకు వినతి పత్రం అందజేశారు. డీఈవో వెంట ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 27 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,820	4,820
రెండో రకం	3,450	3,450
మూడో రకం	3,350	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	:8 వసంతాలు
పర్తిసాయి	:కుబేరా
షిర్డీసాయి	: సితారే జమీన్ పర్
వెంకటేశ్వర	:చంద్రేశ్వర
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 65 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -13, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 286 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 204 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వామ్మో.. వయ్యారిభామ

- లోపలంతా విషమే
- పంటల్లో అంతర పంటగా ఎదుగుదల
- తగ్గిపోతున్న పంట దిగుబడి
- పశువులు, మనుషులకూ ప్రమాదమే..



తెల్లటి పూలతో పెరుగుతున్న వయ్యారిభామ మొక్కలు

తుమ్మపాల: వాడు నడిచిన చోట గడ్డి కూడా మొలవదు అన్న చందంగా వినాశకరమైన కలుపు మొక్క వయ్యారిభామ అంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు జంకుతున్నారు. ఇది రోడ్ల పక్కన, కాలువ గట్లు, పొలం గట్లు, ఖాళీ ప్రదేశాల్లో పెరిగే ఈ కలుపు మొక్క పొలాల్లో పంటలను మించి పెరిగిపోతుంది. ఈ కలుపు మొక్క అన్ని ప్రాంతాల్లో త్వరితగతిన వ్యాపిస్తూ పంటల దిగుబడిని తగ్గిస్తుంది. అంతేకాక జంతువులతోపాటు మానవులకూ హాని చేస్తుంది. నిలువెల్లా విషం కలిగిన వయ్యారిభామ శాస్త్రీయ నామం పార్థీనియం హిస్టారోఫోరెస్. ఈ మొక్క ఇంటి పరిసరాల్లో ఉంటే రోగాలు వెంటే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

● నివారిద్దామిలా..

మండలంలో అన్ని గ్రామాల్లోను పొలాల్లో మొలిచిన వయ్యారిభామ పూత పూయక ముందే వేర్లతో సహా తొలగించి బురదలో తొక్కేయ్యాలి. తర్వాత నీరు పెడితే అది బాగా మురిగి పచ్చరొట్టగా మారుతుంది. తంగేడు చెట్లు ఉన్న ప్రాంతంలో ఈ మొక్క మొలవదు. వయ్యారిభామను నివారించే శక్తి తంగేడు మొక్కకు మాత్రమే ఉంటుంది. ఈ కలుపు మొక్క పూతదశకు రాకముందే 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఆ విధంగా చేస్తే వయ్యారిభామ కలుపు మొక్కలు మొలవవు.

● దిగుబడిని తగ్గిస్తుంది..

వయ్యారిభామ పంట మొక్కల ఎదుగుదలను నియంత్రిస్తుంది. పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చివేస్తుంది. పూత, పిందెలపై ప్రభావం చూపుతుంది. దీంతో దిగుబడి తగ్గుతుంది. ఈ మొక్కను సీజన్‌కు ముందే నియంత్రించాలి. మొక్కజొన్న, పూల తోటలు, కూరగాయల మడులు, కొబ్బరి, మామిడి తోటల్లో ఎక్కువగా పెరుగుతున్నాయి. ఇతర పంటల మొక్కల శాతం తగ్గిపోవడంతోపాటు ఎదుగుదల మందగిస్తుంది.

● మనుషులకు ప్రమాదం..

ఈ మొక్క ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వస్తుంది. పుప్పొడిని పీలిస్తే జలుబు, కండ్లు ఎరబ్రడడం, కనురెప్పలు వాపు వస్తాయి. వయ్యారిభామతో మనుషులకు ప్రమాదకరమైన డర్మాటైటీస్, ఎగ్జిమా హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. రైతులు, కూలీలకు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దురద, తుమ్ములు వచ్చి చర్మంపై మచ్చలు ఏర్పడతాయి.

● పశువులకు ప్రాణసంకటం..

జంతువులకు వెంట్రుకలు వాడిపోవడం, హైపర్ టెన్షన్ పెరుగుతుంది. సాధారణంగా పశువులు ఈ మొక్కను తినవు. పొరపాటున గడ్డితోపాటు వయ్యారిభామను తిన్న పశువుల పాలు తాగితే జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. వీటిని తిన్న పశువుల జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, అన్నవాహిక శ్వాసక్రియలు దెబ్బతింటాయి. చివరికి మరణిస్తాయి.

ప్రభుత్వమే నివారణ చర్యలు చేపట్టాలి

ఇటీవల కాలంలో వయ్యారిభామ మొక్కలు విపరీతంగా పొలాల్లో పేరుకుపోతున్నాయి. కూరగాయలు, మామిడి, కొబ్బరి తోటలతోపాటు ఖాళీ స్థలాల్లో మొలుస్తున్నాయి. భూమిలో సారాన్ని మొత్తం తీసుకుని ఏపుగా పెరుగుతున్నాయి. తెల్లటి పూలతో పెరిగిన మొక్కలను చూస్తే ముట్టుకోవడానికి కూడా భయం ఏర్పడుతుంది.

– ఎం.నాని, రైతు, రేబాక గ్రామం, అనకాపల్లి మండలం

200 మందికి వైద్య పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

అనకాపల్లి టౌన్: రైల్వే డైలీ పాసింజర్స్ అసోసియేషన్ పూర్వ గౌరవాధ్యక్షుడు దివంగత బొద్దపు మాణిక్యం జయంతి సందర్భంగా పట్టణంలోని వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి గుండె, ఎముకలు, కీళ్లు, కంటి, సుగర్, జనరల్ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, భీమరశెట్టి రాంకీ, బొద్దపు ప్రసాద్, గరికి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐపీఈలో స్వచ్ఛతా పక్వాడా

సబ్బవరం: మండలంలోని వంగలిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా పక్వాడా నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ జాయింట్ రిజిస్ట్రార్, కార్యక్రమం నోడల్ అఫీసర్ మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ, పారిశుధ్య కార్మికులకు సన్మానం, పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15 వరకూ స్వచ్ఛతా పక్వాడా నిర్వహిస్తామన్నారు.

వామనావతారంలో జగన్నాథస్వామి

వామనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం జగన్నాథస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు విష్ణుమూర్తి దశావతారాల్లో వామనునిగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, భక్తుల గోత్ర నామార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్ రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి సోమవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య వాక్య వరదాయని బృంద సభ్యుల సంకీర్తనలు, కోలాటం ప్రదర్శనలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యన్నారాయణ, శ్రీరామ్‌లు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వాహణాధికారి బి. మురళీకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

చిత్తడి చిత్తడిగా..

చిత్తడిగా కశింకోట బస్ స్టేషన్

కశింకోట: మండలంలో మంగళవారం ముసురు వాన కురిసింది. దీంతో జన జీవనానికి తీవ్ర ఇబ్బంది కలగింది. రోజంతా కురిసిన వర్షం వల్ల రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణ బురదమయంగా మారింది. తాళ్లపాలెంలోని హైస్కూలుకు జాతీయ రహదారి నుంచి వెళ్లే మార్గంలో నీరు నిలిచిపోయి రాకపోకలకు విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది చెందారు. వర్షం వల్ల వాతావరణం చల్లబడింది. రైతులు ఖరీఫ్ వరి నారుమళ్లు వేసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు.

వ్యాయామ పరికరాల వితరణ

వ్యాయామ పరికరాలతో రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: అందరూ ఆరోగ్యంగా ఉండాలని, అందుకు రోజూ ఒక గంట వ్యాయామానికి కేటాయించాలని స్థానిక రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ కోరారు. పట్టణంలోని శారదానగర్ పార్కుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాయామ పరికరాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, కె.ఎల్. కుమార్, అనీల్, రాజేష్, నాయుడు, శారదానగర్ వాసులు సరిపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

తాళ్లపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట: జాతీయ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం-2025లో భాగంగా మంగళవారం తాళ్లపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్య సిబ్బంది డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూపై అవగాహన కలిగించి, ఇది రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్. సుమ మాట్లాడుతూ డెంగ్యూ నిరారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వారానికి ఒక రోజు పాత్రల్లో నీరు నిల్వలు ఖాళీ చేసి డ్రై డే పాటించాలన్నారు. వ్యాధికి కారణమయ్యే దోమలు కుట్టకుండా, వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పగటిపూట కుట్టే దోమ వల్ల డెంగ్యూ వ్యాప్తి చెందుతుందన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాల కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. వైద్యాధికారి బి. మంజూష, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆరోగ్య సహాయకుడు పి. శివ రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వసతి గృహంలో సీసీ కెమెరాల ఏర్పాటు

వసతి గృహ విద్యార్థినులకు యాప్‌ను డౌన్లోడ్ చేసి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. శక్తి బీట్‌తో బీసీ బాలికల వసతి గృహంను మంగళవారం ఆమె పరిశీలించారు. వసతి గృహం సెక్యూరిటీ దృష్ట్యా నాలుగు హై క్వాలిటీ సీసీ కెమెరాలను వసతి గృహానికి నలువైపులా ఏర్పాటు చేశామన్నారు. వసతి గృహం విద్యార్థులతో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేయించి యాప్ వినియోగంపై సీఐ అవగాహన కల్పించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి కోరారు. మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. తక్కువ ప్రీమియంతో మెరుగైన బీమా సదుపాయం పొందాలన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎల్‌డీఎం సత్యనారాయణ, బీఎం శ్రవణ్, సీసీ రామకృష్ణ, వీవోఏలు కమల, నీలిమ, హేమ, జానకి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సహకార సంఘ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతీశ్వరరావు కోరారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ పరిధిలోని తోటాడలోని బహుళ ప్రయోజక సేవా కేంద్రం ఆవరణలో మంగళవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. రైతులు కూడా సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు.

వెబ్ ఆప్షన్ల నమోదు వేగవంతం

పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పాలిసెట్ విద్యార్థులకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పాలిసెట్ ర్యాంకర్ల వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు పాలిసెట్ 1వ ర్యాంక్ నుంచి 50,000 ర్యాంక్ వరకు 30 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. బుధ, గురువారాల్లో 50,001 నుంచి 90,000 ర్యాంక్ విద్యార్థుల ఆప్షన్లు నమోదు చేయిస్తామన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

గోడ ప్రతికను ఆవిష్కరిస్తున్న సీఐటీయు జిల్లా కార్యదర్శి సత్యవతి తదితరులు

రావికమతం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్ తో జులై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వజ్రపు సత్యవతి పిలుపునిచ్చారు. మంగళవారం ఈ సమ్మెకు సంబంధించి గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. కనీస వేతనాల చట్టం అమలు చేసి, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించాలన్నారు. సమాన వేతన చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి అమలుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

'ముఠా కార్మికుల సమగ్ర చట్టం అమలు చేయాలి'

కరపత్రాలను ప్రదర్శిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం అమలు చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. లంకెలపాలెంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఠా కార్మికులతో కలిసి ఈ నెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెపై కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికులకు ఆసరాగా ఉన్న 44 కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేయడం దుర్మార్గమన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేసి నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించడంతో పాటు రూ.10 లక్షల బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, దాసరి దేముడు, కె.వెంకటరావు, శ్రీను, తాత బాబు పాల్గొన్నారు.

అధికారులపై వేధింపులు తగదు

వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: కూటమి నాయకులు తమ ఆధిపత్య పోరుతో వడ్డాది గ్రామ ప్రతిష్టను దిగజార్చవద్దని వైఎస్సార్‌సీపీ నాయ కులు హితవు పలికారు. ఇటీవల కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ కూటమి నాయకుల వేధింపుల కారణంగా ఆస్పత్రి పాలైన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు స్పందించారు. స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్షులు దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టరు కోవెల జనార్ధన్‌రావు, ఎంపీటీసీ కోరుకొండ రమణ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతల తీరును ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులపై బెదిరింపులు పెరిగిపోయాయన్నారు. గ్రామంలో కల్యాణ మండపం, బీఎన్ రోడ్డు, పెద్దేరు వంతెన, తాగునీటి కొరత వంటి సమస్యలు పరిష్కరించడం మాని కూటమి నేతలు వర్గ పోరుతో గ్రామానికి నష్టం కలిగిస్తున్నారన్నారు. అధికారం ఉందని ప్రజలను, అధికారులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. సమావేశంలో ఎస్‌సీబీఎం స్కూలు చైర్మన్ అప్పారావు, శంకరావు, అయ్యన్నదొర, నాగేష్, మురళి, రమేష్, ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా బీమా ఉద్యోగుల సంఘం వజ్రోత్సవాలు

వేడుకలను జరుపుకుంటున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నర్సీపట్నం: అఖిల భారత ఉద్యోగుల సంఘం(ఏఐఈఏ) 75వ దినోత్సవాన్ని స్థానిక ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కామేశ్వరరావు మాట్లాడుతూ 1956లో ఎల్ఐసీ సంఘం ఆవిర్భవించడానికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృషి చేసిందన్నారు. బీమారంగంలో ప్రాథమిక హక్కులైన జీవన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ సెలవులు, సిక్ లీవ్ వంటి హక్కుల సాధనకు ఏఐఈఏ కృషి చేసిందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి : 9010973030, 9010546644, 9951602901

Office mail : sakshiadvtvsp@gmail.com

సాక్షి
అనంతపురం
బుధవారం, 2, జూలై, 2025

చీనీ టన్ను రూ.28,200

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28,200 పలికాయి.

వద్దొద్దు.. ఇప్పుడే వద్దు!

ఈ నెల 10న హెచ్చెల్సీకి నీటి విడుదలకు టీబీ బోర్డు సుముఖత వ్యక్తం చేయగా.. కెనాల్ అధికారులు తిరకాసు పెట్టారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.9°/23.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ఉరవకొండలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం స్థానిక గవిమఠం సమీపంలోని వీరశైవ కల్యాణ మండపంలో జరగనుంది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్, మేలో నిర్వహించిన బీటెక్, బీఫార్మసీ ఫలితాలు విడుదలయ్యాయి. బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20)(ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15), (ఆర్–19) సప్లిమెంటరీ, బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. అలాగే, బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్ సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగ ప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ తదితరులున్నారు.

ఏఎఫ్ ఎకాలజీ మల్లారెడ్డికి సైబర్ నేరగాళ్ల టోకరా

- మొబైల్ హ్యాక్ చేసి రూ. 8.50 లక్షల అపహరణ

రాప్తాడురూరల్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి సైబర్ నేరస్తుల ఉచ్చులో పడ్డారు. రూ. 8.50 లక్షల డబ్బు పోగొట్టుకున్నారు. ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. ఐదు రోజుల క్రితం మల్లారెడ్డి మొబైల్‌కు కిసాన్ రైతు పేరుతో 'ఏపీకే' ఫైలు వచ్చింది. మల్లారెడ్డి ఆ ఫైలు ఓపెన్ చేయగా.. ఆయన మొబైల్ హ్యాక్ అయింది. ఆ తర్వాత మల్లారెడ్డి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 8.50 లక్షలు హ్యాకర్లు వేరే అకౌంటుకు బదిలీ చేసుకున్నారు. గుర్తించిన మల్లారెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు కిసాన్ పేరుతో వచ్చే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయొద్దని ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. మొబైల్ ఒకసారి హ్యాక్ చేశారంటే సమాచారం మొత్తం కొల్లగొడతారని, ఆండ్రాయిడ్ ఫోన్లు వాడేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

అబద్ధాల్లో బాబు గిన్నిస్ రికార్డు

మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి, చిత్రంలో అనంత, వైవీఆర్, శైలజనాథ్, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు

సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- కూటమి ఏడాది పాలనలో ప్రజలకు చేసిన మంచి శూన్యం
- రాయలసీమకు తీరని అన్యాయం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి మండిపాటు
- గుంతకల్లులో పార్టీ విస్తృత స్థాయి సమావేశం

గుంతకల్లు: 'అలవిగాని హామీలతో గద్దెనెక్కడం.. తరువాత వాటిని పక్కన పెట్టడం బాబు నైజం. ఇప్పటి వరకు ఆయన ఇచ్చిన అబద్ధపు హామీలు లెక్కేస్తే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుకు ఎక్కడం ఖాయం' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి అన్నారు. గుంతకల్లు పట్టణంలోని ఆర్‌టీసీ డిపో సమీపంలోని పీఎంఆర్ కన్వెన్షన్ హాలులో మంగళవారం మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో.. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సతీష్‌రెడ్డితోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామన్న బాబు అధికారంలోకి వచ్చాక మొహం చాటేశారన్నారు. 'దీపం' పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామన్నాడని, కానీ నేడు సగం మందికి కూడా పథకం డబ్బులు అందలేదని విమర్శించారు. పింఛను పంపిణీ గురించి గొప్పగా చెప్పుకుంటున్న బాబు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటి కంటే ఒక్క కొత్త పింఛన్ అయిన మంజూరు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు' కార్యక్రమం చేపట్టాక కిందికి దిగొచ్చి అరకొరగా తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 87 లక్షల మంది విద్యార్థులకు రూ.13,500 కోట్లు అవసరముంటే, కేవలం రూ.8,000 కోట్లు విడుదల చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే ఇన్ని డబ్బులొస్తాయని గతంలో టీడీపీ నాయకులు బాండ్లు పంచారని, హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగాలని చంద్రబాబు కుమారుడు లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే అన్ని వర్గాల ప్రజలూ కూటమి ప్రజాప్రతినిధుల కాలర్ పట్టుకోవడానికి ఎదురు చూస్తున్నారన్నారు.

ఎవరికీ భయపడం: అనంత వెంకటరామిరెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. తమ పార్టీ నుంచి గెంటేస్తే గుంతకల్లులో పడిన గుమ్మనూరు జయరాం.. నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల కాళ్లు, చేతులు విరుస్తామంటున్నారని, ఆయనకు గుంతకల్లు నియోజకవర్గ ప్రజల గురించి తెలియనట్లుగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ కొడితే ఆలూరు కాదు ఎక్కడ పడతాడో కూడా తెలియదని హెచ్చరించారు. గుంతకల్లు నియోజక వర్గంలో ప్రతి మండలానికీ తమ్ముళ్లను ఇన్‌చార్జ్‌లుగా ప్రకటించుకొని దోపిడీ చేస్తున్నారన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తమ పై అధికారుల ఆదేశాలు పాటించాలి కానీ, ఎమ్మెల్యేలు చెప్పినట్లు నడుచుకోకూడదని హితవు పలికారు. చట్టాలు తమకు కూడా తెలుసని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కోర్టులకు ఈడుస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరగాలని 'అనంత' పిలుపునిచ్చారు.

రాయలసీమలోని ఏ ప్రాజెక్టుకూ పైసా కూడా ఇవ్వని చంద్రబాబు పోలవరం నుంచి బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేస్తామంటే నమ్మగలమా అని పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఈ ఏడాదిలో ఒక్క అభివృద్ధి పని చేపట్టారా అని ఆయన ప్రశ్నించారు. జగన్ 2.0లో ఒకపక్క ప్రజలు.. మరో పక్క కార్యకర్తలు అనే నినాదంతో పార్టీ ముందుకు పోతుందని చెప్పారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త చంద్రబాబు మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేశారట.. ఎవరూ వీటిపై అడగరాదట. ఆరు పథకాలు ఏఏ ఇంటికి పోయాయో చర్చించేందుకు మేం రెడీగా ఉన్నాం' అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.గాదిలింగేశ్వరబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రామాంజినేయులు, పట్టణ, రూరల్ అధ్యక్షులు ఖలీల్, రాము, గుత్తి జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్, పార్టీ నేతల పామిడి వీరా, వైఎస్సార్ సీపీ సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు తుంగలోకి..

చంద్రబాబు ఎన్నడూ నిజాలు చెప్పడు. ఎన్నికల ముందు ఇచ్చిన 143 హామీల్లో ఇంత వరకూ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. మేం చేపట్టిన 'వెన్నుపోటు నిరసన' కార్యక్రమం విజయవంతమైతే దిగొచ్చి 'తల్లికి వందనం' అమలు చేశారు. హామీలు అమలు చేయకుంటే ప్రభుత్వ మెడలు వంచుతాం. స్థానిక ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీకి ఓటు వేయకపోతే పథకాలు కట్ చేస్తామని భయపెట్టేందుకే ఇంటింటికీ కార్యక్రమం చేపడుతున్నారు.

– వెంకటరామిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త

చంద్రబాబు అంటేనే మోసం

చంద్రబాబు అంటేనే మోసం. ప్రతి సారీ అబద్ధపు హామీలతోనే గద్దెనెక్కారు. పై స్థాయిలో బాబు, లోకేష్ దోపిడీ చేస్తుంటే కిందిస్థాయిలో ఎమ్మెల్యేలు అదే దారిలో నడుస్తున్నారు. మా పార్టీ కార్యకర్తలను టార్గెట్ చేసి తప్పుడు కేసులు పెడుతున్నారు.

– నరేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు

కేసులు పెట్టడం ఒక్కటే చేశారు

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఏమైనా చేసిందా అంటే అది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు చేయడం, కేసులు పెట్టడమే. గుంతకల్లు ఎమ్మెల్యేకు ఎంత ధైర్యం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్ వేయనియ్యనని అంటారు? జగన్ నాయకత్వంలో, వై. వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి చోటా నామినేషన్లు దాఖలు చేస్తాం.

– శైలజనాథ్, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త

కూటమి అవినీతిని ప్రజలకు తెలపండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎంపీ రంగయ్య, పార్లమెంట్ అబ్జర్వర్ నరేష్‌కుమార్ రెడ్డి తదితరులు

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వ అవినీతి, మోసాలను ప్రజలకు తెలియపరచాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో పార్టీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు మాట్లాడారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ పార్టీ శ్రేణులు 30 రోజుల పాటు ఇంటింటికీ తిరగాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన మంచిని వివరిస్తూ ఏడాదిలో చంద్రబాబు చేసిన మోసాలను, మేనిఫెస్టోను తెలియజేయాలని సూచించారు. అనంతరం... రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కుటుంబానికి ఎంత మోసం జరిగిందో తెలుసుకునేలా ప్రజలను చైతన్య వంతులు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల రాష్ట్ర కార్యదర్శులు నారాయణపురం వెంకటేశులు, రామాంజినేయులుతో పాటు వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి. సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహించే దిశగా శిల్పారామంలోని స్టాళ్లలో యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్ పక్కనున్న స్థల సమస్యకు సంబంధించి వాస్తవ నివేదిక సమర్పించాలన్నారు. భూ పంపిణీ కోసం 35 మంది మాజీ సైనికులు జిల్లా సైనిక సంక్షేమ శాఖ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన దుకాణ సముదాయాల నుంచి బాడుగలు తప్పకుండా వసూలు చేయాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఖాజీల రెన్యువల్, ఇమామ్, మౌజన్లు, పాస్టర్ల వేతనం తదితర అంశాలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

హిజ్రాల ఆగడాలపై ఫిర్యాదులు

హిజ్రాల ఆగడాలపై ఇటీవల తనకు ఫిర్యాదులు అందాయని కలెక్టర్ చెప్పారు. వాటిని అరికట్టేందుకు జిల్లా ఎస్పీకి విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా లేఖ సమర్పించాలని ఆదేశించారు.సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

ఉరవకొండ: మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు గోవిందరాజులు, సిద్ధప్ప, బొజ్జన్న, వీణమ్మలు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఐజయ్యతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఉమాదేవి రేషన్ షాపును కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య ఇలాకాలో మద్యం వరద

- ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు
- ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు
- ఉమ్మడి జిల్లాలో ఇతర నియోజకవర్గాలకూ పాకిన జాడ్యం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- నాలుగు రోజుల క్రితం ఓ ఎక్సైజ్ అధికారి తాడిపత్రికి చెందిన టీడీపీ నేతకు ఫోన్ చేశారు. సార్ మీ నియోజకవర్గంలో పర్మిట్ రూములు, బెల్టుషాపులపై తనిఖీ చేయాల్సి ఉందన్నారు. దీనికి ఆ నేత.. ముందు హిందూపురంలో మూసెయ్, ఆ తర్వాత నేను ఇక్కడ మూయిస్తా అనడంతో ఎక్సైజ్ అధికారి ఖిన్నుడయ్యారు.
- ఇటీవల హిందూపురంలో ఓ వ్యక్తి వైన్ షాపు వద్దకెళ్లి మాన్‌సన్‌హౌస్ క్వార్టర్ బాటిల్ కొనుగోలు చేయగా.. ఎంఆర్‌పీ కంటే రూ.10 ఎక్కువ తీసుకున్నారు. ఎందుకిలా ఎక్కువ తీసుకున్నావ్ అంటే ఇక్కడ ఇంతే.. ఇష్టమైతే తీసుకో లేదంటే వెళ్లిపో అన్నాడు షాపులో ఉన్న వ్యక్తి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆ నియోజకవర్గంలో మద్యం వరదై పారుతోంది. నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. పర్మిట్ రూములు.. బెల్టుషాపులే కాదు రేట్లు కూడా అక్కడ ఎక్కువే. ఇంత జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడాలంటే కూడా ఎక్సైజ్ అధికారులు భయపడిపోతున్నారు. ఎమ్మెల్యే కాదు.. కనీసం ఆయన పీఏలతో మాట్లాడే ధైర్యం చేయడం లేదు. ఈ క్రమంలో ఇతర నియోజకవర్గాలకు తనిఖీ అధికారులు వెళితే ముందు 'అక్కడి' కథ చూసి మా వద్దకు రండి అంటున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న 'తమ్ముళ్లు' తమ ప్రాంతాల్లోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. నిబంధనలు తోసిరాజని 'హిందూపురం'లో సాగుతున్న మద్యం దందా నేడు ఉమ్మడి జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకూ మోడల్‌గా మారిన విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వేళాపాళా లేదు..

సీఎం చంద్రబాబు బావమరిది, వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా తయారైంది. మద్యం అమ్మకాల్లో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా రేట్లు పెంచుకుని, వేళాపాళా లేకుండా ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలు కూడా హిందూపురం మోడల్‌ను అనుసరిస్తున్నాయి. ఏ నియోజకవర్గానికి వెళ్లినా హిందూపురం వైపు వేలెత్తి చూపిస్తుండటంతో అధికారులూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

మనకేంటి ఇబ్బంది అంటున్న 'తమ్ముళ్లు'..

హిందూపురం నియోజకవర్గంలో తొలిరోజు నుంచే యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. దీంతో మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. హిందూపురం తరహాలోనే కదిరిలో విచ్చలవిడిగా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మెజారిటీ బ్రాండ్‌ల మీద ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. తాడిపత్రిలోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఇలా ఒక నియోజకవర్గంలో ఎక్కువ రేట్లకు అమ్ముతుండటంతో మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పద్ధతి అనుసరిస్తున్నారు.తాడిపత్రి, ధర్మవరం, కళ్యాణదుర్గం, గుంతకల్లు వంటి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలవే మెజారిటీ మద్యం షాపులు కావడం గమనార్హం. స్వయానా బాలకృష్ణ నియోజకవర్గంలోనే అమ్ముతున్నప్పుడు మనకేంటి ఇబ్బంది అన్న ధైర్యంతో అన్ని చోట్లా దందా కొనసాగిస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ హిందూపురం మోడల్ మద్యం అమ్మకాలు బాగా ప్రచారంలోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు మాత్రం బాలయ్య ఇలాకాలో ఏం చేస్తే ఎలా బుక్ అవుతామో అని భయపడుతున్నారు.

2024 సెప్టెంబర్ 15 నుంచి 2025 జూన్ 30 వరకూ నియోజకవర్గాల్లో మద్యం అమ్మకాలు ఇలా

నియోజకవర్గం	మద్యం అమ్మకం విలువ
హిందూపురం	రూ.74,87,61,067
కదిరి	రూ.68,71,63,705
ధర్మవరం	రూ.110,03,56,136
తాడిపత్రి	రూ.106,02,28,367
గుంతకల్లు	రూ.77,43,45,594
పెనుకొండ	రూ.78,25,96,955
అనంతపురం	రూ.271,78,57,685

రైతులను ఆదుకోని పరిశ్రమలు ఎందుకు?

- ప్రజాభిప్రాయ సేకరణలో పులకుర్తి, హీర్దేహాళ్, నేమకల్లు గ్రామస్తులు

కర్మాగారం వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): పరిశ్రమలు ఏర్పాటుకు ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ, వారిని ఆదుకోని పరిశ్రమల ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకిస్తామని నేమకల్లు సర్పంచ్ పరమేశ్వర, పులకుర్తి సర్పంచ్ దోణెప్ప, శ్రీనివాస రెడ్డి, రైతులు హీర్దేహాళ్ మారెన్న, షణ్ముఖ, శివారెడ్డి, హీరోజీరావు, మంజునాథ్, హీర్దేలప్ప, మల్లికార్జున తదితరులు అన్నారు. డి.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామ పరిధిలో రూ.560 కోట్లతో ఏర్పాటు చేయనున్న ధనలక్ష్మి ఐరన్ కర్మాగారానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను మంగళవారం పులకుర్తి గ్రామంలో చేపట్టారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, కాలుష్య నియంత్రణ ఎస్ఈ శివశంకర్‌నాయక్, ఈఈ మునిప్రసాద్, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ తహసీల్దార్లు మునివేలు, శ్రీనివాసులుతో పాటు పులకుర్తి, హీర్దేహాళ్, నేమకల్లు గ్రామాలకు చెందిన రైతులు ఎక్కువగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పులకుర్తి గ్రామ పరిధిలో పరిశ్రమ ఏర్పాటు చేసినా ఎక్కువగా నష్టపోయేది నేమకల్లు, హీర్దేహాళ్ గ్రామాల రైతులేనని పేర్కొన్నారు. గతంలో ఏర్పాటు చేసిన 6 స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా పంట దిగుబడులు రాక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహారం కూడా కలుషితమవుతోందని వాపోయారు. స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని ముందుగా పేర్కొంటారని, ఫ్యాక్టరీ ప్రారంభం అయిన తర్వాత స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఫ్యాక్టరీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వరాదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు ఎస్ఐలు నబీరసూల్, గురుప్రసాద్‌రెడ్డి, నాగమధు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కణేకల్ శాఖ-02738, అనంతపురము జిల్లా

A/C No. 40869062904 (ABAL)

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)
(అనుబంధం-IV చట్టం - రూల్ 8(1) మరియు (2) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **08-04-2025 తేదీగల డిమాండ్ నోటీసు** జారీచేసి **ఋణగ్రహీత: శ్రీ జి. శివశంకర్, తండ్రి జి. రామచంద్రప్ప, డి.నం. 2/6, O.C. కాలనీ, ఎస్.హనుమాపురం గ్రామం మరియు పోస్ట్, కణేకల్ మండలం, అనంతపురము జిల్లా. గ్యారెంటార్: శ్రీ వై.శ్రీరాములు, తండ్రి వై. ఎర్రప్ప, డి.నం. 6-2-653, రామ్‌నగర్, అనంతపురము** వారిని నోటీసులో తెలిపిన మొత్తం **08-04-2025 నాటికి రూ.11,78,925.93/- (పదకొండు లక్షల డెబ్బై ఎనిమిది వేల తొమ్మిది వందల ఇరవై ఐదు రూపాయల తొంభై మూడు పైసలు మాత్రమే)** మరియు **09-04-2025** నుండి వర్తింపుతో భవిష్యత్ వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వాటిని సదరు నోటీసు తేదీ నుండి 60 రోజుల లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేయగా సదరు ఎన్వలప్‌లు అందజేయబడకుండానే/అక్నాలెడ్జ్ చేయకుండానే వాపసు వచ్చినందున వాటిలోని అంశాలు **17-04-2025 తేదీగల వార్తపత్రికలో (సాక్షి మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్)** ప్రచురించబడినవి.

ఋణగ్రహీత / గ్యారంటార్ నం. **40869062904** కలిగిన ABAL ఋణ ఖాతాకు **17-04-2025న రూ. 2,00,000/-** మరియు **06-06-2025 న రూ. 1,50,000/-** మరియు **09-06-2025న రూ. 2,40,000/-** చెల్లించారు. కానీ డిమాండ్ నోటీసులో డిమాండ్‌చేసిన పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **26-06-2025 తేదీన** నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా ఋణగ్రహీతకు/ గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **26-06-2025 తేదీ నాటికి రూ. 6,50,672/- (ఆరు లక్షల యాభై వేల ఆరు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే)** + కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥వి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ, అనంతపురము జిల్లా** చార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా ఋణగ్రహీతను/ గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఆస్తి పూర్తి వివరణ :-

అనంతపురము జిల్లా, కణేకల్ మండలం, ఎస్.హనుమాపురం గ్రామ పొలం, ఎస్.హనుమాపురం పంచాయతీ, SRD కణేకల్ మరియు RD అనంతపురములో ఆస్తి ఉన్నది. ఈ ఆస్తి **రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 2292/2021, తేది: 12-08-2021** ప్రకారం **శ్రీ జి. శివశంకర్ తండ్రి జి.రామచంద్రప్ప కు చెందినది.**

బాబు సర్వే నం. **A.C.**

ప్రభుత్వ ఖుష్కి 41-J ఎ. 08.92 E-పైకి ఎ. 00.05.85 సెంట్లు లేదా 283.81 చ.గజాలు

సరిహద్దులు : తూర్పు : ప్రైవేట్ సుధాకర్ భూమి, **పడమర :** అదే సర్వే నంబరులో జి.గోవిందప్ప వారి భూమి, **ఉత్తరం :** రోడ్డు, **దక్షిణం :** అదే సర్వే నంబరులో జి. విశ్వనాథ్ భూమి.

కొలతలు : తూర్పు-పడమర ఉత్తరంవైపు: 42 అడుగులు లేదా 12.74 మీటర్లు, **తూర్పు-పడమర దక్షిణం వైపు:** 43 ½ అడుగులు లేదా 17.05 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం తూర్పు వైపు:** 62 అడుగులు లేదా 18.80 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం పడమర వైపు:** 57 ¾ అడుగులు లేదా 17.51 మీటర్లు. **మొత్తం విస్తీర్ణం : 283.81 చ.గజాలు**

తేది : 26-06-2025
ప్రదేశం : కణేకల్

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కణేకల్ శాఖ-02738

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం

■ మైసూర్‌కు చెందిన జ్యోతిష్యులైన జనార్ధన జోషి గారు మీ రెండు హస్త రేఖలు. జాతకం ఆధారంగా సంపూర్ణ భవిష్యత్తు చెప్పెదరు. ఎటువంటి సమస్యలున్నా శాస్త్రీయంగా శాశ్వతంగా, శీఘ్రముగా పరిష్కారం చూపెదరు. వాట్సాప్/ఫోన్: 9908626148. [SCA 25005361]

జ్యోతిష్యాలయం

■ కేరళ మాంత్రిక సాయి స్వరూప జోతిష్యం ప: వి. అయ్యప్పన్ (స్త్రీ.పు) వశీకరణం, సంతాన, ఉద్యోగ, ప్రేమ వివాహం, సతి-పతి కలహం, ప్రేమలో మోస పోవడం ఏలాంటి గుప్త కష్టకర నిఘాడ సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573677754. [SCA25005835]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు
ఫర్నిచర్స్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

WANTED

■ బాయ్స్ హాస్టల్ వార్డన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి సెల్ : 9966333236, 9966334236. [A-7126]

■ **Tutors (Gents), Bus Incharges,** PET'S Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304. [A-4111]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-624]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 Hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF + ESI కలదు. శాలరీ 1st కి ఇవ్వబడును. ఫోన్ : 7013730900 / 9246543129 [SCA25005819]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమం తుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838. [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

- ఈ నెల 10న హెచ్చెల్సీకి నీటి విడుదలకు టీబీ బోర్డు సుముఖత
- వద్దంటూ హెచ్చెల్సీ అధికారుల తిరకాసు
- అధికారుల నిర్ణయంతో ఆయకట్టు రైతులకు తీరని నష్టం

వద్దొద్దు.. ఇప్పుడే వద్దు!

'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు' అన్న చందంగా మారింది జిల్లా హెచ్చెల్సీ అధికారుల తీరు. ప్రకృతి కరుణించడంతో నిండుకుండలా మారిన తుంగభద్ర డ్యాం నుంచి జిల్లాకు నీటి విడుదలకు టీబీ బోర్డు సిద్ధమైనా.. హెచ్చెల్సీ అధికారులు మాత్రం ఇప్పుడే వద్దంటూ తిరకాసు పెట్టారు.

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ అధికారుల తాజా నిర్ణయం ఆయకట్టు రైతులకు తీరని నష్టం కలిగించేలా మారింది. జిల్లాలో ముందస్తుగా వర్షాలు కురిసినా ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేశాడు. కానీ ఎగువన కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి కొద్దిరోజులుగా భారీ స్థాయిలో వరద చేరుకుంటోంది. త్వరలో పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 10 నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటనతో జిల్లా హెచ్చెల్సీ అధికారులు హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి... ఇప్పుడే అవసరం లేదని, ఎలాంటి పరిస్థితుల్లోనూ నీటి విడుదల ఇప్పుడే వదంటూ బోర్డుపై ఒత్తిళ్లు తీసుకెళ్లారు.

నత్తనడకన పనులు చేపట్టి..

ఉమ్మడి జిల్లాకు వరదాయినిగా తుంగభద్ర జలాశయం నిలిచింది. కొన్నేళ్లుగా చెప్పుకునే స్థాయిలో వర్షాలు వస్తుండడంతో దాదాపు లక్ష ఎకరాలకు పైగా సాగునీరు, ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందిస్తున్నారు. ఇంతటి మహోన్నతమైన ప్రాజెక్ట్‌పై అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువపై కల్వర్టులు కూలిపోవడంతో పలు చోట్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల డిస్ట్రిబ్యూటరీల మరమ్మతు పనులు కూడా చేపట్టాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి గత జనవరిలో దాదాపు రూ. 30 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. వెనువెంటనే పనులు చేపట్టాల్సింది పోయి ఏప్రిల్ వరకూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కూడా నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలోహెచ్చెల్సీకి నీరు విడుదలైతే కాలువకు గండ్లు పడే ప్రమాదముంది. కల్వర్టులు, ఇతర పనులు జరుగుతున్నాయంటూ మరో పదిరోజులు గడువు కావాలని హెచ్చెల్సీ అధికారులు విజ్ఞప్తులపై విజ్ఞప్తులు చేస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది హెచ్చెల్సీ రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిండుకుండను తలపిస్తున్న తుంగభద్ర డ్యాం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో భారీ నష్టం

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని తీసుకునే అవకాశముంది. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాకు కేటాయించిన నీటి కోటాలో ఈ ఏడాది భారీ కోత పడింది. గతేడాది భారీ వర్షాలకు ఒక గేటు కొట్టుకుపోవడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచేందుకు వీలు కాదని ఇంజనీరింగ్ నిపుణులు స్పష్టం చేశారు. వాస్తవానికి కొత్త గేటు అమర్చడానికి ఐదారు నెలలకు పైగా సమయం ఉన్నా.. కర్ణాటక ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చినా గేటు ఏర్పాటు అంశంలో ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో టెండర్లు పిలవడంలో జాప్యం చోటు చేసుకుని తాత్కలికంగా అమర్చిన గేటుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో టీబీ డ్యాంలో 80 టీఎంసీలకు మించి నీటి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. అంతకు మించి నీరు చేరుకుంటే దిగువకు వదిలేయాల్సిందే.

ఆయకట్టుకు తీరని నష్టం

దామాషా ప్రకారం 140 టీఎంసీల నీటి లభ్యత ఉంటే హెచ్చెల్సీకి 32 టీఎంసీల నికర కేటాయింపులు ఉంటాయి. ఈసారి తుంగభద్ర జలాశయం భద్రత దృష్ట్యా 80 టీఎంసీలకు మించి నిల్వ ఉంచరాదని నిర్ణయించారు. దీంతో హెచ్చెల్సీకి కేవలం 18.396 టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించారు. ఇందులో 10 టీఎంసీలు తాగునీటి అవసరాలకు పోను, మిగిలిన 8.396 టీఎంసీల్లో ప్రవాహ నష్టాలు ఉంటాయి. ఇక మిగిలిన నీటిని ఆయకట్టుకు అందించాలి. ఫలితంగా హెచ్చెల్సీ పరిధిలో లక్ష ఎకరాలకు పైగా పంటల సాగు ప్రశ్నార్థకమైంది. ఇది హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు తీరని నష్టాన్ని చేకూరుస్తోంది. తుంగభద్ర నుంచి నీరు విడుదలయ్యే సమయం దగ్గరలోనే ఉందని తెలిసినా పనులు వేగవంతం చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కూటమి ప్రజాప్రతినిధులు కూడా తమకు ఆదాయం సమకూరే పనులపై మాత్రమే శ్రద్ధ చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీబీ డ్యాంకు తగ్గిన వరద

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం 65 వేల క్యూసెక్కులు, సోమవారం 40 వేల క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 33,916 క్యూసెక్కులకు పడిపోయింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో శివమొగ్గలోని అప్పర్ తుంగా ప్రాజెక్ట్ (గాజునూరు జలాశయం) నుంచి దిగువకు నీటి విడుదలను నిలిపివేయడంతో టీబీ డ్యాంకు వచ్చే వరద సగానికి తగ్గింది. 80 టీఎంసీలకు చేరితే డ్యాం క్రస్ట్ గేట్లు ఎత్తి నదికి వదులుతారు. ఈ లెక్కన గేట్లు ఎత్తడానికి మరో రెండు, మూడు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈనెల 10న తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు నీటిని విడుదల చేయనుండడంతో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1,624.38 అడుగులకు చేరుకుంది. అవుట్‌ఫ్లో 2,389 క్యూసెక్కులుగా ఉంది.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు

హెచ్చెల్సీకి నీటిని తీసుకోవడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రైతులకు అవసరముందో.. లేదో.. అనే అంశంపై నీటి సంఘాల నాయకులతో చర్చిస్తాం. అవసరముందని చెబితే తప్పకుండా తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని తీసుకుంటాం. ఆలస్యమైనా పర్వాలేదని అంటే పనులను వేగవంతంగా పూర్తి చేసి, నీటిని తీసుకుంటాం.

– విశ్వనాథరెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ,హెచ్చెల్సీ

గుంతకల్లు క్రీడాకారులకు అంతర్జాతీయ చెస్ రేటింగ్

జువైరా బాలాజీ పునీత్‌రెడ్డి కార్తీక్ రాఘవ

గుంతకల్లు: ప్రపంచ చదరంగ సమాఖ్య (ఎఫ్ఐడీఈ), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఏఐసీఎఫ్) సంయుక్తంగా మంగళవారం విడుదల చేసిన చదరంగ క్రీడాకారుల రేటింగ్ జాబితాలో గుంతకల్లు చెందిన ఐదుగురు క్రీడాకారులకు అంతర్జాతీయ రేటింగ్ దక్కింది. ఈ మేరకు కోచ్‌లు అనిల్‌కుమార్, రామారావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలల విభాగంలో బాలాజీ (1,472), పునీత్‌రెడ్డి (14,712), కార్తీక్ (1,493), రాఘవ (1,478) అంతర్జాతీయ రేటింగ్ దక్కించుకున్నారన్నారు. బాలికల విభాగంలో 1,401 రేటింగ్‌తో గుంతకల్లు చెస్ క్రీడా చరిత్రలో మొట్టమొదటి రేటెడ్ ప్లేయర్‌గా జువైరా రికార్డు నమోదు చేసిందని తెలిపారు.

రైలులో ప్రయాణికుడి మృతి

గుర్తు తెలియని మృతదేహం

గుంతకల్లు: ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ద్వివాంగుల బోగీలో ప్రయాణిస్తున్న అతని వద్ద కనీసం టికెట్ కూడా లేదు. సరైన సంరక్షణ లేకపోవడం, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడమే మృతికి కారణంగా ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుంది. ఎరుపు రంగులో ఉండి.. కాఫీ కలర్ టీ షర్టు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

కుక్కల దాడిలో 20 గొర్రెల మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని చెదుల్ల గ్రామంలో కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... చెదుల్ల గ్రామానికి చెందిన రాగే ఎల్లప్ప గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామ శివారులోని దొడ్డిలో మంగళవారం మధ్యాహ్నం జీవాలను వదిలి ఇంటికెళ్లి భోజనం చేసుకుని వచ్చేలోపు వీధి కుక్కల గుంపు మందపై దాడి చేశాయి. ఘటనలో 20 గొర్రెలు మృతి చెందాయి.

అతిథి అధ్యాపకులకు నేడు ఇంటర్వ్యూలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లైవ్ స్టాక్ మేనేజ్‌మెంట్ – డెయిరీ కోర్సు బోధనకు అర్హులైన అతిథి అధ్యాపకులకు బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గురుప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు అదే కళాశాలలో జరుగుతాయి. బీవీఎస్సీలో డిగ్రీ (వెటర్నరీ సైన్స్) లేదా డెయిరీ సైన్స్‌లో డిగ్రీ ఉన్న వారు అర్హులు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను వెంట తీసుకెళ్లాలి.

గాడిద పిల్లపై చిరుత దాడి

మరణించిన గాడిద పిల్లను పరిశీలిస్తున్న అధికారులు

వజ్రకరూరు: మండలంలోని కడమలకుంట గ్రామ పరిసరాల్లో చిరుత దాడిలో ఓ గాడిద పిల్ల మృతి చెందింది. యజమాని చాకలి వెంకటేష్ సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం ఫారెస్ట్ బీట్ ధికారి సతీష్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేష్, ప్లాట్ వాచర్ మల్లికార్జున తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సోమవారం రాత్రి చిరుత దాడి చేసినట్లుగా నిర్ధారించారు. చిరుత సంచారాన్ని అరికట్టాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ రేపు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 3న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను బంద్ చేసి శాంతియుతంగా నిరసన తెలిపేలా నిర్ణయించినట్లు అపుస్మా రాష్ట్ర కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఆర్టీఈ 12(1)సి ద్వారా ఉచిత అడ్మిషన్లకు బలవంతం చేస్తున్నారంటూ వాపోయారు. అకారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని, గుర్తింపు రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్రువీకరణ లేని ఫిర్యాదుల ఆధారంగా అధికారులు ఏకపక్షంగా తనిఖీలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమానులు సహకరించి 3న స్వచ్ఛందంగా విద్యా సంస్థలు బంద్ పాటించాలని పుల్లారెడ్డి పిలుపునిచ్చారు.

స్కూల్ బస్సుల కండీషన్‌పై ప్రత్యేక దృష్టి

డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్కూల్ బస్సుల కండీషన్‌పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పేర్కొన్నారు. స్కూల్ బస్సుల కండీషన్ అంశంపై రవాణాశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్టీఓ సురేష్‌నాయుడుతో కలసి జిల్లాలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో 600 పై చిలుకు స్కూల్, కళాశాలల బస్సులు ఉన్నాయన్నారు. విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఈ బస్సులన్నీ కండీషన్‌లో ఉన్నాయో? లేదో పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధిక లోడు, ప్యాసింజర్లతో వెళ్లే గూడ్స్ వాహనాలు, ఇతర వాహనాలపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా తిరిగే వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు.

నగర శివారున వాహనాల ఛేజింగ్

నగర శివారున వాహనాల ఛేజింగ్ ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారిని బెంబేలెత్తించింది. వివరాలు... జిల్లా రవాణా శాఖకు చెందిన ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం నగరంలోని టీవీ టవర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్ణాటకకు చెందిన రెండు బొలెరో వాహనాల నిండా చేపల వలలు, ఆపై బోట్లు (పుట్టి) వేసుకుని వాటిపై మనుషులు కూర్చొని ప్రయాణిస్తుండడం గమనించిన ఆయన వాటిని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే బొలెరో డ్రైవర్లు ఆపకుండా శరవేగంతో దూసుకెళ్లి పోవడంతో ఏఎంవీఐ తన వాహనంలో వెంబడిస్తూ రాప్తాడు పంగల్ రోడ్డు దాటిన తర్వాత అడ్డుకున్నారు. వాహనాలను ఆర్టీఓ కార్యాలయానికి తరలించారు. విచారణలో వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనాలకు పర్మిట్‌లు, ట్యాక్స్‌లు లేకపోవడం, ప్రమాదకరంగా ప్రజలను తీసుకెళుతుండడంతో కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

ఈఎన్‌టీలో తప్పని రోగుల నిరీక్షణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో చికిత్స కోసం రోగులు నాలుగు గంటలకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది. మంగళవారం ఉదయం 8 గంటలకు ఆస్పత్రికి వచ్చిన రోగులు ఓపీ కోసం గంట పాటు బారులు తీరారు. ఆ తర్వాత ఈఎన్‌టీ విభాగానికి 9 గంటలకు చేరుకుని 12 గంటల వరకు వేచి ఉన్నా వైద్య నిపుణుడి పత్తా లేకుండా పోయింది. వైద్య విద్యార్థులు (పీజీ) ఓపీ చూసుకుని తీరిగ్గా 12 గంటల తర్వాత చికిత్స మొదలు పెట్టారు. దీంతో చెవి పోటు తీవ్రమై రోగులు నీరసించిపోయారు.

ఓపీ క్యాబిన్ ఎదుట వేచి ఉన్న రోగులు

నొప్పి అంటున్నా పట్టించుకోలేదు

మా ఆదెమ్మ చెవి నొప్పితో బాధపడుతుంటే ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి వచ్చాం. ఓపీలో పరీక్షించి గదిలో కూర్చొమన్నారు. ఎంత సేపటికీ డాక్టర్లు రారు. చెవి నొప్పి అంటూ ఆదెమ్మ విలవిల్లాడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వాస్పత్రిలో మరీ ఇంత అద్వానంగా వైద్యం చేస్తారనుకోలేదు. పేదలంటే ఇంత చులకన అనుకోలేదు.

– వెంకటరాముడు, వెంకటాపురం

నీరసించిపోయా

చెవిలో సమస్య ఉందని పొద్దున్నే వచ్చా. ఇక్కడ చూస్తే ఓపీ చూసేందుకు గంటల సమయం పట్టింది. కుర్చీల్లో డాక్టర్లు లేరు. చివరకు జూనియర్ డాక్టర్లు వచ్చి చెవి చెక్ చేసి వెళ్లారు. తిరిగి ఎవరూ పట్టించుకోలేదు. ఎదురు చూసి నీరసించిపోయా.

– చెన్నకేశవులు, అనంతపురం

ప్రమాదంలో యువకుడి మృతి

- మృతుడు సర్పంచ్ భర్త

కళ్యాణదుర్గం రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం బోయలపల్లి గ్రామ సర్పంచ్ దుర్గమ్మ భర్త హనుమంత రాయుడు వైఎస్సార్‌సీపీలో కీలక కార్యకర్తగా వ్యవహరిస్తున్నాడు. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. కళ్యాణదుర్గంలో మంగళవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు సిద్ధమైన హనుమంత రాయుడు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కళ్యాణదుర్గం సమీపంలోకి చేరుకోగానే మల్లాపురం రోడ్డు వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. హనుమంతరాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదంలో హనుమంతరాయుడు మృతి చెందిన విషయం తెలియగానే నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులతో కలసి ఘటనా స్థలానికి చేరుకుని హనుమంతరాయుడి మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు (ఇన్‌సెట్‌లో) హనుమంత రాయుడు(ఫైల్)

ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఓతూరు పరమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఓతూరు పరమేష్‌ను ఎంపిక చేశారు. ఇటీవల కేరళలోని కోచికోడు జిల్లాలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత 18వ మహాసభలు జరిగాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఎస్ఎఫ్ఐ ప్రధాన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న ఎస్ఎఫ్ఐ కమిటీలో జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న ఓతూరు పరమేష్‌కు కేంద్ర కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించారు.

అధినేతతో భేటీ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి, తదితరులు

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ ఎన్ఆర్ఐ విభాగం కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మండల మాజీ కన్వీనర్లు రఘునాథరెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

భూగర్భ జలశాఖ ఇన్‌చార్జ్ డీడీగా మల్లికార్జునరావు

అనంతపురం అగ్రికల్చర్: భూగర్భ జలశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ఎం.మల్లికార్జునరావు బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీడీ కె.తిప్పేస్వామి విజయవాడలో ఉన్న ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జునరావుకు ఇన్‌చార్జ్ డీడీగా బదిలీ చేశారు.

హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్ఈగా విశ్వనాథరెడ్డి

ఎస్ఈ విశ్వనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఇన్‌చార్జ్ ఎస్ఈగా విశ్వనాథరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకే ఇన్‌చార్జ్ ఎస్ఈగా పనిచేస్తున్న పురంధరరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో చిన్న నీటిపారుదలశాఖ ఎస్ఈగా ఉన్న విశ్వనాథరెడ్డికి ఇన్‌చార్జ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ-స్టాంపుల కుంభకోణంపై అధికారులకు సమాచారమిచ్చా

- టీడీపీ నేత ఉన్నం మారుతి చౌదరి

అనంతపురం టవర్‌క్లాక్: కళ్యాణదుర్గంలో టీడీపీ కార్యకర్త ఎర్రప్ప అలియాస్ బాబు 'మీసేవ' కేంద్రంగా సాగిన నకిలీ ఈ–స్టాంపుల కుంభకోణంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులకు తానే సమాచారం ఇచ్చానని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు, టీడీపీ నేత మారుతి చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎర్రప్ప మీసేవ కేంద్రంలో నకిలీ స్టాంపులు సృష్టిస్తున్నట్లు గతంలో అతని కారణంగా మీసేవ కేంద్రాలను మూసేసుకున్న వారు తన దృష్టికి తెచ్చారన్నారు. అందుకు ఆధారంగా ఉన్న పత్రాలను వాట్సాప్‌లో పంపడంతో వాటిని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఇతర శాఖల అధికారులకు పంపి విచారణ చేయాల్సిందిగా కోరానన్నారు. ఈ–స్టాంపుల ట్యాంపరింగ్ ద్వారా ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారనే ఉద్దేశంతోనే తాను అధికారులకు సమాచారం ఇచ్చానన్నారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం కల్గించిన వారిని వదిలేసి పోలీసులు తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా ముందుకు వెళతానన్నారు. రాజకీయంగా తనను దెబ్బతీయడానికి బురద జల్లుతున్నారని, ఈ కుంభకోణంతో తనకు ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని ఆమె సూచించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం నగర శివారులోని తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన పలువురు టీచర్లకు మంగళవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ స్కూల్ పని చేస్తూ మురళీ, శ్రీదేవి, రమాదేవి, అరుంధతి, సుగుణమ్మ, కిరణ్మయి, ఓబులేసు, నాగజ్యోతి, విజయలక్ష్మి వివిధ స్కూళ్లకు బదిలీ అయ్యారు. వారి సేవలకు గుర్తుగా హెచ్ఎం రాజశేఖర్ అధ్యక్షతన సన్మానించారు. కార్యక్రమంలో టీచర్లు కిష్టప్ప, శ్రీనివాసులు, సురేష్, సత్యమయ్య, మధు, ద్వారకానాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం శుద్ధ షష్ఠి సందర్భంగా ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన అమ్మవార్ల కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలతో పాటు మహా మంగళ హారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

పొగాకు వాడకం అనర్థదాయకం

సంతకం చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: పొగాకు వాడకం అనర్థదాయకమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా మంగళవారం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 21 వరకు పొగాకుతో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకువద్దామని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, ఏఓ గిరిజా మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీఎస్ఓ'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: గత నెలలో జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్ఓ) మొదటి దశ పరీక్ష ఫలితాల్లో స్థానిక హౌసింగ్‌బోర్డులోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. జీటీఎస్ఓ విభాగంలో 27 మంది, ఎస్టీఎస్ఓ విభాగంలో 45 మంది, ఏటీఎస్ఓ విభాగంలో 35 మంది, ఈటీఎస్ఓ విభాగంలో 51 మంది, ఎంటీఎస్ఓ విభాగంలో 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, వైస్ ప్రిన్సిపల్ అమృతవల్లి, డీన్ సత్యనారాయణ, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనం మోస్తున్న యువతి

బోనాలెత్తిన బంజారాలు

అనంతపురం కల్చరల్: ఆరుద్ర కార్తెలో చివరి మంగళవారం కావడంతో అనంతపురంలోని నాయక్‌నగర్, ఆదర్శనగర్ పరిసర ప్రాంతాల్లో బంజారాల బోనాల జాతర మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. పశు వృద్ధి జరగాలని, వర్షాలు విస్తారంగా కురవాలని, తండాల సౌభాగ్యం కోసం బంజారాల ఆరాధ్య దైవం మారెమ్మ తల్లిని పూజిస్తూ బోనాలు సమర్పించారు. అంతకు ముందు ఊరేగింపుగా తెచ్చిన సీత్లాయాడి, మరియామా, తోల్జాయాడి, కంకాళి, సామ్లామయాడి, హింగ్లాజ్, భవానీ, మంత్రాళి వంటి అక్కమ్మ దేవతామూర్తులను సుందరంగా అలంకరించి ప్రతిష్టించారు. అనంతరం మేళతాళాలతో దేవతారూపాలకు ఇష్టమైన వంటకాలను తలపై ఉంచుకొని శోభాయాత్రను నిర్వహించారు. నాయక్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో చంద్రాబాయి, శివశంకర రాథోడ్, నారాయణ నాయక్, రామకృష్ణానాయక్, కిరణ్ నాయక్, సుబ్బానాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదర్శనగర్‌లో సాగిన మారెమ్మ బోనాల జాతరలో లక్ష్మీనాయక్, జయరామ్ నాయక్, తిరుపాల్ నాయక్, సూర్యనారాయణ, లక్ష్మీపతినాయక్, సీతారామ్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆటపాటలతో సందడి బంజారా మహిళలు

అనంతపురంలోని నాయక్‌నగర్‌లో బోనాలతో వెళ్తున్న గిరిజన మహిళలు

● మల్లాలమ్మకు బోనాలు

అనంతపురం కల్చరల్: జిల్లా మేదర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సూర్యానగర్‌లోని మల్లాలమ్మ దేవికి భక్తులు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సందడిగా సాగిన వేడుకల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశా. అనంతరం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ సాగింది. కార్యక్రమంలో మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలేపల్లి నాగరాజు, గౌరవాధ్యక్షుడు కాకర్ల ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు తమ్మినేని రామచంద్ర, మురళీకృష్ణ, మహేష్, రాజ్యం మధు తదితరులు పాల్గొన్నారు.

మల్లాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కార్పొరేషన్: ఇంజినీరింగ్ విభాగంలో నీటి సరఫరా సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతామని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నగర పాలక సంస్థ ముందు ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ చేపడుతున్న సమ్మెకు వారు మద్దతు తెలిపారు. కార్మికులతో కలసి నల్ల రిబ్బన్‌లను కళ్లకు కట్టుకుని, మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు, సీఐటీయూ నాయకులు గోపాల్, నాగేంద్రకుమార్, వెంకటనారాయణ, నాగభూషణం, సంజీవరాయుడు, ఓబుళపతి, మురళీ, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, జగదీష్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించండి

- తమ పరిధిలో ఉండే సమస్యలకు పరిష్కారం

కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

చూపుతామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సమ్మె విరమించాలని కమిషనర్ బాలస్వామి యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ ముందు కార్మికులు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని కమిషనర్ సందర్శించారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందిద్దాం

కేక్ కట్ చేస్తున్న గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్ బేగం, చిత్రంలో ప్రొఫెసర్లు, వైద్యులు, పీజీలు

వైద్యాధికారి శివకృష్ణను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం మెడికల్: గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందిద్దామని గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్ బేగం పిలుపునిచ్చారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గైనిక్ విభాగంలో ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్ సుచిత్ర, తదితరులతో కలసి ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఓడీ మాట్లాడుతూ ఎన్నో క్లిష్టతరమైన కేసులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి ఆస్పత్రి మంచి పేరు తీసుకువద్దామన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిస్సార్‌బేగం, డాక్టర్ రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నవ్య, డాక్టర్ నివేదిత, డాక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

తల్లి జన్మనిస్తే పునర్జన్మనిచ్చేది వైద్యులే

రాప్తాడు: తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని సీహెచ్ఓ శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణిని పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ మాట్లాడుతూ కరోనా మహమ్మరి లాంటి ఆరోగ్య విపత్తు సమయంలో వైద్యులు రోగుల కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా రోగులకు సేవలందిస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ నరసింహ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులు దైవంతో సమానం

వైద్యులు దైవంతో సమానమని ఎల్ఆర్‌జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ బోంతు ప్రసాద్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల పూర్వ విద్యార్థులు, డాక్టర్లు సుదర్శన్, ఈశ్వర్, శ్రీధర్, శాంతి, సందీప్, బద్రినాథ్, ప్రణిత్, రంజిత్, శ్రీహర్షను ఘనంగా సన్మానించారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం సిటీ: జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సెంట్రల్ జీఎస్టీ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ సాగి సుందర్‌రాజు కోరారు. ఇండియా గూడ్స్, సర్వీసెస్ ట్యాక్స్ డేను పురస్కరించుకొని అనంతపురం సంగమేష్ సర్కిల్ వద్ద నున్న ఆ శాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం సదస్సు నిర్వహించారు. హుందాయ్ ట్రాన్సిస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఎఫ్ఓ క్యూటే హంగ్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ సీనియర్ జీఎం ఫైనాన్స్, కమర్షియల్ సుబ్రత్ కుమార్ మొహపాత్ర, సీఎఫ్ఓ శ్యామ్‌కృష్ణ, చార్టెడ్ అకౌంటెంట్లు చంద్రశేఖర్ గుప్తా, స్పందేశ్ చౌదరి, హరీష్, నాగశేషు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పన్నుదాతలు, ప్రాక్టీషనర్ల సహకారంతో అనంతపురం డివిజన్ జీఎస్టీ వసూళ్లలో ముందు వరుసలో ఉండడం గర్వంగా ఉందని అసిస్టెంట్ కమిషనర్ సుందర్‌రాజు తెలిపారు. అనంతరం ఆయా సంస్థల ప్రతినిధులకు మెమొంటోలు అందించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రంగనాయకులు అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సాగి సుందర్‌రాజు

95 శాతం పింఛన్ల పంపిణీ

అనంతపురం క్రైం: సామాజిక భద్రత పింఛన్లను జిల్లా వ్యాప్తంగా మంగళవారం 95 శాతం పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు. జిల్లాలో 2,77,192 మంది పింఛన్‌దారులకు గాను రూ.1,23,47,53,500 విడుదలైందన్నారు. తొలిరోజు 2,62,885 మందికి రూ.1,16,83,12,500 పంపిణీ చేశామన్నారు. మిగిలిన 5 శాతం మందికి రాత్రిలోపు అందిస్తామని పేర్కొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

బుక్కచెర్లలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం బుక్కచెర్ల గ్రామంలో పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పశుశాఖ నూతన జేడీకి అభినందనలు

జేడీ డాక్టర్ టీవీ సుధాకర్‌కు అభినందనలు చెబుతున్న ఏడీలు, కార్యాలయ ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ కొత్త జేడీగా సోమవారం రాత్రి బాధ్యతలు తీసుకున్న డాక్టర్ టీవీ సుధాకర్‌కు ఆ శాఖ ఏడీలు, జేడీ కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. మంగళవారం జేడీ చాంబర్‌లో ఆ శాఖ ఏడీలు డాక్టర్ జి.పద్మనాభం, డాక్టర్ రాధిక, డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మితో పాటు కార్యాలయ ఉద్యోగులు రంగారెడ్డి, సుభద్ర తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం ఆ శాఖ జేడీగా ఉన్న డాక్టర్ జీపీ వెంకటస్వామి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో స్థానిక జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఈఓగా ఉన్న డాక్టర్ టీవీ సుధాకర్‌కు జేడీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అందరి సహకారంతో జిల్లాలో పాడి రైతులు, జీవాల కాపర్ల సంక్షేమానికి, పశుసంపద, జీవ సంపద పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన జేడీ తెలిపారు.

అనంతేశ్వరికి సారె సమర్పణ

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో ఆషాఢమాస సందర్భంగా మంగళవారం అనంతేశ్వరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. పాతూరు, కొత్తూరు అమ్మవారి శాలల నుంచి ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల పిండివంటలను నియమనిష్టలతో వండి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రధాన అర్చకులు ఆషాఢం విశిష్టతను తెలియజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షులు రత్నగిరి దేవరాజ్, మల్లికార్జున, విశ్వనాథ పాల్గొన్నారు.

ఘనంగా రమేష్‌గౌడ్ జన్మదినం

కేక్ కట్ చేస్తున్న రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఏ7 కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ముఖ్యనేతలు అనంత చంద్రారెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ కేక్ కట్ చేసి జిల్లా అధ్యక్షుడు అనంత, తదితరులకు అందించారు. ఉదయం రమేష్‌గౌడ్ ఇంటి వద్ద భారీగా ఏర్పాట్లు చేశారు. అభిమానులు, నాయకులు కలెక్టరేట్ నుంచి బైక్ ర్యాలీగా నగరంలోని రమేష్‌గౌడ్ ఇంటికి వెళ్లి గజమాలతో సన్మానించారు. అక్కడ యువత రక్తదానం చేశారు. రాంనగర్‌లోని అనాథాశ్రమంలో దుప్పట్ల పంపిణీ చేశారు. పార్టీలకతీతంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రమేష్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర కుమార్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీబీ భాస్కర్ బాబు, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చంద్రాచర్ల హరి, ప్రధాన కార్యదర్శి విష్ణు, జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, నాయకులు దాసగానిపల్లి కుళ్లాయప్ప, సాకే ఆదినారాయణ, నామాల శంకర్, కేశవ, భరత్, సుబ్రమణ్యం, వెంకటేశులు, జగదీష్ గౌడ్, నాగేష్ గౌడ్, హిద్దూ, ఆసిఫ్, వైఎస్సార్‌సీపీ అనుబంధాల సంఘాల అధ్యక్షులు సైపుల్లా బేగ్, ఓబిరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలపల్లిలో మోటర్ చోరీ

- గుజరీలో గుర్తించిన రైతు
- పట్టించుకోని పోలీసులు

రాప్తాడురూరల్: ఇటుకలపల్లిలో రైతు శివారెడ్డి వ్యవసాయ తోటలో మూడు రోజుల కిందట పంపు, మోటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. తర్వాత రోజు బాధిత రైతు పంగల్‌రోడ్డులోని ఓ గుజరీ దుకాణాన్ని పరిశీలించగా అందులో తన మోటారు, పంపు, పైపులను గుర్తించాడు. వెంటనే ఇటుకలపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఓ కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని గుజరీ యజమానిని ఆరా తీశాడు. ఇటుకలపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాము రైతులంటూ వచ్చి విక్రయించినట్లు తెలిపాడు. దొంగలు బహిరంగంగానే తిరుగుతున్నా ఆరోజు నుంచి పోలీసులు కనీసం అదుపులోకి తీసుకోలేదు. గతంలోనూ మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నాగభూషణరెడ్డికి చెందిన కంకరప్లాంటులో లక్షలాది రూపాయల విలువ చేసే పలు వస్తువులను ఎత్తుకెళ్లారు. దీనిపైనా పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదంటూ బాధితులు వాపోతున్నారు. అప్పట్లో దొంగలను అదుపులోకి తీసుకుని తర్వాత వదిలేశారనే ఆరోపణలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఇలాంటి దొంగతనాలు చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా ఈవిషయంపై ఎస్ఐ విజయకుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా....రైతు శివారెడ్డికి చెందిన మోటర్, పంపు ఎత్తుకెళ్లిన దొంగలను అదుపులోకి తీసుకున్నామని, బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు.

గుజరీ దుకాణంలో ఉన్న రైతు శివారెడ్డికి చెందిన మోటరు

విప్లవోద్యమ దారులే అనుసరణీయం

కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అనంతపురం కల్చరల్: విప్లవోద్యమదారులే అనుసరణీయమని వక్తలన్నారు. లోచర్ల పెద్దారెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా ఆయన గతంలో అక్షరీకరించిన చరిత్రాత్మక మార్క్సిస్టు పాఠాలను పుస్తకరూపంలోకి తెచ్చిన 'కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర' పుస్తకావిష్కరణ మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. లోచర్ల పెద్దారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి లోచర్ల విజయభాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. విరసం (విప్లవ రచయితల సంఘం) రచయితలు పాణి, వరలక్ష్మి, నాగేశ్వరాచారి తదితరులు ఉద్యమ నేపథ్యంపై మాట్లాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొండపల్లి సీతారామయ్య బోధించిన భావజాలం, లోచర్ల పెద్దారెడ్డి వివిధ సందర్భాల్లో అనుభవాల సారంతో వచ్చిన పుస్తకం కమ్యూనిస్టుల పోరాటాలను సమగ్రంగా వివరిస్తుందన్నారు.

ఆత్మకూరులో కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరులో పీర్లకు చదివింపులు ఇస్తున్న ముల్లా సాహెబ్

ఆత్మకూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో సోమవారం రాత్రి పీర్లను కొలువుదీర్చారు. జిల్లా నలుమూలల నుంచి పీర్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈనెల 4న చిన్న సరిగెత్తు, 5న విడిదినం, 6వ తేదీన పెద్ద సరిగెత్తు,7వ తేదీ ఉదయం పీర్లను గ్రామోత్సవం నిర్వహించి సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహించనున్నారు.

సందడిగా మొహర్రం వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలో పలుచోట్ల మొహర్రం వేడుకలు సందడిగా సాగుతున్నాయి. ఐదోరోడ్డులో బీబీ ఫాతిమా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెట్టె మెరవణి అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పీర్ల వద్ద చక్కెర చదివింపులను చేయించారు. నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు మాట్లాడుతూ రోజూ అమ్మవారి పీర్ల ముందు ప్రత్యేక ఆరాధన జరుగుతుందన్నారు. 17న చిన్నసరిగెత్తు, 19న పెద్ద సరిగెత్తు, 20న జలధి, 22న చివరి దర్శనం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు నవీన్ కుమార్, మురళీ, కిశోర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రా.. కుక్కల కేంద్రమా!

ఆస్పత్రి ఆవరణలో కుక్కల సంచారం

అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ ముందు రోగి సహాయకులను చూసి మొరుగుతున్న కుక్క

ఆర్థో ఆపరేషన్ థియేటర్ ముందు రక్తం అయిన రోగుల బెడ్‌షీట్‌ను తీసుకెళ్తున్న కుక్క

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆస్పత్రి ఆవరణతో పాటు గైనిక్, లేబర్, చిన్నపిల్లల వార్డు, ఆర్థో, ఐసీసీయూ, ఏఎంసీ, పాత ఓపీ బ్లాక్, ఫార్మసీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికమైంది. గైనిక్ వార్డుల్లో పొరపాటున పసికందులపై కుక్కలు దాడి చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. సాక్షాత్తు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం విభాగం ఆర్థో ఓటీ ముందు కుక్కలుంటున్నాయి. రక్తం మరకలున్న బెడ్‌షీట్లను తీసుకెళ్తున్నా వాటిని పట్టించుకునే పరిస్థితి లేదు. కనీసం వినియోగించిన బెడ్‌షీట్లను జాగ్రత్తగా దోబీలకు ఇవ్వాలన్న ఆలోచన కూడా ఆస్పత్రి అధికారులు చేయడం లేదు. ఇన్‌ఫెక్షన్స్‌తో మరిన్ని కొత్త సమస్యలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. ఇక రాత్రి అయ్యిందంటే చాలు కుక్కలు పెద్ద ఎత్తున అరుస్తుండడంతో రోగులు, వారి సహాయకులు భయాందోళనకు లోనవుతున్నారు. అక్యూట్ మెడికల్ కేర్ ముందు కుక్కలు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. రోగి సహాయకులపై దాడికి యత్నిస్తున్నాయి.

వైఎస్ జగన్‌ను కలసిన యువజన నేతలు

వైఎస్ జగన్‌ను కలసిన యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షుడు దత్తా

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి

రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం అనంతరం జిల్లాకు చెందిన యువజన విభాగం రాష్ట్ర, జిల్లా నాయకులు విజయవాడలో జరిగిన సమావేశంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగం ఎంతో కీలకమని, రానున్న రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యువజన విభాగం నాయకులకు సూచించారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు, జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షులు దత్తా తదితరులున్నారు.

సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 2, జూలై, 2025

శభాష్.. పోలీస్..!

కురబలకోట మండలంలోని చెన్నామర్రి వద్ద కర్ణాటకకు చెందిన ట్రావెలర్ టెంపోను ఢీకొట్టి వెళ్లిపోయిన కంటైనర్ మిస్టరీని గంటల వ్యవధి లోనే పోలీసులు ఛేదించారు. - 8లో

దళిత యువకుడిపై దాడి

వాల్మీకిపురం మండలంలో దళిత యువకుడిపై జరిగిన దాడి ఆలస్యంగా వెలుగు చూసింది. కారకులపై కేసు నమోదు చేయాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.390	రూ.450
రెండోరకం	రూ.250	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1153 మెట్రిక్ టన్నులు

న్యూస్‌రీల్

వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నగదు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ప్రధాన ఆలయాలతోపాటు ఉప ఆలయాలకు భక్తులు 95 రోజుల పాటు సమర్పించిన నగదు, కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.19,55,945, నిత్యాన్నదానానికి రూ.1,12,888 వచ్చింది. అలాగే హుండీలలో బంగారం 53.600 గ్రాములు, వెండి 1.800 కిలోలు వచ్చినట్లు ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రాయచోటి పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి సి. విశ్వనాథ్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు.

ఇద్దరు ఫీల్డ్‌అసిస్టెంట్‌ల సస్పెన్షన్

మదనపల్లె రూరల్ : ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారు. పట్టణంలోని వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి డ్వామా పీడీ వెంకటరత్నం ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో హౌసింగ్‌కు సంబంధించి బిల్లులను లబ్ధిదారులకు కాకుండా ఇతరులకు ఇచ్చినట్లు విచారణలో తేలడంతో.. కోళ్లబైలు వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్డిశేఖర్, కొత్తవారిపల్లె ఫీల్డ్‌అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. అలాగే ఉపాధి వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 25 పంచాయతీల్లో రూ.54 వేల రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. రూ.18,500 వేల జరిమానా విధించారు. 61 పనులకు సంబంధించి ఏపీడీ ఆధ్వర్యంలో రీ ఎంక్వయిరీకి ఆదేశించారు.

ఆర్థిక సమ్మిళితత్వంపై విస్తృత ప్రచారం

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఆర్థిక సమ్మిళితత్వం కోసం విస్తృత ప్రచారం చేయాలని జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఆర్థిక సమ్మిళితత్వంపై గోడపత్రికను ఆవిష్కరించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జరగబోయే ప్రచార కార్యక్రమాలను ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక క్యాంపుల ద్వారా నిర్వహించాలని తెలిపారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జలాశయాల్లో చేపల వేట నిషేధం

గండికోట జలాశయం

కొండాపురం : జిల్లాలోని గండికోట జలాశయం, బ్రహ్మసాగర్, సోమశిల వెనుక జలాలలో చేపల వేట నిషేధించినట్లు ఉప మత్స్యసంచాలకులు నాగయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజంగా చేపల సంతానోత్పత్తి జూలై 1 నుంచి ఆగస్టు31 వ తేది వరకు ఉంటుందని.. ఈ 62 రోజులపాటు మత్స్యకారులు ఎవరు చేపలు పట్టకూడదని ఆయన హెచ్చరించారు. చేపల వేటకు పోతే ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జలాశయాలల్లో వేటకు వెళ్లితే మత్స్యకారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ధర ఉన్నా.. దిగుబడి లేదన్నా..

- టమాటా రైతును వెంటాడుతున్న కష్టాలు
- వాతావరణం మార్పు, తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- రేటు పెరిగిన సమయంలో సోకిన ఊజి వైరస్
- పంటను కాపాడుకునేందుకు పాట్లు
- భారీగా నష్టపోతున్న వైనం

గుర్రంకొండలో తెగుళ్లు, వాతావారణ మార్పులతో దెబ్బతిన్న టమాటా పంట

రాయచోటి/గుర్రంకొండ : టమాటా రైతుకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఏదో విధంగా వారిని నష్టాలే వెంటాడుతున్నాయి. నాలుగు నెలలుగా అనుకూలమైన ధరలు లేక సాగుకు పెట్టిన పెట్టుబడులు రాక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నట్టేట మునిగారు. ఇలాంటి పరిస్థితుల్లో 20 రోజులుగా మార్కెట్‌లో ధర పలుకుతుండటంతో ఆశలు చిగురించాయి. అయితే వారి ఆశల కంటే ముందే ఊజి వైరస్ కాయలను తొలచి మార్కెట్‌కు తరలించకుండా పాడైపోయేలా చేస్తున్నాయి. దీంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

నల్లమచ్చలు, ఊజీతో దెబ్బతిన్న తోటలు

ప్రస్తుతం టమాటా తోటలకు నల్లమచ్చలు, ఊజి, ఆకుముడత రోగాలు ఆవహించడంతో దెబ్బతిన్నాయి. ఇటీవల అప్పుడప్పుడు కురుస్తున్న అరకొర వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా రోగాలు భారీగా టమాటా తోటలను ఆవహించాయి. మొక్కలోని కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు నల్లమచ్చలు ఏర్పడ్డాయి. దీంతో మొక్క ఎదుగుదల లేక అప్పటి వరకు ఉన్న కాయలు మాత్రమే దిగుబడి వస్తున్నాయి. దీనికి తోడు నల్లమచ్చలున్న కాయలు సైజు పెరిగినా.. మచ్చలు అలాగే ఉంటున్నాయి. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉండటం లేదు. ఊజీ, ఆకుముడత రోగాలతో తోటల్లో ఉన్న కాయలకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. ఊజి ఈగలు, ఆకుమడత రోగాలు మొక్క, ఆకుల్ని సైతం పీల్చి పిప్పిచేస్తున్నాయి. మొక్క ఎదుగుదల, కాయల దిగుబడి పూర్తిగా తగ్గిపోతోంది. దీంతో టమాటా మొక్కల పంటకాలం, దిగుబడి రెండూ తగ్గిపోతుండటంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.

సగానికి పడిపోయిన దిగుబడి

నల్లమచ్చలు, ఊజి, ఆకుముడత రోగాల బారిన పడిన టమాటా తోటల్లో పంట దిగుబడి సగానికిపైగా తగ్గిపోయింది. సాధారణంగా ఎటువంటి రోగాలు లేకుండా ఉంటే ఎకరానికి 750 నుంచి 800 క్రేట్ల నాణ్యమైన టమాటాల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం రోగాల కారణంగా నాణ్యమైన టమాటాలు ఎకరానికి 400 క్రేట్లకు పడిపోయాయి. మరో వైపు రోగాలను నివారించేందుకు గానూ మందుల పిచికారి అదనపు భారంగా మారింది. నల్లమచ్చలు, ఊజీ, ఆకుమడత రోగాల నివారణ, అదుపు చేయడం కోసం ఎకరం తోటకు రూ.55 వేల నుంచి రూ.70 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు.

రోజురోజుకు పుంజుకొంటున్న ధరలు

ఓ వైపు టమాటా పంట దిగుబడి తగ్గిపోతుంటే.. మరో వైపు రోజురోజుకు ధరలు పుంజుకొంటున్నాయి. మార్కెట్‌లో ప్రస్తుతం నాణ్యమైన టమాటాలు 25 కేజీల క్రేట్ ధర రూ.800 వరకు పలుకుతున్నాయి. అయితే అదే సమయంలో నల్లమచ్చలు, ఊజీ రోగాలున్న టమాటాలు క్రేట్ ధర రూ.150 మాత్రమే పలుకుతున్నాయి. దీంతో ఒక క్రేట్‌కు రైతు రూ.650 వరకు నష్టపోతున్నాడు. నల్లమచ్చలు, ఊజీ రోగాలున్న టమాటాలు ఎకరానికి 350 క్రేట్ల వరకు వస్తున్నాయి. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కాయలు సరిగ్గా కాయక పంట దిగుబడి కూడా 50 నుంచి 60 శాతం మాత్రమే వస్తుండటం గమనార్హం.

గతేడాదితో పోల్చితే 35 శాతం దిగుబడే

జిల్లాలో రోగాల బారిన, వాతావారణంలో వస్తున్న మార్పుల కారణంగా టమాటా తోటల్లో పంట దిగుబడి రోజురోజుకు తగ్గిపోతోంది. ఇదే సీజన్‌లో గతేడాది జిల్లాలో సాగు చేసిన పంట దిగుబడితో పోల్చితే.. కేవలం 35 శాతం మాత్రమే వస్తోంది. గత ఏడాది ఇదే నెలలో వారం రోజుల్లో 3568 నుంచి 4582 టన్నుల వరకు టమాటా దిగుబడి మార్కెట్ యార్డులకు వచ్చింది. ప్రస్తుతం ఇదే నెలలో వారం రోజుల్లో 1192 నుంచి 1483 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చింది. అంటే ప్రస్తుతం ఇంచుమించు 35 శాతం మాత్రమే రావడం గమనార్హం. మార్కెట్‌లో టమాటా ధరలు రోజురోజుకు పెరుగుతున్నా స్టాకు రాకపోవడంతో మండీలు వెలవెలబోతున్నాయి.

జిల్లాలోని మార్కెట్లకు ప్రస్తుతం, గతేడాది ఇదే సీజన్‌లో వచ్చిన టమాటాల స్టాకు, ధరలు

తేదీ	2024లో స్టాకు (టన్నులు)	2025లో స్టాకు (టన్నులు)	ప్రస్తుతం ధర(రూ.లలో) (25 కేజీల క్రేట్)
జున్ 25	3568	1192	510
26	3657	1234	570
27	3754	1257	620
28	3962	1338	580
29	4298	1395	600
30	4458	1435	750
జూలై 1	4582	1483	800

కాపాడుకోవడం కష్టంగా ఉంది

ఇప్పుడు టమాటా పంటను కాపాడుకోవడం చాలా కష్టంతోపాటు ఖర్చుతో కూడుకొంది. ధరలు పెరుగుతున్నా వైరస్‌లు, తెగుళ్లు.. వాతావారణంలో వస్తున్న మార్పుల కారణంగా దిగుబడి తగ్గిపోతోంది. ఉన్న పంటనైనా కాపాడుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. – రెడ్డిమోహన్, రైతు, చెరువుమొరవపల్లె, గుర్రంకొండ

సబ్సిడీపై మందులు ఇవ్వాలి

ఊజి వైరస్ నివారణకు సరైన మందులు లేకపోవడంతో.. వేగంగా విస్తరిస్తోంది. పంట భారీగా దెబ్బతిని వినియోగానికి ఉపయోగపడటం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పురుగు నివారణ మందులను సబ్సిడీపై సరఫరా చేయాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. – ఎండపల్లి బాలకృష్ణారెడ్డి, రైతు సంఘ నాయకుడు, రాయచోటి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



టమాటాలకు మార్కెట్‌లో అనుకూల ధరలు లేకపోవడంతో.. రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఏప్రిల్, మేలలో పంటకు సరైన ధర లేకపోవడంతో కోతలు కోయకుండా వదిలేశారు. అలాంటి తోటలలో ఊజి వైరస్ ఎక్కువ ఉంటుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. తెగులు సోకిన మొక్కలు తొలగించి, పురుగు నివారణ మందులు వాడటం వల్ల అరికట్టవచ్చు. – ఎస్.సుభాషిణి, జిల్లా ఉద్యానవన అధికారిణి

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం

అభిమానులు, ఆత్మీయులతో వైఎస్‌ఆర్‌సీపీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

వైఎస్‌ఆర్‌సీపీ నేత సుగవాసి సుబ్రమణ్యంను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాయచోటి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు తెలియపరిచే బాధ్యతను ప్రతి ఒక్కరం తీసుకుందామని వైఎస్‌ఆర్‌సీపీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం అభిమానులు, ఆత్మీయులకు పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటిలోని సుగవాసి స్వగృహంలో గుంటిమడుగు, కాటిమాయకుంట గ్రామాలకు చెందిన ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాయమాటల కారణంగా ప్రజా సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ పాలనను కాదని కూటమి పార్టీలకు ప్రజలు ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని వదిలి, కూటమి నేతల ధన, సంపద, సంక్షేమంతో ముందుకు సాగుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దెదింపి రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్‌ఆర్‌సీపీ పాలన తేవడానికి కృషి చేయాలన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. త్వరలోనే వైఎస్‌ఆర్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గ్రామాలలో పర్యటించి కూటమి పాలన అవినీతి, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిద్దామన్నారు. అనంతరం రెండు గ్రామాల పరిధిలోని ప్రజల పరిస్థితులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు ఆ గ్రామాల నాయకులు గజమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ మండల పరిధిలోని గుంటిమడుగు, కాటిమాయకుంట గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఖాదర్‌వల్లి, కర్నపు రమణారెడ్డి, కొక్కంటి రెడ్డప్పరెడ్డి, శేఖర్‌రెడ్డి, దేవనాథరెడ్డి, అమరనాథరెడ్డి, నల్లగుండ్లపల్లి మహేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బొంకు బాబురెడ్డి, రాఘవరెడ్డి, నడిపి రెడ్డయ్య, ఖాదర్‌బాషా, వడిపల్లి రాజా, షేక్ అబ్బాస్, షేక్ ఆదిల్, ఇలాహి, మహమ్మద్, దేవర నాగేంద్ర, ఫజిల్, షేక్ అజ్గర్, షేక్ బాబ్జీ, పంగ రఘురామ, సాయి, తిరుమల, రామయ్య, వెంకటరమణ, గుంటిమడుగు మాజీ డీలర్ రమణ, పెద్దివీటి ఆంజనేయులు, మహేష్, మనోహర్, నాగేశ్వర, అంజి, రమణ, రామాంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

5న మెగా జాబ్‌మేళా

బద్వేలు అర్బన్ : స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5న సియట్ కంపెనీ ద్వారా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ సాయిక్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీసీఏలలో 2022, 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 8297160304, 9703244614 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES-KADAPA (AUTONOMOUS)

(Approved by AICTE & Affiliated to SBTET, Vijayawada)
Accredited by NBA (B.Tech- EEE, ECE & CSE) & NAAC 'A' Grade
Utukur (P), C.K. Dinne (V & M), Kadapa Y.S.R. Dist.,A.P.
Web : www.aitskadapa.ac.in

AP POLYCET COUNSELING CODE: AITK

Diploma (Polytechnic) Courses Offered :
- Electrical and Electronics Engineering (EEE)
- Electronics and Communication Engineering(ECE)
- Computer Engineering (CME)

Transport facility is available from Kadapa Town, Vontimitta, Rayachoti and Mydukur.
You Can avail free help desk at our campus for web options.

For Details Contact : 9603999591, 8801236667, 7386324079

కల.. నిజమైన వేళ!

వారంతా శ్రమజీవుల బిడ్డలు. తల్లిదండ్రుల కష్టాలు కళ్లారా చూశారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని.. కన్న వారి కలలను నిజం చేయాలని కలగన్నారు. కష్టపడి చదివారు.. వారి కష్టానికి ఫలితం దక్కింది. మహానేత వైఎస్సార్ స్థాపించిన ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. కల సాకారమైన వేళ.. వారి కళ్ల నిండా సంతోషం కనిపించింది. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది.

- ట్రిపుల్ ఐటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ
- మొత్తం 878 మంది అడ్మిషన్లు పొందిన విద్యార్థులు

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ల ప్రక్రియలో అధికారులు, విద్యార్థులు

వేంపల్లె (వైఎస్‌ఆర్ జిల్లా) : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాయలం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమ, మంగళవారాల్లో విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకడమిక్ రమేష్ కైలాస్ ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

- రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా 1010 సీట్లకు సంబంధించి అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా.. 878 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. త్వరలో రెండో జాబితా విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. జూలై 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌ను స్మరించుకున్న విద్యార్థులు

రాష్ట్ర నలుమూలల నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వచ్చారు. ఈ నేపథ్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని వారు స్మరించుకున్నారు. ఆయన ఈ ట్రిపుల్‌ఐటీలను స్థాపించడం వల్లే తమ లాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అవకాశం వచ్చిందన్నారు. ఆయనను ఎన్నటికీ మరువలేమన్నారు. భావిభారత ఇంజినీర్లుగా దేశానికి సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతామని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తెలిపారు.

కూలి పనులు చేసుకుంటూ చదివించారు..

నా తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. కర్నూలు జిల్లా దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 593 మార్కులు సాధించాను. ఐఏఎస్ కావాలని నా లక్ష్యం. ట్రిపుల్ ఐటీలో ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేస్తాను. – బి.మహేశ్వరి(అడ్మిషన్ పొందిన విద్యార్థిని), అలారుదిన్నె, కర్నూలు

ట్రిపుల్ ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను



ట్రిపుల్ ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను. వ్యవసాయ కుటుంబంలో ఉంటూ తల్లిదండ్రులు గోవర్ధన్, లక్ష్మీదేవి నన్ను ఎంతో ప్రోత్సహించారు. రైల్వే కోడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 589 మార్కులు సాధించాను. మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా. – జి.యశ్వంత్ రెడ్డి(అడ్మిషన్ పొందిన విద్యార్థి), రైల్వేకోడూరు, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

పోలీసులకు అగంతకుడి పట్టివేత

అగంతకుడిని పట్టుకున్న కానిస్టేబుల్

పెద్దతిప్పసముద్రం : స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ఓ పెట్రోల్ పంపులోకి గుర్తు తెలియని ఓ అగంతకుడు మంగళవారం వేకువ జాము జొరబడేందుకు ప్రయత్నించాడు. లోపల నిద్రిస్తున్న పెట్రోల్ పంప్ ఆపరేటర్లు కట్టెతో తచ్చాడుతున్న అగంతకుడిని గుర్తించి అప్రమత్తమై దుండగుడిని పట్టుకునేందుకు బయటకు వచ్చారు. తక్షణం దుండగుడు పక్కనే ఉన్న మరుగుదొడ్డి లోనికి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. అనంతరం పెట్రోల్ పంప్ సిబ్బంది ఎస్ఐకు సమాచారం ఇవ్వగా పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గుర్తుతెలియని అగంతకుడిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీల కారణంగా పోలీసులు రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తూ అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా వేస్తున్నారు.

బైకుల దొంగ అరెస్టు

యశవంతపుర : అతని కన్ను పడితే ఎలాంటి బైక్ అయినా మాయం అవుతుంది. ఘరానా ద్విచక్ర వాహనాల దొంగను బెంగళూరు హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేసి రూ. 40 లక్షల విలువగల 32 బైక్‌లను సీజ్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన హేమంత్ (23) నిందితుడు. ఇటీవల విభూతిపురలో జరిగిన బైకు చోరీ కేసులో విచారించి మదనపల్లి మొయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న హేమంత్‌ను అరెస్ట్ చేశారు. హొసకోట, విజయపురలోనూ బైకులను చోరీ చేశాడు. 20 బైకులను మదనపల్లెలోని తన స్నేహితులకు అమ్మినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన బైకులను మదనపల్లె మెయిన్ రోడ్డులోని ఖాళీ జాగాలో దాచి ఉంచాడు. వాటిని స్వాధీనం చేసుకుని తరలించారు.

250 గ్రాముల గంజాయి పట్టివేత

సింహాద్రిపురం : వాహనాల తనిఖీలో గంజాయి పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం పోలీసు సిబ్బందితో కలిసి ఆయన సింహాద్రిపురం – పార్నపల్లె రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి దొరికింది. దీనిపై సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు.

శభాష్.. పోలీస్..!

- శోధించి..ఛేదించారు
- చెన్నామర్రి ప్రమాద ఘటనలో మూడు గంటల్లోనే కంటైనర్ గుర్తింపు
- కర్ణాటక వాసుల మృతి కేసులో పోలీసుల అదుపులో డ్రైవర్

కురబలకోట : రాష్ట్రంలో సంచలనం కలిగించిన మండలంలోని చెన్నామర్రి వద్ద కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన ట్రావెలర్ టెంపోను సోమవారం ఉదయం ఢీకొట్టి వెళ్లిపోయిన కంటైనర్ మిస్టరీని గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. దీని వెనుక కఠోర శ్రమతో పాటు సకాలంలో అప్రమత్తమై వివిధ కోణాల్లో జల్లెడ పట్టి శోధించి సాధించారు. తిరుమల దైవ దర్శనానికి వెళ్లి స్వగ్రామానికి వెళుతున్న ట్రావెలర్ టెంపోను ఢీకొన్న సంఘటనలో మేఘన్స్ (16), చరణ్ (17), శ్రావణి (24) అక్కడికక్కడే విగత జీవులుగా మారిన విషయం తెలిసిందే. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొట్టి వెళ్లిపోయిన కంటైనర్‌ను చెన్నైలో ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముదివేడు స్టేషన్‌కు మంగళవారం తీసుకు వచ్చారు. ప్రమాదం సోమవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో జరగ్గా వెంటనే పోలీసులు అలర్ట్ అయ్యారు. ముగ్గురి మృతికి కారణమై మరో పది మందికి తీవ్ర గాయాలు కావడానికి కారణమైన కంటైనర్ వెళ్లిపోవడాన్ని పోలీసు అధికారులు కూడా తీవ్రంగా పరిగణించారు. ప్రతిష్టాత్మకంగానే కాకుండా చాలెంజ్‌గా తీసుకున్నారు. అప్పటికప్పుడే దీన్ని కనిపెట్టడానికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు నేతృత్వంలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు, నిమ్మనపల్లె ఎస్ఐలు దిలీప్‌కుమార్, తిప్పేస్వామి ఆధ్వర్యంలో మూడు టీమ్‌లు ఏర్పాటయ్యాయి. కదిరి నుండి చెన్నై వరకు హైవే పొడవునా 150 పైగా సీసీ కెమెరాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. మార్గంలోని ఆరు టోల్‌గేట్లు, మరెన్నో చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించారు. కదిరి టోల్‌గేటు మీదుగా ప్రమాద సమయానికి ముందుగా మూడు కంటైనర్లు వచ్చినట్లు గుర్తించారు. వీటిలో ప్రమాదానికి కారణమైన కంటైనర్ కోసం జల్లెడ పట్టారు. ఎట్టకేలకు లభించిన ఆధారాలను బట్టి చెన్నైలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ కూడా వరుసగా మూడు కంటైనర్లు ఉండడంతో ప్రమాదానికి కారణమైన వాహనం కోసం మళ్లీ సందిగ్ధత ఏర్పడింది. ట్రావెలర్ టెంపోను ఢీకొట్టి ఉండడంతో ఓ కంటైనర్‌కు డ్రైవర్ వైపుగా గీతలు, రాసుకున్న ఆనవాళ్లు ఉండడంతో పసిగట్టారు. డ్రైవర్ హరిని అదుపులోకి తీసుకుని తమ స్టైల్‌లో విచారించారు. వెంటనే కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఓవర్ టేక్ చెయబోయి ప్రమాదవశాత్తు ఈ ప్రమాదానికి కారణమైనట్లు డ్రైవర్ హరి (42) చెబుతున్నట్లు సమాచారం. డ్రైవర్‌ది తమిళనాడులోని చెంగల్పట్టు. ప్రమాదంతో బాధితులు, పరిసర ప్రాంతాల వారు దాడి చేస్తారన్న భయంతో వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇతను తమిళనాడు నుండి కియో కార్లకు సంబంధించి ముడి సరుకులను అనంతపురం జిల్లాలోని కియో కార్ల తయారీ కేంద్రంలో అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ప్రమాదం జరిగిన మూడు గంటలలోనే కారణమైన కంటైనర్ ను గుర్తించడంతో పాటు దానిని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పట్టుకున్న పోలీసుల ప్రతిభను జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు అభినందించారు.

చెన్నామర్రి వద్ద బాగేపల్లె వాసుల ప్రమాదానికి కారణమైన కంటైనర్ స్వాధీనం

ప్రమాదం ఎలా జరిగింది.?

కర్ణాటక వాసుల మృతి ఘటనపై త్రిసభ్య కమిటీ పరిశీలన

కురబలకోట : మండలంలోని చెన్నామర్రి వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసులు మృతి చెందిన ఘటనను జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తోంది. ముగ్గురి ప్రాణాలు కోల్పోయి మరో పది మంది తీవ్రంగా గాయపడ్డ ఘటన జరిగిన ప్రదేశాన్ని మంగళవారం త్రిసభ్య కమిటీ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, హైవే డీఈ శివరాం, ఎంవీఐ శివలింగయ్య, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కారణాలను అధ్యయనం చేశారు. అధిక వేగం, డ్రైవర్లు అప్రమత్తంగా లేకపోండం, నిర్లక్ష్య ధోరణి, సిగ్నల్ లోపం తదితర వాటిని ప్రధాన కారణాలుగా భావించారు. వేగ నియంత్రణకు స్పీడు బ్రేకర్లు వేయాలని నిర్ధారించారు. అదే విధంగా ప్రమాదకర మలుపుల వద్ద సిగ్నల్స్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు మరిన్ని చర్యలు తీసుకోవడానికి సంకల్పించారు. మండల కేంద్రం కురబలకోటకు వెళ్లే జంగావారిపల్లె హైవే క్రాస్ వద్ద స్పీడు బ్రేకర్లు వేయాల్సిన అవసరం ఉందని ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించేవారు ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు.

చెన్నామర్రి ప్రమాద స్థలం వద్ద త్రిసభ్య కమిటీ పరిశీలన

వివాహిత హత్య కేసులో నలుగురి అరెస్టు

పీలేరు రూరల్ : వివాహిత హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం వెంగంపల్లెకు చెందిన లోకనాథరెడ్డి, జీవనజ్యోతి దంపతుల కుమార్తె ఇందుజా (30)కు ఐదేళ్ల క్రితం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందారువాండ్లపల్లెకు చెందిన వరంపాటి శంకర్‌రెడ్డి కుమారుడు వరంపాటి విజయశేఖర్‌రెడ్డితో వివాహమైంది. విజయశేఖర్‌రెడ్డి వేరే మహిళతో వివాహేతర సంబంధం కలిగి భార్య అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గతనెల 28న రాత్రి ఇందుజాను హతమార్చాలని విజయశేఖర్‌రెడ్డి, తన తల్లి శాంతమ్మ, అక్క సునంద, అవ్వ కంభం అమ్మన్నమ్మలతో కలిసి పథకం పన్నాడు. ఆ రోజు రాత్రి పక్క గ్రామంలో గంగ జాతర ఉండడంతో గ్రామస్తులు ఎవరూ లేని సమయం చూసుకుని పథకం ప్రకారం ఇందుజాను కొట్టి గొంతునులిమి హత్య చేశారు. తొలుత ఆత్మహత్యగా చిత్రీకరించేందుగా సమీప వ్యవసాయ బావిలో మృతదేహాన్ని పడేశారు. తన తల్లి సలహా మేరకు తిరిగి మృతదేహాన్ని ఇంటి వద్దకు చేర్చారు. ఇందుజా నిద్రలోనే మృతి చెందినట్లు ప్రచారం చేశారు. మృతురాలి తల్లి జీవనజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అసలు విషయం వెలికి తీశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

కలికిరి : అనారోగ్యం, మతిస్థిమితం సరిగ్గాలేని యువతి పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం కలికిరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కలికిరి గ్రామ పంచాయతీ నర్రావాండ్లపల్లికి చెందిన ఎర్రయ్య, గంగులమ్మల కుమార్తె కె.చందన(23)తో కలిసి కలికిరి సీఎల్ఆర్‌సీ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న చందన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అప్పుడప్పుడూ మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ పెట్రోలు బంకులో పెట్రోలు కొనుక్కుని గిరిజన కాలనీ సమీపం కలికిరి వంక వద్ద ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. ఉదయం 8 గంటల ప్రాంతంలో యువతి మృతదేహాన్ని గుర్తించిన గిరిజన కాలనీ వాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువతి ఆచూకీ గుర్తించి ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు.

ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు ఈనెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం భాస్కర్ రెడ్డి, సెక్రటరీ పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. జూలై 12వ తేదీ రెండవ శనివారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్ 15, అండర్ 17 విభాగాలకు చెందిన బాల బాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. అలాగే 13వ తేదీ ఆదివారం ప్రొద్దుటూరు జార్జ్ క్లబ్‌లో అండర్ 11, అండర్ 13 బాలబాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం లోపు 9440107080 లేదా 9440223908 నంబర్‌కు ఎంట్రీలను పంపాలని అసోసియేషన్ చైర్మన్ బాషా కోరారు.

గండిలో నేడు టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ, స్వాగత తోరణాలు, చలువపందిళ్లు, బారికేడ్ల ఏర్పా టుకు సంబంధించి బుధవారం సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. వీటితో పాటు ఫొటో, వీడియో కవరేజి, ప్రత్యేక భజంత్రీల ఏర్పాటుకు కూడా టెండర్లు జరుగుతాయన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

10న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం జులై 9, 10 తేదీలలో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో లైసెన్సులు జారీ చేసే గండికోట జలాశయం, బ్రహ్మంసాగర్ జలాశయం, సోమశిల వెనక జలాల్లో చేపల సంతానోత్పత్తి కాలమైన జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటకు విరామం పాటించాలని ఉప మత్స్య సంచాలకుడు నాగయ్య తెలిపారు. ఈ సమయంలో ఎవరైనా చేపల వేట కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కలికిరి : తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారిలో వాల్మీకిపురం మండల పరిధిలోని గండబోయనపల్లి సమీపంలో గల టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య కుమారుడు వినేష్ సొంత పనుల నిమిత్తం మదనపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గండబోయనపల్లి సమీపంలోని టోల్‌గేటు వద్ద కర్ణాటకకు చెందిన కెఎ36ఎం 9619 తూఫాన్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో వినేష్‌కు తీవ్ర గాయాలు కాగా, తూఫాన్ వాహనం రోడ్డుపైన ఫల్టీ కొట్టింది. వాహనంలో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. వినేష్‌ను స్థానికులు కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు.

నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

చౌకదుకాణం మూత.. తప్పని వెత

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ రైల్వేగేట్ సమీపంలోని చౌక దుకాణం మంగళవారం మూసివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ ఇవ్వాలని చెప్పినప్పటికీ మొదటి రోజే చౌకదుకాణానికి బీగాలు వేయడంతో రేషన్ దుకాణానికి వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. చౌకదుకాణం మూసివేయడంపై ఆర్ఐ సుశీల్‌కుమార్‌ను వివరణ కోరగా రేషన్ డీలర్ బంధువులు చనిపోవడంతో కడపకు వెళ్తున్నామని తహసీల్దార్ అమరేశ్వరి వద్ద పర్మిషన్ తీసుకుని డీలర్ వెళ్లారని ఆర్ఐ తెలిపారు.



చౌకదుకాణం మూసివేయడంతో పడిగాపులు కాస్తున్న ప్రజలు

ఆటో బోల్తా

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. సోమల మండలం నంజంపేటకు చెందిన విజయ్(42), చోటేసాబ్(62), నంజంపేట వడ్డిపల్లెకు చెందిన రమణ(49) ముగ్గురూ కలిసి మదనపల్లె మండలం వలసపల్లె వద్ద కట్టెలు కొట్టేందుకు కూలిపనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలోని పెద్దూరు సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చౌడేపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్, చోటేసాబ్

జూనియర్ బాలుర ఫుట్‌బాల్ విజేత సత్యసాయి జిల్లా

మదనపల్లె సిటీ : మదనపల్లె సమీపంలోని వేద పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఫైనల్స్‌లో సత్యసాయి జిల్లా విజేతగా నిలిచింది. గత మూడు రోజుల నుంచి పలు జిల్లాల జట్ల మధ్య పోటీలు జరుగుతున్నాయి. ఫైనల్స్‌లో సత్యసాయి, తిరుపతి జట్లు పోటీపడగా సత్యసాయి జిల్లా విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా తిరుపతి జట్టు, తృతీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచాయి. ఈ టోర్నమెంటులో బెస్ట్ ప్లేయర్స్‌ను ఎంపిక చేసి వారిని ఈనెల మూడవ వారంలో అమృతసర్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంటుకు పంపనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. విజేతలకు వేదా పాఠశాల కరస్పాండెంట్ రామలింగారెడ్డి, పోతబోలు సర్పంచు ఈశ్వరయ్యలు ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు సిరాజ్, చినబాబు, శ్రీనివాస్, మహీంద్ర, కమలేష్, బాలాజీ, నరేంద్ర పాల్గొన్నారు.

మొదటి స్థానంలో నిలిచిన సత్యసాయి జిల్లా జట్టు

పచ్చ పత్రిక కథనం బూటకం

జరిగిన విషయాన్ని వెల్లడిస్తున్న బాధిత కుటుంబీకులు

టీడీపీ సానుభూతిపరుడు రోడ్డుకు అడ్డంగా వేసిన ముళ్ల కంపలు (ఫైల్)

- అగ్నికి ఆజ్యం పోసింది టీడీపీ సానుభూతిపరులే
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు
- పోలీసుల చొరవతో కంపలు తొలగించినా మళ్లీ రోడ్డులో మూగజీవాలతో అడ్డు కట్ట

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లిలో అదే తాలిబన్ల రాజ్యం అంటూ ఓ పచ్చ పత్రికలో ప్రచురితమైన వార్తపై బాధిత గ్రామస్తులు స్పందించారు. ఇదంతా బూటకపు కథనమని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండలంలోని పులికల్లు పంచాయతీ చిన్న వెంకట్రమణగారిపల్లి (సీవీ పల్లి)కి చెందిన ముస్తాని చిన్నప్ప, ముస్తాని జయరాం కుటుంబీకులు మంగళవారం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెలో కొంత మంది టీడీపీ నాయకులు తమ దాయాదుల నడుమ చిచ్చు పెడుతూ గొడవలకు ప్రేరేపిస్తున్నారన్నారు. 20 ఏళ్ల క్రితమే ప్రజల సౌకర్యం కోసం రోడ్డుకు స్థలాన్ని కేటాయించారన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సిమెంటు రోడ్డు కూడా గతంలోనే వేయించారన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇదే గ్రామంలో ఉంటున్న ఓ టీడీపీ సానుభూతిపరుడు రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు వేశాడన్నారు. అప్పట్లో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ముళ్ల కంపలను తొలగించేసినా కూడా మళ్లీ అదే వ్యక్తి ప్రజల రాకపోకలకు అసౌకర్యాన్ని కల్పిస్తూ రోడ్డులో మూగజీవాలు, ద్విచక్ర వాహనాలతో అడ్డు కట్ట వేశాడని ఆరోపించారు. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న పల్లె ప్రజలపై దాయాదుల మధ్య చిచ్చు పెట్టి అగ్నికి ఆజ్యం పోసి ఒకరి కోసం 10 మందిని ఇబ్బందులకు గురి చేస్తూ ఉనికి కోసం రాజకీయ రంగు పులమడం టీడీపీ సానుభూతిపరులకు తగదని హితవు పలికారు. ఏడు కుటుంబాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న సదరు వ్యక్తి అసౌకర్యం కల్పించనని చెబితే రోడ్డులోని రాళ్లను తొలగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బాధితులు స్పష్టం చేశారు.

దళిత యువకునిపై అమానుష దాడి

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

కలికిరి(వాల్మీకిపురం) : దళిత యువకునిపై జరిగిన అమానుష దాడి ఘటన వాల్మీకిపురం మండల పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు... మండలంలోని చింతపర్తి గ్రామం కోటపల్లికి చెందిన గురునాథ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామం బోయపల్లి నుంచి కూలీలను తన ఆటోలో పని చేసే ప్రాంతానికి తీసుకెళ్లేవాడు. ఆటో డ్రైవర్ గురునాథ తన భార్యకు ఫోన్ చేశాడన్న అనుమానంతో బోయపల్లికి చెందిన భార్గవ ఈ నెల 27న గురునాథను బోయపల్లి సమీపంలోని ఓ తోటలోకి తీసుకెళ్లి తన స్నేహితులతో కలిసి అమానుషంగా దాడి చేసి గాయపరిచాడు. దాడిలో గురునాథ చేయి విరిగింది. చెవికి రక్త గాయాలయ్యాయి. దాడి ఘటన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేస్తోంది.

తనపై దాడికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మూడు రోజుల క్రితం బాధితుడు గురునాథ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కనీసం దాడి ఘటనపై విచారించకుండా కాలయాపన చేస్తుండటంతో మాలమహానాడు నేతలతో కలిసి మంగళవారం వాల్మీకిపురం పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలపారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లెల మోహన్ మాట్లాడుతూ ఓ దళితునిపై దాడి జరిగితే పోలీసులు రాజకీయ ఒత్తిడితో కేసు నమోదు చేయక పోవడం దుర్మార్గమన్నారు. దళిత యువకునిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోక పోతే మాలమహానాడు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు గుండా మనోహర్, శివయ్య, వెంకటస్వామి, సుధా, నాగార్జున, ప్రశాంత్, బాధితుని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలియజేస్తున్న మాలమహానాడు సంఘం నేతలు

బాధితుడు గురునాథ

మీ సేవలకు ఆత్మీయ వీడ్కోలు

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానించిన జిల్లా ఎస్పీ

రాయచోటి : విధి నిర్వహణలో అలుపెరుగక సేవలు అందించిన పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులు, సిబ్బందిని వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో రాయచోటిలోని అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించారు.

జిల్లా క్రైమ్ బ్రాంచ్, ఎస్ఐ పి.రెడ్డయ్య, అన్నమయ్య జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.శ్రీహరి, మదనపల్లి 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ బి.గణపతి, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్ఐ ఎస్.గౌస్ మొహిద్దీన్, మన్నూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.శంకరయ్యలు పదవీ విరమణ పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ లక్ష్యం పట్ల అంకితభావం, కృషి, నిబద్ధత కనబరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, మదనపల్లి డీఎస్పీ ఎస్. హేంద్ర, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఎఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఏఏఓ జె.త్రినాథ సత్యం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజ రమేష్, కె.రాజారెడ్డి, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజె రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు హాజరయ్యారు.

ఇసుక అక్రమ రవాణా

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ రాచపల్లి సమీపంలోని పింఛా నదిలో అధిక సంఖ్యలో ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. పింఛా ప్రాజెక్టు నుంచి రాయవరం బహుదానదిలోకి కలిసే వాగులో ప్రతిరోజూ అధిక మొత్తంలో పీలేరు, బయట ప్రాంతాల వారు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని, రైతులు పేర్కొంటున్నారు. బయట ప్రాంతాల నుండి వచ్చి ఇసుకను అక్రమంగా తరలించుకోవడం వలన ఇసుక మాయమై నదిలో మట్టి, పెద్ద పెద్ద రాళ్లు ఏర్పడటంతో భూగర్భ జలాలు అడుగంటి తాగు నీటి సమస్యలు తలెత్తుతున్నాయని వారు వాపోతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్ట్10th, Inter, (వయస్సు18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366

SERIVCES
PERSONAL CARE
CHANGE OF NAME
■I BAYAPUREDDY DHEERAJH RREDDE (OLD NAME) S/O BAYAPU REDDY VENU GOPAL REDDY R/O D.NO:-3/647, GAYATHRI NAGAR , YMR COLONY,PRODDATUR TOWN & MANDAL YSR KADAPA DIST AP . I CHANGED MY NAME TO BAYAPUREDDY DHEERAJH REDDY. HENCE FORTH .I WILL BE KNOW AS BAYAPUREDDY DHEERAJH REDDY

■WE BAYAPUREDDY VENU GOPAL REDDY & BAYAPUREDDY SUNANDA PARENTS OF BAYAPUREDDY KESHAVVAA REDDY R/O D.NO.:-3/647, GAYATHRI NAGAR, YMR COLONY, PRODDATUR TOWN & MANDAL YSR KADAPA DIST AP. DECLARE THAT OUR SON NAME HAS CHANGED TO BAYAPUREDDY KESH AVAREDDY (NEW NAME) FROM BAYAPUREDDY KESHAVVAA REDDY (OLD NAME)

LOST
■Passport No:T350221 pedda palli Nagaraju, S/o pedda palli thimmaya D.No: 46-108-5-3-2 sattar colony, Kadapa city, YSR District. పై వివరాలు గల పాసుపోర్టు matari street) నుండి sattar colony కు ఇల్లు మారినప్పుడు పోయి నది. దయచేసి దొరికిన వారు పై చిరునామాలో సంప్రదించండి.

■Passport No:K4157948 Dt:17-07-2012 Issued by The Regional Passport Office Hyderabad. PATAN MUHIB KHAN, S/O PATAN KHADER KHAN. R/at. D.No:30/22-9-33-3, Alimabad Street, Rayachoty (Town &MDL), ANNAMAYYA (DIST),A.P. అను నెంబరు, చిరునామా కలిగిన పాసుపోర్టు తీసుకొని బస్సు కోసం రాయచోటి బస్టాండ్ నందు ఉన్నప్పుడు ఎక్కడో జారిపోయినది దొరికిన వారు పై చిరునామాకు తెలుపగలరు.

■పాపుదిప్పు మహేశ్వర్ రెడ్డి S/o పాపుదిప్పు మల్లెంకొండారెడ్డి అను నేను యస్.రామాపురం నుండి బద్వేల్‌కు జిరాక్స్ కొరకు బస్సులో వెళ్తుండగా నా ఒరిజినల్ పాసుపోర్టు పోయినది. పాసు పోర్టు నెం:M0230852 ఎవరికైన దొరికిన యెడల ఈ అడ్రస్‌కి తెలుపగలరు మా అడ్రస్ యస్.రామాపురం గ్రామం, గోపవరం మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా సెల్ : 8919523180

WANTED
■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమం తుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- 92814 52827, 92814 52838

■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135

■ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

సాక్షి బాపట్ల

బుధవారం । 2 । జూలై । 2025

అమ్మవారికి ఆషాఢ సారె

బాపట్లటౌన్:ముత్తాయపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం మహిళలు పూజలు నిర్వహించి ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పింఛన్లు పంపిణీ

మేదరమెట్ల: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొరిశపాడు మండలం ధైవాల రావూరు గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

నేడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశం

బాపట్ల: బాపట్ల జిల్లా పరిధిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల సమావేశం బుధవారం బాపట్లలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నూతన కార్యాలయంలో ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

తెనాలి వచ్చిన గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్

తెనాలిఅర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని పరిశీలించేందుకు ఆ విభాగ గుంటూరు గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్ మంగళవారం తెనాలి వచ్చారు. కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 22వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ కల్నర్ ఎ.ఉదయ్‌కుమార్, సబ్ మేజర్ గురుదీప్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ దేవి ప్రియా, ఎన్‌సీసీ అధికారి కె.అశోక్ పాల్గొన్నారు.

గృహ హింస బాధిత మహిళలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100

నరసరావుపేట టౌన్: గృహహింస బాధిత మహిళలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పూర్తి అండగా నిలుస్తుందని, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేయవలసిందిగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ మంగళవారం తెలిపారు. బాధిత మహిళలకు చట్ట ప్రకారం ఆర్థిక, ఆరోగ్య, ఉచిత నివాస, చట్టపరమైన సహాయాలు లభిస్తాయన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి తగు సహాయం పొందవలసిందిగా సూచించారు.

ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం

పెదకాకాని: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించేందుకు ఉప్పలపాడు గ్రామాన్ని కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. పెదకాకాని మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనలో భాగంగా ఉప్పలపాడు గ్రామానికి వచ్చిన కేంద్ర బృందం ఫాం పాండ్స్, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను పరిశీలించింది. మండలంలో జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డ్వాక్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రంలో జేసీ ఆకస్మిక తనిఖీలు

పెదకాకాని: రైతులు తీసుకు వచ్చిన పొగాకును వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అన్నారు. పెదకాకాని సెంట్రల్ వేర్‌హౌస్‌లో గత పది రోజులుగా పొగాకు కొనుగోలు ప్రారంభించారు. ఈ కేంద్రంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకు వచ్చిన పొగాకును త్వరగా కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం సిబ్బంది ఉదయం ఆలస్యంగా రావడం వల్ల కొనుగోలులో ఆలస్యంగా జరుగుతుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐతా నాగేశ్వరరావు, పొగాకు సేకరణ ముఖ్య అధికారులు రమేష్, సుబ్రమణ్యం, తహసీల్దార్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఇంటింటికా..మేము రాలేం..

- నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కూటమి ప్రచారం
- ఏడాదిలో ఏమీ చేయకుండానే చేసినట్లు ఆర్భాటం
- ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు గాలికి
- జనంలోకి వెళ్లేందుకు జంకుతున్న పచ్చనేతలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు– ఇంటింటికి తేదేపా' పేరుతో బుధవారం నుంచి కూటమి ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారానికి దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ఇంటింటికి వెళ్లడంలో ఇబ్బందులు తప్పవని పచ్చపార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు.

హామీలకు మంగళం

ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ మాటున ఇచ్చిన వందలాది హామీలలో ఒకటి రెండు మినహా చంద్రబాబు సర్కార్ నెరవేర్చలేదు. అవి కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. ఎన్నికల్లో ఓట్లేయించుకొని గద్దెనెక్కాక వంచిచడంపై జనం మండిపడుతున్నారు. రెండో ఏడాది ఖరీఫ్ నడికొంటున్నా అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. మహిళలకు ఉచిత బస్సు హామీ ఊసేలేదు. 20 లక్షల ఉద్యోగాలన్నా ఒక్క ఉద్యోగం రాలేదు. నిరుద్యోగ భృతి నీటిమూటగా మారింది. మహిళలకు ప్రతినెలా రూ.1500 ఇస్తామన్న హామీని అటకెక్కించారు. ఇలా చెప్పుకుంటూ పోతే వందలాది హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ఇప్పుడు హామీలను అటకెక్కించడంపై పేద, మధ్యతరగతి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

పతాక స్థాయిలో అవినీతి

మరోవైపు చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలు పతాక స్థాయికి చేరాయి. ఇసుక, బుసక, గ్రానైట్, గ్రావెల్‌ను ట్రిప్పుల లెక్కన విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. పేదల కడుపుకొట్టి చౌక బియ్యాన్ని ఒక్కొక్క ప్రజాప్రతినిధి నెలకు రూ.25 లక్షలకు అమ్ముకుంటున్నారు. రెడ్‌బుక్ పాలనను తెరపైకి తెచ్చి హత్యలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు అంటూ ప్రతిపక్ష పార్టీలతోపాటు ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదు. మొత్తంగా కూటమి ఏడాది పాలన ప్రజాకంఠకంగా మారడంతో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓట్లేయించుకొని వంచించారని మండిపడుతున్నారు.

అడ్డుఅదుపూ లేని పచ్చదోపిడీ

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పేదల కడుపుకొట్టి రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గ్రానైట్, గ్రావెల్‌ను ఎక్కడికక్కడ అమ్ముకుంటున్నారు. జిల్లాలో ప్రభుత్వ, అటవీ భూములను కబ్జా చేస్తున్నారు. వీధివీధినా బెల్టు షాపులు పెట్టి ప్రజలను తాగుడుకు బానిసలను చేస్తున్నారు.

పార్టీ శ్రేణుల్లో అంతర్మథనం

ఎన్నికల్లో మాటలు చెప్పి ఓట్లేయించుకొని హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్న విషయం పచ్చ ప్రజాప్రతినిధులు, నేతలకు తెలుసు. ఈ సమయంలో ప్రచార ఆర్భాటంగా ఇంటింటికి వెళితే ప్రజల నుంచి చీవాట్లు ఖాయమని చాలామంది పచ్చనేతలు భయపడుతున్నారు. ప్రజలు నిలదీస్తే సమాధానం చెప్పలేని పరిస్థితి. దీంతో జనంలోకి వెళ్లి ఇరుకున పడతామని, హామీలు కొన్నైనా నెరవేర్చాక వెళితే బాగుంటుందని చాలా మంది పచ్చనేతలు పేర్కొంటుండటం గమనార్హం. తల్లికి వందనం ఒక్కటే ఇప్పటివరకూ ఇచ్చిన పథకమని అది కూడా చాలామందికి ఇంకా డబ్బులు పడలేదని ఈ పరిస్థితిలో జనంలో కోపం ఉందని ఒక టీడీపీ నేత చెప్పారు. ఇప్పటికీ తల్లికి వందనాన్ని అమ్మ ఒడిగానే ప్రజలు పిలుస్తున్నారని మరో పచ్చనేత చెప్పారు. కొన్ని పథకాలైనా నెరవేర్చాక జనంలోకి వెళ్లాలని, ఇప్పుడు వెళ్లడం వల్ల ఇబ్బందులు తప్పవని మరో టీడీపీ నేత పేర్కొన్నారు. మొత్తంగా హామీలు నెరవేర్చకుండా ఏడాదిలోనే జనంలోకి వెళ్లడం సరికాదని ఎక్కువమంది పచ్చనేతలు అభిప్రాయపడుతున్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో వంచన

- అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. రెండో ఖరీఫ్ సీజన్ వచ్చినా జిల్లాలోని 1,92,037 మంది రైతులకు ఇవ్వాల్సిన రూ.384,06 కోట్లలో పైసా ఇవ్వలేదు.
- తల్లికి వందన పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు. జిల్లాలోని 2,35,654 మందికి రూ.353.48 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా కొందరికే ఇచ్చి చాలామందికి ఎగనామం పెట్టారు.
- నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి అన్నారు. జిల్లాలో 4,77,557 కుటుంబాల పరిదిలో ఇంటికొక్కరు అనుకున్నా వారందరికి చెల్లించాల్సిన రూ.143. 26 కోట్లలో పైసా ఇవ్వలేదు.
- మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణమన్నారు. జిల్లాలో ఉన్న ఆర్టీసీ బస్సుల ప్రకారం రోజూ 90 వేలమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన వందకు పైగా హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. జిల్లాలో అభివృద్ధిని పట్టించుకోలేదు.
- మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామన్నారు. జిల్లాలో 19 నుంచి 59 ఏళ్లవయస్సు వారు 6,61,841 మంది ఉండగా వీరందకి ఏడాదికి రూ.11,913 కోట్లు ఇవ్వాల్సిఉన్నా దాని ఊసే మరిచారు.
- ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు అనిచెప్పి జిల్లాలో మొత్తం 4,60,836 గ్యాస్ కనెక్షన్‌లు ఉండగా మూడు ఉచిత సిలిండర్లకు ఒక్కొక్కరికి రూ.2,700 చొప్పున ఇవ్వాల్సి వుంది. కానీ ప్రభుత్వం 3 లక్షల మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేసి చేతులు దులుపుకుంది.

పీఏసీఎస్‌లలో అంతర్జాతీయ సహకార కార్యక్రమాలు

నరసరావుపేటరూరల్: జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయాల్లో అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమాలు సందర్భంగా మోడల్ ఆడిటింగ్, స్వచ్ఛత, మెంబర్‌షిప్ డ్రైవ్, పాఠశాలలలో సహకార సంఘాలపై అవగాహన సదస్సులు, సహకార సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2025వ ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించి ఉన్నందున ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు సహకార ఉద్యమ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, సంఘ సీఈఓ కంటు శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్‌కు అర్హత సాధించిన శివకోటేశ్వరమ్మ

రెంటచింతల: కేరళలో జరగనున్న సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు రెంటచింతల–2 సచివాలయం మహిళా పోలీస్ చిన్నపురెడ్డి శివకోటేశ్వరమ్మ అర్హత సాధించింది. జూన్ 21 నుంచి 30 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన 25 ఏపీ రైఫిల్ షూటింగ్ చాంపియన్ 2025 పోటీలలో 10 మీటర్ల ఎయిర్ ఫిస్టల్ విభాగంలో విశేష ప్రతిభను ప్రదర్శించి శివకోటేశ్వరమ్మ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైంది. ఇంటర్ డిస్ట్రిక్ స్థాయిలో కూడా 10 మీటర్ల ఎయిర్ ఫిస్టల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన శివకోటేశ్వరమ్మ తన ప్రతిభను రోజురోజుకు మెరుగుపరుచుకుంటూ సౌత్‌జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆమె కృషి, పట్టుదలకు నిదర్శనం. శివకోటేశ్వరమ్మ మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రోత్సహంతోనే ఈ విజయం సాధించినట్లు తెలిపారు.

ఉప్పు సాగుకు ప్రకృతి విఘాతం

- సీజన్‌లో భారీగా పడిపోయిన ఉత్పత్తి
- గతంలో ఎన్నడూ లేని విధంగా దెబ్బతిన్న రైతు
- రైతుల ఆశలపై నీరు చల్లిన అకాల వర్షం
- ఉమ్మడి ప్రకాశంలో రైతులకు కోలుకోలేని దెబ్బ
- రైతుల కష్టం పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఉప్పు భూములలో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతులు

చినగంజాం: ఉప్పు సాగుకు ఇటీవల కాలంలో ప్రకృతి తీవ్ర విఘాతం కలుగజేస్తోంది. అయినా ఉప్పు రైతు వాటిని తట్టుకొని నెగ్గుకు రాగలుగుతున్నాడు. వేసవి ఉష్ణోగ్రతలు పంట దిగుబడిని, నాణ్యతను పెంచుతాయి. ఉప్పు సాగు ముమ్మరంగా సాగే అనుకూల సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఉప్పు రైతు కోలుకోవడం కష్టమే. గత నాలుగు సీజన్‌లుగా ఇదే పరిణామాలు ఉప్పు సాగు విషయంలో చోటు చేసుకుంటున్నాయి.

సీజన్‌లో భారీగా పడిపోయిన ఉప్పు ఉత్పత్తి

రాష్ట్రంలో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య సీజన్‌లో ఉప్పు ఉత్పత్తి భారీగా పడిపోయింది. రాష్ట్రంలో ఇచ్చాపురం నుంచి తడ వరకు ఉన్న ఉప్పు పరిశ్రమల్లో మొత్తం 22 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి కొనసాగుతుంది. తుఫాన్‌లు, భారీ వర్షాల కారణంగా ఉప్పు రైతు నష్టపోక తప్పడం లేదు. ఉప్పు సాగు ప్రతి ఏడాది నవంబరు నెల నుంచి తరువాత ఏడాది జూన్ వరకు దాదాపు 8 నెలలపాటు కొనసాగుతుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో ఉప్పు సాగును ప్రారంభించి తొలి తీత సంక్రాంతి పండుగ నాటికి తీయాల్సి ఉంది. 2024–25 సీజన్‌లో నవంబరు, డిసెంబరు నెలలో ప్రకృతి అనుకూలించక ఆలస్యంగా రైతులు సాగును ప్రారంభించాల్సి వచ్చింది. ఉప్పు కొఠారుల్లో భారీగా వర్షపు నీరు నిలిచి సాగుకు భూములు అనుకూలత లేక జనవరి నెలలో సాగుకు భూములను సిద్ధం చేసుకునే పనిలో ఉండి ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో సుమారు 30 శాతం మాత్రమే ఉప్పును రైతులు తీయగలిగారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండి ఉప్పు దిగుబడికి అనుకూలంగా ఉండే మే, జూన్ నెలల్లో తుఫాన్‌లు, అకాల వర్షాలతో సాగు పూర్తిగా నిలిచిపోయింది. ఉప్పు రైతుకు ఎన్నడూ లేని విధంగా తీవ్ర విఘాతం కలిగింది. సొంత భూములున్న రైతులు, లైసెన్స్‌దారులు పరిస్థితి ఎలా ఉన్నా ముఖ్యంగా కౌలుదారులకు మాత్రం తీవ్ర ఇబ్బంది కలిగింది.

ఉమ్మడి ప్రకాశంలో ఉపాధి కోల్పోయిన వేల కుటుంబాలు:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఊళ్లపాలెం, కనపర్తి, కొత్తపట్నం, చినగంజాం మండలాల్లో ఉప్పు సాగు కొనసాగుతోంది. బాపట్ల జిల్లాలో చినగంజాం మండలంలో చినగంజాం, పెదగంజాం గ్రామాల్లో రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు మొత్తం 3,600 ఎకరాల్లో ఉప్పు సాగు చేసే భూములున్నాయి. వాటిలో ప్రభుత్వ భూములు 2,400 ఎకరాలు కాగా, 500 ఎకరాలు స్పోవైట్ సాల్ట్ భూముల్లో సాగు సాగడం లేదు. ప్రభుత్వ భూమిలో 620 ఎకరాలు చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి మరో 1200 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. చినగంజాం మండల పరిధిలో చిన్న, పెద్ద రైతులు సుమారు 1050 కుటుంబాలు ఉండగా వారితో పాటు ఉప్పు కొఠారుల్లో పనులు నిర్వహిస్తూ కూలీలుగా సుమారు 8 వేల మంది పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. చినగంజాం సాల్ట్ వర్కర్స్ కో ఆపరేటివ్ ప్రొడక్షన్స్ సేల్స్ సొసైటీ (ఎల్ నంబర్ 73 అండ్ 86)లో 400 ఎకరాలు సుమారు 700 కుటుంబాలు, రాజుబంగారుపాలెం సాల్ట్ సొసైటీలో 120 ఎకరాలు 350 కుటుంబాలు మొత్తం 1050 కుటుంబాలు ఉప్పు సాగు మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఊళ్లపాలెం గ్రామ పరిధిలో ఎస్సీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద 500 ఎకరాలు, ఓసీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద మరో 350 ఎకరాలు ఉప్పు సాగు చేస్తుండగా, కొత్తపట్నం మండలంలోని సాల్ట్ సొసైటీ కింద 275 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. వీటితో పాటు సుమారు మరో వెయ్యి ఎకరాలు ప్రైవేట్ భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఉప్పు సాగుకు అవాంతరం కలగడంతో వేల కుటుంబాలు ఈ సీజన్‌లో తమ ఉపాధిని కోల్పోయారు.

పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

తీవ్ర ప్రకృతి వైపరీత్యాల నడుమ కొట్టు మిట్టాడుతున్న ఉప్పు రైతుల గోడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. ఉప్పు రైతులకు సబ్సిడీ కల్పించే విషయంలోను, గిట్టుబాటు ధర కల్పించడంలోను, ఉత్పత్తి చేసిన ఉప్పును భద్రపరచుకునేందుకు షెడ్డుల నిర్మాణాలు, కొఠారుల్లో రోడ్ల వసతి, తాగునీరు, విశ్రాంతి గదుల వంటివి లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో సాగు చేయలేకపోతున్నాం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఉప్పు సాగు చేయలేక పోతున్నాం. గతంలో మూడు సీజన్‌లుగా ఇబ్బందులు పడిన మాకు ఈ ఏడాది సాగు సక్రమంగా సాగక దిగుబడి లేకుండా పోయింది. కష్టం, అప్పు మాత్రమే మిగిలిపోయింది. కౌలు నగదు సైతం చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది.

– మరపాల నారాయణరెడ్డి, ఉప్పు రైతు, మూలగానివారిపాలెం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

ఉప్పు ఉత్పత్తి లేక పెట్టిన పెట్టుబడులు రాక అల్లాడుతున్న ఉప్పు రైతులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే ఆదుకోవాలి. పొగాకు, మిరప, ఇతర పంటల రైతులను ఆదుకున్న మాదిరిగానే ఉప్పు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

– శనగపల్లి లక్ష్మణ పరశు, ఉప్పు రైతు, చినగంజాం

సామాజిక పింఛన్ల నగదు మాయం

సుమారు రూ.9.5 లక్షలుగా లెక్క తేల్చిన అధికారులు

యడ్లపాడు: సామాజిక పింఛన్ల నిధులు గోల్‌మాల్ అయిన విషయం వెలుగు చూసింది. యడ్లపాడులో గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సిన రూ. 9.5 లక్షల పింఛన్ నగదును తిరిగి జమ చేయకపోవడంతో అధికా రులు ఆరా తీయడంతో విషయం బయటకు వచ్చింది. గత నాలుగు నెలలుగా తన సొంత అవసరాలకు వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం, ప్రతినెలా పింఛన్లు పంపిణీ చేసిన తర్వాత, పంపిణీ కాని మొత్తాన్ని 7వ తేదీలోపు ప్రభుత్వ ఖాతాకు తిరిగి జమ చేయాలి. సచివాలయాల పరిధిలో ఈ బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్‌లదే. అయితే, సదరు అసిస్టెంట్ ఈ నిబంధనలను ఉల్లంఘించి, నాలుగు నెలలుగా పంపిణీ కాని పింఛన్ నగదును జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు.

బయటపడిందిలా..

నాలుగు రోజుల క్రితం ఈ విషయంపై డీఆర్డీఏ అధికారులు ఎంపీడీవోకు సమాచారం అందించారు. ఎంపీడీవో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిధుల జమ ఆలస్యంపై ప్రశ్నించగా, సాంకేతిక లోపాల కారణంగా అప్డేట్ కావడం లేదని బుకాయించాడు. దీంతో ఎంపీడీవో జిల్లా కార్యాలయానికి వెళ్లి అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. అయితే, జిల్లా కార్యాలయానికి వెళ్లి తాను కట్టినట్టుగా చూపించిన చలానాలు నకిలీవిగా తేలడంతో అసలు బండారం బయటపడింది. వెంటనే ఆ మొత్తాన్ని చెల్లించాలని అధికారులు సదరు అసిస్టెంట్‌ను ఆదేశించారు.

వాస్తవమే..

పింఛన్ల నగదు ప్రభుత్వ ఖాతాకు జమచేయని విషయం వాస్తవమే. సొంతానికి వాడుకున్న నగదు జమ చేయాలని జిల్లా అధికారులే వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. నగదు సొంతానికి వాడుకున్న విషయమై విచారిస్తాం.

–వి.హేమలతాదేవి, ఎంపీడీఓ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,200** గరిష్ఠం : రూ. **2,000**

మోడల్ ధర రూ. **1,600**

మిర్చి యార్డు సమాచారం (మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	47,085
అమ్మకాలు	45,592
నిల్వ	8,935

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,700
నంబరు-5	రూ. 10,000 – 13,420
341	రూ. 10,000 – 13,300

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,700
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
ఆర్మూర్	రూ. 9,700 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 12,800
నంబరు-5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,300
4884	రూ. 10,000 – 12,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు (మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 754

కొమ్ములు : 565 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,625	10,350	10,200

కాయలు : 155 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,625	10,400	10,175

మొత్తం అమ్మకాలు : **565.500** క్వింటాళ్లు

–దుగ్గిరాల

పచ్చ నేతల మధ్య ఇసుక లొల్లి

బాపట్ల, చీరాల నేతల అక్రమ ఇసుక వ్యాపారం

- పేరుకు వాడరేవు–పిడుగురాళ్ల జాతీయరహదారి పేరున అనుమతి
- బాపట్ల, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లో ఇసుక అమ్మకాలు
- ఇసుక అక్రమ రవాణాపై అధిష్టానానికి ఫిర్యాదు చేసిన పార్లమెంట్ పచ్చనేత
- పార్లమెంట్ పచ్చనేతకు నెలకు రూ.5 లక్షలు ఇచ్చేలా చీరాల, బాపట్ల నేతల ఒప్పందం
- మొదటి నెల పేమెంట్ తర్వాత కప్పం నిలిపివేసిన నేతలు
- గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తానంటూ పార్లమెంట్ పచ్చనేత బెదిరింపు
- బెంబేలెత్తిన పచ్చనేతలు, అధికారులు
- ఇసుక వ్యాపారంలో పార్లమెంట్ పచ్చనేతకు వాటా
- జిల్లాలో హాట్ టాపిక్‌గా పచ్చనేతల తీరు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పచ్చ నేతల ఇసుక అక్రమ వ్యాపారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. కూటమి సర్కార్ కొలువు దీరింది మొదలు ఇసుక అక్రమంగా అమ్ముకుంటున్న బాపట్ల, చీరాల పచ్చ నేతలు ఇన్నాళ్ళుగా నెల కప్పం ఎగ్గొట్టడంతో ఆగ్రహించిన పార్లమెంట్ పచ్చనేత ముఖ్యమంత్రితో పాటు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తానని బెదిరించారు. వివాదం ముదరడంతో కొద్ది వెనక్కు తగ్గిన పచ్చనేతలు, మైనింగ్ అధికారి ఇసుక వ్యాపారంలో పార్లమెంట్ పచ్చనేతకు వాటా ఇచ్చేందుకు అయిష్టంగానే అంగీకారం తెలిపారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారానికి మంచి రోజులొచ్చాయని కొబ్బరికాయ కొట్టేందుకు పార్లమెంట్ పచ్చనేత సిద్ధమయ్యారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్టు చందంగా తలపిస్తున్న పచ్చనేతల వ్యవహారం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

[illegible] పార్లమెంట్ నేత

పార్లమెంట్ పచ్చనేత పరిస్థితి అయోమయంగా తయారైంది. రెండు నియోజకవర్గాల్లో మంత్రులు ఉండడం, ఒక నియోజకవర్గంలో మాజీ మంత్రి ఉండడంతో అక్కడ కాలు పెట్టలేని పరిస్థితి. కూటమి సర్కార్ కొలువుదీరగానే జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పచ్చనేతలు రేషన్ బియ్యంతోపాటు ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన పార్లమెంట్ పచ్చనేత నియోజకవర్గ నేతలను సంప్రదిస్తే..నీది మా పరిధి కాదని, రేషన్ బియ్యం, ఇసుక, గ్రానైట్, గ్రావెల్ తరలింపులో వాటాలు ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. పర్చూరు పచ్చనేత పలుకుబడి కలిగిన సీనియర్ నేత కావడం, అద్దంకి, రేపల్లె నియోజకవర్గాలకు చెందిన ఇద్దరూ మంత్రులు కావడంతో పార్లమెంట్ నేత వారి జోలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సీనియర్‌గా ఉన్న వేమూరు పచ్చనేత మాజీ మంత్రి కావడంతో పార్లమెంట్ నేత అటువైపు వెళ్లలేదు. బాపట్ల, చీరాల ఇద్దరు నేతలు కొత్తగా ఎన్నికైన వారు అయినా తొలుత పార్లమెంట్ నేత ప్రతిపాదనకు ససేమిరా అన్నారు. అక్రమాలపై అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తానని హెచ్చరించడంతో చివరకు ఓకే చెప్పి నెలకు చెరో రూ.5 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక నెల పేమెంట్ మాత్రమే చెల్లించారు. ఇంతలో మిగిలిన నియోజకవర్గ నేతలకు విషయం తెలిసి పార్లమెంట్ నేతను ఎంకరేజ్ చేయొద్దని, ఆర్థిక వ్యవహారాల్లో సహకరించవద్దని బాపట్ల, చీరాల పచ్చనేతలకు సూచించినట్లు సమాచారం. దీంతో ఆ తర్వాత ఇద్దరు పచ్చనేతలు పార్లమెంట్ నేతకు ఎగనామం పెట్టి నీ చేతనైంది చేసుకోమని తెల్చిచెప్పినట్లు సమాచారం.

సీఎం, లోకేష్‌లకు ఫిర్యాదు

ఆగ్రహం చెందిన పార్లమెంట్ నేత బాపట్ల, చీరాల ప్రాంతాల్లో సముద్ర తీరం వరకూ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా వ్యవహారంతోపాటు తీర ప్రాంతంలోని ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములను ఆక్రమించి పచ్చనేతలు మత్స్యకారులకు ఇబ్బంది కలిగించడం, యాచరీస్, ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వచ్చే విష వ్యర్థాలతో సముద్రాన్ని కలుషితం చేయడం, టూరిజం అభివృద్ధికి అడ్డంకులు కల్పిస్తున్న వైనంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రి లోకేష్, అటు గ్రీన్ ట్రిబ్యునల్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం జిల్లా మైనింగ్ అధికారులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యమంత్రి కార్యాలయం సైతం పార్లమెంట్ నేత ఫిర్యాదులపై విచారణ చేసి ఇసుక తరలింపుతోపాటు ఇతర కార్యక్రమాలపై ఆరా తీసింది. మరోవైపు రాబిన్‌శర్మ టీం సైతం బాపట్ల, చీరాల ప్రాంతాల్లో పచ్చనేతల అక్రమాల చిట్టాను నిర్ధారించి ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందించినట్లు తెలుస్తోంది. దీంతో రెండు నియోజకవర్గాల పచ్చనేతలతోపాటు జిల్లా అధికారులు బెంబేలెత్తి పార్లమెంట్ నేతతో పంచాయతీ చేసుకోవాలని, అలా అయితేనే ఇసుక, ఇతర అక్రమాలకు దన్నుగా ఉంటామని పచ్చనేతలకు సూచించినట్లు సమాచారం. బాపట్ల, చీరాల పచ్చనేతలు పార్లమెంట్ నేతతో సఖ్యతకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

రాజీ కుదిర్చిన సీనియర్ నేతలు

ఇరు వర్గాల మధ్య కొందరు సీనియర్ పచ్చనేతలు ఇటీవల రాజీ కుదిర్చినట్లు సమాచారం. పార్లమెంట్ నేత సైతం ఇకనుంచి ఈ ప్రాంతంలో ఇసుక అమ్ముకుంటారని ఇందుకు ఇద్దరు పచ్చనేతలు ఇందుకు అడ్డ చెప్పకూడదని తీర్మానించగా బాపట్ల, చీరాల నేతలు అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో త్వరలోనే పార్లమెంట్ పచ్చ నేత బాపట్ల, చీరాల ప్రాంతాల్లో ఇసుక అక్రమ వ్యాపారం మొదలు పెట్టనున్నారని, ఇందుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పచ్చపార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇక నుంచి బాపట్ల ప్రాంతాల్లో ఇసుక అక్రమవ్యాపారం జరిగినా, తీరం ఆక్రమణలకు గురైనా, మత్స్యకారుల జీవన భృతికి గండిపడినా పార్లమెంట్ పచ్చనేత వాయిస్ వినిపించరని ఆయన అనుచరగణమే వ్యంగంగా పేర్కొంటుండం గమనార్హం. మొత్తంగా పచ్చపార్టీ నేతలు దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా వ్యవహరించడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేపడతాం

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు శరత్

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కాంట్రాక్టు ఇంజినీరింగ్ ఉద్యోగులు

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

బాపట్ల: మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలియజేశారు. నాయకులు కె.శరత్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న ఆందోళన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి తల్లికి వందనం పథకం వర్తింపచేయాలని, సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపచేయాలని, గత ప్రభుత్వ కాలంలో చేసినటువంటి 17 రోజుల సమ్మెకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జీవో నెంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని కోరారు. బాపట్ల మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు హరిబాబు, అంకారావు, రత్నం, నాని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల కూల్చివేతపై ఉద్రిక్తత

- వైఎస్సార్ సీపీ నాయకుడి దుకాణం కూల్చివేత
- ప్రశ్నించిన నాయకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వైఎస్సార్ సీపీ నాయకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భట్టిప్రోలు(కొల్లూరు): ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దుకాణాలు, ఇతర నిర్మాణాలు కూల్చివేతపై ఉద్రిక్తత నెలకొంది. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్లో ప్రభుత్వ భూమిలో ఉన్న చికెన్ దుకాణంతోపాటు, మరికొన్ని నిర్మాణాల తొలగింపునకు ప్రభుత్వ యంత్రాంగం మంగళవారం పూనుకుంది. ఈక్రమంలో తమకు ముందస్తు నోటీసులు అందజేయకుండా ఉన్న పళంగా కూల్చివేతలు చేపట్టడంపై చికెన్ దుకాణం నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం మాజీ కార్యదర్శి అరుణశాస్త్రి అధికారుల వద్ద అభ్యంతరం వ్యక్తం చేశాడు. పంచాయతీలో కొన్నేళ్ల కిందట దుకాణం నిర్వహించుకునేందుకు తీర్మానం చేసినట్లు అధికారులకు తెలియజేయడంతోపాటు, నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడ్డం తగదని అధికారుల వద్ద మొరపెట్టుకున్నాడు. ఈ క్రమంలో దుకాణం తొలగింపు చర్యలు కొనసాగిస్తుండటంతో అడ్డుకునేందుకు ప్రయత్నించిన అరుణశాస్త్రిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

అరుణశాస్త్రి కుటుంబ సభ్యులు కనీసం దుకాణం రేకులు, ఇతర సామాగ్రిని జాగ్రత్త పరుచుకునేందుకు సమయం కోరినా అధికారులు అవకాశం ఇవ్వకుండా అక్రమంగా తన దుకాణాన్ని కూల్చివేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. టీడీపీ నాయకుల ఆదేశాల మేరకే అధికారులు తన ఆస్తులకు నష్టం కలిగించారని విమర్శించాడు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య

సమావేశంలో మాట్లాడుతున్నరామయ్య

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తోందని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు, సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు తల్లికి వందనం కింద గతంలో ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ. 13 వేలే తల్లుల ఖాతాల్లో వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంకా కొంత మంది తల్లులకు అర్హత ఉన్నా పథకం వర్తించకపోవటంతో సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇంటి వద్దకు వచ్చే రేషన్‌ను తొలగించి దివ్యాంగులకు, వృద్ధులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. చంద్రబాబు రాజధాని ముసుగులో ప్రజలను మరోసారి మోసగిస్తున్నారన్నారు. పాలనపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

బల్లికురవ: మూడు రోడ్ల కూడలిలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేయడంతో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బల్లికురవ–అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్‌లోని కొమ్మినేనివారిపాలెం, వలపర్ల వెళ్లే క్రాస్ రోడ్డు జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి ఆగంతకులు గుమ్మడికాయలు, కుంకుమ, పసుపు పూలతో పూజలు నిర్వహించారు. మంగళవారం ఆ మార్గంలో వెళ్తున్న వారంత ఇవి దాటి వెళ్లాలంటే ఏ ప్రమాదం ముంచుకువస్తోందని భయాందోళన చెందారు. ప్రతి నిత్యం ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఇలాంటి క్షుద్ర పూజలు చేస్తున్నారని వాటిని అరికట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలో చుండూరు నిడుబ్రోలు స్టేషన్ల మధ్య సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు నుంచి పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్ల కట్ బనియన్, నీలం రంగు జీన్సు ప్యాంటు ధరించి ఉన్నాడు. తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27554 నంబరులో సంప్రదించాలని కోరారు.

గ్రానైట్ లారీలు పట్టివేత

- బిల్లులు లేకుండా తరలింపు
- స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ గ్రానైట్ లారీలు
- కమర్షియల్ టాక్స్ అధికారుల మెరుపు దాడులు
- అదుపులోకి తీసుకున్న గ్రానైట్ లారీలు నడికుడి మార్కెట్ యార్డ్‌లో
- విలువను బట్టి పన్ను, జరిమానా వేస్తామన్న అధికారులు

పిడుగురాళ్ల బైపాస్ రోడ్డులో కమర్షియల్ టాక్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ లారీలు

పిడుగురాళ్ల: బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ లారీలను జీఎస్టీ, కమర్షియల్ టాక్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి లారీలను తనిఖీ చేసే కార్యక్రమం పట్టణంలోని బైపాస్ రోడ్డుపై నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొండమోడు నుంచి దాచేపల్లి వైపు వెళుతున్న నాలుగు గ్రానైట్ లోడ్ లారీలను గుర్తించి పట్టుకున్నారు. ఈ గ్రానైట్ లారీలకు సంబంధించి ఎటువంటి బిల్లు లేకపోవడం, సామర్థ్యాన్ని మించి లోడుతో రవాణా చేయటం నిర్వహించడంతో ఈ నాలుగు లారీలను అదుపులో తీసుకున్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వి.భార్గవ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేపట్టామని అందులో నాలుగు గ్రానైట్ లారీలు బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నాయని వాటిని గుర్తించామన్నారు. వీటిని అదుపులో తీసుకొని నడికుడి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఉంచినట్లు తెలిపారు. గ్రానైట్ లోడును బట్టి, గ్రానైట్ విలువను అంచనా వేసి ఆ తరువాత పన్నుతో పాటు అపరాధ రుసుం కూడా విధిస్తామని చెప్పారు. అలాగే లెక్కలు చూసి టాక్స్, ఫైన్ వేయాల్సి ఉంటుందని దానికి కొంత సమయం పడుతుందని వివరించారు. బిల్లులు లేకుండా ఓవర్ లోడ్ తో గ్రానైట్ లారీలు వెళితే అటువంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. అక్రమంగా బిల్లులు లేకుండా గ్రానైట్ లారీలు తరలిస్తే వాటిని అదుపులోకి తీసుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ దాడుల్లో జీఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం రవికుమార్, జీఎస్టీవో టి పీటర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

18 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాడికొండ: అక్రమంగా నిల్వ చేసిన 18 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్‌లైస్ అధికారులు పట్టుకున్న ఘటన మండల కేంద్రమైన తాడికొండలో జరిగింది. వివరాల ప్రకారం తాడికొండ చెరువు కట్టపై రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సీఎస్ డీటీ దేవరాజు, ఆర్ఐ హనుమంతరావుల ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించగా 35 కిలోల తూకం కలిగిన 18 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. దీనిపై విచారించగా తాడికొండకు చెందిన గుర్రపుశాల ఆనంద్ అనే వ్యక్తి కొనుగోలు చేసి నిల్వ చేసినట్లు స్థానికులు తెలపగా అతనిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులలో వీఆర్వో మాల్యాద్రి కూడా పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన జీఎస్టీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జీఎస్టీతో దేశం ప్రగతి పథంలో దూసుకువెళుతుందని, జీఎస్టీ అమలు మంచి ఫలితాలు ఇచ్చిందని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. జీఎస్టీ ఏర్పడి ఎనిమిది ఏళ్లు పూర్తియైన సందర్భంగా మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాలులో జరిగిన జీఎస్టీ దినోత్సవ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. జీఎస్టీ చెల్లించటం గౌరవప్రదంగా భావించాలని సూచించారు. దేశ పౌరులు, వ్యాపారస్తులు చెల్లించే వస్తుసేవల పన్ను దేశ నిర్మాణానికి, దేశ సౌభాగ్యానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో జీఎస్టీ ప్రారంభమైన ఏడాది రూ.2,850కోట్లు ఆదాయం సమకూరగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.7,300 కోట్లు ఆదాయం లభించిందన్నారు. గుంటూరులో జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల సంఖ్య ప్రారంభంలో 19 వేల మంది ఉండగా, ఇప్పుడు 75 వేల మందికి చేరారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ జీఎస్టీతో దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎఫ్టానిక్స్ ఎం.డి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ లో వచ్చిన సాంకేతిక సమస్యలు, సందేహాలు వీడాయన్నారు. సి.పి.డబ్లు.డి చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ప్రకృతి సాగుతో గొప్ప ప్రయోజనాలు

- పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ
- ప్రకృతి సాగు పంటల పరిశీలన
- సాగు పద్ధతి ప్రయోజనాలపై అవగాహన

ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ

యడ్లపాడు:ప్రకృతి సాగు విధానంతో గొప్ప ప్రయోజనాలు ఉన్నాయని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ.బి తెలిపారు. ప్రకృతి విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారితో కలిసి కొత్తపాలెం గ్రామంలో మంగళవారం పర్యటించారు. రసాయనాలు లేని, సహజసిద్ధ వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులు మానం శ్రీనివాసరావు, ఐనం హరిబాబు, మానం మణింద్ర, నిక్కీ తిరుపతిరావు, దమ్ము నాగజ్యోతి పంట పొలాలను పరిశీలించారు. వారు సాగు చేసిన బహుళ రకాల పంటలు, అంతర పంటలను చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మునగ తోటలో దొండ, కాకర, సొర, కనకాంబరం, అరటితోటలో తీగజాతి దోస, నిమ్మతోటలో కరివేపాకును అంతర పంటగా వేయడాన్ని గమనించారు. వినూత్న పద్ధతిలో సాగు చేసిన తీరు, ఎక్కువ దిగుబడుల్ని సాధిస్తూ.. అధిక లాభాలను ఆర్జిస్తున్నామని తెలపడంతో రైతుల్ని ఆమె అభినందించారు.

పురుగు మందుల ఖర్చు తక్కువ..

ప్రకృతి వ్యవసాయ విధానంతో కౌలు రైతుకు మంచి దిగుబడి, రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. సహజ సిద్ధంగా పండించే ఉత్పత్తుల ద్వారా కౌలురైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. అయితే వారికి కౌలుకు ఇచ్చిన భూ యజమానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సాగు విధానం చేయడం వలన నేల సారం వృద్ధి చెందుతుందన్నారు. రైతులు తమ భూముల్ని కౌలుకు ఇచ్చే సమయంలో ప్రకృతి సేద్యం చేసేవారికి మాత్రమే ఇచ్చే ఒప్పందం చేసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు సిబ్బంది సౌజన్య, అప్పలరాజు, నందకుమార్, స్వాతి, బేబీ రాణి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్సిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE
PLOT FOR SALE
■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES
GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్వాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
■ గుంటూరు, అద్దంకి సమీపంలో గల కళ్యం టెక్స్‌టైల్స్‌లో లేడీగార్డ్స్, సెక్యూరిటీ గార్డ్స్, హెడ్‌గార్డ్స్ కావలెను. ఉచిత వసతి సబ్సిడీ భోజన సదుపాయం. ✆ 9848091341, 9346176356
■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357
■ శ్రీ శాంతి హోమ్‌కేర్స్‌లో తెనాలి, గుంటూరు, రేపల్లె లో పనిచేయుటకు నర్సులు, కేర్‌టేకర్స్ కావలెను. జీ: 17000/– సంప్ర: 96184 85329
■ Wanted experienced, dedicated & hardworking teacher's to teach nursery - 2nd class mother teachers - 6 members & 3rd - 8th class (all subjects) - 8 members. GKR High School, A.T. Agraharam, 9th lane, opp water tank Guntur. ✆ 9885028725, 9959127256
■ Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241
■ Wanted Local, boys/girls for jewellery shop, experience in sales must., Contact: 9848333267
■ Wanted High School, Biology, Physics, Hindi, Social, PET, Computer Operator and mother teachers. Sri Vidhya High School, NGGO's colony, Gnt. 9701022900
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నరసరావుపేట బ్రాంచ్ (0884), నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601.

స్థిర/చరాస్తుల ఇ-వేలం అమ్మకం కొరకు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన. [illegible] స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట బ్రాంచ్(0884), పల్నాడు జిల్లా [illegible] "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఏలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" [illegible] హెచ్‌ఎల్ అకౌంట్ నెం.35877718693కు రూ. 6,02,328/-(అక్షరాల ఆరు లక్షల రెండు వేల మూడు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు హెచ్‌ఎల్ టాప్‌అప్ అకౌంట్ నెం.37145718842కు రూ.7,12,112/- [illegible] మరియు సురక్ష అకౌంట్ నెం.35941965112కు రూ.32,439/- [illegible] వెరసి మొత్తం ది.30-06-2025 నాటికి రూ.13,46,879/- [illegible] ది.21-07-2025న అమ్మటకు నిర్ణయించటమైనది. ఋణగ్రహీతలు: 1) శ్రీ అవదానం సుబ్బారావు, తండ్రి: సుందరయ్య, డోర్ నెం.6-41, [illegible] గ్రామం, [illegible] (పోస్ట్), సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా, 2) శ్రీమతి అవదానం వరలక్ష్మి, భర్త: సుబ్బారావు, డోర్ నెం.6-41, [illegible] గ్రామం, [illegible] (పోస్ట్), సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా.

స్థిరాస్తి వివరములు :
ఆస్తి యజమాని పేరు: శ్రీమతి అవదానం వరలక్ష్మి, భర్త: సుబ్బారావు
ది.31-07-2015 నాటి రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.12193/2015 ప్రకారం [illegible] సర్వే నెం.576 [illegible] 146.2 చ॥గజాలు లేదా 121.4 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు అందులో నిర్మించబడిన [illegible] గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ [illegible]

రిజర్వు ధర: రూ.17,63,325/- ధరావత్తు: రూ.1,76,332/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-
ఇ-వేలం తేది : 21-07-2025 సమయం : ఉ. 11.00 గం॥ల నుండి సా॥. 04.00 గం॥ వరకు
ధరావత్తు మరియు కెవైసి డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది & సమయం : 19-07-2025, సా॥4.00 గం॥ల లోపు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
[illegible] M/s PSB Alliance వారి వెబ్ పోర్టల్: https://ebkray.in/eauction-psb/baanknet.com/bidder-registration మరియు ఫోన్: +8291220220 [illegible] sbi.00884@sbi.co.in [illegible] ఫోన్: 9966393649 & 8885536787 [illegible]
ప్రదేశం : నరసరావుపేట, సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
తేది : 30-06-2025 నరసరావుపేట బ్రాంచి, నరసరావుపేట.

చదువుకు దారేది?

జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారిన ఘటన రొంపిచెర్ల మండలంలో చోటుచేసుకుంది. - 8లో

మొక్కుబడిగా ఓపెన్ స్కూల్ సమావేశం

చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఏపీ ఓపెన్ స్కూల్ సమావేశం తూతూమంత్రంగా సాగింది. - 8లో

ఆటో బోల్తా: ఏడుగురికి తీవ్ర గాయాలు

బోయకొండ గంగమ్మను దర్శించుకుని స్వగ్రామానికి బయల్దేరిన భక్తుల ఆటో బోల్తాపడింది. - 8లో

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి ఏనుగులు

కోటపల్లెలో ఇంటి పెరట్లోని అరటి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీలో తిష్ట వేసిన 14 ఏనుగుల గుంపు చుట్టు పక్కల పొలాల్లో రోజూ ఏదోఒకచోట పంటలపై పడి తీవ్ర నష్టం కలిగిస్తోంది. రోజూ మామిడి తోపుల్లో కాయలు తింటూ కొమ్మలను విరిచేయడం, కంచె కూసాలను, డ్రిప్ పైపులను నాశనం చేయడం పరిపాటిగా మారింది. తాజాగా మంగళవారం తెల్లవారు జామున పాళెం పంచాయతీలోని జూపల్లె, కోటపల్లె గ్రామాల్లోకి ప్రవేశించి ఇళ్ల ముందర ఉన్న అరటి చెట్లను ధ్వంసం చేశాయి. రోడ్ల పైన తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఏనుగులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

సూచనలు చేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

కుప్పం: సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కుప్పంలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు యంత్రాగంతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసు బలగాలను అధికంగా మోహరించాలన్నారు. సమీక్షలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివనందకిషోర్, కుప్పం డీఎస్పీ పార్థ సారిథి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఎం కుప్పం పర్యటనలో మార్పు

శాంతిపురం: సీఎం చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటన ఒక్క రోజు ఆలస్యంగా ప్రారంభంకానుంది. మంగళవారం ఇక్కడికి రావాల్సిన ఆయన బుధవారం విచ్చేయనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం 12.30కి సీఎం తుమ్మిశి వద్ద ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వచ్చి 12.50కి తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలు వద్దకు చేరుకుని బహిరంగసభ, పథకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.35కు తిమ్మరాజుపల్లి చేరుకుని రాత్రి 7 గంటల వరకూ ఇంటింటికీ వెళ్లి 26 కుటుంబాలను నేరుగా కలవనున్నారు. గురువారం ఉదయం 10.35కు కుప్పం ఏరియా ఆస్పత్రి చేరుకుని టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.15కు కడపల్లి వద్ద తన నివాసంలో అధికారిక సమిక్ష నిర్వహిస్తారు. 2.30 నుంచి 4 గంటల వరకూ పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. అనంతరం తిరుగు ప్రయాణంలో తుమ్మిశి వద్ద హెలీప్యాడ్ చేరుకుని బెంగళూరుకు వెళ్తారని తెలిపారు.

మామిడి పండు.. కూటమి పుండు!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

గుడిపాల సరిహద్దు ప్రాంతంలో నిలిచిన ట్రాక్టర్లు

‘ఆలస్యంగానైనా ఆశించిన స్థాయిలో పూత వచ్చిందని మురిసిపోయాము. పంట దిగుబడిని చూసి ఇక దిగుల్లేదులేనని సంబరపడ్డాము. కాయ కోసి మార్కెట్‌కు తోలితే కొనేవారు లేకపోవడంతో కుమిలిపోయాము. ప్రభుత్వం చెప్పిన ధర ఇవ్వక మొండికేస్తున్న ఫ్యాక్టరీల ఎదుటే రోజుల తరబడి నిరీక్షిస్తున్నాము. ర్యాంపుల్లో ఒకటికి సగానికి తెగనమ్మాలని భావించినా ఏ ఒక్కరూ దింపుకోక దిగాలు చెందుతున్నాము. తోటలపై పెట్టిన పెట్టుబడి చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాము. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేరా..? మామిడి రైతు పరిస్థితి ఇంతేనా..?తోటలను తెగనరకాల్సిందేనా..?’ అంటూ మామిడి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక.. కుటుంబాలను వెళ్లీదే పరిస్థితి లేక గుండెలు బాదుకుంటున్నారు. జిల్లాలో మామిడి రైతుల దుస్థితిపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం..

మద్దతుధర కల్పించడంలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

- తొలుత కిలోకు రూ.12, ఆపై రూ.6 ప్రకటించిన వైనం
- క్షేత్ర స్థాయిలో కిలో రూ.3 కూడా దక్కక రైతుల ఆవేదన
- అయినా సరే కాయ కొనడానికి ముందుకురాని ఫ్యాక్టరీలు
- అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పంట అమ్మడానికి అగచాట్లు
- నిద్రాహారాల్లేక ఫ్యాక్టరీల ఎదుట ఎదురుచూపులు
- జిల్లాలో దయనీయ పరిస్థితులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం మామిడి పంట ఆశించిన స్థాయిలో దిగుబడినిచ్చింది. ఇందులో తోతాపురి రకం నుంచి గుజ్జు (పల్ప్)ను తయారుచేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఫలితంగా ప్రతీ ఏటా దాదాపు 40 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి రకాన్ని రైతాంగం సాగుచేస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ మొదలయ్యింది. కానీ మామిడిని కొనడానికి ఏ ఒక్క ఫ్యాక్టరీ ముందుకు రావడం లేదు. ఒకవేళ కొన్నా కిలోకు సగటున రూ.4 –5 చెల్లిస్తున్నారు. ర్యాంపుల వద్ద కిలో రూ.3 మాత్రమే పలుకుతోంది. చేతికొచ్చిన పంట అమ్ముకోలేక, ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించక అన్నదాతకు గుండెకోత మిగులుతోంది.

గుడిపాల ఫ్యాక్టరీ వద్ద టోకెన్ల కోసం రైతుల తోపులాట

చేజేతులా కోల్పోతూ..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఫ్యాక్టరీలు మామిడిని కొనకపోవడంతో రైతు కంట కన్నీళ్లు ఆగడం లేదు. చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల బయట రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలోకు రూ.6 చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకునే దిక్కులేదు. ముందుగా ఫ్యాక్టరీ వద్దకు రైతు వచ్చి టోకెన్ తీసుకోవాలి. ఆ టోకెన్ నెంబర్ వస్తే తప్ప మామిడిని లోపలకు తీసుకెళ్లడానికి వీల్లేదు. రెండు రోజులు అలాగే ఉంచేస్తే 40 శాతం పంట పనికిరాదు. చిన్నపాటి వర్షం పడితే వంద శాతం పంట రోడ్డుపై పడేయాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో టోకెన్ల కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిల్చోవడం, తోపులాటలు, పోలీసులు–ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదాలు.. ఇవన్నీ ఓ మినీ యుద్ధాన్ని తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 47 గుజ్జు పరిశ్రమలు ఉంటే ఇప్పటి వరకు 30 వరకు ఫ్యాక్టరీలు మాత్రమే తెరుచుకున్నాయి. 80 శాతం వరకు ఫ్యాక్టరీలు, కూటమి ప్రభుత్వ అనుకూలురు చేతుల్లో ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గరిష్టంగా కిలో మామిడి రూ.23కు అమ్ముడం కొసమెరుపు.

చిత్తూరు పల్ప్ ఫ్యాక్టరీ బయట మామిడికాయల ట్రాక్టర్లతో వేచి ఉన్న రైతులు

టోకెన్ల కోసం ఫ్యాక్టరీ వద్ద అవస్థలు పడుతున్న రైతులు

‘మద్దతు’లేక..అగచాట్లు పడలేక

చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ మరో పది రోజుల్లో ముగియనుంది. మామిడి పంటను ఫ్యాక్టరీలకు అమ్ముదామని పంటను తీసుకొచ్చిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కిలో మామిడికి రూ.12 గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఫ్యాక్టరీలు చెప్పడంతో, కిలోకు రూ.8 ఫ్యాక్టరీలు చెల్లించాలని, మిగిలిన రూ.4 ప్రభుత్వమే భరిస్తుందని.. ఆ మొత్తాన్ని రైతుల ఖాతాలో జమచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కానీ ఫ్యాక్టరీలు కూడా ఈ ధరలు పాటించలేదు. కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఖరాకండిగా చెప్పేస్తున్నాయి. కొన్ని చోట్ల కిలో రూ.3 సైతం చెల్లిస్తున్నారు. ప్రభుత్వ హామీలన్నీ నీటిమీద రాతలేనని తేలిపోయాయి. సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు రైతుకు మద్దతు ధర అంద లేదు.

ఉమ్మడి జిల్లాలో మామిడి పంట వివరాలు

సాగవుతున్న పంట	56 వేల హెక్టార్లు
తోతాపురి రకం	39,895 హెక్టార్లు
ప్రభుత్వం ప్రకటించిన ధర	కిలో రూ.12
ఫ్యాక్టరీల వద్ద ధర	రూ.5-6
ర్యాంపుల వద్ద ధర	రూ.3
ఫ్యాక్టరీల బయట నిరీక్షిస్తున్న పంట	41 వేల కిలోలు

ఇంటికి పోయే పరిస్థితి లేదు

కాణిపాకం నుంచి గుడిపాల సరిహద్దులో ఉన్న ఫ్యాక్టరీకి కాయలు తెస్తే రూ.5వేలు బాడుగ. ఒక్కరోజు అయినా.. రెండు రోజులు.. మూడు రోజులు అయినా ఇదే రేటు. ఇక్కడకు కాయలు తెస్తే.. అన్‌లోడింగ్ అయ్యేందుకు ఐదు రోజులు పడుతోంది. అంతవరకు ఓపికతో ఉండాల్సిందే. ఇంటికి పోను.. రాను అంటే కుదరదు.

– రవి, బొమ్మసముద్రం, ఐరాల మండలం

టోకెన్లు అమ్ముకుంటున్నారు

వారం పది రోజులుగా తిండీనీళ్లు లేకుండా రోడ్లపై అవస్థలు పడుతున్నాం. రాత్రి సమయాల్లో అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కుమ్మక్కై దొడ్డి దారిన టోకెన్లు అమ్ముకుని డైరెక్టుగా 10, 20 వాహనాలు లోపలకు పంపించేస్తున్నారు. ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారు. దోమల బెడదతో నిద్రాహారాలు లేకుండా మేము అవస్థలు పడుతుంటే కొందరు మాత్రం దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు.

– బాబునాయుడు, జీడీనెల్లూరు

కన్న బిడ్డల్లా సాకినాం

సంవత్సరం పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నాం. కన్నబిడ్డల్లా గా పండించాం. ఇప్పుడు మామిడి పంట మొత్తం కిలోమీటర్ల మేర రోడ్లపై పడి ఉంది. నాలుగైదు రోజుల నిరీక్షణలతో టార్పాలిన్‌పట్ట వేడికి లోలోపలే కుళ్లిపోయి, జ్యూసులా రోడ్లపై కారిపోతోంది. అధికారులు ఫ్యాక్టరీలు ప్రత్యేక చొరవ చూపించాలి.

– శ్రీనివాసరెడ్డి, పెనుమూరు మండలం

నేడు మెగా ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని సీఎంటీ రోడ్డులో ఉన్న విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ మెగా కంపెనీలు పాల్గొంటాయని, ఈ అవకాశాన్ని జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9676376855, 7995239612 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరుకలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అందజేసే జాతీయ ఉత్తమ టీచర్ల అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఈ అవార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హత, ఆసక్తి ఉన్న టీచర్లు ఈ నెల 13వ తేదీలోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. www.nationalawardstoteachers.education.gov.in అనే వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

డిజిటల్ సర్వే సిస్టమ్ పరిశీలన

డిజిటల్ సర్వేను పరశీలిస్తున్న చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో టాటా సంస్థ చేపడుతున్న డిజిటల్ సర్వే సిస్టమ్ పనితీరును రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణాబాబు పరిశీలించారు. బుధ, గురువారాలు సీఎం చంద్రబాబు కుప్పం వంద పడకల ఆస్పత్రిలో టాటా సంస్థ డిజిటల్ సర్వే సిస్టమ్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన కంగుంది పీహెచ్‌సీలో సర్వే పనితీరును పరిశీలించారు. ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, డీయెన్సీ మెనేజర్ కమలేష్ పాల్గొన్నారు.

ఊరుబడంటే అలుసా?

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమ పిల్లల చదువుకు ఊరు బడంటే ఒప్పుకుంటామని.. లేకుంటే తమిళనాడులోని ప్రభుత్వ బడికి పంపుతామని పిల్లల తల్లిదండ్రులు రోడెక్కారు. చిత్తూరు మండలం, అనంతాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విలీ నంపై మంగళవారం పిల్లల తల్లిదండ్రులు నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 24 మంది విద్యార్థులు ఉన్నా రన్నారు. ఈ పాఠశాలను విలీనం చేయడంతో పిల్లలంతా రెండున్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న బీఎన్ఆర్ పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. చిత్తూరు తిరుత్తణి జాతీయ రహదారి మీదుగా పిల్లలు బడికి వెళ్లాలని, భారీ వాహనాల రాకపోకల నడుమ ఈ ప్రయాణం అత్యంత ప్రమాదకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు.

పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న పిల్లలు, తల్లిదండ్రులు

విలీనం మాకొద్దని.. ఊరుబడే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అధికారులు స్పందించకుంటే కి.మీ పరిధిలో ఉన్న తమిళనాడులోని ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపుతామని స్పష్టం చేశారు. కావాలంటే రేషన్ కార్డులు కూడా రద్దు చేసుకోమని వారు ఆగ్రహానికి గురయ్యారు. గ్రామస్తులు భానుచందర్, సుదీర్, శశికళ, అరుణాయాకాంబరం, తంగమని, మురళి, బాబు, వాణి, రామన్, నదియా పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల్లో గుబులు!

- ఇంటింటికీ వెళ్లాలంటే భయం
- మామిడికి గిట్టుబాటు ధర కల్పించలేదు
- కనీసం కాయలను కొనుగోలు చేయని వైనం
- పింఛన్లు, తల్లికి వందనంలో కోతపై లబ్ధిదారుల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సుపరిపాలన పేరుతో ఇంటింటికీ వెళ్లడానికి టీడీపీ ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు పట్టుకుంది. ఏడాది పాలనలో పథకాలు అమలు చేయకపోవటం, ఉమ్మడి జిల్లాలో మామిడి రైతులు ఆగ్రహంగా ఉండడంతో ఏంచేయాలో పాలుపోవడం లేదు. అధినేత చంద్రబాబు ఆదేశించినట్లు ఇంటింటికీ వెళ్లినప్పుడు స్థానికులు నిలదీస్తే ఏమని సమాధానం చెప్పాలి? అనేదానిపై ఎమ్మెల్యేలు అధికారులు, స్థానిక టీడీపీ నేతలతో సుదీర్ఘంగా చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై ‘చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ’ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి ముందే సుపరిపాలన పేరుతో ఇంటింటికీ ఎమ్మెల్యేలు వెళ్లాలని సీఎం చంద్రబాబు నిర్ణయించి, ప్రారంభించేశారు. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు నేడు కుప్పంలో పర్యటించనున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లనున్నారు. మరో వైపు ఎమ్మెల్యేలు అధికారుల నుంచి సమాచారం సేకరించారు.

పథకాలు అడగరా?

ఏడాది కూటమి పాలనలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పింఛన్లు తొలగించిన వారే సుమారు 32 వేల మంది ఉన్నారు. వాటి స్థానంలో కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు అతీగతి లేదు. పింఛను కోల్పోయిన వారు, కొత్తగా ఆశిస్తున్నవారు ఎమ్మెల్యేలను నిలదీస్తారని ఆందోళన చెందుతున్నారు. కొత్త రేషన్ కార్డులు లేవు, ఉన్న కార్డులకు పూర్తి స్థాయిలో సరుకులు ఇవ్వటం లేదు. కేవలం బియ్యం మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది ప్రభుత్వం. మరో వైపు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. కానీ రెండో ఏడాది ప్రారంభమై ఖరీఫ్ సీజన్ మొదలైనా పైసా విదల్చలేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, ఇతరత్రా హామీలు అమలు చేయకపోవటంపై లబ్ధిదారులు అసంతృప్తితో ఉన్నారు.

భయపెడుతున్న మామిడి

చిత్తూరు, తిరుపతి జిల్లాలో గత కొంత కాలంగా రైతులు మామిడి దిగుబడులను అమ్ముకోలేక వారు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం. మామిడి దిగుబడులతో రోజుల తరబడి ఫ్యాక్టరీల ముందు వేచి ఉన్నా కొనుగోలు చేసే పరిస్థితి కనిపించలేదు. గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రభుత్వం పదే పదే చెప్పినా ఫలితం కనిపించలేదు. అధికారులు ఆదేశించినా ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో మామిడి రైతులు చేసేది లేక కడుపు మండి చెట్లను నరికేసుకుంటున్నారు. మరి కొందరు కాయలను రోడ్లపై పారబోసి వెళ్లిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. ఈ పరిస్థితుల్లో సుపరిపాలన పేరుతో ఇంటింటికి వెళితే రైతులు విరుచుకుపడుతారన్న భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది.

అడుగడుగునా అక్రమాలే

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇసుక, మట్టి, గ్రావెల్, మైనింగ్ అక్రమ తవ్వకాలు, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అక్రమార్కులు రాత్రింబవళ్లు జేసీబీల, ఇటాచీలు, లారీలు, టిప్పర్లతో ప్రకృతి సంపదను తరలించి సొమ్ముచేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. అక్రమార్కులకు అధికారులు తోడయ్యారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక దొరకడం లేదు. ఉచిత ఇసుక గురించి పట్టించుకునే ఎమ్మెల్యేలు, అధికారులు కరువయ్యారు. కూటమి నేతలు ప్రభుత్వ, పోరంబోకు, కాలువ, చెరువు పోరంబోకు భూములను ఆక్రమించి సొంతం చేసుకునే పనిలో బిజీ బిజీగా ఉన్నారు. వేరొకరి అనుభవంలో ఉన్నా.. దౌర్జన్యంగా లాక్కుంటున్నారు. ఇదేమిటని అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారు. అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తున్నారు. ఇలా ఏడాది పాలనపై జనంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలను నిలదీసేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సుపరిపాలన పేరుతో ఇంటింటికీ వెళ్లటానికి ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు.

ANNAMACHARYA UNIVERSITY
RAJAMPET, Annamayya District, AP - 516126, India
www.annamacharyauniversity.edu.in
Accredited with 'A' Grade NAAC National Assessment and Accreditation Council
NBA National Board of Accreditation — FIVE UG PROGRAMMES ACCREDITED
THREE UG PROGRAMMES ACCREDITED
8th RANK THE WEEK
COUNSELLING CODE AITSPU
COURSES OFFERED: B.Tech | M.Tech | MBA | MCA | B.Sc. (Hons.) Agriculture | B.Sc. AT & OT | B.Sc. Medical Lab Technology | Bachelor of Physiotherapy | B.Sc. (CS, P&DS, AI&DA, AI&ML) | M.Sc (Maths, Physics & Chemistry) | M.A in English | L.L.B. | Ph.D. in all disciplines | B.B.A
PLACEMENT STATISTICS FOR THE AY 2024-25
918 STUDENTS PLACED | ₹30 LPA RECORD PACKAGE | 40+ COMPANIES VISITED | ₹5 LPA AVERAGE SALARY | 2K+ INTERNSHIPS

SOME OF OUR RECRUITERS: Tech Mahindra, tcs, Cognizant, Infosys, Mphasis, ITC Infotech, accenture, wipro
AUET 2025 ANNAMACHARYA UNIVERSITY ENTRANCE TEST for ADMISSION/SCHOLARSHIP 6th July
APPLY NOW
MoU with Foreign Universities: RWTH AACHEN UNIVERSITY, WISCONSIN
ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY & SCIENCES (AUTONOMOUS)
TIRUPATHI (AITT) | KADAPA (AITK) | HYDERABAD (AITH)
For Admissions: +91 9848998641, 9154147257 Follow us: /Annamacharya Group

క్లుప్తంగా

టమాట బాక్సు రూ.450

వడ్డిపల్లి మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: టమాట ధరలు ఎట్టకేలకు పెరుగుతున్నాయి. పలమనేరు మార్కెట్లో 15 కిలోల బాక్సు మంగళవారం రూ.450 దాకా పలికింది. సూపర్‌ఫైన్ రకం(తొలి కోతలు) రూ.500 దాటింది. ఆ మేరకు పెద్దపంజాణి మండలానికి చెందిన రైతు క్రిష్ణారెడ్డి తోటలోని టమాటాలు రూ.500 పలికాయి. అయితే వైరస్ కారణంగా పంట దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఈ మాత్రం ధరలున్నా టమాటా రైతులకు మేలు కలిగినట్టేనని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఇటీవల టీచర్ల బదిలీలు నిర్వహించిన విషయం విధితమే. అయితే ఈ బదిలీల్లో పలువురు టీచర్లు తమకు అన్యాయం జరిగిందని విద్యాశాఖ అధికారులకు విన్నవించారు. సంబంధిత టీచర్ల అభ్యర్థనలను రెండు రోజుల క్రితం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నష్టపోయిన 25 మంది టీచర్ల అభ్యంతరాలు(గ్రీవెన్స్)ను పరిష్కరించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

డిగ్రీ అడ్మిషన్లపై కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చనంటోంది. ఇంటర్మీడియెట్ ఫలితాలొచ్చి రెండు నెలలవుతున్నా డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా.. ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారో తెలియక తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తుండడంతో తల్లిదండ్రులు క్యూ కట్టే పరిస్థితి నెలకొంది.

డిగ్రీ అడ్మిషన్ల కోసం ఎదురు చూపులు

- ఆన్‌లైన్‌లోనా?.. ఆఫ్‌లైన్‌లోనా?
- ఎటూ తేల్చని కూటమి ప్రభుత్వం
- ప్రైవేట్ కళాశాలలకు క్యూ కడుతున్న తల్లిదండ్రులు

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

చిత్తూరు కలెక్టరేట్ : డిగ్రీ కోర్సుల్లో నూతన అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియట్లేదు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు డిగ్రీ ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

తేలని సబ్జెక్టు విధానం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెకలొంది.

ఇప్పటికే ప్రైవేట్ వైపు

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విద్యార్థులను చేర్చుకోవడంతో పాటు మార్కుల జాబితాను, టీసీ, ఇతర సర్టిఫికెట్లను ప్రైవేట్ కళాశాలలు సేకరించాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాయి.

సమయం లేదు మిత్రమా?

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుంది. గతంలో రెండు నెలల సమయం వరకు షెడ్యూల్ ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ నిర్వహించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు షెడ్యూలే ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యేసరికి ఆగస్టు నెల వచ్చేస్తుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆఫ్‌లైన్ కోసమే ఆలస్యమా?

జిల్లాలో చిత్తూరుతో పాటు కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి, కార్వేటినగరంలో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 8 ప్రభుత్వ, ప్రైవేట్ 51 మొత్తం 59 డిగ్రీ కళాశాలలున్నాయి. డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియను సులువుతరం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు 2022–23లో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు పొందేవారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి తిరిగి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టేందుకు కుట్రపన్నుతున్నట్టు తెలుస్తోంది. ఇందు కోసమే అడ్మిషన్‌ల ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లాలోని డిగ్రీ కళాశాలల సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	08
ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు	51
మొత్తం డిగ్రీ కళాశాలలు	59
డిగ్రీ విద్యనభ్యసిస్తున్న బాలురు	7,451
బాలికలు	4,873
మొత్తం విద్యార్థులు	12,324

ఎలాంటి స్పష్టత లేదు

కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల అలసత్వ వైఖరి చూపించడం సరి కాదు. డిగ్రీ కళాశాలలు ప్రారంభమై చాలా రోజులు అవుతున్నా ఇంత వరకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణం. ప్రైవేట్ కళాశాలలకు మేలు చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్మిషన్‌ల ప్రక్రియను ఆలస్యం చేస్తోంది. వెంటనే అడ్మిషన్‌ల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతాం. **–సద్దాం, స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్, చిత్తూరు జిల్లా**

మొక్కుబడిగా ఏపీ ఓపెన్ స్కూల్ సమావేశం

హాజరైన ప్రభుత్వ ఏఐ కో–ఆర్డినేటర్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏపీ ఓపెన్ స్కూల్ సమావేశం మొక్కుబడిగా సాగింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించిన మొదటి సమావేశాన్ని జిల్లాలోని 22 ప్రైవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులు బాయ్‌కాట్ చేశారు. ఈ సమావేశం నిర్వహణకు ప్రత్యేకంగా రాష్ట్రం నుంచి ప్రత్యేక అధికారి నరహింహరావు హాజరయ్యారు. అయితే జిల్లాలోని ప్రైవేట్ స్టడీ సెంటర్ నిర్వాహకులు ఒక్కరు సైతం హాజరుకాలేదు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ విద్యాసంస్థల కో ఆర్డినేటర్లతోనే తూతూమంత్రంగా సమావేశం నిర్వహించేశారు. సంబంధిత 22 సెంటర్లలో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్‌లు చేసేదిలేదంటూ పలువురు స్టడీ సెంటర్ల నిర్వాహకులు వెల్లడించారు.

చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం

మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ వరం లాంటిదని డీఈఓ వరలక్ష్మి, రాష్ట్ర కో–ఆర్డినేటర్ నరసింహరావులు తెలిపారు. డీఈవో కార్యాలయంలో ఏఐ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌ల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పదో తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు, ఇంటర్‌కు 15 సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులను చేసుకోవాలని చెప్పారు. ఏడీ–2 వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పుంగనూరులో మున్సిపల్ కార్మికుల నిరసనకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు(చౌడేపల్లె): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 18 రోజులుగా మున్సిపల్ కార్మికులు ఆందోళన చేస్తున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టుకూడా లేదని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల నిరసనలకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇచ్చి సంఘీభావం ప్రకటించింది. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్ధిన్‌షరీఫ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్మికులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ వర్గానికి న్యాయం చేయకుండా ఆరాచకాలు, అక్రమాలు, రెడ్‌బుక్ రాజ్యాంగంతో, గొంతెత్తే వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. సూపర్ –6ను అమలు చేయాల్సిన ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. కార్మిక సంఘ నాయకుడు శ్రీరాములు, కౌన్సిలర్లు సాజిదాబేగం, రేష్మా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్, కొండవీటి నరేష్, ఖాదర్‌బాషా, రాజేష్, కార్మికులు కుమార్, గోపి, దౌలత్, సంతోష్, శివకుమార్, మోహన్, సోము, వెంకట్రమణ, యూసుఫ్, జావహార్‌అలి పాల్గొన్నారు.

భిక్షాటన అనే పదాన్ని తొలగించారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దాసరుల కుల ధ్రువీకరణ పత్రంలో భిక్షాటన అనే పదాన్ని తొలగించడం స్వాగతించదగ్గ విషయమని దాసరి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి రవి తెలిపారు. చిత్తూరు ప్రెస్ క్లబ్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రంలో దాసరులకు భిక్షాటన అనే పదాన్ని చేర్చే వారని, ఈ పదం తమ మనో భావాలనులను దెబ్బతీసే విధంగా ఉందేదన్నారు. ముఖ్యమంత్రి ఈ పదాన్ని తొలగించేలా చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. దాసరి రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు వెంకటరమణ, సుబ్బయ్య, జయచంద్ర, శేఖర్, మధు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రమాదంలో మృతి చెందిన మస్తాన్



ధ్వంసమైన కారు ముందు భాగం

గంగవరం: బెంగళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును అదే మార్గంలో వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా బైక్ వెనుక కూర్చున్న యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గంగవరం ఫ్లైఓవర్ పైన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలు.. పలమనేరు పట్టణం, ఆర్‌కే స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న మస్తాన్(44), గంగవరం మండలం, మేలుమాయి క్రాస్‌కు చెందిన రితిక(20) ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరి వెళ్లారు. గంగవరం బైపాస్‌లో రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా బైక్‌ను నడుపుతూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే దారిలో బెంగళూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును అదే మార్గంలో అజాగ్రత్తగా వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మస్తాన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా వెనుక కూర్చున్న యువతికి తీవ్రంగా గాయపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బైక్‌తో పాటు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటో బోల్తా: ఏడుగురికి తీవ్ర గాయాలు

బోల్తాపడిన ఆటో వద్ద వైద్యసేవల కోసం వేచి ఉన్న క్షతగాత్రులు

ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనానంతరం స్వగ్రామానికి భక్తులతో వెళ్తున్న ఆటో చౌడేపల్లె– బోయకొండ మార్గంలోని జూనియర్ కళాశాల సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. సోమల మండలం, నంజంపేటకు చెందిన కొందరు ఆటోలో బోయకొండకు వెళ్లారు. గంగమ్మను దర్శించుకొని ఇంటికి బయలు దేరారు. జూనియర్ కళాశాల సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న అహమ్మద్, విజయ్, రమణ, పాపయ్యతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత పంటల బీమాకు మంగళం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం 2024–25 రబీ నుంచి ఉచిత పంటల బీమాకు మంగళం పాడేసింది. సూపర్–6లో భాగంగా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ప్రకటించిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక ఏడాదిగా ఆ ఊసే ఎత్తలేదు. తాజాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా ఇంతవరకు ఆ జోలికి వెళ్లలేదు. తాజాగా ఉచిత పంటల బీమాను రద్దు చేసి ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపును అమలు చేస్తున్నారు. 2024 ఖరీఫ్ వరకు ఉచిత పంటల బీమా అమలైనా.. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిన్నప్పటికీ ఒక్క రూపాయి పరిహారం అందివ్వని పరిస్థితి. 2024–25 రబీ నుంచి ప్రీమి యం చెలించడం ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాను అమలు చేసింది. అయితే పరిహారం వస్తుందో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఖరీఫ్‌నకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా అమలుకు మార్గదర్శకాలు జారీచేసింది. ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు విధానం అమలు చేస్తుండడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.67 కోట్ల పరిహారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది అంటే 2019–20లో కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిఫై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది. 2020–21 నుంచి వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు పంటల బీమా సదుపాయం కల్పించింది. 2019–20 నుంచి 20022–23 వరకు ఉచిత పంటల బీమా కింద రైతన్నలకు చెల్లించిన పరిహారం రూ.67 కోట్లు. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే బీమా పరిహారం విడుదల చేయడం వల్ల రైతులకు ఊరట లభించింది.

జిల్లాలో బీమా చేయించుకోవాలంటే ప్రీమియం ఇలా

పంట రకం	బీమా యూనిట్	బీమా చేసేమొత్తం (ఎకరాకు రూ.లల్లో)	రైతు వాటా (ఎకరాకు రూ.లల్లో)	దరఖాస్తుకు ఆఖరు తేదీ
వరి	మండల యూనిట్	42,000	840	15-08-2025
రాగి	మండల యూనిట్	17,000	170	31-07-2025
కంది	మండల యూనిట్	20,000	400	31-07-2025
వేరుశనగ	మండల యూనిట్	28,000	560	15-07-2025
టమోటా	మండల యూనిట్	30,000	1,500	15-07-2025

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 78,730 మంది స్వామివారిని దర్శించుకోగా 28,940 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

త్వరలో సంఘాలకు సారథులు

చిత్తూరు నగరంలోని డీసీసీబీ కార్యాలయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పల్లె ప్రాంతాల్లోని రైతులకు అండగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలో సారథులు రాబోతున్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా సంబంధిత శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. వారి స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) పరిధిలో 75 సహకార సంఘాలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక త్రీమెన్ కమిటీలను రద్దుచేసి సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. వీరు తగినంతమంది లేక మూడు, నాలుగు సంఘాలకు ఒకరిని చొప్పున నియమించడంతో సక్రమంగా పర్యవేక్షించలేకపోతున్నారు. వీరి గడువు ముగిసింది. మళ్లీ ఆరు నెలలకు పెంచాలి. ఈ దఫా నెల రోజులే పొడిగించారు. ఈ సమయంలో త్రిసభ్య కమిటీల నియామకాన్ని కొలిక్కి తీసుకురానున్నారు.

పోటాపోటీగా ఆశావహులు

ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలో చైర్మన్, డైరక్టర్లుగా నియమించేందుకు మూడు నెలల క్రితమే ఆశావహుల పేర్లు తీసుకున్నారు. ఎమ్మెల్యేలే జాబితాలను సిద్ధం చేసి అధిష్టానానికి పంపించారు. కొన్నిచోట్ల కూటమి నేతల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తడంతో ఇన్నాళ్లు వాటిని పక్కన పెట్టేశారు. కమిటీలో పేర్లున్న ఆశావహులంతా ఈ పదవుల కోసం రెండు నెలలుగా వేచి చూస్తున్నారు. వచ్చే నెలాఖరులోగా సంఘాలన్నింటికీ కమిటీలు వేయబోతున్నారు. తర్వాత ఎన్నికలు నిర్వహించినా అప్పుడు కూడా వీరినే అధ్యక్షులుగా కొనసాగించేలా అభ్యర్థులను ఎంపికచే యాలని, తేడాలుంటే ఇప్పుడే సరిదిద్ది మరో సారి జాబితాను పునఃపరిశీలన చేసుకోవాలని పార్టీ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. ఈ విషయంలో కూటమి నేతల్లో లుకలుకలు మొదలైనట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పీఆర్‌లో ఒకరికి అదనంగా రెండు బాధ్యతలు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్) చిత్తూరు పీఆర్‌ఐ విభాగం డీఈ నవీన్‌కుమార్‌కు పీఐయూ విభాగం ఈఈగా పదోన్నతి పై అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుడిపాల ఏఈ ప్రసాద్‌నాయుడును ఇన్‌చార్జి డీఈగా అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై స్వరత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఆయన గుడిపాల రెగ్యూలర్ ఏఈ పోస్టుతో పాటు పూతలపట్టు ఇన్‌చార్జి డీఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు చిత్తూరు డీఈగా కూడా అదనపు బాధ్యతలు ఇవ్వడంపై తోటి ఉద్యోగులు విస్తుపోతున్నారు. జిల్లా కేంద్రం అయిన చిత్తూరు, సమీప ప్రాంతం అయిన పూతలపట్టు నియోజకవర్గాలకు ఒకరికే ఇన్‌చార్జి ఇవ్వడం పై విమర్శలు వినిపిస్తున్నాయి. చిత్తూరు ఇన్‌చార్జి డీఈగా కొనసాగడానికి తన పలుకుబడితో ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. జెడ్పీ కార్యాలయంలో జరిగే పనులన్నీ చిత్తూరు డీఈ పర్యవేక్షిస్తారనే విషయం తెలిసిందే.

పూర్తిగాని అండర్ పాస్ రోడ్డు

- దారి లేక పాఠశాలకు వెళ్లని విద్యార్థులు
- 24 గంటల్లో తాత్కాలిక పనులు పూర్తిచేస్తామని హామీ

చదువుకు దారేది?

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: జాతీయ రహదారుల అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. దారిలేక పాఠశాలకు హాజరుకాలేని దుస్థితి రొంపిచెర్ల మండలం, బండకిందపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం.. మదనపల్లె నుంచి రంగంపేట వరకు నేషనల్ హైవే రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు నిర్వహించి పనులు చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణంలో బండకిందపల్లె యూపీ పాఠశాల ముంపునకు గురికాగా.. ప్రభుత్వం రూ.37 లక్షలు నష్ట పరిహారంగా మంజూరు చేసింది. అధికారులు నేషనల్ హైవే రోడ్డు పక్కనే తరగతి గదులను నిర్మించారు. సుమారు 54 మంది విద్యార్థులు రోజూ వచ్చి వెళ్లేవారు. పాఠశాలలో నలగురు ఉపాధ్యాయులు కూడా పనిచేస్తున్నారు. ఇంతవరకు రోడ్డు పైనే దాటుకుని విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే వారు. రోడ్డు పనులు పూర్తి కావడంతో రోడ్డు మీద దాటే అవకాశం లేకుండా పోయింది. అండర్ పాస్ రోడ్డు వేయాల్సిన అధికారులు దానిని విస్మరించడంతో విద్యార్థులు రెండు కిలో మీటర్ల దూరం చుట్టుతిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు జేసీకి, ఎంపీడీఓ, ఎంఈఓ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు అండర్ పాస్ పనులను పట్టించుకోక పోవడంతో మంగళవారం విద్యార్థులను పాఠశాలకు పంపకుండా తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు రాక పోవడంతో చేసేది లేక ఖాళీగానే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే పాఠశాలకు విద్యార్థులు రాక పోవడంతో వంట గది కూడా మూత పడింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీనివాసులు, తహసీల్దార్ అమరనాథ్ బండకింద పల్లె పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతోనూ, నేషనల్ హైవే సూపర్‌వజర్ విజయకుమార్‌తోనూ మాట్లాడారు. అండర్ పాస్ పనులను తాత్కాలికంగా 24 గంటల్లో పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేస్తామని నేషనల్ హైవే సూపర్ వైజర్ హామీ ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు

కెనరా బ్యాంక్ Canara Bank | వి.కోట శాఖ, చిత్తూరు జిల్లా | ఫోన్: 8333818518

రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

తేది: 23.04.2025

రుణగ్రహీత: ఎం.ఆర్.రిషన్ ట్రెక్ ఇరిగేషన్ ఇండస్ట్రీ, ప్రొప్రైయిటర్ శ్రీ రోషన్ ఆహిద్, [illegible]

[illegible]

మూల రుణగ్రహీత	మంజూరు చేసిన రుణం మొత్తం	ఖాతా నెంబరు	తేది: 09.04.2025 నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
MSME ఖర్చీలు	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]

స్థలం : వి.కోట | సం॥ అధీకృత అధికారి,
తేది: : 23.04.2025 | కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ 10th Pass / Inter Fail అయిన విద్యార్థులు Nursing, MLT (Lab Technician) కోర్సులు చేసుకునే అవకాశం. సంప్రదించండి: 82474 57565.

Real Estate

PLOTS FOR SALE

■ గేటెడ్ కమ్యూనిటీ తుడా అప్రూవల్ ప్లాట్లు ధర 3,50,000/– నుండి ప్రారంభం. సంప్రదించండి సెల్: 8333873430, 8297001234.

■ అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/డిటిసిపి ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సెల్: 9114561456

Wanted

■ Wanted Teachers for Higher Class All Subjects & Computers Teacher, Hostel Cook, for a reputed School in S.N.Puram, Tirupathi. Attractive Salary, Contact Cell: 9290898331, 7013881383.

■ నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీ లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 20 to 25K. Q: Inter పైన, Age: 25 to 40Y. ఆసక్తిగల అభ్యర్థులు సంప్ర. సెల్: 91828 98446

■ Wanted Civil Engineers to work at a well Reputed company in Tirupati Qual: Diploma/B.Tech/QC Engineer Min 2 yrs exp. Sal: 15K - 20K. Cont: 9542332862, 8985323604

■ కిసాన్ మిత్ర, మండలాల వారిగ ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. Q: 12, జీతం: 25 వేలు. సెల్: 7702806401, 9347989835

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమం తుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- 92814 52827, 92814 52838

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలనగా పరిశీలించిన పిదప ప్రత్యేకం సంప్రదించవలసిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. 375/- అదనపు లైనుకు రూ.:90/- ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970



టెండర్ ఖరారు రేపే..

అన్నవరం సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది.

8లో

కలలు కల్లలై..

తెలంగాణ రాష్ట్రం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటంలో తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన యువతి దుర్మరణం పాలైంది.

కడలిలోకి 47,411 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 47,411 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి మొత్తం 12,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పిలుపు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమలాపురం మండలం ఇందుపల్లిలోని ఎ–కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం జరగనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరవుతున్న ఉభయ గోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు పార్టీ శ్రేణులు భారీఎత్తున స్వాగతం పలకాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మంగళవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి పథకాల అర్హతతో కూడిన మొత్తం సొమ్ముకు సంబంధించి బాండ్లు అందించిన కూటమి పార్టీల నేతలు.. నేడు ఆయా పథకాలు అమలు చేయకుండా దగా చేశాయని గుర్తు చేశారు. ఎన్నికల్లో బాబు ఇచ్చిన పథకాల ష్యూరిటీ అంతా బోగస్ అని ఇందుపల్లిలో జరిగే సభ ఎండగట్టనుందని వివరించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ యువతను కూటమి ప్రభుత్వం అనేక రకాలుగా వంచించిందన్నారు. బాబు ఇచ్చిన హామీలు, మోసాలపై నిలదీసేందుకు నిర్వహిస్తున్న ఈ సభకు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించాలి

ఐ.పోలవరం: ప్రధానోపాధ్యాయుల టేబుళ్లపై అకడమిక్ క్యాలెండర్ ఉండాలని, దానిని హెచ్ఎంలు తప్పనిసరిగా అనుసరించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆదేశించారు. మండలంలోని మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పాఠశాలల్లో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ జరగాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చదవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఎస్ఆర్‌కేవీఎం కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు బోధనాభ్యసన, పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు తరచూ వారి పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి, వారిలో విద్యా ప్రమాణాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్ఎం సర్వెళ్ల సుజాతకు నిర్దేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో వండాలని, విద్యార్థులంతా భుజించేలా రుచిగా, శుచిగా వండేలా హెచ్ఎం పర్యవేక్షించాలని సూచించారు.

హైవేకి రెడ్ సిగ్నల్

- జిల్లాలో ఎక్కడికక్కడే జాతీయ రహదార్ల నిర్మాణాలకు అడ్డంకులు
- నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్
- ముందుకు కదలని సఖినేటిపల్లి–నర్సాపురం బైపాస్
- 216ఈ చుట్టూ భూ వివాదాలు
- ప్రతిపాదనల దశలోనే కోటిపల్లి–ముక్తేశ్వరం వంతెనకు ఫుల్‌స్టాప్
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన పనులు

కోనసీమ జిల్లాకు జీవనాడిగా మారనున్న నాలుగు జాతీయ రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం వచ్చాక అడుగు ముందుకు పడడం లేదు. వీటిలో కొన్ని నిర్మాణ దశల్లో ఆగిపోగా.. మరికొన్నింటికి భూసేకరణ ఇబ్బందికరంగా మారింది. కొన్ని నిర్మాణాలు ప్రతిపాదన దశ దాటడం లేదు. ఇవి పూర్తయితే కోనసీమ స్వరూపమే మారిపోనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగాయి. కొత్త రహదారులకు వేగంగా ప్రతిపాదనలు సిద్ధం కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక అటు నిర్మాణాలు.. ఇటు ప్రతిపాదనలు పడకేశాయి.

– సాక్షి, అమలాపురం

నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్ అప్రోచ్ నిర్మాణ పనులు

శివకోడు రహదారి

వీడిన భూ సమస్యలు!

కోనసీమ జిల్లా శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం రామరాజులంక వరకు వరకు 216 బైపాస్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో అనుమతిచ్చింది. సుమారు 22.17 కి.మీ. ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును హైవేగా గుర్తించారు. రామరాజులంక వద్ద వశిష్టపై 380 మీటర్ల మేర వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. వంతెన, రహదారి నిర్మాణాలకు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరైంది. వంతెన, రోడ్ల నిర్మాణ పనులను 2025–26 పూర్తి చేయాలని లక్ష్యం. ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. సఖినేటిపల్లి రేవు వద్ద వంతెన నిర్మాణం దశాబ్దాలుగా ముందుకు సాగకపోవడంతో, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ బైపాస్‌ను కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు ప్రతిపాదించింది. దీంతో ఈ రోడ్డు, వంతెనలకు మార్గం సుగమమైంది. ఆయా పనులకు అవసరమైన భూసేకరణకు అవాంతరాలు ఏర్పడ్డాయి. కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ఆ వివాదాలు తొలిగాయని, త్వరలోనే పనులు మొదలవుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

ముక్తేశ్వరం–కోటిపల్లి మధ్య పంటుపై రాకపోకలు

కోటిపల్లి వంతెన ప్రతిపాదనలతో సరి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడ్డాక ముక్తేశ్వరం, కోటిపల్లి రేవు మధ్య రాకపోకలు పెరిగాయి. దీంతోపాటు దశాబ్ద కాలంగా హామీగా ఉండిపోయిన ముక్తేశ్వరం, కోటిపల్లి మధ్య వంతెన నిర్మాణం సైతం తెరపైకి వచ్చింది. కత్తిపూడి–నర్సాపురం ఫెర్రీ (కేఎన్ఎఫ్) రోడ్డులో భాగంగా కోటిపల్లి వద్ద వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. జిల్లా ఏర్పడ్డాక రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందినవారు కలెక్టరేట్, ఇతర పనుల కోసం జిల్లా కేంద్రమైన అమలాపురం రావడం పెరిగింది. ఇప్పుడు పడవలు, పంట్లపై రాకపోకలు చేయాల్సి రావడం వాహనచోదకులకు వ్యయప్రయాసగా మారింది. దీంతో ఇక్కడ వంతెన ఆవశ్యకతను గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ ఎంపీ చింతా అనూరాధ విశేష కృషి చేశారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ జయరామ్ గడ్కరీని ఒప్పించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అప్పట్లో ఆయన ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు కూడా. ప్రభుత్వం మారడంతో దీని ఊసే లేకుండా పోయింది.

మూడేళ్లు దాటుతున్నా..

జాతీయ రహదారి 216ఏలో ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. 2022 సెప్టెంబర్ 22న పనులు మొదలు కాగా, ఇంకా పూర్తి కాలేదు. దీంతోపాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ కూడా జొన్నాడతో పాటు ప్రారంభించారు. ఇప్పటికే మోరంపూడి ఫ్లై ఓవర్ వినియోగంలోకి రాగా, జొన్నాడ మాత్రం బాలారిష్టాలు దాటడం లేదు. పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిపై గడ్డర్లు, శ్లాబ్ వేయాల్సి ఉంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. అప్రోచ్ నిర్మాణం కోసమని పి.గన్నవరంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే, అక్రమార్కులు తవ్వకాలు చేసి కాసులు దండుకున్నారు. నిర్మాణ పనుల వల్ల జొన్నాడ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ స్తంభించి, ఇటు రావులపాలెం, రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

ఎన్‌హెచ్ టు ఎన్‌హెచ్ ఎప్పుడో?

జాతీయ రహదారి 216 (కత్తిపూడి నుంచి ఒంగోలు), జాతీయ రహదారి 216ఏ (దివాన్ చెరువు నుంచి రావులపాలెం మీదుగా గుండుగొలను వరకు) ఉన్న జాతీయ రహదార్లను అనుసంధానం చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్ ముందుకొచ్చింది. ఎన్‌హెచ్–ఈ అమలాపురం పేరూరు నుంచి ముక్కామల, కొత్తపేట మీదుగా రావులపాలెం సమీపంలోని మార్కెట్ యార్డు వరకు నిర్మించాలని నిర్ణయించారు. తొలుత దీనికి రూ.450 కోట్లు కేటాయించారు. తర్వాత ఇది రూ.735 కోట్లకు చేరిందని అంచనా. ఏడు మీటర్ల వెడల్పున ఉన్న రహదారిని పది మీటర్ల వెడల్పున నిర్మించనున్నారు. దీనిలో అమలాపురం సమీపంలోని నడిపూడి నుంచి పేరూరు వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి ఉంది. ఇప్పటి వరకు ఈదరపల్లి నుంచి కొత్తపేట వరకున్న ఆర్అండ్‌బీ రహదారి మరింత వెడల్పు కానుంది. ఈ రోడ్డు పూర్తయితే రెండు జాతీయ రహదారుల మధ్య మరో ఎన్‌హెచ్ రోడ్డు వచ్చినట్టవుతోంది. ఈ ప్రాజెక్టుకు గతంలో భూసేకరణకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతమేర గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రతిపాదన రావడంతో.. ఇందుపల్లి, ఇతర ప్రాంతాల వాసులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. వీరు ప్రత్యామ్నాయ రహదారిని సూచిస్తున్నా స్థానికంగా పట్టించుకునేవారు లేరు. దీంతో ఈ రోడ్డు నిర్మాణం ఇంకా ప్రతిపాదనల దశ దాటలేదు.

ఈదరపల్లి రహదారి

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పలు నిర్మాణ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులతో పాటు, వంతెన అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో సర్వీస్ రోడ్లు అధ్వానంగా మారాయని, వారం రోజుల్లో బాగు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అప్రోచ్ రోడ్లను నవంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. పాశర్లపూడి జంక్షన్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నగరంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, గెద్దాడలో పనులు సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. టోల్ ప్లాజా నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలన్నారు. ఊడిమూడిలంక–జి.పెదపూడిలంక వంతెనను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. వాడపల్లి వద్ద సైఫన్ పనులను వేగవంతం చేయాలన్నారు.

వంతెన పనులపై సమీక్ష

పి.గన్నవరం: ఊడిమూడిలంక–జి.పెదపూడిలంక గ్రామాల వశిష్ట నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులపై కలెక్టర్ మహేష్‌కుమార్ తన కార్యాలయంలో సమీక్షించారు. పీఆర్ ప్రాజెక్ట్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, డీఈ అన్యం రాంబాబు, కాంట్రాక్టర్ పీపీ రాజు పనుల పురోగతిని కలెక్టర్‌కు, జేసీ నిశాంతికి వివరించారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అమలాపురం టౌన్: పురాతన దేవస్థానమైన అమలాపురం భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రమూర్తి స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన జీవీఎంఎం సేవా ట్రస్ట్ చైర్మన్ గుళ్లపల్లి సత్యనారాయణ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దేవస్థానం వద్ద దాత గుళ్లపల్లి సత్యనారాయణ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులకు ఈ విరాళాన్ని మంగళవారం అందించారు. తన తల్లిదండ్రులు దివంగత గుళ్లపల్లి వెంకట్రామయ్య, మహాలక్ష్మమ్మ, తన భార్య దివంగత కామేశ్వరి సంస్మరణార్థం విరాళం అందజేసినట్టు సత్యనారాయణ తెలిపారు. కమిటీ ప్రతినిధులు జిల్లెళ్ల గోపాల్, విస్సాప్రగడ చాన్న, మండలీక నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రతినిధులకు విరాళం అందిస్తున్న దాత

20 వేల మంది రైతులకు రూ.255 కోట్ల పెండింగ్

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జున్నూరి రామారావు

అల్లవరం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించిన సివిల్ సప్లయిస్ అధికారులు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయకుండా రెండు నెలలుగా జాప్యం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జున్నూరి రామారావు ఓ ప్రకటనలో ఆరోపించారు. మే నెల తొలి వారం తర్వాత రైతుల వద్ద తీసుకున్న ధాన్యానికి నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని, జిల్లాలో సుమారు 20 వేల మంది రైతులకు రూ.255 కోట్ల ధాన్యం డబ్బు రావాల్సి ఉందన్నారు. రోజువారీ వడ్డీకి, బంగారు నగలు కుదవ పెట్టి తెచ్చిన డబ్బుతో దాళ్వా పండించారని. పంట అమ్మి అప్పులు తీర్చుదామనుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. వేలాది మంది రైతులు వడ్డీ భారం భరించాల్సి వస్తోందన్నారు. రైతుల ఇబ్బందులు సివిల్ సప్లయిస్ మంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు మొబలైజేషన్ అడ్వాన్సులు, మద్యం దుకాణాలకు ప్రాఫిట్ మార్జిన్ ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి డబ్బులుంటాయని, రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించడానికి చేతులు రావని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక్క రూపాయికే ఎకరం భూమిని కట్టబెడుతున్న కూటమి ప్రభుత్వం, ధాన్యం డబ్బు చెల్లింపులో తాత్సారమేమిటని నిలదీశారు. రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రతి సోమవారం రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నా, ఎందుకు స్పందించడం లేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సాగుకు రైతులు పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేయాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెండు రోజుల్లో ధాన్యం డబ్బు జమ చేయకపోతే రైతులు పోరాటానికి సన్నద్ధం అవుతారని హెచ్చరించారు.

పట్టాభిరామ్ మనవారే..

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మరణంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. పట్టాభిరామ్కు ఈ జిల్లాతో విడదీయరాని అనుబంధమే ఉంది. ఉమ్మడి జిల్లాలోని కె.గంగవరం మండలం దంగేరులో ఆయన పూర్వీకులు నివాసం ఉండేవారు. అక్కడ నుంచి ద్రాక్షారామ సమీపంలోని దొడ్డంపేటలో తల్లిదండ్రులతో కలిసి నివాసముండగా పట్టాభిరామ్ రామచంద్రపురంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించారు. ఉన్నత చదువుల కోసం కాకినాడ వచ్చి అక్కడి పీఆర్ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. కాలి వైకల్యంతో ఉన్న ఆయన ఆ లోపం కనపడకుండా ఉండేందుకు.. తండ్రి రావు సాహెబ్ భావరాజు సత్యనారాయణ సూచన మేరకు ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబీ రావ్ వద్ద ఇంద్రజాలంలో శిక్షణ పొందారు. అక్కడ నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. కాకినాడ నుంచి హైదరాబాద్‌లో భారత ఆహార సంస్థ ఉద్యోగిగా ఉంటూ అనేక ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తూ జిల్లా పేరు ప్రతిష్ఠలను రాష్ట్రవ్యాప్తం చేశారు. ఇంద్రజాలంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై అనేక పుస్తకాలు రాశారు. ఇంద్రజాలం అంటే ఒక వినోదం మాత్రమే కాదని, మూఢ నమ్మకాలపై పరోక్షంగా ఒక యుద్ధాన్ని చేశారు. 1949లో జన్మించిన పట్టాభిరామ్ 75 ఏళ్ల వయసులో ఖైరతాబాద్‌లో మృతి చెందడంతో ఈ ప్రాంత వాసులు ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

వెలుగుకు కమ్మిన చీకట్లు

- సిబ్బంది కొరతతో సతమతం
- 66 సీసీ, 19 ఏపీఎం పోస్టుల ఖాళీ
- ఎంసీపీ, హెచ్‌సీఎల్ యాప్‌లతో మరింత భారం
- రూ.కోట్లలో టర్నోవర్ అయినా.. కాంట్రాక్టు సిబ్బందితోనే కాలక్షేపం

మలికిపురం: జిల్లా డీఆర్‌డీఏ పరిధిలోని వెలుగు విభాగంలో సిబ్బంది లేక చీకట్లు అలముకున్నాయి. జిల్లా వెలుగు కార్యాలయాల్లో కొంత కాలంగా 66 సీసీ (క్లస్టర్ కోఆర్డినేటర్), 19 మండలాలకు ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్)ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో సతమతమవుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఎంసీపీ, హెచ్‌సీఎల్ యాప్‌లను ప్రవేశపెట్టి సిబ్బందిపై మరింత భారం పెంచింది. ఈ నేపథ్యంలో వెలుగు అధికారులు గ్రామస్థాయిలో వీవోఏలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న వారి నుంచి సహాయకులుగా దరఖాస్తులను స్వీకరించారు. రాజకీయ పైరవీలు, పోటీ నుంచి తప్పించడానికి ఈ పోస్టులకు జీతాలు ఇవ్వలేని తాత్కాలిక వలంటీర్లుగా అధికారులు నామకరణం చేశారనే ప్రచారం నడుస్తోంది. ఆనక సీసీలుగా రెగ్యులర్ చేస్తామని లోపాయికారిగా మండల స్థాయిలో ఒప్పందం కుదిరినట్టు అంటున్నారు. సాధారణంగా సీసీ పోస్టులకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకూ జీతాలుంటాయి. వెలుగులో చాలా కాలంగా ఇవి కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నాయి. గ్రామ స్థాయిలో సీనియర్లను కాదని ఇష్టానుసారం నియామకాలను చేపట్టడంతో, సఖినేటిపల్లి మండల వీవోఏ సీనియర్లు, పొరుగు క్లస్టర్ వారిని తమ క్లస్టర్లలో నియమించారని మరికొందరు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వద్ద పంచాయితీ పెట్టారు. దీంతో ఎమ్మెల్యే సదరు అధికారులను నిలదీయగా, ఈ విషయం వివాదాస్పదం కావడంతో.. వాటిని రద్దు చేస్తున్నామని సఖినేటిపల్లి మండల ఏపీఎం అజయ్ వివరణ ఇచ్చారు. దీంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు డీఆర్‌డీఏ పీడీని అడగడంతో, అవి సీసీ పోస్టులు కాదని, కేవలం సహాయకులేనని బదులిచ్చారు. ఈ నియామకాల్లో కింది స్థాయి అధికారుల మధ్య డబ్బు చేతులు మారుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అజమాయిషీ లేక..

వెలుగు విభాగంలో కోట్లాది రూపాయల టర్నోవర్ జరుగుతుంది. ఈ విభాగానికి జిల్లా స్థాయిలో ప్రత్యేకాధికారులు లేరు. డీఆర్‌డీఏ మాత్రమే పర్యవేక్షిస్తుంది. మండల స్థాయిలో ఏపీఎంలు ఉంటారు. వీరు కూడా కాంట్రాక్టు బేస్‌లోనే పని చేస్తారు. ఒక్కో మండలంలో రూ.20 కోట్ల పైబడి స్త్రీ నిధి రుణాలుగా ఇస్తున్నారు. అలాగే రూ.వందల కోట్ల బ్యాంకు రుణాల లావాదేవీలు జరుగుతాయి.

సఖినేటిపల్లి వెలుగు కార్యాలయం

ఇలాంటి కీలక ఆర్థిక వ్యవస్థకు మండల స్థాయిలో కాంట్రాక్టు సిబ్బంది ఉండడం గమనార్హం. రుణాలు ఇవ్వాలన్నా, గ్రూపుల వెరిఫికేషన్ చేయాలన్నా మండలానికి ముగ్గురు సీసీ (క్లస్టర్ కో–ఆర్డినేటర్లు) ఉంటారు. వీరు కూడా కాంట్రాక్టు పద్ధతిలోనే పని చేస్తున్నారు. ఏపీఎం, సీసీలు పూర్తి స్థాయిలో ఉన్నారా అంటే అదీ లేదు. అందువల్లే వెలుగులో అనేక అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జిల్లాలో స్త్రీ నిధి, మహిళల పేరుతో బినామీ రుణాలు, బ్యాంకులకు రీ పేమెంట్లు జరగకపోవడం వంటి సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి.

అంతా గందరగోళం

ఇప్పటికే తీవ్ర పనిభారంతో ఉన్న వీవోఏ నుంచి తాజాగా జిల్లాలో ఇన్‌చార్జి సీసీ అంటూ నూతన పోస్టులు ఎర వేశారు. గ్రామ స్థాయిలో వీవోఏల నుంచి దరకాస్తులు తీసుకోవడంతో, ఆయా గ్రామాల్లో వీవోఏల పోస్టులు భారీగా ఖాళీలు ఏర్పడనున్నాయి. జీతాల్లేని సీసీ సహాయకులుగా వెళ్తే, తమ వీవోఏ పోస్టులు ఉంటాయో, లేవో అనే సందేహం వారిలో వ్యక్తమవుతోంది. దీంతో ఇన్‌చార్జి సీసీలుగా నియమితులైన వీవోఏల్లో గందరగోళం నెలకొంది. మండలానికి మూడుకు పైగా వీవోఏ పోస్టులు ఖాళీలు ఏర్పడనున్నాయని అంటున్నారు.

సీసీ మృతితో భార్యకు హామీ ఇచ్చి..

సీసీ నాగరాజు (ఫైల్)

డీఆర్‌డీఏ అధికారుల తీరు ఆ శాఖలో ఓ చిరుద్యోగి నిండు ప్రాణాలను బలితీసుకుంది. గత మే నెల రెండో తేదీన అమరావతిలో జరిగిన పునర్నిర్మాణ సభకు అధికారులు చేపట్టిన డ్వాక్రా మహిళల తరలింపులో భాగంగా బస్సులో డ్యూటీకి పంపించిన డీఆర్‌డీఏ వెలుగు విభాగం మలికిపురం మండల క్లస్టర్ కో–ఆర్డినేటర్ డీటీ నాగరాజు ప్రాణాలు కోల్పోయాడు. కడప జిల్లాకు చెందిన నాగరాజు కొంత కాలంగా మలికిపురం వెలుగు కార్యాలయంలో పరిమిత జీతంతో కాంట్రాక్టు పద్ధతిలో క్లస్టర్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పటికే రెండు రోజుల నుంచీ అనారోగ్యంతో ఉన్న నాగరాజును అమరావతి సభకు బస్సులో డ్యూటీ వేశారు. అనారోగ్యం కారణంగా సెలవు ఇవ్వాలని అడిగినా అధికారులు ఆలకించలేదు. సభకు రాకపోతే జీతాలు ఇవ్వలేమని చెప్పినట్టు సమాచారం. సభ ముగిశాక తిరుగు ప్రయాణంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద బస్సు దిగి, రోడ్డు దాటుతున్న నాగరాజును కోళ్ల వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయారు.

షాక్‌లోనే నాగరాజు భార్య

భర్త మృతి చెందిన సంఘటనతో నాగరాజు భార్య ఇప్పటికీ షాక్‌లో ఉన్నారు. అప్పట్లో నాగరాజు భార్యకు సీసీ పోస్టు ఇస్తామని కొందరు నమ్మించారు. తీరా ఆమెకు ప్రభుత్వం నుంచి కనీస సాయం అందలేదు. జిల్లాలో మహిళల నుంచి చందాలు వసూలు చేసి, ఆర్థిక సాయమిచ్చి చేతులు దులుపుకొన్నారు. నాగరాజుకు ఇంటర్ పాసైన కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగరాజు జీతం మినహా కుటుంబానికి ఆధారం లేదు. ఆ కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారనేది గ్యారంటీ లేదు.

అకౌంటెంట్లదే హవా

జిల్లాలోని మండల స్థాయి వెలుగు కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న అకౌంటెంట్లదే హవా నడుస్తోంది. మహిళా సంఘాలు, సమాఖ్యలు ఏర్పడి 28 ఏళ్లయింది. అప్పట్నుంచి ఒకే అకౌంటెంట్ మండల కేంద్రాల్లో ఉన్నారు. వీరు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. సొంత ప్రాంతాలు కావడంతో మహిళా సమాఖ్యలను గుప్పెట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమాఖ్య అకౌంట్ నుంచి వీరు జీతాలు పొందడం గమనార్హం. ఇన్నేళ్లుగా వీరికి బదిలీలు లేవు. వీరు ఇతర మండలాలకు వెళ్లకపోవడంతో, మండల సమాఖ్య నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే అభియోగాలూ ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



జిల్లా వెలుగు విభాగంలో సిబ్బంది కొరత ఉంది. దీనిపై సెర్ప్‌కు నివేదిక ఇచ్చాం. ప్రస్తుతం తాత్కాలికంగా సహాయకులను తీసుకుంటున్నాం. అవి సీసీ పోస్టులు కాదు. నియామకం పొందిన వారి నుంచి పక్కాగా లేఖలు తీసుకుంటాం. ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. మండల స్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడి, క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జయచంద్ర గాంధీ, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

టెండర్ ఖరారు రేపే..

- ప్రముఖ దేవాలయాలకు గత ఏప్రిల్‌లో నోటిఫికేషన్
- దానిని రద్దు చేసి మళ్లీ జూన్ 12న రీటెండర్
- కొత్త షరతుల ప్రకారం రూ.80 లక్షలకు పెరిగే అవకాశం

అన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సహా, రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు శానిటరీ మెటీరియల్, క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్‌డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది. దీని ప్రైస్ బిడ్‌ను విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం తెరవనున్నారు. సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా, విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్, ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయ్యాయి. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి, లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన వారికి టెండర్ ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.

గత టీడీపీ ప్రభుత్వంలో 'పద్మావతి'కి టెండర్

కాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య రాష్ట్రంలో అన్నవరం దేవస్థానం సహా, పలు దేవస్థానాల్లో శానిటరీ టెండర్‌ను పద్మావతి సంస్థ దక్కించుకుంది. మొదట రెండేళ్ల కాల పరిమితికి టెండర్ దక్కించుకున్న ఈ సంస్థకు, తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం మరో రెండేళ్లు కాంట్రాక్ట్ పొడిగించింది. ఇప్పుడు మరలా అదే సంస్థ టెక్నికల్ బిడ్‌లో క్వాలిఫై కావడంతో, మరలా ఆ సంస్థకే టెండర్ దక్కే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పద్మావతి సంస్థ యజమాని భాస్కరనాయుడు టీడీపీ పెద్దలకు సన్నిహితుడు కావడమే కారణంగా చెబుతున్నారు.

ప్రముఖ దేవస్థానాల్లో రీ టెండర్

గత ఏప్రిల్ నెలలో పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌పై టెండర్‌దారులు అనేక సందేహాలను వ్యక్తం చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం దానిని రద్దు చేసింది. కొన్ని మార్పులతో కొత్త నోటిఫికేషన్‌ను జూన్ 12న విడుదల చేసింది. టెండర్‌దారులు తమ కొటేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీ జూన్ 26గా నిర్ణయించారు. మొత్తం 23 మంది టెండర్ కోసం పోటీ పడినా, వివిధ కారణాలతో 21 మంది తప్పుకొన్నారు. చివరకు చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థలు ప్రైస్ బిడ్‌కు ఎంపికయ్యాయి.

ఏడు దేవస్థానాల్లో శానిటరీ నిర్వహణ

టెండర్ దక్కించుకున్న సంస్థ రెండేళ్ల కాల పరిమితిలో అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గ గుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో పారిశుధ్య పనులు, వివిధ సత్రాల్లో హౌస్ కీపింగ్, రహదార్లు, టాయిలెట్స్ క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనులు నిర్వహించాల్సి ఉంది.

గత ప్రభుత్వ హయాంలో విడివిడిగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దేవస్థానాల వారీగా శానిటరీ టెండర్లు ఖరారు చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని పది నెలలు జాప్యం చేసింది. ఒకే యూనిట్‌గా టెండర్లు నిర్వహించాలని గతేడాది ఆగస్టు 27న కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కాంట్రాక్ట్ ముగిసి ఆరు నెలలైనా..

అన్నవరం దేవస్థానంలో శానిటరీ విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్ట్ గతేడాది నవంబర్‌తో ముగిసింది. ఆ కాంట్రాక్ట్ ముగియడానికి ఒక నెల ముందుగానే గత అక్టోబర్‌లో టెండర్ విడుదల కావాల్సి ఉంది. టెండర్లు ఆలస్యం కావడంతో, దేవస్థానం కోరిక మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. మార్చి ఒకటి నుంచి తాము విధులు నిర్వహించలేమని దేవస్థానానికి లేఖ సమర్పించారు. దీంతో టెండర్ పిలవకుండానే గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్ సంస్థకు తాత్కాలికంగా పనులు అప్పగించారు.

పెరగనున్న కాంట్రాక్ట్..?

గత నవంబర్‌తో ముగిసిన కేఎల్‌టీసీ సంస్థ శానిటరీ టెండర్ నెలకు రూ.49 లక్షలు. దేవస్థానం కనకదుర్గా ఏజెన్సీకి నెలకు రూ.59 లక్షలు జీతాలుగా చెల్లిస్తున్నారు. రూ.12 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. మొత్తం నెలకు రూ.71 లక్షలు ఖర్చు చేస్తున్నారు. తాజాగా అన్ని దేవస్థానాలకు కలిపి సెంట్రలైజ్డ్ టెండర్‌లో అత్యాధునిక మెషినరీలు ఉపయోగించాలనే షరతు విధించారు. శానిటరీ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం జీతాల చెల్లింపుతో పాటు, వారాంతపు సెలవుల్లో సిబ్బంది రిలీవర్స్‌గా కొంతమందిని నియమించనున్నారు. ఏసీలు, విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కూడా కలిపారు. ఫలితంగా దేవస్థానంలో నెలకు శానిటరీ కాంట్రాక్ట్ రూ.80 లక్షలకు పైమాటే అంటున్నారు.

రత్నగిరిపై ఆలయ ప్రాంగణం శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద రవాణా జేఏసీ ధర్నా

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

అమలాపురం రూరల్: రవాణా శాఖాధికారులను పక్కనపెట్టి, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ ప్రైవేట్ ఏజెన్సీలు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా రవాణా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రవాణా జేఏసీ జిల్లా కో–ఆర్డినేటర్, ఆంధ్రా ఆటోవాలా జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల మోటారు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ చేయడానికి జిల్లా రవాణా అధికారులను విస్మరించి, ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల వాహన యాజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. యాంత్రీకరణ విధానం నిలిపి, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా జేఏసీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సదస్సు ఈ నెల 4న అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 9న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. రవాణా జేఏసీ జిల్లా కన్వీనర్ రాగుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు పోలిశెట్టి సీతారాంబాబు, బొంతు బాలరాజు, యాళ్ల వెంకటేశ్వరరావు, ఎల్లమెల్లి పెద్దా తదితరులు పాల్గొన్నారు.

సజ్జలపై తప్పుడు ప్రచారం

- ప్రేమ్‌చంద్‌తో సంబంధం లేదు
- వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

చిర్ల జగ్గిరెడ్డి విడుదల చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో ప్రేమ్‌చంద్ తండ్రి ప్రసాద్ ఫొటో

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎల్లో మీడియా కేంద్రంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సజ్జల మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ తన నియోజకవర్గ పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌చంద్ అనే వ్యక్తి సొమ్ము వసూలు చేశాడంటూ ఆంధ్రజ్యోతిలో రాసిన కథనాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ కథనం పూర్తిగా అవాస్తవమన్నారు. సజ్జలకు, ప్రేమ్‌చంద్‌కు ఎటువంటి సంబంధమూ లేదన్నారు. ప్రేమ్‌చంద్ తండ్రి అడపా ప్రసాద్ టీడీపీ సానుభూతిపరుడని వివరించారు. ఆయన కొత్తపేట టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అనుచరుడని జగ్గిరెడ్డి తెలిపారు. బండారుతో ప్రసాద్ ఉన్న ఫొటోను జగ్గిరెడ్డి విడుదల చేశారు. టీడీపీ సానుభూతిపరుడు అడపా ప్రసాద్ కుమారుడు అడపా ప్రేమ్‌చంద్ మాటలు నమ్మి, నిజానిజాలు తెలుసుకోకుండా వార్తా పత్రికలో ఇలా తప్పుడు కథనాలను ప్రచురించడాన్ని ఆయన ఖండించారు.

నెల రోజులు సెక్షన్–30 అమలు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌లో నెల రోజుల పాటు సెక్షన్–30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మంగళవారం ఇక్కడ వెల్లడించారు. అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ల పరిధిల్లో ఈ నెల 31 వరకూ ఈ సెక్షన్ వర్తిస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాంటి కార్యకలాపాలు జరపడానికి ముందుగా తన అనుమతి పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రెండు పొక్లెయిన్లు సీజ్

మానేపల్లిలంకలో సీజ్ చేసిన పొక్లెయిన్ వద్ద ఆర్డీఓ, తహసీల్దార్

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లిలంకలో అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న రెండు పొక్లెయిన్లను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ మంగళవారం సీజ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని యర్రంశెట్టివారిపాలెం, పెదకందాలపాలెం, మానేపల్లిలంకలో ర్యాంపులను తహసీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. మానేపల్లిలంకలో ఉన్న పొక్లెయిన్లను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 15 వరకూ జిల్లాలో ఎక్కడా మట్టి, ఇసుక తవ్వకాలు జరపరాదని కలెక్టర్ ఆదేశించారన్నారు. అక్రమ తవ్వకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాంపుల్లోకి లారీలు, ట్రాక్టర్లు వెళ్లకుండా బాటలను కట్ చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయా ర్యాంపుల్లో ఎంత మేరకు అక్రమ తవ్వకాలు జరిపారో డ్రోన్ల ద్వారా సర్వే చేయించి, సంబంధిత వ్యక్తులకు డిమాండ్ నోటీసులు పంపిస్తామని ఆర్డీఓ చెప్పారు.

లారీని ఢీకొన్న గూడ్స్ ఆటో

జొన్నాడకు చెందిన డ్రైవర్ మృతి

కిర్లంపూడి: ఆగి ఉన్న లారీని గూడ్స్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్(43) గూడ్స్‌ఆటోలో విశాఖ పట్నానికి పువ్వుల లోడుతో కిరాయికి వెళ్లాడు. అక్కడి నుంచి న్యూస్ పేపర్ల లోడును వేసుకుని రాజమండ్రికి తిరిగొస్తుండగా, మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మరణించాడు. అతడి సోదరుడు సూరిశెట్టి గంగాజలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సూరిశెట్టి శ్రీధర్ (ఫైల్)

గ్రామంలో తీవ్ర విషాదం

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో సూరిశెట్టి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన శ్రీధర్ 12 ఏళ్లుగా జొన్నాడలో నివసిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యజమాని శాశ్వతంగా దూరం కావడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ఇక తమకు దిక్కెవరంటూ మృతదేహం వద్ద కుటుంబీకులు రోదించిన తీరు చూపరులను కలచివేసింది. బంధువులు విషాదంలో మునిగిపోయారు.

కలలు కల్లలై..

- కెమికల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో చాగల్లు యువతి దుర్మరణం
- ప్రసన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు
- ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఆమె అత్త కొడుకు

చాగల్లు: బాగా చదువుకుంది. జీవితంలో ఏదో సాధించాలనే తపనతో ఉద్యోగంలో చేరింది. చిరుద్యోగులైన తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకుంది. తానొకటి తలిస్తే.. విధి ఒకటి తలచిందని.. ఉద్యోగంలో చేరిన రెండు నెలలకే ఆమెను మృత్యువు కబళించింది. ఆమె ఆశలన్నీ కల్లలయ్యాయి.

తెలంగాణలో పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో చాగల్లుకు చెందిన యువతి మృతి చెందడంతో చాగల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పొలిశెట్టి శ్రీనివాసరావు కుమార్తె ప్రసన్న(22) ఈ దుర్ఘటనలో మృతి చెందింది. రెండు నెలల క్రితమే ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా ఉద్యోగంలో చేరిన ప్రసన్న మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి శ్రీనివాసరావు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, అనాథ పిల్లల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రామలక్ష్మి ఆశా కార్యకర్తగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ప్రసన్న కాగా, చిన్న కుమార్తె ప్రభుకుమారి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతుంది.

పొలిశెట్టి ప్రసన్న (ఫైల్)

ప్రాణాపాయం నుంచి తప్పించుకుని..

ప్రసన్న అత్త కొడుకు కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన యాతం మహేష్ సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రసన్న కూడా రెండు నెలల క్రితమే అదే ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ పనిపై మహేష్ బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. దుర్ఘటన విషయం తెలుసుకుని.. అదే సమయంలో డ్యూటీలో ఉన్న ప్రసన్న కూడా ప్రమాదానికి గురైందని గ్రహించి ఆమె తల్లిదండ్రులకు మహేష్ సమాచారం అందించాడు. సోమవారం సాయంత్రం శ్రీనివాసరావు, రామలక్ష్మి హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఎన్నో ఆశలతో..

దుర్ఘటనలో మృతిచెందిన ప్రసన్న బీ–ఫార్మసీ చదివింది. ఉన్నత చదువు అభ్యసించి జీవితంలో మంచి స్థానం సాధించాలని ఆశించింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో స్టైఫండ్ తీసుకుంటూ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగంలోకి చేరింది. ఎం–ఫార్మసీ చేయాలన్న తపనతో ఓ శిక్షణ సంస్థలో కూడా చేరింది. ఇదే విషయాన్ని దుర్ఘటనకు ముందురోజు ఆమె తల్లితో ఫోన్‌లో చెప్పింది. తాను ఎం–ఫార్మసీ చదివేందుకు ఫీజు చెల్లించానని ఆనందం పంచుకుంది. సోమవారం సాయంత్రం ఏడు గంటల నుంచి జరిగే క్లాసులకు వెళుతున్నానని తల్లికి చెప్పింది. ఎంతో ఆనందాన్ని పంచుకున్న కుమార్తె తమను విషాదంలో విడిచి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు రోదించారు.

కన్నీరుమున్నీరైన చెల్లెలు

చిన్ను(ప్రసన్న) కుటుంబ సభ్యులందరితో కలివిడిగా ఉండేదని, తామిద్దరం అక్కాచెల్లెలైనా.. స్నేహితుల్లా కలిసిమెలిసి ఉండేవాళ్లమని ప్రసన్న చెల్లెలు ప్రభుకుమారి కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. ప్రసన్న ఇంటి వద్ద బంధువుల రోదనలు హృదయవిదారకంగా మారాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

ల్యాండ్ కావలెను

■ రియల్ ఎస్టేట్ రంగంలో రెండు రాష్ట్రాల్లో అగ్రగామిగా ఉన్న ప్రముఖ సంస్థకు రాజమండ్రిలో డెవలప్‌మెంట్‌కొరకు లేఅవుట్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించుటకు ల్యాండ్ కావలెను. సంప్ర : 90591 13819 [V- 2828]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2640]

జ్యోతిష్యాలయం

■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ ప్రముఖ గ్యాస్ ఏజెన్సీలో డోర్ టూ డోర్ సర్వే చేయుటకు యువతీ యువకులు కావలెను. జీతం: 18000. సంప్ర: 9121515459 [SCA25005832]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్దుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పిఠాపురానికి చెందిన చాగంటి వీరవెంకట భీమ మల్లికార్జున శర్మ(39) మృతి చెందారు. కాకినాడ జయేంద్రనగర్ ఎస్‌బీఐ ఈ–కార్నర్ వద్ద రోడ్డుపై సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, రాత్రి 11.45 సమయంలో మల్లికార్జున శర్మ స్నేహితుడికి సెల్‌ఫోన్ ద్వారా స్థానికులు ప్రమాద సమాచారాన్ని తెలిపారు. స్నేహితుడు మంత్రిప్రగడ సుబ్బారావు అక్కడకు చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న మల్లికార్జున శర్మను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడు మల్లికార్జున శర్మ తండ్రి వీరేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మోటార్ సైకిల్‌పై స్నేహితులను కలిసేందుకు కాకినాడ వెళ్లిన కుమారుడు శవమయ్యాడని, ఏకైక కుమారుడిని కోల్పోయామని తండ్రి వీరేశ్వరరావు విలపించారు. ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కలెక్షన్ విభాగంలో మల్లికార్జున శర్మ పని చేస్తూ ఇటీవల ఉద్యోగం మానేశాడు.

700 లీటర్ల డీజిల్ పట్టివేత

వాహనం, నిందితులతో పోలీసులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న 700 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న పాలకొల్లుకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. ట్రాక్టర్‌తో పాటు, 700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట: జగ్గంపేట శివారు గుర్రంపాలెం రోడ్డులో పోలవరం కాలువ వద్ద పేకాట శిబిరంపై జగ్గంపేట పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.ఈ దాడిలో రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఎస్సై రఘునాథరావు, సిబ్బంది దాడులు నిర్వహించినట్టు తెలిపారు.

కనకాయలంక కాజ్ వే వద్ద వంతెన నిర్మాణం

రూ.22.83 కోట్లకు పరిపాలనా ఆమోదం

పి.గన్నవరం: కొద్దిపాటి వరదకే కాజ్ వే నీటమునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక గ్రామ ప్రజలకు వరద కష్టాలు తీరనున్నాయి. మండలంలోని చాకలిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న కనకాయలంక కాజ్ వే వద్ద హై లెవెల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.22.83 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చినట్టు గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ (ధవళేశ్వరం) ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ తెలిపారు. కనకాయలంక, చాకలిపాలెం (వశిష్ట ఎడమ ఏటిగట్టు) గ్రామాలను కలుపుతూ వశిష్ట నదిపై వంతెన నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. రూ.24 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, రూ.22.83 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కనకాయలంక గ్రామంలో సుమారు మూడు వేల మంది నివసిస్తున్నారు. వారి జీవన విధానం తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలంతో ముడిపడి ఉంది. నిత్యం కాజ్ వే దాటి పి.గన్నవరం మండలానికి వస్తుంటారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తే కనకాయలంక కాజ్ వే మునిగిపోతోంది. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో కాజ్ వే దాటి వస్తుంటారు. వరద నీరు మరీ ఎక్కువైతే పడవలపై ప్రయాణిస్తారు. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే కనకాయలంక గ్రామాల ప్రజల వరద కష్టాలు తీరతాయి.

కనకాయలంక కాజ్ వేపై వరద నీటిలో వస్తున్న విద్యార్థినులు(ఫైల్)

పెదలంక వద్ద వంతెన

అలాగే వరద సమయాల్లో ప్రజల రాకపోకల కోసం వశిష్ట ఎడమ ఏటిగట్టు నుంచి యలమంచిలి మండలం పెదలంకకు రూ.80.8 లక్షలతో సింగిల్ లైన్ రోడ్డు వంతెనకు కూడా పరిపాలనా ఆమోదం లభించినట్టు ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు. టెండర్లు పూర్తయిన తర్వాత ఈ వంతెన పనులు ప్రారంభమవుతాయని ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ వివరించారు.

పరిమళించిన మానవత్వం

- మురుగు కాలువలో మతిస్థిమితం లేని మహిళ దైన్యం
- రెండు రోజుల తర్వాత ఆస్పత్రికి తరలింపు

కోరుకొండ: ఏం చేస్తుందో ఆమెకు తెలియడం లేదు. ఎండైనా.. వానొచ్చినా మురుగు కాలువలోకి దిగి గంటల తరబడి ఉండిపోతోంది. ఎట్టకేలకు కొందరు చొరవ చూపడంతో.. ఆమెను కాపాడి ఆస్పత్రికి తరలించారు. మతిస్థిమితం లేని ఓ యువతి దయనీయ స్థితిలో మురికి కాలువలోనే రెండు రోజుల పాటు గడిపిన హృదయ విదారక సంఘటన కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో, కోరుకొండలో ఆమె సంచరిస్తోంది. మతి స్థిమితం లేకపోవడంతో ఎవరైనా పెట్టింది తిని కాలం వెళ్లదీస్తోంది. రెండు రోజుల నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్‌ను ఆనుకుని ఉన్న మురుగు కాలువలోకి దిగి, మళ్లీ బయటకు వస్తోంది. దుర్వాసన వస్తున్నా.. వ్యర్థాల మధ్యే రెండు రోజులుగా ఇలా చేస్తుండడాన్ని స్థానికులు గమనించారు. ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు ఈ కాలువ నుంచే గోదావరి నదిలోకి వెళ్తుంది. కొన్ని రోజులుగా కాలువకు వర్షపు నీరు రాకపోవడంతో ఆమెకు ఎటువంటి అపాయం కలగలేదు. కొందరు స్థానికులు ఈ విషయాన్ని పంచాయతీ వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆమెను కాలువ నుంచి బయటకు తీసుకొచ్చారు. సైగలు చేస్తూ, పొడిపొడిగా మాట్లాడుతూ ఆమె భయంగా ఉంటోంది. పారిశుధ్య కార్మికులు జలడుగుల చిన్నపార్వతి, సోమాజుల బంగారమ్మ, రాజమహేంద్రవరానికి చెందిన డివైన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద మురుగు కాలువలో కూర్చున్న యువతి

సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 2 । జూలై । 2025

టెండర్ ఖరారు రేపే..

అన్నవరం సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది.

8లో

కలలు కల్లలై..

తెలంగాణ రాష్ట్రం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటంలో తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన యువతి దుర్మరణం పాలైంది.

కడలిలోకి 47,411 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 47,411 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి మొత్తం 12,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

పట్టాభిరామ్ మనవారే..

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మరణంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. పట్టాభిరామ్‌కు ఈ జిల్లాతో విడదీయరాని అనుబంధమే ఉంది. ఉమ్మడి జిల్లాలోని కె.గంగవరం మండలం దంగేరులో ఆయన పూర్వీకులు నివాసం ఉండేవారు. అక్కడ నుంచి ద్రాక్షారామ సమీపంలోని దొడ్డంపేటలో తల్లిదండ్రులతో కలిసి నివాసముండగా పట్టాభిరామ్ రామచంద్రపురంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించారు. ఉన్నత చదువుల కోసం కాకినాడ వచ్చి అక్కడి పీఆర్ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. కాలి వైకల్యంతో ఉన్న ఆయన ఆ లోపం కనపడకుండా ఉండేందుకు.. తండ్రి రావు సాహెబ్ భావరాజు సత్యనారాయణ సూచన మేరకు ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబీ రావ్ వద్ద ఇంద్రజాలంలో శిక్షణ పొందారు. అక్కడ నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. కాకినాడ నుంచి హైదరాబాద్‌లో భారత ఆహార సంస్థ ఉద్యోగిగా ఉంటూ అనేక ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తూ జిల్లా పేరు ప్రతిష్ఠలను రాష్ట్రవ్యాప్తం చేశారు. ఇంద్రజాలంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై అనేక పుస్తకాలు రాశారు. ఇంద్రజాలం అంటే ఒక వినోదం మాత్రమే కాదని, మూఢనమ్మకాలపై పరోక్షంగా ఒక యుద్ధాన్ని చేశారు. 1949లో జన్మించిన పట్టాభిరామ్ 75 ఏళ్ల వయసులో ఖైరతాబాద్‌లో మృతి చెందడంతో ఈ ప్రాంత వాసులు ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: స్థానిక శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారికి పెద్ద సంఖ్యలో భక్తులు మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం, షష్ఠి కలసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అభిషేకాల అనంతరం స్వామివారికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యాన అన్నసమారధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఈఓ రామలింగ భాస్కర్ ఆధ్వర్యాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కమిటీ ప్రతినిధులకు విరాళం అందిస్తున్న దాత

అమలాపురం టౌన్: పురాతన దేవస్థానమైన అమలాపురం భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రమూర్తి స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన జీవీఎంఎం సేవా ట్రస్ట్ చైర్మన్ గుళ్లపల్లి సత్యనారాయణ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దేవస్థానం వద్ద దాత గుళ్లపల్లి సత్యనారాయణ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులకు ఈ విరాళాన్ని మంగళవారం అందించారు. తన తల్లిదండ్రులు దివంగత గుళ్లపల్లి వెంకట్రామయ్య, మహాలక్ష్మమ్మ, తన భార్య దివంగత కామేశ్వరి సంస్మరణార్థం విరాళం అందజేసినట్టు సత్యనారాయణ తెలిపారు.

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమలాపురం మండలం ఇందుపల్లిలోని ఎ–కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం జరగనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరవుతున్న ఉభయ గోదావరి జిల్లాల పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు పార్టీ శ్రేణులు భారీఎత్తున స్వాగతం పలకాలని విజ్ఞప్తి చేశారు.

నత్తనడకన సా..గుతూ..

- ఖరీఫ్ వ్యవసాయంలో ఎడతెగని జాప్యం
- వరి సాగు లక్ష్యం 76,941 హెక్టార్లు
- ఆకుమడుల అంచనా 3,847 హెక్టార్లు
- ఇప్పటి వరకూ పూర్తయినవి 1,857 హెక్టార్లు
- ఇంకా పడాల్సినవి 1,990 హెక్టార్లు
- కాలువలకు నీళ్లు వదలడంతో సరిపెట్టిన సర్కారు
- పెట్టుబడి కోసం అన్నదాతల ఇక్కట్లు

పెరవలి: ఖరీఫ్ సీజన్ జూన్ ఒకటిన ప్రారంభమవుతుంది. జూలై వచ్చేసరికి వరి ఆకుమడులు పూర్తయి, నాట్లు పడే దశ ప్రారంభం కావాలి. కానీ, జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ వరి సాగు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాధారణంగా రైతులు మే నెలలో దుక్కులు దున్ని పొలాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకుంటారు. జూన్ మొదటి వారంలో కాలువలకు నీరు వదిలిన వెంటనే వరి ఆకుమడులు వేస్తారు. అనంతరం దమ్ములు చేసి, మడులు కట్టి, నాట్లు ప్రారంభిస్తారు. గత ప్రభుత్వ హయాంలో అయితే జూలై రెండో వారం పూర్తయ్యేసరికే నాట్లు ముగిసేవి. కానీ, ఈ ఏడాది పరిస్థితి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ నెలలో దుక్కులు చేసి, జూలై నెలలో ఆకుమడులు వేస్తున్నారు. దీనికి కారణాలు కోకొల్లలు.

సగం కూడా పడని ఆకుమడులు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు 76,941 హెక్టార్లలో జరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. దీనికి 3,847 హెక్టార్ల మేర ఆకుమడులు అవసరం. ఇందులో ఇప్పటి వరకూ 1,857 హెక్టార్లలో (సుమారు 48 శాతం) మాత్రమే రైతులు ఆకుమడులు వేశారు. ఇంకా 1,990 హెక్టార్లలో నారు పోయాల్సి ఉంది. జిల్లాలోని కొన్ని మండలాల్లో పదెకరాల్లో కూడా ఆకుమడులు పడలేదు. ఉదాహరణకు కడియం మండలంలో 107 హెక్టార్ల ఆకుమడులు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 8 హెక్టార్లలో మాత్రమే పడ్డాయి. ఇటువంటి పరిస్థితుల్లో సకాలంలో పంట పూర్తయి, సజావుగా చేతికొస్తుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి ఎలా..?

ఏటా ఖరీఫ్ ఆకుమడులు జూన్ నెలలో వేసేవాళ్లం. కానీ, ఈ ఏడాది పెట్టుబడికి సొమ్ము లేదు. గత్యంతరం లేక అప్పులు చేసి ఆకుమడులు వేస్తున్నాం. పంట సాగుకు పెట్టుబడి ఎక్కడి నుంచి తీసుకుని రావాలో తెలియడం లేదు.

– వలవల బాలాజీ, వరి రైతు, ముక్కామల

అన్నవరప్పాడులో వేసిన ఆకుమడులు

పిట్టల వేమవరంలో నేటికీ దమ్ములు చేయని వరిచేలు

అందరి వేళ్లూ ప్రభుత్వం వైపే..

సాగు జాప్యానికి సంబంధించి అందరి వేళ్లూ ప్రభుత్వం వైపే చూపిస్తున్నాయి. రైతులు ముందస్తు సాగు ప్రారంభించాలనే పేరుతో ప్రభుత్వం కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు కేవలం నీరు విడుదల చేసి ఊరుకుంది. కానీ, గత రబీలో ధాన్యం అమ్మిన చాలా మంది రైతులకు డబ్బులు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతోంది. మరోవైపు అన్నదాతా సుఖీభవ పథకం కింద ఇస్తామన్న డబ్బులూ ఇవ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో అటు ఆరుగాలం పడిన కష్టానికి ప్రతిఫలం రాక.. ఇటు అప్పులు పుట్టక రైతులు పెట్టుబడి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ప్రభుత్వం బదిలీల ప్రక్రియ కూడా చేపట్టింది. దీంతో, కోరుకున్న చోటు కోసం అధికారులు, సిబ్బంది అధినాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయడంలో బిజీ అయిపోయారు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన పనులను పక్కన పెట్టేశారు. ఒకవేళ ఎవరైనా వెళ్దామనుకున్నా రైతులు ఎక్కడ ధాన్యం డబ్బులు అడుగుతారోననే భయంతో వెనుకంజ వేశారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు కూడా పూర్తి స్థాయిలో అందించలేదు. అలాగే, విత్తనాలు అందుబాటులో ఉంచామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కావలసినంతగా లభ్యం కావడం లేదని రైతులు అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సాగులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఓవైపు సమయం మించిపోతున్న తరుణంలో చేతికి అంది వచ్చే దశలో పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

25 నాటికి 80 శాతం నాట్లు

ఈ ఏడాది అధిక ఎండల కారణంగా జూన్ 15కి పూర్తి కావాల్సిన ఆకుమడులు జూలైలో వేయాల్సి వచ్చింది. ఈ నెల 25వ తేదీ నాటికి 80 శాతం వరి నాట్లు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. బెంగాలీ కూలీల ఊడ్పుల వలన నారు 25 రోజుల అవసరం ఉండదు. కేవలం 14 రోజుల వయస్సు నారుతోనే నాట్లు వేస్తా రు. దీనివలన సమయం ఆదా కావడంతో పాటు మంచి దిగుబడులు వస్తాయి. జూలైలో నాట్లు పడితే నవంబర్ నెలాఖరుకు కో తలు పూర్తవుతాయి. లేకపోతే డిసెంబర్‌లో కోతలకు వస్తే ప్రకృతి వైపరీత్యాల వలన ఇబ్బందులు వస్తాయి. – మాధవరావు జిల్లా వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం

సాగు చేయాలంటే భయంగా ఉంది

ఖరీఫ్ పంట సాగు చేయాలంటే భయం వేస్తోంది. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. రబీలో ధాన్యం కొనుగోలు దగ్గర నుంచి సొమ్ము చెల్లించేంత వరకూ ఏదీ సక్రమంగా చేయలేదు. దీంతో రోడ్డెక్కాం. గతంలో ఇలా ఎన్నడూ చూడలేదు.

– చిట్టీడి వీర వెంకట సత్యనారాయణ, పెరవలి

మండలాల వారీగా ఆకుమడుల వివరాలు (హెక్టార్లలో)

మండలం	సాగు విస్తీర్ణం	ఆకుమడుల లక్ష్యం	వేసిన ఆకుమడులు
రాజమహేంద్రవరం రూరల్	1,460	73	8
కడియం	2,137	107	8
రాజానగరం	4,687	234	15
అనపర్తి	3,739	187	100
బిక్కవోలు	6,113	306	200
కోరుకొండ	5,755	288	30
గోకవరం	5,195	260	25
సీతానగరం	5,710	286	150
రంగంపేట	2,815	141	25
చాగల్లు	3,421	171	160
దేవరపల్లి	3,657	183	100
గోపాలపురం	4,216	211	101
కొవ్వూరు	4,507	255	200
నిడదవోలు	7,253	363	300
పెరవలి	3,319	166	130
తాళ్ళపూడి	3,787	189	100
ఉండ్రాజవరం	4,923	246	130
నల్లజర్ల	4,247	212	35

ప్రభుత్వం సొమ్ము ఇవ్వకే..

ఇప్పటికీ రబీ ధాన్యం సొమ్ము అందకపోవడంతో ఖరీఫ్ సాగు పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి రావలసిన సొమ్ము రాకపోవడమే సాగు జాప్యానికి కారణం.

– లొల్ల నాగేశ్వరరావు, వరి రైతు, కొత్తపల్లి అగ్రహారం

పోలవరంపై సీఎం పచ్చి అబద్ధాలు

- డయాఫ్రం వాల్ నాశనానికి చంద్రబాబే కారణం
- జగన్ హయాంలో గేట్లు సహా అత్యధిక శాతం పనులు పూర్తి
- వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి (కొవ్వూరు): పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండిపడ్డారు. తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం జరిగిన పర్యటన సందర్భంగా సీఎం చేసిన ప్రసంగంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో కుడి, ఎడమ కాలువలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దాదాపు పూర్తి చేశారని గుర్తు చేశారు. అనంతరం 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో కేవలం ఒక గేటు పెట్టి, ప్రాజెక్టును చూడటానికి జనాన్ని బస్సుల్లో తరలించి, వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృథా చేశారని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుకు అన్ని గేట్లూ పెట్టారని, ప్రాజెక్టు నిర్మాణం చాలా వరకూ పూర్తి చేశారని చెప్పారు. దీనిని కావాలనే విస్మరించి, జగన్ హయాంలో కేవలం 4 శాతం పనులే జరిగాయని చంద్రబాబు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఏడాదిలో 6 శాతం పనులు పూర్తి చేశామంటున్నారని, అదే సమయంలో ప్రాజెక్టు 82 శాతం పూర్తయ్యిందంటున్నారని, అటువంటప్పుడు ఇదంతా ఎవరి హయాంలో జరిగినట్లని వెంకట్రావు ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నాశనమవడానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. పోలవరం సందర్శనకు రూ.500 కోట్ల ప్రజాధనం వృథా చేశారన్నారు. చంద్రబాబుకు డబ్బులు, క్రెడిట్ దక్కించుకోవడం తప్ప పోలవరం ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభంలో శీనయ్య కమిటీ రెండు డయాఫ్రం వాల్స్ కట్టాలని సూచించినప్పటికీ చంద్రబాబు ఒక్కటి మాత్రమే నిర్మించారని విమర్శించారు. అది కూడా ఒకచోట 52 మీటర్లు, మరోచోట 92 మీటర్ల మేర ఇష్టారాజ్యంగా నిర్మించారని చెప్పారు. డయాఫ్రం వాల్ పునాది కచ్చితంగా హార్డ్ రాక్ వరకూ వెళ్లాలని అధికారులు సూచించినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. అందువల్లనే నేడు ఈ దుస్థితి నెలకొందని, చేసిన తప్పు ఒప్పుకొని లెంపలేసుకోవాల్సింది పోయి, ఆ తప్పును జగన్‌పై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

> పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతం పైగా పూర్తి చేశామని 2024 జూన్‌లో చెప్పారు. పోలవరం అంచనా రూ.55,549 కోట్లు అయినప్పుడు రూ.13,683 కోట్లు అంటే 24 శాతం ఖర్చు చేసి 72 శాతం పూర్తి చేశానని ఎలా అన్నారు? అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. జనాన్ని నమ్మించడానికే ఈ కట్టు కథలు చెబుతున్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.కోట్లు దుర్వినియోగం

గత ప్రభుత్వంలో ప్రతి నెలా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తే.. నేడు ప్రతి నెలా చంద్రబాబు తన ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండానే అమలు చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో కొత్త పథకాలు ప్రారంభించడానికి మాత్రమే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభలు పెట్టేవారని, కానీ నేడు ప్రతి దానినీ చంద్రబాబు ప్రచారార్భాటానికి వాడుకుంటున్నారని విమర్శించారు. రాజకీయాల్లో రౌడీలు ఉన్నారంటున్నారని, ఆయన పార్టీలో ఎంత మంది రౌడీలున్నారని ప్రశ్నించారు. పైగా ఇసుక, మద్యం, మట్టి, మైనింగ్ మాఫియాలుగా మారి ప్రజాధనాన్ని దోచుకుంటున్నది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంపై దాడులు చేసి కేసులు పెడుతున్నది ఈ ప్రభుత్వం కాదా అని వెంకట్రావు నిలదీశారు.

అరుణాచలానికి 8న ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గురు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 8న జిల్లాలోని మూడు డిపోల నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, ఏలేశ్వరం, తుని డిపోల నుంచి ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. కాణిపాకం, శ్రీపురం దర్శనానంతరం అరుణాచలం చేరుతాయన్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి దర్శనానంతరం ఈనెల 11న ఆయా డిపోలకు తిరిగి వస్తాయన్నారు. పూరీ జగన్నాథ రథయాత్రకు వెళ్లేందుకు స్పెషల్ బస్సులు సిద్ధం చేశామన్నారు.

వాహనాల ఫిట్‌నెస్ టెస్టులు ప్రైవేటు పరం చేయొద్దు

- నిర్ణయం ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజానగరంలోని వాహనాల ఫిట్‌నెస్ పాయింట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజానగరం: రవాణా వాహనాల ఫిట్‌నెస్ (బ్రేక్) టెస్టులను రాష్ట్ర రవాణా శాఖ నుంచి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వివిధ రవాణా వాహన కార్మిక సంఘాల ప్రతినిధుల జేఏసీ కన్వీనర్లు వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్‌ల ఆధ్వర్యాన స్థానిక ఫిట్‌నెస్ టెస్టింగ్ పాయింట్ వద్ద మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలోని హైటెక్ బస్ షెల్టర్ నుంచి నిరసనకారులు ఆటోల్లో ఊరేగింపుగా ఇక్కడకు చేరుకుని, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రవాణా శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటోందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా, వివిధ రకాల పన్నులతో ఆర్థిక భారం మోపుతోందన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అనుసరించడమే కాకుండా, స్వార్థ రాజకీయాలతో ప్రతిపక్షాలపై పోలీసు జులుం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో కరెంటు బిల్లు నెలకు రూ.600 నుంచి రూ.700 వస్తే, కూటమి సర్కారులో రూ.1,500 నుంచి రూ.3 వేలు వస్తోందని, ప్రజలపై పడుతున్న ఆర్థిక భారానికి ఇది ఒక ఉదాహరణని చెప్పారు. అన్నదాతల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందన్నారు. అలాగే, ఆటో, వ్యాన్, కారు, లారీ నడుపుతూ, రోజువారీ సంపాదనతో జీవనం సాగిస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఎటువంటి సాయమూ చేయడం లేదని, పైగా ఆయా వాహనాల ఫిట్‌నెస్ ప్రక్రియను పరుల పరం చేసి, ఫీజుల భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా, తక్కువ మందితోనే నిరసన తెలపాలంటూ ప్రజాస్వేచ్ఛను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలోనే ఇంతటి దారుణ పరిస్థితులుంటే మిగిలిన నాలుగేళ్లలో ఎంతటి ఘోరాలు ఎదుర్కోవలసి వస్తుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమేదో ప్రజలే తెలుసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి చేసే పోరాటాలకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరత్‌రామ్ చెప్పారు.

స్మార్ట్ మీటర్లు పగులగొట్టండి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగించినప్పుడు నారా లోకేష్ వాటిని పగులగొట్టాలన్నారని, ఆయన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని నగరంలో బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రజలు పగులగొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారుల గొంతు కోయడానికి అదానీ, శిరిడి సాయి కంపెనీల లాభాల కోసమే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. గతంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించాయని, ఇప్పుడు ఎలా స్వాగతిస్తున్నాయని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల కారణంగా ఏటా రూ.50 కోట్ల భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5న జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని ప్రజలకు మధు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కమిటీ సభ్యులు లావణ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

టెండర్ ఖరారు రేపే..

- ప్రముఖ దేవాలయాలకు గత ఏప్రిల్‌లో నోటిఫికేషన్
- దానిని రద్దు చేసి మళ్లీ జూన్ 12న రీటెండర్
- కొత్త షరతుల ప్రకారం రూ.80 లక్షలకు పెరిగే అవకాశం

అన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సహా, రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు శానిటరీ మెటీరియల్, క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్‌డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది. దీని ప్రైస్ బిడ్‌ను విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం తెరవనున్నారు. సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా, విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్, ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయ్యాయి. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి, లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన వారికి టెండర్ ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.

గత టీడీపీ ప్రభుత్వంలో 'పద్మావతి'కి టెండర్

కాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య రాష్ట్రంలో అన్నవరం దేవస్థానం సహా, పలు దేవస్థానాల్లో శానిటరీ టెండర్‌ను పద్మావతి సంస్థ దక్కించుకుంది. మొదట రెండేళ్ల కాల పరిమితికి టెండర్ దక్కించుకున్న ఈ సంస్థకు, తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం మరో రెండేళ్లు కాంట్రాక్ట్ పొడిగించింది. ఇప్పుడు మరలా అదే సంస్థ టెక్నికల్ బిడ్‌లో క్వాలిఫై కావడంతో, మరలా ఆ సంస్థకే టెండర్ దక్కే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పద్మావతి సంస్థ యజమాని భాస్కరనాయుడు టీడీపీ పెద్దలకు సన్నిహితుడు కావడమే కారణంగా చెబుతున్నారు.

ప్రముఖ దేవస్థానాల్లో రీ టెండర్

గత ఏప్రిల్ నెలలో పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌పై టెండర్‌దారులు అనేక సందేహాలను వ్యక్తం చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం దానిని రద్దు చేసింది. కొన్ని మార్పులతో కొత్త నోటిఫికేషన్‌ను జూన్ 12న విడుదల చేసింది. టెండర్‌దారులు తమ కొటేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీ జూన్ 26గా నిర్ణయించారు. మొత్తం 23 మంది టెండర్ కోసం పోటీ పడినా, వివిధ కారణాలతో 21 మంది తప్పుకొన్నారు. చివరకు చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థలు ప్రైస్ బిడ్‌కు ఎంపికయ్యాయి.

ఏడు దేవస్థానాల్లో శానిటరీ నిర్వహణ

టెండర్ దక్కించుకున్న సంస్థ రెండేళ్ల కాల పరిమితిలో అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గ గుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో పారిశుధ్య పనులు, వివిధ సత్రాల్లో హౌస్ కీపింగ్, రహదార్లు, టాయిలెట్స్ క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనులు నిర్వహించాల్సి ఉంది.

గత ప్రభుత్వ హయాంలో విడివిడిగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దేవస్థానాల వారీగా శానిటరీ టెండర్లు ఖరారు చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని పది నెలలు జాప్యం చేసింది. ఒకే యూనిట్‌గా టెండర్లు నిర్వహించాలని గతేడాది ఆగస్టు 27న కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కాంట్రాక్ట్ ముగిసి ఆరు నెలలైనా..

అన్నవరం దేవస్థానంలో శానిటరీ విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్ట్ గతేడాది నవంబర్‌తో ముగిసింది. ఆ కాంట్రాక్ట్ ముగియడానికి ఒక నెల ముందుగానే గత అక్టోబర్‌లో టెండర్ విడుదల కావాల్సి ఉంది. టెండర్లు ఆలస్యం కావడంతో, దేవస్థానం కోరిక మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. మార్చి ఒకటి నుంచి తాము విధులు నిర్వహించలేమని దేవస్థానానికి లేఖ సమర్పించారు. దీంతో టెండర్ పిలవకుండానే గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్ సంస్థకు తాత్కాలికంగా పనులు అప్పగించారు.

పెరగనున్న కాంట్రాక్ట్..?

గత నవంబర్‌తో ముగిసిన కేఎల్‌టీసీ సంస్థ శానిటరీ టెండర్ నెలకు రూ.49 లక్షలు. దేవస్థానం కనకదుర్గా ఏజెన్సీకి నెలకు రూ.59 లక్షలు జీతాలుగా చెల్లిస్తున్నారు. రూ.12 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. మొత్తం నెలకు రూ.71 లక్షలు ఖర్చు చేస్తున్నారు. తాజాగా అన్ని దేవస్థానాలకు కలిపి సెంట్రలైజ్డ్ టెండర్‌లో అత్యాధునిక మెషినరీలు ఉపయోగించాలనే షరతు విధించారు. శానిటరీ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం జీతాల చెల్లింపుతో పాటు, వారాంతపు సెలవుల్లో సిబ్బంది రిలీవర్స్‌గా కొంతమందిని నియమించనున్నారు. ఏసీలు, విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కూడా కలిపారు. ఫలితంగా దేవస్థానంలో నెలకు శానిటరీ కాంట్రాక్ట్ రూ.80 లక్షలకు పైమాటే అంటున్నారు.

రత్నగిరిపై ఆలయ ప్రాంగణం శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద రవాణా జేఏసీ ధర్నా

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

అమలాపురం రూరల్: రవాణా శాఖాధికారులను పక్కనపెట్టి, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ ప్రైవేట్ ఏజెన్సీలు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా రవాణా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రవాణా జేఏసీ జిల్లా కో–ఆర్డినేటర్, ఆంధ్రా ఆటో వాలా జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల మోటారు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ చేయడానికి జిల్లా రవాణా అధికారులను విస్మరించి, ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల వాహన యాజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. యాంత్రీకరణ విధానం నిలిపి, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా జేఏసీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సదస్సు ఈ నెల 4న అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 9న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. రవాణా జేఏసీ జిల్లా కన్వీనర్ రాగుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు పోలిశెట్టి సీతారాంబాబు, బొంతు బాలరాజు, యాళ్ల వెంకటేశ్వరరావు, ఎల్లమెల్లి పెద్దా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14 నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ

విజయనగరంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ

సామర్లకోట: తూర్పుగోదావరి జిల్లాలోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో శిక్షణ ఉంటుందని శిక్షణా కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ ఎ.రవిశంకర్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని ఎంపీటీసీ సభ్యులకు సామర్లకోట ఈటీసీలోనే శిక్షణ ఇవ్వాలని తొలుత నిర్ణయించారని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈటీసీ సిబ్బంది ఆయా జిల్లాలకు వెళ్లి శిక్షణ ఇవ్వాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. దాంతో ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు మంగళవారం శిక్షణ ప్రారంభించినట్టు వివరించారు. కోర్సు డైరెక్టర్‌గా కేఆర్ నిహారిక, ఫ్యాకల్టీలు వి.జగన్నాథం, ఖాజా మొహీద్దీన్ శిక్షణ ఇస్తారన్నారు. రెండో తేదీ నుంచి శ్రీకాకుళం జిల్లా మహిళా ప్రాంగణంలో, ఎనిమిదో తేదీ నుంచి విశాఖపట్నంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో, పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో శిక్షణ ఉంటుందన్నారు.

నెల రోజులు సెక్షన్-30 అమలు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌లో నెల రోజుల పాటు సెక్షన్–30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మంగళవారం ఇక్కడ వెల్లడించారు. అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ల పరిధిల్లో ఈ నెల 31 వరకూ ఈ సెక్షన్ వర్తిస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాంటి కార్యకలాపాలు జరపడానికి ముందుగా తన అనుమతి పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రెండు పొక్లెయిన్లు సీజ్

మానేపల్లిలంకలో సీజ్ చేసిన పొక్లెయిన్ వద్ద ఆర్డీఓ, తహసీల్దార్

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లిలంకలో అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న రెండు పొక్లెయిన్లను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ మంగళవారం సీజ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని యర్రంశెట్టివారిపాలెం, పెదకందాలపాలెం, మానేపల్లిలంకలో ర్యాంపులను తహసీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. మానేపల్లిలంకలో ఉన్న పొక్లెయిన్లను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 15 వరకూ జిల్లాలో ఎక్కడా మట్టి, ఇసుక తవ్వకాలు జరపరాదని కలెక్టర్ ఆదేశించారన్నారు. అక్రమ తవ్వకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాంపుల్లోకి లారీలు, ట్రాక్టర్లు వెళ్లకుండా బాటలను కట్ చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయా ర్యాంపుల్లో ఎంత మేరకు అక్రమ తవ్వకాలు జరిపారో డ్రోన్ల ద్వారా సర్వే చేయించి, సంబంధిత వ్యక్తులకు డిమాండ్ నోటీసులు పంపిస్తామని ఆర్డీఓ చెప్పారు.

లారీని ఢీకొన్న గూడ్స్ ఆటో

జొన్నాడకు చెందిన డ్రైవర్ మృతి

సూరిశెట్టి శ్రీధర్ (ఫైల్)

కిర్లంపూడి: ఆగి ఉన్న లారీని గూడ్స్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్(43) గూడ్స్‌ఆటోలో విశాఖపట్నానికి పువ్వుల లోడుతో కిరాయికి వెళ్లాడు. అక్కడి నుంచి న్యూస్ పేపర్ల లోడును వేసుకుని రాజమండ్రికి తిరిగొస్తుండగా, మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మరణించాడు. అతడి సోదరుడు సూరిశెట్టి గంగాజలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గ్రామంలో తీవ్ర విషాదం

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో సూరిశెట్టి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన శ్రీధర్ 12 ఏళ్లుగా జొన్నాడలో నివసిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యజమాని శాశ్వతంగా దూరం కావడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ఇక తమకు దిక్కెవరంటూ మృతదేహం వద్ద కుటుంబీకులు రోదించిన తీరు చూపరులను కలచివేసింది. బంధువులు విషాదంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పిఠాపురానికి చెందిన చాగంటి వీరవెంకట భీమ మల్లికార్జున శర్మ(39) మృతి చెందారు. కాకినాడ జయేంద్రనగర్ ఎస్‌బీఐ ఈ–కార్నర్ వద్ద రోడ్డుపై సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, రాత్రి 11.45 సమయంలో మల్లికార్జున శర్మ స్నేహితుడికి సెల్‌ఫోన్ ద్వారా స్థానికులు ప్రమాద సమాచారాన్ని తెలిపారు. స్నేహితుడు మంత్రిప్రగడ సుబ్బారావు అక్కడకు చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న మల్లికార్జున శర్మను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడు మల్లికార్జున శర్మ తండ్రి వీరేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మోటార్ సైకిల్‌పై స్నేహితులను కలిసేందుకు కాకినాడ వెళ్లిన కుమారుడు శవమయ్యాడని, ఏకైక కుమారుడిని కోల్పోయామని తండ్రి వీరేశ్వరరావు విలపించారు. ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కలెక్షన్ విభాగంలో మల్లికార్జున శర్మ పని చేస్తూ ఇటీవల ఉద్యోగం మానేశాడు.

కలలు కల్లలై..

- కెమికల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో చాగల్లు యువతి దుర్మరణం
- ప్రసన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు
- ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఆమె అత్త కొడుకు

పొలిశెట్టి ప్రసన్న (ఫైల్)

చాగల్లు: బాగా చదువుకుంది. జీవితంలో ఏదో సాధించాలనే తపనతో ఉద్యోగంలో చేరింది. చిరుద్యోగులైన తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకుంది. తానొకటి తలిస్తే.. విధి ఒకటి తలచిందని.. ఉద్యోగంలో చేరిన రెండు నెలలకే ఆమెను మృత్యువు కబళించింది. ఆమె ఆశలన్నీ కల్లలయ్యాయి.

తెలంగాణలో పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో చాగల్లుకు చెందిన యువతి మృతి చెందడంతో చాగల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పొలిశెట్టి శ్రీనివాసరావు కుమార్తె ప్రసన్న(22) ఈ దుర్ఘటనలో మృతి చెందింది. రెండు నెలల క్రితమే ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా ఉద్యోగంలో చేరిన ప్రసన్న మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి శ్రీనివాసరావు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, అనాథ పిల్లల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రామలక్ష్మి ఆశా కార్యకర్తగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ప్రసన్న కాగా, చిన్న కుమార్తె ప్రభుకుమారి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతుంది.

ప్రాణాపాయం నుంచి తప్పించుకుని..

ప్రసన్న అత్త కొడుకు కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన యాతం మహేష్ సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రసన్న కూడా రెండు నెలల క్రితమే అదే ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ పనిపై మహేష్ బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. దుర్ఘటన విషయం తెలుసుకుని.. అదే సమయంలో డ్యూటీలో ఉన్న ప్రసన్న కూడా ప్రమాదానికి గురైందని గ్రహించి ఆమె తల్లిదండ్రులకు మహేష్ సమాచారం అందించాడు. సోమవారం సాయంత్రం శ్రీనివాసరావు, రామలక్ష్మి హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఎన్నో ఆశలతో..

దుర్ఘటనలో మృతిచెందిన ప్రసన్న బీ–ఫార్మసీ చదివింది. ఉన్నత చదువు అభ్యసించి జీవితంలో మంచి స్థానం సాధించాలని ఆశించింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో స్టైఫండ్ తీసుకుంటూ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగంలోకి చేరింది. ఎం–ఫార్మసీ చేయాలన్న తపనతో ఓ శిక్షణ సంస్థలో కూడా చేరింది. ఇదే విషయాన్ని దుర్ఘటనకు ముందురోజు ఆమె తల్లితో ఫోన్‌లో చెప్పింది. తాను ఎం–ఫార్మసీ చదివేందుకు ఫీజు చెల్లించానని ఆనందం పంచుకుంది. సోమవారం సాయంత్రం ఏడు గంటల నుంచి జరిగే క్లాసులకు వెళుతున్నానని తల్లికి చెప్పింది. ఎంతో ఆనందాన్ని పంచుకున్న కుమార్తె తమను విషాదంలో విడిచి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు రోదించారు.

కన్నీరుమున్నీరైన చెల్లెలు

చిన్ను(ప్రసన్న) కుటుంబ సభ్యులందరితో కలివిడిగా ఉండేదని, తామిద్దరం అక్కాచెల్లెలైనా.. స్నేహితుల్లా కలిసిమెలిసి ఉండేవాళ్లమని ప్రసన్న చెల్లెలు ప్రభుకుమారి కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. ప్రసన్న ఇంటి వద్ద బంధువుల రోదనలు హృదయవిదారకంగా మారాయి.

700 లీటర్ల డీజిల్ పట్టివేత

వాహనం, నిందితులతో పోలీసులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న 700 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న పాలకొల్లుకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. ట్రాక్టర్‌తో పాటు, 700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట: జగ్గంపేట శివారు గుర్రంపాలెం రోడ్డులో పోలవరం కాలువ వద్ద పేకాట శిబిరంపై జగ్గంపేట పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.ఈ దాడిలో రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఎస్సై రఘునాథరావు, సిబ్బంది దాడులు నిర్వహించినట్టు తెలిపారు.

కనకాయలంక కాజ్ వే వద్ద వంతెన నిర్మాణం

రూ.22.83 కోట్లకు పరిపాలనా ఆమోదం

కనకాయలంక కాజ్ వేపై వరద నీటిలో వస్తున్న విద్యార్థినులు(ఫైల్)

పి.గన్నవరం: కొద్దిపాటి వరదకే కాజ్ వే నీటమునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక గ్రామ ప్రజలకు వరద కష్టాలు తీరనున్నాయి. మండలంలోని చాకలిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న కనకాయలంక కాజ్ వే వద్ద హై లెవెల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.22.83 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చినట్టు గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ (ధవళేశ్వరం) ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ తెలిపారు. కనకాయలంక, చాకలిపాలెం (వశిష్ట ఎడమ ఏటిగట్టు) గ్రామాలను కలుపుతూ వశిష్ట నదిపై వంతెన నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. రూ.24 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, రూ.22.83 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కనకాయలంక గ్రామంలో సుమారు మూడు వేల మంది నివసిస్తున్నారు. వారి జీవన విధానం తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలంతో ముడిపడి ఉంది. నిత్యం కాజ్ వే దాటి పి.గన్నవరం మండలానికి వస్తుంటారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తే కనకాయలంక కాజ్ వే మునిగిపోతోంది. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో కాజ్ వే దాటి వస్తుంటారు. వరద నీరు మరీ ఎక్కువైతే పడవలపై ప్రయాణిస్తారు. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే కనకాయలంక గ్రామాల ప్రజల వరద కష్టాలు తీరతాయి.

పెదలంక వద్ద వంతెన

అలాగే వరద సమయాల్లో ప్రజల రాకపోకల కోసం వశిష్ట ఎడమ ఏటిగట్టు నుంచి యలమంచిలి మండలం పెదలంకకు రూ.80.8 లక్షలతో సింగిల్ లైన్ రోడ్డు వంతెనకు కూడా పరిపాలనా ఆమోదం లభించినట్టు ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు. టెండర్లు పూర్తయిన తర్వాత ఈ వంతెన పనులు ప్రారంభమవుతాయని ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ వివరించారు.

పరిమళించిన మానవత్వం

- మురుగు కాలువలో మతిస్థిమితం లేని మహిళ దైన్యం
- రెండు రోజుల తర్వాత ఆస్పత్రికి తరలింపు

కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద మురుగు కాలువలో కూర్చున్న యువతి

కోరుకొండ: ఏం చేస్తుందో ఆమెకు తెలియడం లేదు. ఎండైనా.. వానొచ్చినా మురుగు కాలువలోకి దిగి గంటల తరబడి ఉండిపోతోంది. ఎట్టకేలకు కొందరు చొరవ చూపడంతో.. ఆమెను కాపాడి ఆస్పత్రికి తరలించారు. మతిస్థిమితం లేని ఓ యువతి దయనీయ స్థితిలో మురికి కాలువలోనే రెండు రోజుల పాటు గడిపిన హృదయ విదారక సంఘటన కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో, కోరుకొండలో ఆమె సంచరిస్తోంది. మతి స్థిమితం లేకపోవడంతో ఎవరైనా పెట్టింది తిని కాలం వెళ్లదీస్తోంది. రెండు రోజుల నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్‌ను ఆనుకుని ఉన్న మురుగు కాలువలోకి దిగి, మళ్లీ బయటకు వస్తోంది. దుర్వాసన వస్తున్నా.. వ్యర్థాల మధ్యే రెండు రోజులుగా ఇలా చేస్తుండడాన్ని స్థానికులు గమనించారు. ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు ఈ కాలువ నుంచే గోదావరి నదిలోకి వెళ్తుంది. కొన్ని రోజులుగా కాలువకు వర్షపు నీరు రాకపోవడంతో ఆమెకు ఎటువంటి అపాయం కలగలేదు. కొందరు స్థానికులు ఈ విషయాన్ని పంచాయతీ వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆమెను కాలువ నుంచి బయటకు తీసుకొచ్చారు. సైగలు చేస్తూ, పొడిపొడిగా మాట్లాడుతూ ఆమె భయంగా ఉంటోంది. పారిశుధ్య కార్మికులు జలడుగుల చిన్నపార్వతి, సోమాజుల బంగారమ్మ, రాజమహేంద్రవరానికి చెందిన డివైన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

ల్యాండ్ కావలెను

■ రియల్ ఎస్టేట్ రంగంలో రెండు రాష్ట్రాల్లో అగ్రగామిగా ఉన్న ప్రముఖ సంస్థకు రాజమండ్రిలో డెవలప్‌మెంట్‌కొరకు లేఅవుట్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించుటకు ల్యాండ్ కావలెను. సంప్ర : 90591 13819 [V- 2828]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2640]

జ్యోతిష్యాలయం

■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు –40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ ప్రముఖ గ్యాస్ ఏజెన్సీలో డోర్ టూ డోర్ సర్వే చేయుటకు యువతీ యువకులు కావలెను. జీతం: 18000. సంప్ర: 9121515459 [SCA25005832]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
ఏలూరు
బుధవారం ౹ 2 ౹ జూలై ౹ 2025

వయ్యారిభామతో ముప్పు
రైతులు తెగుళ్ల కంటే అధికంగా భయపడేది వయ్యారి భామ కలుపు మొక్కకే. ఈ మొక్క నెల రోజుల్లోనే పూతకు వచ్చి.. 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. 10లో ▸

నయనానందకరం.. రథోత్సవం
ఏలూరు నగరంలో జగన్నాథుడి రథోత్సవం వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు నృత్యాలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ రథం వెంట నడిచారు. 10లో ▸



పిడుగులతో అప్రమత్తం
వర్షాకాలంలో పిడుగుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాణాపాయంతో పాటు గృహోపకరణాలు కాలిపోయే ముప్పు ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 10లో ▸

అరకొరగా మందు బిళ్లలు

- ప్రభుత్వ ఆస్పత్రులకు పూర్తిస్థాయిలో అందని వైనం
- మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్న రోగులు
- అలంకార ప్రాయంగా హెల్త్ క్లినిక్‌లు
- గత ప్రభుత్వంలో అందుబాటులో అన్ని రకాల మందులు
- జగనన్న సురక్ష శిబిరాలతో చెంతకే మందులు

సాక్షి, భీమవరం: వృద్ధుల్లో రక్తపోటు అదుపునకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ఎటన్‌లాల్ 50 మాత్రలను ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు. గతంలో పీహెచ్‌సీలకు క్రమం తప్పకుండా ఈ మాత్రలు సరఫరా జరిగేవి. కొన్ని నెలలుగా వీటి పంపిణీ అంతంత మాత్రంగానే ఉండడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నొప్పులు తగ్గేందుకు వినియోగించే ప్రిగాబ్లిన్ టాబ్లెట్లు, రోగికి సత్తువ కోసం పెట్టే మెట్రోజిల్ సెలైన్లు, జ్వరాలు, నొప్పులకు వివిధ రకాల వ్యాధులను తగ్గించేందుకు వినియోగించే పారాసిటమాల్ 500 ఎంజీ, ఇన్సులిన్, అమాక్సిలిన్ టాబ్లెట్స్, అమాక్సిలిన్ ఇంజెక్షన్లు, సిట్రజన్, సిల్వర్ ఎక్స్ తదితర మందులది అదే దారి. ఏ రకం మందులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర మందులతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తోంది. జిల్లాలో ఒక జిల్లా ఆరోగ్య కేంద్రం, మూడు సీహెచ్‌సీలు, ఐదు ఏరియా ఆస్పత్రులు, 34 వరకు పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీల వరకూ ఉన్నాయి. రోజుకు 15,500 వరకూ ఓపీ నమోదవుతుంది. ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులను వైద్యారోగ్య శాఖ అందిస్తుంది. కొంతకాలంగా క్వార్టర్ కోటా విడుదలతో ప్రభుత్వం కోత పెడుతోంది. మూడు నెలలకు అవసరమైన డ్రగ్స్‌తో ఇండెంట్ పెడుతుండగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి పూర్తిస్థాయిలో మందులు రావడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. గతంతో పోలిస్తే మందులకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి.

పత్తాలేని సురక్ష శిబిరాలు

జగనన్న సురక్ష ద్వారా పేద వర్గాల వారికి రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్ట్ వైద్యసేవలు పొందే సౌలభ్యాన్ని గత ప్రభుత్వం కల్పించింది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, అవసరాన్ని బట్టి మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించేవారు. జిల్లాలోని విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచేవారు. స్పెషలిస్ట్ వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది వైద్యసేవలు అందించేవారు. పేదలకు వైద్య భరోసా కల్పించిన ఈ శిబిరాల నిర్వహణను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. గత ప్రభుత్వంలో తమ సమీప ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యసేవల్ని ఉచితంగా పొందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పుడు వాటి కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

కొన్ని మందులు నిలిపివేసిన ప్రభుత్వం

పీహెచ్‌సీలకు 172 రకాలు ఉంచాల్సి ఉండగా కొన్ని మందులను నిలిపివేసిన వైద్య ఆరోగ్యశాఖ మరికొన్ని అరకొరగానే అందజేస్తోంది. సీహెచ్‌సీల్లో 325 రకాల మందులకు 240 రకాలనే సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు మందుల పంపిణీ అరకొరగానే ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యాధిని నయం చేసేందుకు సరైన డ్రగ్ లేక బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటోందని రోగులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన సర్వేలో ఉచిత మందులు సక్రమంగా అందడం లేదని 46 శాతం చెప్పగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలపై 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం.

అలంకారప్రాయంగా హెల్త్ క్లినిక్‌లు

సాధారణంగా యూనివర్శల్ (యూ), సబ్ డివిజనల్ (ఎస్), టెరిసరీ (టి) కేటగిరీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు మందుల కేటాయింపు చేస్తుంటారు. స్థాయిని బట్టి అలాట్‌మెంట్, బడ్జెట్ కేటాయింపులుంటాయి. రోజువారీ ఓపీ అధికశాతం నమోదయ్యే పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో మందుల సరఫరా జరగక వీటికి అనుబంధంగా పనిచేసే హెల్త్ క్లినిక్‌లోనూ మందుల కొరత వేధిస్తోంది. హెల్త్ క్లినిక్‌లకు రావాల్సిన మందులు అరకొరగానే సరఫరా అవుతున్నాయి. ఆస్పత్రుల్లో మందులకు కొరత లేదని, అలాట్‌మెంట్ మేరకు పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

వరదను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): గోదావరి వరదను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తు నియంత్రణ కార్యాచరణను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గోదావరి వరద నియంత్రణ, సహాయక చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఫైర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల పేర్లు, అత్యవసర ఫోన్ నెంబర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడులో మొదటి, రెండవ, మూడో వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా పునరావాస కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నెలలు నిండిన గర్భిణీల జాబితాను సిద్ధం చేసి సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా ఏలూరు : జిల్లాలో 140 గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు పూర్తిగా అరికట్టినందున ఏలూరు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా కలెక్టర్ ప్రకటించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ప్రజల్లోకి టోల్ ఫ్రీ నెంబరు 14405పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన : మంగళవారం ఏలూరులో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు.జూలై 1న పింఛన్లు ఏదైనా కారణంతో తీసుకోని వారికి జూలై 2న పంపిణీ చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణ అమానుషం

ఏలూరులో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్ల పాలనలో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ మంగళవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై జులై 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, దుర్గారావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 1,018 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు మొత్తం 1,018 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం పరీక్షకు 180 మందికి గాను 172 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 180 మందికి 180 మంది హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 140 మందికి గాను 140 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 139 మందికి 137 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 200 మందికి 196 మంది హాజరు కాగా, మధ్యాహ్నం సెషన్‌లో 200 మందికి గాను 193 మంది హాజరయ్యారు.

సమ్మెకు మద్దతివ్వాలి

కొయ్యలగూడెం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల తొమ్మిదిన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గంపై బానిసత్వం రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి భారతి కోరారు. అనంతరం బయ్యనగూడెం, పొంగుటూరు, కొయ్యలగూడెం సెక్టార్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలి

ఏలూరు (టూటౌన్): పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. నష్టాలు వస్తున్నాయనే సాకుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారని, దీనిని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. పరిశ్రమపై 300 మంది కార్మికులు, 33 వేల ఎకరాల్లో ఉన్న 1100 మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలో భాగంగానే ఈ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేసినా అక్కడి కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని అదే పద్ధతిలో పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరిస్తే కార్మికులు, రైతులు, ప్రజలు నుంచి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

ఎంపీడీఓల సంఘం కార్యవర్గ ఎన్నిక

భీమవరం అర్బన్: భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎంపీడీఓ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంపీడీఓ సంఘం అధ్యక్షుడిగా బీఎస్ఎస్ కృష్ణ మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్. గంగాధరరావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.స్వాతి, ఎ. శ్రీనివాస్, కోశాధికారిగా సీహెచ్ త్రిశూలఫణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా టీఎస్ మూర్తి, సంయుక్త కార్యదర్శిగా పి.శామ్యూల్‌ను ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ ఎంపీ శ్రీధర్‌తో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏలూరు సమన్వయకర్త జేపీ, పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే కాలంలో ఏలూరు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ.. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాటం చేసి ప్రజలకు అండగా నిలవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరులోని ఆయన ఇంట్లో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏలూరు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి అరాచకాలు, పార్టీ నేతలపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలపై ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కూటమి నేతలు సూపర్ -6 హామీలు అమలు చేయలేక, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు ఏ విధంగా మేలు చేశామనేది ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పాట్లు

రేషన్ లబ్ధిదారులకు కష్టాలు కొనసాగుతున్నాయి. ఒకటో తేదీ వచ్చిందంటే సరకుల కోసం రేషన్ దుకాణాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఇంటి వద్దకే రేషన్ విధానానికి మంగళం పాడి.. షాపు వద్దకు రావాల్సిందే అంటూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వృద్ధులు, దివ్యాంగులు, రోజువారీ కూలీలకు శరాఘాతంగా మారింది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందిస్తుంటే ఇబ్బంది తెలిసేది కాదని, ఇప్పుడు రేషన్ షాపు వద్దే సరకులు తీసుకోవాలనడంతో కూలి పనులు మానుకుని రావాల్సి వస్తోందని రేషన్ కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. ఏలూరులోని పలు చౌక డిపోల వద్ద మంగళవారం ప్రజల అవస్థల దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

ఏలూరు గాంధీ నగర్ రేషన్ డిపో వద్ద బారులు తీరిన జనం

బియ్యం బస్తాతో వృద్ధుల ఇబ్బందులు

ఆనందం ‘ట్రిపుల్’

ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన గ్రామీణ పేద విద్యార్థులు
- కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని సంతోషం

నూజివీడు: రోజువారీ కూలీ కుమారుడు ఒకరు... ఆటో డ్రైవర్ కొడుకు మరొకరు.. తండ్రి లేని నిరుపేద బాలిక ఇంకొకరు.. ఇలా అందరూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే. అద్భుత ప్రతిభ కలిగిన వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతిలో సత్తా చాటారు. గ్రామీణ పేద పిల్లలకు సైతం సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అత్యుత్తమ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందారు. తమ లక్ష్యానికి అనుగుణంగా తొలి అడుగు పడిందనే ఆనందంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు పొందిన కొందరు విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే..

కూలికి వెళ్తూ చదివించారు

మాది ప్రకాశం జిల్లా మార్కాపురం. మా ఊరిలోని ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి చదివా. 591 మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. మా నాన్న కొండయ్య కూలి పనులకు వెళుతూ నన్ను చదివించారు. ట్రిపుల్ ఐటీలో సీటు లభించడం ఎంతో ఆనందంగా ఉంది.

– బొప్పరాజు సాత్విక, మార్కాపురం, ప్రకాశం జిల్లా

ఉన్నత స్థానమే లక్ష్యంగా..

అమ్మ, నాన్న ఇద్దరూ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 590 మార్కులు సాధించా. తల్లిదండ్రుల కష్టాన్ని రోజూ చూస్తుండేవాడిని. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు ఆనందంగా ఉంది. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగడమే లక్ష్యం.

– దామా చైతన్య, నలదలపూర్, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

నా కల నెరవేరింది

మాది ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గొట్టిపడియ. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ శాఖ స్కూల్‌లో చదువుకుని పదో తరగతిలో 580 మార్కులు సాధించా. మా అమ్మ చాలా కష్టపడి నన్ను చదివించింది. ట్రిపుల్ ఐటీలో చేరాలనే నా కల నెరవేరింది. ఎంతో సంతోషంగా ఉంది.

– సాల్వ హిమచంద్రిక, గొట్టిపడియ, ప్రకాశం జిల్లా

సంతోషంగా ఉంది

నా తండ్రి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. బీఎంఆర్ బాలికల హైస్కూల్‌లో చదివి పదో తరగతిలో 587 మార్కులు సాధించాను. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు రావడం సంతోషంగా ఉంది. ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులను ఆనందంగా ఉండేలా చూడటం నా బాధ్యత.

– మరుకుర్తి శ్రీకీర్తన, పిఠాపురం, కాకినాడ జిల్లా

కష్టపడి చదువుతా

మా నాన్న ఆటో నడిపి కుటుంబాన్ని పోషించేవాడు. అమ్మ కూలి పనులకు వెళ్తుంది. నేను జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ శాఖ స్కూల్‌లో పదో తరగతి చదివి 592 మార్కులు సాధించా. ఇక్కడ సీటు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇక ముందు కూడా కష్టపడి చదువుతా.

– వాసిరెడ్డి వెంకటలక్ష్మి, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా

ఉన్నత విద్యకు అవకాశం

మా నాన్న కూలికి వెళ్తేనే మా కుటుంబం గడిచేది. నేను కావలి మున్సిపల్ హైస్కూల్‌లో చదివి పదో తరగతిలో 582 మార్కులు సాధించాను. ఇక్కడ సీటు రావడంతో ఎంతో ఆనందంగా ఉంది. పేద కుటుంబానికి చెందిన నాకు ఉన్నత చదువుకు అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– బొగ్గవరపు తనూజ, లింగనపాలెం, నెల్లూరు జిల్లా

క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామిని దర్శించేందుకు క్యూలో వేచిఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామివారికి ఆలయ అర్చకులు ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు దీరి స్వామివారిని దర్శించి, 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,75,143 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1400 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. ఆలయం వద్ద బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు.

తాడేపల్లిగూడెంలో చోరీ

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని ఝూన్సీరాణి ఆస్పత్రి సమీపంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.7 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. వివరాల ప్రకారం సుబ్బారావు పేటలో ఉంటున్న బల్ల వేణువర్మ, లలిత గత నెల 24వ తేదీన తిరుమల తిరుపతి వెళ్లి మంగళవారం వచ్చారు. ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడం, ఇంటిలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతోపాటు బీరువాలో దాచిన ఆరు కాసుల బంగారు నగలు, కిలో వెండి సామగ్రి కనిపించలేదు. దీంతో బాధితురాలు బల్ల లలిత స్థానిక పట్టణ పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పంట కాలువ నుంచి మృతదేహం బయటకు తీసి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం: పట్టణ పరిధిలోని నరసాపురం –నిడదవోలు ప్రధాన పంట కాలువలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పంటకాలువలో మహిళ మృతదేహం ఉన్నట్టుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టౌన్ సీఐ బి.చాదగిరి, ఎస్సై జయలక్ష్మి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి వయస్సు సుమారు 53 సంవత్సరాలు ఉంటుందని సీఐ వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వివరించారు.

పిడుగులతో అప్రమత్తం

పాలకొల్లు సెంట్రల్: వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుంటాయి. ఆ సమయంలో ఎక్కువగా పిడుగులు పడుతుంటాయి. పిడుగుల మూలంగా ఏటా సుమారు రెండువేల మంది చనిపోతున్నట్లు అంచనా. అలాగే పిడుగుల మూలంగా గృహోపకరణాలు కాలిపోతుంటాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో పిడుగుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులను చూసి కొందరు చాలా భయపడతారు. దీనిని అస్ట్రఫోబియా అంటారు. పిడుగు ఒకసారి పడినచోట రెండోసారి మళ్లీ పడదనుకోవడం అపోహ మాత్రమే. ఒకే చోట ఒకే ప్రదేశంలో ఎన్నిసార్లయినా పడే అవకాశం ఉంటుంది.

పిడుగు పడిందంటే...

పిడుగు శబ్దం వినగలమే తప్ప చూడాలంటే మాత్రం చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. పిడుగు పడే సమయంలో మెరుపు మేఘాల నుంచి భూమికి తాకినట్టుగా కనిపిస్తుంది. అలా తాకినప్పుడు మేఘాలలో తయారైన పాజిటివ్ శక్తి, భూమిలోని నెగెటివ్ శక్తిని చేరుతుంది. ఒకవేళ మేఘాలలో నెగటివ్ శక్తి తయారైతే అప్పుడు భూమిలో ఉన్న పాజిటివ్ శక్తిని చేరుతుంది. ఏ విధంగానైనా సర్క్యూట్ పూర్తవుతుంది. పిడుగు పడిన సమయంలో ఆ ప్రదేశంలో ఉష్ణోగ్రత కొన్ని వేల డిగ్రీల ఫారన్‌హీట్ ఉంటుందని నిపుణులు అంటున్నారు.

కాపర్ ఎర్త్ ముఖ్యం

పిడుగుల ప్రమాదాల నుంచి రక్షించుకోవాలంటే ఎత్తయిన భవనాల నుంచి లేదా టవర్లు, పొగ

పిడుగులు (ఫైల్)

గొట్టాలు ఇలా ఏదైనా సరే పై నుంచి భూమిలోపలి వరకూ కాపర్ ఎర్త్‌ను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. ఇది దాదాపుగా కిలో మీటరు దూరంలో పడిన పిడుగును సైతం నేరుగా భూమిలోకి లాక్కునే అవకాశం ఉంటుంది. కాపర్ ఎర్త్ వేసే ముందు ఉప్పు, కర్పూర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమిలోపలకు ఏర్పాటుచేయడం వల్ల ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి పిడుగులు పడే అవకాశం ఉందని సమాచారం రాగానే ప్రధానంగా పశువులు లేదా మేకలను చెట్లకింద కట్టకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- రహదారులపై హోర్డింగ్‌లు, ఎత్తయిన, బలహీనమైన చెట్లు కింద నిలబడరాదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు ఆరు బయట తిరగకూడదు.
- ఇంట్లో కేబుల్ టీవీ, కంప్యూటర్లు, ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడకుండా కనెక్షన్‌లు తొలగించాలి.
- పొలం దగ్గర మైదాన ప్రాంతంలో ఉన్నట్లయితే ఎత్తయిన చెట్ల కింద నిలబడకూడదు. ట్రాక్టర్లతో పనులు నిలుపుదల చేసుకోవాలి. లేదంటే పిడుగు పడితే వాహనాల్లో ఉన్న లోహపు పరికరాలను ఆకర్షించే ప్రమాదం ఉంటుంది.
- హైటెన్షన్ వైర్లు, సెల్ టవర్ల కింద ఉండకుండా చూసుకోవాలి.
- చెరువు, కొలనులు ఉన్నట్లయితే దూరంగా ఉండాలి.
- మోటార్‌సైకిల్, స్కూటర్, సైకిల్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ప్రయాణం చేసే సమయాల్లో వాహనాలు పక్కకు ఆపి ఎత్తయిన చెట్లు పక్కన కాకుండా నిలబడడం మేలు.
- ఉరుములతో వర్షం కురుస్తున్న సమయంలో ఇంట్లో షవర్‌బాత్ చేయడం, నీళ్లతో పాత్రలు శుభ్రం చేయడం వంటి పనులను చేయకూడదు. పైపుల గుండా పిడుగు ప్రయాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా ఇంటికి ఎర్తింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

లైట్నింగ్ అరెస్టర్ అవసరం

పిడుగు విద్యుత్ ప్రవాహం అధికంగా ఉండడం వల్ల విద్యుత్ పరివర్తకాలు, సామగ్రిని కాపాడుకోవడానికి లైట్నింగ్ అరెస్టర్ (పిడుగును అరెస్ట్ చేసేది) ఉపయోగిస్తుంటాము. ఎత్తయిన భవనాలకు కూడా ఇది అమర్చుకోవడం వల్ల ఉపయోగంగా ఉంటుంది. సోలార్ ప్యానల్‌లకు లైట్నింగ్ అరెస్టర్ ఏర్పాటుచేసుకోవాలి. సోలార్ ప్యానల్లోనే వీటిని బిగిస్తున్నారు.

– చిటికెన రామకృష్ణ, డీఈఈ తూర్పు ప్రాంత విద్యుత్ శాఖ, పాలకొల్లు

రేపటి నుంచి మూలపాడులో సీనియర్ క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకూ కృష్ణా జిల్లా మూలపాడులో సెంట్రల్ జోన్ సీనియర్ అంతర జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్‌ఎస్ఆర్ మూర్తి, ఈ అశోక్‌కుమార్, ఎస్‌కే సాకిర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ మెన్ మల్టీడే జట్టు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఇందులో బి మునీష్‌వర్మ(కెప్టెన్), జీఎస్ స్వామి నాయుడు (వైస్ కెప్టెన్), కె రేవంత్‌నాగకుమార్, కేకేఎస్‌ఎన్ హరీష్, ఎం హర్షవర్ధన్, వి జాస్విన్, ఏ దినేష్, పి భువనీశ్వర్, బి చరణ్‌సాయితేజ, ఎండీ మోహబూబ్‌ఆలీ, ఏ ప్రేమ్‌చంద్, జి రుత్విక్, వి దీపక్‌చంద్, వీఎంవీఎస్ రక్షన్, బి జయకృష్ణ ఉన్నారని వెల్లడించారు. పది రోజుల పాటు జరిగే పోటీల్లో జట్టు సభ్యులు ఇతర జట్లుతో తలపడతారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: వర్షం కారణంగా మోటారు సైకిల్‌పై అదుపుతప్పి ఒక వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు నగరం శివారు దుగ్గిరాల సమీపంలో మంగళవారం మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా వర్షం కారణంగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కృష్టాజిల్లా పెడనకు చెందినవాడిగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావటంతో అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఏలూరు త్రీటౌన్ ఎస్సై రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై విచారణ చేస్తున్నారు.

నల్ల అద్దాలపై నిర్లక్ష్యమేల?

- యథేచ్ఛగా తిరుగుతున్న నల్ల అద్దాల కార్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉండే ప్రమాదం
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు అమలు కాని వైనం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజానీకం

తణుకు ఎక్సైజ్ శాఖ దాడుల్లో అక్రమ మద్యం రవాణాలో పట్టుబడ్డ నల్ల అద్దాలతో ఉన్న కారు

తణుకు అర్బన్ : నల్ల అద్దాలు కలిగిన కార్లు రోడ్లపై చక్కర్లు కొడుతున్నా రవాణా శాఖ, పోలీసు అధికారులు చోద్యం చూస్తుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నల్ల అద్దాలు కలిగి ఉన్న కార్లలో అసాంఘిక కార్యకలాపాలు.. మద్యం అక్రమ రవాణా.. పిల్లల కిడ్నాప్‌లు.. సంఘ విద్రోహశక్తుల కదలికలను గుర్తించేందుకు వీలు పడదు. దీంతో ఈ తరహా అద్దాలను వాడకూడదని సుమారుగా పదేళ్ల క్రితమే ఉన్నత న్యాయస్థానం ఆదేశాలివ్వడంతో అప్పట్లో రవాణా శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కార్లకు ఉన్న నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్‌లను తొలగింపజేశారు. కానీ ఇటీవల రహదారులపై తిరుగుతున్న కార్లు, ట్యాక్సీల్లో 30 శాతంపైగా నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్ ఏర్పాటుచేసుకుని లోపల ఉన్నవారు బయటకు కనిపించకూడదనే ఉద్దేశ్యంతో హల్‌చల్ చేస్తున్నారు. మోటారు వెహికల్ యాక్ట్ 1989/100, సీఆర్‌పీసీ 188 ప్రకారం నలుపు రంగు ఫిల్మ్ వాడకూడదనే నిబంధనలు ఉన్నాయి. ఒకవేళ వేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నా బయటవారికి 70 శాతం విజిబులిటీ ఉండేలా ఏర్పాటుచేసుకోవాలని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

నల్ల అద్దాలతో యథేచ్ఛగా తిరుగుతున్న కార్లు

ప్రస్తుతం జిల్లాలో తిరుగుతున్న సుమారు లక్షన్నరకుపైగా ఉన్న కార్లలో 30 శాతం కార్లకు నల్ల అద్దాలతో తిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మద్యం అక్రమ రవాణాలో కార్లకు నూరు శాతం నల్ల రంగు అద్దాలతో కార్లు తిరుగుతున్న పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి. గతనెలలో యానాం నుంచి వస్తున్న కారులో తణుకు ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ మద్యాన్ని గుర్తించి పట్టుకున్న ఘటనలో సదరు కారుకు పూర్తిస్థాయిలో నల్ల అద్దాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం కారు తణుకు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందే సీజ్ చేయబడి ఉంది. రహదారుల్లో ప్రయాణించే కార్లలో ఉన్న వారు రోడ్డుపై ప్రయాణించే వారికి పూర్తిగా బహిర్గతం కావాలని న్యాయస్థానం ఇచ్చిన నిషేదాజ్ఞలు కొందరు కార్ల యజమానులు పట్టించుకోకుండా యథేచ్ఛగా అదే కార్లలో తిరుగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలే కాకుండా కార్లలో చిన్నారులు ఆడుకుంటూ డోర్ లాక్ అయిపోయి లోపల ఇరుక్కుని ప్రాణాలు వదలిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

జెడ్ ప్లస్‌కు ఓకే

ప్రముఖుల భద్రతా ప్రమాణాల్లో భాగంగా జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న వారికి మాత్రమే బ్లాక్ ఫిల్మ్ వినియోగించుకునే వెసులుబాటును న్యాయస్థానం కల్పించింది. చివరకు మంత్రులు, ఎంపీలు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు సైతం బ్లాక్ ఫిల్మ్‌లేని వాహనాలనే వినియోగించాలనే నిబంధనలు సైతం రవాణా శాఖ నియమావళిలో పొందుపరిచారు. తప్పనిసరి పరిస్థితుల్లో గోప్యంగా ప్రయాణం చేయాల్సి ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర హోం సెక్రటరీ ఆధ్వర్యంలో డీజీపీతోపాటు ఇతర ప్రముఖ అధికారులతో కూడిన కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తుది నిర్ణయం ఆ కమిటీలో ఉన్న వ్యక్తులపై ఆధారపడి ఉంది.

నిబంధనలు మీరితే చర్యలు తప్పవు

కార్లకు ఉండే నల్ల అద్దాల విషయంలో కారులో ఉన్న వారిని బయటనుంచి చూసేవారికి 70 శాతం కనిపించే విధంగా ఏర్పాటుచేసుకోవాలి. నిబంధనలు మీరి వంద శాతం నల్ల అద్దాలు కలిగి ఉన్న వాహనాలకు రూ. వెయ్యి జరిమానా విధించి నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్‌ను తొలగింపజేస్తాం. నిబంధనలు పాటించకుండా రహదారులపై తిరిగే కార్లపై రానున్న రోజుల్లో స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా చర్యలు తీసుకుంటాం.

– ఎస్. శ్రీనివాస్, తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్

నయనానందకరం.. జగన్నాథుని రథోత్సవం

ఏలూరులో జగన్నాథుని రథాన్ని లాగుతున్న భక్తులు

ఏలూరు నగరంలో జగన్నాథుని రథోత్సవం నయనానందకరంగా సాగింది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలు, గానాలు, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల నడుమ రథం వెంట నడిచారు. రథంపై ఊరేగిన జగన్నాథుడు, బలదేవ్, సుభద్ర మహారాణి ఉత్సవ విగ్రహాలను భక్తులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద విందు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

రథంపై ఊరేగుతున్న జగన్నాథ, బలభద్ర, సుభద్ర మహారాణి

ఐదుగురిపై వేధింపుల కేసు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. దొరసానిపాడుకు చెందిన సత్తెనపల్లి శివకృష్ణకు వసంతకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల నుంచి శివకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వేధిస్తున్నాడని, అలాగే అధిక కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, దీనికి కుటుంబసభ్యులు కూడా సహకరిస్తున్నారని బాధితురాలు వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శివకృష్ణతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005740]

Services

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2640]

జ్యోతిష్యాలయం

■కేరళ భగవతీ భద్రకాళి మాంత్రిక జోతిష్యం ప: వి.ఫణికర్, స్త్రీ/పు వశీకరణం, ప్రేమ పెళ్ళి, సంతానం, శత్రుబాధ, ప్రేమలో మోసపోవడం మీ ఎటువంటి కఠిన నిఘూడ వ్యక్తిగత గుప్త సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573872341 [SCA25005839]

Wanted

■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటో అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: ఆటో కనిపించడం లేదని భీమవరం టూటౌన్ 35వ వార్డుకు చెందిన పి గురునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రహమాన్ చెప్పారు. గురునాయుడు గత నెల 3వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద పెట్టిన ఆటో మరుసటి రోజు తెల్లారేసరికి కనిపించలేదు. మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక నిర్మల ఆసుపత్రి ఎదుట సాయి శరత్‌కుమార్ ఇంజనీరింగ్ వర్క్స్ పేరున కె.వెంకటేశ్వరరావు ట్రాక్టర్ ట్రక్కులు తయారు చేయడం, మరమ్మతులు చేయడం చేస్తున్నాడు. ఆర్డర్ మేరకు కొత్త ట్రక్కు తయారు చేసి స్థానిక ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న తన స్థలంలో ట్రక్కును ఉంచాడు. అయితే గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు ఆ ట్రక్కును చోరీ చేశారని వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: అత్తింటి వారి వేధింపులపై ఓ వివాహిత ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మక్కినవారిగూడేనికి చెందిన వెల్లంపల్లి సుజాతకు వెంకటరమణతో 2012లో వివాహమైంది. సుజాతకు సంతానం కలగకపోవడంతో భర్త, అత్తమామ, ఆడపడుచు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళా స్టేషన్ సీఐ యం.సుబ్బారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం పేరుతో మహిళకు బురిడీ

జంగారెడ్డిగూడెం: స్థలం తనఖా పెట్టి ఆ తరువాత విక్రయిస్తానని చెప్పి మహిళ నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడో వ్యక్తి. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న మడా పార్వతికి పట్టణానికి చెందిన ఉద్దగిరి సత్యనారాయణకు పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో 2018లో తనకున్న 250 చ.గ స్థలాన్ని సత్యనారాయణ పార్వతి వద్ద తనఖా పెట్టి రూ.20 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆ స్థలాన్ని మీకే అమ్ముతాను, దాని మార్కెట్ ధర రూ.33 లక్షలు ఉందని చెప్పగా మిగిలిన రూ.13 లక్షలు సత్యనారాయణకు పార్వతి ఇచ్చింది. అయితే స్థలం చూపకుండా 2019 నుంచి సత్యనారాయణ కాలయాపన చేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన పార్వతి రెవెన్యూ వారికి ఫిర్యాదు చేసింది. తీరా చూస్తే సదరు సర్వేలో సత్యనారాయణకు స్థలం లేదని రెవెన్యూ వారు తెలియజేయడంతో తాను మోసపోయానని గ్రహించిన పార్వతి పోలీసులను ఆశ్రయించింది.

వయ్యారిభామతో ముప్పు

- ఈ కలుపు మొక్కతో పంటకు నష్టం, జీవరాశికీ ప్రమాదమే
- పూతకు ముందే తొలగించాలి



యలమంచిలి: రైతులు తెగుళ్ల కంటే అధికంగా భయపడేది వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కకే. ఎక్కడైనా పెరగడం ఈ మొక్క లక్షణం. ఈ కలుపు మొక్క ప్రధాన పంటకు నష్టం కలిగిస్తుంది. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో మొక్క 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు గాలి పాటుకు దూర ప్రాంతాలకు సైతం తేలికగా విస్తరిస్తుంది. ఈ కలుపు మొక్క గురించి మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీమ్ తెలిపిన వివరాలు..

జీవరాశికి ప్రమాదమే

వయ్యారిభామ వల్ల పంటలకే కాదు మనుషులు, పశువులకూ ముప్పే. మనుషులకు జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులతో పాటు చర్మ సంబంధిత అలర్జీ వస్తుంది. జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పల వాపు తదితర సమస్యలు వస్తాయి. ఈ మొక్కలను తింటే పశువులు అయితే హైపర్ టెన్షన్‌కు గురవుతాయి. ఇక పంటలకు నీరు, పోషకాలు అందకుండా వాటి కన్నా ముందుగా ఇవే శోషించుకుంటాయి. తద్వారా దిగుబడులు 40 శాతం వరకు తగ్గుతాయి. వంగ, మిరప, టమాట, మొక్కజొన్న పైర్లు పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడితే ఉత్పత్తి తగ్గుతుంది. పైర్లకు మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్లు సోకే ప్రమాదముంది. ఈ మొక్కలు పశుగ్రాస పంటలకు కూడా నష్టం కలిగిస్తాయి. ఈ మొక్కల్ని నిర్మూలించాలంటే రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

యలమంచిలి మండలం గుంపర్రులో వరి పొలాల మధ్య పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలు

ఇలా తొలగించాలి

వయ్యారిభామ మొక్కలు తక్కువ సంఖ్యలో ఉంటే చేతితో పీకేయాలి. మొక్కలు పూతదశకు రాక ముందే పీకి తగలబెట్టాలి. లేకపోతే వాటి వ్యాప్తిని నివారించడం కష్టం. ఒకవేళ పూత దశకు చేరుకున్న తర్వాత మొక్కలను పీకినట్లయితే వాటిని వెంటనే కుప్పగా వేసి తగలబెట్టాలి.

రసాయనాలతో..

మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలక రాకముందు లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేస్తే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. విత్తనాలు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 2 ఎంఎల్ పేరాక్వాట్ మందును కలిపి పిచికారీ చేసుకోవచ్చు. పశుగ్రాసం వేసేవారు పైరు వేయకముందే లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేయాలి.

కంపోస్ట్ తయారీ చేయవచ్చు

వయ్యారిభామ మొక్కలు ఎంతో హానికరమైనప్పటికీ వాటిని ఉపయోగించి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఇందుకు నీరు నిలవని చోట 3 మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేలా గుంత తవ్వాలి. ఇందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కలను వేసి, వాటిపై 5 కిలోల యూరియా, 50 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కూడా చల్లాలి. ఈ విధంగా పొరలు, పొరలుగా గుంతను డోము ఆకారంలో నింపుకోవాలి. పొరల పైన పేడ, మట్టి, ఊక మిశ్రమాన్ని వేసి కప్పేయాలి. నాలుగైదు నెలల్లో కంపోస్ట్ తయారవుతుంది. దానిని జల్లెడ పట్టి పంటకు వేసుకోవాలి. ఈ కంపోస్టులో నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇలా తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని అన్ని పంటలకు వేసుకోవచ్చు.

– షేక్ అబ్దుల్ రహీమ్, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

అమ్మవారికి ఆషాఢ సారె

బాపట్ల టౌన్: ముత్తాయపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం మహిళలు పూజలు నిర్వహించి ఆషాఢ సారె సమర్పించారు. ఊరేగింపు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

మేదరమెట్ల: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం ధైవాలరావూరులో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

తెనాలి వచ్చిన గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్

తెనాలిఅర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని పరిశీలించేందుకు ఆ విభాగ గుంటూరు గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్ మంగళవారం తెనాలి వచ్చారు. కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 22వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ కల్నర్ ఎ.ఉదయ్‌కుమార్, సబ్ మేజర్ గురుదీప్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ దేవి ప్రియా, ఎన్‌సీసీ అధికారి కె.ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస బాధిత మహిళలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100

నరసరావుపేట టౌన్: గృహహింస బాధిత మహిళలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పూర్తి అండగా నిలుస్తుందని, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేయవలసిందిగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ మంగళవారం తెలిపారు. బాధిత మహిళలకు చట్ట ప్రకారం ఆర్థిక, ఆరోగ్య, ఉచిత నివాస, చట్టపరమైన సహాయాలు లభిస్తాయన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి తగు సహాయం పొందవలసిందిగా సూచించారు.

ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం

పెదకాకాని: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించేందుకు ఉప్పలపాడు గ్రామాన్ని కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. పెదకాకాని మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనలో భాగంగా ఉప్పలపాడు గ్రామానికి వచ్చిన కేంద్ర బృందం ఫాం పాండ్స్, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను పరిశీలించింది. మండలంలో జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డ్వాక్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రంలో జేసీ ఆకస్మిక తనిఖీలు

పెదకాకాని: రైతులు తీసుకు వచ్చిన పొగాకును వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అన్నారు. పెదకాకాని సెంట్రల్ వేర్‌హౌస్‌లో గత పది రోజులుగా పొగాకు కొనుగోలు ప్రారంభించారు. ఈ కేంద్రంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకు వచ్చిన పొగాకును త్వరగా కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం సిబ్బంది ఉదయం ఆలస్యంగా రావడం వల్ల కొనుగోలులో ఆలస్యంగా జరుగుతుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. పొగాకు నాణ్యత, తేమశాతం ఎలా పరీక్షిస్తారో అధికారులు రైతులకు, జేసీకి వివరించారు. పొగాకును నాణ్యత ఆధారంగా మూడు గ్రేడులుగా గుర్తించి మేలు రకం క్వింటా రూ.12 వేలు, మధ్య రకం రూ.9 వేలు, నాసిరకం రూ.6 వేలుగా కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐతా నాగేశ్వరరావు, పొగాకు సేకరణ ముఖ్య అధికారులు రమేష్, సుబ్రమణ్యం, తహసీల్దార్ కృష్ణకాంత్, వ్యవసాయ అధికారి రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఒకసారి అతివృష్టి, మరోసారి అనావృష్టి.. కష్టాలు భరిస్తూ, నష్టాలను సహిస్తూ.. ఎండనకా, వాననకా.. పురుగనక, పుట్రనకా.. సాగు యజ్ఞం చేసే రైతన్నలు తనువు చాలిస్తున్నారు. పెట్టుబడి సాయం అందక.. ప్రభుత్వ ఆ'ధర'ణ లేక.. రుణదాతల దా'రుణ' మాటలు భరించలేక.. భవిష్యత్తుపై ఆశలు కానరాక.. ఇక ఏమీ చేయలేక.. ఉసురు తీసుకుంటున్నారు. తాము నిత్యం నడయాడే చేలోని చెట్లే ఉరికొయ్యలుగా మారుతుండగా.. క్రిమి సంహారకాలను సమస్యల శాశ్వత సంహారకాలుగా భావించి.. సేవించి.. మృత్యు ఒడిలోకి జారుకుంటున్నారు.

మరుణ శాసనం

ఆ'ధర'ణ లేక.. దా'రుణాలు'

ఆత్మహత్య చేసుకున్న రైతు చల్లగిరి నాగరాజు (ఫైల్)

- జిల్లాలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు
- అప్పుల ఊబిలో కూరుకుపోయి బలిపీఠం ఎక్కుతున్న అన్నదాతలు
- భరోసా దక్కక, గిట్టుబాటు ధర లేక బలవన్మరణాలు
- ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే పది మంది రైతుల ఆత్మహత్య
- మృతుల కుటుంబాలకు పరిహారం అందజేయని కూటమి ప్రభుత్వం
- కనీసం వారిని పరామర్శించే దిక్కుకూడా లేని దుస్థితి

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు

రైతుపేరు	ఊరు	ఆత్మహత్య చేసుకున్న తేదీ
పుట్టా నాగరాజు (40)	చినకొండ్రుపాడు	2024 జూన్ 30
ధూపాటి శివయ్య (56)	ప్రత్తిపాడు	2024 జూలై 27
గడ్డం గోపాలకృష్ణ (31)	చినకొండ్రుపాడు	2024 అక్టోబరు 17
యనగందల వీరారావు (54)	ప్రత్తిపాడు	2024 అక్టోబరు 23
జొన్నలగడ్డ అశోక్ (36)	కోయవారిపాలెం	2024 నవంబరు 13
గేరా ప్రసాద్ (32)	తిక్కిరెడ్డిపాలెం	2024 నవంబరు 23
వరగాని బాబూరావు (59)	వంగిపురం	2025 ఫిబ్రవరి 13
కావూరి శివశంకరప్రసాద్ (46)	పుసులూరు	2025 జూన్ 7
చిమటా శేషయ్య (52)	కొర్నెపాడు	2025 జూన్ 13
చల్లగిరి నాగరాజు (42)	ప్రత్తిపాడు	2025 జూన్ 28

ఆత్మహత్య చేసుకున్న రైతు పుట్టా నాగరాజు (ఫైల్)

ఆత్మహత్య చేసుకున్న రైతు డి.శివయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు, ప్రత్తిపాడు: జిల్లాలో రోజురోజుకు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, అరకొర దిగుబడులు, పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి విలయ తాండవం.. అన్నీ గట్టెక్కినా చివరి గిట్టుబాటు ధర లేకపోవడం, వడ్డీలకు తెచ్చిన అప్పులు రెట్టింపు అవుతుండటం, వాటిని తీర్చలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కూటమి గద్దెనెక్కిన తరువాత ఇప్పటి వరకు ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే పది మంది రైతులు బలిపీఠం ఎక్కారు. అప్పుల బాధలు తాళలేక బలవన్మరణాలకు పాల్పడి ఊపిరి తీసుకున్నారు.

నిండా ముంచేసిన పత్తి, మిర్చి, పొగాకు

గత ఏడాది జిల్లాలో వేల ఎకరాల్లో పత్తి, మిర్చి పంటను రైతులు సాగు చేశారు. గులాబీరంగు పురుగు ఉధృతి అధికంగా ఉండటంతో పత్తి రైతులు నిలువునా నష్టపోయారు. అదేవిధంగా మిర్చిని నల్లి తామర ముంచెత్తడంతో పంటను మధ్యలోనే పీకేయాల్సిన పరిస్థితి. పత్తికి, మిర్చికి ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టారు. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటలకు కనీస గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక మిర్చి సాగు చేసి నట్టేట మునిగిపోయిన రైతులు పంటను పీకేసి, నల్లబర్లీ పొగాకు సాగుచేశారు. తీరా పంట దిగుబడులు చేతికొచ్చే సమయానికి ధర లేకపోవడంతో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.15వేల వరకు అమ్మిన నల్లబర్లీని మొన్నటివరకు రూ.3 వేలకు కూడా కొనే వారులేక నానాఅగచాట్లు పడ్డారు. ప్రస్తుతం పొగాకు కొనుగోలు కేంద్రాలని ప్రభుత్వం చెబుతున్నా వాటి ద్వారా కొనుగోళ్లు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.

పత్తాలేని పెట్టుబడి సాయం

గత ప్రభుత్వం పంటలు సాగు చేసుకునే సమయంలో రైతన్నకు ఆదరువుగా ఉండేందుకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 13,500లను వారి ఖాతాలకు నేరుగా జమ చేసింది. అదే పథకాన్ని పేరు మార్చి అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేలు ఆర్థిక సాయం రైతుల ఖాతాలకు జమ చేస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కూటమి నేతలు తొలి ఏడాది అన్నదాత సుఖీభవకు మంగళం పాడేశారు. ఈ ఏడాది అదిగో ఇదిగో అని ఊరిస్తూ ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు.

గత ప్రభుత్వంలో త్వరితగతిన ఆర్థిక సాయం

బలవన్మరణాలకు పాల్పడిన రైతులకు ప్రభుత్వ సాయం ఏ మాత్రం అందడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మరణించిన రైతులను ఆదుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నేరుగా జిల్లా కలెక్టర్ మరణించిన రైతు కుటుంబానికి ఏకంగా రూ. 7 లక్షల పరిహారాన్ని నెల రెండు నెలల వ్యవధిలోనే అందించారు. కానీ ఇప్పుడు కనీసం మృతుల కుటుంబాలను పరామర్శించే దిక్కుకూడా లేని పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పుడు కనీసం మండల స్థాయి అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు సకాలంలో నివేదికలను కూడా పంపిచలేని దుర్భర పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పరిహారం అందలేదు

నా తండ్రి ఇనగందుల వీరారావు 2024 అక్టోబరులో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపుగా ఎనిమిది నెలలు కావొస్తుంది. ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి ఇటీవలే దరఖాస్తు అందించాం. త్వరలోనే పరిహారం వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిస్తున్నాం.

– యనగందుల సుబ్బారావు
(మరణించిన రైతు వీరారావు కుమారుడు)

ప్రజా సమస్యలపై పోరుబాట

బాబు ష్యూరిటీ - మోసాలు గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న అంబటి రాంబాబు, నేతలు

- నేడు వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల విస్తృత స్థాయి సమావేశం
- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- వివరాలు వెల్లడించిన జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం తాడేపల్లి రూరల్‌లోని కుంచనపల్లి ప్రాతూరురోడ్‌లో ఉన్న ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశ ఏర్పాట్లను ఆయన గుంటూరు ఈస్ట్, మంగళగిరి, సత్తెనపల్లి నియోజకవర్గాల సమన్వయకర్తలు నూరి ఫాతిమా, దొంతిరెడ్డి వేమారెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిమ్మల రామానాయుడుతో కలసి పరిశీలించారు. అనంతరం అంబటి మాట్లాడుతూ గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మండల, పట్టణ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులతో బాబు ష్యూరిటీ – మోసాలు గ్యారెంటీ అనే అంశంపై సమావేశం నిర్వహిస్తున్నామని.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో, ప్రతి మండలంలో బాబు మోసాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే అంశం.. క్యూఆర్ కోడ్ వినియోగంపై ఈ సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, కుంచనపల్లి అధ్యక్షుడు మిరియాల రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఘనంగా డాక్టర్స్ డే

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలోని శుశ్రుతాహాల్‌లో జరిగిన ఈ వేడుకలకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వైద్యులను సత్కరించి మాట్లాడారు. జీజీహెచ్‌లో పేద రోగులకు వైద్యులు ఎంతో కష్టపడి సేవలందిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రిలో పచ్చదనం బాగా పెంచారని అభినందించారు. వైద్యులు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుని రోగులకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ ఆస్పత్రిలో దాతల సహాయంతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. రోగులకు ఓపీ రద్దీని తగ్గించేందుకు నూతనంగా ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న 50 మంది వైద్యులను ఘనంగా సత్కరించారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నీలి ఉమాజ్యోతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, వైద్యులు

వర్షాల నేపథ్యంలో ఇసుక ప్రత్యేక డంప్

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ముందుగానే ప్రత్యేకమైన డంప్ యార్డుల్లో నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్ఓ షేక్ ఖాజావలితో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరపాలన్నారు. ఇసుక విక్రయాలు జరిగే ప్రాంతాల్లో ధరల బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత తహసీల్దార్‌లు తనిఖీ నివేదకలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ నివేదిక ప్రకారం జిల్లాలో 2021–24 మధ్యలో జిల్లాలో అక్రమంగా ఇసుక తవ్విన ఏజెన్సీలకు నోటీసులివ్వాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న ఇసుక స్టాక్ పాయింట్లు ప్రధాన రహదారులకు సమీపంలో ఉండాలన్నారు. స్టాక్ పాయింట్ల నుంచి వసూలు చేసే రవాణా చార్జీల విషయంలో వినియోగదారుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి డి.వెంకట సాయి, జిల్లా భూగర్భ వనరుల శాఖ డీడీ వందనం, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ క్లస్టర్లు..

గుంటూరు వెస్ట్: జిల్లాలో వ్యవసాయంతో పారిశ్రామికాభివృద్ధి జరగాలంటే ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలు గుర్తించాలన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్, హ్యాండ్‌లూమ్ క్లస్టర్ పనులు వేగవంతం చేయాలన్నారు. తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో మాడ్యూలర్ కిచెన్ క్లస్టర్ ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎస్ఐపీబీ, ఎస్ఐపీసీలో జిల్లాకు అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. జిల్లాలో 45 ఎస్ఎంఎస్ఈ పరిశ్రమలకు సంబంధించి రూ.2,52,74,672 మంజూరు చేస్తూ కలెక్టర్ సమావేశంలో ఆమోదించారు. డీఆర్ఓ షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, తెనాలి ఆర్డీఓ శ్రీహరి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉప్పు సాగుకు ప్రకృతి విఘాతం

- సీజన్‌లో భారీగా పడిపోయిన ఉత్పత్తి
- గతంలో ఎన్నడూ లేని విధంగా దెబ్బతిన్న రైతు
- రైతుల ఆశలపై నీరు చల్లిన అకాల వర్షం
- ఉమ్మడి ప్రకాశంలో రైతులకు కోలుకోలేని దెబ్బ
- రైతుల కష్టం పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చినగంజాం: ఉప్పు సాగుకు ఇటీవల కాలంలో ప్రకృతి తీవ్ర విఘాతం కలుగజేస్తోంది. అయినా ఉప్పు రైతు వాటిని తట్టుకొని నెగ్గుకు రాగలుగుతున్నాడు. వేసవి ఉష్ణోగ్రతలు పంట దిగుబడిని, నాణ్యతను పెంచుతాయి. ఉప్పు సాగు ముమ్మరంగా సాగే అనుకూల సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఉప్పు రైతు కోలుకోవడం కష్టమే. గత నాలుగు సీజన్‌లుగా ఇదే పరిణామాలు ఉప్పు సాగు విషయంలో చోటు చేసుకుంటున్నాయి.

సీజన్‌లో భారీగా పడిపోయిన ఉప్పు ఉత్పత్తి

రాష్ట్రంలో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య సీజన్‌లో ఉప్పు ఉత్పత్తి భారీగా పడిపోయింది. రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి తడ వరకు ఉన్న ఉప్పు పరిశ్రమల్లో మొత్తం 22 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి కొనసాగుతుంది. తుఫాన్‌లు, భారీ వర్షాల కారణంగా ఉప్పు రైతు నష్టపోక తప్పడం లేదు. ఉప్పు సాగు ప్రతి ఏడాది నవంబరు నెల నుంచి తరువాత ఏడాది జూన్ వరకు దాదాపు 8 నెలలపాటు కొనసాగుతుంది. నవంబరు, డిసెంబరు నెలల్లో ఉప్పు సాగును ప్రారంభించి తొలి తీత సంక్రాంతి పండుగ నాటికి తీయాల్సి ఉంది. 2024–25 సీజన్‌లో నవంబరు, డిసెంబరు నెలలో ప్రకృతి అనుకూలించక ఆలస్యంగా రైతులు సాగును ప్రారంభించాల్సి వచ్చింది.

ఉప్పు కొఠారుల్లో భారీగా వర్షపు నీరు నిలిచి సాగుకు భూములు అనుకూలత లేక జనవరి నెలలో సాగుకు భూములను సిద్ధం చేసుకునే పనిలో ఉండి ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో సుమారు 30 శాతం మాత్రమే ఉప్పును రైతులు తీయగలిగారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండి ఉప్పు దిగుబడికి అనుకూలంగా ఉండే మే, జూన్ నెలల్లో తుఫాన్‌లు, అకాల వర్షాలతో సాగు పూర్తిగా నిలిచిపోయింది. ఉప్పు రైతుకు ఎన్నడూ లేని విధంగా తీవ్ర విఘాతం కలిగింది. సొంత భూములున్న రైతులు, లైసెన్స్‌దారులు పరిస్థితి ఎలా ఉన్నా ముఖ్యంగా కౌలుదారులకు మాత్రం తీవ్ర ఇబ్బంది కలిగింది.

ఉప్పు భూముల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతులు

ఉమ్మడి ప్రకాశంలో ఉపాధి కోల్పోయిన వేల కుటుంబాలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఊళ్లపాలెం, కనపర్తి, కొత్తపట్నం, చినగంజాం మండలాల్లో ఉప్పు సాగు కొనసాగుతోంది. బాపట్ల జిల్లాలో చినగంజాం మండలంలో చినగంజాం, పెదగంజాం గ్రామాల్లో రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు మొత్తం 3,600 ఎకరాల్లో ఉప్పు సాగు చేసే భూములున్నాయి. వాటిలో ప్రభుత్వ భూములు 2,400 ఎకరాలు కాగా, 500 ఎకరాలు స్పోర్వైట్ సాల్ట్ భూముల్లో సాగు సాగడం లేదు. ప్రభుత్వ భూమిలో 620 ఎకరాలు చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి మరో 1200 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. చినగంజాం మండల పరిధిలో చిన్న, పెద్ద రైతులు సుమారు 1050 కుటుంబాలు ఉండగా వారితో పాటు ఉప్పు కొఠారుల్లో పనులు నిర్వహిస్తూ కూలీలుగా సుమారు 8 వేల మంది పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. చినగంజాం సాల్ట్ వర్కర్స్ కో ఆపరేటివ్ ప్రొడక్షన్స్ సేల్స్ సొసైటీ (ఎల్ నంబర్ 73 అండ్ 86)లో 400 ఎకరాలు సుమారు 700 కుటుంబాలు, రాజుబంగారుపాలెం సాల్ట్ సొసైటీలో 120 ఎకరాలు 350 కుటుంబాలు మొత్తం 1050 కుటుంబాలు ఉప్పు సాగు మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఊళ్లపాలెం గ్రామ పరిధిలో ఎస్సీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద 500 ఎకరాలు, ఓసీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద మరో 350 ఎకరాలు ఉప్పు సాగు చేస్తుండగా, కొత్తపట్నం మండలంలోని సాల్ట్ సొసైటీ కింద 275 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. వీటితో పాటు సుమారు మరో వెయ్యి ఎకరాలు ప్రైవేట్ భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఉప్పు సాగుకు అవాంతరం కలగడంతో వేల కుటుంబాలు ఈ సీజన్‌లో తమ ఉపాధిని కోల్పోయారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	47,085
అమ్మకాలు	45,592
నిల్వ	8,935

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,700
నంబరు–5	రూ. 10,000 – 13,420
341	రూ. 10,000 – 13,300

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,700
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
ఆర్మూర్	రూ. 9,700 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 12,800
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,300
4884	రూ. 10,000 – 12,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 754

కొమ్ములు : 565 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,625	10,350	10,200

కాయలు : 155 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,625	10,400	10,175

మొత్తం అమ్మకాలు : 565.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ముగిసిన ఇస్కాన్ మందిర జగన్నాథస్వామి ఉత్సవాలు

సుభద్రాదేవికి సారె తీసుకొస్తున్న మహిళలు

జగన్నాథుడు, బలదేవుడు, సుభద్రాదేవి

సుభద్రాదేవికి సారె సమర్పించిన మహిళలు

తెనాలి: తెనాలి నాజరుపేటలోని ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి ఉత్సవాలు నాలుగో రోజైన మంగళవారం రాత్రితో ముగిశాయి. సోమవారం రాత్రి జగన్నాథ రథయాత్ర ముగిసిన తదుపరి, ఇక్కడి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన గుండిదా మందిరంలో జగన్నాథుడు, బలదేవుడు, సుభద్రామాతను అక్కడ కొలువు ఉంచిన విషయం తెలిసిందే. చివరి రోజు రాత్రి పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన పెద్ద ఎత్తున పాల్గొని సుభద్రాదేవికి చీర, సారె, పసుపు కుంకుమలను సమర్పించారు. ఈ వేడుకల సందర్భంగా గత నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన వివిధ కళాసాంస్కృతిక పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మూడు వేలమంది పాల్గొన్నట్టు ఇస్కాన్ మందిర నిర్వాహకుడు సింహ గౌరదాసు చెప్పారు. సుభద్రాదేవికి సారె సమర్పణ అనంతరం ఆయా పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లను, జ్ఞాపికలను బహూకరించారు. అత్యధికంగా 28 జ్ఞాపికలను గెలుచుకున్న స్థానిక వెస్ట్‌బెర్రీ స్కూలుకు ఓవరాల్ ఛాంపియన్‌గా ట్రోఫీని బహూకరించారు. మందిర ఉత్సవాలకు సహకరించిన బలరాం గోవింద ప్రభు, వైష్ణవి, భార్గవ్, వెంకటేష్, అపూర్వ, ఆశ్రిత, గాయత్రి, వెస్ట్‌బెర్రీ స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, శివశంకర్, పావని, తేజ, మురళి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత పినపాడుకు చెందిన కోదాడ బృందం వాయిద్యాల నడుమ మహిళలు ఊరేగింపుగా సారెను తీసుకొచ్చారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

రథయాత్రకు హాజరైన భక్తులు

పెదకాకాని: విశ్వ ప్రఖ్యాత పూరీ జగన్నాథుని రథయాత్రకు సంఘీభావంగా వీవీఐటీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రథయాత్ర విద్యార్థుల భక్తి పారవశ్యంతో వైభవంగా సాగింది. గుంటూరు జిల్లా పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి విశ్వవిద్యాలయం వరకు సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు కొలువుదీరిన రథయాత్రను వివా వీవీఐటి సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. భక్తులు, విద్యార్థులు, ఇస్కాన్ సభ్యులు భక్తిశ్రద్ధలతో, విదేశీ భక్తుల సంకీర్తనలు జయ జయహే జై జగన్నాథ నినాదాలతో యాత్ర శోభాయమానంగా ముందుకు సాగింది. మార్గ మధ్యలో గోళ్లమూడి గ్రామ ప్రజలు హారతులు, పూలు జల్లుతూ రథయాత్రకు స్వాగతం పలికారు. అనంతరం ఇస్కాన్ సభ్యులు యూనివర్శిటి వద్ద దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహా హారతి నిర్వహించి, విద్యార్థులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి రథయాత్రను దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో వివా, వీవీఐటియూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ మంగళగిరి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ తీరుపై విచారణ

కేంద్ర బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: వర్షపు నీటిని ఒడిసి పట్టడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతి పరిశీలించడానికి కేంద్ర జల శక్తి శాఖ పరిశీలకులు కిరణ్‌కుమార్ కర్లపు, రేష్మి పిళ్లైతో కూడిన అధికారుల బృందం రెండు రోజులు పాటు జిల్లాలో పర్యటించారు. పలు ప్రాంతాల్లో స్థానికులతో మమేకమై ప్రభుత్వ విధానాలపై ఆరా తీశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా చేపడుతున్న ఫారం పాండ్, వాన నీటి సంరక్షణ, నిర్మాణాలు, అమృత్ సరోవర్లు, నర్సరీలు, పండ్లు, పూలతోటలు పెంపకం, తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో చేపడుతున్న పనులు బాగున్నప్పటికీ వాటిని వెబ్‌సైట్‌ల్లో ఫొటోలు అప్‌లోడు చేయకపోవడం వలన పురోగతి మార్గాలు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా అధికారులు నడుచుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రుతుపవనాలు రావడానికి ముందు, తరువాత నీటి లభ్యతను లెక్క వేయడంలో భాగంగా రానున్న అక్టోబరు నెలలో మరోసారి జిల్లాలో పర్యటిస్తామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో పాటు, సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై పథకాలపై చర్చించారు.

ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన జీఎస్టీ

- సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సుజిత్ మల్లిక్
- ఘనంగా జీఎస్టీ దినోత్సవం

జ్యోతి వెలిగిస్తున్న సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సుజిత్ మల్లిక్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): జీఎస్టీతో దేశం ప్రగతి పథంలో దూసుకువెళుతుందని, జీఎస్టీ అమలు మంచి ఫలితాలు ఇచ్చిందని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. జీఎస్టీ ఏర్పడి ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాలులో జరిగిన జి.ఎస్.టి. దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. జి ఎస్.టి. చెల్లించటం గౌరవప్రదంగా భావించాలని సూచించారు. దేశ పౌరులు, వ్యాపారస్తులు చెల్లించే వస్తుసేవల పన్ను దేశ నిర్మాణానికి, దేశ సౌభాగ్యానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో జీఎస్టీ ప్రారంభమైన ఏడాది రూ.2,850 కోట్లు ఆదాయం సమకూరగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.7,300 కోట్లు ఆదాయం లభించిందన్నారు. అలాగే గుంటూరులో జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల సంఖ్య ప్రారంభంలో 19 వేల మంది ఉండగా, ఇప్పుడు 75 వేల మందికి చేరారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ జీఎస్టీతో దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎఫ్టానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన సాంకేతిక సమస్యలు, సందేహాలు వీడాయన్నారు. సి.పి.డబ్ల్యు.డి చీఫ్ ఇంజినీర్ ముక్కామల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా అత్యధిక ఆదాయం వస్తున్నప్పటికీ జీఎస్టీ కార్యాలయాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, సొంత భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం అత్యధిక పన్ను చెల్లింపుదారులను సత్కరించి, మెమెంటోలు బహూకరించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేశారు.కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ, జాయింట్ కమిషనర్ రెజ్వాని, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.రవి కుమార్, మరియదాసు సూపరింటెండెంట్లు ఆర్.పి.పి.కుమార్, యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి, సురేష్ మణి చిట్టెం వెంకటేశ్వరరావు, పూర్ణసాయి పాల్గొన్నారు.

ప్రతి పౌరునికి అందుబాటులో బ్యాంకింగ్ సేవలు

జిల్లా అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి

మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎల్‌డీఎం కృష్ణారెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): ప్రతి పౌరునికి బ్యాంకింగ్, బీమా, పెన్షన్ వంటి ఆర్థిక సేవలు అందుబాటులో ఉండేలా చేయడమే జన సురక్ష శిబిరాల లక్ష్యమని జిల్లా అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో జన సురక్ష మూడు నెలల శిబిరాలను తెనాలి మండలం, కొలకలూరు గ్రామంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయిలో ఆర్థిక సేవలను విస్తరించేందుకు చేపట్టిన జన సురక్ష సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. శిబిరాల్లో జన్ ధన్ ఖాతాల ప్రారంభం, జీవన్‌జ్యోతి, సురక్ష బీమా పథకాలలో నమోదు, అటల్ పెన్షన్ యోజన సభ్యత్వం, పాత ఖాతాలకు ఈకేవైసీ చేయించడం, డిజిటల్ మోసాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏపీఎం జయశ్రీ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ఇన్‌చార్జి శ్యామ్ ప్రసాద్, కొలకలూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ హర్ష, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

సుందరయ్యనగర్‌లో సీపీఎం నేతల ప్రచారం

సీపీఎం నాయకుల ప్రచారం

తెనాలి: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ప్రజలు స్పష్టంగా తిరస్కరించాలని, చూస్తూ ఊరుకుంటే తరతరాలుగా ఇరుక్కుపోతారని సీపీఎం నాయకులు ప్రజలను హెచ్చరించారు. సీపీఎం నాయకులు కేబీ ప్రసాద్, శెట్టి ఏసోబులు మంగళవారం తెనాలి సుందరయ్యనగర్‌లో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. అదానీ కంపెనీ ప్రతినిధులు వినియోగదారుల సమ్మతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, పట్టించుకోకుండా బలవంతంగా విద్యుత్ మీటర్లు మార్చుతున్నారని కేబీ ప్రసాద్ చెప్పారు. స్మార్ట్ మీటర్లుగా పిలుచుకునే ఆ మీటర్లలో ఎన్నో ఏర్పాట్లు ఉన్నాయని చెప్పారు. అందులో ఉండే 'అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్' (ఏఎంఐ) ద్వారా రిమోట్ ద్వారా ఆపరేట్ చేయొచ్చని, వైర్‌లెస్ ద్వారా ఆ మీటర్ అదాని కంపెనీకి కనెక్ట్ చేయబడి ఉంటుందన్నారు. ఎక్కడో ఉండి ఆ మీటర్‌ను ఆపరేట్ చేయొచ్చని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. రెండోది 'ఆటోమేటిక్ మీటర్ రీడింగ్' (ఏఎంఆర్) అని చెబుతూ ఏ సమయానికి ఎంత విద్యుత్ వాడుకున్నదీ రికార్డు చేస్తుందన్నారు. పీక్ అవర్స్‌లో 6–10 గంటల వరకు అధిక చార్జీలు వసూలు చేస్తారని వివరించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుపై మాట్లాడుతూ వాడుకున్న విద్యుత్‌కు తర్వాత డబ్బులు చెల్లించే ప్రస్తుత పద్ధతికి భిన్నంగా, ముందుగానే డబ్బులు చెల్లించి సెల్‌ఫోన్‌లో ఛార్జింగ్ చేయించితేనే విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్‌ను సౌకర్యంగా ప్రజలకు అందుబాటులో ఉంచకుండా, సరుకుగా మార్చి ప్రజలను పిండుకోవటానికి వ్యాపారంగా మార్చుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వి.బాబూరావు, యు.బుజ్జి, శెట్టి పోలు, వి.సూరిబాబు, ఎస్.బాలస్వామి, మేరి, శెట్టి సలోమి, ఎస్.సింధు, కె.మరియమ్మ, ఎస్.అరుణప్రమీల, పి.జ్యోతి, కె.లక్ష్మమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో సీఏల పాత్ర కీలకం

క్రేన్ సంస్థల అధినేత గ్రంధి లక్ష్మీకాంతారావు

ఐసీఏఐ గుంటూరు శాఖ ప్రతినిధులతో గ్రంధి లక్ష్మీ కాంతారావు, చింతా రఘునందన్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రగతిలో సీఏల పాత్ర ఎంతో కీలకమని క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంథి లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చార్టర్డ్ అకౌంటెంట్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రంథి లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ సీఏ విద్యకు గుంటూరు నగరం కేంద్రంగా ఉందని, వివిధ రాష్ట్రాల విద్యార్థుల ఇక్కడికి వస్తున్నారని అన్నారు. విద్యార్థులు సీఏ విద్యను ఎంపిక చేసుకోవడం ద్వారా ఉన్నత భవిష్యత్ అందిపుచ్చుకోగలరని అన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ కుందుల, సీఏ ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు చాప్టర్ చైర్మన్ చింతా వీఎన్ఎస్ రఘునందన్, వైస్ చైర్మన్ రుద్రవరపు భరద్వాజ, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్, కోశాధికారి కన్నెగంటి మృత్యుంజయరావు, సికాస చైర్మన్ నాగబీరు రాజశేఖర్, సభ్యులు షేక్ బాజీ, దేసు సంపత్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలో చుండూరు నిడుబ్రోలు స్టేషన్ల మధ్య సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు నుంచి పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్ల కట్ బనియన్, నీలం రంగు జీన్సు ప్యాంటు ధరించి ఉన్నాడు. తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ జి. వెంకటాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27554లో సంప్రదించాలని కోరారు.

విజ్ఞాన్, ఏపీ ఫిషరీస్ వర్సిటీల ఒప్పందం

అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీ అధికారులు

చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ – విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్‌తో విజ్ఞాన్ రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల జలజీవుల ఆరోగ్యం, డయగ్నొస్టిక్స్‌లో భాగస్వామ్య పరిశోధన చేస్తామన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, ఆక్వా రైతులకు సాంకేతిక శిక్షణ కూడా అందిస్తామన్నారు. అంతేకాకుండా అధ్యాపకులు, సిబ్బంది మార్పిడి, ప్రయోగశాల వనరుల వినియోగం , వివిధ నిపుణుల సేవలు అందిస్తామన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రాజెక్టుల కోసం సంయుక్తంగా ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన కోసం నిపుణుల నియామకం, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు.

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ (ఏపీఎఫ్‌యూ) స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణ, డీన్లు, తదితరులు పాల్గొన్నారు.

18 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాడికొండ: అక్రమంగా నిల్వ చేసిన 18 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లెస్ అధికారులు పట్టుకున్న ఘటన మండల కేంద్రమైన తాడికొండలో జరిగింది. వివరాల ప్రకారం తాడికొండ చెరువు కట్టపై రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సీఎస్ డీటీ దేవరాజు, ఆర్ఐ హనుమంతరావుల ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించగా 35 కిలోల తూకం కలిగిన 18 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. దీనిపై విచారించగా తాడికొండకు చెందిన గుర్రపుశాల ఆనంద్ అనే వ్యక్తి కొనుగోలు చేసి నిల్వ చేసినట్లు స్థానికులు తెలపగా అతనిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులలో వీఆర్వో మాల్యాద్రి కూడా పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఖమ్మంకు చెందిన భూక్యా భారతి, జక్కన్న ఇరువురు ఖమ్మం నుంచి రైలులో అక్రమంగా గుంటూరుకు గంజాయి రవాణా చేశారు. గుంటూరు జీజీహెచ్ వద్ద ఇరువురిని ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఏఈఎస్ సూర్యనారాయణ, సీఐలు రేఖ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికను కాలువలోకి తోసిన గుర్తుతెలియని వ్యక్తి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద దారుణం చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి బాలికను తీసుకొచ్చి బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి తోసేశాడు. గమనించిన వృద్ధురాలు స్థానికులకు చెప్పడంతో వారు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వీరేంద్ర ఆదేశాల మేరకు ఎస్సై ఖాజావలి సంఘటనా స్థలానికి వెళ్లి సుమారు 3 గంటల పాటు బకింగ్‌హామ్ కెనాల్‌లో వెతికి బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. మృతిచెందిన బాలిక వయస్సు 12 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి జాతీయ రహదారి వెంబడి సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. బాలిక వాహనం మీద వచ్చిందా, నడుచుకుంటూ తీసుకొచ్చారా.. అనే విషయమై పరిశీలిస్తున్నట్లు సీఐ తెలిపారు. బాలికపై లైంగికదాడి చేసి నీటిలో పడేశారా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

'మిషన్ ఉన్నతి'తో రైల్వే ఉద్యోగులకు మేలు

లక్ష్మీపురం: ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంచడానికి, కార్యాచరణ కొనసాగింపునకు ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుంటూరు డీఆర్ఎం సుథేష్ణ సేన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పట్టాభిపురం కార్యాలయంలో మంగళవారం 'మిషన్ ఉన్నతి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీలను అర్హత కలిగిన ఉద్యోగులతో భర్తీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మిషన్ ఉన్నతి కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించేలా కీలకమైన స్థానాలను భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పదవీ విరమణ చేసే ఉద్యోగులు స్వయంగా వారి జూనియర్లకు పదోన్నతి ఉత్తర్వులను అందజేయిస్తున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలో ఆయా విభాగాలలో ఆరుగురు సిబ్బంది ఉద్యోగ విరమణ పొందగా వారి చేతుల మీదుగా వారి తరువాత విధులు నిర్వహించే సిబ్బంది పదోన్నతులు పొందడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్ పాల్గొన్నారు.

ఆత్మీయ స్పర్శతోనే వైద్యానికి వన్నె

గుంటూరు ఎడ్యుకేషన్: మందుల కన్నా ఆత్మీయ స్పర్శతోనే వైద్యానికి వన్నె తెస్తుందని ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా గుంటూరులోని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్, ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర అనే అంశంపై జూమ్ వేదికగా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉన్నత వృత్తులలో వైద్య వృత్తి ఒకటని, దేవుని తర్వాత ప్రాణం నిలిపే అవకాశం వైద్యునికే ఉండడం ఒక అద్భుతమైన వరం వంటిదని అన్నారు. జేబును చూసి వైద్యం చేయడం కన్నా రోగి జబ్బు చూసి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా వైద్యులు ఉండాలని, కార్పొరేట్ల మాయాజాలం, కాసుల కక్కుర్తి అవాంఛనీయమైనవని, మందుల కన్నా మృదువైన మాటలు, మానవీయ స్పర్శ అత్యున్నత ఫలితాలను అందిస్తాయని అందుకే వైద్య వృత్తికి మానవీయ దృక్పథం మకుటంలా నిలుస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యాఖ్యాత కోపల్లి జయకర్ బాబు, జి. శాంతమూర్తి మాట్లాడారు. జూమ్ సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వాడకుప్ప సుధాకర్, ఏలీ, ఎం.స్వాములు, ప్రియా జాన్, బాలకృష్ణారెడ్డి, కవి, రచయిత కాపిరెడ్డి కృష్ణారెడ్డి, గునుకూరు రత్నరాజు, శ్రీ విష్ణు, గాలి శాంత తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు రెండేళ్లు జైలు శిక్ష

గుంటూరు లీగల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు 5వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కోలారు లత మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021లో పేరేచర్ల జంక్షన్ వద్ద భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు డ్రైవర్ మాలంపాటి శ్రీకాంత్ రెడ్డి ఢీకొట్టాడు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గుంటుపల్లి వెంకటేశ్వరరావు మృతిచెందగా, ఆయన భార్య తీవ్రగాయాలపాలైంది. ఈఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షాధారాలతో జిల్లా ఐదో అదనపు సివిల్ కోర్టులో సమర్పించగా, పూర్వపరాలు, సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కె.లత ముద్దాయికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ఏపీపీ ఎ.పవన్ కుమార్, కోర్టు పర్యవేక్షణ అధికారి సీఐ నరసింహారావు , అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై నరహరిలను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE
PLOT FOR SALE
■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES
GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకుల్లో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
■ గుంటూరు, అడ్డంకి సమీపంలో గల కళ్యం టెక్స్‌టైల్స్‌లో లేడీగార్డ్సు, సెక్యూరిటీ గార్డ్సు, హెడ్‌గార్డ్సు కావలెను. ఉచిత వసతి సబ్సిడీ భోజన సదుపాయం. ✆ 9848091341, 9346176356
■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357
■ శ్రీ శాంతి హోమ్‌కేర్స్‌లో తెనాలి, గుంటూరు, రేపల్లె లో పనిచేయుటకు నర్సులు, కేర్‌టేకర్స్ కావలెను. జీ: 17000/– సంప్ర: 96184 85329
■ Wanted experienced, dedicated & hardworking teacher's to teach nursery - 2nd class mother teachers - 6 members & 3rd - 8th class (all subjects) - 8 members. GKR High School, A.T. Agraharam, 9th lane, opp water tank Guntur. ✆ 9885028725, 9959127256
■ Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241
■ Wanted Local, boys/girls for jewellery shop, experience in sales must., Contact: 9848333267
■ Wanted High School, Biology, Physics, Hindi, Social, PET, Computer Operator and mother teachers. Sri Vidhya High School, NGGO's colony, Gnt. 9701022900
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. ఫో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ. 100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంకు అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
కాకినాడ
బుధవారం । 2 । జూలై । 2025

టెండర్ ఖరారు రేపే..

అన్నవరం సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది.

కలలు కల్లలై..

తెలంగాణ రాష్ట్రం పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటంలో తూర్పు గోదావరి జిల్లా చాగల్లుకు చెందిన యువతి దుర్మరణం పాలైంది.

8లో

కడలిలోకి 47,411 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 47,411 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 కలిపి మొత్తం 12,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శృంగార వల్లభునికి రూ.31.66 లక్షల ఆదాయం

హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి వారికి అన్నదానం, హుండీల ద్వారా రూ.31,66,081 ఆదాయం సమకూరింది. జిల్లా దేవదాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్ర కుమార్, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి సమక్షంలో ఆలయంలోని హుండీలను మంగళవారం తెరచి, ఆదాయం లెక్కించారు. మొత్తం 104 రోజులకు గాను ఆలయ హుండీల ద్వారా రూ.23,89,935, అన్నదానం హుండీ ద్వారా రూ.7,76,146 మేర ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి 8న ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గురు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 8న జిల్లాలోని మూడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, ఏలేశ్వరం, తుని డిపోల నుంచి ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. కాణిపాకం, శ్రీపురం దర్శనానంతరం అరుణాచలం చేరుతాయని తెలిపారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి దర్శనానంతరం ఈ నెల 11న ఆయా డిపోలకు చేరుతాయని వివరించారు. పూరీ జగన్నాథ రథయాత్రకు వెళ్లేందుకు కూడా స్పెషల్ బస్సులు సిద్ధం చేశామని శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ ప్రాజెక్ట్స్ ఈఈగా సీతయ్య



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా రోడ్లు, భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖ ప్రాజెక్టు ఈఈగా ఎన్.సీతయ్య మంగళవారం కాకినాడలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా పని చేస్తున్న మల్లికార్జున రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో కొయ్యలగూడెం డీఈగా ఉన్న సీతయ్యకు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనను పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్యం రాంబాబు తదితరులు అభినందించారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: స్థానిక శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారికి పెద్ద సంఖ్యలో భక్తులు మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం, షష్ఠి కలసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అభిషేకాల అనంతరం స్వామివారికి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యాన అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఈఓ రామలింగ భాస్కర్ ఆధ్వర్యాన సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఇదేం తీరువా బాబూ!

- రూ.12 కోట్ల నీటితీరువా వసూలుకు సర్కారు సన్నాహాలు
- కొత్తగా రూ.35 సర్వీసు ట్యాక్స్
- చిల్లిగవ్వ సాయం చేయకపోగా ఈ వసూళ్లేమిటని రైతుల అసహనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గత ఖరీఫ్, తరువాత రబీ సీజన్లు రెండూ వెళ్లిపోయాయి. మళ్లీ ఖరీఫ్ వచ్చేసింది. అయినప్పటికీ పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు మాట ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో, సాగు పెట్టుబడి కోసం రైతులు నానా అగచాట్లూ పడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో పులి మీద పుట్రలా నీటితీరువా వసూళ్లకు కూటమి సర్కారు సన్నాహాలు చేస్తోంది. పిడుగులాంటి ఈ వార్త రైతులను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది.

సిద్ధమవుతున్న రెవెన్యూ యంత్రాంగం

జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో రెండు ఫసలీల(1433, 1434)కు (ఫసలీ – పంట కాలం) పాత బకాయిలతో కలిపి నీటితీరువా రూ.12 కోట్ల పైమాటే. ఈ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్క పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోనే 11 మండలాల్లో 1.79 లక్షల పై చిలుకు ఖాతాల్లో నీటితీరువా వసూలు చేయాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది మే నెల నాటికి 1434 ఫసలీలో రైతుల నుంచి నీటితీరువా బకాయి రూ.7.36 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడ డివిజన్‌లోని 10 మండలాల్లోని 143 గ్రామాల పరిధిలో 1,07,720 ఖాతాలున్నాయి. వీటి ద్వారా రూ.4.80 కోట్ల బకాయిలున్నాయని లెక్కలు తేల్చారు. ఈ రకంగా జిల్లావ్యాప్తంగా 2,86,771 ఖాతాల నుంచి నీటితీరువా బకాయిలు వసూలు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమవుతోంది.

సర్వీస్ ట్యాక్స్ బాదుడు

ఈ మేరకు ఆర్డీఓలకు, మండలాల తహసీల్దార్లకు, అక్కడి నుంచి వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రెండు పంటలు పండే వ్యవసాయ భూములైతే ఎకరానికి మొదటి పంటకు రూ.200, రెండో పంటకు రూ.150 కలిపి మొత్తం రూ.350 నీటితీరువా వసూలు చేయనున్నారు. అదే ఆక్వా చెరువులైతే ఏడాదికి ఒకే పంట తీస్తారనే లెక్కలతో నీటితీరువా ఎకరానికి రూ.500గా పేర్కొన్నారు. నీటితీరువా వసూలుతోనే ఆగిపోకుండా కూటమి సర్కార్ రైతులపై సర్వీసు ట్యాక్స్ రూపంలో కూడా బాదేస్తోంది. నీటితీరువా కోసం జరిపే ప్రతి లావాదేవీకి అదనంగా రూ.35 సర్వీసు ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించింది. దీనిని రైతుసంఘాల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు. మునుపెన్నడూ ఇటువంటి సర్వీసు ట్యాక్స్ తాము చూడలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నీటితీరువా, సర్వీసు ట్యాక్స్ చూడటానికి తక్కువగానే ఉన్నట్లు కనిపిస్తోంది. కానీ, గడచిన నాలుగేళ్లకు కలిపితే రైతులపై పెనుభారం పడుతుందని అంటున్నారు. పైగా, రైతు సాగు చేసే ప్రతి ఎకరానికి ఇది పెరుగుతూ పోతుంది.

వీఆర్‌ఓలకు భారం

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందనే సామెత చందంగా వీఆర్‌ఓల పరిస్థితి తయారైంది. నీటితీరువా వసూలు ప్రక్రియ వారికి ఆర్థికంగా భారం కానుంది. భూముల రీసర్వే అయిన గ్రామాల్లో నీటితీరువా వసూలు రెవెన్యూ యంత్రాంగానికి గుదిబండగా మారనుంది. రీసర్వే కాక ముందు 1433 ఫసలీలో అప్పటి వరకూ ఉన్న నీటితీరువా బకాయిలకు ఒక డిమాండ్ నోటీసు, రీసర్వే తరువాత వచ్చిన 1434 ఫసలీలో ఉన్న బకాయిలకు మరో డిమాండ్ నోటీసు జారీ చేయాలి. అంటే ఒక రైతుకు సంబంధించిన బకాయిల వసూలుకు వీఆర్‌ఓ రెండు డిమాండ్ నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. దీనికయ్యే ఖర్చుల విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ లేవు. ఈ నేపథ్యంలో గ్రామంలోని రైతులందరికీ రెండేసి నోటీసులు జారీ చేయాలంటే ఆర్థికంగా కుదేలైపోతామని వీఆర్‌ఓలు అంటున్నారు. కరప మండలంలోని ఒక మేజర్ గ్రామ పంచాయతీ వీఆర్‌ఓకు డిమాండ్ నోటీసులు జారీ చేసేసరికి రూ.18 వేల మేర చేతిచమురు వదిలిందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈ ఖర్చులు ఎవరు భరిస్తారని వీఆర్‌ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగన్ సర్కారులో ఆ ఊసే లేదు

రైతు పక్షపాతి అయిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అసలు నీటితీరువా అనేదే లేకుండా చేశారు. తద్వారా రైతుల నెత్తిన పాలు పోశారు. వాస్తవానికి నీటి తీరువాను గతంలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు వ్యక్తిగతంగా వసూలు చేసేవారు. ఈ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉండటంతో ఆన్‌లైన్ చేద్దామని నాటి జగన్ ప్రభుత్వం భావించింది. రాష్ట్రవ్యాప్తంగా నీటితీరువా డిమాండ్ రూ.350 కోట్లు మించి లేదు. అటువంటప్పుడు అదేమీ పెద్ద విషయం కాదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నీటితీరువా వసూలుపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తద్వారా రైతులకు మేలు చేసింది. దీంతో, సుమారు నాలుగేళ్లుగా వారికి రూపాయి కూడా నీటితీరువా చెల్లించాల్సిన అవసరం రాలేదు.

మండలాల వారీగా 1434 ఫసలీలో నీటితీరువా డిమాండ్, వసూలు వివరాలు (రూ.లు)

పెద్దాపురం రెవెన్యూ డివిజన్

మండలం	డిమాండ్	వసూలు	బ్యాలెన్స్
గండేపల్లి	10,47,383	---	10,47,383
జగ్గంపేట	27,99,974	---	27,99,974
కిర్లంపూడి	2,43,71,714	---	2,43,71,714
కోటనందూరు	93,36,189	12,81,971	80,54,218
పెద్దాపురం	1,13,36,038	5,39,959	1,07,96,079
ప్రత్తిపాడు	50,23,200	---	50,23,200
రౌతులపూడి	13,99,873	---	13,99,873
శంఖవరం	5,15,997	---	5,15,997
తొండంగి	1,04,34,976	4,93,142	99,41,834
తుని	26,04,969	---	26,04,969
ఏలేశ్వరం	70,82,381	---	70,82,381
మొత్తం	**7,59,52,694**	**23,15,072**	**7,36,37,622**
కాకినాడ రెవెన్యూ డివిజన్			
పెదపూడి	99,31,430.94	4,08,077.00	95,23,353.87
కాజులూరు	82,41,762.46	2,73,796.00	79,67,966.46
పిఠాపురం	79,94,757.17	5,51,368.00	74,43,352.60
కరప	73,66,201.82	1,29,681.00	72,36,520.79
సామర్లకోట	59,89,496.35	2,17,637.00	57,71,853.53
గొల్లప్రోలు	33,94,159.40	41,203.00	33,52,954.44
కొత్తపల్లి	35,04,440.89	1,58,863.00	33,45,577.86
కాకినాడ రూరల్	17,13,798.04	1,11,853.00	16,01,943.62
తాళ్లరేవు	16,32,013.18	77,327.00	15,54,686.13
కాకినాడ అర్బన్	2,81,906.40	8,175.00	2,73,730.99
మొత్తం	**5,00,49,966.65**	**19,77,980.00**	**4,80,71,940.03**

అన్నదాతపై భారం మోపేలా..

గత ప్రభుత్వ విధానానికి భిన్నంగా చంద్రబాబు ప్రభుత్వం రైతులను నానా ఇక్కట్లకూ గురి చేస్తోంది. గద్దెనెక్కగానే రైతులకు చేస్తానన్న సాయం చేయకపోగా వారిపై భారం మోపేలా నిర్ణయం తీసుకుంది. వ్యవసాయం దండగన్న చంద్రబాబు అందుకు తగ్గట్టుగానే రైతుల నెత్తిన అకస్మాత్తుగా నీటితీరువా గుదిబండ వేశారు. ఆయన గద్దెనెక్కాక రెండో వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా రైతుకు ఇస్తామన్న పెట్టుబడి సాయం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. పైగా ఇప్పుడు నీటితీరువా వసూలు చేయాలని రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై రైతులు మండిపడుతున్నారు. ఇంత కాలం అసలు నీటితీరువా అంటూ ఒకటి ఉందనే విషయాన్నే వారు మరచిపోయారు. అటువంటిది బకాయిలతో కలిపి నీటితీరువా వసూలు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం సమాయత్తం కావడం రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది.

సాయం చేయకుండా నీటితీరువా వసూలా?



వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతోంది. రైతులు పెట్టుబడిలు కోసం నానా ఇబ్బందులూ పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకూ రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాదైపోతున్నా ఆ మాట నిలబెట్టుకోలేదు. ఇప్పుడు చూస్తే నీటితీరువాను బకాయిలతో సహా ఇప్పటికిప్పుడు ఒకేసారి వసూలు చేయడం సహేతుకం కాదు. చాలా ఏళ్లుగా నీటితీరువా వసూలు చేయడం లేదు. రైతులు కూడా ఈ విషయం పూర్తిగా మరచిపోయారు. అలాగే, రూ.35 సర్వీసు ట్యాక్స్ వసూలు నిర్ణయం కూడా వెనక్కు తీసుకోవాలి.

– రావుల ప్రసాద్, రైతు సంఘ ప్రతినిధి, కూరాడ, కరప మండలం

పట్టాభిరామ్ మనవారే..

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మరణంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. పట్టాభిరామ్కు ఈ జిల్లాతో విడదీయరాని అనుబంధమే ఉంది. ఉమ్మడి జిల్లాలోని కె.గంగవరం మండలం దంగేరులో ఆయన పూర్వీకులు నివాసం ఉండేవారు. అక్కడ నుంచి ద్రాక్షారామ సమీపంలోని దొడ్డంపేటలో తల్లిదండ్రులతో కలిసి నివాసముండగా పట్టాభిరామ్ రామచంద్రపురంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించారు. ఉన్నత చదువుల కోసం కాకినాడ వచ్చి అక్కడి పీఆర్ కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. కాలి వైకల్యంతో ఉన్న ఆయన ఆ లోపం కనపడకుండా ఉండేందుకు.. తండ్రి రావు సాహెబ్ భావరాజు సత్యనారాయణ సూచన మేరకు ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబీ రావ్ వద్ద ఇంద్రజాలంలో శిక్షణ పొందారు. అక్కడ నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. కాకినాడ నుంచి హైదరాబాద్‌లో భారత ఆహార సంస్థ ఉద్యోగిగా ఉంటూ అనేక ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తూ జిల్లా పేరు ప్రతిష్టలను రాష్ట్రవ్యాప్తం చేశారు. ఇంద్రజాలంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై అనేక పుస్తకాలు రాశారు. ఇంద్రజాలం అంటే ఒక వినోదం మాత్రమే కాదని, మూఢ నమ్మకాలపై పరోక్షంగా ఒక యుద్ధాన్ని చేశారు. 1949లో జన్మించిన పట్టాభిరామ్ 75 ఏళ్ల వయసులో ఖైరతాబాద్‌లో మృతి చెందడంతో ఈ ప్రాంత వాసులు ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

పోలవరంపై సీఎం పచ్చి అబద్ధాలు

- డయాఫ్రం వాల్ నాశనానికి చంద్రబాబే కారణం
- జగన్ హయాంలో గేట్లు సహా అత్యధిక శాతం పనులు పూర్తి
- వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి (కొవ్వూరు): పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండిపడ్డారు. తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం జరిగిన పర్యటన సందర్భంగా సీఎం చేసిన ప్రసంగంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో కుడి, ఎడమ కాలువలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దాదాపు పూర్తి చేశారని గుర్తు చేశారు. అనంతరం 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో కేవలం ఒక గేటు పెట్టి, ప్రాజెక్టును చూడటానికి జనాన్ని బస్సుల్లో తరలించి, వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృథా చేశారని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుకు అన్ని గేట్లూ పెట్టారని, ప్రాజెక్టు నిర్మాణం చాలా వరకూ పూర్తి చేశారని చెప్పారు. దీనిని కావాలనే విస్మరించి, జగన్ హయాంలో కేవలం 4 శాతం పనులే జరిగాయని చంద్రబాబు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఏడాదిలో 6 శాతం పనులు పూర్తి చేశామంటున్నారని, అదే సమయంలో ప్రాజెక్టు 82 శాతం పూర్తయ్యిందంటున్నారని, అటువంటప్పుడు ఇదంతా ఎవరి హయాంలో జరిగినట్లని వెంకట్రావు ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నాశనమవడానికి చంద్రబాబే కారణమని ఆరోపించారు. పోలవరం సందర్శనకు రూ.500 కోట్ల ప్రజాధనం వృథా చేశారన్నారు. చంద్రబాబుకు డబ్బులు, క్రెడిట్ దక్కించుకోవడం తప్ప పోలవరం ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభంలో శీనయ్య కమిటీ రెండు డయాఫ్రం వాల్స్ కట్టాలని సూచించినప్పటికీ చంద్రబాబు ఒక్కటి మాత్రమే నిర్మించారని విమర్శించారు. అది కూడా ఒకచోట 52 మీటర్లు, మరోచోట 92 మీటర్ల మేర ఇష్టారాజ్యంగా నిర్మించారని చెప్పారు. డయాఫ్రం వాల్ పునాది కచ్చితంగా హార్డ్ రాక్ వరకూ వెళ్లాలని అధికారులు సూచించినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. అందువల్లనే నేడు ఈ దుస్థితి నెలకొందని, చేసిన తప్పు ఒప్పుకొని లెంపలేసుకోవాల్సింది పోయి, ఆ తప్పును జగన్‌పై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

పింఛన్ల పంపిణీకి రూ.కోట్లు దుర్వినియోగం

గత ప్రభుత్వంలో ప్రతి నెలా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తే.. నేడు ప్రతి నెలా చంద్రబాబు తన ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండానే అమలు చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో కొత్త పథకాలు ప్రారంభించడానికి మాత్రమే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభలు పెట్టేవారని, కానీ నేడు ప్రతి దానినీ చంద్రబాబు ప్రచారార్భాటానికి వాడుకుంటున్నారని విమర్శించారు. రాజకీయాల్లో రౌడీలు ఉన్నారంటున్నారని, ఆయన పార్టీలో ఎంత మంది రౌడీలున్నారని ప్రశ్నించారు. పైగా ఇసుక, మద్యం, మట్టి, మైనింగ్ మాఫియాలుగా మారి ప్రజాధనాన్ని దోచుకుంటున్నది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంపై దాడులు చేసి కేసులు పెడుతున్నది ఈ ప్రభుత్వం కాదా అని వెంకట్రావు నిలదీశారు.

> పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతం పైగా పూర్తి చేశామని 2024 జూన్‌లో చెప్పారు. పోలవరం అంచనా రూ.55,549 కోట్లు అయినప్పుడు రూ.13,683 కోట్లు అంటే 24 శాతం ఖర్చు చేసి 72 శాతం పూర్తి చేశానని ఎలా అన్నారు? అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. జనాన్ని నమ్మించడానికే ఈ కట్టు కథలు చెబుతున్నారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అమలాపురం టౌన్: పురాతన దేవస్థానమైన అమలాపురం భూపయ్య అగ్రహారంలోని సీతా రామచంద్రమూర్తి స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన జీవీఎంఎం సేవా ట్రస్ట్ చైర్మన్ గుళ్లపల్లి సత్యనారాయణ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దేవస్థానం వద్ద దాత గుళ్లపల్లి సత్యనారాయణ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులకు ఈ విరాళాన్ని మంగళవారం అందించారు. తన తల్లిదండ్రులు దివంగత గుళ్లపల్లి వెంకట్రామయ్య, మహాలక్ష్మమ్మ, తన భార్య దివంగత కామేశ్వరి సంస్మరణార్థం విరాళం అందజేసినట్టు సత్యనారాయణ తెలిపారు. కమిటీ ప్రతినిధులు జిల్లెళ్ల గోపాల్, విస్సాప్రగడ చాన్న, మండలీక నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రతినిధులకు విరాళం అందిస్తున్న దాత

హైవేకి రెడ్ సిగ్నల్

- కోనసీమ జిల్లాలో ఎక్కడికక్కడే జాతీయ రహదారుల నిర్మాణాలు
- నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్
- ముందుకు కదలని సఖినేటిపల్లి–నర్సాపురం బైపాస్
- 216ఈ చుట్టూ భూ వివాదాలు
- ప్రతిపాదనల దశలోనే కోటిపల్లి–ముక్తేశ్వరం వంతెనకు ఫుల్‌స్టాప్
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన పనులు

కోనసీమ జిల్లాకు జీవనాడిగా మారనున్న నాలుగు జాతీయ రహదారుల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం వచ్చాక అడుగు ముందుకు పడడం లేదు. వీటిలో కొన్ని నిర్మాణ దశల్లోనే ఆగిపోగా.. మరికొన్నింటికి భూసేకరణ ఇబ్బందికరంగా మారింది. కొన్ని నిర్మాణాలు ప్రతిపాదన దశ దాటడం లేదు. ఇవి పూర్తయితే కోనసీమ స్వరూపమే మారిపోనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగాయి. కొత్త రహదారులకు వేగంగా ప్రతిపాదనలు సిద్ధం కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక అటు నిర్మాణాలు.. ఇటు ప్రతిపాదనలు పడకేశాయి. – సాక్షి, అమలాపురం

నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్ అప్రోచ్ నిర్మాణ పనులు

వీడిన భూ సమస్యలు!

కోనసీమ జిల్లా శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం రామరాజులంక వరకు వరకు 216 బైపాస్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో అనుమతిచ్చింది. సుమారు 22.17 కి.మీ. ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును హైవేగా గుర్తించారు. రామరాజులంక వద్ద వశిష్టపై 380 మీటర్ల మేర వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. వంతెన, రహదారి నిర్మాణాలకు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరైంది. వంతెన, రోడ్ల నిర్మాణ పనులను 2025–26 పూర్తి చేయాలని లక్ష్యం. ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. సఖినేటిపల్లి రేవు వద్ద వంతెన నిర్మాణం దశాబ్దాలుగా ముందుకు సాగకపోవడంతో, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ బైపాస్‌ను కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు ప్రతిపాదించింది. దీంతో ఈ రోడ్డు, వంతెనలకు మార్గం సుగమమైంది. ఆయా పనులకు అవసరమైన భూసేకరణకు అవాంతరాలు ఏర్పడ్డాయి. కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ఆ వివాదాలు తొలిగాయని, త్వరలోనే పనులు మొదలవుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

శివకోడు రహదారి

ముక్తేశ్వరం–కోటిపల్లి మధ్య పంటుపై రాకపోకలు

కోటిపల్లి వంతెన ప్రతిపాదనలతో సరి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడ్డాక ముక్తేశ్వరం, కోటిపల్లి రేవు మధ్య రాకపోకలు పెరిగాయి. దీంతో పాటు దశాబ్ద కాలంగా హామీగా ఉండిపోయిన ముక్తేశ్వరం, కోటిపల్లి మధ్య వంతెన నిర్మాణం సైతం తెరపైకి వచ్చింది. కత్తిపూడి–నర్సాపురం ఫెర్రీ (కేఎన్‌ఎఫ్) రోడ్డులో భాగంగా కోటిపల్లి వద్ద వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. జిల్లా ఏర్పడ్డాక రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందినవారు కలెక్టరేట్, ఇతర పనుల కోసం జిల్లా కేంద్రమైన అమలాపురం రావడం పెరిగింది. ఇప్పుడు పడవలు, పంట్లపై రాకపోకలు చేయాల్సి రావడం వాహనచోదకులకు వ్యయప్రయాసగా మారింది. దీంతో ఇక్కడ వంతెన ఆవశ్యకతను గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ ఎంపీ చింతా అనూరాధ విశేష కృషి చేశారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ జయరామ్ గడ్కరీని ఒప్పించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అప్పట్లో ఆయన ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు కూడా. ప్రభుత్వం మారడంతో దీని ఊసే లేకుండా పోయింది.

మూడేళ్లు దాటుతున్నా..

జాతీయ రహదారి 216ఏలో ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. 2022 సెప్టెంబర్ 22న పనులు మొదలు కాగా, ఇంకా పూర్తి కాలేదు. దీంతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరాన్ని ఆనుకుని మోరంపూడి వద్ద ఫ్లైఓవర్ కూడా జొన్నాడతో పాటు ప్రారంభించారు. ఇప్పటికే మోరంపూడి ఫ్లై ఓవర్ వినియోగంలోకి రాగా, జొన్నాడ మాత్రం బాలారిష్టాలు దాటడం లేదు. పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిపై గెడ్డర్లు, శ్లాబ్ వేయాల్సి ఉంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. అప్రోచ్ నిర్మాణం కోసమని పి.గన్నవరంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే, అక్రమార్కులు తవ్వకాలు చేసి కాసులు దండుకున్నారు. నిర్మాణ పనుల వల్ల జొన్నాడ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ స్తంభించి, ఇటు రాజమహేంద్రవరం, రావులపాలెం, కాకినాడ వెళ్లే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

ఎన్‌హెచ్ టు ఎన్‌హెచ్ ఎప్పుడో?

జాతీయ రహదారి 216 (కత్తిపూడి నుంచి ఒంగోలు), జాతీయ రహదారి 216ఏ (దివాన్ చెరువు నుంచి రావులపాలెం మీదుగా గుండుగొలను వరకు) ఉన్న జాతీయ రహదార్లను అనుసంధానం చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్ ముందుకొచ్చింది. ఎన్‌హెచ్–ఈ అమలాపురం పేరూరు నుంచి ముక్కామల, కొత్తపేట మీదుగా రావులపాలెం సమీపంలోని మార్కెట్ యార్డు వరకు నిర్మించాలని నిర్ణయించారు. తొలుత దీనికి రూ.450 కోట్లు కేటాయించారు. తర్వాత ఇది రూ.735 కోట్లకు చేరిందని అంచనా. ఏడు మీటర్ల వెడల్పున ఉన్న రహదారిని పది మీటర్ల వెడల్పున నిర్మించనున్నారు. దీనిలో అమలాపురం సమీపంలోని నడిపూడి నుంచి పేరూరు వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి ఉంది. ఇప్పటి వరకు ఈదరపల్లి నుంచి కొత్తపేట వరకున్న ఆర్‌అండ్‌బీ రహదారి మరింత వెడల్పు కానుంది. ఈ రోడ్డు పూర్తయితే రెండు జాతీయ రహదారుల మధ్య మరో ఎన్‌హెచ్ రోడ్డు వచ్చినట్టవుతోంది. ఈ ప్రాజెక్టుకు గతంలో భూసేకరణకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతమేర గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రతిపాదన రావడంతో.. ఇందుపల్లి, ఇతర ప్రాంతాల వాసులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. వీరు ప్రత్యామ్నాయ రహదారిని సూచిస్తున్నా స్థానికంగా పట్టించుకునేవారు లేరు. దీంతో ఈ రోడ్డు నిర్మాణం ఇంకా ప్రతిపాదనల దశ దాటలేదు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

14 నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ

విజయనగరంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణ

సామర్లకోట: తూర్పుగోదావరి జిల్లాలోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో శిక్షణ ఉంటుందని శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ ఎ.రవిశంకర్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని ఎంపీటీసీ సభ్యులకు సామర్లకోట ఈటీసీలోనే శిక్షణ ఇవ్వాలని తొలుత నిర్ణయించారని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈటీసీ సిబ్బంది ఆయా జిల్లాలకు వెళ్లి శిక్షణ ఇవ్వాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. దాంతో ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు మంగళవారం శిక్షణ ప్రారంభించినట్టు వివరించారు. కోర్సు డైరెక్టర్‌గా కేఆర్ నిహారిక, ఫ్యాకల్టీలు వి.జగన్నాథం, భాజా మొహీద్దీన్ శిక్షణ ఇస్తారన్నారు. రెండో తేదీ నుంచి శ్రీకాకుళం జిల్లా మహిళా ప్రాంగణంలో, ఎనిమిదో తేదీ నుంచి విశాఖపట్నంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో, పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో శిక్షణ ఉంటుందన్నారు.

నెల రోజులు సెక్షన్–30 అమలు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌లో నెల రోజుల పాటు సెక్షన్–30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ మంగళవారం ఇక్కడ వెల్లడించారు. అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ల పరిధిల్లో ఈ నెల 31 వరకూ ఈ సెక్షన్ వర్తిస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాంటి కార్యకలాపాలు జరపడానికి ముందుగా తన అనుమతి పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టెండర్ ఖరారు రేపే..

- ప్రముఖ దేవాలయాలకు గత ఏప్రిల్‌లో నోటిఫికేషన్
- దానిని రద్దు చేసి మళ్లీ జూన్ 12న రీటెండర్
- కొత్త షరతుల ప్రకారం రూ.80 లక్షలకు పెరిగే అవకాశం

అన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సహా, రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు శానిటరీ మెటీరియల్, క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్డ్ ఈ–ప్రొక్యూర్ రీ టెండర్ గురువారం ఖరారు కానుంది. దీని ప్రైస్ బిడ్‌ను విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం తెరవనున్నారు. సోమవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా, విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్, ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయ్యాయి. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ గురువారం ఓపెన్ చేసి, లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన వారికి టెండర్ ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.

గత టీడీపీ ప్రభుత్వంలో 'పద్మావతి'కి టెండర్

కాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య రాష్ట్రంలో అన్నవరం దేవస్థానం సహా, పలు దేవస్థానాల్లో శానిటరీ టెండర్‌ను పద్మావతి సంస్థ దక్కించుకుంది. మొదట రెండేళ్ల కాల పరిమితికి టెండర్ దక్కించుకున్న ఈ సంస్థకు, తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం మరో రెండేళ్లు కాంట్రాక్ట్ పొడిగించింది. ఇప్పుడు మరలా అదే సంస్థ టెక్నికల్ బిడ్‌లో క్వాలిఫై కావడంతో, మరలా ఆ సంస్థకే టెండర్ దక్కే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పద్మావతి సంస్థ యజమాని భాస్కరనాయుడు టీడీపీ పెద్దలకు సన్నిహితుడు కావడమే కారణంగా చెబుతున్నారు.

ప్రముఖ దేవస్థానాల్లో రీ టెండర్

గత ఏప్రిల్ నెలలో పిలిచిన టెండర్ నోటిఫికేషన్‌పై టెండర్‌దారులు అనేక సందేహాలను వ్యక్తం చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం దానిని రద్దు చేసింది. కొన్ని మార్పులతో కొత్త నోటిఫికేషన్‌ను జూన్ 12న విడుదల చేసింది. టెండర్‌దారులు తమ కొటేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీ జూన్ 26గా నిర్ణయించారు. మొత్తం 23 మంది టెండర్ కోసం పోటీ పడినా, వివిధ కారణాలతో 21 మంది తప్పుకొన్నారు. చివరకు చైతన్యజ్యోతి, పద్మావతి సంస్థలు ప్రైస్ బిడ్‌కు ఎంపికయ్యాయి.

ఏడు దేవస్థానాల్లో శానిటరీ నిర్వహణ

టెండర్ దక్కించుకున్న సంస్థ రెండేళ్ల కాల పరిమితిలో అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గ గుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో పారిశుధ్య పనులు, వివిధ సత్రాల్లో హౌస్ కీపింగ్, రహదార్లు, టాయిలెట్స్ క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనులు నిర్వహించాల్సి ఉంది.

గత ప్రభుత్వ హయాంలో విడివిడిగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దేవస్థానాల వారీగా శానిటరీ టెండర్లు ఖరారు చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని పది నెలలు జాప్యం చేసింది. ఒకే యూనిట్‌గా టెండర్లు నిర్వహించాలని గతేడాది ఆగస్టు 27న కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కాంట్రాక్ట్ ముగిసి ఆరు నెలలైనా..

అన్నవరం దేవస్థానంలో శానిటరీ విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్ట్ గతేడాది నవంబర్‌తో ముగిసింది. ఆ కాంట్రాక్ట్ ముగియడానికి ఒక నెల ముందుగానే గత అక్టోబర్‌లో టెండర్ విడుదల కావాల్సి ఉంది. టెండర్లు ఆలస్యం కావడంతో, దేవస్థానం కోరిక మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. మార్చి ఒకటి నుంచి తాము విధులు నిర్వహించలేమని దేవస్థానానికి లేఖ సమర్పించారు. దీంతో టెండర్ పిలవకుండానే గుంటూరుకు చెందిన కనకదుర్గా శానిటరీ సర్వీసెస్ సంస్థకు తాత్కాలికంగా పనులు అప్పగించారు.

పెరగనున్న కాంట్రాక్ట్..?

గత నవంబర్‌తో ముగిసిన కేఎల్‌టీసీ సంస్థ శానిటరీ టెండర్ నెలకు రూ.49 లక్షలు. దేవస్థానం కనకదుర్గా ఏజెన్సీకి నెలకు రూ.59 లక్షలు జీతాలుగా చెల్లిస్తున్నారు. రూ.12 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. మొత్తం నెలకు రూ.71 లక్షలు ఖర్చు చేస్తున్నారు. తాజాగా అన్ని దేవస్థానాలకు కలిపి సెంట్రలైజ్డ్ టెండర్‌లో అత్యాధునిక మెషినరీలు ఉపయోగించాలనే షరతు విధించారు. శానిటరీ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం జీతాల చెల్లింపుతో పాటు, వారాంతపు సెలవుల్లో సిబ్బంది రిలీవర్స్‌గా కొంతమందిని నియమించనున్నారు. ఏసీలు, విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కూడా కలిపారు. ఫలితంగా దేవస్థానంలో నెలకు శానిటరీ కాంట్రాక్ట్ రూ.80 లక్షలకు పైమాటే అంటున్నారు.

రత్నగిరిపై ఆలయ ప్రాంగణం శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రైవేట్ ఏజెన్సీల విధానాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద రవాణా జేఏసీ ధర్నా

అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

అమలాపురం రూరల్: రవాణా శాఖాధికారులను పక్కనపెట్టి, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ ప్రైవేట్ ఏజెన్సీలు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా రవాణా జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రవాణా జేఏసీ జిల్లా కో–ఆర్డినేటర్, ఆంధ్రా ఆటోవాలా జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల మోటారు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ చేయడానికి జిల్లా రవాణా అధికారులను విస్మరించి, ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడం వల్ల వాహన యాజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. యాంత్రీకరణ విధానం నిలిపి, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా జేఏసీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సదస్సు ఈ నెల 4న అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 9న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. రవాణా జేఏసీ జిల్లా కన్వీనర్ రాగుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు పోలిశెట్టి సీతారాంబాబు, బొంతు బాలరాజు, యాళ్ల వెంకటేశ్వరరావు, ఎల్లమెల్లి పెద్దా తదితరులు పాల్గొన్నారు.

రెండు పొక్లెయిన్లు సీజ్

మానేపల్లిలంకలో సీజ్ చేసిన పొక్లెయిన్ వద్ద ఆర్డీఓ, తహసీల్దార్

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లిలంకలో అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న రెండు పొక్లెయిన్లను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ మంగళవారం సీజ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని యర్రంశెట్టివారిపాలెం, పెదకందాలపాలెం, మానేపల్లిలంకలో ర్యాంపులను తహసీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. మానేపల్లిలంకలో ఉన్న పొక్లెయిన్లను సీజ్ చేసి మైన్స్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 15 వరకూ జిల్లాలో ఎక్కడా మట్టి, ఇసుక తవ్వకాలు జరపరాదని కలెక్టర్ ఆదేశించారన్నారు. అక్రమ తవ్వకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాంపుల్లోకి లారీలు, ట్రాక్టర్లు వెళ్లకుండా బాటలను కట్ చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయా ర్యాంపుల్లో ఎంత మేరకు అక్రమ తవ్వకాలు జరిపారో డ్రోన్ల ద్వారా సర్వే చేయించి, సంబంధిత వ్యక్తులకు డిమాండ్ నోటీసులు పంపిస్తామని ఆర్డీఓ చెప్పారు.

లారీని ఢీకొన్న గూడ్స్ ఆటో

జొన్నాడకు చెందిన డ్రైవర్ మృతి

సూరిశెట్టి శ్రీధర్ (ఫైల్)

కిర్లంపూడి: ఆగి ఉన్న లారీని గూడ్స్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్(43) గూడ్స్‌ఆటోలో విశాఖపట్నానికి పువ్వుల లోడుతో కిరాయికి వెళ్లాడు. అక్కడి నుంచి న్యూస్ పేపర్ల లోడును వేసుకుని రాజమండ్రికి తిరిగొస్తుండగా, మంగళవారం తెల్లవారుజామున కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మరణించాడు. అతడి సోదరుడు సూరిశెట్టి గంగాజలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గ్రామంలో తీవ్ర విషాదం

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో సూరిశెట్టి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన శ్రీధర్ 12 ఏళ్లుగా జొన్నాడలో నివసిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యజమాని శాశ్వతంగా దూరం కావడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ఇక తమకు దిక్కెవరంటూ మృతదేహం వద్ద కుటుంబీకులు రోదించిన తీరు చూపరులను కలచివేసింది. బంధువులు విషాదంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో పిఠాపురానికి చెందిన చాగంటి వీరవెంకట భీమ మల్లికార్జున శర్మ(39) మృతి చెందారు. కాకినాడ జయేంద్రనగర్ ఎస్‌బీఐ ఈ–కార్నర్ వద్ద రోడ్డుపై సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, రాత్రి 11.45 సమయంలో మల్లికార్జున శర్మ స్నేహితుడికి సెల్‌ఫోన్ ద్వారా స్థానికులు ప్రమాద సమాచారాన్ని తెలిపారు. స్నేహితుడు మంత్రిప్రగడ సుబ్బారావు అక్కడకు చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న మల్లికార్జున శర్మను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడు మల్లికార్జున శర్మ తండ్రి వీరేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు మోటార్ సైకిల్‌పై స్నేహితులను కలిసేందుకు కాకినాడ వెళ్లిన కుమారుడు శవమయ్యాడని, ఏకైక కుమారుడిని కోల్పోయామని తండ్రి వీరేశ్వరరావు విలపించారు. ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో కలెక్షన్ విభాగంలో మల్లికార్జున శర్మ పని చేస్తూ ఇటీవల ఉద్యోగం మానేశాడు.

కలలు కల్లలై..

- కెమికల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో చాగల్లు యువతి దుర్మరణం
- ప్రసన్న మృతితో గ్రామంలో విషాదఛాయలు
- ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఆమె అత్త కొడుకు

పొలిశెట్టి ప్రసన్న (ఫైల్)

చాగల్లు: బాగా చదువుకుంది. జీవితంలో ఏదో సాధించాలనే తపనతో ఉద్యోగంలో చేరింది. చిరుద్యోగులైన తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకుంది. తానొకటి తలిస్తే.. విధి ఒకటి తలచిందని.. ఉద్యోగంలో చేరిన రెండు నెలలకే ఆమెను మృత్యువు కబళించింది. ఆమె ఆశలన్నీ కల్లలయ్యాయి.

తెలంగాణలో పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో చాగల్లుకు చెందిన యువతి మృతి చెందడంతో చాగల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పొలిశెట్టి శ్రీనివాసరావు కుమార్తె ప్రసన్న(22) ఈ దుర్ఘటనలో మృతి చెందింది. రెండు నెలల క్రితమే ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా ఉద్యోగంలో చేరిన ప్రసన్న మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తండ్రి శ్రీనివాసరావు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, అనాథ పిల్లల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రామలక్ష్మి ఆశా కార్యకర్తగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ప్రసన్న కాగా, చిన్న కుమార్తె ప్రభుకుమారి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతుంది.

ప్రాణాపాయం నుంచి తప్పించుకుని..

ప్రసన్న అత్త కొడుకు కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన యాతం మహేష్ సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రసన్న కూడా రెండు నెలల క్రితమే అదే ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరింది. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ పనిపై మహేష్ బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. దుర్ఘటన విషయం తెలుసుకుని.. అదే సమయంలో డ్యూటీలో ఉన్న ప్రసన్న కూడా ప్రమాదానికి గురైందని గ్రహించి ఆమె తల్లిదండ్రులకు మహేష్ సమాచారం అందించాడు. సోమవారం సాయంత్రం శ్రీనివాసరావు, రామలక్ష్మి హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఎన్నో ఆశలతో..

దుర్ఘటనలో మృతిచెందిన ప్రసన్న బీ–ఫార్మసీ చదివింది. ఉన్నత చదువు అభ్యసించి జీవితంలో మంచి స్థానం సాధించాలని ఆశించింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో స్టైఫండ్ తీసుకుంటూ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగంలోకి చేరింది. ఎం–ఫార్మసీ చేయాలన్న తపనతో ఓ శిక్షణ సంస్థలో కూడా చేరింది. ఇదే విషయాన్ని దుర్ఘటనకు ముందురోజు ఆమె తల్లితో ఫోన్‌లో చెప్పింది. తాను ఎం–ఫార్మసీ చదివేందుకు ఫీజు చెల్లించానని ఆనందం పంచుకుంది. సోమవారం సాయంత్రం ఏడు గంటల నుంచి జరిగే క్లాసులకు వెళుతున్నానని తల్లికి చెప్పింది. ఎంతో ఆనందాన్ని పంచుకున్న కుమార్తె తమను విషాదంలో విడిచి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు రోదించారు.

కన్నీరుమున్నీరైన చెల్లెలు

చిన్ను(ప్రసన్న) కుటుంబ సభ్యులందరితో కలివిడిగా ఉండేదని, తామిద్దరం అక్కాచెల్లెలైనా.. స్నేహితుల్లా కలిసిమెలిసి ఉండేవాళ్లమని ప్రసన్న చెల్లెలు ప్రభుకుమారి కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. ప్రసన్న ఇంటి వద్ద బంధువుల రోదనలు హృదయవిదారకంగా మారాయి.

700 లీటర్ల డీజిల్ పట్టివేత

వాహనం, నిందితులతో పోలీసులు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న 700 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్న పాలకొల్లుకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. ట్రాక్టర్‌తో పాటు, 700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

జగ్గంపేట: జగ్గంపేట శివారు గుర్రంపాలెం రోడ్డులో పోలవరం కాలువ వద్ద పేకాట శిబిరంపై జగ్గంపేట పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.ఈ దాడిలో రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఎస్సై రఘునాథరావు, సిబ్బంది దాడులు నిర్వహించినట్టు తెలిపారు.

కనకాయలంక కాజ్ వే వద్ద వంతెన నిర్మాణం

రూ.22.83 కోట్లకు పరిపాలనా ఆమోదం

కనకాయలంక కాజ్ వేపై వరద నీటిలో వస్తున్న విద్యార్థినులు(ఫైల్)

పి.గన్నవరం: కొద్దిపాటి వరదకే కాజ్ వే నీటమునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక గ్రామ ప్రజలకు వరద కష్టాలు తీరనున్నాయి. మండలంలోని చాకలిపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న కనకాయలంక కాజ్ వే వద్ద హై లెవెల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.22.83 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా ఆమోదం ఇచ్చినట్టు గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ (ధవళేశ్వరం) ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ తెలిపారు. కనకాయలంక, చాకలిపాలెం (వశిష్ట ఎడమ ఏటిగట్టు) గ్రామాలను కలుపుతూ వశిష్ట నదిపై వంతెన నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. రూ.24 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, రూ.22.83 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కనకాయలంక గ్రామంలో సుమారు మూడు వేల మంది నివసిస్తున్నారు. వారి జీవన విధానం తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలంతో ముడిపడి ఉంది. నిత్యం కాజ్ వే దాటి పి.గన్నవరం మండలానికి వస్తుంటారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తే కనకాయలంక కాజ్ వే మునిగిపోతోంది. దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో కాజ్ వే దాటి వస్తుంటారు. వరద నీరు మరీ ఎక్కువైతే పడవలపై ప్రయాణిస్తారు. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే కనకాయలంక గ్రామాల ప్రజల వరద కష్టాలు తీరతాయి.

పెదలంక వద్ద వంతెన

అలాగే వరద సమయాల్లో ప్రజల రాకపోకల కోసం వశిష్ట ఎడమ ఏటిగట్టు నుంచి యలమంచిలి మండలం పెదలంకకు రూ.80.8 లక్షలతో సింగిల్ లైన్ రోడ్డు వంతెనకు కూడా పరిపాలనా ఆమోదం లభించినట్టు ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు. టెండర్లు పూర్తయిన తర్వాత ఈ వంతెన పనులు ప్రారంభమవుతాయని ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్ వివరించారు.

పరిమళించిన మానవత్వం

- మురుగు కాలువలో మతిస్థిమితం లేని మహిళ దైన్యం
- రెండు రోజుల తర్వాత ఆస్పత్రికి తరలింపు

కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద మురుగు కాలువలో కూర్చున్న యువతి

కోరుకొండ: ఏం చేస్తుందో ఆమెకు తెలియడం లేదు. ఎండైనా.. వానొచ్చినా మురుగు కాలువలోకి దిగి గంటల తరబడి ఉండిపోతోంది. ఎట్టకేలకు కొందరు చొరవ చూపడంతో.. ఆమెను కాపాడి ఆస్పత్రికి తరలించారు. మతిస్థిమితం లేని ఓ యువతి దయనీయ స్థితిలో మురికి కాలువలోనే రెండు రోజుల పాటు గడిపిన హృదయ విదారక సంఘటన కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎక్కడి నుంచి వచ్చిందో, కోరుకొండలో ఆమె సంచరిస్తోంది. మతి స్థిమితం లేకపోవడంతో ఎవరైనా పెట్టింది తిని కాలం వెళ్లదీస్తోంది. రెండు రోజుల నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్‌ను ఆనుకుని ఉన్న మురుగు కాలువలోకి దిగి, మళ్లీ బయటకు వస్తోంది. దుర్వాసన వస్తున్నా.. వ్యర్థాల మధ్యే రెండు రోజులుగా ఇలా చేస్తుండడాన్ని స్థానికులు గమనించారు. ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు ఈ కాలువ నుంచే గోదావరి నదిలోకి వెళ్తుంది. కొన్ని రోజులుగా కాలువకు వర్షపు నీరు రాకపోవడంతో ఆమెకు ఎటువంటి అపాయం కలగలేదు. కొందరు స్థానికులు ఈ విషయాన్ని పంచాయతీ వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆమెను కాలువ నుంచి బయటకు తీసుకొచ్చారు. సైగలు చేస్తూ, పొడిపొడిగా మాట్లాడుతూ ఆమె భయంగా ఉంటోంది. పారిశుధ్య కార్మికులు జలదుగుల చిన్నపార్వతి, సోమాజుల బంగారమ్మ, రాజమహేంద్రవరానికి చెందిన డివైన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

ల్యాండ్ కావలెను

■ రియల్ ఎస్టేట్ రంగంలో రెండు రాష్ట్రాల్లో అగ్రగామిగా ఉన్న ప్రముఖ సంస్థకు రాజమండ్రిలో డెవలప్‌మెంట్‌కొరకు లేఅవుట్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించుటకు ల్యాండ్ కావలెను. సంప్ర : 90591 13819 [V- 2828]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2640]

జ్యోతిష్యాలయం

■ కేరళ అగస్త్య నాడి జోతిష్యాలయం ప: వి. కృష్ణ స్వామి విద్యా ఉద్యోగం, ప్రేమ పెళ్ళి, సంతాన, కుటుంబ కలహాలు, స్త్రీ/పు వశీకరణ, ఆర్థిక సమస్య, ప్రేమలో మోసపోవడం మీ ఏ రకమైన కఠిన కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9676470724 [SCA25005838]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ ప్రముఖ గ్యాస్ ఏజెన్సీలో డోర్ టూ డోర్ సర్వే చేయుటకు యువతీ యువకులు కావలెను. జీతం: 18000. సంప్ర: 9121515459 [SCA25005832]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
కృష్ణాజిల్లా
బుధవారం । 2 । జూలై । 2025

దుర్గమ్మ సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పాకల వంశీ నాగేంద్ర మాధవ్ కుటుంబ సమేతంగా మంగళవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పీఆర్ కోసం ఆందోళన

లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన విద్యార్థులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ మంగళవారం హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.

న్యూస్‌రీల్

4 వరకు హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హంసలదీవి సాగరతీరం బీచ్ గేట్లను మూసివేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్ట్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పాటు ఈదురుగాలులు తీవ్ర కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల నాలుగో తేదీ వరకు బీచ్ గేట్లను మూసివేస్తామని వివరించారు. పర్యాటకులు సహకరించి ఈ మూడు రోజుల పాటు బీచ్‌కు రాకుండా ఉండాలని కోరారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచే బీచ్ గేట్లకు అటవీ అధికారులు తాళాలు వేశారు.

త్వరలో ఎ.కొండూరుకు కృష్ణా జలాలు

తిరువూరు: మరో 45 రోజుల్లో ఎ.కొండూరు మండలానికి కృష్ణా నదీజలాలను సరఫరా చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎ.కొండూరులో జల్‌జీవన్ మిషన్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షిత తాగు నీరందించే లక్ష్యంతో జల్ జీవన్‌మిషన్ అమలవుతోందన్నారు. కిడ్నీబాధిత తండాలకు కృష్ణా నదీ జలాలు ఇచ్చే ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి జరుగుతోందని, ఇప్పటికే ప్రధాన పైపులైను పనులు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం కంభంపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పరిశీలించారు.

డెంగీపై విస్తృత అవగాహన కల్పించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగీ నివారణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం డెంగీ డే సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పించే రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను డాక్టర్ మాచర్ల సుహాసిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెలరోజులు యాంటీ డెంగీ, యాంటీ మలేరియా మాసంగా పాటిస్తామని తెలిపారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా వ్యాధులపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఈ నెల రోజులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతి బాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు విపత్తు

- కృష్ణా జిల్లాలో 1.64 లక్షల హెక్టార్లలో వరిసాగు
- 1.02 లక్షల క్వింటాళ్ల వరి వంగడాలు అవసరం
- ప్రభుత్వం సరఫరా చేసింది 11,650 క్వింటాళ్లే..
- విత్తనాల కోసం రైతులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో 40 శాతానికి పైగా విత్తనాల పంపిణీ
- అవసరమైతే ఇండెంట్ పెట్టి సరఫరా చేసిన వైనం

చల్లపల్లిలో ఓ షాపు వద్ద లోడు రాగానే విత్తనాల కోసం ఎగబడిన రైతులు

అవనిగడ్డ: ఖరీఫ్ సాగు ఆరంభంలోనే కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 40 శాతానికి పైగా విత్తనాలను రైతులకు వారి గ్రామాల్లోనే అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పదిశాతం విత్తనాలు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీంతో కృష్ణాజిల్లా రైతులు వరి వంగడాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

అరకొరగా విత్తనాలు

కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.64 లక్షల హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఎక్కువగా ఎంటీయూ 1061, బీపీజీ 5204 రకాలను రైతులు సాగు చేస్తారు. గత సంవత్సరం ఎంటీయూ 1262, 1318 రకాలను పలుచోట్ల సాగుచేయగా వాటిని కొనేందుకు మిల్లర్లు ముందుకు రాలేదు. దీంతో ఈ సంవత్సరం రైతులు ఆ రకాల జోలికెళ్లడం లేదు. సాధారణంగా ఎకరాకు 25 నుంచి 30 కిలోల విత్తనాలను రైతులు నారుమడికి ఉపయోగిస్తారు. ఈ సీజన్‌లో 1.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవగా ప్రభుత్వం 10,650 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీంతో విత్తనాలు కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వచ్చిన లోడులు వచ్చినట్టు అయిపోతున్నాయి. రైతులు పనులు మానుకుని గంటల తరబడి ఎదురు చూసినా కొన్ని చోట్ల విత్తనాలు దొరకడం గగనంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 40 నుంచి 45 శాతం విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేసింది. అవసరమైతే డిమాండ్‌ను బట్టి మరో ఐదు శాతం విత్తనాలు సరఫరా చేసింది. ఈ ప్రభుత్వం పదిశాతం మాత్రమే సరఫరా చేయడంతో రైతులు విత్తనాలు కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కూడా విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలే అయిందని రైతులు తమకు తామే సర్దిచెప్పుకొన్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి కొనసాగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చల్లపల్లిలోని ఓ షాపులో పలు రకాల వరి విత్తనాలు

ఇప్పుడే ఇలా ఉంటే..

కృష్ణాజిల్లాలోని బందరు, కేఈబీ కెనాల్‌కు ఇటీవల సాగునీరు విడుదల చేశారు. గతంలో బోర్ల కింద అక్కడక్కడా రైతులు నారుమళ్లు పోసుకున్నారు. పంట కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో ఇప్పుడే నారుమళ్లు పోసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆదిలోనే విత్తనాలకు ఈ విధంగా డిమాండ్ ఉంటే సాగు పనులు ముమ్మరం చేస్తే పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 65 శాతం మంది కౌలు రైతులు ఉన్నారు. ఏటా పంట చేతికందగానే 85 శాతం మంది కౌలు రైతులు విత్తనాలకు తీయకుండానే ధాన్యం విక్రయిస్తారు. వీరంతా ప్రస్తుతం ఎక్కడో ఒకచోట విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేయాల్సిందే. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సాగుకు సరిపడా విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సరిపడా విత్తనాలు ఇవ్వాలి

గత ప్రభుత్వం సబ్సిడీపై అవసరమైనన్ని వరివిత్తనాలు సరఫరా చేసింది. ఇప్పుడు చాలా తక్కువ వచ్చాయని చెబుతున్నారు. బయట షాపుల్లో రేటు ఎక్కువ. కల్తీ విత్తనాలు వచ్చే ప్రమాదముంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాల సరఫరా పెంచాలి.

– చిరివేళ్లే యానాదిరావు, పిట్టల్లంక

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

రైతులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. గత సంవత్సరం సబ్సిడీ విత్తనాలు సరిగా సరఫరా చేయలేదు. ఈ సంవత్సరం అదే ధోరణి అవలంబిస్తోంది. ప్రైవేటు షాపుల్లో విత్తనాలు తెచ్చుకోవడానికి వెళ్లిన రైతులు బాగోలేవని తిరిగి వచ్చేస్తున్నారు.

– బీసాబత్తిన ప్రసాద్, మాజీ డీసీ చైర్మన్, నాగాయలంక

తనిఖీలు చేస్తున్నాం

అవనిగడ్డ సబ్ డివిజన్‌కు బీపీటీ 5204 రకం 515 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 154 క్వింటాళ్లు, 1318 రకం 110 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. ప్రస్తుతం వీటిని రైతులకు సబ్సిడీపై అందిస్తున్నాం. ప్రైవేటు విత్తన షాపులను తనిఖీ చేస్తున్నాం. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– జయప్రద, ఏడీఏ, అవనిగడ్డ

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

రేమల్లెలో కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రాజ్ ప్రియాసింగ్ నేతృత్వంలోని బృందం మంగళవారం పరిశీలించింది. తొలుత రేమల్లె గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు పండ్లతోటల సాగు, బంద్రీ చెరువు పూడికతీత, పశువుల షెడ్ల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ చానల్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి మొక్కలు పెంచుతున్న రైతు సంగీతరావుతో మాట్లాడారు. సాగు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడిచర్ల గ్రామంలో పంట కుంట, బీటీ రోడ్డు, రజక చెరువులో పూడిక తీత, పశువుల షెడ్డు నిర్మాణం, మ్యాజిక్ సోక్ పిట్ పనులను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. పీఎంఏవై–జీ పథకం కింద గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద కానుమోలు నుంచి రంగయ్య అప్పారావు పేట, రామ శేషాపురం గ్రామాల మీదగా రామన్నగూడెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సీఈఓ కన్నమ్మ నాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ హరహరినాథ్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర కీలకం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- డాక్టర్స్ డే సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సత్కారం

మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా సత్కారం పొందుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమన్నారు. నిరంతరం ప్రజాసేవపై చిత్త శుద్ధి, అంకితభావంతో పనిచేసే వైద్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎంతో ప్రయాస పడి వైద్య విద్యను అభ్యసించి వ్యక్తిగత, కుటుంబ పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచటానికి కృషి చేస్తున్న వైద్యులపై ప్రజలు, నాయకుల ధోరణిలో మార్పు రావాలన్నారు. ఆఖరి క్షణం వరకు రోగుల ప్రాణాలు కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు సరికాదని పేర్కొన్నారు.

విశిష్ట సేవలందించిన వైద్యులకు సత్కారం

జాతీయ డాక్టర్స్ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన పది మంది వైద్యులను మంత్రి సత్య కుమార్ యాదవ్ సత్కరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ పద్మశ్రీవాత్సవ, ప్రస్తుత డీఎంఈ, శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం, జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ ఎ.అశ్విని కుమార్, కార్డియాలజిస్ట్లు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.భాస్కరనాయుడు, డాక్టర్ జి.భవానీప్రసాద్, న్యూరోసర్జన్ డాక్టర్ కె.సత్యవరప్రసాద్, డాక్టర్ ఎం. కృష్ణ నాయక్, డాక్టర్ ఆర్.మురళీబాబూరావు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ టి.భారతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి, హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ జి.రఘునందనరావు, మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూ పోయే.. దారీ కరువాయె

> రోడ్డు విస్తరణ పేరుతో అడ్డంగా ఉన్నాయంటూ పక్కా ఇళ్లను హడావిడిగా కూల్చేశారు. పరిహారం ఇస్తామని చెప్పారు.
>
> – ఇది 2016 నాటి మాట
>
> మరోవైపు కమీషన్లకు ఆశపడి ముందస్తు అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పనులను మొదలు పెట్టారు. కానీ కాంట్రాక్టర్ కిలోమీటర్ దారికి రూ.కోటి కొట్టేయాలనుకుని ప్రతిపాదన పంపాడు. దీన్ని ప్రభుత్వం తిరస్కరించడంతో పనులను మధ్యలోనే ఆపేశాడు.
>
> – ఇది ప్రస్తుత పరిస్థితి

వెల్వడంలో అధ్వానంగా మారిన మైలవరం – నూజివీడు రోడ్డు

- రహదారి విస్తరణ పేరుతో హడావిడిగా ఇళ్లను కూల్చేసిన అధికారులు
- మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- అర్ధంతరంగా నిలిచిన మైలవరం–నూజివీడు రహదారి పనులు
- రహదారి బాగు చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫొటోతో వెలిసిన ఫ్లెక్సీలు

ఈ ఫొటోలోని వృద్ధ దంపతుల పేర్లు చనమోలు సత్యనారాయణ, సామ్రాజ్యం. వీరికి వెల్వడం గ్రామంలో సర్వే నంబరు 498/1లో ఇల్లు ఉంది. అయితే 2016లో మైలవరం–నూజివీడు ఆర్అండ్‌బీ రహదారి విస్తరణలో భాగంగా వీరి ఇంటిని అధికారులు కూల్చారు. అప్పటి నుంచి వీరికి ఎటువంటి పరిహారం ఇవ్వలేదు. దీనిపై అధికారులను సంప్రదించగా ఇళ్లు కూల్చిన స్థలంలో రోడ్డు వేయలేదని, పరిహారం ఇవ్వాల్సిన పనిలేదని చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫ్లెక్సీని గ్రామంలో కట్టారు.

జి.కొండూరు: 'లోకేశ్.. మా ఊరి దారి సమస్య పరిష్కరించండి' అంటూ మంత్రి నారా లోకేశ్ ఫొటోలతో మైలవరం మండలం వెల్వడం గ్రామస్తులు ఫ్లెక్సీలతో మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రహదారిని విస్తరించే క్రమంలో వెల్వడంలో కొన్ని సర్వే నంబర్లు నోటిఫై చేశారు. రహదారి అభివృద్ధి పనులను నాలుగు నెలల కిందట హడావిడిగా చేపట్టారు. మార్గం పొడవునా వెట్ మిక్స్ వేశారు. అయితే అర్ధంతరంగా రహదారి విస్తరణ నిలిచిపోయింది. దీంతో ఎండొస్తే దుమ్ము, వానొస్తే రహదారిపై గోతుల్లో చేరిన నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదు. దీంతో గ్రామస్తులంతా దారిపొడవునా నారా లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు కట్టారు. ఇదిలా ఉంటే 2016 రహదారి విస్తరణలో గ్రామంలో కొందరి ఇళ్లను కూల్చేశారు. పరిహారం ఇవ్వలేదు. దీంతో వారు సైతం లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు వేయించి వినూత్న నిరసనకు దిగారు.

లోకేష్ ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కాంట్రాక్టర్ అత్యాశ.. మొదటికి వచ్చిన సమస్య

మైలవరం–నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా వెల్వడం అయ్యప్ప స్వామి గుడి నుంచి ఐదు కిలోమీటర్ల మేర ఉన్న తారు రోడ్డును అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పూర్తిగా తొలగించి నాలుగు నెలల క్రితం రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. తారు రోడ్డును పూర్తిగా తొలగించడానికి ఆర్అండ్‌బీ అధికారులు అడ్డుచెప్పినా కాంట్రాక్టరు తనకు స్థానికంగా రాజకీయ అండ ఉందనే ధోరణికి పోయాడు. తారురోడ్డును తవ్వి వెట్‌మిక్స్ వేసిన తర్వాత నిధుల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరారు. కిలోమీటరుకు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపాడు. వీటిని ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టరు మూటాముల్లె సర్దుకొని వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో నిత్యం రాకపోకలు సాగుతుండటంతో వెట్‌మిక్స్ కదిలి రహదారి అంతా ఛిద్రంగా మారింది. దారిపొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు చేరి చిన్న కొలనుల్లా తలపిస్తున్నాయి.

అద్విక.. అంతా మాయ!

- ట్రేడింగ్ కంపెనీలో తవ్వేకొద్దీ అన్ని అక్రమాలే
- పోలీసులకు ఇప్పటికే 76 మందికిపైగా బాధితుల ఫిర్యాదు
- రూ.350 కోట్ల మేర మోసపోయిన ప్రముఖులు

పలు జిల్లాల్లో బాధితులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అత్యాశ కొంపముంచింది. బ్లాక్ మనీని వైట్‌గా మార్చుకోవచ్చని అద్విక ట్రేడింగ్ కంపెనీ విసిరిన వలలో పెద్ద చేపలు చిక్కి విలవిల్లాడుతున్నాయి. ఆ కంపెనీ బోర్డు తిప్పేసిన వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలే వెలుగు చూస్తున్నాయి. నల్లధనం భారీగా ఉండి, పెట్టుబడి పెట్టగల వారినే లక్ష్యంగా చేసుకొని అద్విక ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకులు వల విసిరారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మొత్తం డబ్బులు సేకరించి ఆపై బోర్డు తిప్పేశారు. డబ్బును విజయవాడ నుంచి హవాలా రూపంలో దుబాయ్‌కి చేర్చి అక్కడి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సంస్థ ఎండీని అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిస్తుంటే విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం. వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు ఖాళీ చేసిన విషయం తెలుసుకుని పోలీసులు సైతం కంగుతిన్నారని తెలుస్తోంది. అద్విక ట్రేడింగ్ కంపెనీ పలు డొల్ల కంపెనీలను సృష్టించి బోర్డు తిప్పేసినట్లు గుర్తించారు.

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసాలకు సంబంధించి పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో 76 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర డిపాజిట్లు చేసినట్లు పేర్కొన్నారు. వారికి తిరిగి ఇన్‌సెంటివ్ కింద రూ.6 కోట్లు ఇచ్చినట్లు గుర్తించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున బాధితులు ఉన్నారు. ప్రధానంగా వైద్యులు, రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు ఉన్నారని సమాచారం. కొంత మంది బినామీ పేర్లతో పెట్టుబడులు పెట్టారు. వారితో పాటు ఓ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రూ.83 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం. అద్విక ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నిండా మునిగిన చాలా మంది బయటికి చెప్పుకోలేక తేలు కుట్టిన దొంగల్లా కుమిలిపోతున్నారని సమాచారం.

ఏజెంట్ల గుర్తింపు పైనే దృష్టి

ప్రస్తుతం పోలీసులు విచారణను వేగ వంతం చేస్తున్నారు. ముందుగా ఎంత మంది పెట్టుబడులు పెట్టారు? ఎంత మొత్తం నష్టపోయారు? అందులో వారు ఇన్‌సెంటివ్‌గా ఎంత మొత్తం తిరిగి తీసుకొన్నారు? వంటి వివరాలు సేకరిస్తున్నారు. బాధితులు ఎంత మొత్తం మేర నష్టపోయారో లెక్క తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కంపెనీలో పెట్టు బడులు పెట్టేందుకు ఆకర్షించిన 45 మంది ఏజెంట్లను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క ప్రధాన ఏజెంట్ తన కింద 15 నుంచి 200 మంది ఏజెంట్లను నియమించుకొన్నట్లు గుర్తించారు. ప్రతి ఏజెంట్ ఎంత మొత్తం వసూలు చేశారు? తిరిగి ఎంత మొత్తం ఇన్‌సెంటివ్ రూపంలో తిరిగి చెల్లించారు? వంటి వివరాలతో ప్రతి ఏజెంట్ సేకరించిన డిపాజిట్ల వివరాలు ఎక్సెల్ షీట్‌లో పోలీసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాథమికంగా 1600 మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు అంచనా వేశారు. వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తం మీద బాధితులంతా రూ.350 కోట్లపైగా డిపాజిట్లు చెల్లించి, నిండా మునిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కంపెనీల్లో నిర్వహించిన సోదాల్లో పోలీసులు కొంత మేర సమాచారం సేకరించారు. ఆ సమాచారం ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలు ఆదిత్య బ్యాంకు ఖాతాలతో పాటు, పలువురు ఏజెంట్ల ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. కంపెనీ డైరెక్టర్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారని సమాచారం.

వంతెన నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): పెనమలూరు మండలం పోరంకిలో బందరు కాలువపై వంతెన నిర్మాణానికి సంబంధించి అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ బందరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోరంకి వద్ద బందరు కాలువపై వంతెన నిర్మాణం గురించి సమీక్షించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. బందరు కాలువ కట్టపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, భూసేకరణ, పరిహారం, నిర్మాణానికి పట్టే సమయం తదితర అంశాలపై అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్.హేలా షారోన్, ఇరిగేషన్ ఎస్ఈ మోహన్ రావు, రహదారులు భవనాలు ఎస్ఈ భాస్కరరావు, ఈఈ లోకేష్, కంకిపాడు తహసిల్దార్ గోపాలకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ

బెజవాడ రాజారావు హైస్కూలు సహవ్యవస్థాపకులుగా, SKPVV హిందూహైస్కూలు గ్రేడ్ 1 తెలుగు పండిట్‌గా విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన మీ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఇవే మా ఘన నివాళులు. మీరందించిన స్ఫూర్తి సదా మాకు అనుసరణీయం.

కీ॥శే॥ తవ్వా కనకదుర్గా వరలక్ష్మి గారు
జననం: 18-2-1946
మరణం: 22-6-2025

భర్త: బెజవాడ రాజారావు
✆ 94402 80263, 89859 17897

కుమారుడు: శ్యామ్ ప్రకాష్
కోడలు: లక్ష్మీప్రసన్న
కుమార్తె: మధులత
అల్లుడు: జూలూరి శ్రీరామ శివప్రసాదరావు
మనుమళ్ళు, మనుమరాండ్రు

సంస్మరణ సభ: ది. 2-7-2025 బుధవారం ఉదయం11 గం.లకు బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12 నందు జరుగును.

క్లుప్తంగా

పంటల బీమాపై ఎస్‌బీఐ ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వారం రోజుల పాటు నిర్వహించేందుకు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. వారం రోజుల కార్యక్రమంలో రైతులకు పంట బీమా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నమోదును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ ప్రేరిత ప్రమాదాల నుంచి రైతులను రక్షించడంలో పంట బీమా ప్రాముఖ్యతను గుర్తించి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ జూలై 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, తమిళనాడుతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ నవీన్‌చంద్ర తెలిపారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు మోక్షిత్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయస్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు కొండపల్లి డీవీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి గింజల మోక్షిత్ కార్తికేయ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్‌మోహన్ సోమవారం తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా అండర్–10 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించాడు. ప్రతిభ కనబరచిన కార్తికేయను రాష్ట్ర సెలక్షన్ కమిటీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసింది. ఈనెల 5 నుంచి 8వరకు మహారాష్ట్ర నాసిక్‌లో జరుగు జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడు. మోక్షిత్ కార్తికేయను ప్రిన్సిపాల్‌తో పాటు పీటీ మాధవరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

కార్మికుల సత్తా చాటుదాం

- 9న సమ్మెను విజయవంతం చేద్దాం
- రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పిలుపు

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన జరిగే సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వర్గ సత్తా చాటుదామని రాష్ట్ర కార్మిక ఉద్యోగ ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 10గంటల పని విధానాన్ని, అధిక గంటల పని విధానాన్ని, రాత్రి సమయంలో మహిళలు పని చేసే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు ఈ సమ్మెను చేపడుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏఐటీసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల, రైతు, వ్యవసాయ కూలి చేతివృత్తులు, మహిళా, యువజన, విద్యార్థి రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది.

'ఉపాధి'లో సంస్కరణలు అవసరం..

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ విధానాన్ని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రుణాలు రద్దు చేయాలని, రైతులకు అన్ని వేళల సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లకు వ్యతిరేకంగా, బీజేపీ దాని అనుబంధ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం సత్తా చాటేందుకు జూలై 9న జరిగే సమ్మెలో కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళా నాయకులు వెంకట సుబ్బారావమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

గూడూరు: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో ఎంపికైన గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని లేళ్లగరువు గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. పంచాయతీలో నిర్వహిస్తున్న నీరు, పారిశుద్ధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ప్రార్థనా మందిరాలను సందర్శించి అక్కడ ఉన్న వసతులపై ఆరా తీశారు. ఆయా ప్రదేశాలలో ఉపాధి హామీ నిధులతో ఇంకుడు గుంతలు, కంపోస్ట్ గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ప్రార్థనా మందిరం దగ్గర తడిచెత్త–పొడిచెత్త బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కప్పలదొడ్డి హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

పనుల నిర్వహణపై అసంతృప్తి..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చెక్‌లిస్ట్ ప్రకారం గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఇప్పటికే స్పష్టమైన సూచనలు ఇచ్చినప్పటికీ పనులు నిదానంగా జరుగుతుండటం సహేతుకం కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఎల్‌పీఓ మహమ్మద్ రజావుల్లా, డీఎల్‌డీఓ పద్మావతి, ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్, సర్పంచి మానస, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మమేకం..

మండల పరిధిలోని లేళ్లగరువు, కప్పలదొడ్డి పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మమేకం అయ్యారు. లేళ్లగరువు పాఠశాలలో 8 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో ఒకే టీచర్ ఉన్నారు. దీంతో కంకటావలో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌కు విద్యార్థులను పంపితే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులకు సూచించారు. కప్పలదొడ్డిలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రేమ చిగురించిన చోటే.. ప్రాణమూ పోయింది

పాశమైలారం ఫార్మా ప్రమాదంలో కాబోయే దంపతులు దుర్మరణం

ముద్దనూరు/పుట్రేల(విస్సన్నపేట): ఆ రెండు మనసులను పనిచేసే ప్రాంతమే పరిచయం చేసింది.. ప్రేమను చిగురించేలా చేసింది. పెళ్లిపీటల కోసం సిద్ధపరచింది. మరో రెండు నెలల్లో ఒక్కటి చేయాలని చూసింది. కానీ ఇంతలోనే మృత్యువు ఆ ఇద్దరినీ కబళించింది. ఆ పనిచేసే ప్రాంతంలోనే పాశాన్ని విసిరింది. అనుకోని విపత్తు వారి ఆశలను ఆహుతి చేసింది. ఎన్నో ఆకాంక్షలతో కొత్త జీవితాన్ని ఆరంభించాలకున్న ఆ జంట.. ఇంట పెను విషాదాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన యువతీ, యువకులు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్‌రెడ్డి(25), ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన రామాల. శ్రీరమ్య ఫార్మా పరిశ్రమలో ఉద్యోగులు. ఇక్కడే వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఇరువురూ తమ పెద్దలను ఒప్పించారు. మరో రెండునెలల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన తరుణంలో విషాదం వెంటాడింది. సోమవారం ఇద్దరూ పరిశ్రమలో విధుల్లో ఉన్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటనతో పెనికలపాడు, పుట్రేల గ్రామాల్లో మంగళవారం తీవ్ర విషాదం అలముకుంది.

అగ్ని ప్రమాదంలో మృతి చెందిన నిఖిల్, రమ్య(ఫైల్)

రెండునెలల్లో పెళ్లి చేద్దామనుకున్నాం...

రామాల నారయ్య, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె జ్యోత్స్న బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసి ఆరు నెలల క్రితమే సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరింది. ఇంతలో ఘోర విపత్తులో చిన్న కుమార్తె ప్రాణాలు కోల్పోవడాన్ని తలచుకుంటూ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నిఖిల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడి ఆషాఢం వెళ్లిన తర్వాత పెళ్లి చేద్దామనుకున్నామని తీరా ఈ విషాద సంఘటనలో ఇరువురు చనిపోయారని మృతురాలి తల్లి పద్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400కోట్లు

తక్షణం విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు బకాయిపడిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ దాసరి భవన్ నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పేరిట రూ.6400 కోట్లు బకాయిపెట్టిందన్నారు. టీడీపీ యువగళం పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా కేవలం రూ.600కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కానందున యాజమాన్యాలు వేధిస్తున్నాయని, విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉన్నాయని, విద్యార్థులు ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

మాట్లాడుతున్న బందెల నాసర్ జీ

నాలుగో తేదీ నుంచి ధర్నాలు..

బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 4 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కార్తీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యశ్వంత్, శరత్, అమర్నాథ్, ప్రణీత్, డేవిడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

Real Estate

PLOT FOR SALE

■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' ఆడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర : ✆ 97034 34023, 96428 72122

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

Wanted

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ కేర్ ఆఫ్ హెల్త్ కార్డు ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000+2500 TA. సంప్రదించండి. ఫోన్: ✆ 70130 52798

■ విజయవాడ – తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60564, 72070 13418

■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : ✆ 88858 01357

■ VJA జవహర్ ఆటోనగర్ లోని ప్రముఖ ఆటోమొబైల్ షాప్ లో పని చేయుటకు అకౌంటెంట్ Tally (M/F) ఫుల్ టైం కావలెను. ✆ 97012 00500

■ ఆటోనగర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ జీతం : 11,000/- + PF+ESI, 4 వీక్లీ ఆఫ్‌లు. Q : 10th Class ✆ 88014 97437

■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపర్స్ (M) కావలెను. VJA, కంకిపాడులలో 8, 12 గం॥ డ్యూటీ వ: 40 లోపు, Q: 10th P/F ✆ 94917 71179, 73309 11212

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679

■ Wanted Teachers. Teachers (Ladies) With U.G or P.G Qualification & Good English && Teacher for Science in High School. CIS-School, VJA-1. Ph: ✆ 81799 90508, 92913 98877

■ రామవరప్పాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M) లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: ✆ 98853 26279

■ బుక్‌వర్క్ నందు మోస్ట్ అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000/- మరియు ప్రూఫ్ రీడర్స్(M/F) కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, జీతం:25,000/-వరకు విజయవాడ ✆ 99631 31354

■ కన్సల్టెన్సీ కాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు, ఫ్రీరూం+భోజనం. Hyd.8317512135

గమనిక

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. సంపద సృష్టికి రుణాలు వాడుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన వార్షిక రుణ–జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక – జీవనోపాధులపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి.. ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

రూ.1,266 కోట్లతో కార్యాచరణ..

జిల్లాలో 16 మండల సమాఖ్యలు, 767 గ్రామ సమాఖ్యలు, 24,880 స్వయం సహాయక సంఘాలు, 2,47,611మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. 2024–25లో 1,93,691మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ. 1,147.59 కోట్ల మేర రుణ మద్దతు లభించిందన్నారు. 2025–26కు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యుల వ్యక్తిగత జీవనోపాధి అవసరాలు ఆధారంగా దాదాపు రూ.1,266 కోట్ల వార్షిక రుణ–జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. కుటుంబ స్థాయి సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సెప్టెంబర్ 30 వరకు ప్రచారం..

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం కె.ప్రియాంక వివరించారు. బ్యాంక్ లింకేజీపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, యూఎల్‌బీల్లో కనీసం ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యంగా కార్యాచరణ

కృష్ణా జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా మెరుగైన ప్రపంచం కోసం ఉత్తమ సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు కృష్ణా జిల్లా సహకార శాఖ అధికారి కె. చంద్రశేఖరరెడ్డి అన్నారు. సహకార వారోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా మంగళవారం కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు తాము కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక సహకార సంఘాల్లో నమూనా బోర్డు మీటింగ్, జనరల్ బాడీ మీటింగ్, మోడల్ ఆడిట్ జరిగాయన్నారు. బుధవారం సహకార సంఘాలు, డీసీసీబీలలో లోన్ మేళా నిర్వహించటం ద్వారా నూతన సభ్యులను చేర్చుకోవటం, డిపాజిట్ల సేకరణ నిర్వహిస్తామన్నారు. 3వ తేదీన సంఘాలు ఉత్పత్తి చేసినవి ప్రదర్శించటం, సంఘ చరిత్రను, అభివృద్ధిని ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. 4వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సహకార రంగంపై రెండు గంటలపాటు బోధనలు చేస్తారన్నారు. 5వ తేదీన సహకార దినోత్సవం సందర్భంగా సంఘాల ఆవరణలో సహకార జెండా ఎగురవేస్తారన్నారు. ఈ విధంగా కార్యక్రమాలు చేపట్టి సహకార రంగం ద్వారా మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటుతున్న డీసీవో చంద్రశేఖరరెడ్డి

కొనసాగుతున్న సారె సంబరం

అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గగుడికి తరలివస్తున్న భక్తబృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని తమ కుటుంబం పిల్లాపాపలతో సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి తాము సారెగా తీసుకువచ్చిన చీరలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, మిఠాయిలను సమర్పిస్తున్నారు. సారె తీసుకువచ్చిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందిస్తున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త బృందాలు సారెను అమ్మవారి ప్రసాదంగా భక్తులకు అందిస్తూ సంతోషాలను పంచుకుంటున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు దేవస్థానం ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాలను అందజేస్తోంది. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో శీనానాయక్ అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ఫలించిన వంశీ న్యాయ పోరాటం

బెయిల్ మంజూరు.. నేడు విడుదలయ్యే అవకాశం

గన్నవరం: గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ న్యాయ పోరాటం ఫలించింది. వివిధ కేసుల్లో గత 138 రోజులుగా అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న ఆయనకు నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి బయటకు రావడానికి మార్గం సుగమమైంది.

రెడ్‌బుక్ కక్షతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వల్లభనేని వంశీమోహన్‌పై ఇబ్బడిముబ్బడిగా కేసులు నమోదు చేసింది. రెండున్నరేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసు పునర్ విచారణ పేరుతో వంశీమోహన్‌ను 71వ నిందితుడిగా చేర్చింది. ఈ కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారని తప్పుడు కేసు పెట్టి.. ఈ ఏడాది ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం టీడీపీ పెద్దల సూచనల మేరకు ఆయనపై గన్నవరం, ఆత్కూరు, వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పీఎస్‌ల్లో పదికి పైగా అక్రమ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో గత ఐదు నెలలుగా విజయవాడ జిల్లా జైలులో ఆయన రిమాండ్‌లో కొనసాగుతున్నారు.

వంశీమోహన్ (ఫైల్)

ఆరోగ్యం క్షీణించినా..

గణనీయంగా బరువు తగ్గిపోవడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలతో ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం కరుణించలేదు. ప్రభుత్వం తరపున ఆయనకు సరైనా వైద్య సేవలు కూడా అందించలేదు. చివరికి హైకోర్టు జోక్యంతో ఆయుష్ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తనపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటం సాగిస్తూ వచ్చిన ఆయనకు తొమ్మిది కేసుల్లో కోర్టుల నుంచి ఉపశమనం లభించింది. చివరికి బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీపై 2019లో నమోదైన కేసులో కూడా నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనకు భారీ ఊరట లభించింది. జైలు నుంచి ఆయన బుధవారం విడుదలయ్యే అవకాశం ఉందని వంశీమోహన్ తరపు న్యాయవాదులు పేర్కొంటున్నారు. వంశీమోహన్‌కు బెయిల్ రావడం పట్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండచిలువ హతం

మైలవరం: మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో పాడుబడిన బావి వద్ద పేరుకుపోయిన చెత్తలో ఉన్న కొండచిలువను గమనించిన గ్రామస్తులు మంగళవారం కర్రలు, కత్తులతో హతమార్చారు. గ్రామానికి చెందిన రైతు వేల్పులకొండ ప్రసాద్‌కు పాము కన్పించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు పెట్టడంతో యువకులు పరుగున వెళ్లి దానిని హతమార్చారు. కొండ చిలువ సుమారు 10 అడుగుల పొడవు, 15కిలోలు బరువు ఉందని యువకులు తెలిపారు. కాగా జంగాలపల్లి గ్రామం నుంచి బయటికి రావాలంటే దారి మార్గం సరిగా ఉండకపోగా, కొద్దిపాటి వర్షానికి రహదారికి గండ్లు పడి కనీసం నడవడానికి కూడా గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం పట్ల అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గృహావసరాలకు బావి నీటిని వాడుకుంటూ ఉంటారని, అదే విధంగా అక్కడే పిల్లలు ఆడుకుంటూ ఉంటారని గ్రామస్తులు తెలిపారు. బావి పాడైపోయి ఉండటంతో గ్రామస్తులు చెత్తా చెదారం తీసుకువచ్చి అక్కడే పడేస్తున్నారని దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు, ప్రమాదకరమైన పాములు తిరుగుతూ భయానక వాతావరణం నెలకొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

గుడివాడరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ మహబూబ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. గుడివాడ రైల్వే స్టేషన్ పరిధిలోని దోసపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మరణించినట్లు తెలిపారు. మృతుని వయస్సు 60ఏళ్లు ఉంటుందని, బ్లూబై కంపెనీ తెలుపు, నీలం రంగు గడులు గల చొక్కా(రెడీమేడ్ షర్ట్), తెలుపు, నలుపు, నీలం రంగు గడుల లుంగి ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440627570, 9866221412లో సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ కోరారు.

బీవీ పట్టాభిరామ్ మృతిపై సంతాపం

విజయవాడ కల్చరల్: సాహితీవేత్త, బహు గ్రంథ కర్త, ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. వ్యక్తిగా, వికాస నిపుణుడిగా వేలాది మందికి దిశానిర్దేశం చేశారని మంగళవారం ఓ ప్రకటనలో కొనియాడింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేసింది. నగరానికి చెందిన సాంస్కృతిక కళా సంస్థలు సంతాపం ప్రకటించాయి.

సాక్షి కర్నూలు

బుధవారం । 2 । జూలై । 2025

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మంగళవారం కోదాడకు చెందిన కనగల నాగేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

శకునాలలో దొంగలు పడ్డారు

ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. రూ.6.50 లక్షలు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. 8లో▸

ప్రజాధనం స్వాహా!

ప్రజలు రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బును కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకుంటే స్వాహా చేశారు. రూ. 2.42 కోట్లు కాజేసినట్లు వెలుగులోకి వచ్చింది. 8లో▸

న్యూస్‌రీల్

క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా మధుసూదన్

బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉమ్మడి కర్నూలు జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా బీవీ మధుసూదన్ స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని క్యూసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు క్యూసీ డీఈఈగా విధులు నిర్వహించిన కుష్‌కుమార్‌రెడ్డి గత జూన్ 30న పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా బనగానపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో క్యూసీలో పనిచేస్తున్న ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి జిల్లాలో కొనసాగుతున్న పనులపై చర్చిస్తామన్నారు. అనంతరం జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

ఆరాధన ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న శ్రీమఠం మేనేజర్ శ్రీనివాస్‌రావు

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో వచ్చే నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆరాధన ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులు, శ్రీమఠం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆరాధన ఉత్సవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాంతి భద్రతలు, భక్తుల సౌకర్యాలు, నది తీరంలో భక్తుల స్నానాలు, వసతులు, ప్రసాదాలు వంటి అంశాలతో మధ్యారాధన, రథోత్సవం రోజు తీసుకోవాలసిన భద్రతపై పోలీసు, రెవెన్యూ, ఎండోమెంట్, ఫైర్ సిబ్బంది తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామ సర్పంచ్ బాధ్యతీసుకుని స్వచ్ఛతపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస్‌రావు సూచనలు చేశారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీలో చేతులెత్తేసిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్ల పంపిణీపై కూటమి ప్రభుత్వం వితంతు మహిళలను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోంది. ముందుగా జూన్ 12న పంపిణీ చేస్తున్నామంటూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. నిధులు కూడా బ్యాంకులకు విడుదల చేసినట్లు ప్రకటించింది. అయితే ఆ రోజు పింఛన్లు పంపిణీ చేయలేక చేతులెత్తేసింది. జూలై నెల పింఛన్లతో పాటు స్పౌజ్ పింఛన్లను కూడా పంపిణీ చేస్తామని ఇటీవల ప్రకటించారు. అయితే మంగళవారం పింఛన్ల పంపిణీ సమయానికి స్పౌజ్ పింఛన్ల పంపిణీని నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వితంతు మహిళల్లో ఆందోళన నెలకొంది. దాదాపు నెల రోజుల క్రితం నుంచి వేలాది మంది మహిళలను కూటమి ప్రభుత్వం ఊరిస్తోంది. కర్నూలు జిల్లాలో 2,319, నంద్యాల జిల్లాలో 2,463 ప్రకారం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినా, పంపిణీలో మొండిచేయి చూపుతుండటం విమర్శలకు తావిస్తోంది.

పింఛన్ల పంపిణీలో 19వ స్థానం

పింఛన్ల పంపిణీలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లా రాష్ట్రంలో 19వ స్థానం, నంద్యాల జిల్లా 16వ స్థానంలో నిలిచాయి. ఎక్కువ భాగం సచివాలయాలు, రచ్చబండల వద్దే పింఛన్ల పంపిణీ చేపట్టడం గమనార్హం.

పెట్టుబడి మట్టిపాలు

జాడలేని వరుణుడు

- రైతులను ఊరించిన ముందస్తు వర్షాలు
- ఇప్పటికే లక్ష హెక్టార్లలో పంటల సాగు
- జూన్ నెలలో దాదాపు 20 మండలాల్లో అత్యల్ప వర్షపాతం
- దెబ్బతింటున్న పత్తి, ఉల్లి, వేరుశనగ తదితర పంటలు

కోడుమూరు మండలం వర్కూరు వద్ద వాడు పట్టిన పత్తి పంట

కర్నూలు(అగ్రికల్చర్): వరుణుడి జాడలేకపోవడంతో ఖరీఫ్ సాగు ఆందోళన కలిగిస్తోంది. ముందస్తు రుతుపవనాలు సంతోషం కలిగించినా నాలుగైదు రోజులకే పరిమితమైంది. సీజన్‌లో నెల గడచిపోతున్నప్పటికీ పంటల సాగు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. జూన్ నెలలో పురోగమించాల్సిన వ్యవసాయం తిరోగమన దిశగా పయనిస్తోంది. 2024-25లో అధిక వర్షాలు, అనావృష్టితో వ్యవసాయం కలసిరాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. 2025-26 సంవత్సరానికి రుతుపవనాలు మే నెల చివరి వారంలోనే విస్తరించాయి. ముందస్తు రుతుపవనాలతో రైతులు సంతోషించారు. అయితే కొద్ది రోజులకే రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో సాగు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సాధారణ సాగు 4,22,540 హెక్టార్లు ఉండగా.. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 1,15,423 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఇప్పటికే దాదాపు 2లక్షల హెక్టార్లలో పంటలు సాగైనట్లు తెలుస్తోంది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా.. రికార్డు స్థాయిలో 106.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో పత్తి సాగు భారీగా పెరిగింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.1 మి.మీ ఉండగా.. 74.3 మి.మీ వర్షపాతం కురిసింది. దాదాపు 20 మండలాల్లో అత్యల్ప వర్షాలు కురిశాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండాల్సిన మే నెలలో విస్తారంగా వర్షాలు కురిశాయి. వర్షాలు కురవాల్సిన జూన్ నెలలో ఎండలు, గాలుల తీవ్రత పెరిగింది. ఫలితంగా నెల్లో తేమ ఆరిపోతుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఆదోని, ఆలూరు, ఆస్పరి, పెద్దకడుబూరు, పత్తికొండ, మద్దికెర, హాలహర్వి, మంత్రాలయం, దేవనకొండ, సి.బెళగల్, కోడుమూరు, కల్లూరు తదితర మండలాల్లో పత్తి, ఉల్లి సాగు ఎక్కువగా ఉంది. జూన్ మాసంలో వర్షాలు తేలికపాటికే పరిమితం కావడంతో పంటల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కన్నీరు పెడుతున్న ఆస్పరి

పశ్చిమ ప్రాంతంలోని ఆస్పరి మండలంలో దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మండలంలో జూన్ నెల సాధారణ వర్షపాతం 91.8 మి.మీ. అయితే మూడు రోజులు మాత్రమే వర్షం కురిసింది. 26 రోజులు చినుకు జాడ లేకుండాపోయింది. జూన్ 12న ఒక మోస్తరుగా 35 మి.మీ వర్షపాతం నమోదైంది. 21న తూతూమంత్రంగా 2.2, 23న 6.0 మి.మీ ప్రకారం కేవలం 43.2 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతంలో కనీసం 50 శాతం కూడా వర్షాలు లేని పరిస్థితి. దీంతో ఈ మండలంలో సాగు చేసిన పత్తి, ఉల్లి, టమాట తదితర పంటలు తేమ లేక దెబ్బతింటున్నాయి.

ఐదెకరాల్లో విత్తనం మొలకెత్తలేదు

మేము ఎడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. అదునులో సాగు చేయాలనే ఉద్దేశంతో అంతంతమాత్రం తేమలోనే ఎకరాకు 3-4 కిలోలు విత్తుకున్నాం. కిలో విత్తనం రూ.1,200-1,400లకు కొన్నాం. ఎద్దుల బాడుగలకు రోజుకు రూ.2,500 వరకు ఖర్చు పెట్టాం. ఎరువులు తదితరాలకు ఇప్పటికే రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఏడు ఎకరాల్లో దాదాపు 5 ఎకరాల్లో విత్తనం మొలకెత్తలేదు. దీంతో పెట్టిన పెట్టుబడి మట్టిపాలైంది.

– శాంతిరెడ్డి, హోసూరు, పత్తికొండ మండలం

పత్తి పంట ఎండుతోంది

మాకున్న 8 ఎకరాల పొలం ఉంటే ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. ఇప్పటికే రెండు సార్లు మందులు పిచికారీ చేశాం. బిటీ విత్తన ప్యాకెట్లు, ఎరువులు, ఎద్దుల బాడుగలు తదితరాలకు ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టాం. జూన్ నెలలో వర్షాలు లేక పత్తి పంట దెబ్బతినింది. మా గ్రామంలో 75 శాతం పత్తి సాగు చేస్తాం. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పంటల బీమాతో ఆదుకుంటే తప్ప రైతులు కోలుకునే పరిస్థితి లేదు.

– మోహన్‌రెడ్డి, జాలవాడి గ్రామం, పెద్దకడబూరు మండలం

ఖరీఫ్ గట్టెక్కడం అనుమానమే!

ముందస్తు వర్షాలతో రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేశారు. ఒక రోజు మధ్యాహ్నం వరకు ఒక కాడి బాడుగకు తీసుకోవాలంటే రూ.2వేల నుంచి రూ.2,500 వరకు చెల్లించాల్సి ఉంది. ఉల్లి విత్తనాలు కిలో ధర రూ.1,500 వరకు ఉంది. పత్తి 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.900. సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9,300. రసాయన ఎరువుల ధరలు షాక్ కొడుతున్నాయి. ఉల్లి, పత్తి, వేరుశనగ, కంది సాగులో ఇప్పటికే సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. జూన్ మాసంలో వర్షాలు లేకపోవడంతో జిల్లాలో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. వర్షాభావ పరిస్థితులతో పెట్టిన పెట్టుబడులు మట్టిపాలయ్యాయి. వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే ఖరీఫ్ గట్టెక్కడం అనుమానమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మంచి పదునులోనే విత్తనం వేసుకోవాలి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అంతంతమాత్రం తేమలో విత్తనం విత్తుకోవద్దు. నల్లరేగడి నేలల్లో 75 మి.మీ వర్షపాతం ఒక్క రోజులో నమోదైనా, లేదా వరుసగా మూడు రోజుల్లో నమోదైనప్పుడు మాత్రమే విత్తనం వేసుకోవాలి. ఎర్ర నేలల్లో కనీసం మూడు రోజులు లేదా ఒక్కరోజులో 50 మి.మీ వర్షపాతం నమోదైనప్పుడు మాత్రమే విత్తనం వేసుకోవడం మంచింది. అంతంతమాత్రం తేమలో విత్తనం వేసుకుంటే మొలక సరిగా రాదు. రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

– సుజాతమ్మ, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

ఈ చిత్రం.. రైతు కన్నీటి కష్టానికి నిదర్శనం. పంపుసెట్‌తో పత్తి మొక్కలకు నీటిని పిచికారీ చేస్తున్న రైతు పేరు బంద. ఊరు గోనెగండ్ల. నాలుగు ఎకరాల్లో సాగు చేసిన పత్తి పైరు వాన లేక ఎండిపోతుండటంతో కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు.

కూటమి పాలనలో అంతా చీకట్లు

- చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లో తీసుకెళ్దాం
- ఏడాది పూర్తయినా అభివృద్ధి, సంక్షేమం లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, పార్టీ నేతలు

సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆలూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బి.వి రూపాక్షి విమర్శించారు. ఆలూరులోని స్థానిక ఉమా కల్యాణ మండపంలో ఆవరణలో మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె. మల్లికార్జున ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్వీ, ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు తెర్నెకల్ సురేంద్రరెడ్డి, జనార్దన్‌నాయుడు, జనరల్ సెక్రటరీ షరీఫ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి, విరూపాక్షి మాట్లాడుతూ.. అధికారం కోసం చంద్రబాబునాయుడు ప్రజలను హామీలతో మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసి పేదల ఇళ్లకు నవరత్నాలు చేర్చారన్నారు. అనంతరం 'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరుతో క్యూర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్మార్టు ఫోన్ ద్వారా కూటమి ఇచ్చిన హామీలు ఎన్ని.. ఎగ్గొట్టినవి ఎన్ని.. అనేది చూసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు మండల స్థాయిలో నాయకులు గ్రామాల్లో పర్యటించి సీఎం చంద్రబాబు నాయుడు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.

రెడ్ బుక్‌లకు భయపడేది లేదు..

రెడ్ బుక్‌లు ఎన్నో చూసి రాజకీయాల్లో కొనసాగుతున్నామని ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఇలాంటి బుక్‌లు అమలు చేసి ఉంటే టీడీపీలో ఎవరూ ఉండేవారు కాదన్నారు. ఈ విషయం సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌కు కూడా బాగా తెలుసునన్నారు. అబద్ధాలతో పాలన కొనసాగించడం ప్రజలను మోసం చేయడమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్రరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో పీఆర్ వింగ్, ఎస్సీ సెల్, కళాకారుల వింగ్ సంయుక్త కార్యదర్శులు ఓబులేసు, మహానంది, శేషప్ప, వీరేశప్ప, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, మేధావుల సంఘం కార్యదర్శి శివానంద, జిల్లా అధికార ప్రతినిధి మల్లికార్జున, యువజన రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మైనార్టీ సెల్ కార్యదర్శి ఇమ్రాన్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, ఈరన్న, ఉపాధ్యక్షులు గిరి, పెద్దయ్య, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మారయ్య, రామిరెడ్డి, షఫి ఉల్లా, రామకృష్ణ, బసవరాజ, జెడ్పీటీసీ సభ్యులు దొరబాబు, నాయకులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

7న ఐఏబీ సమావేశం

కర్నూలు సిటీ: సాగునీటి సలహా మండలి సమావేశం ఈనెల 7న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించారని జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ బాలచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ప్రధాన జల వనరు తుంగభద్ర జలాలు. కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయంలో నీటి లభ్యత ఆశించిన స్థాయి కంటే ఎక్కువగానే ఉండడంతో పాటు, డ్యాం ఎగువన ఉన్న నదీ పరీవాహక ప్రాంతంతో పాటు, పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండడంతో డ్యాంలోకి వరద నీరు భారీగానే వచ్చి చేరుతోంది. దీంతో కర్ణాటక నీటిపారుదల సలహా సమితి(ఐసీసీ) గత నెల 27న బెంగళూరులో సమావేశమై కాలువలకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించారు. ఆ మేరకు ఈ నెల 10వ తేది నుంచి తుంగభద్ర దిగువ కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. అందులో భాగంగానే కర్ణాటక వాటా నీటితో కలిపి ఏపీ కోటా నీటి విడుదలకు టీబీ బోర్డుకు ఇండెంట్ పెట్టనున్నారు. 2025-26 నీటి సంవత్సరంలో టీబి డ్యాం నీటి లభ్యత 120 టీఎంసీలుగా అంచనా వేశారు. ఈ మేరకు ఎల్‌ఎల్‌సీ కాలువకు 13.585 టీఎంసీల నీరు, కేసీ కాలువకు 5.66 టీఎంసీల నీటిని కేటాయించారు. జిల్లాలో ఎల్‌ఎల్‌సీ, కేసీ కాలువ, ఏబీసీ, జీడీపీ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, హంద్రీనీవా, పులికనుమ రిజర్వాయర్లు ఉండగా, వీటి పరిధిలో సుమారు 3లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

భక్తులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు సంతృప్తికర, సులభతర దర్శనం కల్పించడమే లక్ష్యంగా దేవదాయశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు. మహానంది ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రసాదాల తయారీ, ఇతర విభాగాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈఓ హోదా నుంచి ఆర్‌జేసీ హోదా కలిగిన ఆలయాల్లో సౌకర్యాలపై దృష్టి సారించారని చెప్పారు. ఆర్జిత సేవలతో పాటు ప్రసాదం తయారీ, అన్నప్రసాదం పంపిణీ, క్యూలైన్ల నిర్వహణపై దృష్టి సారించారన్నారు.

మా పాఠశాలలోనే చదువుకుంటాం!

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు(సెంట్రల్): 'మా పాఠశాల మాకే కావాలి.. వేరే పాఠశాలకు వెళ్లమని' కర్నూలు నగరంలో ని బి.క్యాంప్ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట భీష్మించారు. మంగళవార ఉదయమే విద్యార్థులు కలెక్టరేట్‌కు చేరుకొని తమను అదే పాఠశాలలో కొనసాగించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు తరగుతులు ఉన్నాయి. అయితే 6, 7, 8 తరగతులను సమీపంలోని బి.క్యాంపు బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం విలీనం చేసింది. దీనిపై ఆగ్రహించిన విద్యార్థులు తాము మరో పాఠశాలకు వెళ్లమని, అదే పాఠశాలలో చదువుకుంటామని చెప్పారు. కాగా, అటుగా వెళ్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్ విద్యార్థుల వద్దకు వచ్చి పాఠశాలకు వెళ్లాలని కోరారు. అయితే వారు మా పాఠశాలకే వెళ్తామని, విలీన పాఠశాలకు వెళ్లమని చెప్పడంతో ఆయన ఏమీ చెప్పలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, విద్యార్థుల ఆందోళనకు ఏఐడీఎస్‌ఓ, పీడీఎస్‌యూ, బీఎస్‌యూ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి.

ప్రత్యేక ప్యాకేజీతో తిరుమల దర్శనం

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక ప్యాకేజీతో తిరుమల దర్శనం ఏర్పాటు చేసినట్లు ఏపీటీడీసీ డీవీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతి శుక్రవారం కర్నూలు నుంచి నంద్యాల మీదుగా తిరుమలకు ట్విన్ షేరింగ్ నాన్-ఏసీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు నుంచి తిరుమలకు రూ.2,670.. నంద్యాల నుంచి తిరుమలకు రూ.2,470 ప్యాకేజీ ఛార్జీ ఉంటుందన్నారు. 5 సంవత్సరాల్లోపు పిల్లలకు పూర్తిగా ఉచితమన్నారు. తిరుమలలో స్పెషల్ ఎంట్రీ దర్శనం.. శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం, తిరుచానూరు క్షేత్రాలు ప్యాకేజీలో ఉన్నాయని తెలిపారు. కర్నూలు వెంకటరమణ కాలనీలోని ఏపీటీడీసీ కార్యాలయం నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. వివరాలకు వీఆర్ కాలనీలోని ఏపీటీడీసీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

5, 6 తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జూలై 5, 6 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు పట్టణంలోని నందిపైప్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన అండర్–11, 13 విభాగాల్లో బాల బాలికలకు, 6వ తేదీన అండర్–17, 19 బాలికల విభాగం క్రీడాకారులకు, సీనియర్స్ విభాగం పురుషులు, మహిళా క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువపత్రంతో పాటు పార్ట్‌నర్ పేరును పొందుపరిచి ఎంట్రీలను 4వ తేదీలోగా ఇవ్వాలని కోరారు. మరింత సమాచారం కోసం కోచ్ నాగార్జున సెల్ నంబర్ 89858 09434ను సంప్రదించాలని సూచించారు.

కాశీకి సైకిల్ యాత్ర

జొన్నగిరి సమీపంలో సైకిల్ యాత్ర చేస్తున్న స్వామీజీ

తుగ్గలి: కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ఓలార్‌కు చెందిన హెచ్‌బి గోపాలకృష్ణ స్వామీజీ కాశీ సందర్శనకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. 12 రోజుల కిందట ఓలార్‌లో యాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. జొన్నగిరి నుంచి ఆదోని వెళ్లే మార్గంలో మంగళవారం స్వామీజీ సైకిల్‌పై వెళుతూ కనిపించారు. 40 ఏళ్లుగా ఏటా కాశీకి వెళుతున్నాని, దేశం సుభిక్షంగా ఉండాలని యాత్ర చేస్తున్నట్లు స్వామీజీ చెప్పారు.

ఫిట్స్‌తో ఏఎస్‌ఐ మృతి

మృతి చెందిన ఏఎస్‌ఐ మాధవస్వామి

నంద్యాల: స్థానిక వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ మాధవస్వామి మంగళవారం ఫిట్స్‌తో మృతి చెందారు. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఏఎస్‌ఐ మాధవస్వామి విధులు ముగించుకొని తన కుటుంబం నివాసం ఉంటున్న డోన్‌కు వెళ్లేందుకు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌కు మంగళవారం ఉదయం వెళ్లారు. అక్కడ ఫిట్స్ రావడంతో ఆర్టీసీ సిబ్బంది గమనించి వన్‌టౌన్ పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ వెళ్లి ఏఎస్‌ఐని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మాధవస్వామి బీపీ, షుగర్, జాండీస్‌తో బాధపడుతూ మెడికల్ లీవ్‌లో వెళ్లి ఇటీవలే విధుల్లో చేరారు. ఏఎస్‌ఐ మృతి పట్ల సీఐ, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

రూ.2.42 కోట్ల ప్రజాధనం స్వాహా!

- కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీలో భారీ అవినీతి
- మేనేజింగ్ కమిటీ ఛైర్మన్ బాలరాజు, సీఈఓలే కారణం
- జిల్లా సహకార అధికారికి అందిన నివేదిక

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజలు రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బును కర్నూలు ఆర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకుంటే స్వాహా చేశారు. లక్ష కాదు రెండు లక్షలు కాదు ఏకంగా రూ. 2.42 కోట్లు కాజేశారు. సెక్షన్–21 కింద నిర్వహించిన విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2010లో సొసైటీ ఏర్పాటు

కర్నూలు నగరంలో 2005 వరకు కర్నూలు అర్బన్ బ్యాంకు ఉండగా అవినీతి, అక్రమాలతో మూత పడింది. దీని స్థానంలో 2010లో దికర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటైంది. సొసైటీ ఏర్పాటు అయినప్పటి నుంచి 2023 నవంబరు వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరించారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌కు, సీఈఓకు జాయింట్‌గా చెక్‌పవర్ ఉండాలి. కాని ఇక్కడ మాత్రం నాన్ అఫీషియల్ పాలక మండలి చైర్మన్ అయిన బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఇచ్చారు.

డిపాజిట్ల సేకరణ ఇలా..

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వ్యాపారాన్ని పెంచుకునేందుకు 100 రోజుల కాలపరిమితితో డైలీ డిపాజిట్‌లు సేకరించింది. డైలీ డిపాజిట్‌ల వసూలుకు సొసైటీ సీఈఓగా వ్యవహరించే వ్యక్తి కుమారుడే ఏజెంటుగా వ్యవహరించే వారు. అనారోగ్య కారణాలతో ఆయన రెండున్నర ఏళ్ల క్రితం ఏజెంటు నుంచి వైదొలగడంతో ఆయన తండ్రి వసూలు చేశారు.

నిధులు పక్కదారి

డైలీ డిపాజిట్‌లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తి అయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. 2021–22లో నిర్వహించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షలకుపైగా నిధులు పక్కదారిపట్టినట్లు తేలింది. ఆడిట్‌లో అక్రమాలు భారీగా వెలుగు చూస్తుండటం, ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో 2023 నవంబరులో సహకార అధికారులు సెక్షన్ –51 కింద విచారణకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీషను విచారణ అధికారిగా నియమించారు. ఈమె ఆరు నెలలకుపైగా విచారణ జరిపి జిల్లా సహకార అధికారికి ఇటీవల నివేదిక అందజేశారు.

రికవరీకి చర్యలు

ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.2.42 కోట్ల ప్రజల సొమ్ము స్వాహాకు గురి అయినట్లు తేలడంతో సహకార శాఖ రికవరీ చర్యలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సొసైటీకి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఉంది. త్వరలో జిల్లా సహకార అధికారులు అఫీషియల్ కమిటీకి తగిన ఆదేశాలు ఇవ్వనున్నారు. అక్రమార్కుల నుంచి స్వాహా అయిన సొమ్మును రికవరీ చేసేందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వనున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు చేపట్టనున్నారు. అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

భారీ అక్రమాలు

విచారణలో మేనేజింగ్ కమిటీ, సీఈవో అక్రమాలు భారీగా వెలుగు చూశాయి. క్రెడిట్ సొసైటీలో రూ.2 కోట్ల వరకు పిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. డైలీ డిపాజిట్లు.. ఇతర లావాదేవీలు రూ. కోటి వరకు ఉన్నాయి. మొత్తం రూ.3 కోట్ల వరకు ఉండగా రూ.2.42 కోట్ల స్వాహా చేశారు. స్వాహా పర్వంలో పాలకవర్గం చైర్మన్‌తో సహా 12 మంది సభ్యులకు, సీఈఓకు భాగస్వామ్యం ఉన్నట్లు తేలింది. మేనేజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజుతో పాటు సీఈఓ పాత్ర ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

32 ఏళ్ల తర్వాత సొంతవారి చెంతకు..

యువకుడిని బంధువులకు అప్పగిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: చిన్నతనంలో తప్పిపోయిన వీరేష్ అనే యువకుడిని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ రమేష్, పురపాలక కమిషనర్ కృష్ణ మంగళవారం బంధువులకు అప్పగించారు. మూడేళ్ల వయస్సులో తప్పిపోయిన వీరేష్ 32 యేళ్ల తర్వాత తమ తల్లిదండ్రులను వెతికి పెట్టాలని అధికారులకు విన్నవించుకున్నాడు. స్పందించిన అధికారులు అతని తల్లిదండ్రులను వెతికే పనిలో పడ్డారు. దిన పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి వీరేష్ అత్త లక్ష్మి, మామ జగదీష్ ఆదోనికి చేరుకుని అధికారులను సంప్రదించారు. వీరేష్ నాన్న జనార్ధన్ మృతి చెందాడని వారు తెలిపారు. తాము కర్నూలులో ఉంటామని తమ మామ, అత్త పేర్లు చెప్పడంతో గతంలో తప్పిపోయిన విషయం గుర్తు చేసుకుని వచ్చినట్లు వారు చెప్పారు. అన్ని ఆధారాలు పరిశీలించి అధికారులు వీరేష్‌ను వారికి అప్పగించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో పలువురికి పదవులు దక్కాయి. జిల్లాస్థాయిలో అంగన్‌వాడీ విభాగ కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా ఐరావతి (ఆలూరు), సంతోషమ్మ (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా అన్నపూర్ణ (ఆదోని), జగదీశ్వరమ్మ (పత్తికొండ), కె.పద్మమ్మ (మంత్రాలయం), పి.వెంకటేశ్వరమ్మ (కర్నూలు), సావిత్రమ్మ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా బోయ ఈరమ్మ (ఎమ్మిగనూరు), ఎల్‌ఎం.లత (ఆదోని), జ్యోతి లత (పత్తికొండ), ఎం.నిర్మల (ఆలూరు), ఎం.లతవాణి (మంత్రాలయం), సుగుణ, కాంతమ్మ (కర్నూలు) ఐదుగురు కార్యవర్గ సభ్యులు కె.మల్లీశ్వరీ (పత్తికొండ), బి.జె. ఆదిలక్ష్మి (ఆలూరు), బి.లలిత (ఆదోని), ఎస్.రమీజాబీ, జి.లలిత (కర్నూలు)ను నియమించారు.

జిల్లా బీసీ కమిటీలో..

జిల్లా స్థాయి బీసీ కమిటీలో ఉపాధ్యక్షులుగా జి.క్రిష్ణ (పత్తికొండ),బోయ రంగస్వామి (ఎమ్మిగనూరు), ప్రధాన కార్యదర్శులుగా యం.భాస్కర్ (ఆలూరు), వి.నాగరాజు (మంత్రాలయం), క్రిష్ణ (కోడుమూరు), బోయ రంగస్వామి (ఆదోని), బోయ లక్ష్మన్న (కర్నూలు), జి.రామక్రిష్ణయాదవ్ (పాణ్యం), కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు (పత్తికొండ), డి.నరసింహులు (ఆలూరు), కె.బసన్న గౌడ్ (మంత్రాలయం), కురువ మధు (కోడుమూరు), బి.లింగారెడ్డి (ఆదోని),షేక్ చాంద్‌బాషా (పాణ్యం),బి.అశోక్ (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా గొల్లనాగరాజు (ఎమ్మిగనూరు), ఏ.పెద్ద లక్ష్మన్న స్వామి (పత్తికొండ), మల్లికార్జున, పి.సంజితకుమార్ (ఆలూరు), బి.మల్లేష్ (మంత్రాలయం), గొల్ల జగన్నాథ రావు (కోడుమూరు), కె.నాగరాజు (ఆదోని), కలువ లక్ష్మీపతి (పాణ్యం), సుంకన్న, సి.శ్రీను (కర్నూలు)కు పార్టీలో పదవులు దక్కాయి. వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరందరినీ నియమిస్తూ మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

గ్రామస్థాయి ఉద్యోగుల బదిలీల్లోనూ రాజకీయాలే!

- సిఫార్సులకు అనుగుణంగానే వీఏఏ, వీహెచ్‌ఏ, ఏహెచ్‌ఏ, మత్స్య సహాయకుల బదిలీలు
- వ్యవసాయ అనుబంధ శాఖల్లో ముగిసిన బదిలీల పర్వం

వీఏఏల బదిలీపై కసరత్తు చేస్తున్న కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అనుబంధ శాఖల్లో గ్రామ సహాయకుల బదిలీల ప్రక్రియ ముగిసింది. అన్ని శాఖల్లోనూ రాజకీయ సిఫార్సులకు అనుగుణంగానే బదిలీలు జరగడం గమనార్హం. వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏహెచ్‌ఏ, మత్స్య సహాయకులు ప్రతిఒక్కరూ టీడీపీ, బీజేపీ నేతల సిఫార్సు లేఖలతోనే బదిలీలకు హాజరయ్యారు. ఎవరైనా ఫలానా వారిని ఈ ప్లేస్‌కు వేయండని ఆడిగితే ఎమ్మెల్యే లెటర్ ఉందా? అని అధికారులు అడుగుతుండటం గమనార్హం. కొంత మంది టీడీపీ చోటా, మోటా నాయకులు లెటర్లు ఇప్పించడానికి ముడుపులు వసూలు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖలో ఆప్షన్ తీసుకోవడం, కౌన్సెలింగ్ నిర్వహించడం పూర్తయినప్పటికీ కలెక్టర్ ఆమోదం తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. వీఏఏల బదిలీల ఫైల్ కలెక్టర్‌కు పంపడానికి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి చర్యలు చేపట్టారు. బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు రాజకీయ సిఫార్సులకే పెద్దపీట వేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యాన శాఖలో వీహెచ్‌ఏల బదిలీల్లో సీనియార్టీ జీఓ ప్రకారం కాకుండా.. కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు విడివిడిగా కౌన్సెలింగ్ నిర్వహించి జీవితాలతో ఆడుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఎస్సీ హార్టికల్చర్, ఎంఎస్సీ హార్టికల్చర్, హార్టికల్చర్ డిప్లొమా, బీఎస్సీ బాటనీ వారీగా బదిలీలు నిర్వహించారు. ఉద్యాన శాఖలో ఉమ్మడి జిల్లాలో 215 మంది వీహెచ్‌ఏలు ఉండగా 212 మంది బదిలీ అయ్యారు. పశు సంవర్ధక శాఖ 16 మంది మంది ఏహెచ్‌ఏలు ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీ అయ్యారు. రిక్వెస్ట్‌పై 42 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా 16 మంది బదిలీ అయ్యారు. సచివాలయాలను కుదించడం వల్ల స్థానాలను కోల్పోయిన 20 మంది ఏహెచ్‌ఏలకు స్థానాలు కేటాయించారు. మొత్తంగా 52 మంది ఏహెచ్‌ఏలు బదిలీ అయ్యారు. మత్స్యశాఖకు సంబంధించి 19 మత్స్య సహాయకులు ఉండగా 16 మంది బదిలీ అయ్యారు. ఐదేళ్లు పూర్తి కావడంతో 15 మంది, రిక్వెస్ట్‌పై ఒకరు బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖలో 454 మంది వీఏఏలు బదిలీలు అయ్యారు. అన్ని శాఖల్లోను పూర్తిగా రాజకీయ కోణంలోనే బదిలీలు జరుగడం గమనార్హం.

జన సురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమాలు

అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజా సంక్షేమం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు సూచించారు. ఇందుకోసం జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు పంచాయతీల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లి గ్రామంలో జన సురక్ష పథకాల అమలుపై స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవన్‌జ్యోతి భీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మూడు నెలల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు ఉండగా... ప్రతి పంచాయతీకి ఒక బ్యాంకును కేటాయించి ఈ పథకాలను వినియోగించుకునే విధంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డీసీఓ వెంకటకృష్ణ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

చెత్త నిల్వలను గుర్తించండి

కర్నూలు(అర్బన్): మున్సిపాలిటీలకు 30 కిలోమీటర్ల దూరంలోని గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన చెత్త, ఇతర వేస్టేజ్‌ను ఐదు రోజుల్లో గుర్తించాలని పీఆర్అండ్ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుంచి జిల్లాలోని ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, కర్నూలు డీఎల్‌డీఓ వెంకటరమణారెడ్డి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల్లో 1,148 టన్నుల చెత్త నిల్వలు ఉన్నాయని సమాచారం పంపారన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీడీఓలు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఏ గ్రామంలో ఎంతమేర చెత్తదిబ్బలు ఉన్నాయి, వాటి ఎత్తు, వెడల్పు, పరిమాణం తదితర వివరాలను పీఆర్‌ఐ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గత ఏడాది విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ఇప్పటికీ పలు మండలాల్లో ఖర్చు చేయలేదని.. జిల్లాలోని కర్నూలు, మంత్రాలయం, ఓర్వకల్ తదితర మండలాల్లో నిధులు అలాగే ఉండిపోయినట్లు తెలుస్తోందన్నారు. ఈ నిధులను వెంటనే లింకు రోడ్లకు వెచ్చించాలన్నారు. అలాగే పనిచేయని చేతి పంపులను మరమ్మతు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, దశరథరామయ్య, జ్యోతి, కవిత, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరయ్య స్వామి పాల్గొన్నారు.

శకునాలలో రెచ్చిపోయిన దొంగలు

- ఒకేరోజు నాలుగు ఇళ్లల్లో చోరీ
- రూ.6.50 లక్షల నగదు, బంగారు, వెండి అపహరణ

బీరువా పెకిలించి దుస్తులను చిందరవందరగా పడేసిన దృశ్యం

ఓర్వకల్లు: మండల పరిధిలోని శకునాల గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీ చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

- గ్రామానికి చెందిన గౌండా షరీఫ్ ఇంటికి తాళం వేసి కంటి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన రూ.లక్ష నగదు, అర కిలో వెండి కడియాలను దోచుకెళ్లారు.
- నాగేంద్ర గౌడు అనే వ్యక్తి భార్యకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో రాత్రి ఇంటికి తాళం వేసి అత్త వారి ఇంట్లో పడుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.50 వేల నగదు, తులం చెవిచుట్లను దోచుకెళ్లారు.
- శీలం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి తల్లిండ్రుల వద్ద పడుకునేందుకు వెళ్లగా ఇంట్లోని బీరువాను పారతో పెకిలించి రూ.లక్ష దోచుకెళ్లారు.
- తలారి మద్దిలేటి ఇంటికి తాళం వేసి గడివేములలో బంధువులకు ఆరోగ్యం బాగాలేకపోతే పరామర్శించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు ఆ ఇంటి తాళాన్ని పగులగొట్టి రూ.4 లక్షల నగదును చోరీ చేసినట్లు వాపోయారు.

విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం తమ ఇళ్లకు చేరుకొని పరిశీలించగా దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకొని బాధితుల ఇళ్లకు వెళ్లి చోరీ ఘటనలపై ఆరా తీశారు. దుండగుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మంత్రాలయం రోడ్ బ్రాంచ్ (21049) ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

జప్తు చేయబడిన కారు ఇ–వేలం

మా రుణగ్రహీతకు చెందిన దిగువ తెలియజేసిన వాహనం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అవిధంగా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఉన్నది ఉన్నట్లుగా ప్రాతిపదికన" ఇ–వేలం కొరకు ఇ–కొటేషన్లు కోరబడుచున్నవి. EMIల చెల్లింపులో రుణగ్రహీత విఫలమైనందున బ్యాంకు అట్టి వాహనమును జప్తుచేసుకుంది మరియు అది 09.07.2025న ఆన్‌లైన్ వేలం వేయబడుచున్నది.

రుణగ్రహీత పేరు & అకౌంట్ నంబరు	కారు వివరణ వాహనం మోడల్-రంగు/రిజిస్టర్డ్ నం./ఇంజిన్ నం./ఛాసిస్ నం./ ఫ్యూయల్	రిజర్వు ధర & బయానా	వేలం సమయం
శ్రీ ఎం.నరేంద్ర, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా A/c.No. 41059621968	MAHINDRA BOLERO PIKUP-2022- FB PS 1.7T /XL/ LMV/ AP39UE8631/ TNN1E68124/ MA1ZU2TNKN1E52743/Diesel/Public Carrier	రూ.4,50,000/- మరియు రూ.45,000/-	ఉ.11.00 గం. నుండి మ.02.00 గం.

ఇ–వేలం నియమ నిబంధనలు: (1) ఇ–వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అవిధంగా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఉన్నది ఉన్నట్లుగా ప్రాతిపదికన" జరుగుతుంది మరియు "ఆన్‌లైన్" ద్వారా నిర్వహించబడుతుంది. వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌పోర్టల్ https://www.bankauctions.com ద్వారా నిర్వహించబడుతుంది. ఆన్‌లైన్ ఇ–వేలం బిడ్ ఫారం (అనెగ్జర్–II, అనెగ్జర్–III), డిక్లరేషన్ మరియు ఆన్‌లైన్ వేలం అమ్మకం యొక్క సాధారణ నియమ నిబంధనలు కలిగిన ఇ–వేలం టెండరు డాక్యుమెంట్ https://www.bankauctions.comలో లభిస్తుంది. సంప్రదించు వ్యక్తి: శ్రీ ఎల్.రఘువీర్‌రెడ్డి – 7095009029 (2) అధీకృత అధికారి పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు వాహనంపై తాకట్టు రుణభారాలు లేవు. అయితే, కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసేముందు వేలమునకు ఉంచబడిన వాహనం తాకట్టు రుణభారాలు, టైటిల్ మరియు వాహనమును ప్రభావితం చేసే క్లెయిములు/హక్కులు/ బకాయిలకు సంబంధించి స్వంత స్వతంత్ర విచారణ జరుపుకోవలెను. ఇ–వేలం ప్రకటన బ్యాంకు యొక్క ఎటువంటి నిబద్ధతను లేదా ఎటువంటి ప్రాతినిధ్యాన్ని కల్పించదు మరియు కల్పిస్తున్నట్లు భావించరాదు. వాహనం బ్యాంకుకు తెలిసిన లేదా తెలియని అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్ తాకట్టు రుణభారాలతో విక్రయించబడుతుంది. ఏ మూడవ పార్టీ క్లెయిములు/ హక్కులు/ బకాయిలకు ఏ రూపంలోను అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటార్ బాధ్యత వహించరు. (3) రిజర్వు ధరలో 10% బయానాను 09.07.2025న ఉ.10.00 గం.లోగా చెల్లించాలి. గెలుపొందిన బిడ్డరు పైన తెలిపిన ఖాతాకు అదేరోజున వేలం ముగిసిన వెంటనే మిగతా మొత్తాన్ని చెల్లించాలి. లేనిచో ఇదివరకే చెల్లించిన బయానా మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది మరియు వాహనాన్ని తిరిగి వేలం వేసేందుకు బ్యాంకుకు స్వేచ్ఛ కలదు. (4) బ్యాంకు నిర్దేశించిన నియమాలు/ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది మరియు ఎటువంటి కారణం తెలుపకుండానే ఏదేని/ అన్ని ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంకుకు హక్కు కలదు. (5) ఏకారణం తెలుపకుండా గెలుపొందిన బిడ్డరును ప్రకటించుటకు ముందు ఏ సమయంలోనైనా వేలం ప్రక్రియను/ టెండరును రద్దు చేయు హక్కు బ్యాంక్‌కు కలదు. (6) గెలుపొందిన బిడ్డరు అతని పేరున వాహనాన్ని బదిలీ చేసుకునేందుకు వీలు కల్పించే అన్ని అవశ్యకమైన డాక్యుమెంట్లు బ్యాంకుచే ఇవ్వబడును. (7) వాహనం 08.07.2025న డిస్‌ప్లే చేయబడును. (8) బిడ్ ఇంక్రిమెంట్ రూ.5,00,000/- వరకు గల రిజర్వు ధర కొరకు రూ.2000/- మరియు రూ.3,00,000/-కు పైన గల రిజర్వు ధర కొరకు రూ.5000/- (9) వేలం కాలవ్యవధి ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో అరగంట ఉంటుంది. (10) పాల్గొనేందుకు అభ్యర్థన/ కేవైసీ డాక్యుమెంట్లు/ బయానా చెల్లింపు రుజువు మొదలైనవాటి దాఖలు/ అప్‌లోడింగ్ తేది మరియు సమయం: 09.07.2025న ఉ.10.00 గం. లోగా

తేది: 01.07.2025, ప్రదేశం: ఎమ్మిగనూరు — సం/– బ్రాంచ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మహిళను ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి..

- రూ.49,900 కాజేసిన యువకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న సెంట్రల్ బ్యాంకు ఏటీఎం సెంటర్‌లో ఓ యువతి దృష్టి మరల్చి ఇద్దరు యువకులు నగదు కాజేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ యువతి పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని సెంట్రల్ బ్యాంక్ ఏటీఎం కేంద్రానికి నగదు విత్ డ్రా చేసేందుకు వెళ్లింది. ఏటీఎం సెంటర్‌లో అప్పటికే ఇద్దరు యువకులు ఉన్నారు. ఆమె ఏటీఎంలో కార్డు పెట్టి పిన్ ఎంటర్ చేసిన వెంటనే వెనక ఉన్న యువకుడు రాంగ్ ప్రాసెస్ ఎంటర్ చేశారని ఆమెను మిస్ గైడ్ చేశాడు. ఆ యువతి వెనక్కు తిరిగి చూడగా మరో యువకుడు తన చేతిలోని ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి ఆ యువతి ఏటీఎం కార్డును దొంగలించారు. తర్వాత పలుసార్లు ప్రయత్నించినా ఏటీఎం మిషన్‌లో డబ్బు రాకపోవడంతో యువతి కార్డును తీసుకుని వెళ్లిపోయింది. ఆ ఇద్దరు యువకులు యువతి ఏటీఎం కార్డు ద్వారా రూ.49,900 కాజేశారు. దీంతో సదరు యువతికి ఫోన్‌లో డబ్బు విత్ డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే త్రీటౌన్ పోలీసులను సంప్రదించింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

జిల్లాలోని వివిధ మండలాల్లో మోస్తరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్):ఉమ్మడి కర్నూలు జిల్లా లోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి కర్నూలు నగరంలో భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. కర్నూలు, ఆదోని, ఎమ్మిగ నూరు, పగిడ్యాల, నందికోట్కూరు, జూపాడు బంగ్లా తదితర మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తాజాగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు స్వల్పంగా ఊరట లభించే అవకాశం ఏర్పడింది.

ఖాళీ స్థానాలు చూపకుండా మోసం చేశారు

- సచివాలయ ఏఎన్‌ఎంల ఆవేదన

బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): తమకు అన్ని ఖాళీ స్థానాలు చూపకుండా నచ్చిన వారికి చూపి వారికే కేటాయించారని పలువురు సచివాలయ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియంలో ప్రారంభమైన సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఉమ్మడి జిల్లాకు ఇక్కడే కౌన్సెలింగ్ నిర్వహించడంతో వందల సంఖ్యలో ఏఎన్‌ఎంలు, వారి కుటుంబసభ్యులు రావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. కొందరు మహిళలు చిన్నపిల్లలతో కౌన్సెలింగ్‌కు హాజరుకాగా వారి పిల్లలను ఓదార్చడం ఇబ్బందిగా మారింది. రాత్రింబవళ్లు కౌన్సెలింగ్ జరగడంతో కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయి. ఆడిటోరియం బయట ఒక్క షామియానా వేసి వదిలేశారు. మంచినీరు, బాత్‌రూమ్‌లు వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని ఏఎన్‌ఎంలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పేరు ఏ నిమిషంలో వస్తుందోనని ఆడిటోరియంలోనే కుర్చీలో కూర్చొని ఎదురుచూశారు. కొందరు రాత్రి కుర్చీల్లోనే నిద్రపోయారు. కౌన్సెలింగ్ ఆద్యంతం అభ్యంతరాల మధ్య కొనసాగింది. అధికారులు పలు ఖాళీలను దాచిపెట్టి వారికి అవసరమైన వారికి కేటాయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సుదూర ప్రాంతాలు దక్కిన వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఖాళీలను చూపకుండా ఇతరులకు చూపి వారికి కేటాయించడం వల్ల మంచి ర్యాంకు ఉన్న తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులే కంప్యూటర్‌లో ఖాళీలు చూసి చెప్పడం వల్ల ఏ ఖాళీ ఉందో, ఏ ఖాళీ లేదో తమకు అర్థం కాలేదని, అలాగాకుండా డిస్‌ప్లే ఏర్పాటు చేసి ఉంటే అందరికీ తెలిసేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మొదట్లో కొందరికి సొంత మండలంలో బదిలీ ఇవ్వలేదని, 300 ర్యాంకు దాటిన తర్వాత సొంత మండలంలోనే ఇచ్చారని, దీనివల్ల తమకు అన్యాయం జరిగిందని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ జాబితాలో టాప్‌లో ఉన్న ఓ ఏఎన్‌ఎంకు తిరిగి అదే స్థానం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అన్యాయంగా తమకు కేటాయించిన స్థానాలు మార్చాలని వర్షంలోనూ నిరసన తెలిపారు.

మత్తులో చిత్తు

తప్పతాగి కంబాలపాడు సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పడిపోయిన మందుబాబులు

కంబాలపాడు సర్కిల్ ఆటో స్టాండ్ వద్ద..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధికో మద్యం దుకాణం, అడుగుకో బెల్టు షాపును ఏర్పాటు చేసి ప్రజల ఒళ్లు, ఇళ్లను గుల్ల చేస్తోంది. మనిషి బలహీనతను ఆసరాగా చేసుకొని బెల్టుషాపుల ద్వారా మద్యాన్ని వాడవాడలా ఏరులై పారిస్తోంది. చాలా మంది యువకులు మద్యం మత్తులో జోగుతూ పచ్చని సంసారాలను నాశనం చేసుకుంటున్నారు. నాణ్యమైన మద్యం సరసమైన ధరకే అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను మత్తులో ఉంచేందుకు నాశిరకం మద్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తప్పతాగి పడిపోయిన మందుబాబులే దర్శనమిస్తున్నారు.

– డోన్

అమ్మ హోటల్ వద్ద రోడ్డు పక్కన..

గుత్తి రోడ్డు వద్ద కట్టపై..

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు తిప్పాయిపల్లె రోడ్డు మెయిన్ రోడ్డుకి నూతన వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో నెలసరి కంతులతో ఓపెన్ ప్లాట్లు కలవు. ✆ 92466 60444. [SCA25005818]

WANTED

■ ఆఫీస్ బాయ్‌గా వర్క్ చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థి కావలెను. వివరాలకు సంప్రదించండి: 73309 24873, 98854 85281. [SCA25005805]

■ కాల్వబుగ్గ దగ్గరలో గల మసరం ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. Qly: 10th, జీతం: 12K, భోజనం కలదు. సంప్ర: 9581776921, 9652447856. [SCA25005716]

■ సెయింట్ థెరీసా (గోషా హాస్పిటల్)లో పనిచేయుటకు GNM/ B.Sc Nursing పూర్తి చేసిన అభ్యర్థులు కావలెను. ఇంటర్వ్యూకు సర్టిఫికెట్స్ మరియు ఫోటోతో రావలెను. సంప్ర: NR పేట కర్నూలు. సెల్: 90104 57112. [SCA25005534]

■ Wanted Marketing Executives for reputed company. No Targets Permanent Salary Starting Rs. 10,000/-. & Good Incentives Cell: 63052 04940 [SCA25005490]

■ Wanted Experienced part-time teacher for Social. Vijetha High School, near krishna nagar ITC, knl. Send your resume via whatsapp: 9492198651. [SCA25005668]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051 [SCA25005825]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
70750 09165
70750 09185
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-

సాక్షి నంద్యాల
బుధవారం । 2 । జూలై । 2025

అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మంగళవారం కోదాడకు చెందిన కనగల నాగేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

శకునాలలో దొంగలు పడ్డారు

ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. రూ.6.50 లక్షలు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. 8లో▸

ప్రజాధనం స్వాహా!

ప్రజలు రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బును కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకుంటే స్వాహా చేశారు. రూ. 2.42 కోట్లు కాజేసినట్లు వెలుగులోకి వచ్చింది. 8లో▸

న్యూస్‌రీల్

భక్తులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం

● దేవదాయశాఖ డీసీ గురుప్రసాద్

ప్రసాదాల విభాగంలో వస్తువులను పరిశీలిస్తున్న డీసీ గురుప్రసాద్

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు సంతృప్తికర, సులభతర దర్శనం కల్పించడమే లక్ష్యంగా దేవదాయశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు. మహానంది ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రసాదాల తయారీ, ఇతర విభాగాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజు, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యలతో కలిసి అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ గురుప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈఓ హోదా నుంచి ఆర్‌జేసీ హోదా కలిగిన ఆలయాల్లో సౌకర్యాలపై దృష్టి సారించారని చెప్పారు. ఆర్జిత సేవలతో పాటు ప్రసాదం తయారీ, అన్నప్రసాదం పంపిణీ, క్యూలైన్ల నిర్వహణపై దృష్టి సారించారన్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. మాడవీధుల్లో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీలో చేతులెత్తేసిన ప్రభుత్వం

సీతారామాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): స్పౌజ్ పింఛన్ల పంపిణీపై కూటమి ప్రభుత్వం వితంతు మహిళలను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోంది. ముందుగా జూన్ 12న పంపిణీ చేస్తున్నామంటూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. నిధులు కూడా బ్యాంకులకు విడుదల చేసినట్లు ప్రకటించింది. అయితే ఆ రోజు పింఛన్లు పంపిణీ చేయలేక చేతులెత్తేసింది. జూలై నెల పింఛన్లతో పాటు స్పౌజ్ పింఛన్లను కూడా పంపిణీ చేస్తామని ఇటీవల ప్రకటించారు. అయితే మంగళవారం పింఛన్ల పంపిణీ సమయానికి స్పౌజ్ పింఛన్ల పంపిణీని నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు నెల రోజుల క్రితం నుంచి వేలాది మంది మహిళలను కూటమి ప్రభుత్వం ఊరిస్తోంది. కర్నూలు జిల్లాలో 2,319, నంద్యాల జిల్లాలో 2,463 ప్రకారం స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినా, పంపిణీలో మొండిచేయి చూపుతుండటం విమర్శలకు తావిస్తోంది.

పింఛన్ల పంపిణీలో 19వ స్థానం

పింఛన్ల పంపిణీలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లా రాష్ట్రంలో 19వ స్థానం, నంద్యాల జిల్లా 16వ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లాలో 2,12,985 పింఛన్లకు గాను 1,99,705 పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు.

తొమ్మిదేళ్లు గడిచినా పట్టాలెక్కని కొత్త రైళ్లు

● నంద్యాల– ఎర్రగుంట్ల మార్గంలో రైళ్ల కొరత
● రోజుకు రాకపోకలు సాగించేది ఆరు మాత్రమే
● పగటి పూట డెమూ ఒక్కటే!
● తిరుగు ప్రయాణంలో వాహనాల్లోనే!

కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

రైలులో పోయి.. బస్సులో రావాల్సిందే!

కోవెలకుంట్ల: రైలు ప్రయాణం అంటే భద్రతతో పాటు చార్జీలు తక్కువని పేద, మధ్య తరగతి ప్రజలు అధిక శాతం రైళ్లలో ప్రయాణిస్తారు. అయితే నంద్యాల– ఎర్రగుంట్ల రైల్వే మార్గం ప్రారంభించి తొమ్మిదేళ్లు అవుతున్నా నేటికి రైళ్ల పెంపు నామమాత్రంగా ఉండటంతో నంద్యాల, వైఎస్సార్ జిల్లాల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు– వైఎస్సార్ జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల వరకు 130 కి.మీ మేర రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఉప్పలపాడు, నొస్సం, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె, మద్దూరు, నంద్యాల రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2016 ఆగస్టు నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నంద్యాల నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు డెమూ, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు, గుంటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఆయా జిల్లాల పారిశ్రామిక అభివృద్ధికి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు రూ. 50 కోట్లతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. 2023 మార్చి 29వ తేదీ నుంచి ఈ మార్గంలో విద్యుత్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. అయితే ప్రస్తుతం రోజుకు రాక,పోక ఆరు రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైళ్ల రాకపోకలను పెంచాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నా రైళ్ల శాఖ అధికారులు విస్మరిస్తున్నారు.

తిరుపతికి ప్రత్యేక రైలు.. అయినా ఆగదు!

ప్రస్తుతం నడుస్తున్న ప్యాసింజర్, రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ఈ నెలనుంచి నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడపనుంది. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా నాందేడ్ నుంచి నంద్యాల మీదుగా తిరుపతికి వెళుతుంది. ప్రతి శుక్రవారం నాందేడ్ నుంచి బయలుదేరే ఈ రైలు చర్లపల్లి, పిడుగురాళ్ల, మార్కాపురం, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మీదుగా ప్రయాణించి మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు తిరుపతి నుంచి బయలు దేరి అదే రోజు రాత్రి 7.40 గంటలకు నంద్యాలకు వస్తుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. నంద్యాల నుంచి ఎర్రగుంట్ల వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి ఏడు రైల్వే స్టాపింగ్‌లు ఉండగా నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల స్టేషన్లలో మాత్రమే స్టాపింగ్ వసతి కల్పించింది. బనగానపల్లె, కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు స్టేషన్లలో స్టాపింగ్ లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో గుంటూరు నుంచి తిరుపతికి నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో నంద్యాల నుంచి తిరుపతికి టికెట్ ధర రూ. 205 ఉండగా కొత్తగా నడిపే ప్రత్యేక రైలు జీరో సర్వీస్ కావడంతో టికెట్ ధర రూ. 400గా నిర్ణయించారు.

పగటి వేళలో కలగా రైళ్ల రాకపోకలు

డెమె రైలు మినహా మిగిలిన రైళ్ల రాకపోకలన్నీ రాత్రి వేళల్లో కొనసాగుతుండటంతో రెండు జిల్లాల ప్రయాణికులకు రైలు ప్రయాణం సౌలభ్యంగా లేదు. పగటి వేళల్లో రైళ్ల రాకపోకలు కలగా మిగిలాయి. నంద్యాల– ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో విద్యార్థులు, ఉద్యోగులతోపాటు ఆయా జిల్లాల్లోని వివిధ ముఖ్య పట్టణాలకు బస్సు ప్రయాణం కంటే రైలు ప్రయాణం దగ్గరి మార్గం. అలాగే ఆయా పట్టణాల్లో బంగారు ఆభరణాలు, పట్టుచీరెలు, వస్త్ర, తదితర వ్యాపార నిమిత్తం ప్రజలు, వ్యాపారాలు రైలు ప్రయాణం సాగిస్తున్నారు. ప్రతి రోజు బోగీల్లో సీట్లు నిండి నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఈ మార్గంలో నంద్యాల నుంచి ఉదయం 6 గంటల రైలు వెళ్లిన తర్వాత రాత్రి వరకు రైళ్ల రాకపోకలు లేవు. తిరుగు ప్రయాణంలో సైతం రాత్రి వరకు రైలు సౌకర్యం లేకపోవడంతో ఉదయం వివిధ పనుల నిమిత్తం వెళ్లిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో రోడ్డు మార్గంలో బస్సులు, ఇతర వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. నిత్యం వందల మంది ప్రయాణికులు రైలు మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తున్నా రైల్వే అధికారులు పగటి వేళలో రైళ్లను నడపకపోవడం విచారకరం.

రైలు బోగిలో ప్రయాణికుల రద్దీ

కనెక్టివిటీ ప్రతిపాదన రద్దు

ఉత్తర భారతదేశానికి రైలు కనెక్టివిటీని విస్తరించేందుకు 2020వ సంవత్సరం నుంచి ఈ మార్గంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు నడపాలని ప్రతిపాదన ఉండేది. ఆ ఏడాది కరోనా వైరస్ విజృంభించడంతో ఆ ప్రాతిపాదనను రైల్వే అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ ప్రతిపాదనపై రైల్వే శాఖ దృష్టి సారించలేదు. తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును కడప నుంచి నంద్యాల వరకు పొడిగించాలని ప్రతిపాదన ఉన్నా రెండు నెలల క్రితం ఆ రైలును నంద్యాలకు కాకుండా అనంతపురం జిల్లా గుంతకల్లు వరకు పొడిగించడంతో ఈ ప్రాంత ప్రజల ఆశలు అడియాసలయ్యాయి. ఈ నెల నుంచి నడిచే ప్రత్యేక రైలు సైతం వారానికి ఒకసారి మాత్రమే నడవనున్నా ఏమాత్రం ఉపయోగకరంగా లేదు. రైల్వేశాఖ అధికారులు ఈ మార్గంలో పగటి వేళ్లలో రైళ్ల రాకపోకలు నడిచేలా చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల ప్రయాణికులు కోరుతున్నారు.

తొమ్మిదేళ్ల నుంచి ఆరు రైళ్లు మాత్రమే..

కేంద్ర మాజీ హోం సహాయమంత్రి, బీహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన సంజామల వాసి దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య కలల సాకారమైన నంద్యాల– ఎర్రగుంట్లరైల్వే మార్గం ప్రారంభించి తొమ్మిదేళ్లు గడుస్తున్నా మరిన్ని రైళ్ల రాకపోకల ప్రతిపాదన మరుగున పడింది. 2016లో ఈ మార్గం ప్రారంభం అయినా ఇప్పటి వరకు కేవలం రాక, పోక ఆరు రైళ్లు మాత్రమే తిరుగుతున్నాయి. రాకపోకలు ప్రారంభమైన మొదట్లో నంద్యాల నుంచి కడప వరకు వారంలో ఆరు రోజులు డెమూ రైలు నడిచేది. తర్వాత ఆరు నెలలకు ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి వారంలో మూడు రోజుల మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగేది. 2018వ సంవత్సరం నుంచి డెమూ రైలును వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి వరకు పొడిగించడంతోపాటు ఎక్స్‌ప్రెస్ రైలుతో సహా రెండు రైళ్ల ప్రతి రోజు నడిచేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు రెండేళ్ల క్రితం నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది.

మరో డెమూ రైలు నడపాలి

నంద్యాల నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతం ఒకే డెమూ రైలు నడుస్తోంది. ఈ రైలు ఉదయం 6.45 గంటలకు కోవెలకుంట్లకు చేరుకుంటుంది. ఈ రైలు వెళ్లిన తర్వాత రాత్రి వరకు రైళ్ల రాకపోకలు లేవు. ఇదే సమయంలో రేణిగుంట నుంచి నంద్యాలకు మరో డెమూ రైలు నడిపితే ప్రయాణికులకు అన్ని విధాలా రైలు ప్రయాణం ఉపయోగకరంగా ఉంటుంది. జూలై నెల నుంచి నంద్యాల మీదుగా తిరుపతికి ప్రత్యేక రైలు నడవనుంది. ఈ రైలుకు బనగానపల్లె, కోవెలకుంట్ల, ప్రొద్దుటూరు పట్టణాల్లో స్టాపింగ్ కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– డీసీ ఉసేన్, కోవెలకుంట్ల

తిరుగు ప్రయాణంలో తిప్పలు

నంద్యాల– ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో పగటి వేళల్లో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వివిధ పనుల నిమిత్తం ఉదయమే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, తదితర ప్రాంతాలకు వెళ్లి మధ్యాహ్నానికే పనులు పూర్తి చేసుకున్నా తిరుగు ప్రయాణంలో రైలు వసతి లేదు. దీంతో బస్సు, ఇతర వాహనాల్లో రోడ్డు మార్గాన స్వగ్రామానికి చేరాల్సి వస్తోంది. దీనివల్ల అనేక వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. ఒకటి, రెండు రైళ్లు పగటి వేళల్లో నడిపితే రైలు ప్రయాణం సులభతరంగా ఉంటుంది.

– రఘునాథరెడ్డి, గుళ్లదూర్తి, కోవెలకుంట్ల మండలం

ఖాళీ జాగా.. టీడీపీ నాయకుల పాగా!

● దర్జాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

రుద్రవరం: ఎక్కడైన ఖాళీ జాగా కన్పిస్తే చాలు టీడీపీ నాయకులు పాగా వేస్తున్నారు. అది లే అవుట్ అయినా.. డీకేటీ భూములైనా.. వదలడం లేదు. రెవెన్యూ అధికారులు వారించినా.. వెనకడుగు వేయడం లేదు. రుద్రవరం మండలం చందలూరు, హరినగరం సమీపంలోని నవ అహోబిల వద్ద ఉన్న ఖాళీ భూములను టీడీపీ నాయకులు ఆక్రమించారు. దర్జాగా ట్రాక్టర్లతో సేద్యాలు చేసి పాగా వేశారు. చందలూరు గ్రామానికి చెందిన ఓ దాత దాదాపు 40 ఏళ్ల క్రితం గ్రామస్తులకు ఇళ్ల స్థలాల కోసం 7.75 ఎకరాలు కేటాయించారు. అప్పట్లోనే ఆ పొలాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. అయితే అప్పటి నుంచి ప్రభుత్వాలు మారాయి కానీ.. ఆ స్థలంలో ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వలేక ఖాళీగా వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ స్థలాన్ని లే అవుట్‌గా మార్చి పక్కనే ఉన్న ఎస్సీ కాలనీ వాసులకు కొంత మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. కాలనీలో మట్టి రోడ్లు వేశారు. అలాగే మల్టీ పర్పస్ గోదాము నిర్మించారు. అలాగే అదే స్థలంలో ఓ వైపు వాగు పక్కన కొత్తగా బోరు వేసి మోటార్ అమర్చి రజకులకు కేటాయించారు. అయితే ఎస్సీలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యే సమయంలో ప్రభుత్వం మారింది. దీంతో ఇళ్లు కట్టుకుంటే బిల్లులు వస్తాయో రావో అన్న భయంతో నిర్మాణాలు చేపట్టలేదు.

చందలూరు లే అవుట్ భూమిని దున్నేసిన దృశ్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ లేఅవుట్ స్థలం ఖాళీగా ఉండటంతో గ్రామ టీడీపీ నాయకుడు చౌరెడ్డి ఇటీవల ట్రాక్టరుతో దున్నేసి ఆ స్థలం తమదే అంటూ పాగా వేశాడు. అలాగే నవ అహోబిలానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే గంగుల ప్రతాపరెడ్డి దాదాపు వంద ఎకరాల డీకేటీ భూమిని కేటాయించారు. అయితే అహోబిల ఆలయ నిర్వాహకులు 12 ఎకరాల్లో పలు నిర్మాణాలు చేపట్టి మిగిలిన పొలాన్ని ఖాళీగా వదిలేశారు. గతంలో కొందరు టీడీపీ నాయకులే ఆ పొలాలను ఎక్కడ బడితే అక్కడ ఆక్రమించుకున్నారు. ఇంకా కొంత పొలం మిగిలి ఉండగా మూడు రోజుల క్రితం ఆలమూరుకు టీడీపీ నాయకుడు ఆ ఖాళీ పొలాన్ని దున్నేసి ఆక్రమించేశాడు. ఆ ఆక్రమణలపై ఆయా గ్రామాల వీఆర్వోలు చంద్రమోహన్, పుల్లయ్యలను అడగ్గా విచారణ చేసి అక్కడ జరిగిన ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో కేసుల దర్యాప్తు

● ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: కేసుల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల పెండింగ్‌కు కారణాలను, కేసుల దర్యాప్తులో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్పీ సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసు వివరాలను క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. గ్రేవ్, యూఐ, పీటీ, మర్డర్, సైబర్ క్రైమ్, పోక్సో, మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, సాయుధ బలగాల అదనపు ఎస్పీ చంద్రబాబు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్, ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

విజిలెన్స్ అధికారుల దాడులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని హోటళ్లు, హోల్‌సేల్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. డీసీటీఓ వెంకటరమణ, విజిలెన్స్ ఎస్‌ఐల నరేంద్రలతో పాటు పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, మురళీ ఆధ్వర్యంలో స్థానిక బీమాస్ హోటల్, సూరబీ హోటళ్లను తనిఖీ చేశారు. లోపాలను గుర్తించి ఒక్కో హోటల్‌కు రూ.36వేలు జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న పలు దుకాణాలపై దాడి చేసి రూ.22వేల జరిమానా విధించారు.

మంచినీటి కోసం రోడ్డెక్కారు

● మంత్రి ఇలాఖాలో తాగునీటి సమస్య
● అనంతపురం – అమరావతి రహదారిపై ఆందోళన
● నీటి కోసం పనులు మానుకుంటున్నామంటూ ఆవేదన

రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: బిందెడు నీటి కోసం అంకిరెడ్డిపల్లె వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. పాలకులు, అధికారులు తమ గోడు పట్టించుకోక పోవడంతో నిరసన బాట పట్టారు. మంగళవారం చింతలాయిపల్లె క్రాస్ రోడ్డులో మహిళలు, వృద్ధులు భారీ సంఖ్యలో ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. అనంతపురం–అమరావతి జాతీయ రహదారి కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గంటకు పైగానే రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. చాలా రోజులుగా కుళాయిలకు నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. బైక్‌ల్లో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. చాలా మంది నాపరాతి గనుల్లో కూలీ పనులకు పోయే వాళ్లమని, నీళ్ల కోసం పనులు సైతం మానుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు మంత్రి బీసీ జనార్దనరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో తీవ్రమైన నీటి సమస్య ఏర్పడినా పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు వాపోయారు. జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్నారని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మహిళలతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి ఒక ప్రకనటలో మంగళవారం తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, స్థానిక సంస్థల మున్సిపల్, ఏపీ మోడల్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఈనెల 15 లోపు దరఖాస్తులు అందజేయాలని, జిల్లా సెలక్షన్ కమిటీ ఎంపికలు రాష్ట్ర కమిటీకి ఈనెల 16 నుంచి 25లోపు పంపడానికి సమయం ఉంటుందన్నారు. పదవీ విరమణ ఉపాధ్యాయులు అనర్హులని, సంబంధిత సంవత్సరంలో కనీసం నాలుగు నెలలు విధులు నిర్వహించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కేంద్ర విద్యామంత్రి ఆమోదం పొందిన తర్వాత అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. సెప్టెంబర్ 4, 5 తేదీన రిహార్సల్, అవార్డుల ప్రదానం ఉంటుందని డీఈఓ తెలిపారు.

క్లుప్తంగా

5, 6 తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జూలై 5, 6 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు పట్టణంలోని నందిపైప్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన అండర్–11, 13 విభాగాల్లో బాలబాలికలకు, 6వ తేదీన అండర్–17, 19 బాలికల విభాగం క్రీడాకారులకు, సీనియర్స్ విభాగం పురుషులు, మహిళా క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అన్ని విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువపత్రంతో పాటు పార్ట్‌నర్ పేరును పొందుపరిచి ఎంట్రీలను 4వ తేదీలోగా ఇవ్వాలని కోరారు. మరింత సమాచారం కోసం కోచ్ నాగార్జున సెల్ నంబర్ 898 58 09434ను సంప్రదించాలని సూచించారు.

కాశీకి సైకిల్ యాత్ర

జొన్నగిరి సమీపంలో సైకిల్ యాత్ర చేస్తున్న స్వామీజీ

తుగ్గలి: కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ఓలార్‌కు చెందిన హెచ్‌బి గోపాలకృష్ణ స్వామీజీ కాశీ సందర్శనకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. 12 రోజుల కిందట ఓలార్‌లో యాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. జొన్నగిరి నుంచి ఆదోని వెళ్లే మార్గంలో మంగళవారం స్వామీజీ సైకిల్‌పై వెళుతూ కనిపించారు. 40 ఏళ్లుగా ఏటా కాశీకి వెళుతున్నాని, దేశం సుభిక్షంగా ఉండాలని యాత్ర చేస్తున్నట్లు స్వామీజీ చెప్పారు.

ఫిట్స్‌తో ఏఎస్‌ఐ మృతి

మృతి చెందిన ఏఎస్‌ఐ మాధవస్వామి

నంద్యాల: స్థానిక వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ మాధవస్వామి మంగళవారం ఫిట్స్‌తో మృతి చెందారు. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఏఎస్‌ఐ మాధవస్వామి విధులు ముగించుకొని తన కుటుంబం నివాసం ఉంటున్న డోన్‌కు వెళ్లేందుకు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌కు మంగళవారం ఉదయం వెళ్లారు. అక్కడ ఫిట్స్ రావడంతో ఆర్టీసీ సిబ్బంది గమనించి వన్‌టౌన్ పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ వెళ్లి ఏఎస్‌ఐని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మాధవస్వామి బీపీ, షుగర్, జాండీస్‌తో బాధపడుతూ మెడికల్ లీవ్‌లో వెళ్లి ఇటీవలే విధుల్లో చేరారు. ఏఎస్‌ఐ మృతి పట్ల సీఐ, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

రూ.2.42 కోట్ల ప్రజాధనం స్వాహా!

- కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీలో భారీ అవినీతి
- మేనేజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజు, సీఈఓలే కారణం
- జిల్లా సహకార అధికారికి అందిన నివేదిక

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజలు రెక్కల కష్టంతో సంపాదించిన డబ్బును కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకుంటే స్వాహా చేశారు. లక్ష కాదు రెండు లక్షలు కాదు ఏకంగా రూ. 2.42 కోట్లు కాజేశారు. సెక్షన్–21 కింద నిర్వహించిన విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2010లో సొసైటీ ఏర్పాటు

కర్నూలు నగరంలో 2005 వరకు కర్నూలు అర్బన్ బ్యాంకు ఉండగా అవినీతి, అక్రమాలతో మూత పడింది. దీని స్థానంలో 2010లో దికర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటైంది. సొసైటీ ఏర్పాటు అయినప్పటి నుంచి 2023 నవంబరు వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరించారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌కు, సీఈఓకు జాయింట్‌గా చెక్‌పవర్ ఉండాలి. కాని ఇక్కడ మాత్రం నాన్ అఫీషియల్ పాలక మండలి చైర్మన్ అయిన బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఇచ్చారు.

డిపాజిట్ల సేకరణ ఇలా..

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వ్యాపారాన్ని పెంచుకునేందుకు 100 రోజుల కాలపరిమితితో డైలీ డిపాజిట్‌లు సేకరించింది. డైలీ డిపాజిట్‌ల వసూలుకు సొసైటీ సీఈఓగా వ్యవహరించే వ్యక్తి కుమారుడే ఏజెంటుగా వ్యవహరించే వారు. అనారోగ్య కారణాలతో ఆయన రెండున్నర ఏళ్ల క్రితం ఏజెంటు నుంచి వైదొలగడంతో ఆయన తండ్రి వసూలు చేశారు.

నిధులు పక్కదారి

డైలీ డిపాజిట్‌లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తి అయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. 2021–22లో నిర్వహించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షలకుపైగా నిధులు పక్కదారిపట్టినట్లు తేలింది. ఆడిట్‌లో అక్రమాలు భారీగా వెలుగు చూస్తుండటం, ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో 2023 నవంబరులో సహకార అధికారులు సెక్షన్ –51 కింద విచారణకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీషను విచారణ అధికారిగా నియమించారు. ఈమె ఆరు నెలలకుపైగా విచారణ జరిపి జిల్లా సహకార అధికారికి ఇటీవల నివేదిక అందజేశారు.

రికవరీకి చర్యలు

ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.2.42 కోట్ల ప్రజల సొమ్ము స్వాహాకు గురి అయినట్లు తేలడంతో సహకార శాఖ రికవరీ చర్యలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఈ సొసైటీకి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఉంది. త్వరలో జిల్లా సహకార అధికారులు అఫీషియల్ కమిటీకి తగిన ఆదేశాలు ఇవ్వనున్నారు. అక్రమార్కుల నుంచి స్వాహా అయిన సొమ్మును రికవరీ చేసేందుకు తగిన ఉత్తర్వులు ఇవ్వనున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు చేపట్టనున్నారు. అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

భారీ అక్రమాలు

విచారణలో మేనేజింగ్ కమిటీ, సీఈవో అక్రమాలు భారీగా వెలుగు చూశాయి. క్రెడిట్ సొసైటీలో రూ.2 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. డైలీ డిపాజిట్లు.. ఇతర లావాదేవీలు రూ. కోటి వరకు ఉన్నాయి. మొత్తం రూ.3 కోట్ల వరకు ఉండగా రూ.2.42 కోట్లు స్వాహా చేశారు. స్వాహా పర్వంలో పాలకవర్గం చైర్మన్‌తో సహా 12 మంది సభ్యులకు, సీఈఓకు భాగస్వామ్యం ఉన్నట్లు తేలింది. మేనేజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజుతో పాటు సీఈఓ పాత్ర ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

32 ఏళ్ల తర్వాత సొంతవారి చెంతకు..

యువకుడిని బంధువులకు అప్పగిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: చిన్నతనంలో తప్పిపోయిన వీరేష్ అనే యువకుడిని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ రమేష్, పురపాలక కమిషనర్ కృష్ణ మంగళవారం బంధువులకు అప్పగించారు. మూడేళ్ల వయస్సులో తప్పిపోయిన వీరేష్ 32 యేళ్ల తర్వాత తమ తల్లిదండ్రులను వెతికి పెట్టాలని అధికారులకు విన్నవించుకున్నాడు. స్పందించిన అధికారులు అతని తల్లిదండ్రులను వెతికే పనిలో పడ్డారు. దిన పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి వీరేష్ అత్త లక్ష్మి, మామ జగదీష్ ఆదోనికి చేరుకుని అధికారులను సంప్రదించారు. వీరేష్ నాన్న జనార్ధన్ మృతి చెందాడని వారు తెలిపారు. తాము కర్నూలులో ఉంటామని తమ మామ, అత్త పేర్లు చెప్పడంతో గతంలో తప్పిపోయిన విషయం గుర్తు చేసుకుని వచ్చినట్లు వారు చెప్పారు. అన్ని ఆధారాలు పరిశీలించి అధికారులు వీరేష్‌ను వారికి అప్పగించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో పలువురికి పదవులు దక్కాయి. జిల్లాస్థాయిలో అంగన్‌వాడీ విభాగ కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా ఐరావతి (ఆలూరు), సంతోషమ్మ (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా అన్నపూర్ణ (ఆదోని), జగదీశ్వరమ్మ (పత్తికొండ), కె.పద్మమ్మ (మంత్రాలయం), పి.వెంకటేశ్వరమ్మ (కర్నూలు), సావిత్రమ్మ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా బోయ ఈరమ్మ (ఎమ్మిగనూరు), ఎల్ఎం.లత (ఆదోని), జ్యోతి లత (పత్తికొండ), ఎం.నిర్మల (ఆలూరు), ఎం.లతవాణి (మంత్రాలయం), సుగుణ, కాంతమ్మ (కర్నూలు) ఐదుగురు కార్యవర్గ సభ్యులు కె.మల్లీశ్వరీ (పత్తికొండ), బి.జె. ఆదిలక్ష్మి (ఆలూరు), బి.లలిత (ఆదోని), ఎస్.రమీజాబీ, జి.లలిత (కర్నూలు)ను నియమించారు.

జిల్లా బీసీ కమిటీలో..

జిల్లా స్థాయి బీసీ కమిటీలో ఉపాధ్యక్షులుగా జి.క్రిష్ణ (పత్తికొండ),బోయ రంగస్వామి (ఎమ్మిగనూరు), ప్రధాన కార్యదర్శులుగా యం.భాస్కర్ (ఆలూరు), వి.నాగరాజు (మంత్రాలయం), క్రిష్ణ (కోడుమూరు), బోయ రంగస్వామి (ఆదోని), బోయ లక్ష్మన్న (కర్నూలు), జి.రామక్రిష్ణయాదవ్ (పాణ్యం), కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు (పత్తికొండ), డి.నరసింహులు (ఆలూరు), కె.బసన్న గౌడ్ (మంత్రాలయం), కురువ మధు (కోడుమూరు), బి.లింగారెడ్డి (ఆదోని),షేక్ చాంద్‌బాషా (పాణ్యం),బి.ఆశోక్ (కర్నూలు), కార్యవర్గ సభ్యులుగా గొల్లనాగరాజు (ఎమ్మిగనూరు), ఏ.పెద్ద లక్ష్మన్న స్వామి (పత్తికొండ), మల్లికార్జున, పి.సంజితకుమార్ (ఆలూరు), బి.మల్లేష్ (మంత్రాలయం), గొల్ల జగన్నాథ రావు (కోడుమూరు), కె.నాగరాజు (ఆదోని), కలువ లక్ష్మీపతి (పాణ్యం), సుంకన్న, సి.శ్రీను (కర్నూలు)కు పార్టీలో పదవులు దక్కాయి. వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరందరినీ నియమిస్తూ మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

జన సురక్ష పథకాలపై అవగాహన కార్యక్రమాలు

అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజా సంక్షేమం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు సూచించారు. ఇందుకోసం జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు పంచాయతీల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లి గ్రామంలో జన సురక్ష పథకాల అమలుపై స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఎల్‌డీఎం మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవన్‌జ్యోతి భీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మూడు నెలల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు ఉండగా... ప్రతి పంచాయతీకి ఒక బ్యాంకును కేటాయించి ఈ పథకాలను వినియోగించుకునే విధంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డీసీఓ వెంకటకృష్ణ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి ఉద్యోగుల బదిలీల్లోనూ రాజకీయాలే!

- సిఫార్సులకు అనుగుణంగానే వీఏఏ, వీహెచ్‌ఏ, ఏహెచ్‌ఏ, మత్స్య సహాయకుల బదిలీలు
- వ్యవసాయ అనుబంధ శాఖల్లో ముగిసిన బదిలీల పర్వం

వీఏఏల బదిలీపై కసరత్తు చేస్తున్న కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ అనుబంధ శాఖల్లో గ్రామ సహాయకుల బదిలీల ప్రక్రియ ముగిసింది. అన్ని శాఖల్లోనూ రాజకీయ సిఫార్సులకు అనుగుణంగానే బదిలీలు జరగడం గమనార్హం. వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏహెచ్‌ఏ, మత్స్య సహాయకులు ప్రతిఒక్కరూ టీడీపీ, బీజేపీ నేతల సిఫార్సు లేఖలతోనే బదిలీలకు హాజరయ్యారు. ఎవరైనా ఫలానా వారిని ఈ ప్లేస్‌కు వేయండని ఆడిగితే ఎమ్మెల్యే లెటర్ ఉందా? అని అధికారులు అడుగుతుండటం గమనార్హం. కొంత మంది టీడీపీ చోటా, మోటా నాయకులు లెటర్లు ఇప్పించడానికి ముడుపులు వసూలు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖలో ఆప్షన్ తీసుకోవడం, కౌన్సెలింగ్ నిర్వహించడం పూర్తయినప్పటికీ కలెక్టర్ ఆమోదం తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. వీఏఏల బదిలీల ఫైల్ కలెక్టర్‌కు పంపడానికి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి చర్యలు చేపట్టారు. బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు రాజకీయ సిఫార్సులకే పెద్దపీట వేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యాన శాఖలో వీహెచ్‌ఏల బదిలీల్లో సీనియార్టీ జీఓ ప్రకారం కాకుండా.. కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు విడివిడిగా కౌన్సెలింగ్ నిర్వహించి జీవితాలతో ఆడుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఎస్సీ హార్టికల్చర్, ఎంఎస్సీ హార్టికల్చర్, హార్టికల్చర్ డిప్లొమా, బీఎస్సీ బాటనీ వారీగా బదిలీలు నిర్వహించారు. ఉద్యాన శాఖలో ఉమ్మడి జిల్లాలో 215 మంది వీహెచ్‌ఏలు ఉండగా 212 మంది బదిలీ అయ్యారు. పశు సంవర్ధక శాఖ 16 మంది మంది ఏహెచ్‌ఏలు ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీ అయ్యారు. రిక్వెస్ట్‌పై 42 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా 16 మంది బదిలీ అయ్యారు. సచివాలయాలను కుదించడం వల్ల స్థానాలను కోల్పోయిన 20 మంది ఏహెచ్‌ఏలకు స్థానాలు కేటాయించారు. మొత్తంగా 52 మంది ఏహెచ్‌ఏలు బదిలీ అయ్యారు. మత్స్యశాఖకు సంబంధించి 19 మత్స్య సహాయకులు ఉండగా 16 మంది బదిలీ అయ్యారు. ఐదేళ్లు పూర్తి కావడంతో 15 మంది, రిక్వెస్ట్‌పై ఒకరు బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖలో 454 మంది వీఏఏలు బదిలీలు అయ్యారు. అన్ని శాఖల్లోను పూర్తిగా రాజకీయ కోణంలోనే బదిలీలు జరుగడం గమనార్హం.

చెత్త నిల్వలను గుర్తించండి

కర్నూలు(అర్బన్): మున్సిపాలిటీలకు 30 కిలోమీటర్ల దూరంలోని గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన చెత్త, ఇతర వేస్టేజ్‌ను ఐదు రోజుల్లో గుర్తించాలని పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుంచి జిల్లాలోని ఎంపీడీఓలతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, కర్నూలు డీఎల్‌డీఓ వెంకటరమణారెడ్డి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల్లో 1,148 టన్నుల చెత్త నిల్వలు ఉన్నాయని సమాచారం పంపారన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీడీఓలు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఏ గ్రామంలో ఎంతమేర చెత్తదిబ్బలు ఉన్నాయి, వాటి ఎత్తు, వెడల్పు, పరిమాణం తదితర వివరాలను పీఆర్ఐ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గత ఏడాది విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ఇప్పటికీ పలు మండలాల్లో ఖర్చు చేయలేదని.. జిల్లాలోని కర్నూలు, మంత్రాలయం, ఓర్వకల్ తదితర మండలాల్లో నిధులు అలాగే ఉండిపోయినట్లు తెలుస్తోందన్నారు. ఈ నిధులను వెంటనే లింకు రోడ్లకు వెచ్చించాలన్నారు. అలాగే పనిచేయని చేతి పంపులను మరమ్మతు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, దశరథరామయ్య, జ్యోతి, కవిత, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరయ్య స్వామి పాల్గొన్నారు.

శకునాలలో రెచ్చిపోయిన దొంగలు

- ఒకేరోజు నాలుగు ఇళ్లల్లో చోరీ
- రూ.6.50 లక్షల నగదు, బంగారు, వెండి అపహరణ

బీరువా పెకిలించి దుస్తులను చిందరవందరగా పడేసిన దృశ్యం

ఓర్వకల్లు: మండల పరిధిలోని శకునాల గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీ చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

- గ్రామానికి చెందిన గౌండా షరీఫ్ ఇంటికి తాళం వేసి కంటి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన రూ.లక్ష నగదు, అర కిలో వెండి కడియాలను దోచుకెళ్లారు.
- నాగేంద్ర గౌడు అనే వ్యక్తి భార్యకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో రాత్రి ఇంటికి తాళం వేసి అత్త వారి ఇంట్లో పడుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.50 వేల నగదు, తులం చెవిచుట్లను దోచుకెళ్లారు.
- శీలం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి తల్లింద్రుల వద్ద పడుకునేందుకు వెళ్లగా ఇంట్లోని బీరువాను పారతో పెకిలించి రూ.లక్ష దోచుకెళ్లారు.
- తలారి మద్దిలేటి ఇంటికి తాళం వేసి గడివేములలో బంధువులకు ఆరోగ్యం బాగాలేకపోతే పరామర్శించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు ఆ ఇంటి తాళాన్ని పగులగొట్టి రూ.4 లక్షల నగదును చోరీ చేసినట్లు వాపోయారు.

విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం తమ ఇళ్లకు చేరుకొని పరిశీలించగా దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకొని బాధితుల ఇళ్లకు వెళ్లి చోరీ ఘటనలపై ఆరా తీశారు. దుండగుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బజార్ బ్రాంచ్, నంద్యాల -02765, నంద్యాల జిల్లా.

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయం)
రూల్ 8 (1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజార్ బ్రాంచ్, నంద్యాల- 02765, నంద్యాల జిల్లా** యొక్క అధీకృత అధికారి యగు దిగువ సంతకందారు **08-04-2025 తేదీగల డిమాండ్ నోటీసు** జారీ చేసి, **రుణగ్రహీత: శ్రీమతి దర్గా షేక్ షబానా భర్త శ్రీ షేక్ ఖలీల్ అహ్మద్ మరియు శ్రీ షేక్ ఖలీల్ అహ్మద్ తండ్రి శ్రీ గౌస్ మోహిద్దీన్,** 1) ఇం.నం. 25-395-B1, ప్రియాంక నగర్, సెయింట్ జోసెఫ్ స్కూల్ దగ్గర, నంద్యాల టౌన్ & జిల్లా-518501, 2) ఇం.నం. 25-395B-9, సలీమ్ నగర్, నంద్యాల టౌన్ & జిల్లా-518501. **అకౌంట్ నం.లు: 36109143112 HL, 36221861101 HL** వారిని నోటీసులో తెలిపిన మొత్తం **08-04-2025** నాటికి **రూ.24,06,486.00 + రూ.9,36,695.00 = రూ.33,43,181.00 (ముప్పై మూడు లక్షల నలభై మూడు వేల నూట ఎనభై ఒక్క రూపాయలు మాత్రమే)** + దానిపై వడ్డీతో పాటు కాంట్రాక్చువల్ రేటు వంతున **09-04-2025** నుండి భవిష్యత్ వడ్డీ మరియు ఖర్చులు సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించేందుకు కూడా మీరు బాధ్యులై ఉన్నారు.
రుణగ్రహీత/ గ్యారంటారు సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **26 జూన్ 2025**న స్వాధీనం చేసుకున్నారని ముఖ్యంగా రుణగ్రహీతకు / గ్యారంటారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో వ్యవహరించరాదని, సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా మొత్తం **రూ.33,43,181.00** + దానిపై వడ్డీ + ఖర్చులు కొరకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజార్ బ్రాంచ్, నంద్యాల-02765, నంద్యాల జిల్లా** చార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభ్యమగు సమయానికి సంబంధించి, SARFAESI చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీతను కోరడమైనది.
గమనిక: ఈ బ్రాంచ్ ద్వారా జారీచేయబడిన 16-06-2025 తేదీగల స్వాధీనత ప్రకటన ఉపసంహరించుకోబడినదని గమనించగలరు. ఆ ప్రకటనకు బదులు ఈ ప్రకటన మీకు జారీచేయబడుచున్నది.

స్థిరాస్తి వివరణ
నంద్యాల జిల్లా RD మరియు నంద్యాల SRD లోని నంద్యాల టౌన్ & మండలం, సలీమ్ నగర్ ఏరియా వద్ద గల సర్వే నం.695/3A పైకి లో డి.నం.25-395B-9 గల ఇంటి ఆస్తి. నమోదిత సేల్ డీడ్ నం.7364/2016, తేది: 22-09-2016 ప్రకారం, శ్రీమతి షేక్ షబానా భర్త శ్రీ షేక్ ఖలీల్ అహ్మద్‌కు చెందినది. విస్తీర్ణం: 242 చ.గజాలు. **RCC ఇంటి కొలతలు:** తూర్పు-పశ్చిమం: 21.5 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 42.75 అడుగులు, **షెడ్ కొలతలు:** తూర్పు-పశ్చిమం: 13.75 అడుగులు, ఉత్తరం-దక్షిణం: 27.25 అడుగులు, **సరిహద్దులు: తూర్పు:** D.S. ఖలీల్ అహ్మద్ ఇల్లు, **పశ్చిమం:** మొహమ్మద్ యూసుఫ్ స్థలం, **ఉత్తరం:** సూర్య నాగలక్ష్మీ ఆస్తి, **దక్షిణం:** 30 లింకుల వెడల్పు రోడ్.

ప్రదేశం:నంద్యాల
తేది: 26-06-2025
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మహిళను ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి..

- రూ.49,900 కాజేసిన యువకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న సెంట్రల్ బ్యాంకు ఏటీఎం సెంటర్‌లో ఓ యువతి దృష్టి మరల్చి ఇద్దరు యువకులు నగదు కాజేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ యువతి పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని సెంట్రల్ బ్యాంక్ ఏటీఎం కేంద్రానికి నగదు విత్ డ్రా చేసేందుకు వెళ్లింది. ఏటీఎం సెంటర్‌లో అప్పటికే ఇద్దరు యువకులు ఉన్నారు. ఆమె ఏటీఎంలో కార్డు పెట్టి పిన్ ఎంటర్ చేసిన వెంటనే వెనక ఉన్న యువకుడు రాంగ్ ప్రాసెస్ ఎంటర్ చేశారని ఆమెను మిస్ గైడ్ చేశాడు. ఆ యువతి వెనక్కు తిరిగి చూడగా మరో యువకుడు తన చేతిలోని ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి ఆ యువతి ఏటీఎం కార్డును దొంగలించారు. తర్వాత పలుసార్లు ప్రయత్నించినా ఏటీఎం మిషన్‌లో డబ్బు రాకపోవడంతో యువతి కార్డును తీసుకుని వెళ్లిపోయింది. ఆ ఇద్దరు యువకులు యువతి ఏటీఎం కార్డు ద్వారా రూ.49,900 కాజేశారు. దీంతో సదరు యువతికి ఫోన్‌లో డబ్బు విత్ డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే త్రీటౌన్ పోలీసులను సంప్రదించింది. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ప్రైవేట్ బస్సులపై రూ.2.09 లక్షల జరిమానా

డోన్ టౌన్: నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు దాడులు చేసి భారీ జరిమానా విధించారు. డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె క్రాస్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టి రూ.2.09 లక్షలు జరిమానా విధించారు. హైదరాబాద్ నుంచి కోయంబత్తూరుకు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సుతో పాటు సరైన పత్రాలు లేకుండా సరుకులు రవాణా చేస్తున్న మరో ఆరు వాహనాలపై రూ.30వేలు జరిమానా విధించినట్లు ఎంవీఐ తెలిపారు.

జిల్లాలోని వివిధ మండలాల్లో మోస్తరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా లోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి కర్నూలు నగరంలో భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. కర్నూలు, ఆదోని, ఎమ్మిగ నూరు, పగిడ్యాల, నందికోట్కూరు, జూపాడు బంగ్లా తదితర మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తాజాగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు స్వల్పంగా ఊరట లభించే అవకాశం ఏర్పడింది.

ఖాళీ స్థానాలు చూపకుండా మోసం చేశారు

- సచివాలయ ఏఎన్‌ఎంల ఆవేదన

బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): తమకు అన్ని ఖాళీ స్థానాలు చూపకుండా నచ్చిన వారికి చూపి వారికే కేటాయించారని పలువురు సచివాలయ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియంలో ప్రారంభమైన సచివాలయ ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఉమ్మడి జిల్లాకు ఇక్కడే కౌన్సెలింగ్ నిర్వహించడంతో వందల సంఖ్యలో ఏఎన్‌ఎంలు, వారి కుటుంబసభ్యులు రావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. కొందరు మహిళలు చిన్నపిల్లలతో కౌన్సెలింగ్‌కు హాజరుకాగా వారి పిల్లలను ఓదార్చడం ఇబ్బందిగా మారింది. రాత్రింబవళ్లు కౌన్సెలింగ్ జరగడంతో కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయి. ఆడిటోరియం బయట ఒక్క షామియానా వేసి వదిలేశారు. మంచినీరు, బాత్‌రూమ్‌లు వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని ఏఎన్‌ఎంలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పేరు ఏ నిమిషంలో వస్తుందోనని ఆడిటోరియంలోనే కుర్చీలో కూర్చొని ఎదురుచూశారు. కొందరు రాత్రి కుర్చీలోనే నిద్రపోయారు. కౌన్సెలింగ్ ఆద్యంతం అభ్యంతరాల మధ్య కొనసాగింది. అధికారులు పలు ఖాళీలను దాచిపెట్టి వారికి అవసరమైన వారికి కేటాయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సుదూర ప్రాంతాలు దక్కిన వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఖాళీలను చూపకుండా ఇతరులకు చూపి వారికి కేటాయించడం వల్ల మంచి ర్యాంకు ఉన్న తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులే కంప్యూటర్‌లో ఖాళీలు చూసి చెప్పడం వల్ల ఏ ఖాళీ ఉందో, ఏ ఖాళీ లేదో తమకు అర్థం కాలేదని, అలాగాకుండా డిస్‌ప్లే ఏర్పాటు చేసి ఉంటే అందరికీ తెలిసేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మొదట్లో కొందరికి సొంత మండలంలో బదిలీ ఇవ్వలేదని, 300 ర్యాంకు దాటిన తర్వాత సొంత మండలంలోనే ఇచ్చారని, దీనివల్ల తమకు అన్యాయం జరిగిందని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ జాబితాలో టాప్‌లో ఉన్న ఓ ఏఎన్ఎంకు తిరిగి అదే స్థానం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అన్యాయంగా తమకు కేటాయించిన స్థానాలు మార్చాలని వర్షంలోనూ నిరసన తెలిపారు.

మత్తులో చిత్తు

తప్పతాగి కంబాలపాడు సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పడిపోయిన మందుబాబులు

కంబాలపాడు సర్కిల్ ఆటో స్టాండ్ వద్ద..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధికో మద్యం దుకాణం, అడుగుకో బెల్టు షాపును ఏర్పాటు చేసి ప్రజల ఒళ్లు, ఇళ్లను గుల్ల చేస్తోంది. మనిషి బలహీనతను ఆసరాగా చేసుకొని బెల్టుషాపుల ద్వారా మద్యాన్ని వాడవాడలా ఏరులై పారిస్తోంది. చాలా మంది యువకులు మద్యం మత్తులో జోగుతూ పచ్చని సంసారాలను నాశనం చేసుకుంటున్నారు. నాణ్యమైన మద్యం సరసమైన ధరకే అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను మత్తులో ఉంచేందుకు నాశిరకం మద్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తప్పతాగి పడిపోయిన మందుబాబులే దర్శనమిస్తున్నారు.

– డోన్

అమ్మ హోటల్ వద్ద రోడ్డు పక్కన..

గుత్తి రోడ్డు వద్ద కట్టపై..

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ **ఓర్వకల్లు తిప్పాయిపల్లె రోడ్డు** మెయిన్ రోడ్డుకి నూతన వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో నెలసరి కంతులతో ఓపెన్ ప్లాట్లు కలవు. ✆ 92466 60444. [SCA25005818]

WANTED

■ **ఆఫీస్ బాయ్‌గా** వర్క్ చేయుటకు డిగ్రీ పూర్తి చేసిన పురుష అభ్యర్థి కావలెను. వివరాలకు సంప్రదించండి: 73309 24873, 98854 85281. [SCA25005805]

■ **కాల్వబుగ్గ దగ్గరలో** గల మసరం ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. Qly: 10th, జీతం: 12K, భోజనం కలదు. సంప్ర: 9581776921, 9652447856. [SCA25005716]

■ **సెయింట్ థెరీసా** (గోషా హాస్పిటల్) లో పనిచేయుటకు GNM/ B.Sc Nursing పూర్తి చేసిన అభ్యర్థులు కావలెను. ఇంటర్వ్యూకు సర్టిఫికెట్స్ మరియు ఫోటోతో రావలెను. సంప్ర: NR పేట కర్నూలు. సెల్: 90104 57112. [SCA25005534]

■ **Wanted Marketing** Executives for reputed company. No Targets Permanent Salary Starting Rs. 10,000/-. & Good Incentives Cell: 63052 04940 [SCA25005490]

■ **Wanted** Experienced part-time teacher for Social. Vijetha High School, near krishna nagar ITC, knl. Send your resume via whatsapp: 9492198651. [SCA25005668]

■ **రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1)** శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ **కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో** పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ **ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో** వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051 [SCA25005825]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దుర్గమ్మ సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పోకల వంశీ నాగేంద్ర మాధవ్ కుటుంబ సమేతంగా మంగళవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పీఆర్ కోసం ఆందోళన

లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన విద్యార్థులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ మంగళవారం హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.

న్యూస్‌రీల్

4 వరకు హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హంసలదీవి సాగరతీరం బీచ్ గేట్లను మూసివేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్ట్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పాటు ఈదురుగాలులు తీవ్ర కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల నాలుగో తేదీ వరకు బీచ్ గేట్లను మూసివేస్తామని వివరించారు. పర్యాటకులు సహకరించి ఈ మూడు రోజుల పాటు బీచ్‌కు రాకుండా ఉండాలని కోరారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచే బీచ్ గేట్లకు అటవీ అధికారులు తాళాలు వేశారు.

త్వరలో ఎ.కొండూరుకు కృష్ణా జలాలు

తిరువూరు: మరో 45 రోజుల్లో ఎ.కొండూరు మండలానికి కృష్ణా నదీజలాలను సరఫరా చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎ.కొండూరులో జల్‌జీవన్ మిషన్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షిత తాగు నీరందించే లక్ష్యంతో జల్ జీవన్‌మిషన్ అమలవుతోందన్నారు. కిడ్నీబాధిత తండాలకు కృష్ణా నదీ జలాలు ఇచ్చే ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి జరుగుతోందని, ఇప్పటికే ప్రధాన పైపులైను పనులు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం కంభంపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పరిశీలించారు.

డెంగీపై విస్తృత అవగాహన కల్పించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగీ నివారణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం డెంగీ డే సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పించే రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను డాక్టర్ మాచర్ల సుహాసిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెలరోజులు యాంటీ డెంగీ, యాంటీ మలేరియా మాసంగా పాటిస్తామని తెలిపారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా వ్యాధులపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఈ నెల రోజులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతి బాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గూడూ పోయే.. దారీ కరువాయె

రోడ్డు విస్తరణ పేరుతో అడ్డంగా ఉన్నాయంటూ పక్కా ఇళ్లను హడావిడిగా కూల్చేశారు. పరిహారం ఇస్తామని చెప్పారు. - ఇది 2016 నాటి మాట

మరోవైపు కమీషన్లకు ఆశపడి ముందస్తు అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పనులను మొదలు పెట్టారు. కానీ కాంట్రాక్టర్ కిలోమీటర్ దారికి రూ.కోటి కొట్టేయాలనుకుని ప్రతిపాదన పంపాడు. దీన్ని ప్రభుత్వం తిరస్కరించడంతో పనులను మధ్యలోనే ఆపేశాడు.

- ఇది ప్రస్తుత పరిస్థితి

వెల్వడంలో అధ్వానంగా మారిన మైలవరం–నూజివీడు రోడ్డు

ఈ ఫొటోలోని వృద్ధ దంపతుల పేర్లు చనుమోలు సత్యనారాయణ, సామ్రాజ్యం. వీరికి వెల్వడం గ్రామంలో సర్వే నంబరు 498/1లో ఇల్లు ఉంది. అయితే 2016లో మైలవరం – నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణలో భాగంగా వీరి ఇంటిని అధికారులు కూల్చారు. అప్పటి నుంచి వీరికి ఎటువంటి పరిహారం ఇవ్వలేదు. దీనిపై అధికారులను సంప్రదించగా ఇళ్లు కూల్చిన స్థలంలో రోడ్డు వేయలేదని, పరిహారం ఇవ్వాల్సిన పనిలేదని చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫ్లెక్సీని గ్రామంలో కట్టారు.

- రహదారి విస్తరణ పేరుతో హడావిడిగా ఇళ్లను కూల్చేసిన అధికారులు
- మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- అర్ధంతరంగా నిలిచిన మైలవరం–నూజివీడు రహదారి పనులు
- రహదారి బాగు చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫొటోతో వెలిసిన ఫ్లెక్సీలు
- రోడ్డెక్కి వినూత్న నిరసన తెలిపిన ఎన్టీఆర్ జిల్లా వెల్వడం గ్రామస్తులు

జి.కొండూరు: 'లోకేశ్.. మా ఊరి దారి సమస్య పరిష్కరించండి' అంటూ మంత్రి నారా లోకేశ్ ఫొటోలతో మైలవరం మండలం వెల్వడం గ్రామస్తులు ఫ్లెక్సీలతో మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రహదారిని విస్తరించే క్రమంలో వెల్వడంలో కొన్ని సర్వే నంబర్లు నోటిఫై చేశారు. రోడ్డు అభివృద్ధి పనులను నాలుగు నెలల కిందట హడావిడిగా చేపట్టారు.

లోకేష్ ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దారి పొడవునా వెట్ మిక్స్ వేశారు. అయితే రోడ్డు విస్తరణ అర్ధంతరంగా నిలిచిపోయింది. ఎండొస్తే దుమ్ము, వానొస్తే రహదారిపై గోతుల్లో చేరిన నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదు. దీంతో గ్రామస్తులంతా దారిపొడవునా నారా లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు కట్టారు. ఇదిలా ఉంటే 2016 రహదారి విస్తరణలో గ్రామంలో కొందరి ఇళ్లను కూల్చేశారు. కానీ వారందరికీ పరిహారం అంద లేదు. దీంతో వారు సైతం లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు వేయించి వినూత్న నిరసనకు దిగారు.

కాంట్రాక్టర్ అత్యాశ.. మొదటికి వచ్చిన సమస్య

మైలవరం–నూజివీడు ఆర్‌ఆండ్‌బీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా వెల్వడం అయ్యప్ప స్వామి గుడి నుంచి ఐదు కిలోమీటర్ల మేర తారు రోడ్డును అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పూర్తిగా తొలగించి రహదారి నిర్మాణానికి నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. తారు రోడ్డును పూర్తిగా తొలగించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం అడ్డుచెప్పినా సదరు కాంట్రాక్టరు తనకు స్థానికంగా రాజకీయ అండ ఉందనే ధోరణికి పోయాడు. తారురోడ్డును తవ్వి వెట్‌మిక్స్ వేసిన తర్వాత నిధుల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరారు. కిలోమీటరుకు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపాడు. వీటిని ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టరు మూటాముల్లె సర్దుకొని వెళ్లిపోయినట్లు చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రహదారిపై నిత్యం రాకపోకలు సాగుతుండటంతో వెట్‌మిక్స్ కదిలి రోడ్డు ఛిద్రంగా మారింది. దారిపొడవునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో ఆ గుంతల్లో నీరు చేరి చిన్న కొలనుల్లా తలపిస్తున్నాయి.

నా ఇంటిని కూల్చి పరిహారం ఇవ్వలేదు

రోడ్డు విస్తరణ పేరుతో వెల్వడంలో ఉన్న నా ఇంటిని కూల్చి పరిహారం ఇవ్వలేదు. ఇప్పుడు అడిగితే మీ స్థలం రోడ్డు విస్తరణకు అవసరం లేదని చెబుతున్నారు. అలాంటప్పుడు మా ఇంటిని ఎందుకు కూల్చారు? అధికారులు సమాధానం చెప్పాలి.

– అడ్డగిరి జమలయ్య (గ్రామస్తుడు, వెల్వడం)

రోడ్డును వెంటనే బాగు చేయాలి

నాలుగు నెలల క్రితం రోడ్డు తవ్వి వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. ఎండొచ్చినప్పుడు దుమ్ము, వానొస్తే రోడ్డుపై గుంతలలో నీరు చేరి నరకయాతన అనుభవిస్తున్నాం. రోడ్డు బురదమయంగా మారి అడుగు బయట పెట్టలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– శివదానం శివకృష్ణ (గ్రామస్తుడు, వెల్వడం)

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

రేమల్లెలో కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రాజ్ ప్రియాసింగ్ నేతృత్వంలోని బృందం మంగళవారం పరిశీలించింది. తొలుత రేమల్లె గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు పండ్లతోటల సాగు, బంద్రీ చెరువు పూడికతీత, పశువుల షెడ్ల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ చానల్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి మొక్కలు పెంచుతున్న రైతు సంగీతరావుతో మాట్లాడారు. సాగు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడిచర్ల గ్రామంలో పంట కుంట, బీటీ రోడ్డు, రజక చెరువులో పూడిక తీత, పశువుల షెడ్డు నిర్మాణం, మ్యాజిక్ సోక్ పిట్ పనులను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. పీఎంఏవై–జీ పథకం కింద గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద కానుమోలు నుంచి రంగయ్య అప్పారావు పేట, రామశేషాపురం గ్రామాల మీదగా రామన్నగూడెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీఈఓ కన్నమ్మ నాయుడు, డ్వామా పీడీ శివ ప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ హరహరినాథ్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర కీలకం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- డాక్టర్స్ డే సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమన్నారు. నిరంతరం ప్రజాసేవపై చిత్త శుద్ధి, అంకితభావంతో పనిచేసే వైద్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎంతో ప్రయాస పడి వైద్య విద్యను అభ్యసించి వ్యక్తిగత, కుటుంబ పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచటానికి కృషి చేస్తున్న వైద్యులపై ప్రజలు, నాయకుల ధోరణిలో మార్పు రావాలన్నారు. ఆఖరి క్షణం వరకు రోగుల ప్రాణాలు కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు సరి కాదని పేర్కొన్నారు.

విశిష్ట సేవలందించిన వైద్యులకు సత్కారం

జాతీయ డాక్టర్స్ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన పది మంది వైద్యులను మంత్రి సత్య కుమార్ యాదవ్ సత్కరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ పద్మశ్రీవాత్సవ, ప్రస్తుత డీఎంఈ, శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం, జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ ఎ.అశ్విని కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.భాస్కరనాయుడు, డాక్టర్ జి.భవానీప్రసాద్, న్యూరోసర్జన్ డాక్టర్ కె.సత్యవరప్రసాద్, డాక్టర్ ఎం.కృష్ణనాయక్, డాక్టర్ ఆర్.మురళీబాబూరావు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ టి.భారతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి, హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ జి.రఘునందనరావు, మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా సత్కారం పొందుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

వరి సాగుకు విపత్తు

- కృష్ణా జిల్లాలో 1.64 లక్షల హెక్టార్లలో వరిసాగు
- 1.02 లక్షల క్వింటాళ్ల వరి వంగడాలు అవసరం
- ప్రభుత్వం సరఫరా చేసింది 11,650 క్వింటాళ్లే..
- విత్తనాల కోసం రైతులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో 40 శాతానికి పైగా విత్తనాల పంపిణీ

చల్లపల్లిలో ఓ షాపు వద్ద లోడు రాగానే విత్తనాల కోసం ఎగబడిన రైతులు

అవనిగడ్డ: ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 40 శాతానికి పైగా విత్తనాలను రైతులకు వారి గ్రామాల్లోనే అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పదిశాతం విత్తనాలు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీంతో కృష్ణాజిల్లా రైతులు వరి వంగడాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

అరకొరగా విత్తనాలు

కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.64 లక్షల హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా ఎంటీయూ 1061, బీపీటీ 5204 రకాలను రైతులు సాగుచేస్తారు. గతేడాది ఎంటీయూ 1262, 1318 రకాలను పలుచోట్ల సాగుచేయగా కొనేందుకు మిల్లర్లు ముందుకు రాలేదు. ఈ సంవత్సరం రైతులు ఆ రకాల జోలికెళ్లడం లేదు. సాధారణంగా ఎకరాకు 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరం. ఈ సీజన్‌లో 1.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ప్రభుత్వం 10,650 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసింది. దీంతో విత్తనాల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వచ్చిన లోడులు వచ్చినట్టు అయిపోతున్నాయి. రైతులు పనులు మానుకుని గంటల తరబడి ఎదురు చూసినా కొన్ని చోట్ల విత్తనాలు దొరకడం గగనంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 40 నుంచి 45 శాతం విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేసింది. అవసరమైతే డిమాండ్‌ను బట్టి మరో ఐదు శాతం విత్తనాలు సరఫరా చేసింది. ఈ ప్రభుత్వం పదిశాతం మాత్రమే సరఫరా చేయడంతో రైతులు విత్తనాలు కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కూడా విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలే అయిందని రైతులు తమకు తామే సర్దిచెప్పుకొన్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి కొనసాగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే..

కృష్ణాజిల్లాలోని బందరు, కేఈబీ కెనాల్‌కు ఇటీవల సాగునీరు విడుదల చేశారు. గతంలో బోర్ల కింద అక్కడక్కడా రైతులు నారుమళ్లు పోసుకున్నారు. పంట కాలువకు సాగునీరు విడుదల చేయడంతో ఇప్పుడే నారుమళ్లు పోసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆదిలోనే విత్తనాలకు ఈ విధంగా డిమాండ్ ఉంటే సాగు పనులు ముమ్మరం చేస్తే పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 65 శాతం మంది కౌలు రైతులున్నారు. ఏటా పంట చేతికందగానే 85 శాతం కౌలు రైతులు విత్తనాలకు తీయకుండానే ధాన్యం విక్రయిస్తారు. వీరంతా ప్రస్తుతం ఎక్కడో ఒకచోట విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేయాల్సిందే. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరిపడా విత్తనాలు ఇవ్వాలి

గత ప్రభుత్వం సబ్సిడీపై అవసరమైనన్ని వరివిత్తనాలు సరఫరా చేసేది. ఇప్పుడు చాలా తక్కువ వచ్చాయని చెబుతున్నారు. బయట షాపుల్లో రేటు ఎక్కువ. కల్తీ విత్తనాలు వచ్చే ప్రమాదముంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాల సరఫరా పెంచాలి.

– చిరివేళ్లే యానాదిరావు, పిట్టల్లంక

తనిఖీలు చేస్తున్నాం

అవనిగడ్డ సబ్ డివిజన్‌కు బీపీటీ 5204 రకం 515 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 154 క్వింటాళ్లు, 1318 రకం 110 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. ప్రస్తుతం వీటిని రైతులుకు సబ్సిడీపై అందిస్తున్నాం. ప్రైవేటు విత్తన షాపులను తనిఖీ చేస్తున్నాం. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– జయప్రద, ఏడీఏ, అవనిగడ్డ

అద్వైక.. అంతా మాయ!

- ట్రేడింగ్ కంపెనీలో తవ్వేకొద్దీ అన్ని అక్రమాలే
- పోలీసులకు ఇప్పటికే 76 మందికిపైగా బాధితుల ఫిర్యాదు
- రూ.350 కోట్ల మేర మోసపోయిన ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అత్యాశ కొంపముంచింది. బ్లాక్ మనీని వైట్‌గా మార్చుకోవచ్చని అద్వైక ట్రేడింగ్ కంపెనీ విసిరిన వలలో పెద్ద చేపలు చిక్కి విలవిల్లాడుతున్నాయి. ఆ కంపెనీ బోర్డు తిప్పేసిన వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలే వెలుగు చూస్తున్నాయి. నల్లధనం భారీగా ఉండి, పెట్టుబడి పెట్టగల వారినే లక్ష్యంగా చేసుకొని అద్వైక ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకులు వల విసిరారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మొత్తం డబ్బులు సేకరించి ఆపై బోర్డు తిప్పేశారు. డబ్బును విజయవాడ నుంచి హవాలా రూపంలో దుబాయ్‌కి చేర్చి అక్కడి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సంస్థ ఎండీని అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిస్తుంటే విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం. వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు ఖాళీ చేసిన విషయం తెలుసుకుని పోలీసులు సైతం కంగుతిన్నారని తెలుస్తోంది. అద్వైక ట్రేడింగ్ కంపెనీ పలు డొల్ల కంపెనీలను సృష్టించి బోర్డు తిప్పేసినట్లు గుర్తించారు.

పలు జిల్లాలో బాధితులు

అద్వైక ట్రేడింగ్ కంపెనీ మోసాలకు సంబంధించి పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో 76 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర డిపాజిట్లు చేసినట్లు పేర్కొన్నారు. వారికి తిరిగి ఇన్‌టెన్సివ్ కింద రూ.6 కోట్లు ఇచ్చినట్లు గుర్తించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున బాధితులు ఉన్నారు. ప్రధానంగా వైద్యులు, రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు ఉన్నారని సమాచారం. కొంత మంది బినామీ పేర్లతో పెట్టుబడులు పెట్టారు. వారితో పాటు ఓ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రూ.83 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం. అద్వైక ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నిండా మునిగిన చాలా మంది బయటికి చెప్పుకోలేక తేలు కుట్టిన దొంగల్లా కుమిలిపోతున్నారని సమాచారం.

ఏజెంట్ల గుర్తింపు పైనే దృష్టి

ప్రస్తుతం పోలీసులు విచారణను వేగ వంతం చేస్తున్నారు. ముందుగా ఎంత మంది పెట్టుబడులు పెట్టారు? ఎంత మొత్తం నష్టపోయారు? అందులో వారు ఇన్‌టెన్సివ్‌గా ఎంత మొత్తం తిరిగి తీసుకొన్నారు? వంటి వివరాలు సేకరిస్తున్నారు. బాధితులు ఎంత మొత్తం మేర నష్టపోయారో లెక్క తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కంపెనీలో పెట్టు బడులు పెట్టేందుకు ఆకర్షించిన 45 మంది ఏజెంట్లను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క ప్రధాన ఏజెంట్ తన కింద 15 నుంచి 200 మంది ఏజెంట్లను నియమించుకొన్నట్లు గుర్తించారు. ప్రతి ఏజెంట్ ఎంత మొత్తం వసూలు చేశారు? తిరిగి ఎంత మొత్తం ఇన్‌టెన్సివ్ రూపంలో తిరిగి చెల్లించారు? వంటి వివరాలతో ప్రతి ఏజెంట్ సేకరించిన డిపాజిట్ల వివరాలు ఎక్సెల్ షీట్‌లో పోలీసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాథమికంగా 1600 మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు అంచనా వేశారు. వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తం మీద బాధితులంతా రూ.350 కోట్లపైగా డిపాజిట్లు చెల్లించి, నిండా మునిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కంపెనీల్లో నిర్వహించిన సోదాల్లో పోలీసులు కొంత మేర సమాచారం సేకరించారు. ఆ సమాచారం ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలు ఆదిత్య బ్యాంకు ఖాతాలతో పాటు, పలువురు ఏజెంట్ల ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. కంపెనీ డైరెక్టర్లను ఆదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారని సమాచారం.

వంతెన నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): పెనమలూరు మండలం పోరంకిలో బందరు కాలువపై వంతెన నిర్మాణానికి సంబంధించి అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ బందరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోరంకి వద్ద బందరు కాలువపై వంతెన నిర్మాణం గురించి సమీక్షించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. బందరు కాలువ కట్టపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, భూసేకరణ, పరిహారం, నిర్మాణానికి పట్టే సమయం తదితర అంశాలపై అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్.హేలా షారోన్, ఇరిగేషన్ ఎస్ఈ మోహన్ రావు, రహదారులు భవనాలు ఎస్ఈ భాస్కరరావు, ఈఈ లోకేష్, కంకిపాడు తహసిల్దార్ గోపాలకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సంస్మరణ సభ

బెజవాడ రాజారావు హైస్కూలు సహవ్యవస్థాపకులుగా, SKPVV హిందూహైస్కూలు గ్రేడ్ 1 తెలుగు పండిట్‌గా విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన మీ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఇవే మా ఘన నివాళులు. మీరందించిన స్ఫూర్తి సదా మాకు అనుసరణీయం.

కీ॥శే॥ తవ్వా కనకదుర్గా వరలక్ష్మి గారు

జననం : 18-2-1946

మరణం : 22-6-2025

భర్త: బెజవాడ రాజారావు

✆ 94402 80263, 89859 17897

కుమారుడు : శ్యామ్ ప్రకాష్

కోడలు : లక్ష్మీప్రసన్న

కుమార్తె : మధులత

అల్లుడు : జొలూరి శ్రీరామ శివప్రసాదరావు

మనుమళ్ళు, మనుమరాండ్రు

సంస్మరణ సభ: ది. 2-7-2025 బుధవారం ఉదయం11 గం.లకు బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12 నందు జరుగును.

క్లుప్తంగా

పంటల బీమాపై ఎస్‌బీఐ ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వారం రోజుల పాటు నిర్వహించేందుకు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. వారం రోజుల కార్యక్రమంలో రైతులకు పంట బీమా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నమోదును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ ప్రేరిత ప్రమాదాల నుంచి రైతులను రక్షించడంలో పంట బీమా ప్రాముఖ్యతను గుర్తించి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ జూలై 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోం, తమిళనాడుతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ నవీన్‌చంద్ర తెలిపారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు మోక్షిత్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయస్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు కొండపల్లి డీవీవీ పాఠశాల 3వ తరగతి విద్యార్థి గింజల మోక్షిత్ కార్తికేయ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మన్‌మోహన్ మంగళవారం తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్–10 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం సాధించాడు. ప్రతిభ కనబరచిన కార్తికేయను రాష్ట్ర సెలక్షన్ కమిటీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసింది. ఈనెల 5 నుంచి 8వరకు మహారాష్ట్ర నాసిక్‌లో జరుగబోయే జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడు. మోక్షిత్ కార్తికేయను ప్రిన్సిపాల్‌తో పాటు పీటీ మాధవరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

కార్మికుల సత్తా చాటుదాం

- 9న సమ్మెను విజయవంతం చేద్దాం
- రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పిలుపు

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన జరిగే సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వర్గ సత్తా చాటుదామని రాష్ట్ర కార్మిక ఉద్యోగ ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 10గంటల పని విధానాన్ని, అధిక గంటల పని విధానాన్ని, రాత్రి సమయంలో మహిళలు పని చేసే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ సమ్మెను చేపడుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏఐటీసీ రాష్ట్ర అధ్యక్షుడు రాంపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల, రైతుల, వ్యవసాయ కూలీ చేతివృత్తులు, మహిళా, యువజన, విద్యార్థి రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది.

'ఉపాధి'లో సంస్కరణలు అవసరం..

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ విధానాన్ని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రుణాలు రద్దు చేయాలని, రైతులకు అన్ని వేదాల సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లకు వ్యతిరేకంగా, బీజేపీ దాని అనుబంధ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం సత్తా చాటేందుకు జూలై 9న జరిగే సమ్మెలో కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వర రావు, శ్రామిక మహిళా నాయకులు వెంకట సుబ్బారావమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పాల్గొన్నారు.

ప్రేమ చిగురించిన చోటే.. ప్రాణమూ పోయింది

- పాశమైలారం ఫార్మా ప్రమాదంలో కాబోయే దంపతులు దుర్మరణం
- మృతుల్లో అబ్బాయిది వైఎస్సార్ కడప జిల్లా పెనికలపాడు
- యువతిది ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల

అగ్ని ప్రమాదంలో మృతి చెందిన నిఖిల్, రమ్య(ఫైల్)

ముద్దనూరు/పుట్రేల(విస్సన్నపేట): ఆ రెండు మనసులను పనిచేసే ప్రాంతమే పరిచయం చేసింది.. ప్రేమను చిగురించేలా చేసింది. పెళ్లిపీటల కోసం సిద్ధ పరచింది. మరో రెండు నెల్లలో ఒక్కటి చేయాలని చూసింది. కానీ ఇంతలోనే మృత్యువు ఆ ఇద్దరినీ కబళించింది. ఆ పనిచేసే ప్రాంతంలోనే పాశాన్ని విసిరింది. అనుకోని విపత్తు వారి ఆశలను ఆహుతి చేసింది. ఎన్నో ఆకాంక్షలతో కొత్త జీవితాన్ని ఆరంభించాలకున్న ఆ జంట.. ఇంట పెను విషాదాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన యువతీ, యువకులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్‌రెడ్డి(25), ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన రామాల. శ్రీరమ్య ఫార్మా పరిశ్రమలో ఉద్యోగులు. ఇక్కడే వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఇరువురూ తమ పెద్దలను ఒప్పించారు. మరో రెండునెలల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన తరుణంలో విషాదం వెంటాడింది. సోమవారం ఇద్దరూ పరిశ్రమలో విధుల్లో ఉన్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటనతో పెనికలపాడు, పుట్రేల గ్రామాల్లో మంగళవారం తీవ్ర విషాదం అలముకుంది.

రెండునెలల్లో పెళ్లి చేద్దామనుకున్నాం...

రామాల నారయ్య, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె జ్యోత్స్న బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసి ఆరు నెలల క్రితమే సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరింది. ఇంతలో ఘోర విపత్తులో చిన్న కుమార్తె ప్రాణాలు కోల్పోవడాన్ని తలచుకుంటూ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నిఖిల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడి ఆషాఢం వెళ్లిన తర్వాత పెళ్లి చేద్దామనుకున్నామని తీరా ఈ విషాద సంఘటనలో ఇరువురు చనిపోయారని మృతురాలి తల్లి పద్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించాలి

డీసీజీ సమావేశంలో ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల్సిందేనని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా క్రై గ్రూప్ (డీసీజీ) సమావేశం జరిగింది.

మాక్‌డ్రిల్స్ నిర్వహించండి..

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా కర్మాగారాలు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్యం తదితర శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని తొమ్మిది మేజర్ యాక్సిడెంట్ హజార్డ్ ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. వాటిల్లో గ్యాస్ లీకేజ్, అగ్ని ప్రమాదాలు వంటివి జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా లెవెల్–1 మాక్‌డ్రిల్స్, ఆర్నెల్లకోసారి లెవెల్–2 మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా తప్పనిసరిగా సేఫ్టీ ఆడిట్ నివేదికలు పంపాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి చోళ మండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ సంస్థ రూపొందించిన ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ముసాయిదాపై భాగస్వామ్య పక్షాలు సలహాలు, సూచనలు చేయాలని.. వాటిని పరిగణనలోకి తీసుకొని తుది ప్రణాళికను ఖరారు చేస్తామన్నారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వ ఐటీఐల్లోని 240 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కర్మాగారాల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు హాజరయ్యారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400కోట్లు

తక్షణం విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్

మాట్లాడుతున్న బందెల నాసర్ జీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు బకాయిపడిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ దాసరి భవన్ నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పేరిట రూ.6400 కోట్లు బకాయిపెట్టిందన్నారు. టీడీపీ యువగళం పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా కేవలం రూ.600కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కానందున యాజమాన్యాలు వేధిస్తున్నాయని, విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉన్నాయని, విద్యార్థులు ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

నాలుగో తేదీ నుంచి ధర్నాలు..

బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 4 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కార్తీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యశ్వంత్, శరత్, అమర్నాథ్, ప్రణీత్, డేవిడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

Real Estate

PLOT FOR SALE

■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' అడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర : ✆ 97034 34023, 96428 72122

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

Wanted

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ కేర్ అఫ్ హెల్త్ కార్డు ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000+2500 TA. సంప్రదించండి. ఫోన్: ✆ 70130 52798

■ విజయవాడ – తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60564, 72070 13418

■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : ✆ 88858 01357

■ VJA జవహర్ ఆటోనగర్ లోని ప్రముఖ ఆటోమొబైల్ షాప్ లో పని చేయుటకు అకౌంటెంట్ Tally (M/F) ఫుల్ టైం కావలెను. ✆ 97012 00500

■ ఆటోనగర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ జీతం : 11,000/- + PF+ESI, 4 వీక్లీ ఆఫ్‌లు. Q : 10th Class ✆ 88014 97437

■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపర్స్ (M) కావలెను. VJA, కంకిపాడులలో 8, 12 గం॥ డ్యూటీ వ: 40 లోపు, Q: 10th P/F ✆ 94917 71179, 73309 11212

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ ✆ 81436 96679

■ Wanted Teachers. Teachers (Ladies) With U.G or P.G Qualification & Good English && Teacher for Science in High School. CIS-School, VJA-1. Ph: ✆ 81799 90508, 92913 98877

■ రామవరప్పాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M) లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: ✆ 98853 26279

■ బుక్‌వర్క్స్ నందు మోస్ట్ అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000/- మరియు ప్రూఫ్ రీడర్స్(M/F) కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, జీతం:25,000/-వరకు విజయవాడ ✆ 99631 31354

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135

గమనిక

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. సంపద సృష్టికి రుణాలు వాడుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన వార్షిక రుణ–జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక – జీవనోపాధులపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి.. ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

రూ.1,266 కోట్లతో కార్యాచరణ..

జిల్లాలో 16 మండల సమాఖ్యలు, 767 గ్రామ సమాఖ్యలు, 24,880 స్వయం సహాయక సంఘాలు, 2,47,611మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. 2024–25లో 1,93,691మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ. 1,147.59 కోట్ల మేర రుణ మద్దతు లభించిందన్నారు. 2025–26కు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యుల వ్యక్తిగత జీవనోపాధి అవసరాలు ఆధారంగా దాదాపు రూ.1,266 కోట్ల వార్షిక రుణ–జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. కుటుంబ స్థాయి సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్లు తెలిపారు.

సెప్టెంబర్ 30 వరకు ప్రచారం..

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం కె.ప్రియాంక వివరించారు. బ్యాంక్ లింకేజీపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, యూఎల్‌బీల్లో కనీసం ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన వంశీ న్యాయ పోరాటం

బెయిల్ మంజూరు.. నేడు విడుదలయ్యే అవకాశం

వంశీమోహన్ (ఫైల్)

గన్నవరం: గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ న్యాయ పోరాటం ఫలించింది. వివిధ కేసుల్లో గత 138 రోజులుగా అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న ఆయనకు నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి బయటకు రావడానికి మార్గం సుగమమైంది.

రెడ్‌బుక్ కక్షతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వల్లభనేని వంశీమోహన్‌పై ఇబ్బడిముబ్బడిగా కేసులు నమోదు చేసింది. రెండున్నరేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసు పునర్ విచారణ పేరుతో వంశీమోహన్‌ను 71వ నిందితుడిగా చేర్చింది. ఈ కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారని తప్పుడు కేసు పెట్టి.. ఈ ఏడాది ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం టీడీపీ పెద్దల సూచనల మేరకు ఆయనపై గన్నవరం, ఆత్కూరు, వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పీఎస్‌ల్లో పదికి పైగా అక్రమ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో గత ఐదు నెలలుగా విజయవాడ జిల్లా జైలులో ఆయన రిమాండ్‌లో కొనసాగుతున్నారు.

ఆరోగ్యం క్షీణించినా..

గణనీయంగా బరువు తగ్గిపోవడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలతో ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం కరుణించలేదు. ప్రభుత్వం తరఫున ఆయనకు సరైనా వైద్య సేవలు కూడా అందించలేదు. చివరికి హైకోర్టు జోక్యంతో ఆయుష్ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తనపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటం సాగిస్తూ వచ్చిన ఆయనకు తొమ్మిది కేసుల్లో కోర్టుల నుంచి ఉపశమనం లభించింది. చివరికి బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీపై 2019లో నమోదైన కేసులో కూడా నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనకు భారీ ఊరట లభించింది. జైలు నుంచి ఆయన బుధవారం విడుదలయ్యే అవకాశం ఉందని వంశీమోహన్ తరఫు న్యాయవాదులు పేర్కొంటున్నారు. వంశీమోహన్‌కు బెయిల్ రావడం పట్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండచిలువ హతం

మైలవరం: మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో పాడుబడిన బావి వద్ద పేరుకుపోయిన చెత్తలో ఉన్న కొండచిలువను గమనించిన గ్రామస్తులు మంగళవారం కర్రలు, కత్తులతో హతమార్చారు. గ్రామానికి చెందిన రైతు వేల్పులకొండ ప్రసాద్‌కు పాము కన్పించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు పెట్టడంతో యువకులు పరుగున వెళ్లి దానిని హతమార్చారు. కొండ చిలువ సుమారు 10 అడుగుల పొడవు, 15కిలోలు బరువు ఉందని యువకులు తెలిపారు. కాగా జంగాలపల్లి గ్రామం నుంచి బయటికి రావాలంటే దారి మార్గం సరిగా ఉండకపోగా, కొద్దిపాటి వర్షానికి రహదారికి గండ్లు పడి కనీసం నడవడానికి కూడా గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం పట్ల అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గృహావసరాలకు బావి నీటిని వాడుకుంటూ ఉంటారని, అదే విధంగా అక్కడే పిల్లలు ఆడుకుంటూ ఉంటారని గ్రామస్తులు తెలిపారు. బావి పాడైపోయి ఉండటంతో గ్రామస్తులు చెత్తా చెదారం తీసుకువచ్చి అక్కడే పడేస్తున్నారని దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు, ప్రమాదకరమైన పాములు తిరుగుతూ భయానక వాతావరణం నెలకొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న సారె సంబరం

అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గగుడికి తరలివస్తున్న భక్తబృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని తమ కుటుంబం పిల్లాపాపలతో సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి తాము సారెగా తీసుకువచ్చిన చీరలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, మిఠాయిలను సమర్పిస్తున్నారు. సారె తీసుకువచ్చిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందిస్తున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త బృందాలు సారెను అమ్మవారి ప్రసాదంగా భక్తులకు అందిస్తూ సంతోషాలను పంచుకుంటున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు దేవస్థానం ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాలను అందజేస్తోంది. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో శీనానాయక్ అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కల్వర్టు గోడను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

10 మంది ప్రయాణికులకు గాయాలు

కట్టంగూర్: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ హైవేపై కల్వర్టు గోడను ఢీకొట్టడంతో 10మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సోమవారం అర్ధరాత్రి 30 మంది ప్రయాణికులతో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల కల్వర్టు గోడను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించగా డోర్ లాక్ కావడంతో బయటకు వెళ్లలేకపోయారు. సమాచారం తెలుసుకున్న కట్టంగూర్ 108 సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అత్యవసర డోర్‌ను పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సత్యవతి, లక్ష్మి, గణపతిరెడ్డితో పాటు మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాల్లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



గుడివాడరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. గుడివాడ రైల్వే స్టేషన్ పరిధిలోని దోసపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మరణించినట్లు తెలిపారు. మృతుని వయస్సు 60ఏళ్లు ఉంటుందని, బ్లూబై కంపెనీ తెలుపు, నీలం రంగు గడులు గల చొక్కా(రెడీమేడ్ షర్ట్), తెలుపు, నలుపు, నీలం రంగు గడుల లుంగి ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440627570, 9866221412లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

బీవీ పట్టాభిరామ్ మృతిపై సంతాపం



విజయవాడ కల్చరల్: సాహితీవేత్త, బహు గ్రంథ కర్త, ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. వ్యక్తిగా, వికాస నిపుణుడిగా వేలాది మందికి దిశానిర్దేశం చేశారని మంగళవారం ఓ ప్రకటనలో కొనియాడింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేసింది. నగరానికి చెందిన సాంస్కృతిక కళా సంస్థలు సంతాపం ప్రకటించాయి.

క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

చందర్లపాడు(నందిగామ రూరల్): చందర్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పద్మజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరీ అధ్యక్షత ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఆషాఢ మాసోత్సవాలు

నందిగామ రూరల్: మండలంలోని అనాసాగరం శివారులోని కాదంబరి శ్యామక ఆశ్రమంలో ఆషాఢ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మాతాజీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వారాహి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అష్టోత్తర సహస్రనామ పూజలు, మూలమంత్ర హోమాది క్రతువులు, నక్షత్ర కుంభ పంచ హారతులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

5 వరకు పాలిటెక్నిక్ వెబ్ ఆప్షన్‌లు

నందిగామ టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా కళాశాలలు, బ్రాంచ్‌లను ఎంపిక చేసుకునే వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 6వ తేదీన వెబ్ ఆప్షన్‌ల మార్పు, 9న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థినులు 10 నుంచి 14వ తేదీలోగా కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని చెప్పారు. వెబ్ ఆప్షన్‌లకు సంబంధించి సందేహాలుంటే కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను కానీ 83092 35213 నంబరును సంప్రదించాలని తెలిపారు.

6న శాకంబరీగా శ్రీతిరుపతమ్మవారు

పెనుగంచిప్రోలు: ఆషాడమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారితో పాటు ఆలయంలోని సహదేవతలు ఈనెల 6వ తేదీన శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాకంబరీ అలంకరణకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇవ్వదలచిన భక్తులు, దాతలు ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటల లోపు ఆలయంలో అందజేయాలని సూచించారు.

దేవస్థాన అధికారుల విచారణ

జగ్గయ్యపేట అర్బన్: దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన పట్టణంలోని శ్రీఆనందసాయి ఆలయం, శ్రీఆంజనేయస్వామి ఆలయంలో దేవస్థాన ఈఓ బి.రవీంద్ర విచారణ చేపట్టారు. దేవదాయశాఖ అధికారుల అనుమతి, పర్యవేక్షణ లేకుండా కొందరు వ్యక్తులు మోసపూరితంగా, అక్రమ రీతిలో భక్తులు సమర్పించి కానుకలు, మొక్కుబడులను కాజేసిన అభియోగంపై జిల్లా ఎండోమెంట్ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం ఈఓ రవీంద్ర విచారణ చేశారు. భక్తులు, స్థానికులను అడిగి పలు విషయాలని సేకరించారు.

క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శన

తిరువూరు: క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం తిరువూరులో అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. క్షయవ్యాధి నిర్మూలనా వారోత్సవాల్లో భాగంగా యూపీహెచ్‌సీ నుంచి బాలికోన్నత పాఠశాల వరకు ఈ ప్రదర్శన జరిగింది. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి రేష్మాబేగం మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలను వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గినప్పుడు ఉమ్మితో కళ్లె పడటం, ఛాతీలో నొప్పిరావడం వంటి లక్షణాలు క్షయ వ్యాధికి సూచికలని తెలిపారు. ఈ లక్షణాలున్న వారు వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని, ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారని పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ కె. రవి, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పీపీ యూనిట్ టీబీ సూపర్‌వైజర్ దిలీప్, ఏఎన్‌ఎంలు రమాదేవి, కుసుమ పాల్గొన్నారు.

ఇళ్ల కింద పైప్‌లైన్

- కంచికచర్ల పైలెట్ ప్రాజెక్టు ప్రధాన పైప్‌లైన్‌తో కూలేందుకు సిద్ధంగా ఉన్న గృహాలు
- పైపులు లీకయినప్పుడు ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు
- పైపులు తొలగించాలని కోరుతున్న కాలనీవాసులు

కంచికచర్ల మండలం చెవిటికల్లు ఎస్సీ కాలనీలో ఇళ్ల కింద ఏర్పాటు చేసిన ప్రధాన పైప్‌లైన్

లీకైన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న మెకానిక్

ఇళ్ల మధ్య రోడ్డుపైనే ఏర్పాటు చేసిన వాల్‌ఫిట్

కంచికచర్ల: ఇళ్ల మధ్యనే తాగునీటి ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో మరమ్మతులకు గురైనప్పుడు ఇంటిగోడలను సైతం తవ్వి రిపేర్లు చేస్తున్నారు. దీంతో ఆ గృహాలు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ తాగునీటి పైప్‌లైన్‌లు తొలగించాలని అనేకసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులైనా మా గోడును పట్టించుకోవాలని చెవిటికల్లు గ్రామ ఎస్సీ ప్రజలు కోరుతున్నారు.

15 కిలోమీటర్ల మేర పైప్‌లైన్

కంచికచర్ల మండలం చెవిటికల్లు కృష్ణానది నుంచి కంచికచర్లతో పాటు బత్తినపాడు, పరిటాల, గొట్టుముక్కల తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం 2004లో కంచికచర్ల పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కృష్ణానది నుంచి కంచికచర్లకు సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రధాన పైప్‌లైన్ వేశారు. అయితే ఆ ప్రధాన పైప్‌లైన్ రోడ్డు మార్జిన్ పక్కన వేయకుండా రైతుల పొలాల్లో వేశారు. గతంలో చెవిటికల్లు కృష్ణానది ఒక్కోసారి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నాటి జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదికి ఒడ్డున ఉన్న ఇళ్లు మునిగిపోతున్నాయని వారికి ప్రత్యేకంగా మెరక ప్రాంతంలో భూములను కొనుగోలు చేసి ఎస్సీ, బీసీలకు ఇళ్ల స్థలం కేటాయించింది. ఆ స్థలాల్లో 2018–19 సంవత్సరంలో కొంతమంది ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అప్పటికే పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పైప్‌లైన్లు ఆ స్థలాల్లో ఉన్నాయని లబ్ధిదారులకు తెలియక ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కాని కొన్నేళ్ల తర్వాత ప్రధాన్ పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో పైపుల నుంచి వచ్చే నీరంతా ఇళ్లలోకి వెళ్తుతోంది.

ఇంటి గోడలను తవ్వి మరమ్మతులు

ఇళ్ల కింద నుంచి పైప్‌లైన్ వెళ్లిన విషయం అర్థం కాని కాలనీవాసులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కంచికచర్ల పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పైప్‌లైన్లు ఉన్నాయని చెప్పడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. పైపులు లీకు అయినప్పుడల్లా మెకానిక్‌లు ఇళ్ల గోడలను తవ్వి ప్రధాన పైప్‌లకు మరమ్మతులు చేపడుతున్నారు. ఒక్కోసారి ఆ నీరంతా ఇళ్లలోకి చేరడంతో వారంతా నానా అవస్థలు పడుతున్నారు. ఆ నీటి వల్ల ఎప్పుడు ఏ ఇళ్లు కూలిపోతాయోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఇళ్లల్లో ఉన్న కంచికచర్ల పైలెట్ ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన ప్రధాన పైపులైన్‌ను తొలగించి ఇళ్లు కూలిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నాడు ఇంటికే పింఛన్.. నేడు పడిగాపులు

నాడు: గండేపల్లిలో వృద్ధురాలి ఇంటి వద్దే పింఛన్ ఇస్తున్న వలంటీర్ వాణి(ఫైల్)

నేడు: కంచికచర్ల గ్రామ సచివాలయం వద్ద మంగళవారం పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కంచికచర్ల: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందులో భాగంగానే నాడు ప్రతి ఇంటికీ వలంటీర్ వెళ్లి అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులతో పాటు లబ్ధిదారులు అందరికీ తెల్లవారుజామునే పింఛన్ నగదు అందించేవారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థను తొలగించింది. దీంతో పింఛన్‌దారులు అందరూ తెల్లవారుజామునే నానా అవస్థలు పడుతూ గ్రామ సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఉదయం 10 గంటలు అయినా కూడా లబ్ధిదారులకు అధికారులు పింఛన్ నగదు అందించకపోవడంతో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. కంచికచర్ల గ్రామ సచివాలయం – 3 వద్ద అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ నగదు కోసం మంగళవారం పడిగాపులు పడ్డారు. అధికారులు ఎప్పుడు వస్తారా.. పింఛన్ ఎప్పుడు ఇస్తారా.. అసలు ఇస్తారా..? లేదాని నిట్టూర్చుకుంటూ ఎదురుచూశారు.

మహిళలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

మాట్లాడుతున్న ట్రైనర్ లావణ్య

నందిగామ రూరల్: మహిళా ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ట్రైనర్లు రవిబాబు, సబిత, లావణ్యలు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మార్పు ద్వారా విజేతలు – సాధికారతతో సుపరిపాలన సాధ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోను రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్లను వినియోగించాలని చెప్పారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన

నూతన పీహెచ్‌సీ మ్యాపును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని, ఎమ్మెల్యే రాజగోపాల్

గట్టుభీమవరం(వత్సవాయి): జాతీయ రహదారి పక్కన టోల్‌గేట్ సమీపంలో నూతనంగా నిర్మాణం చేయనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి మంగళవారం జిల్లా వైద్యాధికారిణి సుహాసిని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, పలు శాఖలకు చెందిన అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. జాతీయ రహదారి పక్కన వైద్యశాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని తెలిపారు. వీలైనంత త్వరగా వైద్యశాల నిర్మాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎన్ అనిల్, జగ్గయ్యపేట వైద్యశాల సూపరిండెంట్ హరీష్, ఆర్అండ్‌బీ డీఈ పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు పరిశీలన

పెనుగంచిప్రోలు: స్థానిక బైపాస్ రోడ్డులో కంకర, వెట్‌మిక్స్‌తో గుంతలు పూడ్చే పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మంగళవారం పరిశీలించారు. ముందుగా గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ శాంతిలక్ష్మి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలను కాపాడాలని రైతులు ఆందోళన

కంచికచర్ల మండలం పరిటాల రాతి క్వారీల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కంచికచర్ల: రెండు పంటలు పండే సాగు భూములన్నీ క్వారీ, క్రషర్ల వల్ల బీడు భూములుగా మారుతున్నాయని తమ భూములను కాపాడాలని రైతులు మంగళవారం రాత్రి క్వారీల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా మా భూముల్లో పంటలు పండించుకుని జీవనం చేస్తున్నామని చెప్పారు. అయితే క్వారీ నిర్వాహకులు నాగార్జున సాగర్ కాల్వను సైతం కబ్జా చేసి పూడ్చివేసి వ్యాపారం చేసుకుంటున్నారని దీంతో తమ భూములకు సాగర్ జలాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా క్రషర్ల యజమానులు కాచేటి వాగును కూడా ఆక్రమించుకుని వారి వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారని ఆరోపించారు. క్వారీల్లో బ్లాస్టింగ్ చేసే సమయంలో తమ భూముల్లో పెద్ద పెద్ద రాళ్లు వచ్చి పడుతున్నాయని దీంతో వ్యవసాయం చేసే సమయంలో రైతులకు, కూలీలకు తీవ్ర గాయాలవుతున్నాయని వాపోయారు. అంతేకాకుండా క్రషర్ల నుంచి దుమ్ము ధూళి వచ్చి పంట పొలాలపై పడటంతో పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. తమ భూములను అమ్ముకుందామంటే క్వారీ యజమానులు, క్రషర్ల నిర్వాహకులు అడ్డుతగులుతున్నారని, తక్కువ ధరకు వారికే విక్రయించాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పాలకులు స్పందించి తమ భూములను రక్షించాలని కోరారు.

గుంతలతో దర్శనమిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో వర్షం నీటితో నిండిన గుంతలు

జారి పడతారు.. జర జాగ్రత్త

- అధ్వానంగా పెద్దమోదుగపల్లి – రామచంద్రాపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

బురదమయంగా మారిన పెద్దమోదుగపల్లి- రామచంద్రాపురం రహదారి

పెద్దమోదుగపల్లి/రామచంద్రాపురం(వత్సవాయి): పెద్దమోదుగపల్లి నుంచి రామచంద్రాపురం వెళ్లే పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత వేసవి కాలంతో పాటు ఈ వేసవిలో కూడా చెరువుల నుంచి నల్లమట్టిని పొలాలకు తోలుకున్నారు. దీంతో ఈ రహదారిపై లారీలు, ట్రాక్టర్లు, ప్రొక్లయిన్‌లు ఎక్కువ స్థాయిలో తిరగడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీనికితోడు ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డంతా దెబ్బతిన్నది. నల్లమట్టిని ట్రాక్టర్లలో నింపుకొని వెళ్లేటప్పుడు ఆ మట్టి రోడ్డంతా జారిపడింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మొత్తం బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు జారి కిందపడుతున్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలలకు ద్విచక్ర వాహనాల మీద ఎక్కించుకుని వెళ్లాలంటే భయపడుతున్నారు. అంతేకాకుండా రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, కంపచెట్లు అల్లుకుపోయి ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతలమయంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాలు

నందిగామ రూరల్: పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మున్సిపల్ కార్యాలయ ఆవరణాల్లోని గుంతలు వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. ఈ కార్యాలయాలకు ఆయా పనులపై నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వచ్చి వెళుతుంటారు. వర్షం నీటితో నిండిన గుంతల్లో నుంచే ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఆవరణ మొత్తం చిద్రంగా మారుతోంది. దీంతో గుంతల్లోని వర్షం నీరు చింది మీద పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ ఆవరణం చిత్తడిగా మారడంతో కార్యాలయంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా పనులపై వచ్చే వారు పేర్కొంటున్నారు. ఆయా శాఖల అధికారులు స్పందించి కార్యాలయాల ఆవరణాల్లోని గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యో నారాయణో హరి

- ఘనంగా డాక్టర్స్ డే
- వైద్యులకు సత్కారం

నందిగామలో వైద్యులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

డాక్టర్ రత్నప్రియదర్శినిని సత్కరిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

నందిగామ టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడగలిగేది వైద్యుడు మాత్రమేనని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. స్థానిక క్లబ్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యో నారాయణో హరి అనే నానుడిని నిజం చేసేలా వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ముఖ్యంగా వైద్యులు సేవా దృక్పథంతో వైద్య వృత్తిని సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యులు సాంబశివరావు, శ్రీనివాసరావు, కొండలరావు, లక్ష్మీకాంత్‌లను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరావు, యర్రంరెడ్డి గాంధీ, నూకవరపు సాంబశివరావు, గోపు సుబ్రహ్మణ్యం, పబ్బతి నరేంద్ర, మారం అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి వై. రత్న ప్రియదర్శినిని మంగళవారం ఆసుపత్రిలో సిబ్బందితో పాటు రోగులు సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ పలు దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఉపశమనం కలిగిస్తున్నారని ప్రియదర్శినిని అభినందించారు.

జీవాలకు నట్టల నివారణ మందు

రోలుపడి(తిరువూరురూరల్): రోలుపడి శివారు సూరవరంలో మంగళవారం జీవాలకు నట్టల నివారణ మందు వేశారు. చింతలపాడు పశువైద్యాధికారి టి. శ్వేత ఆధ్వర్యంలో సిబ్బంది 600 జీవాలకు ఈ మందు వేశారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వచ్చే వైరస్‌తో మృత్యువాత పడకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు వేశామని చెప్పారు. జీవాల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉండటానికి కూడా ఈ వ్యాక్సిన్ తోడ్పడుతుందని తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ రామాంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నందిగామ టౌన్: నిరుపేద దివ్యాంగులకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని సత్య దివ్యాంగుల సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం పేర్కొన్నారు. స్థానిక మెయిన్ బజార్‌లో దాతల సహకారంతో అందించిన బియ్యం, నిత్యావసర సరుకులను మంగళవారం ఆయన నిరుపేద దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో 12 ఏళ్లుగా దివ్యాంగులకు ప్రతి నెలా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యాధికారులకు సమ్మె నోటీస్ అందజేత

సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ, పీహెచ్‌సీల కమిటీ నాయకులు

నందిగామ రూరల్: ఈ నెల 9వ తేదీన చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు పీహెచ్‌సీ కమిటీల నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో డీవీఆర్ కాలనీ, అనాసాగరం, లింగాలపాడు, గోళ్లమూడి పీహెచ్‌సీలలో వైద్యాధికారులకు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను యజమానులకు కట్టుబానిసలుగా చేసేలా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఆశవర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఒప్పంద జీవోలను విడుదల చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌లతో దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీల్లోని ఆశవర్కర్లు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. పీహెచ్‌సీ కమిటీ నాయకులు తిరుమలదేవి, వనజ, ఉమాదేవి, సునీత, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీల్లో ఏకపక్ష ధోరణి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఏకపక్ష ధోరణిలో వ్యవహరిస్తున్నారని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ అన్నపూర్ణాచారి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ బదిలీలు సీనియారిటీ ప్రకారం జరగలేదని తెలిపారు. పెడన మున్సిపాలిటీలో సెక్రటరీలకు వారి సీనియారిటీ ప్రకారం మూడు సచివాలయాలు ఎంపిక చేసుకొనేలా ఆప్షన్ ఫారం ఇచ్చారని తెలిపారు. కాని జగ్గయ్యపేట మున్సిపాలిటీలో మాత్రం కనీసం ఆప్షన్ ఫారం ఇవ్వకుండా ఏకపక్ష ధోరణితో బదిలీలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ విధంగా చేయడం వల్ల వార్డు సచివాలయ ఉద్యోగులు అందరూ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారన్నారు. సచివాలయాలు ఎంపిక చేసుకోమని ఆప్షన్ ఫారం ఇవ్వడం వల్ల వచ్చిన నష్టం ఏమిటో తెలియడం లేదని ఉద్యోగులు చాలా బాధపడుతున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగులకైనా ఇలా చేస్తారా అని, మా సచివాలయ ఉద్యోగులకే ఇలా ఎందుకు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీ

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో పింఛన్ల పంపిణీని మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8,583 మందికి గాను 7,834 మందికి పింఛన్‌లు పంపిణీ చేశామన్నారు. నూరు శాతం పింఛన్లను పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా

జీవాలకు నట్టల నివారణ మందు

రోలుపడి(తిరువూరురూరల్): రోలుపడి శివారు సూరవరంలో మంగళవారం జీవాలకు నట్టల నివారణ మందు వేశారు. చింతలపాడు పశువైద్యాధికారి టి. శ్వేత ఆధ్వర్యంలో సిబ్బంది 600 జీవాలకు ఈ మందు వేశారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వచ్చే వైరస్‌తో మృత్యువాత పడకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు వేశామని చెప్పారు. జీవాల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉండటానికి కూడా ఈ వ్యాక్సిన్ తోడ్పడుతోందన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ రామాంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విభాగం కార్మికుల నిరసన

తిరువూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగం కార్మికులు మంగళవారం మోకాళ్లపై నిలబడి ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పనికి తగిన వేతనాలివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో 4వ తేదీ నుంచి సమ్మెలో పాల్గొంటామని కార్మిక సంఘ నాయకులు బి. వెంకటేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కమిషనర్ మనోజకు వినతి పత్రం సమర్పించారు.

బీమా పథకాలపై అవగాహన

జి.కొండూరు: ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ సీవీఎన్ భాస్కర్‌రావు అన్నారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, యూనియన్ బ్యాంకు సంయుక్తంగా జి.కొండూరు కేడీసీసీ బ్రాంచ్ కార్యాలయంలో బీమా పథకాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన భాస్కర్‌రావు, ఎస్‌ఎల్‌బీసీ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు బీమా పథకాల ప్రాముఖ్యతను వివరించారు. కేడీసీసీబీ ప్రతినిధులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పాల కేంద్రం లెక్కలు చెప్పాలని రైతుల ధర్నా

చాట్రాయి: చీపురుగూడెం విజయ కృష్ణా మిల్క్ యూనియన్ పాల కేంద్రం లెక్కలు చెప్పాలంటూ పాడి రైతులు మంగళవారం స్థానిక పాల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గత 23 సంవత్సరాల నుంచి పాల కేంద్రంలో జరుగుతున్న క్రయ, విక్రయాలకు సంబంధించి లెక్కలు చెప్పాలని, పాల కేంద్రం సభ్యులు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా

మైలవరం: ఇబ్రహీంపట్నం నుంచి సంప్‌వెల్ ద్వారా శుద్ధి చేసిన కృష్ణా వాటర్‌ను పైపులైన్ ద్వారా జి.కొండూరు మండలం, మైలవరం మండలాలకు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నారు. మైలవరంలోని డాక్టర్ హనిమిరెడ్డి స్టేడియం సమీపంలో పైపులైన్ లీకై గ్రామస్తులకు ఉపయోగపడాల్సిన కృష్ణా వాటర్ వృథాగా పోతోంది. ఈ విషయాన్ని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన

కాచవరం(ఇబ్రహీంపట్నం): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అంగలూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు కొచ్చెర్ల మోహన్‌రావు మంగళవారం సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు అభ్యసన ప్రక్రియలో భాగంగా తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు వంటి సామర్థ్యాలను పరిశీలించారు. ఐదో తరగతి విద్యార్థులను ఆంగ్ల పాఠ్యాంశంలో కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, రిజిస్టర్ల నిర్వహణ, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని భవాని, ఉర్దూ ఉపాధ్యాయులు మహ్మద్ ఇర్ఫాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయం

తుక్కులూరులోని గ్రామ సచివాలయం సమీపంలో ప్రధాన రహదారిపై గుంత ; నూజివీడు పట్టణంలోని జంక్షన్ రోడ్డులో పడిన గుంత

- వాహనదారులకు నరకాన్ని చూపుతున్న రోడ్లు
- గుంతలను తప్పించబోయి ప్రమాదాలు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు

నూజివీడు: సంక్రాంతి నాటికి గుంతలు లేకుండా చేస్తాం అని పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. సంక్రాంతే కాదు ఉగాది, శ్రీరామ నవమి పండుగలు గడిచిపోయినా నేటికీ పలు చోట్ల గుంతలు పూడ్చలేదు. నూజివీడు–హనుమాన్ జంక్షన్ మార్గంలో నూజివీడు పట్టణం నుంచి తుక్కులూరు వరకు పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలో, పెట్రోలు బంకు వద్ద, తుక్కులూరు సచివాలయం వద్ద, తుక్కులూరులో పలుచోట్ల గుంతలు పడటంతో వాహనదారులు ఇక్కట్లతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పట్టణంలో ఇలా..

పట్టణ పరిధిలోని ముసునూరు రోడ్డులో గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తుక్కులూరులోని గ్రామ సచివాలయం సమీపంలో కల్వర్టు వద్ద పడిన గుంత వాహనదారులకు నరకాన్ని చూపిస్తోంది. ఈ గుంత దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను వేగంగా గుంతలో దింపుతుండటంతో అవి కాస్తా దెబ్బతిని మరమ్మతులకు గురవుతున్నాయి. గుంతను తప్పించే క్రమంలో అకస్మాత్తుగా పక్కకు తిప్పుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదకరంగా..

సరస్వతి ఆలయం సమీపంలో ఉన్న పెట్రోలు బంకు వద్ద, పట్టణంలోని జంక్షన్ రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర రవాణా వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు, ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

సరస్వతి ఆలయం సమీపంలోని పెట్రోలు బంకు ఎదురుగా ఏర్పడిన గుంతలు

నూజివీడు పట్టణం సత్యనారాయణ థియేటర్ రోడ్డులో పడిన గుంతలు

క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శన

తిరువూరు: క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం తిరువూరులో అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనా వారోత్సవాల్లో భాగంగా యూపీహెచ్‌సీ నుంచి బాలికోన్నత పాఠశాల వరకు ఈ ప్రదర్శన జరిగింది. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి రేష్మాబేగం మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలను వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గినప్పుడు ఉమ్మితో కళ్లె పడటం, చాతీలో నొప్పిరావడం వంటి లక్షణాలు క్షయ వ్యాధికి సూచికలన్నారు. ఈ లక్షణాలున్న వారు వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని, ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ కె. రవి, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పీపీ యూనిట్ టీబీ సూపర్‌వైజర్ దినీప్, ఏఎన్‌ఎంలు రమాదేవి, కుసుమ పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

సార్వత్రిక సమ్మె కరపత్రాల ఆవిష్కరణ

జికొండూరు: కార్మికులకు నష్టదాయకంగా మారిన లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు మహేష్ కోరారు. జి.కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు, ఆశాలు తదితరులతో కలిసి సమ్మె కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంగన్‌వాడీలు, ఆశాలు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎన్. సుందరరావు, ఉపాధ్యక్షురాలు సునీత, సహాయ కార్యదర్శి ప్రశాంతి, నాయకులు ప్రసాద్, బాలస్వామి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలి

మైలవరం: విద్యార్థులు సీఏడీ డిజైన్, 3డీ ప్రింటింగ్ వంటి సాంకేతిక రంగాల్లో ఆసక్తి పెంచుకోవాలని రిసోర్స్‌పర్సన్ జుల్ఫికర్ ఆలీ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో సీఏడీ డిజైన్ టు 3డీ ప్రింటింగ్–ఫౌండేషన్ డిటైల్స్‌పై ఐదు రోజులు బూట్ క్యాంప్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ సృజనాత్మక సాధించగలిగే సామర్థ్యం ఈ టెక్నాలజీకి ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, డీన్ ఆర్ అండ్ డీ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి మాట్లాడారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎంబీఎస్ శ్రీకర రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డి. మల్లికార్జున రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక రాబడి

కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు: మెట్ట ప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగుతో అధిక రాబడి సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఎ. కొండూరు మండలంలో ఉపాధి హామీ పథకం కింద నిమ్మ తోట సాగును పరిశీలించిన కలెక్టరు మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో ఈ ఏడాది 375 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యమని చెప్పారు. మల్లె, మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, నేరేడు, ఆపిల్‌బేర్, మునగ తోటలను సాగుచేసే రైతులకు ఉద్యాన శాఖ తగు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. రైతులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. తిరువూరు ఆర్డీఓ మాధురి, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు సర్పంచి ఫిర్యాదు..

తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడులో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని గ్రామ సర్పంచి కోట పుల్లారావు జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జవ్వాజి రాంబాబు తోట వరకు డ్రెయినేజీ తీయకుండా ప్రభుత్వ స్థలం ఆక్రమించడంతో నీరు నిలిచిపోతోందని పేర్కొన్నారు. కంభంపాడు పంచాయతీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా శ్మశానవాటికకు స్థలం కేటాయించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణం జరపాలని కోరారు.



కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి పుల్లారావు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ధర్నా

మైలవరం: మైలవరం నుంచి నూజివీడు–గణపవరం రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరితే అధికారులు పోలీసులతో అరెస్టు చేయిస్తున్నారని విమర్శించారు. గత నాలుగు నెలలుగా అధ్వానంగా గుంతలు పడి ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నాలుగు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగడంతో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించామని చెప్పారు. తక్షణమే మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకుంటే వారం రోజుల్లో రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు సందీప్, ఇస్సాక్, వజ్రాల వెంకటరెడ్డి, విజయ్, సురేష్, అనిల్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ముసునూరు: పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, ప్రకృతి సేద్యం ద్వారా పంట చేనుకు చేవ లభించి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. ముసునూరు, కొర్లగుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌కేల వద్ద భూసార పరీక్షల ఆవశ్యకత, భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలను, భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాల అవసరతను వివరించారు. పీఎండీఎస్ కిట్ల రూపంలో ఉన్న నవ ధాన్యాలను చల్లుకొని పూత దశలో పంట చేనులో కలియదున్నాలన్నారు. అనంతరం పచ్చిరొట్ట ఎరువులను, విత్తుకున్న పొలాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వెలగలేరులో పొలం పిలుస్తోంది

వెలగలేరు(జి.కొండూరు): పాడిరైతులు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ హనుమంతరావు అన్నారు. మండలంలోని వెలగలేరు గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ సబ్సిడీపై పశువుల దాణా, గడ్డి విత్తనాలు, లింగ నిర్ధారణ వీర్యం గురించి వివరించారు. సకాలంలో పశువులు, జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. లింగ నిర్ధారణ వీర్యం ఒక డోసు రూ.150కే లభిస్తుందని చెప్పారు. సబ్సిడీపై రైతులకు దాణా పంపిణీ చేశారు. మైలవరం అసిస్టెంట్ డైరెక్టర్ హరి హరనాథ్, ఏఓ సూరిబాబు, పశువైద్యాధికారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

- **పుట్రేల(విస్సన్నపేట):** పుట్రేల గ్రామంలో ఏడీఏ కె. శశికళ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. రాజశేఖర్ వరిలో సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

పునీత థామస్ మహోత్సవాలు ప్రారంభం

ముసునూరు: భారతదేశంలో రోమన్ క్యాథలిక్ సేవలు, ఏసుక్రీస్తు బోధనల వ్యాప్తికి ఆద్యుడు పునీత థామస్‌ను గౌరవించాలని రమణక్కపేట ఆర్సీఎం విచారణకర్త జాన్‌భారతి అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పునీత థామస్ పండుగ మహోత్సవాలు మంగళవారం రాత్రి పతాకావిష్కరణ, దివ్యబలి పూజ సమర్పణతో ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి కార్యక్రమాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో సమష్టి దివ్య బలి పూజ సమర్పించారు. విచారణ హోలీ ఫ్యామిలీ సిస్టర్స్, బోర్డింగ్ విద్యార్థినులు, యూత్ సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సహాయక ఫాదర్ విలియం, సిస్టర్లు, ఉపదేశి కె.రాజు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ఇబ్రహీంపట్నం: జాతీయ వైద్యుల దినోత్సవం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సయ్యద్ పర్వీన్‌ను శాలువా కప్పి పూల బొకే అందజేసి సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శి ఎ.సురేష్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు బి.కృష్ణారెడ్డి, బీఆర్ చౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎ.నాగిరెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువలేనివి

మైలవరం: వైద్యుల సేవలు మరువలేనివని, ముఖ్యంగా కరోనా సమయంలో వారు అందించిన సేవలు ప్రశంస నీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ప్రోగ్రాం కమిటీ కో–ఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల కోసం మౌలిక వసతులు కల్పించామని వివరించారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

- **తిరువూరు:** రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు చేసే కృషికి వెలకట్టలేమని లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరులో మంగళవారం డాక్టర్స్ డే నిర్వహించారు. పట్టణంలోని పలువురు వైద్యులను క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ సభ్యులు కొమ్మినేని రాజేష్ ఖన్నా, అడుసుమల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, చలమాల శంకరరావు, నాగుబండి రాజేశ్వరరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులను, సీనియర్ వైద్యులను సన్మానించారు. ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** వైద్యులు రోగులకు అందజేస్తున్న సేవలకు వెలకట్టలేనివని లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ అధ్యక్షుడు కోలాహలం సత్య వరప్రసాద్‌రాజు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ ఆధ్వర్యంలో మగళవారం పట్టణంలోని పలువురు వైద్యులను సన్మానించారు. వైద్యులు మూల్పూరి శైలజారాణి, తేజస్విని, వై. వరప్రసాద్, వై.రాజ్యలక్ష్మిలను శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యదర్శి నారిగడప సాంబశివరావు, కోశాధికారి సింగరాజు సంధ్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ముసునూరు పీహెచ్‌సీలో ఘనంగా నిర్వహించారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్‌ను ఆస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది, ఆశా వర్కర్లు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** మండలంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి జాస్తి జగన్‌మోహన్‌రావును ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరంలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైద్యులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ ప్రతినిధులు

పింఛన్ల పంపిణీ

ఆగిరిపల్లి: మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. చొప్పరమెట్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందజేస్తున్నామని చెప్పారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేల జెడ్పీ ఉన్నత పాఠశాలకు తిరువూరు భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖ కంప్యూటర్ బహూకరించింది. బ్యాంకు శాఖ 70వ వార్షికోత్సవం సందర్భంగా మేనేజరు దాసరి నాగన్న ఈ కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీఎన్ ప్రసాద్‌కు అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి సీఈఓల కృషి

కో–ఆపరేటివ్ నూజివీడు డెప్యూటీ రిజిస్ట్రార్ రవికుమార్

నూజివీడు: సహకార సంఘాల బలోపేతానికి పీఏసీఎస్‌ల సీఈఓలు కృషి చేయాలని కో–ఆపరేటివ్ నూజివీడు డెప్యూటీ రిజిస్ట్రార్ రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025 సందర్భంగా స్థానిక డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీసులో మంగళవారం పీఏసీఎస్‌ల సీఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో సహకార శాఖను ఏర్పాటు చేసి నాలుగేళ్లు అయిన సందర్భంగా ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. సొసైటీల్లో ఆడిట్లను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. బకాయిల వసూలుపై దృష్టి సారించాలని, పాలకవర్గ సమావేశాలు, మహాజన సభ నిర్వహణ, తీసుకోవాల్సిన నిర్ణయాలు, తీర్మానాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలు సొసైటీల సీఈఓలు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ–2 వీరాస్వామి తల్లిదండ్రులకు సూచించారు. విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బడి ఈడు బాలబాలికలు ముగ్గురిని గుర్తించి స్థానిక మోడల్ ప్రైమరీ పాఠశాలలో చేర్పించారు.

లేబర్ కోడ్స్ రద్దుచేయాలి

మైలవరం: లేబర్ కోడ్స్ రద్దు చేసి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని, కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పుట్టెపు అప్పారావు డిమాండ్ చేశారు. మైలవరంలోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో కార్మికుల విస్తత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 9న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.

వర్షం పడితే రోడ్డు చెరువే

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రధాన రహదారి అయిన బ్రాహ్మణ బజార్ కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డులో వర్షం పడితే ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. సిమెంట్ రోడ్డు పల్లంగా ఉండి చుట్టూ ఆక్రమణలతో వర్షం నీరు వెళ్లే మార్గం లేదు. దీంతో వర్షం కురిసినప్పుడు ఈ రోడ్డులో పాదచారులపై బురద నీరు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డును మెరక చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

విస్సన్నపేట: భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్య సాయి సేవా మందిరం వద్ద ఉదయం 9 లకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

సాక్షి పల్నాడు

బుధవారం । 2 । జూలై । 2025

అమ్మవారికి ఆషాఢ సారె

బాపట్ల టౌన్: ముత్తాయపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం మహిళలు పూజలు నిర్వహించి ఆషాఢ సారె సమర్పించారు. ఊరేగింపు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

మేదరమెట్ల: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరులో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

తెనాలి వచ్చిన గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్

తెనాలిఅర్బన్: వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలోని ఎన్సీసీ విభాగాన్ని పరిశీలించేందుకు ఆ విభాగ గుంటూరు గ్రూప్ కమాండర్ సుదాన్ష్ దుబాయ్ మంగళవారం తెనాలి వచ్చారు. కళాశాలలోని ఎన్సీసీ విభాగాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 22వ ఆంధ్ర బెటాలియన్ ఎన్సీసీ కమాండర్ కల్నర్ ఎ.ఉదయ్‌కుమార్, సబ్ మేజర్ గురుదీప్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ దేవి ప్రియా, ఎన్సీసీ అధికారి కె.ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస బాధిత మహిళలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100

నరసరావుపేట టౌన్: గృహహింస బాధిత మహిళలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పూర్తి అండగా నిలుస్తుందని, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేయవలసిందిగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ మంగళవారం తెలిపారు. బాధిత మహిళలకు చట్ట ప్రకారం ఆర్థిక, ఆరోగ్య, ఉచిత నివాస, చట్టపరమైన సహాయాలు లభిస్తాయన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి తగు సహాయం పొందవలసిందిగా సూచించారు.

ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం

పెదకాకాని: జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించేందుకు ఉప్పలపాడు గ్రామాన్ని కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. పెదకాకాని మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనలో భాగంగా ఉప్పలపాడు గ్రామానికి వచ్చిన కేంద్ర బృందం ఫాం పాండ్స్, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను పరిశీలించింది. మండలంలో జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డ్వాక్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రంలో జేసీ ఆకస్మిక తనిఖీలు

పెదకాకాని: రైతులు తీసుకు వచ్చిన పొగాకును వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అన్నారు. పెదకాకాని సెంట్రల్ వేర్‌హౌస్‌లో గత పది రోజులుగా పొగాకు కొనుగోలు ప్రారంభించారు. ఈ కేంద్రంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకు వచ్చిన పొగాకును త్వరగా కొనుగోలు చేయాలన్నారు. కేంద్రం సిబ్బంది ఉదయం ఆలస్యంగా రావడం వల్ల కొనుగోలులో ఆలస్యంగా జరుగుతుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. పొగాకు నాణ్యత, తేమశాతం ఎలా పరీక్షిస్తారో అధికారులు రైతులకు, జేసీకి వివరించారు. పొగాకును నాణ్యత ఆధారంగా మూడు గ్రేడులుగా గుర్తించి మేలు రకం క్వింటా రూ.12 వేలు, మధ్య రకం రూ.9 వేలు, నాసిరకం రూ.6 వేలుగా కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐతా నాగేశ్వరరావు, పొగాకు సేకరణ ముఖ్య అధికారులు రమేష్, సుబ్రమణ్యం, తహసీల్దార్ కృష్ణకాంత్, వ్యవసాయ అధికారి రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో.. ఇంటింటికా?

హామీలకు మంగళం.. ప్రశ్నిస్తే ఏం చెప్పగలం?

- టీడీపీ ఎమ్మెల్యేలలో అంతర్మథనం
- నేటి నుంచి సుపరిపాలన తొలి అడుగు – ఇంటింటికి టీడీపీ కార్యక్రమం
- ఏడాది దాటినా అమలుకు నోచుకోని హామీలు
- ప్రజాప్రతినిధుల పనితీరుపై సర్వత్రా విమర్శలు
- ఏడాదిగా పెండింగ్‌లో వరికపూడిసెల, మెడికల్ కళాశాల పనులు
- తీవ్ర సంక్షోభంలో మిర్చి, పొగాకు, కంది రైతులు
- అతీగతీ లేని అన్నదాత సుఖీభవ
- పెండింగ్‌లో ధాన్యం కొనుగోలు నగదు
- ప్రజలు నిలదీస్తారేమోనని భయంలో టీడీపీ ప్రజాప్రతినిధులు

సాక్షి, నరసరావుపేట: అలవిగాని హామీలు, అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయకపోగా, అప్పటివరకు ప్రజలకు అందుతున్న సేవలు, పథకాలను అటకెక్కించారు. ముఖ్యంగా సూపర్–6 లో పేర్కొన్న పథకాలు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత జిల్లా అయిన పల్నాడులో రైతులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సమయంలో సీఎం చంద్రబాబు నేటి నుంచి టీడీపీ నేతలను సుపరిపాలన తొలి అడుగు – ఇంటింటికీ టీడీపీ పేరుతో ఇల్లిల్లు తిరిగి ప్రచారం చేయాలని ఆదేశించారు. ఏడాది పాలనలో మనం ఏం సాధించామని ఇంటింటికి తిరగాలని ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. పర్యటనలో ప్రజలు నిలదీస్తే ఏం సమాధానం చెప్పాలని అంతర్మథనంలో ఉన్నారట.

ఏడాదిగా మొహం చాటేసి...

సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన తరువాత జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరంగా ఉంటున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు నిత్యం ఏదో కార్యక్రమం పేరట ప్రజల్లోనే ఉండేవారు. వారి కష్టసుఖాలను ఇంటింటికి వెళ్లి తెలుసుకొని సత్వరమే పరిష్కారం చూపారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది కాలంలో ఎమ్మెల్యేలు పల్లెల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భాలు లేవు. జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు పల్లెలకన్నా విదేశాలకే ఎక్కువ వెళ్లారని సొంత పార్టీ కార్యకర్తలే విమర్శిస్తున్నారు. నియోజకవర్గాల్లో షాడో ఎమ్మెల్యేలను వదలి ప్రజలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వస్తారని ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి జాడేది...?

ఏడు దశాబ్దాలుగా పల్నాటి ప్రజల కల వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం. గతంలో ఎంతో మంది నేతలు అనుకున్నా ప్రాజెక్టుకు అవసరమైన అటవీ, పర్యావరణ, వన్యప్రాణ సంరక్షణ వంటి కీలక అనుమతులను కేంద్రం నుంచి తేవడంలో సఫలీకృతం కాలేకపోయారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరికపూడిశెల ప్రాజెక్టు అనుమతులపై ప్రత్యేక దృష్టిపెట్టి కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించి కీలక అడుగువేశారు. మొదటి దశ పనులను ప్రారంభించారు. అంతలో ఎన్నికలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు చంద్రబాబు మొదలు స్థానిక నేతల వరకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీలిచ్చారు. అయితే ఏడాదైనా కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని ప్రజలు వాపోతున్నారు.

- జలజీవన్ మిషన్, వైఎస్సార్ కరువు నివారణ పథకం వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి
- ఏడాదైనా జేజేఎం పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించలేకపోతున్నారు
- కీలకమైన జాతీయ రహదారుల పనులు ముందుకుసాగడం లేదు. ముఖ్యంగా నకరికల్లు–వాడరేవు జాతీయ రహదారి భూసేకరణ నేటికీ పూర్తికాలేదు
- మాదిపాడు బ్రిడ్జి పూర్తి చేయలేదు
- పల్నాడు జిల్లాకే తలమానికమైన పిడుగురాళ్ల

మహిళల్లో ఆగ్రహ జ్వాలలు

కూటమి ప్రభుత్వ పాలనపై ముఖ్యంగా మహిళలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. సూపర్–6లో మహిళలకు ప్రకటించిన హామీలను ఏడాది పాలనలో గాలికి వదిలేశారు. ముఖ్యంగా మహిళలకు నెలా నెలా రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందో ఎప్పుడు అమలు చేస్తారో చెప్పడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జీవిత కాల ఆలస్యంగా నడుస్తోంది. ఉచిత సిలెండర్ల పథకం అమలు చేస్తున్నామని చెబుతున్నా నగదు బదిలీ సక్రమంగా జరగడంలేదు.. విచారణ కోసం ప్రకటించిన టోల్‌ఫ్రీ నెంబర్లు పనిచేయవు.

మెడికల్ కళాశాల భవితవ్యం కూటమి ప్రభుత్వంలో అయోమయంలో పడింది. సుమారు 50 ఎకరాల్లో రూ.540 కోట్లతో కడుతున్న కళాశాల నిర్మాణ పనులలో కీలకమైనవి గత ప్రభుత్వ హయాంలో దాదాపుగా పూర్తికావొచ్చాయి. మిగిలిన అరకొర పనులు పూర్తిచేసేందుకు ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేక పూర్తికావడంలేదు. ఎప్పటి నుంచి ఆసుపత్రి సేవలు అందుబాటులోకి వస్తాయి, మెడికల్ విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభం ఎప్పుడు అన్న వాటికి సమాధానాలు లేవు. ఈ నేపథ్యంలో ఏడాది పాలనలో మీరు సాధించిన అభివృద్ధి ఏమిటని కూటమి నేతలను ప్రజలు ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో కూటమి ప్రజాప్రతినిధుల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి వెళ్లడానికి ఆలోచనలో పడ్డారు.

రోడ్డెక్కిన రైతన్న

వ్యవసాయం ఏడాదిగా తీవ్ర సంక్షోభాలను ఎదుర్కొంది. ముఖ్యంగా మిర్చి, పత్తి. పొగాకు, కంది పంటల రైతులకు గిట్టుబాటు ధరలు లేక మార్కెటింగ్ సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోయారు. రోడ్డెక్కి తమకు విత్తనాలు, ఎరువులు కావాలని, పండించిన పంటలను కొనుగోలు చేయాలని, గిట్టుబాట ధర కల్పించాలని రైతులు నిరసనలు చేపట్టడానికే ఏడాది సరిపోయింది. మరోవైపు రైతులకు అన్నదాత సుఖీభవ పేరిట ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న సాయంలో తొలి ఏడాది ఒక్క రూపాయి ఇవ్వలేదు. రెండో ఏడాదీ ఇప్పటివరకు అతీగతీ లేదు. పంటలు పెట్టి అప్పులపాలైన రైతులకు పెట్టుబడి పెట్టడానికి కూడా డబ్బులు లేక ఖరీఫ్ సాగు నెమ్మదిగా సాగుతోంది. మరోవైపు రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యం డబ్బులు నేటికీ వారి ఖాతాల్లో జమ కాలేదు. జిల్లావ్యాప్తంగా రూ.6 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. మరోవైపు నిరుద్యోగులు, విద్యార్థులు కూటమి ప్రభుత్వం తమను పూర్తిగా వంచించిదని తీవ్ర ఆవేదనలో ఉన్నారు.

వైఎస్ జగన్‌కు గోపిరెడ్డి కృతజ్ఞతలు



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ పీఏసీ మెంబర్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడులు మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. ఆయనకు దుశ్శాలువా కప్పి తన నియామకంపై గోపిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సౌత్ జోన్‌కు అర్హత సాధించిన శివకోటేశ్వరమ్మ

రెంటచింతల: కేరళలో జరగనున్న సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు రెంటచింతల–2 సచివాలయం మహిళా పోలీస్ చిన్నపురెడ్డి శివకోటేశ్వరమ్మ అర్హత సాధించింది. జూన్ 21 నుంచి 30 వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన 25 ఏపీ రైఫిల్ షూటింగ్ చాంపియన్ 2025 పోటీలలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో విశేష ప్రతిభను ప్రదర్శించి శివకోటేశ్వరమ్మ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైంది. ఇంటర్ డిస్ట్రిక్ స్థాయిలో కూడా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన శివకోటేశ్వరమ్మ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటూ సౌత్‌జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆమె కృషి, పట్టుదలకు నిదర్శనం. శివకోటేశ్వరమ్మ మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించినట్లు తెలిపారు.

పల్నాడును వైఎస్సార్ సీపీ అడ్డాగా మారుద్దాం

డాక్టర్ గోపిరెడ్డిని అభినందిస్తున్న రొంపిచర్ల మండల నాయకులు, కార్యకర్తలు

- నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి
- పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డాగా మారుస్తానని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించటంతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాదిమంది మంగళవారం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి అభినందనలు తెలియచేశారు. డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆరు నియోజకవర్గాల సమన్వయకర్తలు కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, మాజీ మంత్రి విడదల రజిని, గజ్జల సుధీర్ భార్గవరెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలోని నాయకులను కలుపుకొని పార్టీ కార్యక్రమాలను దిగ్విజయం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి సలహాలు స్వీకరిస్తూ వారితో సంప్రదింపులు జరుపుతూ పార్టీని పటిష్టం చేస్తానని చెప్పారు. 2029 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెంపున్నారెడ్డి, ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఈఎం స్వామి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్, నరసరావుపేట, రొంపిచర్ల మండలాల అధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు షేక్ రెహమాన్, నరసరావుపేట పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, కార్యనిర్వాహక అధ్యక్షుడు అచ్చిశివకోటి, ఎన్.సురేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వద్దే అన్ని సేవలు

- మందుల షాపులే మినీ ఆస్పత్రులు
- అద్దెకు దొరుకుతున్న ఫార్మసీ సర్టిఫికెట్లు
- గ్రామాలు, పట్టణాల్లో భారీగా ఆర్ఎంపీ క్లినిక్‌లు
- పట్టించుకోని జిల్లా వైద్యశాఖ

యడ్లపాడు: కనీస వైద్య శిక్షణ లేని ఈ వ్యక్తులు ఇష్టానుసారంగా యాంటీ బయాటిక్స్ ఇచ్చి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పల్లె ప్రజల అమాయకత్వం, చదువులేని స్థితి వీరికి అవకాశంగా మారింది. కొందరు మెడికల్ షాపుల యజమానులే ఇప్పుడు గ్రామాల్లో డాక్టర్ల అవతారం ఎత్తి, రోగులకు వైద్యం అందిస్తున్నారు. వీరిలో ఫార్మసీ కోర్సులు చేసినవారు కొందరైతే, సదరు కోర్సు పూర్తి చేసిన వ్యక్తుల నుంచి సర్టిఫికెట్లు సేకరించి, మెడికల్ షాపులు నడిపేవారు మరికొందరు.

మెడికల్ షాపు ముందు బాలిక మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

ఇలా మెడికల్ షాపులు పెట్టుకున్నవారు అక్కడే మందులు, ఇంజెక్షన్లు, సెలైన్లు ఇస్తూ, క్రమంగా ఆ షాపులను చిన్నపాటి ఆసుపత్రులుగా మార్చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో నిరాదరణ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యపరీక్షల రూపంలో జరిగే ఆర్థిక దోపిడీకి భయపడి నిరుపేద, మధ్యతరగతి ప్రజలు వీరిని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

కమీషన్ల దందా:

ప్రైవేట్ ఆసుపత్రుల అండదండలు

కొందరు ఆర్ఎంపీల దందా కేవలం మందుల అమ్మకాలకే పరిమితం కాలేదు. రోగులకు పరీక్షలు అవసరమైతే నిర్దిష్ట ల్యాబ్‌లకు పంపి, భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ఆర్ఎంపీ వైద్యం, మెడికల్‌షాప్, ల్యాబ్‌లు, రిఫరల్ సేవలు అన్నీ కలిసి మెడికల్ సిండికేట్ మాఫియాలా నడుస్తున్నాయని బహిరంగ రహస్యమే. కరోనా సమయంలో సైకిళ్లపై తిరిగి వైద్యం చేసిన ఆర్ఎంపీలు ఇప్పుడు ఖరీదైన కార్లలో తిరుగడమే ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

జగ్గాపురంలో బాలిక మృతి ఒక ఉదాహరణ మాత్రమే...

ఆర్ఎంపీ వైద్యం ఎంత ప్రమాదకరమో జగ్గాపురం బాలికకు ఇటీవల యడ్లపాడులో జరిగిన విషాదకర ఘటన నిదర్శనంగా నిలుస్తుంది. బొంతు కోటేశ్వరరావు కుమార్తె శాలిని(9) అనే బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ సమస్య ఉండగా ఎలాంటి పరీక్షలు లేకుండా వైద్యం చేయడంతో బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. విచారణకు వెళ్లిన వైద్యాధికారులే అక్కడి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారంటే అర్థం చేసుకోవచ్చు. ఇది బాలిక కుటుంబ సభ్యులు ఆందోళన చేయడంతో బయటపడింది. అలా చేయకుండా సెటిల్‌మెంట్‌లతో వెలుగు చూడని సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు ఆర్‌పీఎం సంఘాలు, మెడికల్ అండ్ డ్రగ్గిస్ట్ యూనియన్లు రంగంలోకి దిగి వివాదాలను సద్దుమణిగేలా చూస్తాయి. వీటిపై నిత్యం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారంటూ ప్రజల నుంచి విమర్శలు వినవస్తున్నాయి.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం మేరకు ఆర్ఎంపీలు ప్రిస్క్రిప్షన్స్ రాయటం, ఇంజక్షన్లు చేయడం, సెలైన్స్ పెట్టడం వంటి ఇన్‌ఫెషెంట్ సేవలు అందించరాదు. ప్రథమ చికిత్సకు సర్టిఫికెట్ ఉండాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆర్ఎంపీలపై చర్యలు తప్పవు. జగ్గాపురంలో బాలికకు వైద్యం వికటించి ఆస్పత్రిలో చేరినట్లు తెలియగానే యడ్లపాడులోని సదరు మెడికల్ షాపును మూత వేయించాం. నిర్వాహకుడిపై కేసు నమోదైంది.

– బి రవి, జిల్లా వైద్యాధికారి పల్నాడు

డ్రైడేతో డెంగీ నివారణ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: డెంగీ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ పనికిరాని వస్తువులు, తొట్లలో ఉండే నీటిని పూర్తిగా మార్చాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ డెంగీ వ్యాధి వైరస్ వలన ఒకరి నుంచి మరొకరికి ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా వస్తుందన్నారు. ఈ దోమ మంచినీటిలో పెరుగుతుందన్నారు. ఇళ్లలో నిల్వుండే మంచినీటిలో గుడ్లు పెట్టి తన సంతానాన్ని వృద్ధి చేస్తాయన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా పిల్లలకు కాళ్లు, చేతులు కప్పేలా పూర్తిగా డ్రస్

పచ్చజెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

వేయాలని, పడుకునే సమయంలో దోమతెరలు తప్పకుండా వాడటం చేయాలని సూచించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే చికిత్స చేయించుకోవాలని అన్నారు. తొలుత కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ రాజేశ్వరి, ఏఎంఓ చుక్కా వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో అంతర్జాతీయ సహకార కార్యక్రమాలు

నరసరావుపేట రూరల్: జిల్లాలోని అన్ని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయాల్లో అంతర్జాతీయ సహకార దినోత్సవ కార్యక్రమాలు సందర్భంగా మోడల్ ఆడిటింగ్, స్వచ్ఛత, మెంబర్‌షిప్ డ్రైవ్, పాఠశాలలలో సహకార సంఘాలపై అవగాహన సదస్సులు, సహకార సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2025వ ఏడాదిని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించి ఉన్నందున ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు సహకార ఉద్యమ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సబ్ డివిజనల్ సహకార అధికారి స్వర్ణ చినరామిరెడ్డి , సంఘ సీఈఓ కంటు శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల నగదు మాయం

సుమారు రూ.9.5 లక్షలుగా లెక్క తేల్చిన అధికారులు

యడ్లపాడు: సామాజిక పింఛన్ల నిధులు గోల్‌మాల్ అయిన విషయం వెలుగు చూసింది. యడ్లపాడులో గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సిన రూ.9.5 లక్షల పింఛన్ నగదును తిరిగి జమ చేయక పోవడంతో అధికారులు ఆరా తీయడంతో విషయం బయటకు వచ్చింది. గత నాలుగు నెలలుగా తన సొంత అవసరాలకు వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం, ప్రతినెలా పింఛన్లు పంపిణీ చేసిన తర్వాత, పంపిణీ కాని మొత్తాన్ని 7వ తేదీలోపు ప్రభుత్వ ఖాతాకు తిరిగి జమ చేయాలి. సచివాలయాల పరిధిలో ఈ బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్‌లదే. అయితే, సదరు అసిస్టెంట్ ఈ నిబంధనలను ఉల్లంఘించి, గత నాలుగు నెలలుగా పంపిణీ కాని పింఛన్ నగదును జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు.

బయటపడిందిలా..

నాలుగు రోజుల క్రితం ఈ విషయంపై డీఆర్డీఏ అధికారులు ఎంపీడీఓకు సమాచారం అందించారు. ఎంపీడీఓ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిధుల జమ ఆలస్యంపై ప్రశ్నించగా, సాంకేతిక లోపాల కారణంగా అప్‌డేట్ కావడం లేదని బుకాయించాడు. దీంతో ఎంపీడీఓ జిల్లా కార్యాలయానికి వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. అయితే, జిల్లా కార్యాలయానికి వెళ్లి తాను కట్టినట్టుగా చూపించిన చలానాలు నకిలీవిగా తేలడంతో అసలు బండారం బయటపడింది. వెంటనే ఆ మొత్తాన్ని చెల్లించాలని అధికారులు సదరు అసిస్టెంట్‌ను ఆదేశించారు.

ఈ విషయమై ఎంపీడీఓ వి. హేమలతాదేవిని వివరణ కోరగా పింఛన్ల నగదు ప్రభుత్వ ఖాతాకు జమచేయని విషయం వాస్తవమే అన్నారు. సొంతానికి వాడుకున్న నగదు జమ చేయాలని జిల్లా అధికారులే వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	47,085
అమ్మకాలు	45,592
నిల్వ	8,935

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,700
నంబరు–5	రూ. 10,000 – 13,420
341	రూ. 10,000 – 13,300

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,700
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
ఆర్మూర్	రూ. 9,700 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 12,800
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,300
4884	రూ. 10,000 – 12,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,800
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 754

కొమ్ములు : 565 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,625	10,350	10,200

కాయలు : 155 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,625	10,400	10,175

మొత్తం అమ్మకాలు : 565.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

గ్రానైట్ లారీలు పట్టివేత

- బిల్లులు లేకుండా తరలింపు
- స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ గ్రానైట్ లారీలు
- కమర్షియల్ టాక్స్ అధికారుల మెరుపు దాడులు
- అదుపులోకి తీసుకున్న గ్రానైట్ లారీలు నడికుడి మార్కెట్ యార్డ్‌లో
- విలువను బట్టి పన్ను, జరిమానా వేస్తామన్న అధికారులు

పిడుగురాళ్ల బైపాస్ రోడ్డులో కమర్షియల్ టాక్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ లారీలు

పిడుగురాళ్ల: బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ లారీలను జీఎస్టీ, కమర్షియల్ టాక్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి లారీలను తనిఖీ చేసే కార్యక్రమం పట్టణంలోని బైపాస్ రోడ్డుపై నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొండమోడు నుంచి దాచేపల్లి వైపు వెళుతున్న నాలుగు గ్రానైట్ లోడ్ లారీలను గుర్తించి పట్టుకున్నారు. ఈ గ్రానైట్ లారీలకు సంబంధించి ఎటువంటి బిల్లు లేకపోవడం, సామర్థ్యాన్ని మించి లోడుతో రవాణా చేయటం నిర్వహించడంతో ఈ నాలుగు లారీలను అదుపులో తీసుకున్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వి.భార్గవ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేపట్టామని అందులో నాలుగు గ్రానైట్ లారీలు బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నాయని వాటిని గుర్తించామన్నారు. వీటిని అదుపులో తీసుకొని నడికుడి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఉంచినట్లు తెలిపారు. గ్రానైట్ లోడును బట్టి, గ్రానైట్ విలువను అంచనా వేసి ఆ తరువాత పన్నుతోపాటు అపరాధ రుసుం కూడా విధిస్తామని చెప్పారు. అలాగే లెక్కలు చూసి టాక్స్, ఫైన్ వేయాల్సి ఉంటుందని దానికి కొంత సమయం పడుతుందని వివరించారు. బిల్లులు లేకుండా ఓవర్ లోడ్ తో గ్రానైట్ లారీలు వెళితే అటువంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. అక్రమంగా బిల్లులు లేకుండా గ్రానైట్ లారీలు తరలిస్తే వాటిని అదుపులోకి తీసుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ దాడుల్లో జీఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం రవికుమార్, జీఎస్టీవో టి పీటర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

చిలకలూరిపేట: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గతంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని పిలుపు నిచ్చిన టీడీపీ ఇప్పుడు అదాని మేలు కోసం స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విధానంతో పాటు సర్దుబాటు చార్జీల విధానాన్ని తొలగించాలని కోరారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలందరిపై భారం పెరుగుతుందని, ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకున్నా, బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సహాయ కార్యదర్శి బొంతా దానియేలు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, మహిళా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో గొప్ప ప్రయోజనాలు

- పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ
- కొత్తపాలెంలోని ప్రకృతి సాగు పంటల పరిశీలన
- ప్రకృతి సాగు పద్ధతి ప్రయోజనాలపై అవగాహన

ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ

యడ్లపాడు: ప్రకృతి సాగు విధానంతో గొప్ప ప్రయోజనాలు ఉన్నాయని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ. బి తెలిపారు. ప్రకృతి విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారితో కలిసి కొత్తపాలెం గ్రామంలో మంగళవారం పర్యటించారు. రసాయనాలు లేని, సహజసిద్ధ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులు మానం శ్రీనివాసరావు, ఐనం హరిబాబు, మానం మణింద్ర, నిక్కి తిరుపతిరావు, దమ్ము నాగజ్యోతి పంట పొలాలను పరిశీలించారు. వారు సాగు చేసిన బహుళ రకాల పంటలు, అంతర పంటలను చూసి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మునగ తోటలో దొండ, కాకర, సొర, కనకాంబరం, అరటి తోటలో తీగజాతి దోసను, నిమ్మతోటలో కరివేపాకును అంతర పంటగా వేయడాన్ని గమనించారు. వినూత్న పద్ధతిలో సాగు చేసిన తీరు, ఎక్కువ దిగుబడుల్ని సాధిస్తూ.. అన్నింటికీ మించి అధిక లాభాలను ఆర్జిస్తున్నామని తెలపడంతో స్థానిక రైతుల్ని ఆమె అభినందించారు.

పురుగు మందుల ఖర్చు తక్కువ..

ప్రకృతి వ్యవసాయ విధానంతో కౌలు రైతుకు మంచి దిగుబడి, రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. సహజ సిద్ధంగా పండించే ఉత్పత్తుల ద్వారా కౌలురైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. అయితే వారికి కౌలుకు ఇచ్చిన భూయజమానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సాగు విధానం చేయడం వలన నేల సారం వృద్ధి చెందుతుందన్నారు. రైతులు తమ భూముల్ని కౌలుకు ఇచ్చే సమయంలో ప్రకృతి సేద్యం చేసేవారికి మాత్రమే ఇచ్చే ఒప్పందం చేసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు సిబ్బంది సౌజన్య, అప్పలరాజు, నందకుమార్, స్వాతి, బేబీ రాణి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

క్షుద్రపూజల కలకలం

బల్లికురవ: మూడు రోడ్ల కూడలిలో అర్ధరాత్రి క్షుద్రపూజలు చేయడంతో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బల్లికురవ–అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్‌లోని కొమ్మినేనివారిపాలెం, వలపర్ల వెళ్లే క్రాస్ రోడ్డు జంక్షన్‌లో సోమవారం అర్ధరాత్రి ఆగంతకులు గుమ్మడికాయలు, కుంకుమ, పసుపు పూలతో పూజలు నిర్వహించారు. మంగళవారం ఆ మార్గంలో వెళ్తున్న వారంత ఇవి దాటి వెళ్లాలంటే ఏ ప్రమాదం ముంచుకువస్తోందని భయాందోళన చెందారు. ప్రతి నిత్యం ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఇలాంటి క్షుద్రపూజలు చేస్తున్నారని వాటిని అరికట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

18 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాడికొండ: అక్రమంగా నిల్వ చేసిన 18 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్‌లైస్ అధికారులు పట్టుకున్న ఘటన మండల కేంద్రమైన తాడికొండలో జరిగింది. వివరాల ప్రకారం తాడికొండ చెరువు కట్టపై రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సీఎస్ డీటీ దేవరాజు, ఆర్ఐ హనుమంతరావుల ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించగా 35 కిలోల తూకం కలిగిన 18 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. దీనిపై విచారించగా తాడికొండకు చెందిన గుర్రపుశాల ఆనంద్ అనే వ్యక్తి కొనుగోలు చేసి నిల్వ చేసినట్లు స్థానికులు తెలపగా అతనిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదవీ విరమణ మొత్తాలను చెల్లించాలి

ఈయూ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు

నరసరావుపేట: ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రావాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సెటిల్మెంట్ మొత్తాలను వెంటనే ప్రభుత్వం చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీలో 36 ఏళ్లు డ్రైవర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.కోటేశ్వరరావు అభినందన సభ డిపో ఆవరణలో మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన దామోదరరావు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్యసౌకర్యాలు కల్పించేందుకు విలీనంకు ముందున్న రెమ్స్ స్కీమ్ కల్పించాలని, అదేవిధంగా 11వ పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్స్ కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. డిపో కార్యదర్శి చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా మాజీ డీపీటీఓ యన్‌వీ. శ్రీనివాసరావు, డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు యూనియన్ రాష్ట్ర నాయకులు యం.హనుమంతరావు, కె.నాగేశ్వరరావు, యం.డి.ప్రసాద్, జి.నారాయణరావు, కృష్ణారావు, కోటేశ్వరరావు, జోనల్ నాయకులు వాకా రమేష్, బాబు సామ్యూల్, బెజవాడ రవి, జిల్లా అధ్యక్షులు ఖాజా, కార్యదర్శి జి.తిరుపతిరావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరిముల్లా, విజయ్‌కుమార్, బాపట్ల జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అన్ని డిపోల నాయకులు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

మాట్లాడుతున్న దివ్యాంగ జిల్లా నాయకుడు చల్లా రామయ్య

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తోందని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు, సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.13 వేలే తల్లుల ఖాతాల్లో వేయటం విడ్డూరంగా ఉందన్నారు. కొంత మంది తల్లులకు అర్హత ఉన్నా పథకం వర్తించకపోవటంతో సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇంటి వద్దకు వచ్చే రేషన్‌ను తొలగించి దివ్యాంగులకు, వృద్ధులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన జీఎస్టీ

- సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సుజిత్ మల్లిక్
- ఘనంగా జీఎస్టీ దినోత్సవం

జ్యోతివెలిగిస్తున్న సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సుజిత్ మల్లిక్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : జీఎస్టీతో దేశం ప్రగతి పథంలో దూసుకువెళుతుందని, జీఎస్టీ అమలు మంచి ఫలితాలు ఇచ్చిందని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ అన్నారు. జీఎస్టీ ఏర్పడి ఎనిమిది ఏళ్లు పూర్తియైన సందర్భంగా మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాలులో జరిగిన జి.ఎస్.టి దినోత్సవ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ చెల్లించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. జి ఎస్.టి చెల్లించటం గౌరవప్రదంగా భావించాలని సూచించారు. దేశ పౌరులు, వ్యాపారస్తులు చెల్లించే వస్తుసేవల పన్ను దేశ నిర్మాణానికి, దేశ సౌభాగ్యానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో జీఎస్టీ ప్రారంభమైన ఏడాది రూ.2,850 కోట్లు ఆదాయం సమకూరగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.7,300 కోట్లు ఆదాయం లభించిందన్నారు. అలాగే గుంటూరులో జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల సంఖ్య ప్రారంభంలో 19 వేల మంది ఉండగా, ఇప్పుడు 75 వేల మందికి చేరారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ జీఎస్టీతో దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎఫ్టానిక్స్ ఎం.డి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ లో వచ్చిన సాంకేతిక సమస్యలు, సందేహాలు వీడాయన్నారు. సి.పి.డబ్లు.డి చీఫ్ ఇంజినీర్ ముక్కామల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా అత్యధిక ఆదాయం వస్తున్నప్పటికీ జీఎస్టీ కార్యాలయాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, సొంత భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం అత్యధిక పన్ను చెల్లింపుదారులను సత్కరించి, మెమోంటోలు బహూకరించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేశారు.కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, జాయింట్ కమిషనర్ రెజ్వాని, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.రవి కుమార్, మరియదాసు సూపరింటెండెంట్లు ఆర్.పి.పి.కుమార్, యుగంధర్, గాదె శ్రీనివాసరెడ్డి, సురేష్ మణి చిట్టెం వెంకటేశ్వరరావు, పూర్ణ సాయి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్సిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

PLOT FOR SALE

■నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES

GOLD FINANCE

■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■గుంటూరు, అద్దంకి సమీపంలో గల కళ్యం టెక్స్‌టైల్స్‌లో లేడీగార్డు, సెక్యూరిటీ గార్డు, హెడ్‌గార్డు కావలెను. ఉచిత వసతి సబ్సిడీ భోజన సదుపాయం. ✆ 9848091341, 9346176356

■NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357

■శ్రీ శాంతి హోమ్‌కేర్స్‌లో తెనాలి, గుంటూరు, రేపల్లె లో పనిచేయుటకు నర్సులు, కేర్‌టేకర్స్ కావలెను. జీ: 17000/– సంప్ర: 96184 85329

■Wanted experienced, dedicated & hardworking teacher's to teach nursery - 2nd class mother teachers - 6 members & 3rd - 8th class (all subjects) - 8 members. GKR High School, A.T. Agraharam, 9th lane, opp water tank Guntur. ✆ 9885028725, 9959127256

■Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241

■Wanted Local, boys/girls for jewellery shop, experience in sales must., Contact: 9848333267

■Wanted High School, Biology, Physics, Hindi, Social, PET, Computer Operator and mother teachers. Sri Vidhya High School, NGGO's colony, Gnt. 9701022900

■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838

■ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు. కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. ఫోన్: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల

నరసరావుపేట ఈస్ట్: పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలను రీడర్స్ ఆన్ డిమాండ్ అనే పద్ధతి ద్వారా వెంటనే కొనుగోలు చేసి గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. అలాగే వారికి అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. పల్నాడు రోడ్డులోని శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం గోనుగుంట్ల ఆకస్మికంగా సందర్శించి పాఠకులకు అందుతున్న వసతులు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఇతర గ్రంథాల వివరాలు పరిశీలించారు. పాఠకులతో మాట్లాడి గ్రంథాలయం అందిస్తున్న సౌకర్యాలు, పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. గ్రంథాలయ సెస్సు బకాయిలు వెంటనే విడుదల అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. పాఠకులు అడిగిన మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ వాచ్‌ఉమెన్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న సాకిరెడ్డి శివపార్వతిని సత్కరించి ఆమె సేవలను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, సిబ్బంది జె.కృష్ణ, వై.సునీల, పాఠకులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెందాడు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలో చుండూరు నిడుబ్రోలు స్టేషన్ల మధ్య సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు నుంచి పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్ల కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జలజీవన్ మిషన్ తీరుపై విచారణ

గుంటూరు వెస్ట్: వర్షపు నీటిని వడిసి పట్టడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతి పరిశీలించడానికి కేంద్ర జల శక్తి శాఖ పరిశీలకులు కిరణ్‌కుమార్ కర్లపు, రేష్మి పిళ్లైతో కూడిన అధికారుల బృందం రెండు రోజులుగా జిల్లాలో పర్యటించింది. పలు ప్రాంతాల్లో స్థానికులతో మమేకమై ప్రభుత్వ విధానాలను ప్రశ్నించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా చేపడుతున్న ఫారం ఫాండ్, వాననీటి సంరక్షణ, నిర్మాణాలు, అమృత్ సరోవర్లు, నర్సరీలు, పండ్లు, పూలతోటలు పెంపకం, తదితర విషయాలను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో చేపడుతున్న పనులు బాగున్నప్పటికీ వాటిని వెబ్‌సైట్‌ల్లో ఫొటోలు అప్‌లోడు చేయకపోవడం వల్ల పురోగతి మార్గాలు కనిపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా అధికారులు నడుచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రుతుపవనాలు రావడానికి ముందు, తరువాత నీటి లభ్యతను లెక్క వేయడంలో భాగంగా రానున్న అక్టోబరు నెలలో మరోసారి జిల్లాలో పర్యటిస్తామన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తోపాటు, సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు.

కారు డ్రైవర్‌కు రెండేళ్లు జైలు శిక్ష

గుంటూరు లీగల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు 5వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కోలారు లత మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021లో పేరేచర్ల జంక్షన్ వద్ద భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు డ్రైవర్ మాలంపాటి శ్రీకాంత్ రెడ్డి ఢీకొట్టాడు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గుంటుపల్లి వెంకటేశ్వరరావు మృతిచెందగా, ఆయన భార్య తీవ్రగాయాలపాలైంది. ఈఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షాధారాలతో జిల్లా ఐదో అదనపు సివిల్ కోర్టులో సమర్పించగా, పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి కె.లత ముద్దాయికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ఏపీపీ ఎ.పవన్ కుమార్, కోర్టు పర్యవేక్షణ అధికారి సీఐ నరసింహారావు , అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై నరహరిలను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

'మిషన్ ఉన్నతి'తో రైల్వే ఉద్యోగులకు మేలు

లక్ష్మీపురం: ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంచడానికి, కార్యాచరణ కొనసాగింపునకు ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుంటూరు డీఆర్ఎం సుథేష్ణ సేన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పట్టాభిపురం కార్యాలయంలో మంగళవారం 'మిషన్ ఉన్నతి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీలను అర్హత కలిగిన ఉద్యోగులతో భర్తీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మిషన్ ఉన్నతి కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించేలా కీలకమైన స్థానాలను భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పదవీ విరమణ చేసే ఉద్యోగులు స్వయంగా వారి జూనియర్లకు పదోన్నతి ఉత్తర్వులను అందజేయిస్తున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలో ఆయా విభాగాలలో ఆరుగురు సిబ్బంది ఉద్యోగ విరమణ పొందగా వారి చేతుల మీదుగా వారి తరువాత విధులు నిర్వహించే సిబ్బంది పదోన్నతులు పొందడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్ పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నరసరావుపేట బ్రాంచ్ (0884), నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601.

స్థిర/చరాస్తుల ఇ-వేలం అమ్మకం కొరకు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు)/తనఖాదారు(లు)కు నోటీసు ద్వారా తెలియజేయునదేమనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట బ్రాంచ్(0884), పల్నాడు జిల్లా వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించినవిధంగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించటమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తము హౌసింగ్ టర్మ్ లోను నెం.38326046150కు ది.29-04-2024 నాటికి రూ.6,09,831/- (అక్షరాల ఆరు లక్షల తొమ్మిది వేల ఎనిమిది వందల ముప్పైఒక్క రూపాయలు మాత్రము) ప్లస్ తదుపరి జమకూడు వడ్డీ ప్లస్ ఖర్చులు మరియు అనుకోకుండా సంభవించు ఇతర ఖర్చులు /ఛార్జీలతో రాబట్టుకొనేందుకు ఇ-వేలం ద్వారా ది.21-07-2025న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.
ఋణగ్రహీత : 1) శ్రీ షేక్ బాజి, తండ్రి: బహదూర్ సాహెబ్, డోర్ నెం.5-4-6-3/2, పనసతోట, నరసరావుపేట, పల్నాడు జిల్లా సహ-ఋణగ్రహీత : 2) శ్రీ షేక్ నాగూర్ వలి, తండ్రి: బహదూర్, డోర్ నెం.5-4-6-3/2, పనసతోట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

స్థిరాస్తి వివరములు :
ఆస్తి యజమాని పేరు: షేక్ బాజి, తండ్రి: బహదూర్ సాహెబ్
ది.15-03-2019 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.3816/2019 ప్రకారం పల్నాడు జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా మరియు యస్‌ఆర్‌ఒ, నరసరావుపేట మునిసిపల్ పరిధిలోని నాగూర్‌వలి టాకీస్‌కి దక్షిణంవైపు, పనసతోట, 1వ లైను, నవత ట్రాన్స్‌పోర్ట్ ఎదురు బజార్, నరసరావుపేట మునిసిపల్ పాత వార్డు నెం.3, కొత్త వార్డు నెం.4, పాత సర్వే డి.నెం.362, టి.యస్.నెం.910, బ్లాక్ నెం.2/18, అసెస్‌మెంట్ నెం.1024013349, డోరు నెం.15-4-9 నందు షేక్ బాజి, తండ్రి: బహదూర్ సాహెబ్‌కు చెందిన $35^{1}/_{4}$ చ॥గ॥లు లేదా 29.4 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: మొహమ్మద్ ఇమాంబి ఉమ్మడి గోడ స్థలం యొక్క ఆస్తి 7'.$6^{3}/_{4}$", దక్షిణం: చీరాల నాగయ్య ఉమ్మడి గోడ స్థలం యొక్క ఆస్తి 41'.9", పడమర: మునిసిపల్ రోడ్డు 7'.7", ఉత్తరం: పఠాన్ జిలాని ఉమ్మడి గోడ స్థలం యొక్క ఆస్తి 41'.9".

రిజర్వు ధర: రూ.6,90,030/- ధరావత్తు: రూ.69,003/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-
ఇ-వేలం తేది : 21-07-2025 సమయం : ఉ. 11.00 గం॥ల నుండి సా॥. 04.00 గం॥ వరకు
ధరావత్తు మరియు కెవైసి డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది & సమయం : 19-07-2025, ఉ॥11.00 గం॥ల లోపు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
విజయవంతమైన పాటదారు యొక్క ధరావత్తు పార్ట్ సేల్‌గా పరిగణించబడుతుంది మరియు విజయవంతం కాని పాటదారు యొక్క ధరావత్తు తిరిగి చెల్లించబడుతుంది. ధరావత్తు సొమ్ముకు ఎటువంటి వడ్డీ చెల్లించబడదు. విజయవంతమైన పాటదారు అధీకృత అధికారి బిడ్ ధరను అంగీకరించిన 24 గం॥లలోపు అప్పటికే చెల్లించిన ధరావత్తు మినహాయించి అమ్మకపు ధరలో 25% జమచేయవలెను మరియు మిగిలిన 75% అమ్మకం జరిగిన 15వ రోజు లేదా అంతకంటే ముందుగా లేదా అధీకృత అధికారి వ్రాతపూర్వకంగా అంగీకరించిన పొడిగించిన వ్యవధిలోపు మరియు వారి అభీష్టానుసారం డిపాజిట్ చేయవలెను. విజయవంతమైన పాటదారు చెల్లింపులో విఫలమైనట్లయితే ఆఫర్ ద్వారా ఇప్పటికే జమచేయబడిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఆస్తిని తిరిగి వేలానికి ఉంచబడుతుంది మరియు విఫలమైన ఋణగ్రహీతకు ఆస్తిపై ఎటువంటి హక్కు ఉండదు.
ఇ-వేలం అమ్మకం బ్యాంక్ వారు సూచించిన నియమాలు/షరతులకు లోబడి ఉంటుంది మరియు ఎటువంటి కారణాలు తెలుపకుండానే ఏదైనా/అన్నీ ఆఫర్‌లను అంగీకరించుట లేదా తిరస్కరించుటకు బ్యాంకు వారికి హక్కు కలదు.
ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించడానికి, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్‌ను సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియ, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్ పోర్టల్: https://ebkray.in/eauction-psb/baanknet.com/bidder-registration మరియు ఫోన్: +8291220220 మరియు ఆస్తి వివరముల కొరకు చీఫ్ మేనేజర్, శ్రీ మల్లెల అమరేంద్ర, మొబైల్ నెం.9000962040, ఇ-మెయిల్ ఐడి: sbi.00884@sbi.co.in (లేదా) బ్యాంక్‌చే ఆమోదించబడిన రిజల్యూషన్ ఏజెన్సీ మెస్సర్స్ మురాల ఏజెన్సీస్, ఫోన్: 9966393649 & 8885556787 నందు ఆఫీసు పని వేళలలో సంప్రదించవచ్చును.
ప్రదేశం : నరసరావుపేట, సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
తేది : 30-06-2025 నరసరావుపేట బ్రాంచి, నరసరావుపేట.

సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 2 । జూలై । 2025

కొంతమందికే ప్రోత్సాహకం..!
మాతాశిశు సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కారు గొప్పలు చెబుతోంది, కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. - 8లో

కళ్లకు గంతలతో నిరసన
జిందాల్ పరిశ్రమ కళ్లు మూసి జెల్ల కొట్టిందని, తడి గుడ్డతో రైతుల గొంతు కోసిందని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. - 8లో



సోషల్ మీడియా వరమా? శాపమా?
సోషల్ మీడియా ఇప్పుడు మనిషి నిత్యకృత్యాల్లో ఓ భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. - 8లో

న్యూస్‌రీల్

ఇసుక ర్యాంప్ పరిశీలన

నేరడి ఇసుక ర్యాంపు పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాస్

భామిని: మండలంలోని నేరడి బీ – బిల్లుమడ గ్రామాల మధ్య వంశధార నదీ తీరంలో నిర్వహించాల్సిన ఇసుక ర్యాంప్ స్థలాన్ని జిల్లా భూగర్భ గనులశాఖ ఏడీ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటికే నేరడి – బిల్లుమడ గ్రామాల మధ్య ఇసుక ర్యాంపు నిర్వహణకు ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసిన నేపథ్యంలో భూగర్భ గనుల అధికారుల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

చిన్నబగ్గ కొండ శిఖరాన గజరాజులు

చిన్నబగ్గ కొండల్లో ఉన్న ఏనుగులు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ కొండ శిఖర గ్రామాల్లో మంగళవారం ఏనుగుల గుంపు సంచరించింది. కొండదిగువన ఉన్న ఏనుగుల గుంపు కొండపైకి వెళ్లడంతో చిన్నబగ్గ పరిసర ప్రాంతాల గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. ఏ క్షణాన మళ్లీ కొండ దిగి వచ్చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ ట్రాకర్లు ఏనుగుల గమనాన్ని పరిశీలించి గిరిజనులను అప్రమత్తం చేస్తున్నారు.

గిరిజన యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

- 8, 9 తేదీల్లో ఓపెన్ కౌన్సెలింగ్

ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ఇన్‌చార్జి వీసీ, గిరిజన వర్సిటీ

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 8, 9వ తేదీల్లో ఓపెన్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ షెడ్యూల్‌లో 8వ తేదీన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంబీఏ, 9వ తేదీన పీజీ ఇంగ్లిష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా యూనివర్సిటీకి హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ 'సీటీయూఏపీ.ఏసీ.ఐఎన్'ను సందర్శించాలన్నారు.

మద్యంమత్తులో దొరికిన దొంగ



మద్యంమత్తులో దొంగ తనం చేసిన ఇంటిలోనే నిద్రపోతున్న కృష్ణ

బొబ్బిలి: ఓ ఇంటిలో ఐదు రోజులుగా దొంగతనం చేస్తూ అదే ఇంటిలో మద్యం మత్తులో నిద్రపోయిన దొంగను బొబ్బిలి పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బొబ్బిలి పట్టణం గొల్లపల్లి అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్న శీర శ్రీనివాసరావు వ్యవసాయ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల కిందట స్వగ్రామమైన అలజంగి వెళ్లారు. ఈ విషయాన్ని కనిపెట్టిన పిరిడి గ్రామానికి చెందిన కె.కృష్ణ ఆ ఇంటిలోకి ప్రవేశించాడు. ఇంటిలో ఉన్న వెండి, ఇత్తడి సామాన్లు దొంగిలించి విక్రయించడం, కొనకపోతే తాకట్టు పెట్టడం చేసి మద్యం కొనుగోలు చేసి ఆ ఇంట్లోకే వెళ్లి తాగుతూ, తింటూ గడిపాడు. ఐదు రోజులుగా ఇదే తంతు జరుగుతోంది. ఇంటి యజమాని మరో రెండు రోజులు రాడనుకున్నాడో ఏమో మంగళవారం కూడా మరికొన్ని సామాన్లు విక్రయించి పూటుగా మద్యం తాగి ఎప్పటివలే చల్లగా ఉందని ఇంటి గచ్చుపై నిద్రపోయాడు. స్థానికులు దొంగను గుర్తించి అలజంగిలో ఉన్న శ్రీనివాసరావుకు సమాచారమందించారు. ఈ లోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారమందుకున్న ఎస్‌ఐ ఆర్.రమేష్ కుమార్ తన సిబ్బందితో వచ్చి దొంగను పట్టుకున్నారు. అప్పటికే నిద్రమత్తులో ఉండడంతో పిరిడిలోని కృష్ణ ఇంటికి ఫోన్ చేశారు. అతడిని ఇంటికి పంపొద్దంటూ కుటుంబ సభ్యులు తిరిగి పోలీసులను వేడుకోవడం గమనార్హం. కేసు నమోదు చేయడమా, లేదంటే దొంగకు కౌన్సెలింగ్ ఇవ్వడమా అన్నది బుధవారం తేల్చుతామని ఎస్‌ఐ తెలిపారు.

ఏడాదిలో ఏం చేశాం..
ఎలా చూపించాలి మొఖం!

- ప్రజాప్రతినిధులు, కూటమి నేతల్లో అంతర్మథనం
- 'సుపరిపాలన' అంటూ నెల రోజులపాటు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించాలంటున్న చంద్రబాబు
- నిలదీతలు ఎదురవుతాయేమోనని స్థానిక నేతల్లో భయం

సాక్షి, పార్వతీపురం మన్యం: ఎన్నికల్లో గెలిచి ఏడాదవుతున్నా.. ఏ ఎమ్మెల్యే కూడా పల్లె గడపకు వెళ్లి ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవు. నాడు లెక్కకు మించి హామీలిచ్చి.. ఒక్కటీ నెరవేర్చిన ఆనవాళ్లు కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ సంవత్సర కాలంలో చేసిన 'సుపరిపాలన'ను ఈ నెల 2వ తేదీ బుధవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. నెల రోజులపాటు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులందరూ ప్రతి గడపకూ వెళ్లి, అక్కడి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని అంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్‌నూ సిద్ధం చేశారు. మరోవైపు ఏం చేశామని ప్రజల వద్దకు వెళ్లగలమని నాయకులు వాపోతున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ఎమ్మెల్యేల దందా అధికమైంది. ప్రతి పనికీ ఒక 'రేటు' కట్టేశారు. ఇసుక, వైన్స్, మైనింగ్.. ఇలా ఏదీ తేడా లేకుండా వాటాలు కొట్టేస్తున్నారు. ప్రభుత్వ, పేదల భూములను అప్పనంగా కాజేస్తున్నారు. కబ్జాలు, బెదిరింపులు పెరిగిపోయాయి. మరోవైపు ఇంటింటికీ అందిస్తామన్న సంక్షేమానికి మంగళం పాడేశారు. గతేడాది తల్లికి వందనం పథకాన్ని పూర్తిగా ఎగ్గొట్టగా.. ఇటీవల విడుదల చేసిన మొత్తంలో భారీగా కోత పెట్టారు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం ఊసేలేదు. ఉచిత ప్రయాణం తుస్సుమంది. నిరుద్యోగ భృతి లేదు. నెలకు రూ.1,500 సాయం కానరాదు. మద్యాన్ని ప్రైవేట్‌పరం చేసి.. ఊరూరా లభించేలా చేశారు. విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ఊరికి దూరం పెట్టారు. దీంతో తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమికి జై కొట్టిన ఉద్యోగులు.. ప్రస్తుతం ప్రభుత్వం తీరుతో అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. బదిలీల్లో నాయకుల ఇష్టారాజ్యమైంది. రూ.లక్షలు వసూలు చేశారు. ఈ నేపథ్యంలో నాయకులకు ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే విషయం గ్రహించి కూటమి నేతలు కూడా భయపడుతున్నారు.

హామీ ఇచ్చారు.. విస్మరించారు

- సాలూరులో జీగిరాం జూట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మాటిచ్చారు.
- ఆటోనగర్‌ను పునఃప్రారంభించి, లారీ పరిశ్రమను ఆదుకుంటామని తెలిపారు.
- గత ప్రభుత్వ హయాంలో 85 శాతం నిర్మాణం పూర్తయిన వంద పడకల ఆస్పత్రిని ఏడాదైనా పూర్తి చేయలేకపోయారు.
- జగ్గుదొరవలసలో అక్కడి స్థానికులకు కులధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నెరవేర్చలేదు.
- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం చేపడతామని మంత్రిగా తొలి సంతకం కూడా సంధ్యారాణి చేశారు.
- మంత్రిగా వచ్చిన మొదటి రోజునే సాలూరు పట్టణంలో మహిళల ఆత్మగౌరవం కోసమని ఉపన్యాసాలిచ్చి.. పాడైన మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తామని చెప్పారు.
- మక్కువ–బాగువలస రోడ్డును పూర్తి చేస్తామన్నారు.
- డోలీల మోతే లేకుండా చేస్తామని తెలిపారు.
- గిరిజన విశ్వవిద్యాలయాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు.

చంద్రబాబు నుంచి స్థానిక నాయకుల వరకూ ఏం చెప్పారంటే...

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ సమక్షంలోనే స్థానిక నేతలు.. ప్రస్తుత ఎమ్మెల్యేలు గత ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చారు. అందులో ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయారు. దీనికి ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక వారంతా తల్లడిల్లుతున్నారు.

- 'కురుపాంలో చదువుకున్న బిడ్డలు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే వర్క్‌ఫ్రం హోం చేసుకునేలా ఏర్పాటు చేస్తా. నైపుణ్య కేంద్రాలు, స్కిల్ సెన్సర్స్ చేసి మిమ్మల్ని ఆదుకుంటా. ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తా.' అని గత ఎన్నికలకు ముందు చంద్రబాబు కురుపాం సభలో హామీ ఇచ్చారు.
- ఏనుగుల వల్ల పంటలు నాశనమవుతున్నాయి. దానికి పరిష్కారం చూపిస్తా.
- తోటపల్లి బ్యారేజ్ పాత ప్రధాన కాలువకు మిగులు జలాలు అందించి లిఫ్ట్ ద్వారా నీరందిస్తా.
- కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు నీరిస్తా. పూర్ణపాడు–లాబేసు మధ్య వంతెన ఏర్పాటు చేస్తా..
- కురుపాం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాలకు సాగునీరిందించడానికి గుమ్మడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం చేస్తా.
- గుమ్మలక్ష్మీపురం మండలంలో జీడి పరిశ్రమ ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ఇప్పిస్తా.
- జీవో నంబరు 3 రద్దు చేస్తానని హామీ ఇస్తున్నా.
- 'ఎంపీ గీతకు కమలం పువ్వు, ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరికి సైకిల్‌గుర్తుపై ఓటేసి గెలిపించే బాధ్యత మీది. మీ సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత నాది' అంటూ స్వయంగా చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఇందులో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారు.



జంపరకోట మినీ జలాశయ ప్రాంతం ఇదే

సెల్ఫీలకే పరిమితం

- పాలకొండలోనూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లతోపాటు.. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అనేక హామీలు గుప్పించారు.
- పాలకొండ మండలంలో జంపరకోట మినీ జలాశయం పూర్తి చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు. అక్కడికి వెళ్లి సెల్ఫీ కూడా తీసుకున్నారు.
- పాలకొండకు రైతుబజారు తీసుకొస్తానని చెప్పారు.
- తోటపల్లి కాలువల ఆధునీకీకరణ చేస్తామని రైతాంగానికి భరోసా ఇచ్చారు.
- నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్ది.. ఇక్కడ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని గట్టిగా.. గట్టిగా అంటూ చెప్పారు. ప్రధానంగా గిరిజన యువతకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

సమస్యల'పురం'

- పార్వతీపురం నియోజకవర్గం విషయానికి వస్తే.. జిల్లా కేంద్రంలో డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.
- తాగునీటి ఎద్దడి నివారణకు పరిష్కారం చూపుతామని ప్రకటించారు.
- డిగ్రీ చదువుకున్న 100 మందిలో 90 మందికి ఉద్యోగ అవకాశాల కల్పన
- ఇప్పుడున్న డిగ్రీ కళాశాలను పీజీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి, హాస్టల్ సౌకర్యం కల్పన
- జంఝావతి, ఆడారుగెడ్డ, వరహాలగెడ్డ ద్వారా రైతులకు సాగునీరు అందిస్తా..
- మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తాం అన్నారు. వీటిలో ఎన్నినెరవేర్చారో ప్రజలను అడిగితే చెబుతారు.

పార్వతీపురం పట్టణంలో డంపింగు యార్డు

అడుగుకో గొయ్యి.. రాకపోకలకు వర్రీ

పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. అడుగుకో గొయ్యితో అధ్వానంగా తయారైంది. రోడ్డుపై రాకపోకలకు వాహనదారులు నరకం చూస్తున్నారు. లారీ ఏ గొయ్యిలో ఉండిపోతుందోనని భయపడుతున్నారు. ఆర్తాం–స్వామినాయుడు రైల్వే గేటు మధ్యలో రోడ్డుపై ఉన్న భారీ గోతిలో మంగళవారం లారీ కూరుకుపోయింది. దీంతో కాసేపు వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు చేరుకుని జేసీబీ, క్రేనుల సహాయంతో లారీని పక్కకు తీసి రాకపోకలు క్రమబద్ధీకరించారు. రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వాహనదారులు, ప్రయాణికులు మండిపడుతున్నారు.

– కొమరాడ

విత్తుకు అదును కరువు!

వెదజల్లేందుకు అదునుకాని వీరఘట్టంలోని పొలాలు

- 15 రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు
- అదునుకాని పొలాలు
- సమయం మించిపోతుండడంతో ఆందోళనలో అన్నదాత

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌కు వాతావరణం సహకరించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏటా జూలై మొదటి వారానికి వరి నారుమడులు సిద్ధం చేసేవారు. జూలై నెలాఖరుకు 80 శాతం వరినాట్లు పూర్తయ్యేవి. మిగిలిన 20 శాతం ఆగస్టు 15 వరకు జరిగేవి. ప్రస్తుత వాతావరణంలో వింత పరిస్థితులు నెలకున్నాయి. గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో నారుమడుల్లో విత్తనాలు జల్లేందుకు అదును కుదరడంలేదు. వెదజల్లుదామన్నా తేమ ఎక్కువ కావడంతో దుక్కిచేయలేని పరిస్థితి. ఈ విపత్కర పరిస్థితుల నుంచి ఎప్పుడు గట్టెక్కుతామో తెలియక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు.

అనుకూలించని వాతావరణం

ఏటా ఆరుద్ర కార్తెలో రైతులు వరి విత్తనాలను వేసి నారుమడులు సిద్ధంచేస్తారు. ఈ ఏడాది జూన్ 22న ఆరుద్ర కార్తె ప్రారంభమైంది. ఈ కార్తెలో విపరీతమైన ఉక్కపోత ఉంటుంది. ఇలా 14 రోజుల పాటు ఉండే ఆరుద్రకార్తెలో నారుమడులు సిద్ధం చేస్తారు. అయితే, గడిచిన 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆరుద్రకార్తె సీజన్ ప్రభావం కనిపించ లేదు. వాతావరణం వరి నారుమడులకు అనుకూలించకపోవడంతో ఖరీఫ్‌కు ఎలా సన్నద్ధంకావాలో తెలియక రైతన్నలు దిగులు చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.75 లక్షల ఎకరాలు కాగా, ఆ మేరకు సాగు అవుతుందా లేదా అన్న బెంగ రైతులను వెంటాడుతోంది.

ఆందోళన వద్దు

ప్రస్తుతం వాతావరణం గత 15 రోజులుగా బాగాలేనందున రైతులు నారుమడులు, వెదజల్లేందుకు ముందుకు రాలేదు. అక్కడక్కడా కొద్దిగా వేసిన నారుమడుల్లో మొలకలు రాలేదనే విషయం తెలిసింది. వర్షం నిరంతరాయంగా కురుస్తుంటే విత్తనం కుళ్లిపోయి మొలకలు రావు. అదును ఇంకా ఉంది. ఆగస్టు 15 వరకు వరినాట్లు వేయవచ్చు.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

ఒక్క మొలక కూడా రాలేదు

నేను ఐదెకరాల్లో వరి సాగుకు సిద్ధమయ్యాను. రెండు బస్తాల విత్తనాలను నారుమడిలో జల్లాను. 15 రోజులుగా రోజూ వర్షం కురుస్తుండడంతో విత్తనాలు కుళ్లిపోయాయి. ఒక్క మొలక కూడా రాలేదు. ఏం చేయాలో అర్థంకావడంలేదు.

– డి.మహేష్,రైతు,వీరఘట్టం

20 కుంచాల విత్తనాలు వేశాను

ఏటా వరినాట్లు వేస్తున్నాను. ఈ ఏడాది కూడా వరి నారుమడి సిద్ధం చేసి 20 కుంచాల విత్తనాలను జల్లాను. ఇంకా మొలకలు రాలేదు. వాతావరణం చూస్తే రోజూ వర్షం పడుతూనే ఉంది. ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– కె.రమణ, రైతు, వీరఘట్టం

ఉపాధ్యాయుల నుంచి అక్రమ వసూళ్లు!

పార్వతీపురం రూరల్/పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో గత రెండు రోజులుగా ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ పాఠశాలలను కేటాయించారు. ఉద్యోగోన్నతి పొందిన 19 మంది ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇచ్చే సమయంలో రూ.6వేలు చొప్పున కొందరు అధికారులు డిమాండ్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. కొందరు ఉపాధ్యాయులు ఈ అంశంపై బహిరంగంగానే విమర్శిస్తుండడం గమనార్హం. రూ.6వేలకు బదులుగా రూ.5వేలు చొప్పున ముట్టచెప్పినట్టు తెలిసింది.

పింఛన్ డబ్బులు లబ్ధిదారులకే అందించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

చీరల వ్యాపారం చేస్తున్న మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పింఛన్ డబ్బులను నేరుగా లబ్ధిదారులకే అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సచివాలయ సిబ్బందికి సూచించారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు అందజేశారు. జిల్లాలో 1,40,982 మందికి రూ.60 కోట్లు నగదును పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం ఆయన అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మౌలిక వసతులు, ఆహారం, పిల్లల విద్యాభ్యాసన తీరుపై ఆరా తీశారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించిన కలెక్టర్ స్టోర్ రూమ్‌లో నిత్యావసర సరుకులు, కోడిగుడ్ల నిల్వల రికార్డులు నిర్వహణను పరిశీలించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అడ్డాపుశీలలోని స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తున్న వస్త్ర వ్యాపారాన్ని కలెక్టర్ పరిశీలించారు. మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలన్నారు. స్త్రీ నిధి నుంచి పొందిన రుణంతో వస్త్రవ్యాపారాన్ని నిర్వహించడం సంతోషదాయకమన్నారు.

సమాజంలో వైద్యులకు ప్రత్యేక స్థానం

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: సమాజంలో వైద్యునికి ప్రత్యేక స్థానం ఉందని, ప్రజారోగ్యమే ధ్యేయంగా అంకిత భావంతో వైద్య సేవలందజేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు కోరారు. జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో వైద్య సేవల నిర్వహణపై సమీక్షించారు. జిల్లాలో గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్న వారిని అభినందించారు. వైద్యవృత్తిలో అంకిత భావంతో పాటు సేవావృక్పథం అలవర్చుకుంటే ప్రజలకు మెరుగైన వైద్యం అందడమే గాక, మనకెంతో సంతప్తి నిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జగన్మోహన్, రఘు, వినోద్, నగేష్ రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి

ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి జరిమానా

మక్కువ: మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి సాలూరు జేఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై ఎం.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల మండల కేంద్రం మక్కువ సరిహద్దుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, 14 మంది వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడంతో కేసులు నమోదు చేశామన్నారు. మంగళవారం 14 మంది నిందితులను సాలూరు కోర్టులో హాజరుపరచగా, ఒక్కో వ్యక్తికి రూ. పదివేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. రెండవసారి మద్యం తాగి వాహనాలను నడిపి పట్టుబడితే, ఆ వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, జైలుశిక్ష పడే అవకాశం ఉందని న్యాయమూర్తి హెచ్చరించారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టపగలే చోరీ

- 2.5తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ధన్‌రాజు ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో 2.5 తులాల బంగారం లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. గ్రామంలో టిఫిన్ హోటల్ నడుపుతున్న ధన్ రాజ్ హోటల్‌లో బిజీగా ఉన్న సమయంలో ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో యువకుడి మృతి

సంతోష్‌కుమార్ (ఫైల్)

సీతంపేట: మండలంలోని చెక్కాపురం గ్రామానికి చెందిన మండంగి సంతోష్‌కుమార్ (31) పాముకాటుకు గురై మంగళవారం మృతిచెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విషసర్పం మెడపై కాటు వేయడంతో వెంటనే కుటుంబసభ్యులు దోనుబాయి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా అక్కడికి తీసుకువెళ్లేసరికి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సంతోష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దోనుబాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

యువతి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని రామవరం మధుర గ్రామం కరకవలస గ్రామానికి చెందిన చుక్క సత్యవేణి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బయట నుంచి వచ్చిన యువతి తండ్రి ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని తమ కుమార్తె వేలాడుతోంది. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. కడుపునొప్పి తాళ లేక తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తండ్రి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: పట్టణంలో 13 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని ఎరుకుల వీధిలో ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 13మంది పేకాటరాయుళ్లను పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.23,800, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొంతమందికే ప్రోత్సాహకం..!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణులకు జేఎస్‌వై లబ్ధి
- ఏప్రిల్ నుంచి జూన్ 26వరకు 1842 మంది ఆన్‌లైన్‌లో నమోదు
- 1232 మందికి మాత్రమే నగదు జమ
- ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిన కూటమి సర్కారు

ఘోషా ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలు

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు సంక్షేమానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది, కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలను ప్రోత్సహించడం కోసం అందించే జేఎస్‌వై ప్రోత్సాహకాలు అందించడంలో కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రోత్సాహకాలు అందరికీ కాకుండా కొంతమందికి ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 వేలు ఆరోగ్య ఆసరా కింద ఇచ్చేది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసవాలు జరిగే ఆస్పత్రులు జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి ఏరియా ఆస్పత్రులు, బాడంగి, నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి సీహెచ్‌సీలు, ఘోషాఆస్పత్రిలో ప్రసవాలు జరుగుతాయి. అదేవిధంగా జిల్లాలో ఉన్న 48 పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు జరుగుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే బాలింతలకు జననీ సురక్ష యోజన కింద ప్రోత్సాహకం (జేఎస్‌వై) అందజేస్తారు. గ్రామీణ ప్రాంత తల్లులకు రూ.1000, పట్టణ ప్రాంత తల్లులకు రూ.600 ఇస్తారు.

1842మంది తల్లుల నమోదు

ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ 26వతేదీ నాటికి ఎంఎస్ఎస్ పోర్టల్‌లో 1842 తల్లులు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో 1232 మందికి మత్రమే నగదు జమ అయింది. 610 మందికి జేఎస్‌వై ప్రోత్సాహకం అందాల్సి ఉంది.

మిగిలిన వారికి త్వరలో అందజేత

జేఎస్‌వై కింద గ్రామీణ ప్రాంత మహిళలకు రూ.1000, పట్టణ ప్రాంత మహిళలకు రూ.600 చొప్పున ప్రోత్సాహకం అందించనున్నాం. ఈ ఏడాది ఇంతవరకు 1842 మందికి గాను 1232 మందికి ప్రోత్సాహకం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగతా 610 మందికి కూడా త్వరలో వారి ఖాతాల్లో జమ అవుతుంది.

డాక్టర్ ఎస్. జీవనరాణి, డీఎంహెచ్ఓ

పోటాపోటీగా పింఛన్ల పంపిణీ

- రెండు ప్రాంతాల్లో రెండు వర్గాలుగా అందజేత
- టీడీపీలో రాజుకుంటున్న గ్రూపుల కుంపటి

ఎస్‌కోటలోని కోటవీధిలో పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

పుణ్యగిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలో మంగళవారం అధికార టీడీపీ నేతలు రెండు వర్గాలుగా, పోటాపోటీగా పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే లలితకుమారి తన అనుయాయులతో కలిసి కోటవీధిలో, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు తన అనుయాయులతో కలిసి పుణ్యగిరిలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీలో రాజుకుంటున్న అసమ్మతి కుంపటికి ఇది నిదర్శనం. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఆరంభం నుంచి రెండు గ్రూపులు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యే లలితకుమారి, ఎమ్మెల్యే సీటు కోసం ఆశించి భంగపడి, డీసీఎంఎస్ చైర్మన్‌గిరితో సరిపెట్టుకున్న గొంప కృష్ణ రెండు వర్గాలుగా ఉన్నారు. గొంప కృష్ణ వర్గానికి ఎంపీ భరత్ ఆశీస్సులు మెండుగా ఉన్న విషయం విదితమే. కాగా ఇటీవల శాసనసభ ఎన్నికల్లో నారా లోకేష్ హామీతో టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారితో పాటు కొందరు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.

అసంతృప్తిలో మూడో వర్గం

మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వైస్ ఎంపీపీ సుధారాజు వర్గం అధికార పార్టీ నేతల తీరుపై గుర్రుగా ఉన్నారు. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కార్యక్రమాలు వేటికీ తమకు సమాచారం ఇవ్వకుండా, తమ ప్రాతినిధ్యం లేకుండా చేస్తున్నారని మధనపడుతున్నారు. నాడు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చి, నమ్మించి నట్టేట ముంచుతున్నారని కలత చెందుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, నిధులు, విధులు, సంక్షేమ కార్యక్రమాలు ఇలా ఎక్కడా తమ మాట చెల్లడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోకేష్ దగ్గకు పంచాయితీ?

తమకు తగిన గౌరవం దక్కడం లేదని నేరుగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసి, నాడు ఇచ్చిన హామీలను గుర్తుచేయాలని సుధారాజు వర్గం యోచిస్తోంది. ఇందుకోసం లోకేష్ అపాయింట్‌మెంట్ కోసం చూస్తున్నారని, త్వరలోనే అధిష్టానం పెద్దలకు వాస్తవాలు చెప్పేందుకు అమరావతి వెళ్లనున్నట్లు కచ్చితమైన సమాచారం.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: తాగునీరు, భూమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కారిగూడ పంచాయతీ దొందమానుగూడ గ్రామ గిరిజనులు పలువురు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావును కలిసి వినతపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న చైర్మన్ ఇంటికి వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు. మంచినీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలపై చైర్మన్‌తో చర్చించారు. పైనాపిల్, కొండచీపుళ్లు, చిరుధాన్యాలు వంటి పంటలకు గిట్టుబాబు ధర లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సవర సింహాచలం, హడ్డుబంగి శేషమ్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 5న శనివారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలో గల రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబులు హాజరవుతారని తెలియజేశారు. పార్లమెంట్ పరిశీలకులు, ఎంపీ, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్యనాయకులు హాజరు కానున్నారన్నారు.

అందరూ హాజరుకావాలి

ఈ సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో గల మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో గల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ సభ్యులు, మాజీ డీసీసీబీ, మాజీ డీసీఎంఎస్ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు అందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బంకురు రవికుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తప్పెట ప్రసాద్, అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, ఎంపీటీసీలు బడే రామారావు, వై.రమణ, సర్పంచ్‌లు తీళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

120 సారా ప్యాకెట్ల పట్టివేత

సాలూరు: పట్టణంలో 120 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎస్సై అప్పలరాజు, సిబ్బందితో కలిసి ఎరుకుల వీధిలో ఓ పాత నిందితురాలి నుంచి 120 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా సారా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ సీఐ నంబరు 9440902374కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.సారా నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్టు

భామిని: మండలంలోని కోసిమానుగూడ సమీపంలో సారా అమ్ముతున్న బిడ్డిక రామారావు అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై జి.అప్పారావు తెలిపారు. 20లీటర్ల సారా సీజ్ చేసి నిందితుడిని కొత్తూరు కోర్టులో హాజరు పరచగా న్యాయామూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

20 మద్యం సీసాల పట్టివేత

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మద్యం బెల్ట్‌దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఎస్సై బి.రాముడు ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించగా మద్యం బాటిల్స్‌తో ఓ వ్యక్తి కనిపించడంతో అదుపులోకి తీసుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

డాక్టర్ దీనకుమార్‌కు సత్కారం

డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను సన్మానిస్తున్న పశువైద్య సహాయకులు

సీతానగరం: పార్వతీపురం బదిలీ అయిన పశుసంవర్ధక ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను పశువైద్య సహాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. దీర్ఘకాలంగా మండల పశువైద్యాధికారి, సీతానగరం పశువైద్య శాఖసబ్ డివిజనల్ ఎ.డిగా డాక్టర్ దీనకుమార్ సేవలందించిచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు కావడంతో పార్వతీపురం సబ్‌డివిజన్ ఎ.డి గా బదిలీ అయినందున పశువైద్య సహాయకులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సన్మాన గ్రహీత డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు అనివార్యమే అయినా విధుల్లో అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయన్నారు. సుదీర్ఘకాలం మండలంలో పశువులకు సేవలందించే సదవకాశం తనకు దక్కిందన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉద్యోగులు. ,శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కళ్లకు గంతలతో నిరసన

- జిందాల్ మోసం చేసిందని నిర్వాసితుల ఆందోళన

కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ కళ్లు మూసి జెల్ల కొట్టిందని, తడి గుడ్డతో రైతుల గొంతు కోసిందని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రఘురాజు నివాసం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో రోడ్డుమీద కళ్లకు గంతలు కట్టుకుని జిందాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిందాల్‌తో చేతులు కలిపి అన్ని పార్టీల నాయకులు, జిల్లా అధికారులు తమను కళ్లు మూసి జెల్ల కొట్టారని, జిందాల్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నారని, వాపోయారు. జిల్లా పెద్దదిక్కు అయిన కలెక్టర్ తన ఉద్యోగం మరిచిపోయి జిందాల్ ప్రతినిధిలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని, నాడు నమ్మించి ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారని, ఇప్పటికీ ముఖం చూపడం లేదన్నారు. నాడు జిందాల్ ఇచ్చిన హామీలు ఎవరు తీరుస్తారు? ఎలా తీరుస్తారని అడిగితే చెప్పకుండా ముఖం చాటేయడం న్యాయమా? జీవనోపాధి అయిన భూములు కోల్పోయి న్యాయం అడిగితే మమ్మల్ని పోలీసుల్ని పెట్టి బెదిరిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్సీ లేఖ

జిందాల్ భూసమస్య చుట్టూ తతెత్తుతున్న పరిస్థితి అర్ధం చేసుకోవాలని, తొలుత నిర్వాసితుల శాంతియుత నిరసనకు అనుమతించి తర్వాత వారిని అనుమతించక పోవడం వల్ల నిర్వాసితులు తన ఇంటికి వస్తున్నారని, స్థానికుడిని కావడం వల్ల వారిని కాదనలేక విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వారి అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడానికి అనుమతించి, తనపై ఒత్తిడి తగ్గించాలని ఎమ్మెల్సీ రఘురాజు కలెక్టర్, ఎస్పీలకు లేఖలు ఇచ్చారు.

మోకాళ్లపై ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

- కమిషనర్‌కు సమ్మె నోటీసు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం రూ. 24,500, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలను ప్రతినెలా 10వ తేదీ లోపు చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా నేటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇప్పటికే అనేక మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం అనే పదాన్ని తొలగించి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించి దశలవారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 17 రోజుల సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, రిటైర్ అయిన, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ బెనిఫిట్, తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాల వర్తింపు తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రజారోగ్య అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్. రామనాయుడు, రాజు, ధనుంజయ, ప్రసాద్, బుజ్జి, నాయుడు, రామచంద్రరావు కుమారి, శంకరరావు, రమ, సూరి పాల్గొన్నారు.

సోషల్ మీడియా వరమా? శాపమా?

- యువతపై అత్యధిక ప్రభావం



సోషల్ మీడియాలో మునిగి తేలుతున్న నేటితరం ప్రజలు

సెల్ఫీ జోష్‌లో..యువత డేంజర్ చిత్రం

విజయనగరం గంటస్తంభం: సోషల్ మీడియా ఇప్పుడు మనిషి నిత్యకృత్యాల్లో ఓ భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. అనుభావాలను, అలవాట్లను, ఆలోచనలను పంచుకునే చోటు. ఇది కొంతమేర బాగానే ఉన్నా ఎదుటివారి 'సోషల్ బతుకు'లను చూస్తూ కుంగుబాటుకు లోనవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇతరుల వివరాలు, వినోదాలు, విలాసాలను చూస్తూ.. చాలామంది.తమను తాము తక్కువ చేసుకుంటున్నారు. మరి సోషల్ మీడియాలో మనం చూసే ప్రతిదీ నిజమేనా? అంటే..'కాదు' అనే చెప్పాల్సి వస్తుంది.

ఎందుకుంటే 'ఫ్యామిలీ ఓవర్ ఎవ్రీథింగ్' అంటూ ఫొటోను స్టేటస్ పెట్టుకునేవారు పట్టుమని పది నిమిషాలు కూడా ఫ్యామిలీతో గడపకపోవచ్చు. 'ఫ్రెండ్స్ ఫర్ లైఫ్' అనేవారు అసలు స్నేహితులే లేకపోవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటూ అర్ధరాత్రిపూట పోస్టులు పెడుతుండవచ్చు, నిద్రపోకుండా ఆరోగ్యం పాడుచేసుకోవచ్చు. 'అమ్మే దైవం' అని ఎమోషనల్ క్యాప్షన్స్ పెట్టేవారంతా అమ్మకు పనుల్లో సాయం చేస్తారన్నది అపోహే. పొద్దున నిద్ర లేదగానే దేవుడి వీడియోలను స్టేటస్‌లుగా పెట్టుకున్నవారు మంచి మనుషులని ఏ తప్పూ చేయని వారని అనుకుంటే పొరపాటే. పిల్లికి బిచ్చం వేయనివారే 'సొంత లాభం కొంత మానుకుని పొరుగువానికి తోడుపడవోయ్' అంటూ ఫోజులు కొట్టవచ్చు. నువ్వు లేనిదే నేను లేనంటూ ఇన్ బాక్స్‌ల్లో ప్రేమ పాఠాలు వల్లె వేసేవారు..ఆ మాటే మరొకరికి చెప్పరని గ్యారంటీ లేదు. ఖరీదైన కారు ముందో, విలాసవంతమైన భవనం ముందో నిలబడి ఫొటోలు పెడితే వాళ్ల వైభోగాన్ని చూసి అసూయ కలుగుతుంది. కానీ అవి వాళ్ల సొంతమేనా కాదా? వారికి ఆ తాహతుందా, లేక ఆర్బాటాలకు పోయి ఆనక అప్పులతో ఇబ్బందులు పడుతున్నారా? అవేవీ మనకు తెలియదు. ఫొటోల కోసం ఎవరికో ఏదో సాయం చేస్తున్నట్లు నటించేవారు పెరుగుతున్నారని వారి సోషల్ మీడియా పోస్టులే చెబుతుంటాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో అందమైన అమ్మాయిలు ఫొటోలు చూసి ఆత్మన్యూనతకు లోనయ్యేవారు, తామూ అలాగే కనపడాలని రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్ కొంటున్న వారూ లేకపోలేదు. ఫొటోలకు ఫిల్టర్లు ఉంటాయని ఎలాంటి వారైనా అందంగా కనిపించవచ్చని ఆ క్షణం స్ఫురించదు.

తెరమీద కనిపించేవన్నీ ఫిల్టరేసిన బతుకులు. నిజజీవితాలు కాదు. నిజాయతీగా ఉన్నదున్నట్లు చూపించుకునేవారూ ఉంటారు. కాకపోతే వారిది ప్రదర్శనలా ఉండదు. ఎవరికీ ఇబ్బంది కలిగించదు. లేనిది ఉన్నట్లూ ఉన్నది లేనట్లూ చూపించుకోవడానికి సోషల్ మీడియాను మయసభలా వాడుకునేవారితోనే సమస్యంతా.

మంచికి వాడుకుందాం..

పోస్టులు పెడుతుంటారు, సమాచారాన్ని షేర్ చేస్తుంటారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజకీయ, విధానాపరమైన పోస్టులే ఎక్కువగా దర్శనమిస్తుంటాయి.ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాలు, న్యాయపరమైన విధానాలపై వచ్చే పోస్టులను ఇతరులకు పంపడం ద్వారా చిక్కుల్లో పడుతుంటాం. అనవసరంగా పోలీసు కేసుల బారిన పడుతుంటాం.అటువంటి సమయంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సాక్ష్యాలుగా చూపుతున్నారు పోలీసులు. లేనిపోని లింకులు క్లిక్ చేయడం, పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులకు దూరంగా ఉండడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అడిక్షన్ ఉందో లేదో ఇలా గుర్తించొచ్చు...

సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల ఉద్యోగం, చదువు, పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే ఏదైనా నిర్దిష్ట సమయంలో చేయాల్సిన పనికి బదులు ఫోన్‌లో యాప్‌లను తెరిస్తే అది వ్యసనానికి సంకేతంగా చెబుతున్నారు.

- స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి ఉన్నప్పుడు, భోజనం చేసేటప్పుడు స్మార్ట్ ఫోన్‌ను తీసుకోవడం, మెస్సేజ్‌లను చూడడం.
- ప్రతి చిన్న సమస్యకు పరిష్కారంగా ఆన్‌లైన్, సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడడం.

సెల్ఫీల మోజు బాగా పెరిగింది..

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడానికి వినియోగించుకోవాలి. అతిగా సెల్‌ఫోన్ వినియోగంచడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది. ఇక యువతకు సెల్ఫీ మోజు బాగా పెరిగింది. సెల్ఫీ మోజులో ఎక్కడపడితే అక్కడ ఫొటోలు దిగుతున్నారు. దీంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

వై.సతీష్ కుమార్,
సీనియర్ కెమిస్ట్రీ లెక్చరర్, విజయనగరం

తల్లిదండ్రులు నియంత్రించాలి..

అనవసరమైన వయస్సులో పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదు. యువత ఫోన్లను విపరీతంగా వాడుతోంది. సరదా కోసం తీస్తున్న సెల్ఫీలు చివరకు ప్రాణాల మీదికి తెస్తున్నాయి.

– ప్రశాంత్ కుమార్ ఎంఎస్సీ సైకాలజీ,
విజయనగరం

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిమ్మకు నల్లి..ధర సన్నగిల్లి

నిమ్మ ధరలు పాతాళంలోకి పడిపోయాయి. రైతుల దగ్గర కేజీ కాయలు రూ.2 నుంచి రూ.3 మాత్రమే పలుకుతోంది. నిమ్మ తోటలను నల్లి తెగులు దారుణంగా దెబ్బతీసింది. - 10లో..

విధిఆటకు బాలుడు బలి

చెట్టుకొమ్మ విరిగిపడి ప్రమాదవశాత్తు ఒక బాలుడు మృతిచెందగా, మరో బాలుడికి గాయాలైన ఘటన కురిచేడు మండలం పడమర నాయుడుపాలెంలో జరిగింది. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
32 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

క్షయ పరీక్షలు చేయించుకోవాలి

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఒంగోలు టౌన్: 60 ఏళ్ల పైబడిన వారందరూ తప్పనిసరిగా క్షయ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. టీబీ ముక్తి భారత్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక 49వ డివిజన్‌లో టీబీ ముక్త్ భారత్ అవగాహన ర్యాలీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1,12,817 మందిని పరీక్షలు చేయగా వారిలో 5,432 మంది అనుమానితులుగా గుర్తించారని తెలిపారు. వారిలో 137 మందికి క్షయవ్యాధి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి అవసరమైన మందులను అందించారన్నారు. ప్రజలందరూ టీబీ వ్యాధి పట్ల అవగాహన కల్పించుకోవాలని, కుటుంబంలో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే క్షయ నివారణ మందులను మింగించి క్షయ వ్యాధి నుంచి విముక్తం కావాలన్నారు. తూర్పునాయుడుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా క్షయ అధికారి డాక్టర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన పొగాకునూ కొనుగోలు చేయండి

● కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బర్లీ పొగాకు రైతుల వినతి

బర్లీ కొనుగోలు కేంద్రంలో పొగాకు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు: మూడు రకాల పొగాకు గ్రేడులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, వర్షానికి తడిసి నల్లబడిన పొగాకును కూడా కొనుగోలు చేస్తేనే తాము తక్కువ నష్టాలతో బయట పడతామని బర్లీ పొగాకు రైతులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. మండలంలోని గార్లపాడు పునరావాస కాలనీ సమీపంలోని బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. పొగాకు కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో పొగాకు పంట ఎన్ని ఎకరాల్లో వేశారు? పంట దిగుబడి ఎంత వచ్చింది, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అన్న విషయాలు అడిగారు. ఈక్రమంలో నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన రైతులు పలువురు నాల్గవ గ్రేడు ఏర్పాటు చేయించాలని కలెక్టర్‌ను కోరగా విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, ఏఓ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి నోటీసులు.. అధికార జలగలు!

ఒంగోలు నగరపాలక సంస్థ వడ్డీ వ్యాపారుల కంటే దారుణంగా తయారైంది. చిరు వ్యాపారం చేసుకునే కూరగాయల నిర్వాహకులపై బకాయిలను వడ్డీల రూపంలో మోయలేని భారాన్ని మోపుతున్నారు. నగర పాలక సంస్థ ఇచ్చిన నోటీసులు చూసి వ్యాపారుల కళ్లు బైర్లు కమ్మాయి. చెల్లించాల్సింది రూ.5.78 కోట్లు అయితే వడ్డీ, అపరాధ రుసుం, జీఎస్టీ కలిపి రూ.7.08 కోట్లు వేశారు. మొత్తంగా రూ.12.86 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అధికారులిచ్చిన నోటీసులు చూసి వారు బెంబేలెత్తిపోతున్నారు. ఇదేంటి అని అడిగిన వారి దుకాణాలను సీజ్ చేస్తున్నారు. అధికారులు చిరు వ్యాపారులను జలగల్లా పీక్కుతింటున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒంగోలులోని కొత్త మార్కెట్



- కూరగాయల మార్కెట్‌ను వేధిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు
- గుదిబండలా మారిన బకాయిలు
- అద్దె బకాయిలు మొత్తం రూ.5.78 కోట్లు
- వడ్డీ, అపరాధ రుసుం, జీఎస్టీతో రూ.7.08 కోట్లు
- మొత్తం రూ.12.86 కోట్లు చెల్లించాలంటూ కార్పొరేషన్ అధికారుల ఒత్తిడి
- నిబంధనల ప్రకారం 2.50 శాతం వడ్డీ మాత్రమే
- అడ్డగోలుగా 50 శాతానికి పైగా వడ్డించి వసూలు
- కరోనా సమయంలో మార్కెట్ లేకపోయినా అద్దె కట్టాల్సిందే అంటూ వేధింపులు
- ముఖం చాటేస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

నగరంలో కొత్త కూరగాయల మార్కెట్ వ్యాపారులు అధికారులు, పాలకుల మధ్య నలిగిపోయి..చిక్కి శల్యమవుతున్నారు. ఒక పక్క బాడుగల పేరుతో వేధింపులు...మరోపక్క దుకాణాలు పెట్టుకోనీయకుండా బెదిరింపులు అక్కడి వ్యాపారులకు నిత్యకృత్యమయ్యాయి. కొత్త కూరగాయల మార్కెట్ ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు దోచుకునేందుకు సొంత ఆదాయ వనరుగా మారిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ (ఏఎంసీ) కోసం కాంప్లెక్స్ నిర్మించారు. ఒంగోలు నడిబొడ్డులో కాంప్లెక్స్ నిర్మాణం కావటంతో అప్పటి పాలకులు ఏఎంసీకి కాకుండా కూరగాయల మార్కెట్ అయితే నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని భావించి ఏఎంసీని పాత గుంటూరు రోడ్డుకు తరలించి ఆ కాంప్లెక్స్‌ను ఒంగోలు మున్సిపాలిటీకి అప్పగించారు. దాంతో 2008లో పాత కూరగాయల మార్కెట్ నుంచి వ్యాపారులను ఇక్కడకు మార్చారు. అప్పట్లో మున్సిపాలిటీ అధికారులు అద్దెలు ఖరారు చేసి వసూలు చేయటం ప్రారంభించారు. 2008 నుంచి 2019 నవంబర్ వరకు వ్యాపారులు అందరూ పూర్తిగా బకాయిలు లేకుండా అద్దెలు చెల్లించారు.

కరోనా నుంచి కష్టాలు ప్రారంభం:

కరోనా సమయం నుంచి కొత్త కూరగాయల మార్కెట్ వ్యాపారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. 2019 డిసెంబర్ నుంచి షాపులను నగరపాలక సంస్థ అధికారులు అప్పటి వరకు ఉన్న అద్దెకు 33.33 శాతం పెంచి షాపులను వ్యాపారులకు రెన్యువల్ చేయాల్సి ఉంది. ఇంతలో కరోనా వచ్చింది. 2020 మార్చి నుంచి కరోనాతో లాక్‌డౌన్ ప్రకటించారు. దాంతో మార్కెట్ మూత పడింది. అయితే మార్కెట్‌లో కాకుండా రంగారాయుడు చెరువు పక్కనే ఉన్న పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా షెడ్లు వేసి ఆ వ్యాపారుల చేతనే ఇక్కడ కూరగాయలను ప్రజల అవసరాలు తీర్చేందుకు అమ్మకాలు జరిపించారు. ఈ విధంగా రెండేళ్ల పాటు చేయించారు. అయితే కరోనా సమయంలో ఉన్న అద్దె బకాయిలను మాఫీ చేయమని వ్యాపారులు పాలకులను, అధికారులను అడుగుతూ వచ్చారు. ప్రభుత్వంతో మాట్లాడి మాఫీ చేయిస్తామని అధికారులు చెబుతూ వచ్చారు. అద్దె మాత్రం మాఫీ చేయలేదు. కానీ కరోనా సమయం నుంచి నగర పాలక సంస్థ అధికారులు 193 షాపులకు అద్దెల లెక్కలు వేసుకుంటూ వస్తూనే ఉన్నారు.

రూ.5.78 కోట్లు అసలు.. వడ్డీ రూ.7.08 కోట్లు..!

ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్‌లో మొత్తం షాపులు 193 ఉన్నాయి. వాటిలో రిటైల్ షాపులు 123, హోల్ సేల్ షాపులు 70 ఉన్నాయి. 2019 డిసెంబరు నుంచి 2022 నవంబర్ వరకు మాత్రమే. 2022 డిసెంబర్ నుంచి రెన్యూవల్ చేయాల్సి ఉంది. అప్పటి వరకూ కట్టాల్సిన అద్దె బకాయిలు రూ.5.78 కోట్లు. వడ్డీ, అపరాధ రుసుం, జీఎస్టీ, ఐజీఎస్టీలు వేసి రూ.7.08 కోట్లు ఉందంటూ నోటీసులు జారీ చేశారు. దీని ప్రకారం మొత్తం రూ.12.86 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. ఈ బకాయిలు రిటైల్, హోల్‌సేల్ వ్యాపారుల పాలిట శాపాలుగా మారాయి. చివరకు మోయలేనంతగా తయారై కట్టలేని స్థితికి చేరుకున్నారు. ఇదిలా ఉంటే 2025 నవంబర్‌తో మూడేళ్లకు గడువు ముగుస్తుంది కూడా. ఇప్పటి వరకు కట్టాల్సిన రూ.12.86 కోట్లతో పాటు అదనంగా మళ్లీ 33.33 శాతం అద్దె పెంచాలి. పెరిగిన అద్దెతో పాటు వడ్డీ, అపరాధ రుసుం, జీఎస్టీలు కలుపుకొని మరో రూ.15 కోట్ల వరకు కట్టాల్సిన పరిస్థితి. అంటే మొత్తం కలుపుకుంటే రూ.27.86 కోట్లు బకాయిలు చెల్లించాలని అధికార వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు ఇస్తున్న నోటీసులు చూసిన చిరు వ్యాపారులు కళ్లు తేలేస్తున్నారు. ఫైనాన్స్ వ్యాపారులే నయం అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి 2.50 శాతం మాత్రమే వడ్డీ... కానీ 50 శాతంపైగా వసూలు...

వాస్తవానికి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం అద్దె బకాయిలపై కేవలం 2.50 శాతం మాత్రమే వడ్డీ, అపరాధ రుసుం కట్టాలి. ఆ నిబంధనలు గాలికి వదిలేసిన నగర పాలక సంస్థ అధికారులు ఇష్టం వచ్చినట్లు వడ్డీ, అపరాధ రుసుం విధిస్తూ నోటీసులు పంపారు. ఇచ్చిన ఆ నోటీసులు కూడా మున్సిపల్ కార్యాలయంలో రికార్డు ఏమీ ఉండదు. కంప్యూటర్‌లో ఒక ప్రింట్ తీసుకొని ఇచ్చి మరీ డబ్బులు వసూలు చేసుకుపోయారు. గతంలో వాటికి లెక్కా..పక్కా లేదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ, అపరాధ రుసుం కలుపుకొని కట్టాల్సింది 193 షాపులకు కలిపి రూ.5.78 కోట్లు అయితే (2022 నవంబర్ వరకు) దానికి అదనంగా వడ్డీ, అపరాధ రుసుం, జీఎస్టీలు కలుపుకొని రూ.7.08 కోట్లు కట్టాలని నోటీసులు షాపులకు అతికించారు. వ్యాపారులకు చేతికి కూడా ఇవ్వటం లేదు. ఇదొక అడ్డగోలు వ్యవహారంలా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీనిపై కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించినట్టు సమాచారం.

అందినకాడికి దోచుకుంటూ..?

సొంత ఖర్చులకు డబ్బులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు కొత్త కూరగాయల మార్కెట్ కార్పొరేషన్ అధికారులకు గుర్తుకు వస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. బకాయిల పేరుతో పలు మార్లు కార్పొరేషన్ అధికారులు డబ్బులు వసూలు /చేశారు. అలా ఇప్పటి వరకు రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకు కట్టించుకున్నట్టు తెలుస్తోంది. ఏ ఒక్కరికీ రసీదులు ఇచ్చిన పాపాన పోలేదు. వసూలు చేసిన అధికారులు ఒకరిద్దరు చనిపోగా, కొందరు బదిలీపై వెళ్లారు. కొంతమందిని ఉద్యోగాల నుంచి తీసేశారు. కానీ కూరగాయల మార్కెట్ వ్యాపారులు కట్టిన అద్దె డబ్బులకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. కొంత మంది అధికారులు సంవత్సరాల తరబడి కార్పొరేషన్‌లోనే పనిచేస్తూ వ్యాపారులపై పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ తంతు 2019వ సంవత్సరం నుంచి నేటికీ అదే జరుగుతుందంటే వ్యాపారుల బాధలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: కౌలు రైతులకు నిర్దేశించిన లక్ష్యం మేరకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లతో వీడియో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్స్, హౌసింగ్ ఫర్ ఆల్‌లో భాగంగా ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్, నూతన ఇంటి పట్టాల కోసం దరఖాస్తుల పరిశీలన, జీఓఎంఎస్ నంబర్ 30 ప్రకారం రెగ్యులరైజేషన్, రీ సర్వే ప్రక్రియ, రేషన్ షాపుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో 46,015 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 11,579 మంది కౌలు రైతులకు కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలన్నారు. కోర్టు కేసులను ఆన్‌లైన్‌లో చూసుకునేలా రెవెన్యూ కేసులు కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జీఓ ఎంఎస్ 30 ప్రకారం రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 22ఏ డాటెడ్ ల్యాండ్, భూమి అప్పగింత, అసైన్‌మెంట్ ల్యాండ్‌లకు సంబంధించి వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్‌డీసీలు వరకుమార్, శ్రీధర్, జాన్సన్, జిల్లా వ్యవసాయ అధికారులు శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ పెరుగు శ్రీనివాస ప్రసాద్, డీఎస్‌ఓ పద్మశ్రీ,, సివిల్ సప్లెస్ డీఎం వరలక్ష్మి, జిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, రెవెన్యూ డివిజినల్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా అధికారులు

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వండి..

● సబ్‌కలెక్టర్‌కు రైతుల వినతి

మద్దిపూడి: ఎన్‌హెచ్544జీ (గ్రీన్‌ఫీల్డ్ హైవే)కు అవసరమైన 6.51 ఎకరాల భూములు కోల్పోయిన ఏడుగురు రైతులకు సుమారు రూ.65 లక్షలు పరిహారం చెల్లించాలని మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం గ్రామస్తులు రోడ్ పనులను పరిశీలించేందుకు మద్దిపూడి వచ్చిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్‌కు మంగళవారం విన్నవించారు. దాదాపు ఏడాది గడుస్తున్నా పరిహారం ఇవ్వకుండా అధికారులు రేపు, మాపు అని కాలయాపన చేస్తున్నారని దుగ్గిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బూదాల ఆశీర్వాదం, దుద్దుకుంట కోటయ్య, ఆకుల పెదగంగిరెడ్డి, ఆకుల సుగుణమ్మ, ఆకుల గంగిరెడ్డి, గురుగూరి ఆదెమ్మ, బీ ఆదిలక్ష్మిలు డిప్యూటీ కలెక్టర్ ముందు వాపోయారు. ఈ భూమి ద్వారా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, అసైన్‌మెంట్ భూమిని గతంలో అధికారులు ఎలాంటి విచారణ జరపకుండా ఏడబ్ల్యూ ల్యాండ్ అని రాసి పంపారని, విచారించి మాకు తగు న్యాయం చేయండి సార్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న దుగ్గిరెడ్డిపాలెం గ్రామస్తులు అంటూ డిప్యూటీ కలెక్టర్‌కు గ్రామస్తులు విన్నవించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు ఆటంకం పెట్టరాదని, రైతుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహశీల్దార్ జనార్దన్ డీటీ రాజు, వీఆర్వోలు ఉన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న దుగ్గిరెడ్డిపాలెం గ్రామస్తులు

ఎండీఎం మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

చిన్నారులతో కలిసి కూర్చుని మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు: పాఠశాలలో మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని గార్లపాడు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ప్రతి రోజు రుచికరంగా ఉంటుందా, సన్న బియ్యం వండుతున్నారా, భోజనం ఎలా ఉందంటూ పలు ప్రశ్నలు వేసి వారి వద్ద సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ చిన్నారులతో సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతివారం ఎంపీడీఓ, తహశీల్దార్లు మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈమని శ్రీనివాసరావుతో మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గార్లపాడు రేషన్ షాపును సందర్శించి సరఫరా చేసిన స్టాకు, మిగిలిన స్టాకును పరిశీలించారు. రేషన్ పంపిణీ కచ్చితంగా జరగాలని, ఎక్కడా అవకతవకలకు పాల్పడకుండా చూడాలని తహశీల్దార్ ఆదిలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో వారి వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు ఒన్‌టౌన్: ఒంగోలులోని గిరిజన భవనాన్ని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన భవనం ప్రాంగణాన్ని శుభ్రపరచాలని, మట్టి వేసి, మెరకగా చేయాలన్నారు. భవనానికి ఏసీలు అమర్చేందుకు పరిశీలించాలన్నారు. ఫంక్షన్‌లకు గిరిజన భవనాన్ని అద్దెకు ఇస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని భవనం నిర్వహణకు ఉపయోగించుకోవచ్చన్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎల్.వరలక్ష్మి పాల్గొన్నారు.

మత్తులో మందుబాబు

రచయిత్రి మొల్ల విగ్రహం వద్ద మద్యం మత్తులో పడి ఉన్న వ్యక్తి

మార్కాపురం: మద్యం మత్తు ఎక్కువై రోడ్డుపై డివైడర్ల మధ్య ఓ వ్యక్తి పడిపోయిన ఘటన మార్కాపురంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన ప్రముఖ రచయిత్రి మొల్ల విగ్రహం వద్ద మద్యం ఎక్కువై ఓ వ్యక్తి అడ్డంగా పడిపోయాడు. సుమారు గంటన్నర సేపు మద్యం మత్తులో ఉండి అలాగే పడుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మార్కాపురం పట్టణంలో మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. రచయిత్రి మొల్ల విగ్రహం వద్ద మందుబాబులు ఇలా తరచుగా పడుకోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేయడం, బెల్టుషాపులతో తమ సంసారాలు నాశనమైపోతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

8 కేజీల గంజాయి పట్టివేత

స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో 8 కేజీల గంజాయిని సీజ్ చేసి, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వివరాలు.. ఒంగోలులో ఎక్సైజ్ పోలీసులతోపాటు ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఏబీఎం కాలేజీ గ్రౌండ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా 8 కేజీల గంజాయి లభ్యమైంది. నిందితుడిని చిత్తూరు జిల్లా నగరి గ్రామానికి చెందిన ఎస్.మణిగా గుర్తించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ ఎ.లీనా, సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ గీత, ఈఎస్‌టీఎఫ్ ఎస్సై రవి ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపులను కట్టడి చేయాలి

- తహసీల్దార్‌కు టీడీపీ నాయకుడి ఫిర్యాదు

తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నరాల చెన్నారెడ్డి

కంభం: మార్కాపురం డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో యథేచ్ఛగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపులను కట్టడి చేయాలని కందులాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నరాల చెన్నారెడ్డి మంగళవారం తహసీల్దార్ వి.కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారులు అవినీతికి పాల్పడుతూ బెల్టు షాపుల గురించి పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కంభం ఎక్సైజ్ పరిధిలోని కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల్లో ఊరూరా బెల్టుషాపులు నిర్వహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని వివరించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

ఏడీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఏడీ సీహెచ్ సువార్తకు మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘాల నాయకులు ఎస్కే కాలేషా, ఎం. సులోచనారాణి, ఎస్డీ అమీర్ హంజా, పసుమర్తి రాజేష్, ముల్లా మదర్‌వలి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు, ఆంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపించినసూ తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం తేది.11.07.2025 శుక్రవారం మ॥ 3.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలం వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారులు ఎవరైనా మరణించి యున్నచో వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

లోన్ ఖాతా నెంబరు.	ఋణగ్రహీతల పేర్లు & చిరునామా	స్థూల బరువు
కోరు ఉప్పలపాడు బ్రాంచ్, ప్రకాశం జిల్లా. ఫోన్ : 99857 76775		
440806540030976	శ్రీ కసవర్తి సాగర్ రెడ్డి, తండ్రి : కె. అంజి రెడ్డి, తూమాడు (గ్రా), జరుగుమల్లి (మం), ప్రకాశం (జిల్లా)	61.5 గ్రాములు
440806540032837	శ్రీ దాసూరి సుధాకర్ రెడ్డి, తండ్రి : డి. రమణా రెడ్డి, ఆలూరు (గ్రా), కొత్తపట్నం (మం), ప్రకాశం (జిల్లా)	29.0 గ్రాములు
సింగరాయకొండ బ్రాంచ్, ప్రకాశం జిల్లా. ఫోన్ : 98531 43606		
050916540008127	శ్రీమతి సోపర్ల ప్రభావతి, భర్త : సుధాకర్ రెడ్డి, హనుమాన్ నగర్, సింగరాయకొండ, ఆం.ప్ర-523101	20.07 గ్రాములు
050930100200555	శ్రీ చేబ్రోలు బాలయ్య, తండ్రి : సుబ్బయ్య, ఆంజనేయ కంపెనీ, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101.	70 గ్రాములు
050916630000856	శ్రీ చక్కా వెంకట నరశమ్మ, తండ్రి : మాలకొండయ్య, సింగరాయకొండ-523101	34 గ్రాములు
050916540002853	శ్రీమతి రామచంద్రుల వెంకట సుబ్బలక్ష్మి, భర్త : ఆర్. సత్యనారాయణ శర్మ, APSWRS గర్ల్స్ కాల్ సెంటర్ దగ్గర, రాయపరం, మార్కాపూర్, ఆం.ప్ర-523371	7 గ్రాములు

నియమనిబంధనలు: 1) వేలంలో పాల్గొనువారు రూ.10,000/-(అక్షరాల పదివేల రూపాయలు మాత్రమే) ధరావత్తు చెల్లించవలెను. 2) వేలంలో సక్సెస్ఫుల్ బిడ్డరు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో అనసక్సెస్ఫుల్ బిడ్డరు వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు.

తేది: 01.07.2025, స్థలం: ఒంగోలు — సం/- బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సింగరాయకొండ బ్రాంచ్, ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, ట్రంక్ రోడ్డు, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523101.
ఫోన్: 98531 43606. ఇ-మెయిల్: Ubin0805092@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి
ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సింగరాయకొండ బ్రాంచ్ తరుపున SARFAESI యాక్ట్ 54/2002 క్రింద
దిగువ వారికి

విషయం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54/2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు దిగువ తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసును జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి దిగువ తెలిపిన తేదీలలో లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, ఆస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

ఋణగ్రహీతలు/సహా-పూచీదారులు/హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

1	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1) మెస్సర్స్ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు 1) శ్రీ రావి వెంకటేశ్వర్లు, మేనేజింగ్ పార్టనర్, 2) శ్రీమతి పిన్నింటి సుబ్బాయమ్మ, పార్టనర్, రిజిష్టర్డ్/పరిపాలన కార్యాలయం : డి. నెం.1-47, శివాలయం దగ్గర, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. యూనిట్/వర్క్స్ : ప్లాట్ నెం. 97 & 98, ఇండస్ట్రియల్ పార్క్, సింగరాయకొండ-523101. 2) శ్రీ ఆర్. వెంకటేశ్వర్లు, డి. నెం.1-47, శివాలయం దగ్గర, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. 3) శ్రీమతి పి. సుబ్బాయమ్మ, డి.నెం.1-47, శివాలయం దగ్గర, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. 4) శ్రీ రావి రమణయ్య, డి.నెం.1-47, శివాలయం దగ్గర, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. 5) శ్రీమతి రావి సుబ్బరత్నమ్మ, డి.నెం.1-47, శివాలయం దగ్గర, టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. డిమాండ్ నోటీసు తేది : 05.04.2021 — స్వాధీనత నోటీసు తేది : 09.07.2021 స్థిరాస్తి వివరములు: ఆస్తి నెం.1 : సింగరాయకొండ, ఇండస్ట్రియల్ పార్కు వద్ద సర్వే నెం.1, ప్లాట్ నెం. 97 & 98 వద్ద 4927.52 చ॥గ॥ల విస్తీర్ణం గల భూమి మరియు భవనం (షెడ్‌తో కలిపి) మెస్సర్స్ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ వారికి చెందినది. హద్దులు : తూర్పు : రోడ్డు, పడమర : ప్లాట్ నెం. 88 & 90, దక్షిణం : ప్లాట్ నెం.99, ఉత్తరం : రోడ్డు. ఆస్తి నెం.2 : ప్రకాశం జిల్లా, టంగుటూరు గ్రామం & మండలం, మూసి రివర్ దగ్గర, కె బిట్రగుంట డొంక రోడ్, రావివారిపాలెం ఏరియా, సబ్ డివిజన్ నెం. 1100/1, సర్వే నెం. 1100 లో ఎకరా. 2.3575 సెంట్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం శ్రీ రావి వెంకటేశ్వర్లు గారికి చెందినది. హద్దులు : తూర్పు : రావి సుబ్బారావు & అంజమ్మ భూమి, దక్షిణం : రావి సుబ్బారావు గారి భూమి, పడమర : డొంక, ఉత్తరం : రావి సుబ్బ కమలాకరరావు గారి భూమి. ఆస్తి నెం.3 : ప్రకాశం జిల్లా, టంగుటూరు గ్రామం & మండలం, మూసి రివర్ దగ్గర, కె బిట్రగుంట డొంక రోడ్, రావివారిపాలెం ఏరియా, సబ్ డివిజన్ నెం. 1102/2, సర్వే నెం.1102 లో ఎకరా. 1.885 సెంట్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం శ్రీ రావి వెంకటేశ్వర్లు గారికి చెందినది. హద్దులు : తూర్పు : రావి సుబ్బారావు గారి భూమి, దక్షిణం : రావి సుబ్బారావు గారి భూమి, పడమర : డొంక, ఉత్తరం : వమిడి కోటయ్య గారి భూమి.
2	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-పూచీదారు(లు): 1) శ్రీమతి మోసపాటి వెంకట రత్నమ్మ, భర్త ఎమ్. మాధవరావు, హెచ్ నెం.21-09, చౌటపాలెం గ్రామం మరియు పోస్ట్, పొన్నలూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర-523109. 2) శ్రీ తన్నీరు వెంకట ప్రతాప్, తండ్రి : టి. వెంకటేశ్వర్లు, 7-378 శ్రీరామ్ నగర్, వడ్డే పాలెం, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా-523101. డిమాండ్ నోటీసు తేది : 26.07.2023 — స్వాధీనత నోటీసు తేది : 16.12.2023 స్థిరాస్తి వివరములు: ప్రకాశం జిల్లా, బొమ్ములవల్లి @ పెదచెర్లోపల్లి గ్రామం, ప్లాట్ నెం.45 మరియు 46, సర్వే నెం.55 వద్ద విస్తీర్ణం 480 చ॥గ॥లులోని ఖాళీ ఇంటి స్థలం శ్రీ తన్నీరు వెంకట ప్రతాప్ గారికి చెందినది. హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.65 మరియు 66 యొక్క స్థలం, పడమర : రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.47 యొక్క స్థలం, దక్షిణం : ప్లాట్ నెం.44 యొక్క స్థలం.

తేది: 18.06.2025, ప్రదేశం: సింగరాయకొండ — సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నిమ్మకు నల్లి.. ధర సన్నగిల్లి!

- పాతాళంలోకి పడిపోయిన నిమ్మ ధరలు
- కేజీ కాయలు రూ.2 నుంచి రూ.3
- కాయలు వద్దని రైతులకు చెబుతున్న వ్యాపారులు
- నిమ్మ తోటలను దారుణంగా దెబ్బతీస్తున్న నల్లి తెగులు
- ఆకు, కాయ రాలిపోతుండటంతో రైతుల్లో ఆందోళన
- పత్తా లేని ఉద్యానశాఖ అధికారులు

హనుమంతునిపాడు: లాభాలు ఆశించి సాగు చేసిన నిమ్మ తోటలు రైతన్నలకు నష్టాలను రుచి చూపుతున్నాయి. నిమ్మ ధరలు భారీగా పతనం కావడం, మరోవైపు తెగుళ్లు చుట్టుముట్టడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గతేడాది కాస్తోకూస్తో లాభాలు గడించిన రైతులు ప్రస్తుత పరిస్థితులు తలుచుకుని కుమిలిపోతున్నారు. అధిక మొత్తంలో కౌలు చెల్లించి సాగు చేపట్టిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మద్దతు ధర లేక, కూలి ఖర్చులు భరించి కాయలను మార్కెట్‌కు తరలించలేక చెట్ల మీదనే వదిలేస్తున్న దుస్థితి. వ్యయప్రయాసలకోర్చి కాయలను మార్కెట్‌కు తరలించిన రైతులు.. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రోడ్ల పక్కన పడేస్తున్న దృశ్యాలు కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లో తరచూ కనిపిస్తున్నాయి.

జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం 2,874 హెక్టార్లకు పైగా నిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. ఒక్క హనుమంతునిపాడు మండలంలోనే ముదురు, లేత తోటలు సుమారు 2 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. హనుమంతునిపాడు ప్రాంతంలో పండించిన నిమ్మకాయలు హైదరాబాద్, ముంబై, కలకత్తా, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్రలో నిమ్మ దిగుబడి అధికంగా రావడంతో ఇక్కడి నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి. అదే సమయంలో వ్యాపారులు, దళారులు కుమ్మక్కవడంతో కేజీ నిమ్మకాయల ధర రూ.2 నుంచి రూ.3 కూడా పలకడం లేదు. కనీసం పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని నిమ్మ రైతులు కోరుతున్నారు.

నిమ్మకాయలను రోడ్డు పక్కన పడేస్తున్న కూలీ

కిలో ధర రూ.2

ప్రస్తుతం పండు నిమ్మ కాయలు కేజీ రూ.2 నుంచి రూ.3కు మించి పలకడం లేదు. కాయలు మార్కెట్‌కు తేవద్దని చెబుతున్న కమీషన్ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ససేమిరా అంటున్నారు. పచ్చి కాయలు కేజీ రూ.6 నుంచి రూ.7కు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో కోత కూలి, ఆటోల బాడుగ కూడా రావడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల పంటలకు నష్ట పరిహారం చెల్లిస్తున్న ప్రభుత్వం పండ్ల తోటల రైతులనూ పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆశలు నల్లిపేస్తోంది!

నిమ్మ ధరలు పతనం కావడంతో చెట్లమీద వదిలేసిన కాయలు పండి రాలిపోతున్నాయి. చెట్లపై, పాదుల్లోనే కుళ్లిపోతుండటంతో నల్లి తెగులు ప్రబలి తోటలు దారుణంగా దెబ్బ తింటున్నాయి. వేరు కుళ్లు, పేనుబంక, మంగు, ఎండు తెగులు, వైరస్ సోకిన తోటలను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. తెగుళ్ల కారణంగా కాయల నాణ్యత దెబ్బతినడంతో ధర పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేడింగ్ అనంతరం భారీ పరిమాణంలో నాణ్యత లేని కాయలను రోడ్డు పక్కన పడుస్తున్నారు. ఇదిలా ఉండగా తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవారు కరువయ్యారు. ఉద్యానశాఖ అధికారులు నిమ్మ తోటలవైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

హాజీపురంలో నిమ్మ కాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

నల్లి తెగులు సోకిన చెట్లను చూపుతున్న రైతు రమణారెడ్డి

ఐదెకరాల తోటను వదిలేశా

నేను ఐదు ఎకరాల్లో నిమ్మ తోట సాగు చేశా. ధర పడిపోవడంతో కాయలు కోయలేదు. కేజీ రెండు రూపాయలకు కూడా వ్యాపారులు తీసుకోవడం లేదు. కోత కూలి ఖర్చు కూడా రాదనే ఉద్దేశంతో చెట్ల మీదే కాయలు వదిలేశా. ఈ ఏడాది నిమ్మ రైతులు భారీగా నష్టపోయారు. నిమ్మ రైతుల గురించి పట్టించుకునే నాథుడు లేడు.
– మీనుగు కాశయ్యఅవులవారిపల్లి

కాయలు ఏరి రోడ్డున పోయిస్తున్నా

ఈ ఏడాది ఆది నుంచే నిమ్మకు ధర లేదు. తొలి కోత సమయంలో కేజీ రూ.50 పలికింది. కొన్నాళ్లకే పండు కాయలు కేజీ రూ.2, పచ్చి కాయలు కేజీ రూ.6కు మించి వ్యాపారులు కొనడం లేదు. కమీషన్ వ్యాపారులు తేవద్దని చెబుతుండటంతో తోటలో వదిలేసిన కాయలు రాలిపోతున్నాయి. అవి కుళ్లడంతో నల్లి తెగులు సోకి తోట మొత్తం దెబ్బ తింటోంది. రాలిన కాయలు ఏరి రోడ్ల పక్కన పడేస్తున్నాం. నాణ్యమైన కాయలను కూడా వ్యాపారులు చెప్పిన ధరకు ఇవ్వక తప్పడం లేదు.
– గాయం రమణారెడ్డి, హాజీపురం

విధి 'ఆట'కు బాలుడు బలి

మృతుడు బొజ్జా మహేందర్

క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్యాధికారి రవితేజకుమార్, సిబ్బంది

- ఆడుకునేందుకు చెట్టు ఎక్కిన నలుగురు బాలురు
- కొమ్మ విరగడంతో ఒకరు మృతి, మరో విద్యార్థికి గాయాలు

కురిచేడు: చెట్టుకొమ్మ విరిగిపడి ప్రమాదవశాత్తు ఒక బాలుడు మృతి చెంది, మరో విద్యార్థికి గాయాలైన సంఘటన మంగళవారం కురిచేడు మండలంలోని పడమర నాయుడుపాలె గ్రామ పంచాయతీ పరిధిలోని వీవై కాలనీలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు కాలనీకి చెందిన బాలురు బొజ్జారిత్విక్, బొజ్జా మల్లికార్జున, బొజ్జా మహేందర్, మేకల లక్ష్మినారాయణ మంగళవారం మధ్యాహ్నం ఆడుకునేందుకు వేపచెట్టు ఎక్కారు. చెట్టుకొమ్మ విరిగి కింద అసంపూర్తిగా నిర్మించిన ఇంటి గోడ పోర్టికోపై పడి అదికూడా కలిసి కిందపడ్డాయి. ఆ చెట్టుకొమ్మపై ఉన్న నలుగురు కిందపడిపోయారు. వారిలో బొజ్జా మహేందర్(13) పోర్టికో కాంక్రీట్ బీమ్ కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురిలో బొజ్జా రిత్విక్‌కు తలకు, కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. రిత్విక్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. మిగతా వారు ఐదో తరగతి తరువాత విద్యాభ్యాసం మానేశారు. మిగిలిన ఇద్దరు పిల్లలకు గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రుడిని ద్విచక్ర వాహనంపై కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో వినుకొండ తరలించారు. మహిళా పోలీస్ కె.రజిత ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎం.శివ తన సిబ్బందితో కలిసి బాలుడి మృతదేహాన్ని, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిగిన మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లిదండ్రులు, ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ

పోయిన నగలు పట్టించిన ఫోన్ పే!

యర్రగొండపాలెం: ఓ వ్యక్తి పోగొట్టుకున్న నగలను ఫోన్ పే సాయంతో పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నగలను ఎస్సై పి.చౌడయ్య మంగళవారం బాధితుడికి అందజేశారు. వివరాలు.. మండలంలోని అయ్యంబొట్లపల్లికి చెందిన పెద్దపోగు కోటయ్య మే 31వ తేదీన బ్యాంకులో రుణం తీసుకునేందుకు తన బంగారు ఆభరణాలు తీసుకుని యర్రగొండపాలెం వచ్చాడు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద షోడా తాగి బ్యాంకు వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లాక నగలు కనిపించలేదు. వెంటనే కోటయ్య షోడా బండి వద్దకు వెళ్లి విచారించగా.. మరి కొంత మంది వచ్చి షోడా తాగి వెళ్లారని, వారు ఫోన్‌పే చేశారని చెప్పాడు. షోడా బండి వ్యాపారి ఇచ్చిన సమాచారం ఆధారంగా కోటయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ రోజు షోడా తాగి ఫోన్ పే చేసిన ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నగలను గుర్తించి అప్పగించిన ఎస్సైకి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

కోటయ్యకు నగలు అప్పగిస్తున్న ఎస్సై చౌడయ్య

బాలికపై లైంగిక దాడి కేసు.. ముగ్గురు నిందితులు అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు రూరల్: సభ్య సమాజం తలదించుకునేలా 12 ఏళ్ల బాలికతో మద్యం తాగించి, ఆపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడితోపాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. మంగళవారం గిద్దలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడు చంద్రశేఖర్‌నాయుడు స్వగ్రామం కడప జిల్లా కలశపాడు మండలం చెన్నుపల్లె కాగా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద భోజనం హోటల్ నిర్వహిస్తున్నాడు. కలశపాడు మండలం మహానందిపల్లెకు చెందిన కేతుకుమారి భర్తతో మనస్పర్ధలు వచ్చి దూరంగా ఉంటూ గిద్దలూరులోని ఓ హోటల్లో పనిచేసుకుంటోంది. ఈ నేపథ్యంలో కేతుకుమారికి చంద్రశేఖర్ నాయుడితో పరిచయం ఏర్పడి అప్పుడప్పుడూ అతడి హోటల్ వద్దకు వెళ్తుండేది. జూన్ 26వ తేదీన తనకు ఒక బాలిక కావాలని చంద్రశేఖర్‌నాయుడు కోరగా కుమారి గిద్దలూరులో నివాసం ఉంటున్న దూరపు బంధువు అయిన మహిళ వద్దకు బైక్‌పై వెళ్లారు. ఆమె కుమార్తెను తనతో బజారుకు పంపాలని చెప్పి, బైక్‌పై తాటిచర్ల మోటు వద్ద గల హోటల్‌కు తీసుకెళ్లారు. హోటల్లో పనిచేసే బాలుడు బీరు తీసుకొచ్చి కూల్‌డ్రింక్‌లో కలిపి బాలికతో తాగించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలికపై చంద్రశేఖర్‌నాయుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తన కుమార్తె ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో వెదుకులాడింది. మరుసటి రోజు తెల్లవారుజామున తాటిచెర్ల మోటు వద్దకు వెళ్లిన ఆమె తన కుమార్తె పరిస్థితిని చూసి చంద్రశేఖర్‌నాయుడు చొక్కా పట్టుకుని ఘర్షణ పడింది. తనకు రాజకీయపలుకుబడి ఉందని, ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని ప్రధాన నిందితుడు బెదిరించాడు. దీంతో బాలిక తల్లి జూన్ 27వ తేదిన కొమరోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చంద్రశేఖర్‌నాయుడు, అతడికి సహకరించిన కుమారి, బాలుడుపై పోక్సో కేసు నమోదు చేశారు. కొమరోలులోని డ్రీమ్స్ రెస్టారెంట్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరులో విచ్చలవిడిగా మద్యం, గంజాయి

మద్యం సమస్యపై మంత్రి స్వామికి ఫిర్యాదు చేస్తున్న పొందూరు మహిళలు

- మంత్రి స్వామికి గ్రామస్తులు, మహిళల ఫిర్యాదు
- ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై ఆరోపణలు

టంగుటూరు: 'సార్.. మా ఊరిలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. కొందరు వీధుల్లోనే మద్యం తాగి అసభ్యకరంగా ప్రవరిస్తున్నారు. గడప దాటి బయటకు రావాలంటే భయమేస్తోంద'ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి ఎదుట పొందూరు గ్రామ మహిళలు వాపోయారు. మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పొందూరు వెళ్లిన మంత్రికి మహిళలతోపాటు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పొందూరులో నలుగురు వ్యక్తులు అక్రమ మద్యం, గంజాయి ప్యాకెట్లు అమ్ముతున్నారు. వీరి నుంచి గ్రామ టీడీపీ నాయకుడైన ఎంపీటీసీ సోదరుడు నెలకు రూ.30 వేలు తీసుకుని పోలీసులు దాడి చేయకుండా కాపాడుకుంటూ వస్తున్నాడని టీడీపీ నాయకుడు తగరం కోటేశ్వరరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి మద్యం తీసుకొచ్చి బెల్ట్ షాప్‌లో విక్రయిస్తూ ఒక్కో క్వార్టర్‌పై రూ.50 అధికంగా వసూలు చేస్తున్నారని, గంజాయి ప్యాకెట్లు బహిరంగంగానే అమ్ముతున్నారని వివరించారు. తాగుబోతులు రచ్చ రచ్చ చేస్తుండటంతో బయటకు రావాలంటేనే భయంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పొందూరు మద్యం, గంజాయి విక్రయాల గురించి ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, వారికి నెల నెలా క్రమం తప్పకుండా ముడుపులు అందుతుండటం వల్లే గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు.

ఆగమేఘాలపై ముగ్గురు అరెస్టు

నలుగురు వ్యక్తులు మద్యం విక్రయిస్తున్నారని మంత్రికి మహిళలు ఫిర్యాదు చేయగా టంగుటూరు పోలీసులు రంగంలోకి దిగారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు తమ సిబ్బందితో కలిసి గ్రామానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులను బైండోవర్ చేశామని, పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

NAVODAYA COACHING
- నవోదయ కోచింగ్ 5th, 8th నవోదయ ఎంట్రాన్స్ లాంగ్ టర్మ్ క్లాసులు జరుగుచున్నవి. హాస్టల్ వసతి కలదు. సంప్ర॥ గాంధి పబ్లిక్ స్కూలు, మంగమూరు రోడ్డు, ఒంగోలు. 93904 10032. [OA-447]
- డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-235]
- ఒంగోలు ఫర్నిచర్ షాప్‌లో పనిచేయుటకు లేడీస్ స్టాఫ్ కావలెను వయసు (18 టు 35) ఉండవలెను. జీ.12000/- ఇవ్వబడును. సెల్: 90305 90855. [SCA25005738]
- ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th - డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-624]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సోమశిలలో 31.742 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 31.742 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,400
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,075
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,347
సవర (8 గ్రాములు)	రూ.74,776

గరిష్టం/కనిష్టం
34.0 /29.9

వాతావరణం

జిల్లాలో బుధవారం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

93.83 శాతం పింఛన్ల పంపిణీ

దివ్యాంగురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 3,04,034 మందికి పింఛన్ల నగదు అందజేయాల్సి ఉండగా 2,85,261 మందికి పంపిణీ చేశారు. నగరంలోని పొదలకూరు రోడ్డులోని గౌతమీనగర్‌లో దివ్యాంగురాలు భానుశ్రీకి కలెక్టర్ ఓ ఆనంద్ నగదు అందజేశారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ అరుణ నియామకం

- తిరస్కరించిన డాక్టర్

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సిద్ధానాయక్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా పెద్దాస్పత్రిలోని పల్మనాలజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అరుణను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులను ఆమె తిరస్కరించారు. తాను ఆ బాధ్యతలు చేపట్టలేనని డీఎంఈకు విన్నవించారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

నెల్లూరు రూరల్: రొట్టెల పండగ ఏర్పాట్లలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో రొట్టెల పండగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి ఐదు రోజులపాటు జరిగే రొట్టెల పండగకు గతంలో కంటే ఎక్కువగా భక్తులు విచ్చేస్తారని, అందుకనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. స్వర్ణాల చెరువులో సరిపోయే నీటిని ఉంచాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ స్థలాల వద్ద, ఇతర అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. మెడికల్ టీంలను, అంబులెన్స్‌లను సన్నద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కువ సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రొట్టెల పండగ ఏర్పాట్లలో భాగమయ్యే వివిధ శాఖల సిబ్బందికి ఆయా రోజుల్లో ఎటువంటి సెలవులు మంజూరు చేయొద్దని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఏఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్డీఓ అనూష, విద్యుత్, ఇరిగేషన్ ఎస్ఈలు విజయన్, దేశ్‌నాయక్, డీఎంహెచ్ఓ సుజాత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్.. ఈ పేరు వింటేనే కూటమి ప్రభుత్వ పెద్దల నుంచి పార్టీ నేతల వరకు వణుకు పుడుతోంది. ఆయన బయటకు వస్తే తరలి వచ్చే జన ప్రభంజనాన్ని చూసి భయ కంపితులు అవుతున్నారు. జగన్ పర్యటన విజయవంతం కాకూడదనే అడుగడుగునా అడ్డంకులు, ఆంక్షలతో అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. మాజీ సీఎం భద్రతను దృష్టిలో ఉంచుకుని హెలిప్యాడ్ కోసం వైఎస్సార్‌సీపీ నేతలు సూచించిన స్థలాలను కాదని, అనువు కాని ప్రాంతాలు సూచిస్తుండడం చూస్తేనే అధికార పార్టీ నేతల్లో భయం టన్నుల్లో ఉందని అర్థమవుతోంది. జెడ్ కేటగిరీ భద్రత కలిగిన వైఎస్ జగన్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహారంపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆయన్ను ఆపలేరంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

(ఫైల్)

జగన్ వస్తే జన ప్రభంజనమే!

అందుకే అడుగడుగునా అడ్డంకులు

- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో హెలిప్యాడ్‌కు అనుమతివ్వని పోలీసులు, అధికారులు
- అనువు కాని ప్రాంతాలు ప్రతిపాదిస్తూ కుట్రలు
- తాత్కాలికంగా పర్యటన వాయిదా
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆయన్ను ఆపలేరంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జనాదరణ చూసి భయపడి

మాజీ సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్రంలో రోజు రోజుకు జనాదరణ పెరుగుతోంది. ఏ ప్రాంతానికి వెళ్లినా వేలాది మంది అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి పర్యటనను విజయవంతం చేస్తున్నారు. కూటమి పాలన ఏడాదిలోనే పూర్తిగా వైఫల్యం చెందడంతో జగన్‌కు సంఘీభావం తెలిపేందుకు జన ప్రభంజనమై కదలి వస్తున్నారు. ఈ క్రమంలో జనాదరణ పెరుగుతుండడంతో, గతేడాది జరిగిన ఎన్నికల్లో కూటమి గెలుపుపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దీంతో కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుంది. మరో వైపు టీడీపీ మహానాడు, ఇటీవల లోకేశ్ పర్యటలు అట్టర్ ఫ్లాప్ కావడంతో కూటమి పాలనపై ప్రజాభిప్రాయ వెల్లడవుతోంది. ఇటీవల రాప్తాడు, తెనాలి, ప్రకాశం జిల్లా పొదిలి, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన వైఎస్ జగన్ పర్యటనల్లో పోలీసులు సృష్టించిన అడ్డంకులను అధిగమించి పొలాలు, కాలి బాటల్లో పరుగులు తీస్తున్న జన సందోహంతో కూటమి నేతలకు వణుకు పుడుతోంది. ఈ క్రమంలోనే అక్రమ కేసులు పెట్టి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైల్లో పెట్టడంతో ఆయన్తో ములాఖత్ అయ్యేందుకు నెల్లూరు పర్యటనను అడ్డుకునే ప్రయత్నాలు ముమ్మురం చేసింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అక్రమ కేసులతో సెంట్రల్ జైల్లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోంది. హెలిప్యాడ్స్ కోసం వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు నెల్లూరు రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల స్థలాలు పరిశీలించారు. పలు ప్రాంతాలను ఎంపిక చేసి కలెక్టర్ అనుమతి కోరినా ససేమిరా అంటున్నారు. ఎలాగైనా వైఎస్ జగన్ పర్యటనను కూటమి ప్రభుత్వ పెద్దలు అడ్డుకునేందుకు పన్నే కుయుక్తులకు జిల్లా అధికార యంత్రాంగం సైతం వంతపాడుతూ అడ్డంకులు సృష్టిస్తున్నారు.

జైలు పక్కనే అనువు కాని స్థలాన్ని చూపడంతో..

వైఎస్ జగన్ పర్యటనకు జనసందోహం తరలివచ్చే అవకాశం ఉండడంతో కూటమి ప్రభుత్వ పెద్దలు కుయుక్తులు పన్నుతున్నారు. జగన్ అభిమానులకు అడ్డుకునేందుకు సెంట్రల్ జైలు పక్కనే ఉన్న స్థలాన్ని చూపి అక్కడే హెలిప్యాడ్ చేసుకోవాలని సలహా ఇచ్చారు. అయితే ఆ స్థలం హెలిప్యాడ్‌కు అనువు కానిది. ముళ్ల పొదలతో నిండి ఉంది. అంతే కాదు సమీపంలోనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు పోతున్నాయి. అక్కడ చాపర్ దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. క్రైస్తవ మిషనరీ పాఠశాల గ్రౌండ్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతిపాదిస్తే.. హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయని నిరాకరించిన పోలీసులు జిల్లా జైలు సమీపంలోనూ ఇలాంటి ప్రమాదకరమైన హైటెన్షన్ ఉంటే అక్కడ అనుమతిస్తామని చెప్పడం చూస్తే వైఎస్ జగన్ భద్రతపై కూడా అనుమానం పెరుగుతోంది. ప్రమాదం జరిగే ప్రాంతాన్ని చూపించడం వెనుక పెద్ద కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది.

ఐదు ప్రాంతాల్లో హెలిప్యాడ్ పరిశీలించినా..

నెల్లూరు రూరల్ పరిధిలో ఐదు ప్రాంతాల్లో హెలిప్యాడ్‌కు స్థలాలను పరిశీలన చేశారు. కనుపర్తిపాడు, కొత్తూరు–అంబాపురం, కాకుటూరు ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసి ఎంపిక చేశారు. అయితే ఆయా భూముల యజమానులకు స్థలం ఇవ్వొద్దని కూటమి నేతలు బెదిరింపులు చేశారు. ఆయా భూముల్లో వివాదాలు ఉన్నాయంటూ రభస చేయడంతో కొందరు యజమానులు స్థలం ఇచ్చేందుకు వెనక్కి తగ్గారు. కొత్తూరు ప్రాంతంలో క్రైస్తవ మిషనరీ ఆధ్వర్యంలో నడిచే పాఠశాల గ్రౌండ్‌ను ఎంపిక చేసినా రాజకీయ బెదిరింపులతో అడ్డుకున్నారు. వారు ముందుగా వెనక్కి తగ్గినా వైఎస్ జగన్ కోసం తాము ఇబ్బంది పడ్డా పర్వాలేదని స్థలం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. కానీ కూటమి ప్రభుత్వ నేతలు పోలీస్ శాఖ ద్వారా ఆ స్థలం సమీపంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని సాకు చూపించి అనుమతి ఇవ్వలేదు. మరికొన్ని ప్రాంతాల్లో సూచించిన హెలిప్యాడ్ స్థలాలకు జిల్లా అధికారులు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు.

పోలీసుల కఠిన ఆంక్షలు

వైఎస్ జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చినా.. పోలీస్‌శాఖ కఠిన ఆంక్షలు పెడుతోంది. హెలిప్యాడ్ వద్దకు కేవలం వంద మంది మాత్రమే వెళ్లాలంటా. అంతకు మించి వెళ్తితే ప్రతి 25 మందికి ఒకరు సూపర్‌వైజింగ్ చేసేలా లీడర్ పేరు వివరాలు ఇవ్వాలంటా. కేవలం జగన్ కాన్వాయ్‌లో భద్రత వాహనాలతోపాటు ఐదు వాహనాలకే అనుమతి ఇస్తారంటా. ఒక వేళ ఎక్కువ వాహనాలు రావాలంటే ఆ వాహనం నంబర్, డ్రైవర్ పేరు, డ్రైవింగ్ లైసెన్స్ ముందుగానే ఇవ్వాలంటా. ఇలా కఠిన ఆంక్షలతో అభిమానాన్ని అడ్డుకునేందుకు పోలీస్ శాఖ చూపిస్తున్న అత్యుత్సాహంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాడు.

పర్యటన అడ్డుకునేందుకే..

మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో వైఎస్ జగన్ ములాఖత్‌ను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం సర్వ శక్తులు ఒడ్డుతోంది. రాష్ట్ర హోంమంత్రి సైతం పోలీస్‌శాఖకు అనుమతులు ఇవ్వొదని చెబుతున్నట్లు సమాచారం. గుంటూరు రేంజ్ స్థాయి అధికారి సైతం పర్యటనను అడ్డుకోవాలని పోలీస్ శాఖకు ఆదేశాలివ్వడంతో కొర్రీలు వేస్తూ అనుమతులకు నిరాకరణ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జగన్ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి.

ఇది ముమ్మాటికీ అక్రమ కేసే

- కృష్ణపట్నం కేసులో తన పాత్రపై స్పష్టత ఇవ్వగలరానని కాకాణి డిమాండ్
- పలు ప్రశ్నలకు కాకాణి దీటుగా సమాధానం
- తిరిగి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన పోలీసులు

కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'నేను స్పష్టంగా పోలీసులను అడిగేది ఒకటే. నా పాత్రపై ఏమైనా ఉంటే రుజువు చేయగలరా? ఇది అక్రమ కేసని తెలియకుండా కప్పిపుచ్చడానికి పోలీస్ కస్టడీ పేరుతో దొంక తిరుగుడు ప్రశ్నలు సంధించడం తప్ప మరొకటి లేదు. రెండు రోజులుగా పోలీస్ కస్టడీలో నా పాత్ర గురించి కానీ, నాకు ఒనగూరిన లబ్ధి గురించి ఏ చిన్న ఆధారాన్ని పోలీసులు చూపించలేక పోయారంటే ఇది ముమ్మాటికీ అక్రమ కేసు బనాయించడమేని అర్థమవుతోంది.' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసులను నిలదీసినట్లు సమాచారం. కృష్ణపట్నం లాజిస్టిక్ చెక్‌పోస్టు ద్వారా బలవంతంగా నగదు వసూలు చేశారని నమోదైన అక్రమ కేసులో సెంట్రల్ జైల్లో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని రెండు రోజుల పాటు ముత్తుకూరు పోలీసులు పోలీస్ కస్టడీకి తీసుకుని ప్రశ్నించారు. మొదటి రోజు 52 ప్రశ్నలు, రెండో రోజు మంగళవారం ఆరు ప్రశ్నలు అడగడంతో కాకాణి దీటుగా సమాధాన మివ్వడంతో పోలీసులు సైతం నీళ్లు నమిలినట్లు తెలుస్తోంది.

పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనం

మీరు అక్రమ కేసులు బనాయించడం, సాక్షులు, సహ నిందితులను భయపెట్టి బెదిరించి ఇష్టారీతిన స్టేట్‌మెంట్ల మీద సంతకాలు చేయించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో తెల్ల కాగితాల మీద ముందుగానే సంతకాలు తీసుకుంటున్నారు. న్యాయస్థానంలో నిలబడని స్టేట్‌మెంట్లపై నేను వ్యాఖ్యానించ దలుచుకోలేదు. నేను తప్పు చేసి ఉంటే సాంకేతిక పరంగా విచారణ చేసి నా పాత్ర ఉందని రుజువు చేస్తే నేను ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నట్లు పోలీసులకు సవాల్ విసిరారని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ అక్రమ కేసుల్లో వైఎస్సార్‌సీపీ చెందిన వారినే నిందితులుగా చూపిస్తూ డాక్యుమెంట్‌లో ఉన్న మిగిలిన వారిని వదిలి వేయడం పోలీసుల పక్షపాతి వైఖరికి నిదర్శనమని విమర్శించారని సమాచారం. ఎవరో చేసే వ్యాపారాలకు నన్ను జవాబుదారి చేయడం పోలీసులకు భావ్యం కాదన్నారు. నాకు అసోసియేషన్ గొడవలతో ఏంటి సంబంధం, పత్రికల్లో వచ్చిన వార్తలను నేను పట్టించుకోను. ఇటీవల పోలీస్ కస్టడీకి తీసుకున్నప్పుడు 'ఓ ఎల్లో పత్రికలో నాకు గుర్తులేదు. మా న్యాయవాదులను అడగండి' అని చెప్పినట్లు నేను మాట దాటవేసినట్లు రాశారు. ఇవన్నీ అసత్యాలే. పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెపుతున్నాను. నాకు తెలియని విషయాలు మాత్రం తెలిదయనే చెప్పుతున్నాను. నాపై బురద చల్లేందుకు కక్ష కట్టి తప్పుడు కథనాలు రాయిస్తున్నారు. నాకు సంబంధం లేని ఈ కేసులో పోలీసులు ఏ–1గా చేర్చారు. ఇది కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసు నమోదు చేసిందనేందుకు ఇదే నిదర్శనంగా చూపవచ్చు.

సోమిరెడ్డి తప్పుడు ఆరోపణలపై కేసులా?

సర్వేపల్లి నియోజకవర్గంలో రెండు సార్లు నాతో పోటీ చేసి ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నా మీద, వైఎస్సార్‌సీపీ నాయకులు మీద నిత్యం అసత్య ఆరోపణలు చేశారు. యూనియన్ గొడవల్లోకి రాజకీయ జోక్యం అవసరం లేదు. ఏ యూనియన్లతో కానీ, ప్రెస్‌మీట్లతో కానీ నాకు సంబంధం లేదు. అలాంటప్పుడు నాపై అక్రమ కేసు బనాయించినట్లే అవుతోంది. రెండు రోజుల పాటు నన్ను కస్టడీకి తీసుకున్నారు కదా నా సమక్షంలోనే సాక్షులను విచారిస్తే నాకు వారితో సంబంధం లేదని తెలుస్తోంది. అలా చేయకుండా కస్టడీ పేరుతో ఏదో జరుగుతుందంటూ ప్రచారం చేయడానికి కాకపోతే దేనికి ఇదంతా అని కాకాణి సంధించిన పలు ప్రశ్నలకు పోలీసులు సైతం నీళ్లు నమలాల్సి వచ్చింది.

వృద్ధుల ఆచూకీ కోసం గాలింపు

సోమశిల: మల్లెంకొండ అటవీ ప్రాంతంలో తప్పిపోయిన వృద్ధులు కోటపాటి రత్నయ్య, కోటపాటి సుబ్బయ్య నాయుడుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మంగళవారం సోమశిల ఎస్సై అనూష, అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, పొదలకూరు ఎస్సై హనీఫ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఫోర్స్, రెవెన్యూ అధికారులు, కుటుంబ సభ్యులు ఇతర వ్యక్తులతో చిలకలమర్రి మల్లెంకొండ శిలల వద్దకు వెళ్లి అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 40 మంది వెళ్లారు. అయినా అన్నదమ్ముల ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. స్మగ్లర్ల చేతిలో చిక్కుకున్నారా అనే అనుమానంతో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబం కోరుతోంది. ఎస్సై అనూష మాట్లాడుతూ వృద్ధుల ఆచూకీ తెలిపితే రూ.10 వేల పారితోషికం అందిస్తామన్నారు.

చిలకలమర్రి మల్లెంకొండ శిలల వద్ద ప్రత్యేక పోలీస్ బృందాలు

జగన్ పర్యటనపై కూటమి కుట్రలు

- నెల్లూరు ఏమన్నా.. ఖర్జూరపునాయుడి జాగీరా?
- జగన్ బయటకు వస్తే బాబుకు భయం
- మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజల్లో విశేష స్పందన లభిస్తుండడంతో చంద్రబాబుకు భయం పట్టుకుందని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న జగన్‌ను కూటమి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అర చేతితో సూర్యకాంతిని ఎలా ఆపలేరో.. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు, కుట్రలు సృష్టించినా జగన్ పర్యటనను ఆపలేరని తెలుసుకోవాలన్నారు. జగన్ హెలికాప్టర్ దిగడానికి కూడా వీలులేకుండా చేయడం దుర్మార్గమని, నెల్లూరేమన్నా.. చంద్రబాబు నాయన ఖర్జూరపునాయుడు జాగీరా అని ప్రసన్నకుమార్‌రెడ్డి మండిపడ్డారు. జగన్ ప్రజల మధ్య ఉండే నాయకుడని, ఆయన పర్యటనల్లో ప్రజలు తండోపతండాలుగా పాల్గొంటారని చెప్పారు. 'బాబు, లోకేశ్, పవన్ పర్యటనలకు సెక్యూరిటీ సిబ్బంది తప్ప.. జనం కానరాని, అదే జగన్ వస్తే వేలాదిగా జన ప్రభంజనమవుతుందన్నారు. గతంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిర్వహించిన సభలను వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. కాకాణితో ములాఖత్ అయ్యాక, ఆ కుటుంబాన్ని పరామర్శించే ఈ పర్యటనను అడ్డుకోవడం ప్రభుత్వం దుర్మార్గమన్నారు. ఇది రాజకీయ పర్యటన కాదని, మానవతా పరమైన పరామర్శ మాత్రమే అన్నారు.

కూటమికి కౌంట్ డౌన్ స్టార్ట్

బాబు ఇటీవల ఐదారు సర్వేలు చేయించారు. 97 స్థానాల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని నివేదికలు రావడంతో చంద్రబాబులో టెన్షన్ ప్రారంభమైందన్నారు. ఇటీవల జరిగి టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి 15 ఎమ్మెల్యేలు కూడా హాజరు కాలేదు. వీటన్నంటిని చూసి భయంతో జగన్ పర్యటనలకు అనుమతులు నిరాకరణ చేస్తున్నాడని ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు.

అక్రమ అరెస్టులకు ప్రజల తీర్పు సిద్ధం

వైఎస్సార్‌సీపీ నేత వీరి చలపతిరావు మాట్లాడుతూ జగన్ పర్యటనను అడ్డుకునే కుట్రలకు కూటమి ప్రభుత్వానికి ప్రజలు తీర్పు సిద్ధంగా ఉందన్నారు. కాలువ గట్లు, పొలాలు గట్లపై జనం పరుగులు తీస్తున్న తీరు చూసి కూటమి నాయకుల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. కూటమి నాయకులూ కళ్లు తెరిచి ఎన్నికల్లో చెప్పిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ చేసిన పోరాట ఫలితంగానే తల్లికి వందనం (అమ్మఒడి) పథకం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరెడ్డి దినేష్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నరసింహులురెడ్డి, సుబ్బారెడ్డి, షాహుల్, బాలశంకర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీలత, రఫీ, రూప్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

కాకాణికి ముగిసిన పోలీసుల కస్టడీ విచారణ

నెల్లూరు (లీగల్): కృష్ణపట్నం పోర్టు సమీపంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని నమోదైన కేసులో ఏ–1గా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రెండు రోజుల పోలీసుల కస్టడీ విచారణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ముత్తుకూరు పోలీసులు జిల్లా కేంద్ర కారాగారం నుంచి కస్టడీకి తీసుకుని జైలు పక్కనే ఉన్న డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మధ్యవర్తులు, కాకాణి తరఫు న్యాయవాది రావూరు గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో కృష్ణపట్నం పోర్టు సీఐ రవినాయక్, ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి ఆరు ప్రశ్నలు అడిగారు. కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో గోవర్ధన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం నెల్లూరు రెండో అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి శారదారెడ్డి ఉత్తర్వులు మేరకు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

కిలో పొగాకు సగటు ధర రూ.209.82

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 697 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 851 బేళ్లు రాగా 697 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కిలోకు రూ.280 గరిష్ఠ ధర కాగా, రూ.160 కనిష్ఠ ధర లభించింది. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

లీటరు పాల కొనుగోలుపై రూ.1.50 పెంపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లాలోని విజయ డెయిరీ పాలక మండలి పాడి రైతులకు శుభ వార్త అందించింది. జూలై 1వ తేదీ నుంచి విజయ డెయిరీ కొనుగోలు చేసే పాలసేకరణలో లీటరు కొనుగోలుపై రూ.1.50 పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మంగళవారం తెలిపారు. పాడి రైతులకు ప్రయోజనకరంగా పాలకమండలి నిర్ణయం తీసుకుందన్నారు.

వైద్యశాఖ.. వివాదాలమయం

- రెండు రోజుల క్రితం ఎఫ్ఎన్ఓ, నర్సు ఆత్మహత్యాయత్నం
- చోద్యం చూస్తున్న ఆ శాఖ అధికారులు
- తప్పు చేసిన వారిని శిక్షించలేకపోతున్న వైనం

నెల్లూరులోని వైద్యశాఖ కార్యాలయం

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ వివాదాలమయంగా మారిపోయింది. ప్రజలకు సేవలందించాల్సిన కొందరు డాక్టర్లు, నర్సులు, సిబ్బంది తగాదాలు పెట్టుకుంటున్నారు. పైఅధికారులకు తరచూ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. నెలల తరబడి ఇలా జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం మానేశారు. తప్పులను మొదట్లోనే సరి చేయకపోవడంతో మూడు రోజుల క్రితం ఏఎస్‌పేట పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎఫ్ఎన్ఓ దొరసానమ్మ తనను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు లక్ష్మి వేధిస్తోందని నిద్రమాత్రలు మింగింది. దీంతో తర్వాత రోజు లక్ష్మి కూడా తనకు డాక్టర్లు సెలవు ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ, అలాగే తనపట్ల ఇబ్బందిగా ఎఫ్ఎన్ఓ ప్రవర్తిస్తోందంటూ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. వారిద్దరూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం జిల్లాలో సంచలనం రేకెత్తించింది.

పట్టించుకోకుండా..

పలు పీహెచ్‌సీల్లో తగాదాలు జరుగుతున్నా వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. స్టాఫ్ నర్సు రెండేళ్ల క్రితం వరకు ప్రకాశం జిల్లా కనిగిరిలో పనిచేసేది. ఏం జరిగిందో గానీ అక్కడ గొడవలు జరిగాయి. ఆ జిల్లా డీఎంహెచ్ఓపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమెను ఏఎస్‌పేటకు బదిలీ చేశారు. ఇక్కడ కూడా గొడవలు మొదలయ్యాయి. గత డీఎంహెచ్ఓ పెంచలయ్య ఉన్నప్పుడు ఆ నర్సు పలు ఫిర్యాదులు పంపారు. డాక్టర్లకు, ఆమెకు మధ్య విభేదాలున్నాయి. దీంతో వైద్యులపై ప్రస్తుత డీఎంహెచ్ఓ సుజాతతోపాటు కలెక్టర్‌కు పలుమార్లు సదరు నర్సు ఫిర్యాదు చేసింది. అంతటితో ఆగకుండా సుజాతపై కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కలెక్టర్ ఆదేశాలతో ఆ ఫిర్యాదులు పరిశీలించేందుకు ఆర్డీఓ, డీఎంహెచ్ఓతోపాటు ఐదుగురు అధికారులను నియమించారు. విచారణలో డాక్టర్లతోపాటు మరి కొందరితో కలిసి దొరసానమ్మ అనే ఎఫ్ఎన్ఓ ఆ నర్సుకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీంతో నర్సు ఎఫ్ఎన్ఓకి సంబంధించిన లోపాలను వెతికింది. దొరసానమ్మకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. భర్త లేడు. ఆమె ఓవైపు వైద్యశాఖలో పనిచేస్తూ మరోవైపు జీఎన్ఎం (నర్సు) కోర్సులో చేరింది. కాలేజీకి వెళ్లకుండా మేనేజ్ చేసుకుని ఆస్పత్రిలో డ్యూటీలు చేసుకుంటూ ఇంటి వద్ద చదువుకుంటూ జీఎన్ఎం తొలి సంవత్సరం పరీక్షలు రాసింది. కళాశాలకు వెళ్లకుండా ఎలా హాజరు వేస్తారని, అలాగే ఒకే సమయంలో ఇటు ఆస్పత్రి డ్యూటీ, అటు చదువుకు ఎలా అనుమతిస్తారంటూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు నర్సు ఫిర్యాదు చేసింది. దీంతో భయపడిన నర్సింగ్ కళాశాల యజమాని ఎఫ్ఎన్ఓను తమ కళాశాల నుంచి తొలగిస్తూ టీసీ ఇచ్చి పంపేశారు. తన కెరీర్‌ను నర్సు దెబ్బతీసిందని భావించిన ఎఫ్ఎన్ఓ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తర్వాత రోజు నర్సు తనను డాక్టర్లు సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ఎఫ్ఎన్ఓ తనపై అభ్యంతరకరంగా స్టేట్‌మెంట్ ఇచ్చిందని చెబుతూ నిద్రమాత్రలు మింగింది.

గోప్యంగా ఉంచకుండా..

విచారణ అధికారి వివిధ వ్యక్తుల దగ్గర నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. ఈ క్రమంలో నర్సుకు వ్యతిరేకంగా ఎఫ్ఎన్ఓ స్టేట్‌మెంట్ ఇచ్చింది. అయితే గోప్యంగా ఉంచాల్సిన విచారణ అంశాలను సిబ్బంది నర్సుకు అందజేసి గొడవ మరింత పెద్దది అయ్యేందుకు ఆజ్యం పోశారు. ఇలాంటివి తరచూ వైద్యశాఖలో జరుగుతున్నాయి. గతంలో అల్లీపురం పీహెచ్‌సీలో కూడా నర్సుల మధ్య గొడవలు జరిగాయి. చేజర్లలో కూడా సమస్యలు తలెత్తాయి. ఇలాంటి వాటిని విచారించి తప్పు చేసిన వారిని దూరంగా బదిలీ చేసి శిక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆ శాఖ పరువు పోతోంది. ఇప్పటికైనా లోపాలు సరి చేయాలని, అలాగే రహస్యంగా ఉంచాల్సిన నివేదికలను బహిర్గతం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్ఓ సుజాతను వివరణ కోరగా ఏమి చేయగలం.. మాపైనే రాష్ట్ర ఉన్నతాధికారులకు నర్సు ఫిర్యాదు చేస్తోందని సమాధానమిచ్చారు. అయినా విచారణ జరుపుతామని పేర్కొన్నారు.

స్వర్ణాల చెరువులో భక్తుల సందడి

నెల్లూరు(బారకాసు): ఈనెల 6వ తేదీన నెల్లూరులోని రొట్టెల పండగ మొదలవుతుంది. అయితే ముందుగానే బారాషహీద్ దర్గాకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల రాక మొదలైంది. మంగళవారం స్వర్ణాల చెరువులో భక్తులు స్నానాలాచరించారు. చిన్నారుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. ఓవైపు ఏర్పాట్లు జరుగుతుండగా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చెరువులో సరదాగా..

గుర్తుగా సెల్ఫీ

డెంగీ రహిత సమాజం కోసం కృషి

- డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): డెంగీ వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ సుజాత అన్నారు. డెంగీ అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయం నుంచి ములుముడి బస్టాండ్, గుప్తా పార్కు మీదుగా ర్యాలీ జరిగింది. దీనిని జెండా ఊపి ప్రారంభించిన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ తలనొప్పి, కళ్లు ఎర్రబడటం, జ్వరం, చర్మంపై ఎర్రటి మచ్చలు, వాంతులు తదితర లక్షణాలుంటే డెంగీగా అనుమానించి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూసుకోవడం ద్వారా డెంగీతోపాటు మలేరియా తదితర వ్యాధులు రాకుండా చూసుకోవచ్చన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, మలేరియా నివారణ సహాయ అధికారి నాగార్జునరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

కేంద్ర పథకాలపై రైతులకు అవగాహన

- దిశ సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి
- అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు జెడ్పీ నిధులు
- ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- హాజరుకాని మంత్రులు, ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న వేమిరెడ్డి

ఖాళీగా ఎమ్మెల్యేల కుర్చీలు

నెల్లూరు(పొగతోట): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని నెల్లూరు ఎంపీ, దిశ కమిటీ ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ (దిశ)ను మంగళవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో 732 అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని, శాశ్వత భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.30 కోట్లతో 24 ప్రాజెక్ట్‌లు చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన ద్వారా 89,577 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. 25,640 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. జిల్లా అభివృద్ధి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా లోపాలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ అడిగిన వెంటనే రోడ్లు మంజూరు చేసిన ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు రూరల్‌లో పాఠశాలకు జెడ్పీ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ పాటించలేదని, ఆహ్వానాన్ని పంపించలేదన్నారు. ఇందుకు సంబంధించి ఏఈని ఎక్కడ దాచి పెట్టారని ప్రశ్నించారు. ఏఈపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు జెడ్పీ నిధులు మంజూరు చేశామని తెలిపారు. తిరుపతి జిల్లాలో నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి నిర్మాణాలు చేపట్టడంలో అధికారులు జాప్యం వహిస్తున్నారని తెలిపారు.
- కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు సంబంధించి గత సమావేశంలోనూ పీఆర్ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు ప్రగతి చూపలేదని, ఇదే విధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా మరికొంతమంది అర్హులను చేర్చేందుకు అవకాశం ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దాని కోసం తహసీల్దార్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జిల్లాలో ఉన్నా హాజరుకాలేదు.

ఆకట్టుకుంటున్న ఫర్నిచర్ ఎక్స్‌పో

నెల్లూరు(బృందావనం): అమ్మ ఫర్నిచర్ మాల్ ఆధ్వర్యంలో స్థానిక మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పో విశేషంగా ఆకట్టుకుంటోంది. దేశవిదేశాల్లో తయారైన ఫర్నిచర్‌ను వినియోగదారుల కోసం ప్రదర్శించడం జరుగుతోందని నిర్వాహకుడు గడ్డం సుజన్ మంగళవారం తెలిపారు. కొనుగోలుదారులకు 50 శాతం వరకు డిస్కౌంట్ అందజేస్తున్నామన్నారు. ఎక్స్‌పో బుధవారం ముగియనుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫర్నిచర్‌ను చూస్తున్న జనం

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని జొన్నవాడ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండటాన్ని గమనించి స్థానికులు సోమవారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

మాట్లాడుతున్న మహిళా డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని నెల్లూరు అబ్‌స్టెట్రిక్, గైనకాలజికల్ సొసైటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుప్రజ, డాక్టర్ లలితా షిర్డీశా అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో నెల్లూరు అబ్‌స్టెట్రిక్ సంఘానికి చెందిన మహిళా డాక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆమె తన పిల్లలను, భర్త ఆరోగ్యాన్ని కాపాడుకుంటుందన్నారు. మారిన ఆధునిక జీవనంలో రుతుక్రమంలో మార్పులు రావడం, ఊబకాయం సమస్యలు వస్తున్నాయన్నారు. ఆలస్యపు వివాహాల వల్ల సంతాన సాఫల్యత లేకపోవడం కూడా జరుగుతుందన్నారు. హైరిస్క్‌తో కూడిన గర్భిణులు ఎక్కువవుతున్నారన్నారు. ఇందువల్ల కాన్పులో సమస్యలు వస్తున్నాయన్నారు. అందువల్ల ఆరోగ్యానికి మహిళలు తగు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు డాక్టర్ వాణి, డాక్టర్ అహల్య, డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సచివాలయ ఏఎన్ఎంల కౌన్సెలింగ్

- పారదర్శకతకు పాతర
- తెల్లవారే వరకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రక్రియ
- కూటమి నేతల సిఫార్సులకే పెద్దపీట

నెల్లూరు(అర్బన్): జిల్లాలో సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంల కౌన్సెలింగ్‌ను వైద్యశాఖాధికారులు ఇష్టారాజ్యంగా మార్చేశారు. ముందస్తుగా సీనియారిటీ జాబితాను కూడా ప్రకటించలేదు. సుమారు 900 మంది వరకు సచివాలయాల పరిధిలో నర్సులున్నారు. వీరిలో ఎంతమంది బదిలీలకు అర్హుల్లో కూడా తెలియలేదు. సోమవారం రాత్రి వరకు ఖాళీలను కోరుకోవాలని ఆప్షన్స్ ఇచ్చారు. అయితే వెనువెంటనే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రక్రియను మొదలుపెట్టి మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 70 మంది వరకు బదిలీ చేశారు. అనంతరం కౌన్సెలింగ్‌ను ఆపేసి వారిని సచివాలయ పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని ఆదేశించారు. దీంతో వారు హడావుడిగా పెన్షన్లు అందించేందుకు వెళ్లారు. మధ్యాహ్నం నుంచి మిగతా వారికోసం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇది పూర్తయ్యేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

నేతల వల్లే..

కూటమికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు తాము చెప్పిన చోటకు బదిలీలు చేయాలని లెటర్లు ఇవ్వడంతో జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారని కొందరు ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు. అర్హులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకతకు చోటు లేదని విమర్శిస్తున్నారు. జూమ్ ద్వారా కౌన్సెలింగ్ అయితే డీఎంహెచ్ఓ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. ఉన్న చోటే ఫోన్ ద్వారా బదిలీలకు చెందిన ప్లేస్‌ను కోరుకోవాలి. అలా కోరుకునేందుకు జాబితా సిద్ధంగా లేదు. దీంతో ప్రశ్నించకుండా ఉండేందుకే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అసలు తెల్లవారే వరకూ ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పడం లేదు. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ఆనంద్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ అధికారులను హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, పింఛన్ల పంపిణీ మొదలైన అంశాలపై మంగళవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అశ్రద్ధగా ఉంటే చర్యలకు వెనుకాడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల్లో పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. హౌసింగ్‌లో ఉపాధిని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లాలో పాఠశాలలన్నీ ప్రారంభమయ్యాయని, ఇంకా ఒకటో తరగతిలో చేరాల్సిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. అత్యంత నిరుపేదలకు మంజూరైన అంత్యోదయ కార్డులకు ఈకేవైసీని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతినెలా ఒకటో తేదీన 95 శాతానికి పైగా పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. పంపిణీలో అశ్రద్ధగా ఉంటే సస్పెండ్ చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, హౌసింగ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, నాగరాజకుమారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సీపీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి..

- వృద్ధుడి బలవన్మరణం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని నాగులపాడు గ్రామంలో మంగళవారం షేక్ ఇమామ్ ఖాసీం (75) అనే వృద్ధుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఖాసీంకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. తన భార్య మృతిచెందిన తర్వాత ఆరు సంవత్సరాలుగా వింజమూరులో చిన్న కుమార్తె వద్ద ఉంటున్నాడు. అప్పుడప్పుడు నాగులపాడులోని బంధువుల వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. మంగళవారం వింజమూరులో పింఛన్ తీసుకున్నారు. తర్వాత ఆస్పత్రికి వద్దకు వెళ్లి వస్తానని కుమార్తెకు చెప్పాడు. అయితే మధ్యాహ్నానికి ఆయన నాగులపాడు గ్రామానికి వచ్చాడు. పలువురిని పలకరించాడు.

ఏమైందో కానీ గ్రామ శివారులో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి గ్రామస్తులు గుర్తించి పైకి తీసుకొచ్చారు. అప్పటికే ఖాసీం మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వింజమూరుకు తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-235]

REAL ESTATE

LAND FOR SALE

■ స్థలం అమ్మకం : నెల్లూరు పొదలకూరు రోడ్డులో ఉన్న పోస్టల్ కాలనీలో ప్లాట్ నెంబర్ 65 స్థలం అమ్మకం. రవి ✆ : 98496 44369 [SCA25005707]

PLOT FOR SALE

■ నెల్లూరు సిటీ, బుజబుజ నెల్లూరు, ఇండ్లు, విద్యా సంస్థల సమీపంలో ప్రశాంతి లే ఔట్ లో ప్లాట్లు అమ్మబడును. సంప్రదించండి. 87903 29447, 7382527139. [NA-5540]

SERVICES

GOLD FINANCE

■ బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. ఫోన్ : 98851 82772, 62813 46878 [V- 6762]

TOURS & TRAVELS

■ రైలు యాత్ర : నేపాల్ తేది 6-9-25, 12 రో॥ టిక్ 25,000, దసరా సెలవుల్లో రాజస్థాన్ యాత్ర తేది 23-9-25, 10 రో॥ టిక్కెట్ 1కి 20,000/- కె.వాసు, నెల్లూరు. 9491340504. [NA-24203]

■ వాడపల్లి, బిక్కవోలు, పట్టిసీమ, వేయి స్తంభాల గుడి, అష్టలక్ష్మి తేది 11-07-25, 2 రోజులు టిక్కెట్ 1కి 3250/- (A/c బస్సు, రూం+భో) కె.వాసు, నెల్లూరు. 9491340504 [NA-24204]

WANTED

■ Wanted Teachers to teach 7th - 10th Classes. Sub : Physics, Social. Con : Sriniketthan E.M. School, beside Dodla Dairy, Nellore. Cont : 94402 66743. [NA-2875]

■ Wanted female teachers to teach maths(2ndto7th), science (BZc graduate) from 3class to 8. Sri Krishna chaitanya high school santhapet. 9440549459. [NA-24267]

■ Wanted female telecallers Education Institute,Qualification AnyDegree. salary + incentives. contact : 9177386631. [SCA25005814]

■ Wanted well experienced php developer for our reputed software company PH No. 93462 39239, 98663 31257 [NA-11323]

■ Wanted Natural Science, Social Teacher(6 to 10) Sainadh School Varadapuram, Podalakur (M), Phone : 99499 88564. [NA-11324]

■ Wanted 1st Class Mother Teachers all subjects. Sal : Above 10,000/- Cont : Kids Kingdom E.M. School, Podalakur Road, Nellore. Ph : 94930 30638. [NA-2878]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-624]

■ నెల్లూరు, హాల్‌మార్క్‌లో కంప్యూటర్ ఆపరేటర్ గా ఏదైనా డిగ్రీ కల్గిన యువతీ యువకులు కావలెను. జీతం 10 వేలు to 12 వేలు. టైం. 10 AM to 9 PM. సంప్రదించండి. 9030313333 [NA-24268]

■ పొదలకూరులోని లేఔట్‌లో పని చేయుటకు వాచ్‌మెన్ కావలెను. (దంపతులకు ప్రాధాన్యత) ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి. 88971 26529. [NA-7031]

ప్రకటన గోరంత స్పందన కొండంత

CHANGE OF NAME

I, [illegible] (Old Name) (In my HDFC Bank Policy Certificate), Residing at 27-2-1366, Nirmala Nagar, Cheppula Factory Road, Balaji Nagar, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that my Correct name as [illegible] (New Name) S/o. SAGILI THIRUPATHI REDDY. I further declare that both names are one and the same person.

■ నెల్లూరు, హరనాథపురం మెయిన్ రోడ్ AMR HP పెట్రోల్ బంకులో డే&నైట్ షిఫ్ట్ పని చేయుటకు యువతీ యువకులు&ఎయిర్ బాయ్స్ కావలెను. 89852 64143, 94947 97343. [NA-7023]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాకర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ మా షోరూంలో పని చేయుటకు సేల్స్ గర్ల్స్, సేల్స్‌బాయ్స్ కావలెను. మంచి జీతము, ఆకర్షణీయ కమీషన్ ఇవ్వబడును. శ్రీ దక్షిణామూర్తి టెక్స్‌టైల్స్, మినిబైపాస్ రోడ్డు, నెల్లూరు. 94411 32023. [NA-130]

■ నెల్లూరు జిల్లాలో మండలాల వారీగా మార్కెటింగ్ మేనేజర్లు, ITI, Diploma విద్యార్హత గల ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం + PF + కమిషన్. 9000731560. [NA-7029]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

సాక్షి శ్రీకాకుళం

బుధవారం | 2 | జూలై | 2025

స్థానికులకు ఇదేం శిక్షణ

టైలరింగ్ శిక్షణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు సైతం వెళ్లాయి.
- 8లో

బదిలీల్లో నిబంధనలకు తూట్లు

హెల్త్ సెక్రటరీల బదిలీల్లో నిబంధనలకు తూట్లు పొడిచారు. ఉద్యోగులు ఆందోళనకు దిగారు.
- 8లో

మూతపడిన హోమియో వైద్యశాల

జలుమూరు: శ్రీముఖలింగం హోమియో వైద్యశాల మూతపడడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ అధికారి లేకపోవడంతో పాటు ఇక్కడ పనిచేసిన సిబ్బంది కూడా వేరే చోటకు బదిలీ కావడంతో కనీసం ఆస్పత్రిలో మందులు ఇచ్చేవారు కరువైపోయారు. తలుపులు, కిటీకీలు చెదలుపట్టి పాడైపోయాయి. అధికారులు స్పందించి హోమియో వైద్యశాల వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు వంశధార నీరు విడుదల

గొట్టా బ్యారేజీలో నీటి నిల్వ

హిరమండలం: జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వంశధార గొట్టాబ్యారేజీ నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా గొట్టా బ్యారేజీ నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా బుధవారం నీటి విడుదలకు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, వంశధార ఉన్నతధికారుల చేతులమీదుగా నీటిని విడుదల చేయనున్నట్లు గొట్టా బ్యారేజీ డీఈఈ బి.సరస్వతి మంగళవారం తెలిపారు. వర్షాలు ఆశాజనకంగా లేకున్నా బ్యారేజీలో కొంతవరకు నీటిని నిల్వ చేశామని, ఖరీఫ్ అవసరాలకు తగినట్టు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బ్యారేజీలో 38.01 మీటర్ల నీటిమట్టం ఉంది.

ఎయిర్ పోర్టు పేరుతో గ్రామాలకు రావద్దు

సర్వే బృందాలను అడ్డుకున్న బాధితులు

వజ్రపుకొత్తూరు రూరల్: కార్గో ఎయిర్ పోర్టు పేరుతో సర్వేలకు తమ గ్రామాలకు రావద్దంటూ బాధితులు నినాదాలు చేశారు. ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా కార్గో ఎయిర్ పోర్టు కోసం భూ సేకరణ పేరుతో గ్రామానికి వచ్చిన సర్వే బృందాలను మంగళవారం చీపురుపల్లి శివారు ప్రాంతంలో బాధితులు అడ్డుకున్నారు. గత కొంత కాలంగా కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో ఎయిర్ పోర్టు నిర్మాణానికి ముందుకు వెళ్లడం సరికాదని అన్నారు. పచ్చని ఉద్దానం నాశనం చేసేందుకు తాము సిద్ధంగా లేమని తమ పంటలను, ప్రాంతాన్ని కాపాడుకుంటామని అన్నారు.

జగన్మోహినిగా..

ఇల్లీసుపురంలో జగన్మోహినిగా జగన్నాథ స్వామి

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ స్వామి రథయాత్రలో భాగంగా ఇల్లీసుపురం కూడలిలో గల జగన్నాథ స్వామిని మంగళవారం జగన్మోహిని అవతారంలో అలంకరించారు. సుభద్ర, బలభద్రలతో పాటుగా జగన్నాథ స్వామిని అలంకరించగా, భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

కూర్మనాథుని హుండీ కానుకల ఆదాయం రూ.14,16,732

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయ హుండీ కానుకల ద్వారా రూ.14,16,732 ఆదాయం వచ్చిందని ఈఓ కె.నరసింహనాయుడు తెలిపారు. మంగళవారం ఆలయ బేడా మంటపం వద్ద పర్యవేక్షణాధికారి కె.నాగేశ్వరరావు సమక్షంలో ఆలయ హుండీలతో పాటు సమీప పాతాళ సిద్ధేశ్వరస్వామి ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. 98 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీహెచ్. సీతారామనృసింహాచార్యులు, అర్చకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

నిలేసి అడిగితే..?!

నేటి నుంచి ఇంటింటికీ రానున్న ప్రజాప్రతినిధులు

- కూటమి నేతల్లో ఆందోళన
- తొలి అడుగు పేరుతో ప్రజల్ని కలవనున్న నేతలు
- చేసింది చెప్పాలంటున్న చంద్రబాబు
- చేసిందేముందంటున్న నాయకులు
- ఏడాది దాటినా అమలుకు నోచుకోని హామీలు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు

పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన పి.నాగభూషణరావుకు ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు ఇచ్చిన బాండు ఇది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంయుక్తంగా సంతకాలు కూడా చేశారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ఇచ్చిన బాండులో నాగభూషణరావుకు ఆడబిడ్డ నిధి కింద రూ.18వేలు, తల్లికి వందనం కింద తన ఇద్దరు పిల్లలకు గాను రూ.30వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు చొప్పున సంవత్సరం మొత్తానికి రూ.68వేలు, ఐదేళ్లకు గాను రూ. 3లక్షల 40వేలు ఇస్తానని ఆ బాండులో రాసిచ్చారు. కానీ నాగభూషణరావుకు తొలి ఏడాది(2024–25)లో నయాపైసా ఇవ్వలేదు. తల్లికి వందనం కింద తన ఇద్దరు పిల్లలకు రావాల్సిన రూ. 30వేలు కూడా కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టేసింది.



పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన పి.రమణరావుకు ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు అందజేసిన బాండు ఇది. ఆడబిడ్డ నిధి కింద రూ.18వేలు, తల్లికి వందనం కింద రూ.15వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున సంవత్సరానికి రూ.53వేలు, ఐదేళ్లకు గాను రూ.2లక్షల 65వేలు ఇస్తామని బాండులో రాసిచ్చారు. 2024–25లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.



బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ బాండులో పేర్కొన్న ప్రధాన హామీల వివరాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

‘చంద్రబాబు.. పవన్ కల్యాణ్ అనే మేము మన రాష్ట్ర ప్రజలు మా సమష్టి నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని త్రికరణ శుద్ధితో ప్రమాణం చేస్తున్నాం. 2024లో టీడీపీ–జనసేన సంయుక్త పార్టీ అధికారంలోకి వచ్చాక మేమిద్దరం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీలోని వాగ్దానాలను అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం’** ఎన్నికల ముందు ఇంటింటికీ తిరిగి ఇచ్చిన బాండ్లలో కూటమి నాయకులు చెప్పిన మాటలివి. ఓట్లు వేసి గెలిపించాక ఈ బాసను పూర్తిగా మర్చిపోయారు. పైగా ఏడాదిలో అన్నీ చేసేశామని చెప్పుకుంటూ నేటి నుంచి ఇంటింటికీ తిరగనున్నారు. జనం కూడా బాండ్ పేపర్లు పట్టుకుని ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారు. తొలి అడుగులోనే ప్రశ్నించకపోతే మిగతా అడుగులు కూడా తప్పుగా పడతాయని జనం భావిస్తున్నారు.



దగా కాదా?

ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది సంక్షేమ పథకాలకు పంగనామం పెట్టారు. రెండో ఏడాది తల్లికి వందనం పేరుతో కొందరికి మాత్రమే ఇచ్చి, దాంట్లో కూడా కోత పెట్టిమమ అనిపించారు. స్థానిక సమస్యలు మొదలు మేనిఫెస్టోలోని హామీల వరకు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టకపోగా గత ప్రభుత్వంలో మొదలు పెట్టిన, దాదాపు పూర్తి కావచ్చిన పనులను సైతం గాలికొదిలేశారు. దీంతో నాయకులకు నిలదీతల భయం పట్టుకుంది.

వెన్నుపోటే కదా..

వైఎస్ జగన్ హయాంలో సంక్షేమ పథకాలు బంగారంలా అమలవుతుంటే.. రాష్ట్రం శ్రీలంకలా అయిపోతుందని భయపెట్టారు. వారు మాత్రం అవే హామీలు ఇచ్చి ఎన్నికలకు వెళ్లారు. సంపద సృష్టిస్తామని డాంబికాలు పలికి.. ఇప్పుడు సంపద ఎలా సృష్టించాలో చెవిలో చెప్పాలంటూ నాలుక మడతేస్తున్నారు. ఎన్నికల ముందు 143 హామీలిచ్చి పట్టుమని ఐదు కూడా అమలు చేయకుండా జనాలకు వెన్నుపోటు పొడిచారు.

భృతి ఎక్కడ..?

ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తాం, ఉద్యోగం వచ్చే వరకు నెలకి రూ.3వేల భృతి ఇస్తాం అంటూ ప్రకటించిన చంద్రబాబు అండ్ కో ఆ ఊసే మర్చిపోయారు. ఇప్పటికే ఏడాది గడిచిపోయింది. 7,28,210 మందికి రూ. 218.46కోట్ల మేర ఇవ్వకుండా మొండి చేయి చూపారు. రెండో ఏడాది కాకమ్మ కబుర్లు చెబుతున్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదు సరికదా వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం ఆయాలు, వైద్య శాఖలో తాత్కాలిక ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర చిరుద్యోగులను తీసేశారు.

అన్నదాత సుఖీభవ ఏదీ..?

చంద్రబాబు చెప్పిన పెట్టుబడి సాయం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు రూ. 20వేలు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక గాలికొదిలేశారు. గత ఏడాది జిల్లాలో 3,14,212 మందికి సంబంధించి రూ.628.42కోట్లు మేర ఎగ్గొట్టారు. ఈ ఏడాదికి ఇంకా అతీగతి లేదు.

వాయిదాల ప్రయాణం

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఉచిత బస్సు ప్రయాణంపై ప్రకటన లేదు. తేదీలు మార్చుకుంటూ పోతున్నారు.

భయపడుతున్న ప్రజాప్రతినిధులు

ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో జనం ఎక్కడ నిలదీస్తారోనని కూటమి నేతలు కూడా భయపడుతున్నారు. ముఖ్యమంత్రేమో ఇంటింటికీ వెళ్లి చేసింది చెప్పుకోవాలని చెబుతుంటే, అసలు చేసిందేముందని ప్రజాప్రతినిధులు అభద్రతాభావంలో పడ్డారు. మరో వైపు ఎక్కడికక్కడ ఇసుక, లిక్కర్, రోడ్లు, సాగు నీటి కాలువల అవకతవకలు, అక్రమాలు జరుగుతుండటంతో బహిరంగంగా ప్రశ్నిస్తారేమో, గుట్టు రట్టు చేస్తారేమో, బాగోతమంతా బయటపెడతారేమోనని ఆందోళన చెందుతున్నారు.

కొత్తవి లేవు.. ఉన్నవాటికి కోత

అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లకే మహిళలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆ ఊసే లేదు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాలో 3,07,537 మంది అర్హులు ఉన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లు దాదాపు 12 వేల వరకు ఏడాది కాలంలో తీసేశారు.

కొందరికే వందనం

తల్లికి వందనం పథకం గత ఏడాదికి సంబంధించి పూర్తిగా ఎగ్గొట్టేశారు. రెండో సంవత్సరం ప్రారంభమయ్యాక రూ.15వేలు కాదు రూ.13వేలు అని మాట మార్చేశారు. ఎంతమందికి ఇచ్చారో జిల్లా యూనిట్‌గా లెక్కే చెప్పడం లేదు. సవాలక్ష కారణాలు చూపుతూ ఆపేశారు. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల సంఖ్య అధికారికంగా ప్రకటించడం లేదు.

అరకొర గ్యాస్

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. కానీ ఒకే సిలిండర్‌తో చేతులు దులుపుకున్నారు. రెండో సిలిండర్ డబ్బులు ఎంతమందికి పడ్డాయో వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్నారు.

ఆడబిడ్డకు అన్యాయం

19 నుంచి 60ఏళ్ల లోపు మహిళలకు నెలకి రూ.1500 ఇస్తామని చెప్పారు. ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.1500 చొప్పున అందజేస్తామని చెప్పారు. జిల్లాలో ఈ పథకం కింద 7,59,692 మంది అర్హులై ఉన్నారు. వీరంతా తమకు రూ.1500 ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఒక సంవత్సరానికి సంబంధించి రూ. 113.95కోట్ల మేర కోల్పోయారు.

విద్యార్థులకు ఫీజు కష్టాలు

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు. వసతి దీవెన, విద్యా దీవెన అందించలేదు. జిల్లాలో 45,657మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.107 కోట్ల వరకు ప్రభుత్వం బకాయిలు పడి ఉంది. వసతి దీవెన సంగతి దేవుడెరుగు.

జ్వరాల వలస!

జ్వరాలతో బాధపడుతున్న కుటుంబ సభ్యులు

- టీడీవలసలో ప్రతి ఇంటా జ్వరాలు

జి.సిగడాం: మండలంలోని టంకాల దిగ్గువలస గ్రామానికి జ్వరం వచ్చింది. గ్రామంలో ఏ ఇంట చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. పది రోజుల నుంచి వంద మందికిపైగా జ్వరాల బారిన పడ్డారు. జ్వరంతో పాటు కాళ్ల పొంగులు, దురదలు కూడా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. డాక్టర్ బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, స్థానిక ఏఎన్ఎం చిన్ని, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యరాజేశ్వరితోపాటు సిబ్బందితో వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రజలు తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతానికి జ్వర పీడితుల సంఖ్య తగ్గుతోందని వైద్యాధికారి యశ్వంత్ తెలిపారు. డెంగీ, మలేరియా కేసులు లేవని పేర్కొన్నారు. పది మంది మాత్రమే జ్వర పీడితులు ఉన్నారని, మిగిలిన వారు కోలుకున్నారని వెల్లడించారు.

మా బడిని కాపాడండి

బూర్జ: మండలంలో గల వైకుంఠపురం గ్రామ ప్రాథమిక పాఠశాలను వేరే పాఠశాలకు తరలించవద్దని గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యంతో పాటు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. 3, 4, 5 తరగతులను ఉప్పినివలస గ్రామంలో గల ప్రైమరీ మోడల్ స్కూల్‌కు తరలించారని వారు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో హైవే క్రాసింగ్, కెనాల్ క్రాసింగ్ కారణాల వల్ల నిలుపుదల చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పాఠశాలను తరలించే ప్రయత్నం చేస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాల హెచ్ఎం విధుల్లో ఉండగానే నిరసన చేపట్టారు. వైకుంఠపుర పంచాయతీతోపాటు గ్రామాలు బొడ్డపాడు, గిరిజన గ్రామం అల్లెపల్లి గూడ ఉన్నాయన్నారు. శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారి దాటి పాఠశాలకు విద్యార్థులు ఎలా వెళ్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సర్పంచ్ విద్యాకమిటీ చైర్‌పర్సన్ టి.హైమావతి ఆధ్వర్యంలో నినాదాలు చేశారు.

వైకుంఠపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, గ్రామస్తులు

‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ విజయవంతం చేయండి

సన్నాహక సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ చేపట్టబోయే ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’ కార్యక్రమం గురువారం శ్రీకాకుళం నగరంలో అరసవల్లి రోడ్డులోని సన్‌రైజ్ హోటల్ వద్ద జరగనుందని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ సభ విజయవంతం చేయడమే మనందరి లక్ష్యమని అన్నారు. కార్యక్రమానికి జిల్లాలోగల అన్ని నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ ముఖ్య నాయకులు హాజరవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, కళింగవైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఆరంగి మురళి, చిట్టి జనార్ధన, ఎన్ని ధనుంజయరావు, వైవీ శ్రీధర్, చింతు రామారావు, అంబటి శ్రీనివాసరావు, బొబ్బది ఈశ్వరరావు, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తూరు: కొత్తూరు మండలం ఎన్ఎన్ కాలనీలోని మల్లా రామారావు ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 90 కిలోల పీడీఎస్ బియ్యంను స్థానిక సీఎస్ డీటీ బీమారావు మంగళవారం పట్టుకున్నారు. రామారావు పై 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ చెప్పారు. రామారావు ఇంటిలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు డీఎస్ఓకు ఫిర్యాదు వెళ్లినట్లు పేర్కొన్నారు. డీఎస్ఓ ఆదేశాల మేరకు రామారావు ఇంటిలో తనిఖీలు చేయగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు సీఎస్‌డీటీ చెప్పారు.

భోగాపురం నుంచి మూలపేటకు ఆరు లైన్ల రహదారి

టెక్కలి: భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం మూలపేట పోర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. అంతకు మునుపు టెక్కలి సమీపంలో పోర్టు అప్రోచ్ రోడ్డును పరిశీలించారు.

అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు. ఆయనతోపాటు ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనాలు..

జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న రిమ్స్ పరిస్థితికి అద్దం పట్టే చిత్రాలివి. మొదటి చిత్రంలో ఓ వృద్ధురాలు ఇలా ర్యాంప్‌పై వెళ్లడానికి అవస్థలు పడుతూ కనిపించారు. వాస్తవానికి ఆమెను వీల్‌చైర్‌పై తీసుకెళ్లాలి. కానీ రిమ్స్‌లో వీల్‌చైర్ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోంది. వీల్‌చైర్లు లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు ఇలా అవస్థలు పడుతున్నారు.

రెండో చిత్రంలో స్ట్రెచర్‌పై కనిపిస్తున్నవి రిమ్స్ రికార్డులు. ఎంతో భద్రంగా ఉంచాల్సిన రికార్డులను ఇలా రోగిని తీసుకెళ్తున్నట్లు స్ట్రెచర్‌పై తీసుకెళ్లడం చూసిన వారికి విస్మయం కలిగించింది. రిమ్స్‌లో రికార్డుల నిర్వహణ తీరుకు ఇదే నిలువెత్తు నిదర్శనం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

శభాష్ అరుణకుమారి!

ఉపాధ్యాయురాలు అరుణకుమారిని అభినందిస్తున్న డీఈఓ

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగులైతే చాలు.. తమ పిల్లల కోసం లక్షల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్న ఈ రోజుల్లో ఇద్దరు పిల్లల్ని సర్కారు బడిలో చదివించడం గొప్ప విశేషమని డీఈఓ సదాశివుని తిరుమల చైతన్య అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాల ప్రార్థనా సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, వారి సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు బి.అరుణకుమారి తన ఇద్దరు పిల్లల్ని అదే పాఠశాలలో చదివిస్తున్నట్లు తెలుసుకున్న అభినందించారు. ఉపాధ్యాయులంతా తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలో చదివిస్తే సర్కారు బడులపై, బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు మరింత నమ్మకం కలుగుతుందని చెప్పారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి కురమాన అప్పారావు ఉన్నారు.

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలు ప్రారంభం

పరీక్షలను పరిశీలిస్తున్న రెక్టార్ బి.అడ్డయ్య

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీలో వ్యాయామ విద్యా కోర్సులైన బీపీఈడీ, డీపీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ఈ నెల 4 వరకు జరగనున్నాయి. మొదటిరోజు పరీక్షకు 359 మంది విద్యార్థులకు గాను 11 మంది గైర్హాజరయ్యారు. వర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ స్వప్నవాహిణి పర్యవేక్షిస్తుండగా పరీక్షా కేంద్రాలను రెక్టార్ బి.అడ్డయ్య పరిశీలించారు.

సాగుహక్కు పత్రాలు పంపించడం తగదు

సమావేశంలో మాట్లాడుతున్న గంగరాపు సింహాచలం

బూర్జ: అన్నంపేట గ్రామ పరిధిలో ఎన్నో ఏళ్లుగా దళితులు, బలహీనవర్గాలు సాగుచేస్తున్న భూములకు సంబంధించి మంగపల్లి సూర్యప్రకాశరావు అనే వ్యక్తి ఆ భూములపై తనకే హక్కు ఉందంటూ ఇప్పుడు సాగు హక్కు పత్రాలు పంపించడం విడ్డూరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. మంగళవారం అన్నంపేటలో సాగుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ మూడులో 75 ఏళ్లుగా బలహీన వర్గాలకు చెందిన 30 కుటుంబాల వారు 25 ఎకరాల భూములను వరకట్టి బాగు చేసి సాగు చేస్తున్నారని చెప్పారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారుల సహకారంతో ఇప్పుడు హక్కు పత్రాలు పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాగులో ఉన్న వ్యక్తులకే భూముల చెందాలన్నారు. కార్యక్రమంలో దంత శ్రీరాములు, లుకలాపు అప్పలనాయుడు, ఎం.కిరణ్, సూరమ్మ, గౌరమ్మ, డి.లక్ష్మి, ఎస్.అప్పారావు, గణపతి, సూర్యనారాయణ, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఆదినారాయణ

రణస్థలం: కోష్ట సమీపంలో రాధాకృష్ణ మందిరం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం వి.ఎన్.పురం పంచాయతీ మిందిపేటకు చెందిన మింది ఆదినారాయణ శ్రీకాకుళం వైపు బైక్‌పై వస్తూ రాధాకృష్ణ మందిరం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న టాటా లగేజ్ వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడు 20 నిమిషాల పాటు రక్తపు మడుగులోనే కొట్టుమిట్టాడు. అనంతరం 108 అంబులెన్సు రావడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికులకు ఇదేం శిక్షణ!

- టైలరింగ్ శిక్షణలో జిల్లా ట్రైనర్లకు చోటు కల్పించని వైనం
- విజయవాడకు చెందిన సంస్థలకే శిక్షణా అనుమతులు
- న్యాయం చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు



ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన గాయిత్రి మహిళా సొసైటీ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు సామాజికవర్గాల మహిళలకు అందిస్తున్న టైలరింగ్ శిక్షణ ప్రారంభం నుంచే విమర్శలకు గురవుతోంది. అభ్యర్థుల ఎంపిక, శిక్షణ తీరు, సంస్థల ఎంపికలో ఆదిలోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు అభ్యర్థులకు శిక్షణ అందించే సంస్థలు స్థానికులకు కాకుండా విజయవాడకు చెందిన మూడు సంస్థలకు కట్టబెట్టడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. జిల్లాలో నైపుణ్యవంతులైన ట్రైనర్లను కాదని ఎక్కడో విజయవాడకు చెందిన సంస్థల నిర్వాహకులతో ట్రైనింగ్ ఇప్పించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఈ విషయమై కలెక్టర్ గ్రీవెన్స్‌లో సైతం ఫిర్యాదు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

ఇదీ పరిస్థితి..

బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ వర్గాలకు చెందిన 21 నుంచి 50 ఏళ్ల మధ్య గల మహిళలకు టైలరింగ్ శిక్షణ అందజేస్తున్నారు. రోజుకు రెండు షిఫ్టులో శిక్షణ అందిస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ అందజేస్తున్నారు. శిక్షణ ఫేస్ యాప్ ద్వారా హాజరు వేయిస్తున్నారు. ఇదంతా విజయవాడ సెంట్రల్ కార్యాలయం నుంచే ఆపరేటింగ్ జరుగుతుంది. అభ్యర్థులకు 75 శాతం హాజరును తప్పనిసరి చేశారు. వీరికి మాత్రమే శిక్షణ అనంతరం కుట్టుమిషన్, సామగ్రి అందజేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

సాధారణంగా జిల్లాలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను స్థానికంగా ఉండే సంస్థలకే ఇస్తుంటారు. దీనివల్ల సంస్థలకు ఆర్థిక ఆసరా కలగటంతో పాటు నాణ్యమైన శిక్షణ అందించే అవకాశం ఉంటుంది. అయితే తాజా టైలరింగ్ శిక్షణలో కేంద్రాల మంజూరు పూర్తిగా రాజకీయపక్షంగా జరగడంతో స్థానికులకు అవకాశం కల్పించలేదు. దీంతో పలువురు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాల నిర్వాహకులు ఇటీవల పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లాలో పది వరకు కుట్టు శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, వారికి ఉపాధి కల్పించాలని శ్రీకాకుళం నగరానికి చెందిన గాయిత్రీ మహిళా సొసైటీ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి ఫిర్యాదు చేశారు.

అయోమయ శిక్షణ..

జిల్లాలో 29 శిక్షణా కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో చేరేందుకు 2800 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరికి అంతంతమాత్రంగానే శిక్షణ అందుతోంది. శిక్షణ తూతూమంత్రంగా పూర్తిచేసి అక్రమాలకు పాల్పడేలా వ్యూహరచన జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శిక్షణ కేంద్రంలో మిషన్లు నాసిరకమైనవి సరఫరా చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుట్టుకు కావాల్సిన క్లాత్, ఇతర సామగ్రీ సరఫరా చేయడం లేదు. బయోమెట్రిక్ హాజరులోనూ అక్రమాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆ మూడు సంస్థలకే..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ శిక్షణకు విజయవాడకు చెందిన శాప్, కార్డు, శ్రీ టెక్నాలజీ సంస్థలే అందిస్తున్నాయి. దీనివల్ల స్థానికంగా శిక్షణకు కావాల్సిన అర్హతలున్న సంస్థలకు ట్రైనింగ్ ఇచ్చే అవకాశం లేకుండాపోయింది. శిక్షణ ఇవ్వడం ద్వారా వచ్చే ప్రతిఫలం స్థానికులకు కాకుండా ఎక్కడో విజయవాడలో ఉన్న కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా ప్రభుత్వం నిర్ణయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక మహిళకు మూడు నెలల్లో 360 గంటలు పాటు శిక్షణ అందించాలి. శత శాతం శిక్షణలు తీసుకున్న అభ్యర్థికి శిక్షణ ఇచ్చేందుకు రూ.28000 చొప్పున ప్రభుత్వం శిక్షణ సంస్థకు జమచేస్తుంది.

సైనికుడే నిజమైన దేశభక్తుడు

సైనికోద్యోగి పురుషోత్తంరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: దేశ రక్షణ వ్యవస్థలో పగలు, రాత్రి తేడా లేకుండా కంటిపై కునుకు లేకుండా దేశాన్ని కాపాడే సైనికుడే గొప్ప దేశభక్తుడని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామానికి చెందిన తిప్పన పురుషోత్తంరెడ్డి 28 ఏళ్ల పాటు ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నేటి యువతీ, యువకులు పురుషోత్తంరెడ్డి వంటి సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్, ఒడిశా పాత్రపురం బ్లాక్ చైర్మన్ ఏదురు మోహనరావు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మహతీ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు రంగాల జానకిరామ్, కళాకారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

ఎస్.ఆర్.సి.పురం పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

కంచిలి : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనే ధ్యేయంగా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషలాఫీసర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని, ట్రాన్సిషన్ 100 శాతం జరగాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు సకాలంలో నమోదుకావాలని సూచించారు. సమావేశంలో నాలుగు మండలాల ఎంఈఓలు అప్పారావు, శివరాంప్రసాద్, చిట్టిబాబు, జోరాడు, కృష్ణంరాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురుషోత్తపురం, ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాలల్ని డీఈఓ తనిఖీ చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. మోడల్ ప్రైమరీ స్కూల్ స్థాయిలో రోల్ పెంచినందుకు మౌలిక వసతుల కల్పనలో తనవంతు సహాయం చేస్తానని, ఒక ఉపాధ్యాయుడ్ని కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శారద, ఉపాధ్యాయులు నల్లాన రవి, సీఆర్ఎంటీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: తాగునీరు, భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కారిగూడ పంచాయతీ దొంద మానుగూడ గ్రామ గిరిజనులు పలువురు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావును కలిసి వినతపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న చైర్మన్ ఇంటికి వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు. మంచినీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలపై చైర్మన్‌తో చర్చించారు. పైనాపిల్, కొండచీపుళ్లు, చిరుధాన్యాలు వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సవర సింహాచలం, హడ్డుబంగి శేషమ్మ ఉన్నారు.

నకిలీ బంగారం మార్పిడిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు పరిధిలో మంగళవారం రాత్రి నకిలీ బంగారం మార్పిడికి సంబంధించి కేసు నమోదైంది. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తునికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమకు ఆరు లక్షల రూపాయలు ఇస్తే బంగారం ఇస్తామని ఒడిశా రాష్ట్రం రాయపూర్‌కు చెందిన శ్రీనివాస్, సూరిబాబులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా ఒరిజినల్ బంగారం బదులు నకిలీ బంగారాన్ని ఒడిశా వ్యక్తులకు అప్పగించారు. బాధితులు గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల్లో నిబంధనలకు తూట్లు

- ఇష్టారాజ్యంగా వార్డు హెల్త్ సెక్రటరీల ట్రాన్స్‌ఫర్లు
- అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు ప్రక్రియ
- నగరంలో ఉన్నవారికి స్థానికంగా పోస్టింగ్ ఇవ్వని వైనం
- రాత్రిపూట ఆందోళనకు దిగిన ఉద్యోగులు

కౌన్సెలింగ్ కోసం రాత్రిపూట ఎదురుచూస్తున్న హెల్త్ సెక్రటరీలు

శ్రీకాకుళం: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ జరుగుతుండటంతో సిబ్బంది ఆందోళనకు దిగారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలో బదిలీ ప్రక్రియ ప్రారంభి అవుతుందని ప్రకటించడంతో వారంతా డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకున్నారు. 605 మందికి ఈ బదిలీలు చేపట్టాల్సి ఉంది. జూన్ 28నే బదిలీలు జరగాల్సి ఉన్నా సీనియారిటీ జాబితా తదితర అంశాలలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రక్రియను సోమవారం నాటికి వాయిదా వేశారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో జరుగుతున్న నియమకాలు, బదిలీలపై తరచూ ఆరోపణలు వస్తుండం, మీడియాలో కథనాలు ప్రచురితం కావడంతో ఈసారి ఎవరికీ తెలియకూడదని యోచించారో ఇంకేమైనా కారణముందో తెలియదు గానీ కౌన్సెలింగ్ అర్ధరాత్రి చేపట్టారు. ఉదయం నుంచి పడిగాపులు కాసిన హెల్త్ సెక్రటరీలు సోమవారం రాత్రి 8 గంటల వరకు వేచిచూడల్సి వచ్చింది. అప్పుడు ప్రారంభమైన బదిలీల ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటల వరకు కొనసాగింది.

అమలుకాని నిబంధనలు..

వాస్తవానికి నియామకాలు, బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ రాత్రి వేళ జరపకూడదన్న నిబంధనలు ఉన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఏమాత్రం పట్టించుకోలేదు. హెల్త్ సెక్రటరీలకు వారి సొంత గ్రామాల్లో నియమించకూడదని, పట్టణ, నగర ప్రాంతాల్లో పనిచేసిన వారికి అదే ప్రాంతంలో వేరొక సచివాలయానికి బదిలీ చేయాలని, మండల సచివాలయాల్లో పనిచేసిన వారికి అదే మండలంలో వేరొక సచివాలయానికి బదిలీ చేయాలని ఆదేశించినా అమలు కాలేదు. నగరంలో పనిచేసిన కొందరిని వేరొక మండలంలో నియమించగా, మండలంలో పనిచేసిన కొందరిని నగరంలో నియమించారు. ఇది కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. నగరంతో పాటు శ్రీకాకుళం రూరల్ మండలంలోని కొన్ని స్థానాలను బ్లాక్ చేయగా హెల్త్ సెక్రటరీలు గంటకు పైగా ఆందోళన చేయడంతో వాటిని ఖాళీగా చూపించారు. అయితే వాటిని అడిగిన వారికి కాకుండా అధికారులు అనుకున్నవారికే కేటాయించడం గమనార్హం. ఇందుకు ఉదాహరణకు ఆదివారపుపేట సచివాలయం చెప్పవచ్చు. ఈ స్థానాన్ని సీనియారిటీ జాబితాలో 100 లోపు క్రమ సంఖ్యలో ఉన్నవారు అడిగినప్పుడు ఖాళీ లేదని చెప్పిన అధికారులు క్రమ సంఖ్య 300 దాటిన తరువాత ఉన్న ఓ అభ్యర్థికి కేటాయించడమే నిదర్శనం. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కొందరు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

వైఎస్ జగన్‌ను కలిసిన యువజన నేతలు

వైఎస్ జగన్‌తో యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్



యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) :వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీలు మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో యువజన విభాగ సమావేశంలో కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

యువత, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై, అన్యాయంపై గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. వీరితో పాటు శ్రీకాకుళం జిల్లాలో నియోజకవర్గ అధ్యక్షులందరూ పాల్గొన్నారు.

ఉద్యోగ, రైతు వ్యతిరేక ప్రభుత్వమిది

దుంపల రామారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో రైతు భరోసా కింద ఏటా రూ.13500 చొప్పున ఇచ్చారని, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికి ఒక్క రూపాయి ఇవ్వకుండా మోసగించారని మండిపడ్డారు. పంటల బీమా సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించి రైతుల్ని ఆదుకున్నారని గుర్తు చేశారు. కరోనా వంటి విపత్తులలో కూడా రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా రైతులను ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అసమర్థత వల్ల చిత్తూరు జిల్లాలోని మామిడి కిలో రెండు రూపాయలు చేరడంతో పాటు, ప్రకాశం జిల్లాలోని పొగాకు పంటను కూడా కొనలేని దుస్థితికి చేరుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మిరప క్వింటాకు రూ.25 నుంచి రూ.30 వేలు ధర ఇచ్చారని, ఇప్పుడు ఏకంగా రూ.8వేలు నుంచి రూ.11వేలుకి పడిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఆక్వా రంగంలో రొయ్యల ధర 50 శాతానికి పడిపోయిందన్నారు. ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ విషయమై నోరెత్తకపోవడం అన్యాయమన్నారు. కొత్త కొత్త రూల్స్ తీసుకొచ్చి గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు.

బదిలీలు సరే.. పోస్టింగ్ ఎప్పుడు?

- వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగుల గగ్గోలు
- కూటమి కౌన్సెలింగ్ అబాసుపాలు
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

శ్రీకాకుళం: కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరిగాయంటే గొప్ప పారదర్శకమని అందరికీ నమ్మకం.. బదిలీ చేసిన తర్వాత రిలీవింగ్.. పోస్టింగ్ ఇవ్వడం చట్టబద్ధమైన ధర్మం.. ఇందుకు ప్రభుత్వమే కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తుంది. వాటిని ఒక జీవోగా విడుదల చేస్తుంది. దానిని సంబంధిత అధికారులు, వారిపై ఉన్న అధికారులు అమలు చేసేలా చూడాలి. అది వారి బాధ్యత. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ జీవోను ఉత్తరాంధ్రలో బాధ్యతగల ఏ ఒక్క ఉన్నతాధికారి అమలు చేయకపోవడం, గౌరవించకపోవడం గమనార్హం. ఉత్తరాంధ్ర వైద్య ఆరోగ్యశాఖలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరిగిన వారిలో 39 మందికి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం ఏ రాజకీయ పార్టీ కూడా పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. అర్హతలు ఉన్నవారు బదిలీలకు ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకొని, ఖాళీగా ఉన్న స్థానాలకు బదిలీలు కోరుకొని, ప్రస్తుతం పని చేస్తున్న స్థానాలనుంచి రిలీవ్ ఆర్డర్లు పొంది, జాయినింగ్ అవ్వడానికి జిల్లా కార్యాలయాల్లో మూవింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మానసికంగా వేదనకు గురవుతున్నారు.

ముడుపుల కోసమేనా?

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కౌన్సెలింగ్ ద్వారా పది రోజుల క్రితం చాలామందికి బదిలీలు నిర్వహించారు. ఐ.టి.డి.ఎ పరిధిలోని పీహెచ్‌సీల సిబ్బందికి కూడా ఆ క్రమంలోనే జరిగాయి. చాలాకాలం నుంచి గిరిజన ప్రాంతాల్లోనే పనిచేస్తూ, మైదాన, పట్టణ ప్రాంతాలకు రాలేని వారి కోసం మార్గదర్శక సూత్రాల్లో కనీసం ప్రస్తావన లేదు. కానీ, సహజ విధానాలకు అనుగుణంగానే బదిలీలు జరిగాయి. దరఖాస్తు ఫారంలో గిరిజన ప్రాంతాల ప్రస్తావన కూడా లేదు. కానీ, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్లు తమ పరిధిలో బదిలీలు జరిగిన వారి స్థానాల్లో కొత్తవారు వచ్చేవరకు, జరిగిన బదిలీలను నిలిపివేయాలని ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖల అధికారులకు అభ్యంతరాలు తెలిపారు. బదిలీ దరఖాస్తుల్లో గిరిజన ప్రాంతాల ఆప్షనే లేనప్పుడు, కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరిగిపోయినప్పుడు, ఎలా ఆపుతారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోనీ, తమ స్థానాల్లో కొత్తవారు జాయిన్ అయ్యే వరకు, పాత స్థానాల్లోనే పనిచేస్తామని, ప్రస్తుతం తమ కోరుకున్న స్థానాలకు కొత్తవారు రాకుండా, తాము జాయిన్ అవ్వడానికి అవకాశాలు ఇవ్వాలని వారు విశాఖలో ఆర్.జె.డి. వద్ద మొరపెట్టుకున్నారు. ఆమె కూడా ఈ ప్రతిపాదనను అంగీకరించి, వారికి ఆ అవకాశం ఇవ్వాలని పీఓలకు లేఖ రాశారు. ఒకరిద్దరి పీఓలు ఇది సబబుగానే ఉందని, తమను కలిసిన యూనియన్ నాయకులతో చెప్పారు. ఈ ప్రతిపాదనను అమలు చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు చెప్పినట్టు తెలుస్తుంది. కానీ, పీవోల పేరు చెప్పి పోస్టింగ్‌లు ఇవ్వకుండా డీఎంహెచ్‌వోలు, కలెక్టర్లను తప్పుదారి పట్టిస్తూ బదిలీ ఉద్యోగులను వేదనకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం, ముడుపుల కోసమే ఈ తతంగం నడుస్తోందని ఆయా కార్యాలయాల సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో కొంతమంది నాయకులు కూడా, వారి ప్రయోజనాల కోసం పోస్టింగులు లేనివారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార కూటమికి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా ఈ వ్యవహారంలో సాంకేతిక విషయాలు తెలియక చేతులెత్తేసినట్టు సమాచారం. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎందుకు అమలు చేయలేదని కనీసం ప్రశ్నించాలనే ఆలోచన రాకపోవడం అన్యాయమని విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవోలను అర్థం చేసుకోలేని స్థాయిలో జిల్లాల కలెక్టర్లు ఉన్నారా! ఐటీడీఏ పీఓలను అడ్డం పెట్టుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆడుతున్న నాటకంలో పాత్రధారులు అవుతున్నారా అనే చర్చ నడుస్తోంది.

శాకంబరిగా విశాలక్షి

పొందూరులోని కోదండ రామస్వామి ఆలయంలో కొలువైన విశాలాక్షి అమ్మవారికి గుప్త నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం అర్చకులు జగ్గబాబు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

\- పొందూరు

మోత ఆరంభం

రేషన్ మోత ఆరంభమైంది. మొదటి తేదీ కావడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద క్యూ కట్టారు. శ్రీకాకుళం గుడివీధి వద్ద ఇలా బస్తాలు మోసుకువెళ్తూ కనిపించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

టీసీఎస్ కంపెనీకి బసిరెడ్డి విద్యార్థినుల ఎంపిక

విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాల బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్ పూర్తి చేసిన లేఖ్య, ఇందు టీసీఎస్ కంపెనీలోని ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సత్యనారాయణ, డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, సరళాదేవి తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థినులను అభినందించారు.

లోటుపాట్ల గుర్తింపునకు సామాజిక తనిఖీ

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వెలుగోడు: ఉపాధి హామీ పథకంలో అవకతవకలు, లోటు పాట్లు గుర్తించేందుకే ప్రతిఏడాది సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం సామాజిక తనిఖీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధి పథకంలో వేతనదారుల హక్కులు, సౌకర్యాలపై ర్యాలీ ద్వారా చైతన్యవంతం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబానికి వంద రోజులు పని, రోజువారి వేతనం రూ.307 పొందేలా పనులు కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమన్నారు. ర్యాలీలో సామాజిక తనిఖీ డైరెక్టర్ జి శ్రీకాంత్, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

నందికొట్కూరు: మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆత్మకూరు కోర్టు జడ్జి రాహుల్ అంబేడ్కర్ తీర్పు వెలువరించినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల తనిఖీల్లో 13 మంది వాహనాలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరందరినీ కోర్టులో హాజరుపరచడంతో విచారణ అనంతరం రూ.10 వేల చొప్పున్న జరిమాన్నా విధించారన్నారు.

నేడు యాగంటిలో బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని ప్రసిద్ధ యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రక్షాధారాలు, రుద్రాక్షమాలలు, కరుంగలి మాలలు, పూసలమాలలు, రాగి కడియాలు అమ్ముకునే హక్కుల కోసం బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన వారు ముందుగా రూ.50,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన వ్యక్తులు హాజరుకావాలని సూచించారు.

గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య

వేదావతి మృతదేహం

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామానికి చెందిన వేదావతి(38) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్ఐ మేరి తెలిపిన వివరాలు.. గత మార్చిలో భర్త చెన్నయ్య లష్కర్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త ఉద్యోగం భార్య వేదావతికి ఇచ్చారు. అయినా జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లోనే గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి డాక్టర్లు ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

బావాపురం గ్రామం వద్ద సేద్యం పనులు చేస్తున్న రైతన్న

నందికుంటలో ట్రాక్టర్‌తో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న దృశ్యం

విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

ఖరీఫ్ సాగులో రైతన్నలు

- విత్తనాలు వేయడంలో అన్నదతలు బిజీ
- ట్రాక్టర్లు, కాడెద్దులతో సేద్యం పనులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవ్వడంతో రైతన్నలు విత్తు పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పొలాలను రూపు చేసుకున్న అన్నదాతలు పంటల సాగులో నిమగ్నమయ్యారు. నాగళ్లతో దుక్కి దున్ని, ఎరువులు చల్లుకుని విత్తనాలతో సిద్ధంగా ఉన్న రైతన్నలు వాన రావడంతో విత్తు పనుల్లో మునిగిపోయారు.

– కొత్తపల్లి

కపిలేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, జడ్డువారిపల్లె, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం గ్రామాలలో ఆరుతడిపంటలైన మొక్కజొన్న, మినుము, కంది, మిరప, పత్తి పంటలు సాగుచేసుకునేందుకు విత్తనాలు కూలీలతో నాటుకోవడం, ట్రాక్టర్‌తో విత్తనాలు వేసుకుంటున్నారు. బండినాయిని పాలెం, పాలెంచెరువు, గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లి, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, నందికుంట, బావాపురం గ్రామాలలో ఆయకట్టు కింద వరి సాగులో అన్నదాతలు విత్తనాలు వేసే పనిలో బిజీగా ఉన్నారు. కాకపోతే వరణుడు రైతన్నలతో దోబూచులు ఆడుతున్నాడు. కొద్ధిపాటి వర్షాలతో వరిసాగు చేయాలనా లేదా అన్న సందిగ్ధంలో ఉన్నారు. కొందరు వర్షాలు పడుతాయన్న నమ్మకంతో రైతన్నలు ట్రాక్టర్లతో, కాడెద్దులతో పొలం పనులు చేస్తున్నారు.

ఎదురుపాడు గ్రామంలో కాడెద్దులతో సేద్యం చేస్తుండగా విత్తనాలు నాటుతున్న కూలీలు

నేడు గ్రామ సభ

వెలుగోడు: మేజర్ పంచాయతీ గ్రామ సభ బుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. సర్పంచ్ వేల్పుల జయపాల్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందని, వార్డు సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రతి ఎకరాకు సాగు నీరు ఇస్తాం

పాములపాడు: ఎత్తిపోతల పథకం కింద ఉన్న ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం ఇస్కాల గ్రామంలోని ఎత్తిపోతల పథకం నుంచి 3 పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 19.5 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతకు ముందు క్రిష్ణారావు పేట గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఈ నారాయణరెడ్డి, సర్పంచు మల్లీశ్వర రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ సర్పంచు హరినాథరెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను తొలగించారు

మహానంది: స్థానిక దేవస్థానంలోని ఉత్తరద్వార గోపురం, అలంకార మండపంపై పిచ్చిమొక్కలు మొలిచి ప్రమాదకరంగా మారిన వైనంపై 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంకె నాగరాజు, సిబ్బంది గోపురాలపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్

మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

క్రీడా పరికరాల విరాళం

బండి ఆత్మకూరు: స్థానిక హైస్కూల్‌కు మంగళవారం పూర్వ విద్యార్థులు క్రీడా పరికరాలను విరాళమిచ్చారు. 2023–24 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ.5 వేల విలువ చేసే క్రీడా పరికరాలను హెచ్‌ఎం హసీనాకు అందజేశారు. కార్యక్రమంలో పీడీ నాగరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు క్రీడా పరికరాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కొరటాల ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూరు: సీపీఎం అగ్ర నాయకుడు కొరటాల సత్యనారాయణ ఆశయాలను సాధించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో జన్మించి, కమ్యూనిస్టు విప్లవాలకు ఆకర్షితులై పాఠశాల స్థాయి నుంచే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. నిత్యం పోరాటాలు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రణధీర్, సురేంద్ర, రాములు, దినేష్, సామేలు, పుల్లయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తూకంలో మోసంపై తహసీల్దార్ ఆగ్రహం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఓ రేషన్ డీలర్ లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం తూకాల్లో చేతివాటం ప్రదర్శిస్తుండటంతో గుర్తించిన కార్డుదారులు తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేశారు. 35 కిలోల బియ్యం వేయాల్సి ఉండగా 32 కిలోలు మాత్రమే వేస్తున్నారని కార్డుదారులు వాపోయారు. తహసీల్దార్ స్పందించి వీఆర్‌ఓను పిలిపించి విచారణ చేశారు. మరోసారి ఇలాంటి తప్పు జరిగితే డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మరో ఇద్దరు డీలర్లు కూడా తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

దేవస్థానంపై దుష్ప్రచారం

- ఈఓ ఎం.శ్రీనివాసరావు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం విక్రయిస్తున్న లడ్డూ ప్రసాదంలో బొద్దింక వచ్చినట్లు ఆరోపించిన వ్యక్తి దేవస్థానంపై దుష్ప్రచారం చేశారని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం దేవస్థానం ఈఓ లడ్డూ ప్రసాదంలో బొద్దింక విషయంపై వీడియో రూపంలో వివరణ ఇచ్చారు. ×గత నెల 29న స్వామి అమ్మవార్ల దర్శనానికి నెల్లూరు జిల్లా కావలికి చెందిన కె.శరత్ చంద్ర, ముగ్గురు స్నేహితులతో కలిసి వచ్చారు. దర్శనం అనంతరం లడ్డూ కౌంటర్ వద్ద ప్రసాదాలు కొనుగోలు చేసి, లడ్డూలో బొద్దింక వచ్చినట్లు ఆరోపించి, ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారితో కమిటీ వేసి విచారణకు ఆదేశించాం. భక్తుడు ఆరోపించినట్లు లడ్డూలో బొద్దింక కాదని మిడత రకానికి చెందిన క్రిమి. లడ్డూ పాకం 100 డిగ్రీల వేడిలో తయారు చేస్తారు. ఆ వేడిలో ఏదైనా క్రిమి కీటకాలు పడితే వాటి శరీరం అవయవాలు గుర్తించడానికి వీలు పడదు. కానీ భక్తుడు ఇచ్చిన లడ్డూలో ఉన్న మిడత చనిపోయినా, దాని శరీర అవయవాలు అన్నీ అలాగే ఉన్నాయి. దీన్ని బట్టి పరిశీలిస్తే దేవస్థానాన్ని పథకం ప్రకారం అప్రతిష్ట పాలు చేయాలని చేసినట్లు నిర్ధారణకు వచ్చాం. వారిపై శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. భక్తులు ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మవద్దు.

మహానందిలో తగ్గిన భక్తుల సందడి

మహానంది: ఆషాడమాసం కావడంతో స్థానిక ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అనంతరం 2 నుంచి రాత్రి 9.00 గంటలకు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం కొనసాగింది. వచ్చిన కొద్దిపాటి మంది భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలో మొదటి రోజే 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. 5,648 మంది లబ్ధిదారులకు గానూ 5,320 మందికి పంపిణీ చేశామన్నారు.

- **జూపాడుబంగ్లా:** మండలంలోని 4,875 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మిగిలిన 279 మందికి బుధవారం సాయంత్రంలోగా పంపిణీ చేస్తామన్నారు. కాగా గత నెల కంటే ఈ నెలకు 27 పింఛన్లు తగ్గాయి.

పథకాలు అమలు చేయకపోవడం తగదు

బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం తగదని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సీపీఎం ముద్రించిన బుక్‌లెట్‌ను ప్రజా వైద్యశాల డాక్టర్ నాగేశ్వరరెడ్డి, అవాజ్ కమిటీ జిల్లా నాయకులు అబుబక్కర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫక్కిర్‌సాహెబ్, గోపాలకృష్ణ, రామకృష్ణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ బాటిళ్ల స్వాధీనం

బండి ఆత్మకూరు: మండలంలోని పరమటూరు గ్రామానికి చెందిన మీనిగ జలపతి నుంచి 15 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

తమ్మడపల్లెలో చోరీ

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో సోమవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సులోచన, కుమార్తెలు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.4వేల నగదుతో పాటు బియ్యం బస్తాను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు సులోచన వాపోయింది.

శాకంబరి అలంకారంలో వాసవీ మాత

శాకంబరిదేవి అలంకరణలో అమ్మవారు

కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు కుంకుమార్చన పూజలు చేపట్టారు.

– ఆత్మకూరు

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన సిబ్బంది, స్థానికులు, భక్తుల సౌకర్యార్థం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఉదయం చంద్రవతి కల్యాణ మండపంలో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారాలు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒంగోలుకు చెందిన యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం శిక్షణ ఇస్తున్నారు.

యోగా శిక్షణలో పాల్గొన్న దేవస్థాన సిబ్బంది, భక్తులు, స్థానికులు

సన్మానం

వెంకటరమణగౌడ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణగౌడ్ పదవీ విరమణ పొందారు. మంగళవారం బనగానపల్లెలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడుతోపాటు నియోజకవర్గ అధ్యక్షులు డబ్బి వెంకటస్వామిగౌడ్, కార్యదర్శి మన్నెం బాలస్వామియాదవ్, ఉపాధ్యక్షులు వీరన్న, నరసింహులు, శ్రీనివాసులు, పెద్దన్న తదితరులు పాల్గొని వెంకటరమణ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బండిఆత్మకూరు: భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలని ఏడీ ఆంజనేయ సూచించారు. మండలంలోని పెద్దదేవలాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏడీ ఆంజనేయ, డీఆర్‌సీఏడీ చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోవడంతోపాటు దిగుబడలపై ప్రభావం చూపుతుందన్నారు. గుర్తింపు పొందిన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించి రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసి పంటను బెట్ట నుంచి కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడి

వెలుగోడు: విత్తన శుద్ధితో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నంద్యాల డీఆర్‌సీ ఏడీఏ సరళమ్మ సూచించారు. మోతుకూరు, మాధవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో సూడోమోనాస్ బయో శిలీంద్ర నాశిని వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఏ శశికళ, డీఆర్‌సీ ఏఓ వెంకటేశ్వరరెడ్డి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

పాములపాడులో ..

దంచికొట్టిన వాన

జూపాడుబంగ్లా/పాములపాడు/కొత్తపల్లి: నందికొట్కూరు నియోజకవర్గంలో వర్షం దంచికొట్టింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వాన కురిసింది. పగిడ్యాలలో అత్యధికంగా 16.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా పాములపాడులో అత్యల్పంగా 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. కొత్తపల్లిలో 10.6, జూపాడుబంగ్లాలో 4.6, నందికొట్కూరులో 4, ఆత్మకూరులో 8.2, శ్రీశైలంలో 7.2, వెలుగోడులో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. కాగా జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, తంగడంచ, మండ్లెం తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకు శ్రీకారం చుట్టారు. పాములపాడు మండలంలో ఇప్పటికే విత్తు వేసిన పొలాల్లో పైర్లకు జీవం పోసినట్లైందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మహానందిలో..

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలో మంగళవారం సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తుంది. ఉదయం నుంచి ఆకాశంలో మేఘావృతం కాగా సాయంత్రం 6.30 గంటల నుంచి వర్షం ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలో భారీ వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

కొత్తపల్లి సమీపంలో మొక్కజొన్న పొలంలో నిలిచిన నీరు

అప్పలరావు వీధిలో దుర్గంధం

అపరిశుభ్రంగా ఉన్న అప్పలరావు వీధిలోని పరిసరాలు

ఆత్మకూరు రూరల్: పట్టణంలోని అప్పలరావు వీధిలో ఓ చెత్త కుండీ వద్ద దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీ వాసులు అక్కడ వేస్తుండటం.. మున్సిపాలిటీ పారిశుద్ధ్య తొలగించక పోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. అటు వెళ్లాలంటేనే ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి. అసలే డెంగీ, మలేరియా, టైఫాయిడ్లకు సీజన్‌గా ఉన్న వర్షాకాలంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం తగదని, ఇప్పటికైనా చెత్తకుండీని తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చీనీ టన్ను రూ.28,200

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,200, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



వద్దొద్దు.. ఇప్పుడే వద్దు!

తుంగభద్ర డ్యాం నిండుకుండలా మారగా.. జిల్లాకు నీరు విడుదల చేసేందుకు టీబీ బోర్డు సిద్ధమైంది. హెచ్చెల్సీ అధికారులు మాత్రం ఇప్పుడే వద్దంటున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం

34.3°/22.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- పింఛన్ల పంపిణీలో కలెక్టర్ టీఎస్ చేతన్

తలమర్ల గ్రామంలో ఆదెమ్మకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రీదేవి, ఎంపీడీఓ నటరాజ్ పాల్గొన్నారు.

జిల్లాలో 93.16 శాతం పింఛన్లు పంపిణీ

తొలిరోజు మంగళవారం జిల్లాలో 93.16 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. తెల్లవారుజాము నుంచే సచివాలయ అధికారులు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. ఫలితంగా తొలి రోజు 2,60,883 పింఛన్లకు గాను 2,44,010 పింఛన్లు పూర్తి చేశారని వివరించారు. మిగిలిన పింఛన్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

బాలుర ఫుట్‌బాల్ విజేత ‘శ్రీసత్యసాయి’

మొదటి స్థానంలో నిలిచిన శ్రీసత్యసాయి జిల్లా జట్టు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలోని వేదా పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. మూడు రోజులుగా పోటాపోటీగా జరుగుతున్న పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు ఒక్కో దశను దాటుకుంటూ ఫైనల్స్‌కు చేరింది. మంగళవారం ఫైనల్స్‌లో తిరుపతి జట్టుతో తలపడి విజయం సాధించింది. చివరివరకూ పోరాడిన తిరుపతి జట్టు రన్నరప్‌గా సరిపెట్టుకుంది. తృతీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచింది. ఈ టోర్నమెంటులో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల మూడో వారంలో అమృతసర్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు పంపనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. విజేతలకు వేదా పాఠశాల కరస్పాండెంట్ రామలింగారెడ్డి, పోతబోలు సర్పంచు ఈశ్వరయ్య ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు సిరాజ్, చినబాబు, శ్రీనివాస్, మహేంద్ర, కమలేష్, బాలాజీ, నరేంద్ర పాల్గొన్నారు.

రొళ్ల మండలం టీడీపల్లిలో సాగు చేసిన విత్తన పత్తి (సీడ్‌పత్తి)

రైతుకు విపత్తి

అన్నదాతను ముంచిన విత్తన పత్తి కంపెనీలు

ఈ రైతు పేరు శివన్న. అమరాపురం మండలం కొర్రేవు గ్రామం. విత్తన కంపెనీల కోరిక మేరకు తన ఐదుఎకరాల వ్యవసాయ భూమిలో విత్తన పత్తి సాగు చేశారు. పంట సాగుకు దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టారు. దిగుబడి చేతికొచ్చే సమయానికి విత్తన కంపెనీలు ప్లేటు ఫిరాయించాయి. విత్తనాలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయబోమని తేల్చిచెప్పాయి. కడుపు మండిన శివన్న ఎకరా విస్తీర్ణంలోని విత్తన పత్తి మొక్కలను పీకేశారు. బంగారు నగలు తాకట్టు పెట్టి పంట సాగుచేశానని, ఇప్పుడు కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యనే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- విత్తన పత్తి సాగుకు కంపెనీల ప్రోత్సాహం
- పంట తామే కొనుగోలు చేస్తామని మొదట్లో భరోసా
- దిగుబడి చేతికందే సమయంలో మాటమార్చిన వైనం
- ఎకరాకు రెండున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని మెలిక
- మిగిలిన పంటను ఏం చేసుకోవాలని వాపోతున్న రైతాంగం

మడకశిర: విత్తన పత్తి (సీడ్ పత్తి) సాగుకు మడకశిర నియోజకవర్గం పెట్టింది పేరు. కానీ ఈసారి విత్తన పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దిగుబడి తామే కొనుగోలు చేస్తామంటూ హామీ ఇచ్చి సాగును ప్రోత్సహించిన పత్తి విత్తన కంపెనీలు ఇప్పుడు మాటమార్చడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

కంపెనీల సహకారం.. పెరిగిన సాగు విస్తీర్ణం

మామూలు పత్తితో పోలిస్తే విత్తన పత్తితో ఎక్కువ లాభాలుంటాయి. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. దీంతో రైతులు కొన్నేళ్ల నుంచి విత్తన పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని శిర, హిరియూర్, చెళ్లికెర, మధుగిరి, హొసదుర్గ, చిక్కనాయకనహళ్లి నియోజకవర్గాల్లోని రైతులు ఎక్కువగా విత్తన పత్తి సాగు చేసేవారు. వారిని చూసి మడకశిర నియోజకవర్గంలోని రైతులు కూడా విత్తన పత్తి వైపు దృష్టి సారించారు. దీంతో ఆయా విత్తన కంపెనీలు కూడా రైతులకు పూర్తి సహకారం అందిస్తూ వచ్చాయి. ముందుగానే పత్తి విత్తనాలకు ధర నిర్ణయించడంతో పాటు దిగుబడి వారే కొనుగోలు చేసేవారు. అంతేగాక రైతులకు ముందుగానే కొంత నగదును అడ్వాన్స్ ఇచ్చేవారు. పంట సాగుకు అవసరమైన మందులు, ఎరువులు, విత్తనాలను కూడా కంపెనీలే సరఫరా చేసేవి. దీంతో మడకశిర నియోజకవర్గంలో ఏటికేడు విత్తన పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. గత ఏడాది ఖరీఫ్‌లో క్వింటాల్ పత్తి విత్తనాలు రూ.50 వేలు పలకగా, రైతులంతా విత్తన పత్తిపై దృష్టి సారించారు.

చేతులెత్తేసిన కంపెనీలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా విత్తన పత్తి సాగుకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని విత్తన కంపెనీల ప్రతినిధులు చెప్పడంతో రైతులు మరోసారి విత్తన పత్తి సాగు చేశారు. విత్తనం, ఎరువులు, మందులు కంపెనీలే అందించాయి. అయితే ప్రస్తుతం విత్తన కంపెనీల ప్రతినిధులు పత్తి విత్తనాలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయబోమని చెబుతున్నారు. ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేస్తామని తేల్చిచెప్పారు. అయితే ఇప్పటికే రైతులు విత్తన పత్తి పంటపై పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఆడ, మగ పువ్వులను పంట సాగు ప్రక్రియలో క్రాస్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ రెండు నెలల పాటు సుదీర్ఘంగా జరగాలి. ఇందుకు కూలీలకు రోజుకు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. అన్నీ సవ్యంగా సాగితే ఎకరాకు 9

క్వింటాళ్ల పంట చేతికి అందుతుంది. ప్రస్తుతం క్వింటాల్ పత్తి విత్తనాల ధర రూ.45 వేలు ఉండగా.. రైతుకు సుమారు రూ.4 లక్షలకుపైగా చేతికి అందుతుంది. పెట్టుబడి పోను రూ.3 లక్షలు మిగులుతాయి. అయితే పంట చేతికొచ్చే సమయంలో విత్తన కంపెనీలు చేతులెత్తేశాయి. ఎకరాకు రెండున్నర క్వింటాళ్లే కొంటామని చెప్పడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గిట్టుబాటు కాదని భావిస్తున్న కొందరు రైతులు పంటను పీకేస్తున్నారు. మరికొందరు గొర్రెలు, మేకలను వదిలి మేపుతున్నారు.

2,500 ఎకరాలు మడకశిర నియోజకవర్గంలో విత్తన పత్తి సాగు విస్తీర్ణం

9 క్వింటాళ్లు ఎకరాకు సగటు దిగుబడి

రూ.45,000 క్వింటాల్ పత్తి విత్తనాల ధర

రూ.2 లక్షలు ఎకరాకు విత్తన పత్తి సాగుకు ఖర్చు

రూ.3 లక్షలు ఎకరాకు ఆదాయం

ప్రభుత్వం ఆదుకునేనా?

విత్తన పత్తి సాగు చేసిన మడకశిర రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి విత్తన కంపెనీలు ఇచ్చిన మాట ప్రకారం పూర్తి స్థాయిలో రైతుల నుంచి విత్తనాలను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే ప్రభుత్వమే పత్తి విత్తనాలను రైతుల నుంచి కొనుగోలు చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.

విత్తనాలన్నీ కొనాలి

నేను ఒకటిన్నర ఎకరాలో విత్తన పత్తిని సాగు చేశా. దాదాపు 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం విత్తన కంపెనీలు పూర్తి స్థాయిలో విత్తనాలను కొనుగోలు చేయబోమని చెబుతున్నాయి. మిగిలిన విత్తనాలను ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కావడం లేదు. విత్తన కంపెనీలు చెప్పిన మేరకు విత్తనాలన్నీ కొనుగోలు చేయాలి. లేకపోతే రైతులు పూర్తిగా నష్ట పోవాల్సి ఉంటుంది.

– శ్రీనివాస్, హెచ్‌టీహళ్లి, రొళ్ల మండలం

కంపెనీలు మోసం చేశాయి

విత్తన కంపెనీలు మోసం చేస్తున్నాయి. మొదట పూర్తి స్థాయిలో విత్తనాలు కొనుగోలు చేస్తామని చెప్పాయి. పంట సాగు చేసిన తర్వాత ఎకరాకు రెండున్నర క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని చెబుతున్నాయి. నేను మూడెకరాల్లో విత్తన పత్తి వేశా. దాదాపు 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇందులో ఏడున్నర క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తామని అంటున్నారు. మిగిలిన విత్తనాలను ఎక్కడ అమ్ముకోవాలో తెలియడం లేదు. విత్తన కంపెనీల మోసంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

–ఇంతియాజ్, బసవనపల్లి, అమరాపురం మండలం

మోసం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- పరిగిలో ‘చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ’ పోస్టర్ల ఆవిష్కరణ

పరిగి: ‘‘మోసం చంద్రబాబు నైజం.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేశారు. అందుకే ఏడాదిలోపే ప్రజలూ ఆయన మోసాన్ని గుర్తించారు’’ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం ఆమె పరిగిలో క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన ‘చంద్రబాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ’ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ... ఏడాది కాలంలోనే కూటమి సర్కార్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలయ్యాయన్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా టీడీపీ అధినాయకత్వాన్ని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేతిలో మరోసారి మోసపోయామన్న ఆవేదన ప్రజల్లో కనిపిస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ ప్రజలు ఒత్తిడి తేవడంతో ఆగమేఘాలపై హడావుడిగా ‘తల్లికి వందనం’ పథకాన్ని అమలు చేశారని, అయిచే ఎంతోమంది అర్హులకు అన్యాయం చేశారన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలై నెల గడిచినా నేటికీ రైతు భరోసా పథకం సొమ్ము నయా పైసా రైతులకు అందించలేదన్నారు. అందుకే జనమంతా నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను తలచుకుంటున్నారన్నారు. కూటమి సర్కార్ ‘తల్లికి వందనం’ అంటూ గగ్గోలు పెడుతున్నా.. అందరూ ‘అమ్మ ఒడి’ గానే ప్రజలు కీర్తిస్తున్నారన్నారు. మోస పూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వైఫల్యాలను గ్రామగ్రామానా వివరించేందుకే ‘చంద్రబాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చంద్రబాబు హయాంలో ప్రజలకు జరిగిన అన్యాయం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగిలో ‘చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్ తదితరులు

రేపు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 3న విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను బంద్ చేసి శాంతియుతంగా నిరసన తెలిపేలా నిర్ణయించినట్లు అపుస్మా రాష్ట్ర కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఆర్టీఈ 12(1)సి ద్వారా ఉచిత అడ్మిషన్లకు బలవంతం చేస్తున్నారంటూ వాపోయారు. అకారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని, గుర్తింపు రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమానులు సహకరించి 3న స్వచ్ఛందంగా విద్యా సంస్థలు బంద్ పాటించాలని కోరారు.

బాలయ్య ఇలాకాలో మద్యం వరద

- ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు
- ఎమ్మార్పీ కంటే అధికంగా వసూళ్లు
- ఉమ్మడి జిల్లాలో ఇతర నియోజకవర్గాలకూ పాకిన జాడ్యం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- నాలుగు రోజుల క్రితం ఓ ఎక్సైజ్ అధికారి తాడిపత్రికి చెందిన టీడీపీ నేతకు ఫోన్ చేశారు. సార్ మీ నియోజకవర్గంలో పర్మిట్ రూములు, బెల్టుషాపులపై తనిఖీ చేయాల్సి ఉంది అన్నారు. దీనికి ఆ నేత.. ముందు హిందూపురంలో మూసెయ్, ఆ తర్వాత నేను ఇక్కడ మూయిస్తా అనడంతో ఎక్సైజ్ అధికారి ఖిన్నుడయ్యారు.
- ఇటీవల హిందూపురంలో ఓ వ్యక్తి వైన్ షాపు వద్దకెళ్లి మాన్‌సన్‌హౌస్ క్వార్టర్ బాటిల్ కొనుగోలు చేయగా.. ఎంఆర్‌పీ కంటే రూ.10 ఎక్కువ తీసుకున్నారు. ఎందుకిలా ఎక్కువ తీసుకున్నావ్ అంటే ఇక్కడ ఇంతే.. ఇష్టమైతే తీసుకో లేదంటే వెళ్లిపో అన్నాడు షాపులో ఉన్న వ్యక్తి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆ నియోజకవర్గంలో అన్ని నిబంధనలూ తుంగలో తొక్కారు. యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. పర్మిట్ రూములు.. బెల్టుషాపులే కాదు రేట్లు కూడా అక్కడ ఎక్కువే. ఇంత జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడాలంటే కూడా ఎక్సైజ్ అధికారులు భయపడిపోతున్నారు. కనీసం ఎమ్మెల్యే పీఏలతో మాట్లాడే ధైర్యం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఇతర నియోజకవర్గాలకు తనిఖీ అధికారులు వెళితే ముందు ‘అక్కడి’ కథ చూసి మా వద్దకు రండి అంటున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ‘తమ్ముళ్లు’ తమ ప్రాంతాల్లోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. నిబంధనలు తోసిరాజని హిందూపురంలో సాగుతున్న మద్యం అమ్మకాలు నేడు ఉమ్మడి జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకూ మోడల్‌గా మారిన విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వేళాపాళా లేదు..

ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయానా బావమరిది, వియ్యంకుడు బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా తయారైంది. మద్యం అమ్మకాల్లో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా రేట్లు పెంచుకుని, వేళాపాళా లేకుండా ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలు కూడా హిందూపురం మోడల్‌ను అనుసరిస్తున్నాయి. ఏ నియోజకవర్గానికి వెళ్లినా హిందూపురం వైపు వేలెత్తి చూపిస్తుండటంతో అధికారులూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

మనకేంటి ఇబ్బంది అంటున్న ‘తమ్ముళ్లు’..

హిందూపురం నియోజకవర్గంలో తొలిరోజు నుంచే నిబంధనలు తుంగలో తొక్కి మద్యం విక్రయాలు చేపడుతున్నారు. దీంతో మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. హిందూపురం తరహాలోనే కదిరిలో విచ్చలవిడిగా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మెజారిటీ బ్రాండ్‌ల మీద ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. తాడిపత్రిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇలా ఒక నియోజకవర్గంలో ఎక్కువ రేట్లకు అమ్ముతుండటంతో మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పద్ధతి అనుసరిస్తున్నారు. తాడిపత్రి, ధర్మవరం, కళ్యాణదుర్గం, గుంతకల్లు వంటి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలవే మెజారిటీ మద్యం షాపులు కావడం గమనార్హం. స్వయానా బాలకృష్ణ నియోజకవర్గంలోనే అమ్ముతున్నప్పుడు మనకేంటి ఇబ్బంది అన్న ధైర్యంతో అన్ని చోట్లా దందా కొనసాగిస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ హిందూపురం తరహా మద్యం అమ్మకాలు బాగా ప్రచారంలోకి వచ్చినట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు మాత్రం బాలకృష్ణ నియోజకవర్గంలో ఏం చేస్తే ఎలా బుక్ అవుతామో అని భయపడుతున్నారు.

2024 సెప్టెంబర్ 15 నుంచి 2025 జూన్ 30 వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మద్యం అమ్మకాలు ఇలా

నియోజకవర్గం	మద్యం అమ్మకం విలువ
హిందూపురం	రూ.74,87,61,067
కదిరి	రూ.68,71,63,705
ధర్మవరం	రూ.110,03,56,136
తాడిపత్రి	రూ.106,02,28,367
గుంతకల్లు	రూ.77,43,45,594
పెనుకొండ	రూ.78,25,96,955
అనంతపురం	రూ.271,78,57,685

వద్దొద్దు.. ఇప్పుడే వద్దు!

- ఈ నెల 10న హెచ్చెల్సీకి నీటి విడుదలకు టీబీ బోర్డు సుముఖత
- వద్దంటూ హెచ్చెల్సీ అధికారుల తిరకాసు
- అధికారుల నిర్ణయంతో ఆయకట్టు రైతులకు తీరని నష్టం

'దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు' అన్న చందంగా మారింది జిల్లా హెచ్చెల్సీ అధికారుల తీరు. ప్రకృతి కరుణించడంతో నిండుకుండలా మారిన తుంగభద్ర డ్యాం నుంచి జిల్లాకు నీటి విడుదలకు టీబీ బోర్డు సిద్ధమైనా.. హెచ్చెల్సీ అధికారులు మాత్రం ఇప్పుడే వద్దంటూ తిరకాసు పెట్టారు.

నిండుకుండను తలపిస్తున్న తుంగభద్ర డ్యాం

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ అధికారుల తాజా నిర్ణయం ఆయకట్టు రైతులకు తీరని నష్టం కలిగించేలా మారింది. జిల్లాలో ముందస్తుగా వర్షాలు కురిసినా ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేశాడు. కానీ ఎగువన కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి కొద్దిరోజులుగా భారీ స్థాయిలో వరద చేరుకుంటోంది. త్వరలో పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 10 నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటనతో జిల్లా హెచ్చెల్సీ అధికారులు హర్షం వ్యక్తం చేయాల్సింది పోయి... ఇప్పుడే అవసరం లేదని, ఎలాంటి పరిస్థితుల్లోనూ నీటి విడుదల ఇప్పుడే వద్దంటూ బోర్డుపై ఒత్తిళ్లు తీసుకెళ్లారు.

నత్తనడకన పనులు చేపట్టి..

ఉమ్మడి జిల్లాకు వరదాయినిగా తుంగభద్ర జలాశయం నిలిచింది. కొన్నేళ్లుగా చెప్పుకునే స్థాయిలో వర్షాలు వస్తుండడంతో దాదాపు లక్ష ఎకరాలకు పైగా సాగునీరు, ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందిస్తున్నారు. ఇంతటి మహోన్నతమైన ప్రాజెక్ట్‌పై అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువపై కల్వర్టులు కూలిపోవడంతో పలు చోట్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల డిస్ట్రిబ్యూటరీల మరమ్మతు పనులు కూడా చేపట్టాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి గత జనవరిలో దాదాపు రూ. 30 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. వెనువెంటనే పనులు చేపట్టాల్సింది పోయి ఏప్రిల్ వరకూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కూడా నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలోహెచ్చెల్సీకి నీరు విడుదలైతే కాలువకు గండ్లు పడే ప్రమాదముంది. కల్వర్టులు, ఇతర పనులు జరుగుతున్నాయంటూ మరో పదిరోజులు గడువు కావాలని హెచ్చెల్సీ అధికారులు విజ్ఞప్తులపై విజ్ఞప్తులు చేస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది హెచ్చెల్సీ రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో భారీ నష్టం

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని తీసుకునే అవకాశముంది. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాకు కేటాయించిన నీటి కోటాలో ఈ ఏడాది భారీ కోత పడింది. గతేడాది భారీ వర్షాలకు ఒక గేటు కొట్టుకుపోవడంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచేందుకు వీలు కాదని ఇంజనీరింగ్ నిపుణులు స్పష్టం చేశారు. వాస్తవానికి కొత్త గేటు అమర్చడానికి ఐదారు నెలలకు పైగా సమయం ఉన్నా.. కర్ణాటక ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చినా గేటు ఏర్పాటు అంశంలో ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో టెండర్లు పిలవడంలో జాప్యం చోటు చేసుకుని తాత్కాలికంగా అమర్చిన గేటుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో టీబీ డ్యాంలో 80 టీఎంసీలకు మించి నీటి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. అంతకు మించి నీరు చేరుకుంటే దిగువకు వదిలేయాల్సిందే.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు

హెచ్చెల్సీకి నీటిని తీసుకోవడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రైతులకు అవసరముందో.. లేదో.. అనే అంశంపై నీటి సంఘాల నాయకులతో చర్చిస్తాం. అవసరముందని చెబితే తప్పకుండా తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని తీసుకుంటాం. ఆలస్యమైనా పర్వాలేదని అంటే పనులను వేగవంతంగా పూర్తి చేసి, నీటిని తీసుకుంటాం.

– విశ్వనాథరెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ, హెచ్చెల్సీ

ఆయకట్టుకు తీరని నష్టం

దామాషా ప్రకారం 140 టీఎంసీల నీటి లభ్యత ఉంటే హెచ్చెల్సీకి 32 టీఎంసీల నికర కేటాయింపులు ఉంటాయి. ఈసారి తుంగభద్ర జలాశయం భద్రత దృష్ట్యా 80 టీఎంసీలకు మించి నిల్వ ఉంచరాదని నిర్ణయించారు. దీంతో హెచ్చెల్సీకి కేవలం 18.396 టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించారు. ఇందులో 10 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు పోను, మిగిలిన 8.396 టీఎంసీల్లో ప్రవాహ నష్టాలు ఉంటాయి. ఇక మిగిలిన నీటిని ఆయకట్టుకు అందించాలి. ఫలితంగా హెచ్చెల్సీ పరిధిలో లక్ష ఎకరాలకు పైగా పంటల సాగు ప్రశ్నార్థకమైంది. ఇది హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు తీరని నష్టాన్ని చేకూరుస్తోంది. తుంగభద్ర నుంచి నీరు విడుదలయ్యే సమయం దగ్గరలోనే ఉందని తెలిసినా పనులు వేగవంతం చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కూటమి ప్రజాప్రతినిధులు కూడా తమకు ఆదాయం సమకూరే పనులపై మాత్రమే శ్రద్ధ చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

పిల్లలూ.. భోజనం బాగుందా?

- విద్యార్థులను ఆరా తీసిన జాయింట్ కలెక్టర్

మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలపై ఆరా తీస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి: పిల్లలూ మధ్యాహ్న భోజనం బాగుందా... సన్నబియ్యంతోనే అన్నం వండుతున్నారా.. మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా... అంటూ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ విద్యార్థులను ఆరా తీశారు. మంగళవారం ఆయన పుట్టపర్తి శివాలయం వీధిలోని ప్రాథమిక పాఠశాలను, చిన్నపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం పథకం కోసం ప్రభుత్వం పాఠశాలలకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తోందని తెలిపారు. జేసీ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, తహసీల్దార్ కళ్యాణ్, డీటీ రమేశ్, ఎంఈఓలు ఖాదర్ వలి బాష ,ప్రసాద్, హెచ్‌ఎంలు వెంకటనారాయణ, రజనీకాంత్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

ఆకతాయికి దేహశుద్ధి

సోమందేపల్లి: మండల కేంద్రంలో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఆకతాయిని పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. వివరాలు.. మంగళవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం రోజులాగే కొందరు మహిళలు వాకింగ్ చేస్తుండగా వైఎస్సార్ సర్కిల్ వద్ద కర్ణాటకలోని చిక్కబళాపురానికి చెందిన వాహన డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మహిళలు పట్టుకుని దేహశుద్ధి చేస్తుండడంతో స్థానికులు చుట్టుముట్టి లాక్కెళ్లి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖైదీ కోసం కదిరి పోలీసుల గాలింపు

ఖైదీ జీవన్ (సీసీ కెమెరా ఫుటేజీ)

కదిరి టౌన్: తెలంగాణలోని నిజామాబాదు సెంట్రల్ జైలు నుంచి తప్పించుకున్న ఖైదీ కోసం కదిరి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పోలీసులు తెలిపిన మేరకు జీవన్ అనే ఖైదీ నిజామాబాదు సెంట్రల్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలోనే జైలు పరిధిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో పని చేసే అతను గత నెల 29న సెంట్రీ గార్డుల కళ్లు గప్పి తప్పించుకుని పారిపోయాడు. అదే నెల 30న కదిరి బస్టాండ్‌కి చేరుకున్నట్లుగా గుర్తించిన అక్కడి పోలీసుల సమాచారం మేరకు స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. బస్టాండ్‌కు పోలీసులు చేరుకునేలోపు అక్కడి నుంచి జీవన్ పారిపోయాడు. కదిరి పట్టణం లేదా చుట్టుపక్కల గ్రామాల్లో తలదాచుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. చామన ఛాయ రంగు కలిగి, గుండు చేయించుకుని ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 94407 96851, 77026 42541, 99127 78069, 87125 32885కు సమాచారం అందించాలని సీఐ వి.నారాయణరెడ్డి కోరారు.

న్యాయవాదిపై సైబర్ ఉచ్చు

- క్రెడిట్ కార్డుల నుంచి రూ.1.15 లక్షలు మాయం

చెన్నేకొత్తపల్లి: న్యాయవాదిపై సైబర్ నేరగాళ్లు వల వేశారు. ఉచ్చులో చిక్కుకున్న అనంతరం తెలివిగా ఆయన క్రెడిట్ కార్డుల నుంచి రూ.1.15 లక్షలు అపహరించారు. ఘటనపై బాధిత న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లికి చెందిన వెంకట్రామిరెడ్డి న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయనకు ఐసీఐసీఐ బ్యాంక్‌కు సంబంధించిన నాలుగు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. మే నెలలో వివాహం నిశ్చయం కావడంతో ఆ హడావిడిలో ఉన్న సమయంలో ఓ ఫోన్ కాల్ వచ్చింది. క్రెడిట్ కార్డుకు ఇన్సూరెన్స్ సౌకర్యం యాక్టివేట్ అయిందని, ఇందుకు గాను అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని అవతలి వ్యక్తి తెలిపాడు. అవసరం లేదనుకుంటే డీయాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. దీంతో తనకు ఇన్సూరెన్స్ అవసరం లేదని వెంకట్రామిరెడ్డి తెలిపారు. అయితే వాట్సాప్ నంబర్‌కు ఓ లింక్ పంపుతామని, అందులో పూర్తి వివరాలు నింపి పంపితే డీయాక్టివేట్ చేస్తామని నమ్మబలికాడు. దీంతో వెంకట్రామిరెడ్డి తన వాట్సాప్ నంబర్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసి, పంపారు. ఆ తర్వాత అదే నెల 6,7, 9 తేదీల్లో అతని క్రెడిట్ కార్డు నుంచి రోజుకు మూడు సార్లు మూడు రోజుల పాటు నగదు విత్‌డ్రా అయింది. పెళ్లి వేడుక ముగిసిన దాదాపు 20 రోజుల అనంతరం తన క్రెడిట్ కార్డులో బ్యాలెన్స్ చెక్ చేసుకోవడంతో నిల్ అని చూపడంతో వెంకట్రామిరెడ్డి ఆశ్చర్యపోయారు. వెంటనే కస్టమర్ కేర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. పరిశీలించిన వారు క్రెడిట్ కార్డును ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా రూ.1.15 లక్షల లావాదేవీల ద్వారా జరిపినట్లుగా తెలిపారు. సమీపంలోని బ్యాంక్‌కు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. దీంతో బ్యాంక్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే 20 రోజుల్లో రీఫండ్ అవుతుందని తెలిపారు. 20 రోజులు దాటినా మొత్తం జమ కాకపోవడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకున్న వెంకట్రామిరెడ్డి మంగళవారం చెన్నేకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం గ్రామంలో రెండు ఇళ్లల్లో చోరీలు జరిగిన విషయం రెండు రోజుల ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు... మాల్యవంతం గ్రామానికి చెందిన సద్దల కేశవయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 28న ఇంటి మిద్దెపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు తెరిచి బీరువాలోని నాలుగు తులాల బంగారు నగలు అపహరించారు. అదే రోజు రాత్రి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ బెంగుళూరులో ఉన్న తన కుమార్తెను చూసి వచ్చేందుకు వెళ్లాడు. ఇంటికి వేసిన తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాలోని బంగారు కమ్మలు, బ్యాంకు పాసు పుస్తకాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయండి

జాతీయ రహదారుల భూసేకరణ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- జాతీయ రహదారులను త్వరగా అందుబాటులోకి తేవాలి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారులకు సంబంధించిన పెండింగ్ పనులు వేగవంతం చేయాలని, వీలైనంత త్వరగా జాతీయ రహదారుల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి ఎన్‌హెచ్ –342, ఎన్‌హెచ్ 716జీ, ఎన్‌హెచ్–455జీ రహదారుల భూసేకరణకు సంబంధించిన పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. రహదారి సౌకర్యం మెరుగైతే రవాణాకు ఇబ్బందులు ఉండవని, తద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం జిల్లా మీదగా వివిధ రహదారులు నిర్మిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో అటవీ, పర్యావరణ, కోర్టు సంబంధిత అంశాలు, అభ్యంతరాలు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ పెండింగ్ పనులను ఆర్డీఓలు మరోసారి పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం ఎన్‌హెచ్–342కి సంబంధించి బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి వద్ద భూసేకరణ, పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం వద్ద భూసేకరణ బిల్లుల పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ముదిగుబ్బ మండలం దొరిగిల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య, ఎన్‌హెచ్ ఏఐ పీడీ అశోక్ కుమార్, మేనేజర్ ముత్యాల రావు, డీఈ గిడ్డయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈటీ కుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ధర్మవరం: సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం దీక్షల్లో మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బొగ్గ నాగరాజు, జయకృష్ణ, అనిల్, కార్మికులు నల్ల బ్యాడ్జీలతో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఓ నంబర్ 36 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దస్తగిరి, యోగి, కాటమయ్య, పెద్దన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల కండీషన్‌పై ప్రత్యేక దృష్టి

డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్కూల్ బస్సుల కండీషన్‌పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు పేర్కొన్నారు. స్కూల్ బస్సుల కండీషన్ అంశంపై రవాణాశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్టీఓ సురేష్‌నాయుడుతో కలసి జిల్లాలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో 600 పై చిలుకు స్కూల్, కళాశాలల బస్సులు ఉన్నాయన్నారు. విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఈ బస్సులన్నీ కండీషన్‌లో ఉన్నాయో? లేదో పరిశీలించాని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధిక లోడు, ప్యాసింజర్లతో వెళ్లే గూడ్స్ వాహనాలు, ఇతర వాహనాలపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా తిరిగే వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని ఆదేశించారు.

నగర శివారున వాహనాల ఛేజింగ్

నగర శివారున వాహనాల ఛేజింగ్ ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారిని బెంబేలెత్తించింది. వివరాలు... జిల్లా రవాణా శాఖకు చెందిన ఏఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం నగరంలోని టీవీ టవర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్ణాటకకు చెందిన రెండు బొలెరో వాహనాల నిండా చేపల వలలు, ఆపై బోట్లు (పుట్టి) వేసుకుని వాటిపై మనుషులు కూర్చొని ప్రయాణిస్తుండడం గమనించిన ఆయన వాటిని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే బొలెరో డ్రైవర్లు ఆపకుండా శరవేగంతో దూసుకెళ్లి పోవడంతో ఏఎంవీఐ తన వాహనంలో వెంబడిస్తూ రాప్తాడు పంగల్ రోడ్డు దాటిన తర్వాత అడ్డుకున్నారు. వాహనాలను ఆర్టీఓ కార్యాలయానికి తరలించారు. విచారణలో వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనాలకు పర్మిట్‌లు, ట్యాక్స్‌లు లేకపోవడం, ప్రమాదకరంగా ప్రజలను తీసుకెళుతుండడంతో కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

గుంతకల్లు క్రీడాకారులకు అంతర్జాతీయ చెస్ రేటింగ్

జువైరా బాలాజీ పునీత్‌రెడ్డి కార్తీక్ రాఘవ

గుంతకల్లు: ప్రపంచ చదరంగ సమాఖ్య (ఎఫ్‌ఐడీఈ), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఏఐసీఎఫ్) సంయుక్తంగా మంగళవారం విడుదల చేసిన చదరంగ క్రీడాకారుల రేటింగ్ జాబితాలో గుంతకల్లు చెందిన ఐదుగురు క్రీడాకారులకు అంతర్జాతీయ రేటింగ్ దక్కింది. ఈ మేరకు కోచ్‌లు అనిల్‌కుమార్, రామారావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలల విభాగంలో బాలాజీ (1,472), పునీత్‌రెడ్డి (14,712), కార్తీక్ (1,493), రాఘవ (1,478) అంతర్జాతీయ రేటింగ్ దక్కించుకున్నారన్నారు. బాలికల విభాగంలో 1,401 రేటింగ్‌తో గుంతకల్లు చెస్ క్రీడా చరిత్రలో మొట్టమొదటి రేటెడ్ ప్లేయర్‌గా జువైరా రికార్డు నమోదు చేసిందని తెలిపారు.

ఈ-స్టాంపుల కుంభకోణంపై అధికారులకు సమాచారమిచ్చా

- టీడీపీ నేత ఉన్నం మారుతి చౌదరి

అనంతపురం టవర్‌క్లాక్: కళ్యాణదుర్గంలో టీడీపీ కార్యకర్త ఎర్రప్ప అలియాస్ బాబు 'మీసేవ' కేంద్రంగా సాగిన నకిలీ ఈ–స్టాంపుల కుంభకోణంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులకు తానే సమాచారం ఇచ్చానని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు, టీడీపీ నేత మారుతి చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎర్రప్ప మీసేవ కేంద్రంలో నకిలీ స్టాంపులు సృష్టిస్తున్నట్లు గతంలో అతని కారణంగా మీసేవ కేంద్రాలను మూసేసుకున్న వారు తన దృష్టికి తెచ్చారన్నారు. అందుకు ఆధారంగా ఉన్న పత్రాలను వాట్సాప్‌లో పంపడంతో వాటిని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఇతర శాఖల అధికారులకు పంపి విచారణ చేయాల్సిందిగా కోరానన్నారు. ఈ–స్టాంపుల ట్యాంపరింగ్ ద్వారా ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారనే ఉద్దేశంతోనే తాను అధికారులకు సమాచారం ఇచ్చానన్నారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం కల్గించిన వారిని వదిలేసి పోలీసులు తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ విషయంలో న్యాయపరంగా ముందుకు వెళతానన్నారు. రాజకీయంగా తనను దెబ్బతీయడానికి బురద జల్లుతున్నారని, ఈ కుంభకోణంతో తనకు ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు.

యువకుడి ప్రాణాలు బలిగొన్న మీటర్ వడ్డీ

మంజునాథ్(ఫైల్)

పావగడ: మీటర్ వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా వైఎన్ హొసకోట పీఎస్ పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన వైటీ మంజునాథ్ (38)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. పంట పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఈ క్రమంలో పంట దిగుబడులు సక్రమంగా రాకపోవడంతో అప్పులు తీర్చలేక ఇబ్బంది పడ్డాడు. ఇదే అదనుగా భావించిన వడ్డీ వ్యాపారులు ఒత్తిళ్లు చేస్తూ సాధారణ వడ్డీని కాస్త మీటర్ వడ్డీ కిందకు మార్చుకున్నారు. వడ్డీల కిందనే రూ.లక్షల్లో చెల్లించినా అప్పులు తీరలేదు. వడ్డీలకు వడ్డీలు పెరుగుతూ రూ.15 లక్షలకు పైగా చేరుకుంది. ఈ భారం నుంచి బయటపడేందుకు గ్రామంలో తనకు తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఇందుకు గాను వారానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వడ్డీలు చెల్లించే దుస్థితికి వడ్డీ వ్యాపారులు తీసుకెళ్లారు. నానాటికీ వడ్డీల భారం పెరగడం, అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెందిన మంజునాథ్ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వైఎన్ హొసకోట పీఎస్ ఎస్‌ఐ మాళప్ప నాయక్కుడి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా వజ్ర భాస్కరరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కె.వజ్ర భాస్కర రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి (ఆర్గనైజేషన్ యాక్టివిటీ)గా నియమించారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌ఓ

పుట్టపర్తి టౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాల పోస్టర్లు, బ్యానర్లను అధికారులతో కలసి తన కార్యాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని అన్ని గ్రామాల్లోనూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు నెల రోజుల పాటు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత దాడి.. గాడిద పిల్ల మృతి

గాడిద పిల్ల కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వజ్రకరూరు: మండలంలోని కడమలకుంట గ్రామ పరిసరాల్లో చిరుత దాడిలో ఓ గాడిద పిల్ల మృతి చెందింది. యజమాని చాకలి వెంకటేష్ సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం ఫారెస్ట్ బీట్ ధికారి సతీష్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేష్, ప్లాట్ వాచర్ మల్లికార్జున తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సోమవారం రాత్రి చిరుత దాడి చేసినట్లుగా నిర్ధారించారు. చిరుత సంచారాన్ని అరికట్టాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

రైలులో ప్రయాణికుడి మృతి



గుర్తు తెలియని మృతదేహం

గుంతకల్లు: ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ద్వివాంగుల బోగీలో ప్రయాణిస్తున్న అతని వద్ద కనీసం టికెట్ కూడా లేదు. సరైన సంరక్షణ లేకపోవడం, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడమే మృతికి కారణంగా ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుంది. ఎరుపు రంగులో ఉండి.. కాఫీ కలర్ టీ షర్టు ధరించాడు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

కుక్కపై చిరుత దాడి

అగళి: మండలంలోని కురసంగనపల్లి శివారున రైతు రంగరాజు పొలంలో మంగళవారం వేకువజామున కుక్కపై చిరుత దాడి, సగానికి పైగా తినేసింది. అలాగే గిరయప్పకు చెందిన జీవాల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను హతమార్చింది. కాగా, అగళి మండలం గాయత్రీ కాలనీ, పి.బ్యాడిగెరె, కరిదాసన్నపల్లి గ్రామాల్లో చిరుత సంచరిస్తూ గొర్రెలు, మేకలు, ఆవులు, తదితర వాటిపై దాడి చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళలో పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

శ్రీ కృష్ణ జ్యోతిష్యాలయం

■ మైసూర్‌కు చెందిన జ్యోతిష్యులైన జనార్ధన జోషి గారు మీ రెండు హస్త రేఖలు. జాతకం ఆధారంగా సంపూర్ణ భవిష్యత్తు చెప్పెదరు. ఎటువంటి సమస్యలున్నా శాస్త్రీయంగా శాశ్వతంగా, శీఘ్రముగా పరిష్కారం చూపెదరు. వాట్సాప్/ఫోన్: 9908626148. [SCA 25005361]

జ్యోతిష్యాలయం

■ కేరళ మాంత్రిక సాయి స్వరూప జోతిష్యం ప: వి. అయ్యప్పన్ (స్త్రీ.పు) వశీకరణం, సంతాన, ఉద్యోగ, ప్రేమ వివాహం, సతి-పతి కలహం, ప్రేమలో మోస పోవడం ఏలాంటి గుప్త కష్టకర నిఘాడ సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573677754. [SCA25005835]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు | 4 లైన్లు రూ. 270/- | అదనపు లైను రూ. 60/- | ఫర్నిచర్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

WANTED

■ బాయ్స్ హాస్టల్ వార్డన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి సెల్ : 9966333236, 9966334236. [A-7126]

■ Tutors (Gents), Bus Incharges, PET'S Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304. [A-4111]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హతః 10th – డిగ్రీ, జీతంః 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-624]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 Hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF + ESI కలదు. శాలరీ 1st కి ఇవ్వబడును. ఫోన్ : 7013730900 / 9246543129 [SCA25005819]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమం తుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- 92814 52827, 92814 52838. [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మాజీ మంత్రి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డు సూర్యకాలనీకి చెందిన యువకుడు కొవిరి నూకరాజు ఇటీవల చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మృతిని కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, రెండో వార్డు సీనియర్ నాయకులు బడగల బల్లయ్యనాయుడు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, స్థానిక నాయకులు బగాది సింహాచలం, కొనారి ఆది, పిట్ట భాస్కరరావు, సోపింటి ఆనంద్, రాజు, చందు, హేమంత్, మణి ఉన్నారు.

పచ్చిరొట్ట ఎరువు పంటకు బలం

సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఏడీ భవానీశంకర్

ఇచ్ఛాపురం రూరల్: పచ్చిరొట్ట ఎరువు పంటకు బలాన్ని ఇస్తుందని వ్యవసాయశాఖ ఉప సంచాలకులు టి.భవానీ శంకర్ అన్నారు. కొళిగాం, కీర్తిపురం, పాయితారి పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు సేద్యంతో మట్టిలో కార్బన్ శాతం పెరుగుతుందని, నేల ఉత్పాదకత మెరుగుపడేందుకు ఉపయోగపడుతుందన్నారు. పాయితారిలో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

పాడి రైతులకు పశుదాణా పంపిణీ

పశుదాణను పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు పశు వైద్య కార్యాలయం వద్ద మంగళవారం నందిగాం సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదగా పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పశుదాణాను అందిస్తుందన్నారు. అవసరమైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి మెట్ట పాపారావు, డాక్టర్ మధుసూదన్, దేవేంద్ర, అరుణ్, మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు సోంపేట మండల సమావేశం

సోంపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ మంగళవారం తెలిపారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండలస్థాయి అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వీల్‌చైర్ల అందజేత

వీల్‌చైర్స్ అందజేస్తున్న సీతయ్య ఫౌండేషన్ ప్రతినిధులు

కంచిలి: మండపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సీతయ్య ఫౌండేషన్ వారు సోంపేట మండల పరిధి బారువకు చెందిన నక్కిడాపు భాస్కరరావు, దమయంతి దంపతుల దివ్యాంగ పిల్లలకు సాయం అందించారు. ఎనిమిదేళ్ల మీనాక్షి, ఆరేళ్ల కుషాల్‌లకు వీల్‌చైర్లను మంగళవారం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో నిత్యావసర సరకులు, దుస్తులు అందించారు. సీతయ్య ఫౌండేషన్ ప్రతినిధులు గుళ్ల రమేష్, మోహనరావు, సోంపేటకు చెందిన సానా గణేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యవసాయ దినోత్సవం

రైతు దినోత్సవంలో విద్యార్థులు

కంచిలి: బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేషధారణలో విద్యార్థులు అలరించారు. వ్యవసాయ ప్రాధాన్యత, రైతుల శ్రమను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

ఉచిత విద్యుత్ అందేనా?

- ఆందోళనలో రైతులు
- కవిటి సబ్‌స్టేషన్ పరిధిలో పూర్తికాని వ్యవసాయ ఫీడర్ పనులు

వ్యవసాయ ఫీడర్ బ్రేకర్ లేని కవిటిలో సబ్‌స్టేషన్



కవిటి సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ కనెక్షన్ల కోసం గతంలో పూర్తిచేసిన విద్యుత్ లైన్

కవిటి: ఉచిత విద్యుత్ సక్రమంగా అందుతుందో.. లేదోనని రైతులు గుబులు చెందుతున్నారు. కవిటి మండలంలో ఐదు వేల ఎకరాల్లో వరి, 11 వేల ఎకరాల్లో ఉద్యానపంటల సాగు విస్తీర్ణం ఉండగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు 1236 ఉన్నాయి. ఇందుకోసం ఇచ్ఛాపురంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కవిటి, రాజపురం, బొరివంక ఉపవిద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. అక్కడ నుంచి ఉద్దానంలోని బీల ప్రాంతంలో పంట పొలాలకు, కొబ్బరి పంటకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. ఇందులో కవిటి సబ్‌స్టేషన్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కవిటి మండల కేంద్రానికి, కవిటి, కపాసుకుద్ది, పుటియాదళ, నెలవంక రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందనే లక్ష్యంతో ప్రారంభించారు. అయితే విద్యుత్‌శాఖ (కనస్ట్రక్షన్ విభాగం) కాంట్రాక్టర్ కవిటి సబ్‌స్టేషన్‌లో 2/3 సెక్షనింగ్ పనులు చేయకుండా వదిలేశారు. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు కవిటి నుంచి సరఫరా చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. వాస్తవానికి ఈ సబ్‌స్టేషన్ నుంచి పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే లైన్ పనులు దాదాపు తొమ్మిది నెలల క్రితం పూర్తి చేశారు. కేవలం సబ్‌స్టేషన్‌లో కొద్దిపాటి పనులు చేపడితే బీలరైతుకు ఎంతోమేలు జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినప్పటికీ పెండింగ్ పనులు ముందుకు సాగలేదు. ఈ పనులు పూర్తిచేయగలిగితే కవిటి నుంచి నెలవంక వరకు సుమారు 450 వరకు ఉచిత విద్యుత్ కనెక్షన్లలో సాగు చేస్తున్న రైతాంగానికి ఎంతో మేలు చేకూరనుంది. దీనిపై విద్యుత్‌శాఖ యంత్రాంగం కాస్త శ్రద్ధ పెడితే రైతన్న కష్టాలు గట్టెక్కే వీలుంటుంది. ప్రధానంగా ఈ పనులు పూర్తికానందున సుదూరంలో ఉన్న రాజపురం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను వ్యవసాయానికి అందిస్తున్న పరిస్థితుల్లో తరచూ బ్రేక్ డౌన్లు, ఎల్‌సీలు తీసుకోవడం మూలాన తొమ్మిది గంటల విద్యుత్‌లో సుమారు రోజుకు రెండు గంటల సరఫరా అందకుండా పోతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నెలకున్న లోపాలను సవరించే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

త్వరగా సమస్యను పరిష్కరించాలి

కవిటి, కపాసుకుద్ది, పుటియాదళ, నెలవంక రెవెన్యూ గ్రామాల పరిధిలో ఖరీఫ్ సీజన్ మరో 15 రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నాళ్లగానో నెలకున్న విద్యుత్ సమస్యను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలి. కవిటి సబ్‌స్టేషన్‌లో వ్యవసాయ విద్యుత్ ఫీడర్ ద్వారా ఉచిత విద్యుత్ రైతులకు సక్రమంగా అందించాలి. విద్యుత్‌శాఖ అధికారులు రైతులకు కష్టాలు లేకుండా చూడాలి.

– బెందాళం వెంకటేశ్వరరావు,రైతు,కవిటి

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం

కవిటి సబ్‌స్టేషన్ నుంచి ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు మేలు జరిగేలా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ ఫీడర్ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తాం.

– యూ.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ, కవిటి మండలం

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

కాశీబుగ్గ: మాజీ మంత్రి అప్పలరాజుకు కేక్ తినిపిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: ప్రసూతి వైద్యురాలు సుశీలను అభినందిస్తున్న లయన్స్ సభ్యులు

సోంపేట: ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డ్రగ్స్ యూనియన్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం టౌన్: డాక్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, కౌన్సిలర్ సపనల సింహాచలం, సర్పంచ్ దువ్వాడ రవి, ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు, కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, నాయకులు బిరాటి వల్లభ, వాయిలాపల్లి లక్ష్మణరావు, రంధి రాజారావు, నెయ్యిల శివకుమార్ ఉన్నారు. అలాగే పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కూడా డాక్టర్స్ డేను జరుపుకున్నారు. ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ అన్నెపు వెంకట నాగసుశీలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. లయన్స్ ప్రెసిడెంట్ హనుమంతు యెండుదొర, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు, సభ్యులు సిందిరి మధుసూదనరావు, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, వీరఘట్టం వెంకటరావు ఉన్నారు.

సోంపేట: సోంపేటలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. సోంపేట డ్రగ్ యూనియన్ ప్రతినిధులు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, వైద్యులు ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఎ.వి.రామకృష్ణ, పి.శివాజి, వై.కృష్ణమూర్తి, గోవిందు, పెద్దింటి దుర్యోధన, జోగినాయుడులను కలిసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యులు పి.దేవేంద్రరెడ్డి, ఎం.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డిలను వైద్యుల దినోత్సవం సందర్భంగా జ్ఞాన భారతి పాఠశాలలో సన్మానించారు. వైద్యుల సేవలను పాఠశాల కార్యదర్శి జోహర్‌ఖాన్ కొనియాడారు.

ఘనంగా అక్షరాభ్యాసం

చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: హిరా పంచమి సందర్భంగా మండపల్లి తోటూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారంఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి సుహాశ్‌చంద్, అంగన్‌వాడీ కార్యకర్త కె.జ్యోతి పాల్గొన్నారు.

గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిజగన్నాథపురం గ్రామంలో పెద్దమ్మతల్లి, మంకినమ్మ, భూలోకమ్మ తల్లి గ్రామ దేవతల ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమెయ్యాయి. ఉదయం గ్రామ పెద్దలు దేవర తెచ్చే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలి రోజు మహిళల కోలాట నృత్యాలతో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు ముర్రాటలతో చల్లదనం చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మరో రెండు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి.

ప్రమాదకరంగా రక్షణ భవనాలు!

- తుఫాన్ భవనాలను పట్టించుకోని వైనం
- కూలేందుకు సిద్ధంగా పలు భవనాలు

దోకులపాడు పాఠశాల అవరణలో ప్రమాదకరంగా ఉన్న భవనం

వజ్రపుకొత్తూరు రూరల్: తుఫాన్ లాంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన భవనాలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో బాధితులకు రక్షణ కల్పించాలని విలువైన ఈ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. మరికొన్ని చోట్ల పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితితో భయం గొల్పుతున్నాయి. వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలోని తుఫాన్ భవనం కొంత కాలంగా వ్యవసాయ కార్యాలయంగా ఉండేది. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అలాగే కిడిగిసింగిలోని భవనం పాఠశాలగా వినియోగించారు. అది కూడా మరమ్మతులకు గురై కూలేందుకు సిద్ధంగా ఉంది. అలాగే డోకులపాడు పాఠశాల అవరణలో ఉన్న తుఫాన్ భవనాన్ని గ్రామస్తులు పలు కార్యాక్రమాలకు వినియోగించేవారు. శిథిలమైన ఈ భవనానికి మరమ్మతులు చేపట్టకపోవంతో ప్రమాదకంగా మారింది. నగరంపల్లిలో ఉన్న తుఫాన్ భవనం నిరూపయోగంగా మారి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. వీటితో పాటు రాజాం, వంకులూరు, అక్కుపల్లి, మంచినీళ్లపేట, పల్లివూరు, మోట్టూరు పంచాయతీలలో ఉన్న మరికొన్ని భవనాలు అభివృద్ధికి నోచుకొక పూర్తిగా మరమ్మతులకు గురై ప్రమాదాలకు నిలయంగా మారాయి.

మరికొన్ని భవనాలదీ ఇదే పరిస్థితి..

తుఫాన్ రక్షిత భవనాలతో పాటు మండలంలో ఉన్న మరికొన్ని ప్రభుత్వ భవనాల కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వజ్రపుకొత్తూరులో ఉన్న పశువైద్య ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయం, వెలుగు భవనం, అక్కుపల్లిలోని గురుకుల పాఠశాలతో పాటు మండల కేంద్రంలో మూతబడిన విద్యాశాఖా కార్యాలయం, సీతాపురం పాఠశాల భవనం శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. పాఠశాల అవరణలో ఉన్న శిథిల భవనాల్లోకి చిన్నారులు ఆడుకోవడానికి వెళ్తుంటారని.. ఏదైన జరగరానిది జరిగితే బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు మేల్కొని కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను తక్షణమే నేలమట్టం చేయాలని కోరుతున్నారు.



కిడిసింగిలో శిథిలావస్థకు చేరుకున్న తుఫాన్ రక్షిత భవనం

నగరంపల్లిలో నిరుపయోగంగా ఉన్న భవనం



వజ్రపుకొత్తూరులో కూలేందుకు సిద్ధంగా తుఫాన్ రక్షిత భవనం

మాజీ సీఎం జగన్‌ను కలిసిన యువజన విభాగం ప్రతినిధులు

మాజీ సీఎం జగన్‌తో యర్ర చక్రవర్తి

జగన్‌తో చిన్ని జోగారావు

టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యర్ర చక్రవర్తి, టెక్కలి నియోజకవర్గ అధ్యక్షుడు చిన్ని జోగారావు తదితరులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తాడేపల్లిలో జరిగిన యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భాగంగా అధినేతను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో కీలకమైన యువజన విభాగాన్ని పటిష్టం చేస్తామని పేర్కొన్నారు.

విశ్రాంతి మండపం ప్రారంభం

విశ్రాంతి మండపం ప్రారంభంలో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధి యు.బొనమాళి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులు రూ. మూడు లక్షల వ్యయంతో నిర్మించిన ప్రజా విశ్రాంతి మండపాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, మడ్డు అభియాదవ్, పలికల జయరాం, డొక్కర దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆవేటి మంగళవారాలు

అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను ఊరేగిస్తున్న భక్తులు

మందస:

మందస భోయివీధిలో ఆవేటి మంగళవారాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామ దేవతలు అన్నపూర్ణమ్మ, కంచమయ్యమ్మ, భూలోకమ్మ అమ్మవార్లకు కాళికావేషధారణతో, గజనెయ్యి ముద్దల విగ్రహాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి పాయసన్నం, పండ్లు, నెయ్యముద్దలను నైవేద్యంగా సమర్పించారు.

వజ్రాల చెరువు ప్లాస్టిక్ మయం

మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులో ఉన్న వజ్రల చెరువులో ప్లాస్టిక్ వస్తువులు, ఇతర వ్యర్థాలు చేరి అస్తవ్యస్తంగా మారింది. ఒకప్పుడు ఈ చెరువు నీటినే ప్రజలు వినియోగించేవారు. ప్రస్తుతం మురికి కూపంగా దర్శనమిస్తుంది. ప్లాస్టిక్ వస్తువులతో పాటు ఇతర వ్యర్థ పదార్థాలు చేరడంతో నీరు రంగమారిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెరువులోని వ్యర్థాలను తొలగించి నీటిని యోనియోగించుకునేలా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

నిత్యం ట్రాఫిక్ కష్టాలు..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. పలాస ఇందిరా చౌక్ నుంచి ఎంపీపీ పాఠశాల వైపు రోడ్డు నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పైనే వివిధ వాహనాలను ఇష్టానుసారంగా విడిచి పెట్టేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరా చౌక్ ప్రాంతంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండాల్సి ఉన్నా ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా పోలీసులు అధికారులు స్పందించి ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

అందుబాటులో ఆక్సిజన్ కాన్సంటేటర్

పూండి ఉద్దానం ప్రాంతంలోని శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ఆక్సిజన్ కాన్సంటేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయకుమార్ మంగళవారం తెలిపారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక చాలా మంది ఇబ్బంది పడిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సొసైటీ అధ్యక్షుడు బత్తి తిరుపతిరావు సలహా మేరకు ఐదు లీటర్ల సామర్థ్యం కలిగిన కాన్సంటేటర్‌ను ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వద్ద ఉంచినట్టు పేర్కొన్నారు. అవసరమైన వారు తమను సంప్రదిస్తే ఉచితంగా సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో వంక జోగారావు, ఎస్. లక్ష్మణరావు, కీలు వెకంటేష్, కె. మురళీ, మదనాల మోహిని ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

వసతులపై డీఈవో ఆరా

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధిలోని పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల, వసతి గృహాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. విద్యార్థులకు అందించే అల్పాహారాన్ని రుచి చూశారు. ఎంఈవో కె.అప్పారావు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి 7093164422
పలాస / ఇచ్ఛాపురం 9010178979
Office mail : sklmadvt@gmail.com

ఘనంగా సీజీఎస్టీ వార్షికోత్సవం

తిరుపతిలోని సెంట్రల్ కమిషనరేట్ పరిధిలో సీజీఎస్టీ, జీఎస్టీ 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో

30 వరకు జన సురక్ష

జన సురక్ష కార్యక్రమాన్ని ఈ నెల 30 వరకు అన్ని పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో

ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్ట్

శ్రీకాళహస్తిలో ముగ్గురు చైన్ స్నాచర్లను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ వెల్లడించారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్వీ యూ అధికారుల 'స్టంట్లు'

హాల్‌టికెట్లు జారీ చేయాలంటూ అధికారులను నిలదీస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అధికారులు డిగ్రీ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ స్టంట్లు చేస్తున్నారు. ఇన్‌స్టంట్ పరీక్షలకు ఫీజులు కట్టుకున్నారు కానీ వర్సిటీ నిబంధనల ప్రకారం హాల్ టికెట్లు పొందడానికి మాత్రం వారికి అర్హత లేదంటూ ప్రకటించారు. దీంతో మంగళవారం ఎస్వీయూ పరీక్షల విభాగం వద్ద సుమారు వంద మంది విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ 2022–25 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులకు సంబంధించి 5వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలకు ఫీజులు కట్టించుకుని హాల్‌టికెట్లు జారీ చేయలేదన్నారు. అడిగితే వర్సిటీ నూతన నిబంధనల ప్రకారం మీరు అర్హులు కాదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆ సెక్షన్ అధికారులు రిజిస్ట్రార్, వీసీలను సంప్రదించి చర్చలు జరిపారు. ఫలితంగా 2022–25 బ్యాచ్ విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అందుకోసం బుధవారం నుంచి జరగనున్న ఇన్‌స్టంట్ పరీక్షలను వచ్చే జూలై 7 నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. దీంతో విద్యార్థులు వెనుదిరిగారు.

ఏడు పాఠశాలల్లో ఆధార్ నమోదు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆధారు కార్డు లేని 1నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల సౌకర్యార్థం తిరుపతి జిల్లాలో 7 పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ కేవీఎన్.కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా గూడూరు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, నాయుడుపేట జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, తిరుచానూరు జెడ్పీహెచ్ఎస్, తిరుపతిలోని ఎస్పీజేఎన్ఎం నగరపాలక హైస్కూల్, శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జెడ్పీహెచ్ఎస్, పుత్తూరు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. యూడైస్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో వారికి అందేందుకు ఆధార్ తప్పనిసరి కావడంతో డీవైఈఓలు, ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ పరిధిలో ఆధార్ లేని విద్యార్థులను గుర్తించి సమీప పాఠశాలల్లో ఆధార్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

ఏపీపీఈసెట్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఆచార్య నాగార్జున వర్సిటీ ఆధ్వర్యంలో జూన్ 25, 26వ తేదీల్లో నిర్వహించిన ఏపీపీఈసెట్–2025 పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. వర్సిటీలోని బీపీఈడీ, డీపీఈడీ రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు ఎస్వీయూ పరిధిలో 492 మంది పరీక్షకు హాజరుకాగా 463మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో పురుషులు 344మంది, మహిళలు 119మంది ఉన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 11మంది విద్యార్థులు టాప్ 50ర్యాంకుల్లో చోటు సంపాదించారు.

గుడిపాల సరిహద్దు ప్రాంతంలో నిలిచిన ట్రాక్టర్లు

మామిడి పండు.. కూటమి పుండు!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

'ఆలస్యంగానైనా ఆశించిన స్థాయిలో పూత వచ్చిందని మురిసిపోయాము. పంట దిగుబడిని చూసి ఇక దిగుల్లేదులేనని సంబరపడ్డాము. కాయ కోసి మార్కెట్‌కు తోలితే కొనేవారు లేకపోవడంతో కుమిలిపోయాము. ప్రభుత్వం చెప్పిన ధర ఇవ్వక మొండికేస్తున్న ఫ్యాక్టరీల ఎదుటే రోజుల తరబడి నిరీక్షిస్తున్నాము. ర్యాంపుల్లో ఒకటికి సగానికి తెగనమ్మాలని భావించినా ఏ ఒక్కరూ దింపుకోక దిగాలు చెందుతున్నాము. తోటలపై పెట్టిన పెట్టుబడి చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాము. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేరా..? మామిడి రైతు పరిస్థితి ఇంతేనా..?తోటలను తెగనరకాల్సిందేనా..?' అంటూ మామిడి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక.. కుటుంబాలను వెళ్లీదే పరిస్థితి లేక గుండెలు బాదుకుంటున్నారు. జిల్లాలో మామిడి రైతుల దుస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

మద్దతుధర కల్పించడంలో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

- తొలుత కిలోకు రూ.12, ఆపై రూ.6 ప్రకటించిన వైనం
- క్షేత్ర స్థాయిలో కిలో రూ.3 కూడా దక్కక రైతుల ఆవేదన
- అయినా సరే కాయ కొనడానికి ముందుకురాని ఫ్యాక్టరీలు
- అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పంట అమ్మడానికి అగచాట్లు
- నిద్రాహారాల్లేక ఫ్యాక్టరీల ఎదుట ఎదురుచూపులు
- జిల్లాలో దయనీయ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో మామిడి పంట వివరాలు	
సాగవుతున్న పంట	56 వేల హెక్టార్లు
తోతాపురి రకం	39,895 హెక్టార్లు
ప్రభుత్వం ప్రకటించిన ధర	కిలో రూ.12
ఫ్యాక్టరీల వద్ద ధర	రూ.5-6
ర్యాంపుల వద్ద ధర	రూ.3
ఫ్యాక్టరీల బయట నిరీక్షిస్తున్న పంట	41 వేల కిలోలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం మామిడి పంట ఆశించిన స్థాయిలో దిగుబడినిచ్చింది. ఇందులో తోతాపురి రకం నుంచి గుజ్జు (పల్ప్)ను తయారుచేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఫలితంగా ప్రతీ ఏటా దాదాపు 40 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి రకాన్ని రైతాంగం సాగుచేస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ మొదలయ్యింది. కానీ మామిడిని కొనడానికి ఏ ఒక్క ఫ్యాక్టరీ ముందుకు రావడం లేదు. ఒకవేళ కొన్నా కిలోకు సగటున రూ.4–5 చెల్లిస్తున్నారు. ర్యాంపుల వద్ద కిలో రూ.3 మాత్రమే పలుకుతోంది. చేతికొచ్చిన పంట అమ్ముకోలేక, ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించక అన్నదాతకు గుండెకోత మిగులుతోంది.

గుడిపాల ఫ్యాక్టరీ వద్ద టోకెన్ల కోసం రైతుల తోపులాట

చేజేతులా కోల్పోతూ..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఫ్యాక్టరీలు మామిడిని కొనకపోవడంతో రైతు కంట కన్నీళ్లు ఆగడం లేదు. చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల బయట రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలోకు రూ.6 చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకునే దిక్కులేదు. ముందుగా ఫ్యాక్టరీ వద్దకు రైతు వచ్చి టోకెన్ తీసుకోవాలి. ఆ టోకెన్ నెంబర్ వస్తే తప్ప మామిడిని లోపలకు తీసుకెళ్లడానికి వీల్లేదు. రెండు రోజులు అలాగే ఉంచేస్తే 40 శాతం పంట పనికిరాదు. చిన్నపాటి వర్షం పడితే వంద శాతం పంట రోడ్డుపై పడేయాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో టోకెన్ల కోసం రైతులు గంటల తరబడి క్యూలో నిల్చోవడం, తోపులాటలు, పోలీసులు–ఫ్యాక్టరీ నిర్వాహకులతో వాగ్వాదాలు.. ఇవన్నీ ఓ మినీ యుద్ధాన్ని తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 47 గుజ్జు పరిశ్రమలు ఉంటే ఇప్పటి వరకు 30 వరకు ఫ్యాక్టరీలు మాత్రమే తెరుచుకున్నాయి. 80 శాతం వరకు ఫ్యాక్టరీలు, కూటమి ప్రభుత్వ అనుకూలురు చేతుల్లో ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గరిష్టంగా కిలో మామిడి రూ.23కు అమ్ముడం కొసమెరుపు.

'మద్దతు'లేక..అగచాట్లు పడలేక

చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ మరో పది రోజుల్లో ముగియనుంది. మామిడి పంటను ఫ్యాక్టరీలకు అమ్ముదామని పంటను తీసుకొచ్చిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కిలో మామిడికి రూ.12 గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఫ్యాక్టరీలు చెప్పడంతో, కిలోకు రూ.8 ఫ్యాక్టరీలు చెల్లించాలని, మిగిలిన రూ.4 ప్రభుత్వమే భరిస్తుందని.. ఆ మొత్తాన్ని రైతుల ఖాతాలో జమచేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కానీ ఫ్యాక్టరీలు కూడా ఈ ధరలు పాటించలేదు. కిలోకు రూ.4 మించి ఇవ్వలేమని ఖరాకండిగా చెప్పేస్తున్నాయి. కొన్ని చోట్ల కిలో రూ.3 సైతం చెల్లిస్తున్నారు. ప్రభుత్వ హామీలన్నీ నీటిమీద రాతలేనని తేలిపోయాయి. సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు రైతుకు మద్దతు ధర అంద లేదు.

ఇంటికి పోయే పరిస్థితి లేదు

కాణిపాకం నుంచి గుడిపాల సరిహద్దులో ఉన్న ఫ్యాక్టరీకి కాయలు తెస్తే రూ.5వేలు బాడుగ. ఒక్కరోజు అయినా.. రెండు రోజులు.. మూడు రోజులు అయినా ఇదే రేటు. ఇక్కడకు కాయలు తెస్తే.. అన్‌లోడింగ్ అయ్యేందుకు ఐదు రోజులు పడుతోంది. అంతవరకు ఓపికతో ఉండాల్సిందే. ఇంటికి పోను.. రాను అంటే కుదరదు.

– రవి, బొమ్మసముద్రం, ఐరాల మండలం

టోకెన్లు అమ్ముకుంటున్నారు

వారం పది రోజులుగా తిండీనీళ్లు లేకుండా రోడ్లపై అవస్థలు పడుతున్నాం. రాత్రి సమయాల్లో అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలు కుమ్మక్కై దొడ్డి దారిన టోకెన్లు అమ్ముకుని డైరెక్టుగా 10, 20 వాహనాలు లోపలకు పంపించేస్తున్నారు. ప్రశ్నిస్తే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యం చేస్తున్నారు. దోమల బెడదతో నిద్రాహారాలు లేకుండా మేము అవస్థలు పడుతుంటే కొందరు మాత్రం దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు.

– బాబునాయుడు, జీడీనెల్లూరు

కన్న బిడ్డల్లా సాకినాం

సంవత్సరం పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నాం. కన్నబిడ్డల్లా పండించాం. ఇప్పుడు మామిడి పంట మొత్తం కిలోమీటర్ల మేర రోడ్లపై పడి ఉంది. నాలుగైదు రోజుల నిరీక్షణలతో టార్పాలిన్‌పట్ట వేడికి లోలోపలే కుళ్లిపోయి, జ్యూసులా రోడ్లపై కారిపోతోంది. అధికారులు ఫ్యాక్టరీలు ప్రత్యేక చొరవ చూపించాలి.

– శ్రీనివాసరెడ్డి, పెనుమూరు మండలం

చిత్తూరు పల్ప్ ఫ్యాక్టరీ బయట మామిడికాయల ట్రాక్టర్లతో వేచి ఉన్న రైతులు

టోకెన్ల కోసం ఫ్యాక్టరీ వద్ద అవస్థలు పడుతున్న రైతులు

తొలిరోజే తాళాలు

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్ మళ్లీ మొదటికే వచ్చింది.. తొలి రోజు తిరుపతి నగరంలో చాలా వరకు రేషన్ షాపులు తెరుచుకోలేదు. కొందరు తెరిచినా సర్కర్ పనిచేయకపోవడంతో తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. దీంతో సంచులు, కార్డులు క్యూలో పెట్టిన లబ్ధిదారులు ఏం చేయాలో తెలియక కాసేపు ఎదురుచూసి వెళ్లిపోయారు. అతికష్టం మీద నడుచుకుంటూ వచ్చిన వృద్ధులు, సరుకులు ఇవ్వకపోవడంతో ఊత కర్ర పొడుచుకుంటూ, కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయారు.

రాఘవేంద్రనగర్‌లో మూతపడిన రేషన్‌దుకాణం

అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల పాటు రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఎగనామం పెట్టారు. కేవలం బియ్యంతోనే సరిపెట్టారు. ఆ తర్వాత మూడు నెలలు బియ్యం, చక్కెర మాత్రమే అందించారు. ఆ తర్వాత నాలుగు నెలలు కందిపప్పు అరకొరగా అందించారు. రెండు నెలల నుంచి మళ్లీ కందిపప్పు కొందరికే ఇస్తూ వచ్చారు. తాజాగా జూలైలో కందిపప్పు ఇవ్వకుండా కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెట్టేశారు. జిల్లాలో 1457 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 6 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే తొలి రోజు సర్వర్ సమస్యలతో పలు దుకాణాల్లో సరుకులు ఇవ్వడం మానేశారు. కొన్ని దుకాణాల్లో గంటల కొద్ది పడిగాపులు కాయాల్సి వచ్చింది. పలువురు వృద్ధులు క్యూలో ఉండలేక, ఇంటిదారి పట్టారు. మరోవైపు జిల్లాలో 345 రేషన్ డీలర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జిలకు అప్పగించారు. వారంతా కాసేపు చూసి.. సర్వర్ పనిచేయకపోవడంతో దుకాణాలు మూసివేశారు. దీంతో కార్డుదారులు బిక్కముఖంతో ఇంటిదారి పట్టారు.

రేషన్ సరుకుల కోసం వృద్ధుల అవస్థలు

భవానీ నగర్‌లో మూతపడిన రేషన్‌దుకాణం

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎమ్మార్‌పల్లిలోని మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కేవీఎన్.కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన మంగళవారం ఆ పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు గత ఏడాది కంటే తక్కువగా అడ్మిషన్లు చేయడం, ఒకటో తరగతి విద్యార్థుల వివరాలను యూడైస్‌లో నమోదు చేయడంలో హెచ్ఎం అలసత్వం వహించడం, తరగతుల వారీగా బోధనకు, మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు ఉపాధ్యాయులను కేటాయించకపోవడం వంటి అంశాలను గుర్తించారు. దీంతో వివరణ కోరుతూ ఆ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు ఇచ్చినట్లు డీఈఓ తెలిపారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కుమార్

టీడీపీ ఎమ్మెల్యేల్లో గుబులు!

- ఇంటింటికీ వెళ్లాలంటే భయం
- మామిడికి గిట్టుబాటు ధర కల్పించలేదు
- కనీసం కాయలను కొనుగోలు చేయని వైనం
- పింఛన్లు, తల్లికి వందనంలో కోతపై లబ్ధిదారుల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సుపరిపాలన పేరుతో ఇంటింటికీ వెళ్లడానికి టీడీపీ ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు పట్టుకుంది. ఏడాది పాలనలో పథకాలు అమలు చేయకపోవటం, ఉమ్మడి జిల్లాలో మామిడి రైతులు ఆగ్రహంగా ఉండడంతో ఏంచేయాలో పాలుపోవడం లేదు. అధినేత చంద్రబాబు ఆదేశించినట్లు ఇంటింటికీ వెళ్లినప్పుడు స్థానికులు నిలదీస్తే ఏమని సమాధానం చెప్పాలి? అనేదానిపై ఎమ్మెల్యేలు అధికారులు, స్థానిక టీడీపీ నేతలతో సుదీర్ఘంగా చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై ×చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ₹ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి ముందే సుపరిపాలన పేరుతో ఇంటింటికీ ఎమ్మెల్యేలు వెళ్లాలని సీఎం చంద్రబాబు నిర్ణయించి, ప్రారంభించేశారు. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు నేడు కుప్పంలో పర్యటించనున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లనున్నారు. మరో వైపు ఎమ్మెల్యేలు అధికారుల నుంచి సమాచారం సేకరించారు.

పథకాలు అడగరా?

ఏడాది కూటమి పాలనలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పింఛన్లు తొలగించిన వారే సుమారు 32 వేల మంది ఉన్నారు. వాటి స్థానంలో కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు అతీగతి లేదు. పింఛను కోల్పోయిన వారు, కొత్తగా ఆశిస్తున్నవారు ఎమ్మెల్యేలను నిలదీస్తారని ఆందోళన చెందుతున్నారు. కొత్త రేషన్ కార్డులు లేవు, ఉన్న కార్డులకు పూర్తి స్థాయిలో సరుకులు ఇవ్వటం లేదు. కేవలం బియ్యం మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది ప్రభుత్వం. మరో వైపు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. కానీ రెండో ఏడాది ప్రారంభమై ఖరీఫ్ సీజన్ మొదలైనా పైసా విదల్చలేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, ఇతరత్రా హామీలు అమలు చేయకపోవటంపై లబ్ధిదారులు అసంతృప్తితో ఉన్నారు.

భయపెడుతున్న మామిడి

చిత్తూరు, తిరుపతి జిల్లాలో గత కొంత కాలంగా రైతులు మామిడి దిగుబడులను అమ్ముకోలేక వారి అవస్థలు వర్ణనాతీతం. మామిడి దిగుబడులతో రోజుల తరబడి ఫ్యాక్టరీల ముందు వేచి ఉన్నా కొనుగోలు చేసే పరిస్థితి కనిపించలేదు. గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా ఫలితం కనిపించలేదు. అధికారులు ఆదేశించినా ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు రావడం లేదు. దీంతో మామిడి రైతులు కడుపు మండి చెట్లను నరికేసుకుంటున్నారు. మరి కొందరు కాయలను రోడ్లపై పారబోసి వెళ్లిపోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. ఈ పరిస్థితుల్లో సుపరిపాలన పేరుతో ఇంటింటికి వెళితే రైతులు విరుచుకుపడుతారన్న భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది.

అడుగడుగునా అక్రమాలే

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇసుక, మట్టి, గ్రావెల్, మైనింగ్ అక్రమ తవ్వకాలు, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అక్రమార్కులు రాత్రింబవళ్లు జేసీబీల, ఇటాచీలు, లారీలు, టిప్పర్లతో ప్రకృతి సంపదను తరలించి సొమ్ముచేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. అక్రమార్కులకు అధికారులు తోడయ్యారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక దొరకటం లేదు. ఉచిత ఇసుక గురించి పట్టించుకునే ఎమ్మెల్యేలు, అధికారులు కరువయ్యారు. కూటమి నేతలు ప్రభుత్వ, పోరంబోకు, కాలువ, చెరువు పోరంబోకు భూములను ఆక్రమించి సొంతం చేసుకునే పనిలో బిజీ బిజీగా ఉన్నారు. వేరొకరి అనుభవంలో ఉన్నా.. దౌర్జన్యంగా లాక్కుంటున్నారు. ఇదేమిటని అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారు. అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తున్నారు. ఇలా ఏడాది పాలనపై జనంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలను నిలదీసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సుపరిపాలన పేరుతో ఇంటింటికీ వెళ్లటానికి ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు.

మేయర్‌కు దక్కని గౌరవం

- పార్లమెంటు జాతీయ స్థాయి సదస్సుకు మేయర్లు, చైర్ పర్సన్‌లకు ఆహ్వానం
- తిరుపతిలో మేయర్ పేరును విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఆమె స్థానంలో డిప్యూటీ మేయర్ పేరు ప్రతిపాదన
- కూటమి నేతల తీరుపై విమర్శల వెల్లువ

మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడ్డాక తొలిసారి మేయర్ ఎన్నికలను 2021లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహించింది. మేయర్ స్థానం ఓసీ మహిళ రిజర్వుడ్ కాగా బీసీ మహిళకు కేటాయించేలా నాటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, యువ నేత భూమన అభినయ రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వీరి విజ్ఞప్తి మేరకు పార్టీ అధిష్టానం తిరుపతి మేయర్ స్థానాన్ని బీసీ మహిళలకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీ పీ తరపున మేయర్‌గా పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు పోటీపడ్డారు. విద్యావంతురాలిని బరిలోకి దింపాలని భూమన తిరుపతిలో జల్లెడ పట్టారు. ఈ క్రమంలో గైనకాలజిస్ట్‌గా విశేష సేవలు అందిస్తూ, వివాదరహితురాలుగా గుర్తింపు పొందిన డాక్టర్ ఆర్ శిరీషను ఎంపిక చేశారు. ఈమె ఎంపికపై నగరవాసులు, మేధావులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఆ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో మేయర్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. 49 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించగా 49 స్థానాల్లోనూ ఆ పార్టీ విజయం సాధించడం విశేషం.


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (G) DEPARTMENT
ORDER:

రెండవ డిప్యూటీ మేయర్ పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు

నాడు బీసీ మహిళకు అగ్రతాంబూలం

ఓసీ మహిళకు రిజర్వ్ అయిన స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించి వైఎస్సార్ సీపీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, తమ పార్టీకి బీసీలు అంటే బ్యాక్ బోన్ అని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేకమార్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే డాక్టర్ శిరీషను ఏరికోరి మేయర్ ను చేసి బీసీలకు పట్టం కట్టారు. నేడు కూటమి ప్రభుత్వం అదే మహిళను అవమానించేలా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. బీసీలు సైతం కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. ముఖ్యంగా యాదవులు తమ వర్గానికి చెందిన మహిళకు ఇంత అన్యాయం చేస్తారా అంటూ భగ్గుమంటున్నారు. ఎన్నికల ముందు బీసీల పాట పాడే చంద్రబాబు ఎన్నికలయ్యాక బీసీలను అణగదొక్కేందుకు ప్రయత్నం చేస్తుంటారని ఓ వర్గం మండపడుతోంది.

నగర ప్రథమ పౌరురాలికి దక్కని గౌరవం

హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ వేదికగా భారత పార్లమెంటు నిర్వహిస్తున్న 'ది రోల్ ఆఫ్ అర్బన్ లోకల్ బాడీస్ ఇన్ స్ట్రంత్నింగ్ కాంగ్రెట్యూషనల్ డెమోక్రసీ అండ్ నేషన్ బిల్డింగ్' అనే అంశంపై జాతీయ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తోంది. జూలై 3, 4 తేదీల్లో నిర్వహించే ఈ జాతీయ కాన్ఫరెన్స్‌కు ఆయా రాష్ట్రాల నుంచి మేయర్లు, చైర్ పర్సన్లను పంపించాలని పార్లమెంట్ జనరల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థల నుంచి మేయర్‌లు, మున్సిపాలిటీల నుంచి చైర్ పర్సన్లను పంపించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం జాతీయ సదస్సుకు ఎవరెవరిని పంపించాలన్న దానిపై ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు కక్ష సాధింపుగా, ప్రతిపక్ష పార్టీకి ప్రాధాన్యత లేకుండా చేసేలా ఉండడంపై రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు చిన్న పదవుల్లో ఉన్నా ఎంపిక చేసి ఉన్నత పదవుల్లో ఉన్న మేయర్లకు మొండి చేయి చూపించి, ఆ పదవులకు అవమానం తెచ్చేలా వ్యవహరించారు. ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. పార్లమెంటు నిర్వహించే ఈ అత్యున్నత జాతీయ సదస్సుకు వైఎస్సార్‌సీపీకి చెందిన మేయర్లు, చైర్ పర్సన్‌లను పంపించకపోవడం ఏంటని నిలదీస్తున్నారు.

రెండో డిప్యూటీ మేయర్ పేరు

హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ వేదికగా నిర్వహించే జాతీయ సెమినార్‌కు తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీషను వెళ్లనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నింది. ఈ జాతీయ సెమినార్‌కు గుంటూరు కార్పొరేషన్ నుంచి మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్‌ని, మరో మున్సిపాలిటీ నుంచి చైర్ పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌ని ఎంపిక చేసిన ప్రభుత్వం తిరుపతిలో మాత్రం మేయర్‌ను పూర్తిగా పక్కన పెట్టి రెండవ డిప్యూటీ మేయర్‌ను మాత్రమే పంపించడం ఇప్పుడు వివాదానికి కారణమైంది. నగర ప్రథమ పౌరురాలికి ఇవ్వాల్సిన కనీస మర్యాదను కూడా ఇవ్వకుండా వ్యవహరించడంపై నగర ప్రజలు మండిపడుతున్నారు. వివాదరహితురాలైన మేయర్‌ను అవమానించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం పట్ల ముఖ్యంగా బీసీ వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో తమది బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చాక ఇలా బీసీ మహిళా మేయర్ పట్ల అవమానించేలా వ్యవహరించడం ఏంటని నిలదీస్తున్నారు. మేయర్ స్థానంలో రెండవ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణను పంపించడం ఏంటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. పార్టీలకు అతీతంగా ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను మాత్రమే పంపించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం ఇప్పుడు విమర్శలకు కారణమైంది.

క్లుప్తంగా

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

అధినేత వైఎస్ జగన్‌తో కొటాల చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సూచించినట్లు పార్టీ మండలాధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్ జగన్‌ను కలిశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్టు చేయడంపై నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు వివరించారు. చంద్రగిరి నియోజకవర్గంలో కూటమి నేతల అరాచకాలు, అక్రమాలను అధినేతకు తెలిపారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్ల ఉపాధ్యాయుడి)గా పనిచేస్తున్న హరిబాబును విధుల నుంచి తొలగిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు రమణయ్య మంగళవారం తెలిపారు. హరిబాబు 02.08.2017 నుంచి 26.08.2024 వరకు 7 సంవత్సరాల 25 రోజులు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై విచారణ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఏడాది కంటే ఎక్కువ కాలం విధులకు హాజరు కాకుంటే ఆయన్ను ప్రభుత్వ సర్వీసు నుంచి పూర్తిగా తొలగిస్తామని పేర్కొన్నారు. 30.06.2025 నుంచి హరిబాబును ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

రేపు అన్‌ఎయిడెడ్ బంద్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు గురువారం బంద్ చేపడుతున్నట్లు అప్సా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలలపై అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష చర్యలను నిరసిస్తూ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియమాలు సరిగ్గా పరిశీలించకుండా ఎటువంటి నోటీసులు, చర్యలకు ఉపక్రమించకూడదని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భార్య పుట్టింటికి.. భర్త ఆత్మహత్య

ఏడుకొండలు ఇంటి వద్ద గుమికూడిన స్థానికులు

చిల్లకూరు : భార్య అలిగి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు తిప్పగుంటపాళెంలో మిక్సెడ్ కాలనీకి చెందిన తాటిపర్తి ఏడుకొండలు(25)కు ఉషాతో వివాహమైంది. కొంత కాలంగా సజావుగా సాగిన వారి కాపురంలో మనస్పర్థలు చోటు చేసుకోవడంతో 8 నెలల క్రితం ఆమె పుట్టింటికెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం రోజున స్థానికులకు కనిపించిన ఏడుకొండలు తరువాత కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి దుర్గంధం రావడంతో స్థానికులు పరిశీలించగా, ఇంటిలోపలి నుంచి గడియ వేసి ఉంది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులకు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం తలుపులు తీసి లోపలకు వెళ్లిన పోలీసులు కుళ్లిపోయి ఉన్న మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

95.89 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ మంగళవారం తొలి రోజు 95.89 శాతం మందికి అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. జూలై నెలకు 2,59,732 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా, 2,49,054 మందికి అందించామని వెల్లడించారు. మిగిలిన వారికి బుధవారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్ట్

తిరుపతి క్రైం: శ్రీకాళహస్తిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆయన మంగళవారం ఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రేణిగుంట పోలీస్ స్టేషన్లో ఆరుసార్లు చోరీలకు పాల్పడిన ముగ్గురిని సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తి మిట్ట కండ్రిగ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు తమిళనాడు రాష్ట్రం, వందలూరు కండ్రిగకు చెందిన మూతం మని మారన్ అలియాస్ మనీ(27), వెంకటగిరి చెందిన మారి మాణిక్యం(25), శ్రీకాళహస్తికి చెందిన కొట్టం బేటి రాజా(20)గా తేలిందన్నారు. వీరి నుంచి రూ.13 లక్షలు విలువ చేసే 139 గ్రాముల బంగారు, హీరో స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేస్తున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసులు, క్రైమ్ పోలీసులు చేసిన కృషి అభినందనీయమన్నారు.

55 మందిపై నిఘా

జిల్లా వ్యాప్తంగా 55 మంది చెయిన్ స్నాచర్లపై నిఘా పెట్టమని ఎస్పీ పేర్కొన్నారు. వారిలో ఇప్పటికే 40 మందిని పూర్తిస్థాయిలో గుర్తించామన్నారు. వీరందరిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఇప్పటికే నగర శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకుంటున్నామని తెలిపారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పాడుబడ్డ గృహాల వద్ద ఐదుగురు యువకులు గంజాయి తాగుతూ డ్రోన్ కెమెరాలకు దొరికారన్నారు. వీరందరికీ కూడా కౌన్సెలింగ్ నిర్వహించి, కేసులు నమోదు చేశామన్నారు.

గంజాయి తాగుతూ డ్రోన్ కెమెరాకు చిక్కిన యువకులు

అకడమిక్ కన్సల్టెంట్ల పనితీరుపై సమీక్ష

డెమో ఇస్తున్న అకడమిక్ కన్సల్టెంట్

తిరుపతి సిటీ: ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ల పనితీరుపై సమీక్ష పేరుతో చేపట్టిన ఇంటర్వ్యూలు అగ్ని పరీక్షలుగా మారాయి. గత విద్యా సంవత్సరంలో అకడమిక్ కన్సల్టెంట్లు, కో-ఆర్డినేటర్ల పనితీరుపై వీసీ చాంబర్‌లో మంగళవారం నుంచి ప్రారంభమైన ఇంటర్వ్యూలకు వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు పలు విభాగాల అధ్యక్షులు హాజరయ్యారు. సంబంధిత సబ్జెక్ట్‌లో కమిటీ సంధించిన ప్రశ్నలకు అకడమిక్ కన్సల్టెంట్లు వైట్‌బోర్డ్‌పై డెమో ఇచ్చారు. తొలిరోజు పలు విభాగాల్లో పనిచేస్తున్న 43మంది తాత్కాలిక అధ్యాపకులు ఇంటర్వ్యూలకు హాజరై పనితీరు పరీక్షను ఎదుర్కొన్నారు. అయితే ఎస్వీయూలో గతంలో ఎన్నడూ లేనివిధంగా తాత్కాలిక అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం బాధాకరమని వారు వాపోతున్నారు. ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో పెద్ద సంఖ్యలో అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించే వ్యూహంలో భాగంగానే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఇంటర్వ్యూలకు పలు విభాగాల నుంచి మరో 200మంది అకడమిక్ కన్సల్టెంట్లు హాజరుకానున్నారు.

తరిగిపోతున్న పింఛన్లు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్లు కూడా కరిగిపోతున్నాయి. గత ఏడాది జూన్‌లో జిల్లాలో 2,71,183 మందికి సామాజిక పింఛన్లు అందించారు. ఈ ఏడాది జూలైలో 2,59,732 మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నారు. కూటమి పాలనలో జిల్లాలో 11,451 పింఛన్లు తగ్గించారు. ప్రతి నెలా సుమారుగా వెయ్యి పింఛన్లు తగ్గిస్తున్నారు. ఈ అంశంపై అధికారులను ప్రశ్నిస్తే, పింఛన్లు తగ్గించలేదని వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు. తొలగించిన వారి జాబితా ఇవ్వడానికి అధికారులు విముఖత చూపుతున్నారు. మరోవైపు జిల్లాలో గత ఏడు నెలలుగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు పింఛన్లు తీసుకుంటున్న వారిని తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. వీరి జాబితాను త్వరలో విడుదల చేస్తామని చెబుతున్నారు. ఈ జాబితా వస్తే అందులో ఎంత మందిని తొలగించేస్తారోనన్న ఆందోళన నెలకొంది. మరోవైపు రూ.4వేలు పింఛన్ తీసుకుంటున్న వారిని జూలైలో తనిఖీలు చేస్తారన్న చర్చ మొదలైంది. మొత్తంగా జిల్లాలో పింఛన్ల ఏరివేత కొనసాగుతోందన్న విషయం మాత్రం తేలిపోయింది.

పింఛన్ల పంపిణీలో అధికారులు(ఫైల్)

వితంతు పింఛన్లకు కొత్త మెలిక

వితంతు పింఛన్లలో జాప్యం లేకుండా గత ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వంలో 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు ఏ కేటగిరిలోనైనా పింఛన్లు తీసుకుంటూ భర్త మృతి చెందితే మాత్రమే వారి సతీమణులకు పింఛన్లు ఇస్తామని చెబుతున్నారు. ఈ ఏడాది జూన్ వరకు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతువులు 7వేల మంది ఉన్నట్లు ఉన్నట్లు అధికారుల వద్ద లెక్కలున్నాయి. వీరికి పింఛన్లు వస్తాయో లేదోనని వారు ఆందోళన చెందుతున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానం, తిరుచానూరు
ఇ-టెండరు ప్రకటన
Roc.No. TTD-27021(37)/38/2021-SRI PAT, Dt: 27.06.2025
ఒక సంవత్సర కాలానికి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దేవస్థానం, లడ్డుపోటులో ఉపయోగించే నెయ్యి విక్రయం కొరకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టీటీడీ, తిరుపతి వారిచే ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు కొరకు వెబ్‌సైట్ http://www.tirupatibalaji.ap.gov.in మరియు https://tender.apeprocurement.gov.in.లను లాగాన్ కాగలరు.తదుపరి వివరాలకు కొరకు సంప్రదించు ఫోన్ నంబర్లు :0877-2264585, షెడ్యూల్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు ముగింపు తేది:04.07.2025న ఉ.10గంటలకు మరియు 18.07.2025 మ.01.00 గంటలకు 1) సాంకేతిక బిడ్ తెరచు తేది :18.07.2025న మ.03.30 గం.లకు 2) ధర బిడ్ తెరచు తేది :18.07.2025 సా.04.00 గం.కు
Roc No:TTD-40021/10/2025-PRO SEC(Adv No.124) Dt: 01.07.2025 కార్యనిర్వహణాధికారి

ఘనంగా సీజీఎస్‌టీ వార్షికోత్సవం

ప్రసంగిస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సీజీఎస్‌టీ) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి కార్యాలయ ఆవరణలో ×సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత్ఞ అనే థీమ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులలో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడింటిలో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి సీజీఎస్‌టీ కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్.దినకరన్ సమక్షంలో గుంటూరు సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ ఎంపిక చేసిన సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు.

30 వరకు జన సురక్ష

తిరుపతి అర్బన్: జన సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 774 పంచాయతీల్లోనూ ఈ నెల1 నుంచి 30 వరకు జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. మరో సమావేశంలో జేసీ శుభం బన్సల్‌తో కలిసి మాట్లాడుతూ, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణపనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం జిల్లా డిసిప్లినరీ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుపతి క్రైమ్: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టీటీడీ విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన సతీమణి అమ్ములుకు రూ.5 లక్షల డీడీని ఎస్పీ అందజేశారు.

విరమణ పొందిన హోంగార్డుకు సత్కారం

జిల్లాలో సుదీర్ఘంగా పనిచేసే ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు వెంకటరమణ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనకు వేతనం రావలసిన రూ.5 లక్షలు అందజేశారు.

విరమణ పొందిన హోంగార్డు వెంకటరమణ

పట్టుబడిన చైన్‌స్నాచర్

గొలుసును వృద్ధురాలికి అప్పగిస్తున్న ఎస్ఐ రామస్వామి

సత్యవేడు: వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును తెంపుకుని పారిపోతున్న దుండగుడిని స్థానిక యువకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు పంచాయతీ పరిధిలోని పాపానాయుడు పేట వీధిలో కే.నాగమ్మ(85) మంగళవారం ఉదయం మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి నడుచుకుంటూ ఇంటికి బయల్దేరింది. ఈమె పరిస్థితి గమనించిన తమిళనాడులోని నేమళ్లూరుకు చెందిన ఈ.ప్రదీప్ వెంబడించాడు. పాపానాయుడు వీధి సమీపంలో జనసంచారం తక్కువ ఉండడంతో ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని పరుగు తీశాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానిక యువకులు వెంబడించి చాముండేశ్వరి థియేటర్ సమీపంలో పట్టుకొని, ఎస్ఐ రామస్వామికి అప్పగించారు. బాధితురాలికి బంగారు గొలుసును అప్పగించారు. వెంటనే స్పందించి దొంగను పట్టుకున్న యువకుడు జగన్‌ను పోలీసులు అభినందించారు.

కాళంగినదిలో మునిగి వ్యక్తి మృతి

మృతి చెందిన బాబురెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: కాళంగి నదిలో నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు, గ్రామానికి చెందిన బాబురెడ్డి (54) గేదెలను పోషణతో జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కాళంగి నది సమీపంలోని పొలాల వద్దకు గేదెలను తోలుకుని వెళ్లారు. గేదెలు నదిలోకి దిగి రాకపోవటంతో వాటిని బయటకు తీసురావటానికి నీటిలో దిగాడు. అయితే ఈతరాని బాబురెడ్డి నీటిలో మునిగి మృతి చెందాడు. ఇది గమనించిన అక్కడి రైతులు బాబురెడ్డిని నీళ్ల నుంచి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందడంతో వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. బాబురెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ విశ్వనాథనాయుడు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రీ కౌన్సెలింగ్ కోసం ఉద్యోగుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సచివాలయ మహిళా పోలీస్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో పారదర్శకత లేనందున రీ కౌన్సెలింగ్ చేయాలంటూ మహిళా పోలీసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళా సంరక్షణ కార్యదర్శులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నాకు దిగారు. గ్రామ, వార్డు సచివాలయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వర రావు, తిరుపతి నగర అధ్యక్షుడు విద్యాసాగర్, ఉద్యోగ సంఘం మహిళా నేతలు విజయలక్ష్మి, నజ్మా, జ్ఞానాంబిక, శాంత కుమారి తదితరులు మాట్లాడారు. చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల్లో పారదర్శకత లేదని చెప్పారు. రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని వారంతా డిమాండ్ చేశారు. వార్డు పరిధిలో పనిచేస్తున్న వారిని పక్క వార్డుకు, మండల పరిధిలో పనిచేస్తున్న వారిని పక్క మండలానికి బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ నిబంధనలు పాటించలేదని మండిపడ్డారు. ప్రధానంగా పంచాయితీల్లో పనిచేస్తున్న వారిని పక్క మండలానికి కాకుండా 80 నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలానికి బదిలీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీల్లో పూర్తిగా సీనియారిటీకి ప్రాధాన్యత కల్పించలేదని ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. దీంతో ఆయన చిత్తూరు ఎస్పీ మణికంఠకు ఫోన్ చేసి మాట్లాడి, సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఉద్యోగులు దివ్యభారతి, కుమారి, నిహారిక, యోగప్రియ, లక్ష్మీప్రసన్న, లావణ్య, కళ్యాణి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education
ADMISSIONS
■ 10th Pass / Inter Fail అయిన విద్యార్థులు Nursing, MLT (Lab Technician) కోర్సులు చేసుకునే అవకాశం. సంప్రదించండి: 82474 57565.

Real Estate
PLOTS FOR SALE
■ గేటెడ్ కమ్యూనిటీ తుడా అప్రూవల్ ప్లాట్లు ధర 3,50,000/- నుండి ప్రారంభం. సంప్రదించండి సెల్: 8333873430, 8297001234.
■ అతి తక్కువ ధరల్లో 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/డీటీసీపీ ఆమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సెల్: 9114561456

Wanted
■ Wanted Teachers for Higher Class All Subjects & Computers Teacher, Hostel Cook, for a reputed School in S.N.Puram, Tirupathi. Attractive Salary, Contact Cell: 9290898331, 7013881383.

■ నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీ లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం: 20 to 25K. Q: Inter పైన, Age: 25 to 40Y. ఆసక్తిగల అభ్యర్థులు సంప్ర. సెల్: 91828 98446
■ Wanted Civil Engineers to work at a well Reputed company in Tirupati Qual: Diploma/B.Tech/QC Engineer Min 2 yrs exp. Sal: 15K - 20K. Cont: 9542332862, 8985323604
■ కిసాన్ మిత్ర, మండలాల వారిగ ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. Q: 12, జీతం: 25 వేలు. సెల్: 7702806401, 9347989835
■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th - డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర: 99084 29239
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- 92814 52827, 92814 52838

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలనగా పరిశీలించవలె పెద్ద ప్రయత్నం చెందాల్సిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాణిజ్యలైన్ల ప్రకటనకు రూ.:375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970

Canara Bank Together we can
తిరుపతి ప్రధాన శాఖ-1, తిరుపతి, తిరుపతి జిల్లా ఫోన్: 7382932285

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు తేది: 25.06.2025
ఋణగ్రహీత: శ్రీమతి నాగప్రమీల, భర్త నాగ శ్రీనివాసులు, ఫ్లాట్‌నెం.308, శ్రీ లాల్గా గోవింద రెసిడెన్సీ, అకార్డ్ స్కూల్ కుంగారం బ్రాంచ్ ప్రక్కన, ఉపాధ్యాయ నగర్, తిరుపతి - 517501
సహఋణగ్రహీత: శ్రీ నాగశ్రీనివాసులు తండ్రి నాగసుబ్బయ్య, ఫ్లాట్‌నెం.308, శ్రీ లాల్గా గోవింద రెసిడెన్సీ, అకార్డ్ స్కూల్ కుంగారం బ్రాంచ్ ప్రక్కన, ఉపాధ్యాయ నగర్, తిరుపతి - 517501
అయ్యా/ అమ్మా !
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు
[illegible]

ఋణ స్వభావం	మంజూరు చేసిన ఋణం మొత్తం	ఖాతా నెంబరు	తేది: 24.06.2025 నాటికి బకాయిమొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్	రూ.37,00,000/-	1065619007228	రూ.20,25,731.45	12.25 %
	రూ.8,00,000/-	1065619007225	రూ.3,45,446.27	11.20 %

[illegible] తేది: 23.06.2025 [illegible] తేది: 24.06.2025 నాటికి రూ.32,71,177.72 [illegible] సెక్షన్ 13(2) [illegible] సెక్షన్ 13(4) [illegible]

స్థలం : తిరుపతి
తేది : 25.06.2025
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి
విజయనగరం
బుధవారం ၊ 2 ၊ జూలై ၊ 2025

కొంతమందికే ప్రోత్సాహకం..!
మాతాశిశు సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. - 8లో

కళ్లకు గంతలతో నిరసన
జిందాల్ పరిశ్రమ కళ్లు మూసి జెల్ల కొట్టిందని, తడి గుడ్డతో రైతుల గొంతు కోసిందని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. - 8లో

సోషల్ మీడియా వరమా? శాపమా?
సోషల్ మీడియా ఇప్పుడు మనిషి నిత్యకృత్యాల్లో ఓ భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. - 8లో

న్యూస్‌రీల్

గిరిజన యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

- 8, 9 తేదీల్లో ఓపెన్ కౌన్సెలింగ్

ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ఇన్‌చార్జి వీసీ, గిరిజన వర్సిటీ

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 8, 9వ తేదీల్లో ఓపెన్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ షెడ్యూల్‌లో 8వ తేదీన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంబీఏ, 9వ తేదీన పీజీ ఇంగ్లిష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా యూనివర్సిటీకి హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ 'సీటీయూఏపీ.ఏసీ.ఐఎన్'ను సందర్శించాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

విజయనగరం క్రైమ్: విజయనగరం సీఎంఆర్ కూడలి వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గాజులరేగకు చెందిన బెవర గణేష్, పద్మావతి నగర్‌కు చెందిన బోగి రాహుల్ 300 గ్రాముల గంజాయిని ప్యాకెట్‌లలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారన్నారు. వారి నుంచి 300 గ్రాముల గంజాయి, రూ.200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

మున్సిపల్ ఉద్యోగుల వినూత్న నిరసన

నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లిమర్ల: కూటమి ప్రభుత్వ తీరుపై నెల్లిమర్ల నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు చెవిలో పూలుపెట్టుకుని వినూత్నరీతిలో మంగళవారం నిరసన తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ తారక్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవింద్, బాబూరావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి వెళ్లి.. అక్కడే నిద్రపోయి..

మద్యంమత్తులో దొంగతనం చేసిన ఇంటిలోనే నిద్రపోతున్న కృష్ణ

బొబ్బిలి: ఓ ఇంటిలో ఐదు రోజులుగా దొంగతనం చేస్తూ అదే ఇంటిలో మద్యం మత్తులో నిద్రపోయిన దొంగను బొబ్బిలి పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బొబ్బిలి పట్టణం గొల్లపల్లి అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్న శీర శ్రీనివాసరావు వ్యవసాయ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల కిందట స్వగ్రామమైన అలజంగి వెళ్లారు. ఈ విషయాన్ని కనిపెట్టిన పిరిడి గ్రామానికి చెందిన కె.కృష్ణ ఆ ఇంటిలోకి ప్రవేశించాడు. ఇంటిలో ఉన్న వెండి, ఇత్తడి సామాన్లు దొంగిలించి విక్రయించడం, కొనకపోతే తాకట్టు పెట్టడం చేసి మద్యం కొనుగోలు చేసి ఆ ఇంట్లోకే వెళ్లి తాగుతూ, తింటూ గడిపాడు. ఐదు రోజులుగా ఇదే తంతు జరుగుతోంది. ఇంటి యజమాని మరో రెండు రోజులు రాడనుకున్నాడో ఏమో మంగళవారం కూడా మరికొన్ని సామాన్లు విక్రయించి పూటుగా మద్యం తాగి ఎప్పటివలే చల్లగా ఉందని ఇంటి గచ్చుపై నిద్రపోయాడు. స్థానికులు దొంగను గుర్తించి అలజంగిలో ఉన్న శ్రీనివాసరావుకు సమాచారమందించారు. ఈ లోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారమందుకున్న ఎస్‌ఐ ఆర్.రమేష్ కుమార్ తన సిబ్బందితో వచ్చి దొంగను పట్టుకున్నారు. అప్పటికే నిద్రమత్తులో ఉండడంతో పిరిడిలోని కృష్ణ ఇంటికి ఫోన్ చేశారు. అతడిని ఇంటికి పంపొద్దంటూ కుటుంబ సభ్యులు తిరిగి పోలీసులను వేడుకోవడం గమనార్హం. కేసు నమోదు చేయడమా, లేదంటే దొంగకు కౌన్సెలింగ్ ఇవ్వడమా అన్నది బుధవారం తేల్చుతామని ఎస్‌ఐ తెలిపారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న ప్రవేశాలు
- ప్రైవేటుకు లబ్ధిచేకూర్చేలా ఆలస్యంగా బడిబాట!
- గందరగోళంగా మారిన ప్రాథమిక విద్య
- ఒకటో తరగతిలో చేరేందుకు వెనుకంజ
- వందల స్కూళ్లల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు నిల్

బడిపోయిన ప్రవేశాలు!

విజయనగరం అర్బన్:

పాఠశాలలు ఆరంభమై ఇరవై రోజులు గడిచింది. బడిఈడు పిల్లలందరూ ఇప్పటికే ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందాలి. జిల్లాలో పరిస్థితి చూస్తే వందల సంఖ్యలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క ప్రవేశమూ జరగలేదు. దీనిపై మేధావులతో పాటు విద్యావేత్తలు ఆలోచనలో పడ్డారు. కూటమి ప్రభుత్వ అస్తవ్యస్థ విద్యావిధానాలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి తొమ్మిది రకాల పాఠశాల వ్యవస్థను తెరపైకి తెచ్చి గందరగోళానికి గురిచేస్తోందంటూ మేధావివర్గం తప్పుబడుతోంది. ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను ఒకటి రెండు తరగతులకే పరిమితం చేయడం, 3, 4, 5 తరగతులను సమీపంలోని మోడల్ స్కూల్స్‌లో విలీనం చేయడం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇవ్వడంతో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు తగ్గిపోయాన్న వాదన వినిపిస్తోంది.

కొన్ని పాఠశాలల్లో ప్రవేశాలు జీరో..

సంతకవిటి మండలం గుజ్జన్నపేట ప్రాథమిక పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడంతో కొత్తగా ఒక్క విద్యార్థి చేరలేదు. దీంతో పాఠశాల ఇటీవల మూతబడింది. అలాగే, మెరకముడిదాం మండలంలో ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య 1100 పడిపోయినట్టు రికార్డులు చెబుతున్నాయి. ప్రభుత్వ విద్యపై కూటమి నిర్లక్ష్యం, జిల్లాలో కొత్త ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు జారీచేయడమే ఊరిబడికి ఆదరణ తగ్గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో జిల్లాలో కొత్తగా ఒక్క ప్రైవేటు పాఠశాల కూడా రిజిస్టర్ కాలేదు. ఈ విద్యా సంవత్సరంలో 45 కొత్త పాఠశాలలు జిల్లాలో నమోదయ్యాయి. ఇవి కాకుండా అనుమతి లేనివి మరో 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్నట్టు సమాచారం. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి ప్రవేశాలు ఈ ఏడాది తగ్గుతున్నాయి. తాజా సమాచారం మేరకు జిల్లాలోని 27 మండలాల్లో విజయనగరం, బొబ్బిలి, కొత్తవలస, ఎస్.కోట, చీపురుపల్లి, గజపతినగరం మండలాల్లోని దాదాపు వంద స్కూళ్లలో ఒకటో తరగతిలో ఒకరిద్దరే చేరారు. ఆయా స్కూళ్లలో ప్రవేశాలు పెంచాలని విద్యాశాఖ అధికారులు ఇప్పుడు ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతుండడం గమనార్హం. ఓ వైపు అస్తవ్యస్త విధానాలతో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ.. మరోవైపు ప్రవేశాలు పెంచాలని ఒత్తిడిచేయడాన్ని ఉపాధ్యాయలోకం తప్పుబడుతోంది.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. దీనికోసం బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నాం. బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం అధికారులు, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు కృషి చేయాలి.
– యు.మాణిక్యంనాయుడు, డీఈఓ

ప్రైవేటు చదువులకు ప్రభుత్వ ప్రోత్సాహం..

ప్రభుత్వ పాఠశాలలను గత నెల 12న పునఃప్రారంభించే వరకు ప్రవేశాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయలేదు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా జూన్ మొదటి వారం నుంచే ప్రవేశాల ప్రణాళికలను అమలు చేసేది. గ్రామాల్లోకి ఉపాధ్యాయులు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలు, అత్యాధునిక బోధన శైలిని తల్లిదండ్రులకు తెలియజెప్పి ప్రచారం చేపట్టేవారు. పాఠశాలల పునఃప్రారంభించే సమయానికి ప్రవేశాలు పూర్తయ్యేవి. దీనికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పాఠశాల పునఃప్రారంభం వరకు ఎలాంటి ప్రవేశాల డ్రైవ్ చేపట్టలేదు. తాజాగా బడిబాట పేరుతో ప్రవేశాల డ్రైవ్ చేపట్టాలని ఉపాధ్యాయులను గ్రామాలకు పంపుతున్నారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల్లో చేరిపోయిన ఒకటో తరగతి విద్యార్థులను క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు గుర్తించి కంగుతింటున్నారు. విద్యాశాఖ నిర్లక్ష్యమా.. ప్రైవేటు పాఠశాలల ప్రవేశాల కోసం మరోక్షంగా కూటమి ప్రభుత్వ సహకారమా అంటూ మేధావివర్గం అనుమానం వ్యక్తంచేస్తోంది.

● గొడుగులకు గిరాకీ

ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి. నాట్లు వేసే సమయంలో మహిళలు వర్షానికి తడిసిపోకుండా వేసుకునేందుకు అనువైన తాటికమ్మలతో అల్లిన గొడుగులకు పల్లెల్లో గిరాకీ పెరిగింది. మరోవైపు పట్టణాల్లోని ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా తమ సరుకులు తడిచిపోకుండా ఉండేందుకు తాటికమ్మల గొడుగులనే వినియోగిస్తున్నారు. దీంతో అటు పల్లెలు, ఇటు పట్టణాల్లో గొడుగుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్కోగొడుగును రూ.200 నుంచి రూ.300 మధ్యన విక్రయిస్తున్నారు. విజయనగరం రామారాయుడు రోడ్డులో మంగళవారం గొడుగులను విక్రయానికి తీసుకెళ్తున్న చిరువ్యాపారిని చిత్రంలో చూడొచ్చు.
– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

మడ్డువలసలోనే ఏనుగులు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు సమీపంలో తొమ్మిది ఏనుగుల గుంపు తిష్ఠ వేసింది. గత మూడు రోజులుగా సంగాం గ్రామ పరిసరాల్లోని చెరకు, పామాయిల్ తోటల్లో సంచరిస్తూ ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల తరలించాలని రైతులు కోరుతున్నారు.

అప్రమత్తంగా అధికారులు.....

ఏనుగులు గుంపు వంగర–రాజాం రోడ్డు మార్గం ఆనుకొని ఉండడంతో అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. రోడ్డుపై వెళుతున్న వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రోడ్డు మార్గంలో వాహనాలు నిలుపుదల చేస్తున్నారు.

ఏనుగుల గుంపు

ఏనుగుల బారి నుంచి తమ పంటను రక్షించాలని అటవీశాఖ అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్న సంగాం రైతులు

మీ సేవలు వెలకట్టలేనివి

- ఎస్పీ వకుల్ జిందల్
- ఉద్యోగవిరమణ పొందిన ఐదుగురు అధికారులకు ఘన సన్మానం

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులతో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన పోలీస్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలు సర్దార్ ఖాన్, ముడసాల వేణుగోపాలస్వామి, కుచ్చర్లపాటి తిరుమలరాజు, జామి ఏఎస్‌ఐ ఆర్‌వీఏ నర్సింగరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఆర్ఎస్‌ఐ ఊయక గుంపస్వామిలను జిల్లా పోలీస్‌శాఖ తరపున జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అంటేనే క్లిష్టపరిస్థితులు, విభిన్న వాతావరణంలో ఆరోగ్యంపై కూడా శ్రద్ధచూపేందుకు అవకాశం లేని పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఐదుగురు అధికారులు పోలీస్ శాఖలో ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వర్తించడంతో పాటు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. విశ్రాంత జీవితాన్ని ఆనందంగా సాగించాలని, సమాజానికి సేవ చేయాలని, పోలీస్ శాఖ తరపున ఎలాంటి సాయం కావాలన్నా సంప్రదించాలని సూచించారు. అనంతరం ఉద్యోగుల దంపతులను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లా కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరపున గిఫ్ట్ చెక్కులను అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన అధికారులు మాట్లాడుతూ తమ సర్వీసులో సహాయ, సహకారాలను అందించిన అధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ ఏఆర్ జి.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్రారెడ్డి, ఎస్‌బీ సీఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.కె.చౌదరి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ఎన్. గోపాలనాయుడు, టి.శ్రీనివాసరావు, ఆర్. రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రేషన్ కష్టాలు

రేషన్ కోసం వరండాలో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

బియ్యం మూటను తీసుకెళ్తున్న మహిళ

గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడంతో లబ్ధిదారులకు ప్రతినెలా కష్టాలు తప్పడం లేదు. పనులు మానుకుని రేషన్ కోసం గంటల తరబడి డిపోల వద్ద నిరీక్షిస్తున్నారు. గతంలో వలే ఇంటివద్దకే వచ్చి సరుకులు అందజేస్తే ఈ కష్టాలు ఉండేవి కావని చెబుతున్నారు. రేషన్ కోసం విజయనగరంలోని ధర్మపురి వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులను చిత్రంలో చూడొచ్చు. – సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

- కూటమి ఏడాది పాలనలో చితికిపోయిన పేదకుటుంబాలు
- ప్రజల్లోకి ప్రభుత్వ మోసకారి పాలన
- ఏడాదిలో కనీస అభివృద్ధికి నోచుకోని జిల్లా
- జనాదరణ చూసి ఓర్వలేకే జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు
- ఈ నెల 3న వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

హామీల అమలుపై అబద్ధాలు

సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా అబద్ధాలు చెబుతూ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రజలకు ఏం మేలు చేశామని ఈ నెల 2వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి కూటమి నేతలు చెప్పగలరని ప్రశ్నించారు. కూటమి నాయకత్వంపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం పోయిందని, ముఖ్యమంత్రి సమావేశం పెడితే ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యే పరిస్థితి నెలకొందని విమర్శించారు. ధర్మపురిలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో పార్టీ జిల్లా నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి కూటమి ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయం, మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా దిశానిర్దేశం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను అమలుచేయకుండా చేశామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. హామీల అమలుపై ఎవరైనా నిలదీస్తే ఊరుకునేది లేదంటూ పరుషపదజాలం ప్రయోగించడం ఆశ్చర్యకరంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు హామీలు అమలుపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాది పాలనపై మోసకారి మాటలు చెబుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన బాండ్లతో పాటు, చేసిన హామీలు, బాబూ ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ప్రచారాలు ఎంత వరకు అమలు చేశారో ప్రజలతో చెప్పిస్తామన్నారు. ఏడాది కాలంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ అన్న చందంగా పాలన సాగిందని ఎద్దేవా చేశారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని చెప్పారు.

హామీల అమలెక్కడ?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్, నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి, ఆడపిల్ల నిధి కింద నెలకు రూ.1500 తదితర హామీలు అమలెప్పుడో చంద్రబాబు చెప్పాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతాంగానికి ఇస్తామన్న రెండేళ్ల పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన 140కు పైగా హామీల అమలుపై ప్రతి ఇంటికీ వెళ్లి అడిగి తెలుసుకుంటామని, వారికి జరుగుతోన్న నష్టాన్ని వివరిస్తామని స్పష్టం చేశారు.

పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం రేపు

జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. నగరంలోని పూల్‌బాగ్ జగన్నాథ కళ్యాణ మండపంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేస్తారన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీలు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ ఎంపీలు, పార్టీ జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండలాధ్యక్షులతో పాటు రాష్ట్ర పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహమూర్తి, సంగంరెడ్డి బంగారునాయుడు, ఇప్పిలి అనంత్, జిల్లా పార్టీ కోశాదికారి సిరిపురపు జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారయణ, వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వల్లిరెడ్డి శ్రీనివాస్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు బూర్లె నరేష్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు పతివాడ కృష్ణవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై తప్పుడు కేసులు

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు అత్యంత ప్రజాదరణ వస్తుండడం చూసి ఓర్వలేక అక్రమ కేసులు పెడుతున్నారని మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. కేవలం భయభ్రాంతులను చేసేందుకు పోలీసులను ఉపయోగించి కట్టడి చేసేందుకు ప్రయత్నించినా జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకున్న అభిమానాన్ని అడ్డుకోలేరన్నారు.

ఏడాదిలో ఏం అభివృద్ధి చేశారు...?

ఏడాది కూటమి పాలనలో విజయనగరం జిల్లాలో ఏం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో చెప్పాలని మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పింఛన్ల కోసం గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మూడు నెలల కిందట స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు జీఓ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేకపోయారని చెప్పారు. ఒక్క విజయనగరం జిల్లాలో 4000 మంది లబ్ధిదారులు పింఛను కోసం ఎదురు చూసే దుస్థితి నెలకొందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వచ్చే పరిస్థితి లేదని, కనీసం అధికారులు నిర్వహించే సమావేశాలకు హాజరుకాకుంటే సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామంటూ చెప్పుకుంటున్న కూటమి నాయకులు ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏడాదిలో గణనీయంగా తగ్గిపోయిందో చెప్పాలన్నారు. జిల్లాలోని మెరకముడిదాం మండలంలో ఏడాది కాలంలో ప్రభుత్వ బడుల్లో 1100 మంది విద్యార్థులు తగ్గిపోయారని చెప్పారు. అన్ని వ్యవస్థలు, రంగాలను అవినీతిమయంగా మార్చేశారని... ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య సమన్వయం లేకపోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇలా అయితే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి

ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి జరిమానా

మక్కువ: మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి సాలూరు జేఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై ఎం.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల మండల కేంద్రం మక్కువ సరిహద్దుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, 14 మంది వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడంతో కేసులు నమోదు చేశామన్నారు. మంగళవారం 14 మంది నిందితులను సాలూరు కోర్టులో హాజరుపరచగా, ఒక్కో వ్యక్తికి రూ. పదివేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. రెండవసారి మద్యం తాగి వాహనాలను నడిపి పట్టుబడితే, ఆ వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, జైలుశిక్ష పడే అవకాశం ఉందని న్యాయమూర్తి హెచ్చరించారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టపగలే చోరీ

- 2.5తులాల బంగారం, లక్ష నగదు అపహరణ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ధన్‌రాజు ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో 2.5 తులాల బంగారం లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. గ్రామంలో టిఫిన్ హోటల్ నడుపుతున్న ధన్ రాజ్ హోటల్‌లో బిజీగా ఉన్న సమయంలో ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో యువకుడి మృతి

సంతోష్‌కుమార్ (ఫైల్)

సీతంపేట: మండలంలోని చెక్కాపురం గ్రామానికి చెందిన మండంగి సంతోష్‌కుమార్ (31) పాముకాటుకు గురై మంగళవారం మృతిచెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విషసర్పం మెడపై కాటు వేయడంతో వెంటనే కుటుంబసభ్యులు దోనుబాయి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా అక్కడికి తీసుకువెళ్లేసరికి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సంతోష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దోనుబాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

యువతి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని రామవరం మధుర గ్రామం కరకవలస గ్రామానికి చెందిన చుక్క సత్యవేణి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బయట నుంచి వచ్చిన యువతి తండ్రి ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని తమ కుమార్తె వేలాడుతోంది. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది. కడుపునొప్పి తాళ లేక తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తండ్రి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: పట్టణంలో 13 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని ఎరుకుల వీధిలో ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 13మంది పేకాటరాయుళ్లను పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.23,800, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొంతమందికే ప్రోత్సాహకం..!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే గర్భిణులకు జేఎస్‌వై లబ్ధి
- ఏప్రిల్ నుంచి జూన్ 26వరకు 1842 మంది ఆన్‌లైన్‌లో నమోదు
- 1232 మందికి మాత్రమే నగదు జమ
- ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిన కూటమి సర్కారు

ఘోషా ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలు

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు సంక్షేమానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది, కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలను ప్రోత్సహించడం కోసం అందించే జేఎస్‌వై ప్రోత్సాహకాలు అందించడంలో కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రోత్సాహకాలు అందరికీ కాకుండా కొంతమందికి ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రుల్లో ప్రసవించే మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 వేలు ఆరోగ్య ఆసరా కింద ఇచ్చేది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరాకు మంగళం పాడేసిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసవాలు జరిగే ఆస్పత్రులు జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి ఏరియా ఆస్పత్రులు, బాడంగి, నెల్లిమర్ల, భోగాపురం, బొబ్బిలి సీహెచ్‌సీలు, ఘోషాఆస్పత్రిలో ప్రసవాలు జరుగుతాయి. అదేవిధంగా జిల్లాలో ఉన్న 48 పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు జరుగుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే బాలింతలకు జననీ సురక్ష యోజన కింద ప్రోత్సాహకం (జేఎస్‌వై) అందజేస్తారు. గ్రామీణ ప్రాంత తల్లులకు రూ.1000, పట్టణ ప్రాంత తల్లులకు రూ.600 ఇస్తారు.

1842మంది తల్లుల నమోదు

ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జూన్ 26వతేదీ నాటికి ఎంఎస్‌ఎస్ పోర్టల్‌లో 1842 తల్లులు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో 1232 మందికి మత్రమే నగదు జమ అయింది. 610 మందికి జేఎస్‌వై ప్రోత్సాహకం అందాల్సి ఉంది.

మిగిలిన వారికి త్వరలో అందజేత

జేఎస్‌వై కింద గ్రామీణ ప్రాంత మహిళలకు రూ.1000, పట్టణ ప్రాంత మహిళలకు రూ.600 చొప్పన ప్రోత్సాహకం అందించనున్నాం. ఈ ఏడాది ఇంతవరకు 1842 మందికి గాను 1232 మందికి ప్రోత్సాహకం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగతా 610 మందికి కూడా త్వరలో వారి ఖాతాల్లో జమ అవుతుంది.

డాక్టర్ ఎస్. జీవనరాణి, డీఎంహెచ్ఓ

పోటాపోటీగా పింఛన్ల పంపిణీ

- రెండు ప్రాంతాల్లో రెండు వర్గాలుగా అందజేత
- టీడీపీలో రాజుకుంటున్న గ్రూపుల కుంపటి

ఎస్‌కోటలోని కోటవీధిలో పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

పుణ్యగిరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలో మంగళవారం అధికార టీడీపీ నేతలు రెండు వర్గాలుగా, పోటాపోటీగా పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే లలితకుమారి తన అనుయాయులతో కలిసి కోటవీధిలో, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు తన అనుయాయులతో కలిసి పుణ్యగిరిలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీలో రాజుకుంటున్న అసమ్మతి కుంపటికి ఇది నిదర్శనం. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఆరంభం నుంచి రెండు గ్రూపులు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యే లలితకుమారి, ఎమ్మెల్యే సీటు కోసం ఆశించి భంగపడి, డీసీఎంఎస్ చైర్మన్‌గిరితో సరిపెట్టుకున్న గొంప కృష్ణ రెండు వర్గాలుగా ఉన్నారు. గొంప కృష్ణ వర్గానికి ఎంపీ భరత్ ఆశీస్సులు మెండుగా ఉన్న విషయం విదితమే. కాగా ఇటీవల శాసనసభ ఎన్నికల్లో నారా లోకేష్ హామీతో టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారితో పాటు కొందరు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.

అసంతృప్తిలో మూడో వర్గం

మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వైస్ ఎంపీపీ సుధారాజు వర్గం అధికార పార్టీ నేతల తీరుపై గుర్రుగా ఉన్నారు. పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కార్యక్రమాలు వేటికీ తమకు సమాచారం ఇవ్వకుండా, తమ ప్రాతినిధ్యం లేకుండా చేస్తున్నారని మధనపడుతున్నారు. నాడు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చి, నమ్మించి నట్టేట ముంచుతున్నారని కలత చెందుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, నిధులు, విధులు, సంక్షేమ కార్యక్రమాలు ఇలా ఎక్కడా తమ మాట చెల్లడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోకేష్ దగ్గరకు పంచాయితీ?

తమకు తగిన గౌరవం దక్కడం లేదని నేరుగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసి, నాడు ఇచ్చిన హామీలను గుర్తుచేయాలని సుధారాజు వర్గం యోచిస్తోంది. ఇందుకోసం లోకేష్ అపాయింట్‌మెంట్ కోసం చూస్తున్నారని, త్వరలోనే అధిష్టానం పెద్దలకు వాస్తవాలు చెప్పేందుకు అమరావతి వెళ్లనున్నట్లు కచ్చితమైన సమాచారం.

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: తాగునీరు, భూమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కారిగూడ పంచాయతీ దొందమానుగూడ గ్రామ గిరిజనులు పలువురు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావును కలిసి వినతపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న చైర్మన్ ఇంటికి వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు. మంచినీటి సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలపై చైర్మన్‌తో చర్చించారు. పైనాపిల్, కొండచీపుళ్లు, చిరుధాన్యాలు వంటి పంటలకు గిట్టుబాబు ధర లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సవర సింహాచలం, హడ్డుబంగి శేషమ్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ముఖ్యనాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 5న శనివారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలో గల రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబులు హాజరవుతారని తెలియజేశారు. పార్లమెంట్ పరిశీలకులు, ఎంపీ, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్యనాయకులు హాజరు కానున్నారన్నారు.

అందరూ హాజరుకావాలి

ఈ సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో గల మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో గల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ సభ్యులు, మాజీ డీసీసీబీ, మాజీ డీసీఎంఎస్ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు అందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, బంకురు రవికుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తప్పెట ప్రసాద్, అధికార ప్రతినిధి ముద్దల సత్యం నాయుడు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, ఎంపీటీసీలు బడే రామారావు, వై.రమణ, సర్పంచ్‌లు తీళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

120 సారా ప్యాకెట్లు పట్టివేత

సాలూరు: పట్టణంలో 120 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎస్సై అప్పలరాజు, సిబ్బందితో కలిసి ఎరుకుల వీధిలో ఓ పాత నిందితురాలి నుంచి 120 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎక్కడైనా సారా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ సీఐ నంబరు 9440902374కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.సారా నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్టు

భామిని: మండలంలోని కోసిమానుగూడ సమీపంలో సారా అమ్ముతున్న బిడ్డిక రామారావు అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై జి.అప్పారావు తెలిపారు. 20లీటర్ల సారా సీజ్ చేసి నిందితుడిని కొత్తూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

20 మద్యం సీసాల పట్టివేత

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మద్యం బెల్ట్‌దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఎస్సై బి.రాముడు ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించగా మద్యం బాటిల్స్‌తో ఓ వ్యక్తి కనిపించడంతో అదుపులోకి తీసుకుని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మోకాళ్లపై ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

- కమిషనర్‌కు సమ్మె నోటీసు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం రూ. 24,500, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలను ప్రతినెలా 10వ తేదీ లోపు చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా నేటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇప్పటికే అనేక మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం అనే పదాన్ని తొలగించి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించి దశలవారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 17 రోజుల సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, రిటైర్ అయిన, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు, రిటైర్మెంట్ బెనిఫిట్, తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాల వర్తింపు తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రజారోగ్య అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్. రామనాయుడు, రాజు, ధనుంజయ, ప్రసాద్, బుజ్జి, నాయుడు, రామచంద్రరావు కుమారి, శంకరరావు, రమ, సూరి పాల్గొన్నారు.

డాక్టర్ దీనకుమార్‌కు సత్కారం

డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను సన్మానిస్తున్న పశువైద్య సహాయకులు

సీతానగరం: పార్వతీపురం బదిలీ అయిన పశుసంవర్థక ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను పశువైద్య సహాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. దీర్ఘకాలంగా మండల పశువైద్యాధికారి, సీతానగరం పశువైద్య శాఖసబ్ డివిజినల్ ఎ.డిగా డాక్టర్ దీనకుమార్ సేవలందించిచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు కావడంతో పార్వతీపురం సబ్‌డివిజన్ ఎ.డి గా బదిలీ అయినందున పశువైద్య సహాయకులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సన్మాన గ్రహీత డాక్టర్ దీనకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు అనివార్యమే అయినా విధుల్లో అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయన్నారు. సుదీర్ఘకాలం మండలంలో పశువులకు సేవలందించే సదవకాశం తనకు దక్కిందన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉద్యోగులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కళ్లకు గంతలతో నిరసన

- జిందాల్ మోసం చేసిందని నిర్వాసితుల ఆందోళన

కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ కళ్లు మూసి జెల్ల కొట్టిందని, తడి గుడ్డతో రైతుల గొంతు కోసిందని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రఘురాజు నివాసం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో రోడ్డుమీద కళ్లకు గంతలు కట్టుకుని జిందాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిందాల్‌తో చేతులు కలిపి అన్ని పార్టీల నాయకులు, జిల్లా అధికారులు తమను కళ్లు మూసి జెల్ల కొట్టారని, జిందాల్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నారని, వాపోయారు. జిల్లా పెద్దదిక్కు అయిన కలెక్టర్ తన ఉద్యోగం మరిచిపోయి జిందాల్ ప్రతినిధిలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని, నాడు నమ్మించి ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారని, ఇప్పటికీ ముఖం చూపడం లేదన్నారు. నాడు జిందాల్ ఇచ్చిన హామీలు ఎవరు తీరుస్తారు? ఎలా తీరుస్తారని అడిగితే చెప్పకుండా ముఖం చాటేయడం న్యాయమా? జీవనోపాధి అయిన భూములు కోల్పోయి న్యాయం అడిగితే మమ్మల్ని పోలీసుల్ని పెట్టి బెదిరిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్సీ లేఖ

జిందాల్ భూసమస్య చుట్టూ తతెత్తుతున్న పరిస్థితి అర్థం చేసుకోవాలని, తొలుత నిర్వాసితుల శాంతియుత నిరసనకు అనుమతించి తర్వాత వారిని అనుమతించక పోవడం వల్ల నిర్వాసితులు తన ఇంటికి వస్తున్నారని, స్థానికుడిని కావడం వల్ల వారిని కాదనలేక విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వారి అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడానికి అనుమతించి, తనపై ఒత్తిడి తగ్గించాలని ఎమ్మెల్సీ రఘురాజు కలెక్టర్, ఎస్పీలకు లేఖలు ఇచ్చారు.

సోషల్ మీడియా వరమా? శాపమా?

- యువతపై అత్యధిక ప్రభావం

సోషల్ మీడియాలో మునిగి తేలుతున్న నేటితరం ప్రజలు

విజయనగరం గంటస్తంభం: సోషల్ మీడియా ఇప్పుడు మనిషి నిత్యకృత్యాల్లో ఓ భాగమైంది. బంధుమిత్రులతో కనెక్ట్ అవ్వడానికి మంచి వేదికైంది. అనుభావాలను, అలవాట్లను, ఆలోచనలను పంచుకునే చోటు. ఇది కొంతమేర బాగానే ఉన్నా ఎదుటి వారి 'సోషల్ బతుకు'లను చూస్తూ కుంగుబాటుకు లోనవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇతరుల వివరాలు, వినోదాలు, విలాసాలను చూస్తూ.. చాలామంది.తమను తాము తక్కువ చేసుకుంటున్నారు. మరి సోషల్ మీడియాలో మనం చూసే ప్రతిదీ నిజమేనా? అంటే..'కాదు' అనే చెప్పాల్సి వస్తుంది.

ఎందుకుంటే 'ఫ్యామిలీ ఓవర్ ఎవ్రీథింగ్' అంటూ ఫొటోను స్టేటస్ పెట్టుకునేవారు పట్టుమని పది నిమిషాలు కూడా ఫ్యామిలీతో గడపకపోవచ్చు. 'ఫ్రెండ్స్ ఫర్ లైఫ్' అనేవారు అసలు స్నేహితులే లేకపోవచ్చు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటూ అర్ధరాత్రి పూట పోస్టులు పెడుతుండవచ్చు, నిద్రపోకుండా ఆరోగ్యం పాడుచేసుకోవచ్చు. 'అమ్మే దైవం' అని ఎమోషనల్ క్యాప్షన్స్ పెట్టేవారంతా అమ్మకు పనుల్లో సాయం చేస్తారన్నది అపోహే. పొద్దున నిద్ర లేదగానే దేవుడి వీడియోలను స్టేటస్‌లుగా పెట్టుకున్నవారు మంచి మనుషులని ఏ తప్పూ చేయని వారని అనుకుంటే పొరపాటే. పిల్లికి బిచ్చం వేయనివారే 'సొంత లాభం కొంత మానుకుని పొరుగువానికి తోడుపడవోయ్' అంటూ ఫోజులు కొట్టవచ్చు. నువ్వు లేనిదే నేను లేనంటూ ఇన్ బాక్స్‌ల్లో ప్రేమ పాఠాలు వల్లె వేసేవారు..ఆ మాటే మరొకరికి చెప్పరని గ్యారంటీ లేదు. ఖరీదైన కారు ముందో, విలాసవంతమైన భవనం ముందో నిలబడి ఫొటోలు పెడితే వాళ్ల వైభోగాన్ని చూసి అసూయ కలుగుతుంది. కానీ అవి వాళ్ల సొంతమేనా కాదా? వారికి ఆ తాహతుందా, లేక ఆర్భాటాలకు పోయి ఆనక అప్పులతో ఇబ్బందులు పడుతున్నారా? అవేవీ మనకు తెలియదు. ఫొటోల కోసం ఎవరికో ఏదో సాయం చేస్తున్నట్లు నటించేవారు పెరుగుతున్నారని వారి సోషల్ మీడియా పోస్టులే చెబుతుంటాయి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో అందమైన అమ్మాయిలు ఫొటోలు చూసి ఆత్మన్యూనతకు లోనయ్యేవారు, తామూ అలాగే కనపడాలని రకరకాల బ్యూటీ ప్రొడక్ట్స్ కొంటున్న వారూ లేకపోలేదు. ఫొటోలకు ఫిల్టర్లు ఉంటాయని ఎలాంటి వారైనా అందంగా కనిపించవచ్చని ఆ క్షణం స్ఫురించదు.

తెరమీద కనిపించేవన్నీ ఫిల్టరేసిన బతుకులు. నిజజీవితాలు కాదు. నిజాయతీగా ఉన్నదున్నట్లు చూపించుకునేవారూ ఉంటారు. కాకపోతే వారిది ప్రదర్శనలా ఉండదు. ఎవరికీ ఇబ్బంది కలిగించదు. లేనిది ఉన్నట్లూ ఉన్నది లేనట్లూ చూపించుకోవడానికి సోషల్ మీడియాను మయసభలా వాడుకునేవారితోనే సమస్యంతా.

సెల్ఫీ జోష్‌లో..యువత డేంజర్ చిత్రం

మంచికి వాడుకుందాం..

పోస్టులు పెడుతుంటారు, సమాచారాన్ని షేర్ చేస్తుంటారు. ఇటీవల సోషల్ మీడియాలో రాజకీయ, విధానాపరమైన పోస్టులే ఎక్కువగా దర్శనమిస్తుంటాయి.ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాలు, న్యాయపరమైన విధానాలపై వచ్చే పోస్టులను ఇతరులకు పంపడం ద్వారా చిక్కుల్లో పడుతుంటాం. అనవసరంగా పోలీసు కేసుల బారిన పడుతుంటాం.అటువంటి సమయంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సాక్ష్యాలుగా చూపుతున్నారు పోలీసులు. లేనిపోని లింకులు క్లిక్ చేయడం, పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులకు దూరంగా ఉండడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

అడిక్షన్ ఉందో లేదో ఇలా గుర్తించొచ్చు...

సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల ఉద్యోగం, చదువు, పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే ఏదైనా నిర్దిష్ట సమయంలో చేయాల్సిన పనికి బదులు ఫోన్‌లో యాప్‌లను తెరిస్తే అది వ్యసనానికి సంకేతంగా చెబుతున్నారు.

- స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి ఉన్నప్పుడు, భోజనం చేసేటప్పుడు స్మార్ట్ ఫోన్‌ను తీసుకోవడం, మెస్సేజ్‌లను చూడడం.
- ప్రతి చిన్న సమస్యకు పరిష్కారంగా ఆన్‌లైన్, సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడడం.

సెల్ఫీల మోజు బాగా పెరిగింది..

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడానికి వినియోగించుకోవాలి. అతిగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది. ఇక యువతకు సెల్ఫీ మోజు బాగా పెరిగింది. సెల్ఫీ మోజులో ఎక్కడపడితే అక్కడ ఫొటోలు దిగుతున్నారు. దీంతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

వై.సతీష్ కుమార్,
సీనియర్ కెమిస్ట్రీ లెక్చరర్, విజయనగరం

తల్లిదండ్రులు నియంత్రించాలి..

అనవసరమైన వయస్సులో పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదు. యువత ఫోన్లను విపరీతంగా వాడుతోంది. సరదా కోసం తీస్తున్న సెల్ఫీలు చివరకు ప్రాణాల మీదికి తెస్తున్నాయి.

– ప్రశాంత్ కుమార్ ఎంఎస్సీ సైకాలజీ,
విజయనగరం

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]
- కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు–40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]
- Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం । 2 । జూలై । 2025

దుర్గమ్మ సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పోకల వంశీ నాగేంద్ర మాధవ్ కుటుంబ సమేతంగా మంగళవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం నుంచి 58,750 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పీఆర్ కోసం ఆందోళన

లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన విద్యార్థులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ మంగళవారం హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.

న్యూస్‌రీల్

4 వరకు హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హంసలదీవి సాగరతీరం బీచ్ గేట్లను మూసివేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్ట్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పాటు ఈదురుగాలులు తీవ్ర కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల నాలుగో తేదీ వరకు బీచ్ గేట్లను మూసివేస్తామని వివరించారు. పర్యాటకులు సహకరించి ఈ మూడు రోజుల పాటు బీచ్‌కు రాకుండా ఉండాలని కోరారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచే బీచ్ గేట్లకు అటవీ అధికారులు తాళాలు వేశారు.

త్వరలో ఎ.కొండూరుకు కృష్ణా జలాలు

తిరువూరు: మరో 45 రోజుల్లో ఎ.కొండూరు మండలానికి కృష్ణా నదీజలాలను సరఫరా చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎ.కొండూరులో జల్‌జీవన్ మిషన్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షిత తాగు నీరందించే లక్ష్యంతో జల్ జీవన్‌మిషన్ అమలవుతోందన్నారు. కిడ్నీబాధిత తండాలకు కృష్ణా నదీ జలాలు ఇచ్చే ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి జరుగుతోందని, ఇప్పటికే ప్రధాన పైపులైను పనులు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం కంభంపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పరిశీలించారు.

డెంగీపై విస్తృత అవగాహన కల్పించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగీ నివారణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం డెంగీ డే సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పించే రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను డాక్టర్ మాచర్ల సుహాసిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెలరోజులు యాంటీ డెంగీ, యాంటీ మలేరియా మాసంగా పాటిస్తామని తెలిపారు. డెంగీ, మలేరియా ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా వ్యాధులపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఈ నెల రోజులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతి బాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గూడూ పోయే.. దారీ కరువాయె

రోడ్డు విస్తరణ పేరుతో అడ్డంగా ఉన్నాయంటూ పక్కా ఇళ్లను హడావిడిగా కూల్చేశారు. పరిహారం ఇస్తామని చెప్పారు. - ఇది 2016 నాటి మాట

మరోవైపు కమీషన్లకు ఆశపడి ముందస్తు అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పనులను మొదలు పెట్టారు. కానీ కాంట్రాక్టర్ కిలోమీటర్ దారికి రూ.కోటి కొట్టేయాలనుకుని ప్రతిపాదన పంపాడు. దీన్ని ప్రభుత్వం తిరస్కరించడంతో పనులను మధ్యలోనే ఆపేశాడు. - ఇది ప్రస్తుత పరిస్థితి

వెల్వడంలో అధ్వానంగా మారిన మైలవరం-నూజివీడు రోడ్డు

ఈ ఫొటోలోని వృద్ధ దంపతుల పేర్లు చనుమోలు సత్యనారాయణ, సామ్రాజ్యం. వీరికి వెల్వడం గ్రామంలో సర్వే నంబరు 498/1లో ఇల్లు ఉంది. అయితే 2016లో మైలవరం – నూజివీడు ఆర్అండ్‌బీ రహదారి విస్తరణలో భాగంగా వీరి ఇంటిని అధికారులు కూల్చారు. అప్పటి నుంచి వీరికి ఎటువంటి పరిహారం ఇవ్వలేదు. దీనిపై అధికారులను సంప్రదించగా ఇళ్లు కూల్చిన స్థలంలో రోడ్డు వేయలేదని, పరిహారం ఇవ్వాల్సిన పనిలేదని చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫ్లెక్సీని గ్రామంలో కట్టారు.

- రహదారి విస్తరణ పేరుతో హడావిడిగా ఇళ్లను కూల్చేసిన అధికారులు
- మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- అర్ధంతరంగా నిలిచిన మైలవరం–నూజివీడు రహదారి పనులు
- రహదారి బాగు చేయాలంటూ మంత్రి లోకేశ్ ఫొటోతో వెలిసిన ఫ్లెక్సీలు
- రోడ్డెక్కి వినూత్న నిరసన తెలిపిన ఎన్టీఆర్ జిల్లా వెల్వడం గ్రామస్తులు

జి.కొండూరు: 'లోకేశ్.. మా ఊరి దారి సమస్య పరిష్కరించండి' అంటూ మంత్రి నారా లోకేశ్ ఫొటోలతో మైలవరం మండలం వెల్వడం గ్రామస్తులు ఫ్లెక్సీలతో మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రహదారిని విస్తరించే క్రమంలో వెల్వడంలో కొన్ని సర్వే నంబర్లు నోటిఫై చేశారు. రోడ్డు అభివృద్ధి పనులను నాలుగు నెలల కిందట హడావిడిగా చేపట్టారు.

లోకేశ్ ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

దారి పొడవునా వెట్ మిక్స్ వేశారు. అయితే రోడ్డు విస్తరణ అర్ధంతరంగా నిలిచిపోయింది. ఎండొస్తే దుమ్ము, వానొస్తే రహదారిపై గోతుల్లో చేరిన నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించలేదు. దీంతో గ్రామస్తులంతా దారిపొడవునా నారా లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు కట్టారు. ఇదిలా ఉంటే 2016 రహదారి విస్తరణలో గ్రామంలో కొందరి ఇళ్లను కూల్చేశారు. కానీ వారందరికీ పరిహారం అంద లేదు. దీంతో వారు సైతం లోకేశ్ ఫొటోలతో ఫ్లెక్సీలు వేయించి వినూత్న నిరసనకు దిగారు.

కాంట్రాక్టర్ అత్యాశ.. మొదటికి వచ్చిన సమస్య

మైలవరం–నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా వెల్వడం అయ్యప్ప స్వామి గుడి నుంచి ఐదు కిలోమీటర్ల మేర తారు రోడ్డును అంచనాలు, వర్క్ ఆర్డర్లు లేకుండా పూర్తిగా తొలగించి రహదారి నిర్మాణానికి నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. తారు రోడ్డును పూర్తిగా తొలగించడానికి ఆర్అండ్‌బీ అధికారులు సైతం అడ్డుచెప్పినా సదరు కాంట్రాక్టరు తనకు స్థానికంగా రాజకీయ అండ ఉందనే ధోరణికి పోయాడు. తారురోడ్డును తవ్వి వెట్‌మిక్స్ వేసిన తర్వాత నిధుల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరారు. కిలోమీటరుకు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపాడు. వీటిని ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టరు మూటాముల్లె సర్దుకొని వెళ్లిపోయినట్లు చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రహదారిపై నిత్యం రాకపోకలు సాగుతుండటంతో వెట్‌మిక్స్ కదిలి రోడ్డు ఛిద్రంగా మారింది. దారిపొడవునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో ఆ గుంతల్లో నీరు చేరి చిన్న కొలనుల్లా తలపిస్తున్నాయి.

నా ఇంటిని కూల్చి పరిహారం ఇవ్వలేదు

రోడ్డు విస్తరణ పేరుతో వెల్వడంలో ఉన్న నా ఇంటిని కూల్చి పరిహారం ఇవ్వలేదు. ఇప్పుడు అడిగితే మీ స్థలం రోడ్డు విస్తరణకు అవసరం లేదని చెబుతున్నారు. అలాంటప్పుడు మా ఇంటిని ఎందుకు కూల్చారు? అధికారులు సమాధానం చెప్పాలి.

– అడ్డగిరి జమలయ్య (గ్రామస్తుడు, వెల్వడం)

రోడ్డును వెంటనే బాగు చేయాలి

నాలుగు నెలల క్రితం రోడ్డు తవ్వి వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. ఎండొచ్చినప్పుడు దుమ్ము, వానొస్తే రోడ్డుపై గుంతలలో నీరు చేరి నరకయాతన అనుభవిస్తున్నాం. రోడ్డు బురదమయంగా మారి అడుగు బయట పెట్టలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలి.

– శివదానం శివకృష్ణ (గ్రామస్తుడు, వెల్వడం)

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

రేమల్లెలో కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రాజ్ ప్రియాసింగ్ నేతృత్వంలోని బృందం మంగళవారం పరిశీలించింది. తొలుత రేమల్లె గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు పండ్లతోటల సాగు, బంద్రీ చెరువు పూడికతీత, పశువుల షెడ్ల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ చానల్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి మొక్కలు పెంచుతున్న రైతు సంగీ తరావుతో మాట్లాడారు. సాగు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడిచర్ల గ్రామంలో పంట కుంట, బీటీ రోడ్డు, రజక చెరువులో పూడిక తీత, పశువుల షెడ్డు నిర్మాణం, మ్యాజిక్ సోక్ పిట్ పనులను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. పీఎంఏవై–జీ పథకం కింద గ్రామంలో చేపట్టిన గృహ నిర్మాణాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద కానుమోలు నుంచి రంగయ్య అప్పారావు పేట, రామ శేషాపురం గ్రామాల మీదగా రామన్నగూడెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సీఈఓ కన్నమ్మ నాయుడు, డ్వామా పీడీ శివ ప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ హరహరినాథ్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర కీలకం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- డాక్టర్స్ డే సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సత్కారం

మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా సత్కారం పొందుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమన్నారు. నిరంతరం ప్రజాసేవపై చిత్త శుద్ధి, అంకితభావంతో పనిచేసే వైద్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎంతో ప్రయాస పడి వైద్య విద్యను అభ్యసించి వ్యక్తిగత, కుటుంబ పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంచటానికి కృషి చేస్తున్న వైద్యులపై ప్రజలు, నాయకుల ధోరణిలో మార్పు రావాలన్నారు. ఆఖరి క్షణం వరకు రోగుల ప్రాణాలు కాపాడేందుకు శ్రమించే వైద్యులపై దాడులు సరి కాదని పేర్కొన్నారు.

విశిష్ట సేవలందించిన వైద్యులకు సత్కారం

జాతీయ డాక్టర్స్ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన పది మంది వైద్యులను మంత్రి సత్య కుమార్ యాదవ్ సత్కరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ పద్మశ్రీవాత్సవ, ప్రస్తుత డీఎంఈ, శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం, జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ ఎ.అశ్విని కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.భాస్కరనాయుడు, డాక్టర్ జి.భవానీప్రసాద్, న్యూరోసర్జన్ డాక్టర్ కె.సత్యవరప్రసాద్, డాక్టర్ ఎం.కృష్ణనాయక్, డాక్టర్ ఆర్.మురళీబాబూరావు, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ టి.భారతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి, హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ జి.రఘునందనరావు, మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు విపత్తు

- కృష్ణా జిల్లాలో 1.64 లక్షల హెక్టార్లలో వరిసాగు
- 1.02 లక్షల క్వింటాళ్ల వరి వంగడాలు అవసరం
- ప్రభుత్వం సరఫరా చేసింది 11,650 క్వింటాళ్లే..
- విత్తనాల కోసం రైతులకు తప్పని ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో 40 శాతానికి పైగా విత్తనాల పంపిణీ

చల్లపల్లిలో ఓ షాపు వద్ద లోడు రాగానే విత్తనాల కోసం ఎగబడిన రైతులు

అవనిగడ్డ: ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే కూటమి ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 40 శాతానికి పైగా విత్తనాలను రైతులకు వారి గ్రామాల్లోనే అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పదిశాతం విత్తనాలు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకొంది. దీంతో కృష్ణాజిల్లా రైతులు వరి వంగడాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

అరకొరగా విత్తనాలు

కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.64 లక్షల హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా ఎంటీయూ 1061, బీపీటీ 5204 రకాలను రైతులు సాగుచేస్తారు. గతేడాది ఎంటీయూ 1262, 1318 రకాలను పలుచోట్ల సాగుచేయగా కొనేందుకు మిల్లర్లు ముందుకు రాలేదు. ఈ సంవత్సరం రైతులు ఆ రకాల జోలికెళ్లడం లేదు. సాధారణంగా ఎకరాకు 25 నుంచి 30 కిలోల విత్తనాలు అవసరం. ఈ సీజన్‌లో 1.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ప్రభుత్వం 10,650 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసింది. దీంతో విత్తనాల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వచ్చిన లోడులు వచ్చినట్టు అయిపోతున్నాయి. రైతులు పనులు మానుకుని గంటల తరబడి ఎదురు చూసినా కొన్ని చోట్ల విత్తనాలు దొరకడం గగనంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 40 నుంచి 45 శాతం విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేసింది. అవసరమైతే డిమాండ్‌ను బట్టి మరో ఐదు శాతం విత్తనాలు సరఫరా చేసింది. ఈ ప్రభుత్వం పదిశాతం మాత్రమే సరఫరా చేయడంతో రైతులు విత్తనాలు కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కూడా విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలే అయిందని రైతులు తమకు తామే సర్దిచెప్పుకొన్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి కొనసాగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడే ఇలా ఉంటే..

కృష్ణాజిల్లాలోని బందరు, కేఈబీ కెనాల్‌కు ఇటీవల సాగునీరు విడుదల చేశారు. గతంలో బోర్ల కింద అక్కడక్కడా రైతులు నారుమళ్లు పోసుకున్నారు. పంట కాలువకు సాగునీరు విడుదల చేయడంతో ఇప్పుడే నారుమళ్లు పోసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఆదిలోనే విత్తనాలకు ఈ విధంగా డిమాండ్ ఉంటే సాగు పనులు ముమ్మరం చేస్తే పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 65 శాతం మంది కౌలు రైతులున్నారు. ఏటా పంట చేతికందగానే 85 శాతం కౌలు రైతులు విత్తనాలకు తీయకుండానే ధాన్యం విక్రయిస్తారు. వీరంతా ప్రస్తుతం ఎక్కడో ఒకచోట విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేయాల్సిందే. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరిపడా విత్తనాలు ఇవ్వాలి

గత ప్రభుత్వం సబ్సిడీపై అవసరమైనన్ని వరివిత్తనాలు సరఫరా చేసేది. ఇప్పుడు చాలా తక్కువ వచ్చాయని చెబుతున్నారు. బయట షాపుల్లో రేటు ఎక్కువ. కల్తీ విత్తనాలు వచ్చే ప్రమాదముంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాల సరఫరా పెంచాలి.

– చిరివేళ్ల యానాదిరావు, పిట్టల్లంక

తనిఖీలు చేస్తున్నాం

అవనిగడ్డ సబ్ డివిజన్‌కు బీపీటీ 5204 రకం 515 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 154 క్వింటాళ్లు, 1318 రకం 110 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. ప్రస్తుతం వీటిని రైతులుకు సబ్సిడీపై అందిస్తున్నాం. ప్రైవేటు విత్తన షాపులను తనిఖీ చేస్తున్నాం. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– జయప్రద, ఏడీఏ, అవనిగడ్డ

అద్విక.. అంతా మాయ!

- ట్రేడింగ్ కంపెనీలో తవ్వేకొద్దీ అన్ని అక్రమాలే
- పోలీసులకు ఇప్పటికే 76 మందికిపైగా బాధితుల ఫిర్యాదు
- రూ.350 కోట్ల మేర మోసపోయిన ప్రముఖులు

పలు జిల్లాల్లో బాధితులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అత్యాశ కొంపముంచింది. బ్లాక్ మనీని వైట్‌గా మార్చుకోవచ్చని అద్విక ట్రేడింగ్ కంపెనీ విసిరిన వలలో పెద్ద చేపలు చిక్కి విలవిల్లాడుతున్నాయి. ఆ కంపెనీ బోర్డు తిప్పేసిన వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలే వెలుగు చూస్తున్నాయి. నల్లధనం భారీగా ఉండి, పెట్టుబడి పెట్టగలవారినే లక్ష్యంగా చేసుకొని అద్విక ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకులు వల విసిరారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మొత్తం డబ్బులు సేకరించి ఆపై బోర్డు తిప్పేశారు. డబ్బును విజయవాడ నుంచి హవాలా రూపంలో దుబాయ్‌కి చేర్చి అక్కడి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సంస్థ ఎండీని అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నిస్తుంటే విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం. వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు ఖాళీ చేసిన విషయం తెలుసుకుని పోలీసులు సైతం కంగుతిన్నారని తెలుస్తోంది. అద్విక ట్రేడింగ్ కంపెనీ పలు డొల్ల కంపెనీలను సృష్టించి బోర్డు తిప్పేసినట్లు గుర్తించారు.

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసాలకు సంబంధించి పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో 76 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర డిపాజిట్లు చేసినట్లు పేర్కొన్నారు. వారికి తిరిగి ఇన్‌టెన్సివ్ కింద రూ.6 కోట్లు ఇచ్చినట్లు గుర్తించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున బాధితులు ఉన్నారు. ప్రధానంగా వైద్యులు, రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు ఉన్నారని సమాచారం. కొంత మంది బినామీ పేర్లతో పెట్టుబడులు పెట్టారు. వారితో పాటు ఓ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రూ.83 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం. అద్విక ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నిండా మునిగిన చాలా మంది బయటికి చెప్పుకోలేక తేలు కుట్టిన దొంగల్లా కుమిలిపోతున్నారని సమాచారం.

ఏజెంట్ల గుర్తింపు పైనే దృష్టి

ప్రస్తుతం పోలీసులు విచారణను వేగ వంతం చేస్తున్నారు. ముందుగా ఎంత మంది పెట్టుబడులు పెట్టారు? ఎంత మొత్తం నష్టపోయారు? అందులో వారు ఇన్‌టెన్సివ్‌గా ఎంత మొత్తం తిరిగి తీసుకొన్నారు? వంటి వివరాలు సేకరిస్తున్నారు. బాధితులు ఎంత మొత్తం మేర నష్టపోయారో లెక్క తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కంపెనీలో పెట్టు బడులు పెట్టేందుకు ఆకర్షించిన 45 మంది ఏజెంట్లను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క ప్రధాన ఏజెంట్ తన కింద 15 నుంచి 200 మంది ఏజెంట్లను నియమించుకొన్నట్లు గుర్తించారు. ప్రతి ఏజెంట్ ఎంత మొత్తం వసూలు చేశారు? తిరిగి ఎంత మొత్తం ఇన్‌టెన్సివ్ రూపంలో తిరిగి చెల్లించారు? వంటి వివరాలతో ప్రతి ఏజెంట్ సేకరించిన డిపాజిట్ల వివరాలు ఎక్సెల్ షీట్‌లో పోలీసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాథమికంగా 1600 మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు అంచనా వేశారు. వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తం మీద బాధితులంతా రూ.350 కోట్లపైగా డిపాజిట్లు చెల్లించి, నిండా మునిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కంపెనీల్లో నిర్వహించిన సోదాల్లో పోలీసులు కొంత మేర సమాచారం సేకరించారు. ఆ సమాచారం ఆధారంగా ప్రత్యేక పోలీసు బృందాలు ఆదిత్య బ్యాంకు ఖాతాలతో పాటు, పలువురు ఏజెంట్ల ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. కంపెనీ డైరెక్టర్లను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారని సమాచారం.

వంతెన నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): పెనమలూరు మండలం పోరంకిలో బందరు కాలువపై వంతెన నిర్మాణానికి సంబంధించి అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ బందరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోరంకి వద్ద బందరు కాలువపై వంతెన నిర్మాణం గురించి సమీక్షించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. బందరు కాలువ కట్టపై ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, భూసేకరణ, పరిహారం, నిర్మాణానికి పట్టే సమయం తదితర అంశాలపై అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్.హేలా షారోన్, ఇరిగేషన్ ఎస్ఈ మోహన్‌రావు, రహదారులు భవనాలు ఎస్ఈ భాస్కరరావు, ఈఈ లోకేశ్, కంకిపాడు తహసిల్దార్ గోపాలకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ



బెజవాడ రాజారావు హైస్కూలు సహవ్యవస్థాపకులుగా, SKPVV హిందూహైస్కూలు గ్రేడ్ 1 తెలుగు పండిట్‌గా విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పాటు అందించిన మీ మరణానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఇవే మా ఘన నివాళులు. మీరందించిన స్ఫూర్తి సదా మాకు అనుసరణీయం.

కీ॥శే॥ తవ్వా కనకదుర్గా వరలక్ష్మి గారు
జననం : 18-2-1946
మరణం : 22-6-2025

భర్త: బెజవాడ రాజారావు
✆ 94402 80263, 89859 17897

కుమారుడు : శ్యామ్ ప్రకాష్
కోడలు : లక్ష్మీప్రసన్న
కుమార్తె : మధులత
అల్లుడు : జూలూరి శ్రీరామ శివప్రసాదరావు
మనుమళ్ళు, మనుమరాండ్రు

సంస్మరణ సభ: ది. 2-7-2025 బుధవారం ఉదయం11 గం.లకు బెజవాడ రాజారావు హైస్కూలు, అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ-12 నందు జరుగును.

క్లుప్తంగా

పంటల బీమాపై ఎస్‌బీఐ ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వారం రోజుల పాటు నిర్వహించే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. వారం రోజుల కార్యక్రమంలో రైతులకు పంట బీమా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన నమోదును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ ప్రమాదాల నుంచి రైతులను రక్షించడంలో పంట బీమా ప్రాముఖ్యతను గుర్తించి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ జూలై 1 నుంచి 7 వరకు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, తమిళనాడుతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ నవీన్‌చంద్ర తెలిపారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు మొక్షిత్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయస్థాయి ఫెన్సింగ్(కత్తిసాము) పోటీలకు కొండపల్లి డీవీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి గింజల మొక్షిత్ కార్తికేయ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్రన్ మంగళవారం తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్–10 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం సాధించాడు. ప్రతిభ కనబరిచిన కార్తికేయను రాష్ట్ర సెలక్షన్ కమిటీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసింది. ఈనెల 5 నుంచి 8వరకు మహారాష్ట్ర నాసిక్‌లో జరిగే జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడు. మొక్షిత్ కార్తికేయను ప్రిన్సిపాల్‌తో పాటు పీటీ మాధవరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

కార్మికుల సత్తా చాటుదాం

- 9న సమ్మెను విజయవంతం చేద్దాం
- రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పిలుపు

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన జరిగే సమ్మెను విజయవంతం చేసి, కార్మిక వర్గ సత్తా చాటుదామని రాష్ట్ర కార్మిక ఉద్యోగ ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 10గంటల పని విధానాన్ని, అధిక గంటల పని విధానాన్ని, రాత్రి సమయంలో మహిళలు పని చేసే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ సమ్మెను చేపడుతున్నట్లు సంఘాలు ప్రకటించాయి. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల, రైతుల, వ్యవసాయ కూలీ చేతివృత్తులు, మహిళా, యువజన, విద్యార్థి రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది.

'ఉపాధి'లో సంస్కరణలు అవసరం..

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ విధానాన్ని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రుణాలు రద్దు చేయాలని, రైతులకు అన్ని వేదాల సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లకు వ్యతిరేకంగా, బీజేపీ దాని అనుబంధ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం సత్తా చాటేందుకు జూలై 9న జరిగే సమ్మెలో కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వర రావు, శ్రామిక మహిళా నాయకులు వెంకట సుబ్బారావమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పాల్గొన్నారు.

ప్రేమ చిగురించిన చోటే.. ప్రాణమూ పోయింది

- పాశమైలారం ఫార్మా ప్రమాదంలో కాబోయే దంపతులు దుర్మరణం
- మృతుల్లో అబ్బాయిది వైఎస్సార్ కడప జిల్లా పెనికలపాడు
- యువతిది ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల

అగ్ని ప్రమాదంలో మృతి చెందిన నిఖిల్, రమ్య(ఫైల్)

ముద్దనూరు/పుట్రేల(విస్సన్నపేట): ఆ రెండు మనసులను పనిచేసే ప్రాంతమే పరిచయం చేసింది.. ప్రేమను చిగురించేలా చేసింది. పెళ్లిపీటల కోసం సిద్ధ పడింది. మరో రెండు నెలల్లో ఒక్కటి చేయాలని చూసింది. కానీ ఇంతలోనే మృత్యువు ఆ ఇద్దరిని కబళించింది. ఆ పనిచేసే ప్రాంతంలోనే పాశాన్ని విసిరింది. అనుకోని విపత్తు వారి ఆశలను ఆహుతి చేసింది. ఎన్నో ఆకాంక్షలతో కొత్త జీవితాన్ని ఆరంభించాలనుకున్న ఆ జంట.. ఇంట పెను విషాదాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన యువతీ, యువకులు ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్‌రెడ్డి(25), ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన రామాల. శ్రీరమ్య ఫార్మా పరిశ్రమలో ఉద్యోగులు. ఇక్కడే వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఇరువురూ తమ పెద్దలను ఒప్పించారు. మరో రెండునెలల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన తరుణంలో విషాదం వెంటాడింది. సోమవారం ఇద్దరూ పరిశ్రమలో విధుల్లో ఉన్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటనతో పెనికలపాడు, పుట్రేల గ్రామాల్లో మంగళవారం తీవ్ర విషాదం అలముకుంది.

రెండునెలల్లో పెళ్లి చేద్దామనుకున్నాం...

రామాల నారయ్య, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె జ్యోత్స్న బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసి ఆరు నెలల క్రితమే సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరింది. ఇంతలో ఘోర విపత్తులో చిన్న కుమార్తె ప్రాణాలు కోల్పోవడాన్ని తలచుకుంటూ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నిఖిల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడి ఆషాఢం వెళ్లిన తర్వాత పెళ్లి చేద్దామనుకున్నామని తీరా ఈ విషాద సంఘటనలో ఇరువురు చనిపోయారని మృతురాలి తల్లి పద్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించాలి

డీసీజీ సమావేశంలో ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల్సిందేనని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా క్రై గ్రూప్ (డీసీజీ) సమావేశం జరిగింది.

మాక్‌డ్రిల్స్ నిర్వహించండి..

కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా కర్మాగారాలు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్యం తదితర శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని తొమ్మిది మేజర్ యాక్సిడెంట్ హజార్డ్ ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. వాటిల్లో గ్యాస్ లీకేజ్, అగ్ని ప్రమాదాలు వంటివి జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా లెవెల్–1 మాక్‌డ్రిల్స్, ఆర్నెల్లకోసారి లెవెల్–2 మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా తప్పనిసరిగా సేఫ్టీ ఆడిట్ నివేదికలు పంపాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి చోళ మండలం ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ సంస్థ రూపొందించిన ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ ముసాయిదాపై భాగస్వామ్య పక్షాలు సలహాలు, సూచనలు చేయాలని.. వాటిని పరిగణనలోకి తీసుకొని తుది ప్రణాళికను ఖరారు చేస్తామన్నారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వ ఐటీఐల్లోని 240 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కర్మాగారాల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు హాజరయ్యారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400కోట్లు

తక్షణం విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్

మాట్లాడుతున్న బందెల నాసర్ జీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు బకాయిపడిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ దాసరి భవన్ నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పేరిట రూ.6400 కోట్లు బకాయిపెట్టిందన్నారు. టీడీపీ యువగళం పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా కేవలం రూ.600కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కానందున యాజమాన్యాలు వేధిస్తున్నాయని, విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉన్నాయని, విద్యార్థులు ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

నాలుగో తేదీ నుంచి ధర్నాలు..

బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 4 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కార్తీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యశ్వంత్, శరత్, అమర్నాథ్, ప్రణీత్, డేవిడ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

శ్రీనివాస టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA © 99493 08940

Real Estate

PLOT FOR SALE

■ మా వెంచర్‌లో 200 చ॥గ॥ స్థలం కేవలం 2 లక్షల 99 వేలు మాత్రమే. 40', 30' అడుగుల రోడ్లు ఈ ఆఫర్ 3 రోజులు మాత్రమే. సంప్ర: © 97034 34023, 96428 72122

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకే తీసుకుంటాం. © 88024 89999

■ బంగారం బ్యాంకులో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నచో విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% ట్రాన్స్‌పరెన్సీ) © 91699 22299

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ © 8790741166

Wanted

■ రాష్ట్రవ్యాప్త ఓల్డేజ్‌హోమ్‌కు (AP NO-1) ఇంట్లో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్‌టేకర్స్ M/F కావలెను. జీ 16-18 వేలు. © 92814 52827, 92814 52838

■ కేర్ ఆఫ్ హెల్త్ కార్పొ ఫీల్డ్ వర్క్ చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. శాలరీ: 15000+2500 TA. సంప్రదించండి. ఫోన్: © 70130 52798

■ విజయవాడ – తాడేపల్లి పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ వర్కర్లు, అనుభవం గల మార్కెటింగ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. © 78427 60564, 72070 13418

■ పెద్దవారిని, పేషెంట్స్‌ని, చిన్నపిల్లలని చూసుకొనుటకు కేర్ టేకర్స్ ఆయాలు కావలెను. జీతం : 20,000 - 30,000 వరకు. సంప్ర : © 88858 01357

■ VJA జవహర్ ఆటోనగర్ లోని ప్రముఖ ఆటోమొబైల్ షాప్ లో పని చేయుటకు అకౌంటెంట్ Tally (M/F) ఫుల్ టైం కావలెను. © 97012 00500

■ ఆటోనగర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ జీతం : 11,000/- + PF+ESI, 4 వీక్లీ ఆఫ్‌లు. Q : 10th Class © 88014 97437

■ సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపర్స్ (M) కావలెను. VJA, కంకిపాడులలో 8, 12 గం॥ డ్యూటీ వ: 40 లోపు, Q: 10th P/F © 94917 71179, 73309 11212

■ విజయవాడ లోని ప్రముఖ హ్యాండ్ రైటింగ్ శిక్షణ సంస్థ నందు వర్క్ చేయుటకు మహిళా టీచింగ్ ఫ్యాకల్టీ కావలెను. సంప్ర॥ © 81436 96679

■ Wanted Teachers. Teachers (Ladies) With U.G or P.G Qualification & Good English && Teacher for Science in High School. CIS-School, VJA-1. Ph: © 81799 90508, 92913 98877

■ రామవరప్పాడు నిడమానూరు పోరంకిలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్ (M) లు కావలెను 12 డ్యూటీ 45 సం లోపు జీ 15000/- సంప్ర: © 98853 26279

■ బుక్‌వర్క్స్ నందు మోస్ట్ అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం: 25,000/- మరియు ప్రూఫ్ రీడర్స్(M/F) కావలెను. అర్హత ఏదైన డిగ్రీ, జీతం:25,000/-వరకు విజయవాడ © 99631 31354

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135

గమనిక

9010210380 9010201611 9505507329 9010577706 9010210382

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. సంపద సృష్టికి రుణాలు వాడుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన వార్షిక రుణ–జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక – జీవనోపాధులపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి.. ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

రూ.1,266 కోట్లతో కార్యాచరణ..

జిల్లాలో 16 మండల సమాఖ్యలు, 767 గ్రామ సమాఖ్యలు, 24,880 స్వయం సహాయక సంఘాలు, 2,47,611మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. 2024–25లో 1,93,691మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ. 1,147.59 కోట్ల మేర రుణ మద్దతు లభించిందన్నారు. 2025–26కు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యుల వ్యక్తిగత జీవనోపాధి అవసరాలు ఆధారంగా దాదాపు రూ.1,266 కోట్ల వార్షిక రుణ–జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. కుటుంబ స్థాయి సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్లు తెలిపారు.

సెప్టెంబర్ 30 వరకు ప్రచారం..

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం కె.ప్రియాంక వివరించారు. బ్యాంక్ లింకేజీపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, యూఎల్‌బీల్లో కనీసం ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన వంశీ న్యాయ పోరాటం

బెయిల్ మంజూరు.. నేడు విడుదలయ్యే అవకాశం

వంశీమోహన్ (ఫైల్)

గన్నవరం: గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ న్యాయ పోరాటం ఫలించింది. వివిధ కేసుల్లో గత 138 రోజులుగా అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న ఆయనకు నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి బయటకు రావడానికి మార్గం సుగమమైంది.

రెడ్‌బుక్ కక్షతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వల్లభనేని వంశీమోహన్‌పై ఇబ్బడిముబ్బడిగా కేసులు నమోదు చేసింది. రెండున్నరేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసు పునర్ విచారణ పేరుతో వంశీమోహన్‌ను 71వ నిందితుడిగా చేర్చింది. ఈ కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారని తప్పుడు కేసు పెట్టి.. ఈ ఏడాది ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం టీడీపీ పెద్దల సూచనల మేరకు ఆయనపై గన్నవరం, ఆత్కూరు, వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పీఎస్‌ల్లో పదికి పైగా అక్రమ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో గత ఐదు నెలలుగా విజయవాడ జిల్లా జైలులో ఆయన రిమాండ్‌లో కొనసాగుతున్నారు.

ఆరోగ్యం క్షీణించినా..

గణనీయంగా బరువు తగ్గిపోవడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలతో ఆయన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం కరుణించలేదు. ప్రభుత్వం తరఫున ఆయనకు సరైనా వైద్య సేవలు కూడా అందించలేదు. చివరికి హైకోర్టు జోక్యంతో ఆయుష్ ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తనపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై న్యాయ పోరాటం సాగిస్తూ వచ్చిన ఆయనకు తొమ్మిది కేసుల్లో కోర్టుల నుంచి ఉపశమనం లభించింది. చివరికి బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీపై 2019లో నమోదైన కేసులో కూడా నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనకు భారీ ఊరట లభించింది. జైలు నుంచి ఆయన బుధవారం విడుదలయ్యే అవకాశం ఉందని వంశీమోహన్ తరఫు న్యాయవాదులు పేర్కొంటున్నారు. వంశీమోహన్‌కు బెయిల్ రావడం పట్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండచిలువ హతం

మైలవరం: మైలవరం మండలం జంగాలపల్లి గ్రామంలో పాడుబడిన బావి వద్ద పేరుకుపోయిన చెత్తలో ఉన్న కొండచిలువను గమనించిన గ్రామస్తులు మంగళవారం కర్రలు, కత్తులతో హతమార్చారు. గ్రామానికి చెందిన రైతు వేల్పులకొండ ప్రసాద్‌కు పాము కన్పించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు పెట్టడంతో యువకులు పరుగున వెళ్లి దానిని హతమార్చారు. కొండ చిలువ సుమారు 10 అడుగుల పొడవు, 15కిలోలు బరువు ఉందని యువకులు తెలిపారు. కాగా జంగాలపల్లి గ్రామం నుంచి బయటికి రావాలంటే దారి మార్గం సరిగా ఉండకపోగా, కొద్దిపాటి వర్షానికి రహదారికి గండ్లు పడి కనీసం నడవడానికి కూడా గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం పట్ల అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గృహావసరాలకు బావి నీటిని వాడుకుంటూ ఉంటారని, అదే విధంగా అక్కడే పిల్లలు ఆడుకుంటూ ఉంటారని గ్రామస్తులు తెలిపారు. బావి పాడైపోయి ఉండటంతో గ్రామస్తులు చెత్తా చెదారం తీసుకువచ్చి అక్కడే పడేస్తున్నారని దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు, ప్రమాదకరమైన పాములు తిరుగుతూ భయానక వాతావరణం నెలకొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న సారె సంబరం

అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గగుడికి తరలివస్తున్న భక్తబృందాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని తమ కుటుంబం పిల్లాపాపలతో సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి తాము సారెగా తీసుకువచ్చిన చీరలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, మిఠాయిలను సమర్పిస్తున్నారు. సారె తీసుకువచ్చిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందిస్తున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్త బృందాలు సారెను అమ్మవారి ప్రసాదంగా భక్తులకు అందిస్తూ సంతోషాలను పంచుకుంటున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు దేవస్థానం ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాలను అందజేస్తోంది. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో శీనానాయక్ అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కల్వర్టు గోడను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

10 మంది ప్రయాణికులకు గాయాలు

కట్టంగూర్: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ హైవేపై కల్వర్టు గోడను ఢీకొట్టడంతో 10మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సోమవారం అర్ధరాత్రి 30 మంది ప్రయాణికులతో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల కల్వర్టు గోడను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించగా డోర్ లాక్ కావడంతో బయటకు వెళ్లలేకపోయారు. సమాచారం తెలుసుకున్న కట్టంగూర్ 108 సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అత్యవసర డోర్‌ను పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సత్యవతి, లక్ష్మి, గణపతిరెడ్డితో పాటు మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాల్లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



గుడివాడరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ మహబూబ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. గుడివాడ రైల్వే స్టేషన్ పరిధిలోని దోసపాడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మరణించినట్లు తెలిపారు. మృతుని వయస్సు 60ఏళ్లు ఉంటుందని, బ్లూబై కంపెనీ తెలుపు, నీలం రంగు గడులు గల చొక్కా(రెడీమేడ్ షర్ట్), తెలుపు, నలుపు, నీలం రంగు గడుల లుంగి ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440627570, 9866221412లో సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ కోరారు.

బీవీ పట్టాభిరామ్ మృతిపై సంతాపం



విజయవాడ కల్చరల్: సాహితీవేత్త, బహు గ్రంథ కర్త, ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. వ్యక్తిగా, వికాస నిపుణుడిగా వేలాది మందికి దిశానిర్దేశం చేశారని మంగళవారం ఓ ప్రకటనలో కొనియాడింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేసింది. నగరానికి చెందిన సాంస్కృతిక కళా సంస్థలు సంతాపం ప్రకటించాయి.

సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 2 । జూలై । 2025

మబ్బుల ముసుగులో సింహగిరి

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి మంగళవారం మబ్బుల ముసుగులో సరికొత్త అందాలను సంతరించుకుంది. అల్పపీడనం కారణంగా విశాఖలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ సందర్భంగా సింహచలం కొండ పైన, అడవివరం గ్రామంపై మేఘాలు కమ్ముకున్నాయి. పచ్చదనం కప్పకున్న కొండలను మేఘాలు తాకుతున్న దృశ్యం అందరికీ కనువిందు చేసింది.

ఫొటో : సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రేషన్ కష్టాలు

రేషన్ కోసం వర్షంలో వేచి ఉన్న లబ్ధిదారులు

కేఆర్ఎం కాలనీలో...

రేషన్ సరకుల కోసం ఈ నెల కూడా కార్డుదారులకు కష్టాలు తప్పలేదు. జోరు వానలో తడుస్తూ సరకులు మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గత నెల నుంచి ఎండీయూ వాహనాలను కూటమి సర్కార్ నిలిపేసిన విషయం తెలిసిందే. దీంతో ఇంటి వద్దే రేషన్ అందుకునే లబ్ధిదారులు ఇప్పుడు రేషన్ డిపోల వద్ద క్యూలు కడుతూ.. సరకుల్ని మోసుకెళ్లేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని ఏరియాల్లో రేషన్ షాపులు నిర్ణీత సమయానికి తెరవక పోవడంతో వర్షంలో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సర్వర్ల మొరాయింపు షరా మామూలే..! – మహారాణిపేట

గోపాలపట్నం ఆదర్శనగర్‌లో..

గోపాలపట్నం చంద్రానగర్ రేషన్ డిపో వద్ద ఇలా..

ముంచెత్తిన వర్షం

సత్యం జంక్షన్ వద్ద..

మహారాణిపేట: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అయితే ఈ భారీ వర్షం జనజీవనానికి అంతరాయం కలిగించింది. ఈదురుగాలులకు పందిమెట్ట, బుల్లయ్య కాలేజీ వద్ద చెట్లు నేలకొరిగాయి. ఆశీలమెట్ట వద్ద హోర్డింగులు కూలిపోయాయి. జ్ఞానాపురం రైల్వే వంతెన, ఆర్టీసీ కాంప్లెక్స్, డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్, కంచరపాలెం సహా అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా భీమిలిలో 36.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా పద్మనాభంలో 10.8 మిల్లీమీటర్లుగా నమోదైంది.

జ్ఞానాపురం వద్ద

న్యూస్‌రీల్

94 శాతం పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం కొత్త పాలెంలో బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ కార్యదర్శి

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ మంగళవారం 94.04 శాతం పూర్తయింది. పింఛన్ల పంపిణీ పూర్తయిన తర్వాతే బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులు రిలీవ్ కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో.. చేసేది లేక ఎక్కడి వారు అక్కడే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో మొత్తం 1,58,681 పింఛన్లు ఉండగా, ఇందుకోసం ప్రభుత్వం రూ.69,60,82,500 విడుదల చేసింది. మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి 94.04 శాతం అంటే 1,49,173 మందికి రూ.65.26 కోట్లు అందజేశారు. బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మిగిలిన వారికి బుధవారం అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

రాజీమార్గమే శ్రేయస్కరం

5న మెగా లోక్ అదాలత్

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ నెల 5న జరగనున్న మెగా లోక్ అదాలత్ సందర్భంగా.. న్యాయమూర్తి బ్యాంకు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాజీపడటానికి వీలున్న అన్ని కేసులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని వారికి సూచించారు. బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసుల్లో ఇరువర్గాలు రాజీ చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. చిట్‌ఫండ్ కంపెనీలు కూడా తమ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

వాల్తేరు డీఆర్ఎం స్టీల్‌ప్లాంట్ సందర్శన

స్టీల్‌ప్లాంట్, రైల్వే సంస్థ సమావేశంలో పాల్గొన్న ఉన్నత స్థాయి అధికారుల బృందం

ఉక్కునగరం: వాల్తేరు డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. రైల్వే, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ల మధ్య సహృద్భావ సంబంధాల పెంపు, సరుకు రవాణా కార్యకలాపాలు, మౌలిక సదుపాయాల సమన్వయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఆయన రైల్వే అధికారుల బృందంతో సహా స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేశారు. సమావేశంలో సరుకు రవాణా పెంపు, రేక్ నిర్వహణ సామర్థ్యం పెంచడం, ప్రణాళికాయుతంగా ఇరు సంస్థల మధ్య వాణిజ్యం అభివృద్ధి తదితర అంశాలను చర్చించారు. రేక్ రిటెన్షన్ టైమ్ తగ్గించడం, మొత్తం కార్యాచరణ పనితీరును పెంచడానికి లాజిస్టిక్స్‌ను మెరుగుపరచడం వంటి విషయాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీతో పాటు ఉన్నత స్థాయి అధికారుల బృందంతో జరిగిన సమావేశంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సీనియర్ డివిజన్ మెకానికల్ ఇంజనీర్ పాల్గొన్నారు.

కూటమి గూడు పురాణి

ఎన్నికలకు ముందు గ్రామంలో 3, నగరంలో 2 సెంట్ల స్థలం ఇస్తామని హామీ
అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క గజం కూడా ఇవ్వని చంద్రబాబు

- గత ప్రభుత్వంలో ఇళ్ల లబ్ధిదారుల్లో కోతకు సర్వే
- నెలలు గడిచినా అనర్హులను గుర్తించలేకపోయిన కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 1,14,805 ఇళ్లు మంజూరు
- అప్పట్లోనే 23,070 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన సెంటు ఇంటి నిర్మాణాలు

విశాఖ సిటీ : సెంటు స్థలాన్ని కూటమి నేతలు సమాధులతో పోల్చారు. అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు.. నగరంలో 2 సెంట్ల స్థలం ఇచ్చేస్తామని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా ఆ ఊసే లేదు. ఇప్పటి వరకు ఒక్కరికి గజం స్థలం ఇవ్వడానికి కూడా చంద్రబాబు ప్రభుత్వానికి చేతులు రాలేదు. గత ప్రభుత్వంలో లబ్ధిదారుల సంఖ్యను కుదించడానికి మాత్రం పూనుకున్నారు. సర్వే పేరుతో నెల రోజుల పాటు హడావుడి చేసి ఒక్కరిని కూడా అనర్హులుగా తేల్చలేక సైలెంట్ అయిపోయారు. పునర్విచారణ పేరుతో గత ప్రభుత్వంలో కేటాయించిన సెంటు స్థలాల్లో నిర్మాణాలకు గ్రహణం పట్టించారు. ఏడాది కాలంలో ఒక్క ఇంటికి కూడా కొత్తగా పునాది రాయి వేయకపోవడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. విశాఖ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 1,14,805 మంది లబ్ధిదారులకు సెంటు స్థలాలను మంజూరు చేసింది. వీటిలో ఏడాది క్రితమే 23,070 ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది.

కూటమి కప్పదాట్లు

సెంటు స్థలాల విషయంలో కూటమి ప్రజాప్రతినిధుల ప్రకటనలు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. సెంటు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టకపోగా.. కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, నగరంలో 2 సెంట్ల స్థలాలు ఇస్తామని ఇప్పటికీ చెబుతూనే ఉన్నారు. ఇటీవలే గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సైతం విశాఖ పర్యటనలో ఇదే విషయాన్ని వల్లెవేశారు. ఇప్పటికే సెంటు స్థలాలను పొందిన వారు వీటిని వదులుకుంటే కొత్తగా 2 సెంట్ల స్థలాలు ఇస్తామని మరికొందరు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. దీంతో సెంటు లబ్ధిదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఒకవైపు ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోవడం, రెండు సెంట్ల ప్రకటనలతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

25 శాతం కూడా జరగని పనులు

కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో సెంటు లేఅవుట్లలో పరిస్థితి అధ్వానంగా మారింది. చాలా లేఅవుట్లలో వేల ఇళ్లకు పునాది రాయి కూడా పడలేదు. 50 శాతం ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో మొత్తం 1,14,805 ఇళ్లను మంజూరు చేయగా.. ఇందులో 6115 స్థలాల్లో ఇటుక కూడా వేయలేదు. బేస్‌మెంట్ లెవల్‌లో 22,295 ఇళ్లు, కాలమ్స్‌లో 4,134, ప్లింత్ బీమ్ స్థాయిలో 19,748 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. లింటల్ లెవెల్‌లో కేవలం 3,200, ఆర్‌సీసీ స్థాయిలో 9,116 మాత్రమే ఉన్నాయి. ఇలా మొత్తంగా 25 శాతానికి మించి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి కాలేనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు ఈ ఇళ్ల నిర్మాణాల కోసం రూ.816.45 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

కూటమి కాంట్రాక్టర్ల కోసం కుయుక్తులు

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లపై కత్తి కట్టారు. వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను తప్పించడంపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం .. ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టలేదు. పాత కాంట్రాక్టర్‌ను తప్పించి ఆ స్థానంలో కూటమి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారం న్యాయస్థానం వరకు వెళ్లింది. అలాగే ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. కూటమి నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో చంద్రబాబు అండ్ టీం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు. సెంటు లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని, పనుల కేటాయింపులో అవకతవకలు జరిగాయంటూ వాటిపై విచారణ చేపడుతున్నట్లు ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ఒక్క లబ్ధిదారుడిని కూడా అనర్హుడిగా గుర్తించలేకపోవడం విశేషం. ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోవడంతో వస్తున్న విమర్శల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే చంద్రబాబు ప్రభుత్వం తప్పుడు ఆరోపణలకు తెరలేపిందన్నది బహిరంగ రహస్యం.

అధ్వానంగా సదుపాయాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని లేఅవుట్లలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టింది. బీటీ రోడ్ల నుంచి మంచి నీటి సదుపాయాల వరకు అన్నింటినీ పనులను చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మౌలిక సదుపాయాల పనులన్నీ నిలిచిపోయాయి. ఇప్పటికీ రోడ్ల పనులు పూర్తి కాలేదు. డ్రైనేజీలు కనిపించడం లేదు. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలను సైతం ఏర్పాటు చేయలేదు. వాస్తవనికి 2026 నాటికి ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఒక్కో లేఅవుట్‌లో పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి త్వరలో గృహ ప్రవేశ కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం.

నియోజకవర్గం	మంజూరు	ప్రారంభం కానివి	పూర్తయినవి	ఖర్చు(కోట్లు)
భీమిలి	31,237	1,468	6,366	224.41
విశాఖ దక్షిణ	15,292	226	1,854	87.50
విశాఖ తూర్పు	10,816	480	3,797	103.41
విశాఖ ఉత్తర	11,373	839	1,947	59.31
విశాఖ పశ్చిమ	16,562	1,245	3,237	133.76
పెందుర్తి	8,988	1,226	1,246	46.62
గాజువాక	20,537	631	4,623	161.51
మొత్తం	1,14,805	6,115	23,070	816.45

ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త

డాబాగార్డెన్స్: ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. విశాఖ నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్, ఎంజీబీఎస్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి వెళ్లే ఏసీ బస్సుల్లో చార్జీలు 10 శాతం తగ్గించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు వెల్లడించారు.

అమరావతి బస్సు: విశాఖ నుంచి బీహెచ్ఈఎల్ అమరావతి బస్సు సాధారణ చార్జీ రూ.1,870, 10 శాతం తగ్గింపుతో రూ.1,690, విశాఖ నుంచి ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,810, తగ్గింపుతో రూ.1,650, విశాఖ నుంచి విజయవాడ సాధారణ చార్జీ రూ.1,070, తగ్గింపుతో రూ.970, విశాఖ నుంచి రాజమండ్రి సాధారణ టికెట్ ధర రూ.600, 10శాతం తగ్గింపుతో రూ.550గా నిర్ణయించారు.

నైట్‌రైడర్ సీట్ : విశాఖ నుంచి బీహెచ్ఈఎల్‌కు రూ.1,670 ఉన్న చార్జీ, 10 శాతం తగ్గింపుతో రూ.1,480, ఎంజీబీఎస్‌కు రూ.1,590 టికెట్ ధర, తగ్గింపుతో రూ.1,520, విజయవాడకు సాధారణ చార్జీ రూ.960, 10 శాతం తగ్గింపుతో రూ.870, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.540, తగ్గింపుతో రూ.520 కానుంది.

నైట్ రైడర్ బెర్త్ : విశాఖ నుంచి బీహెచ్ఈఎల్‌కు సాధారణ చార్జీ రూ.1,940, 10 శాతం తగ్గింపుతో రూ.1,730, ఎంజీబీఎస్‌కు సాధారణ చార్జీ రూ.1,860, తగ్గింపుతో రూ.1,680, విజయవాడకు రూ.1,110 కాస్తా, తగ్గింపుతో రూ.1010, రాజమండ్రికి సాధారణ చార్జీ రూ.630 కాస్తా తగ్గింపుతో రూ.600 అయింది.

ఇంద్ర బస్సు : విశాఖపట్నం నుంచి అమలాపురానికి సాధారణ చార్జీ రూ.550 కాగా, 10 శాతం తగ్గింపుతో రూ.500గా ధర నిర్ణయించారు.

రేపు ప్రైవేట్ పాఠశాలలు బంద్

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 3న బంద్‌కు పిలుపునిచ్చాయి. అపుస్మా ఉత్తరాంధ్ర రీజనల్ అధ్యక్షుడు ఎం.వి.రావుతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలల యూనియన్ నాయకులు ఈ విషయాన్ని మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలపై త్రీమెన్ కమిటీలు తనిఖీలు చేపట్టడం, జిల్లా విద్యాశాఖ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ఆర్టీఈ 12.1.సి దరఖాస్తుదారులను చేర్చుకోవాలని ఒత్తిడి చేయడం, తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా నోటీసులు, హెచ్చరికలు జారీ చేయడం, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు దురుసుగా ప్రవర్తించడం, తదితర అంశాలపై నిరసనగా గురువారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయనున్నట్లు వారు ప్రకటించారు.

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 32 కి.మీ.పరిధిలో వీధి దీపాలు సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు
- 132 పాయింట్లలో తాగునీటి సదుపాయం
- స్నానఘట్టం వద్ద గజ ఈతగాళ్లు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్, రెవెన్యూ, దేవస్థానం, ఇతర శాఖల అధికారులతో ఆయన గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న తెల్లవారుజాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తుల రద్దీని, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీస్ బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూలు, రద్దీ ప్రదేశాల వద్ద తోపులాటలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

భక్తులకు సౌకర్యాలు, వైద్య సేవలు

లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 32 కిలోమీటర్ల మేర 132 పాయింట్లలో తాగునీటి సౌకర్యం, 400 మరుగుదొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన అంబులెన్సులు, 32 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, ప్రతి శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక వైద్యుడు, ఏఎన్ఎం లేదా ఆశ కార్యకర్తను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తులు ప్రదక్షిణ చేసే మార్గంలో, రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులను సూచించారు. ముందుజాగ్రత్త చర్యగా 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశారు. సింహగిరిపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ నియంత్రణ పరికరాలతో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ తీగలు వేలాడకుండా చూసుకోవాలని, గిరి ప్రదక్షిణ జరిగే దారిలో వాహనాలు అడ్డదిడ్డంగా నిలపకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

యాప్‌తో సాంకేతిక సాయం

అత్యవసర సమయాల్లో ప్రత్యేక యాప్ ద్వారా సహాయం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి 'అస్త్రం'యాప్ ద్వారా సహాయం పొందవచ్చని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లైవ్ స్ట్రీమింగ్ ఇవ్వాలని సీపీ ఆదేశించారు. పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, హనుమంతువాక, ఇసుకతోట జంక్షన్ల వద్ద తాత్కాలిక వంతెనలు నిర్మించాలని సీపీ సూచించారు. సమీక్షలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథ రావు, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, రెవెన్యూ, దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సింహాచలం: గిరి ప్రదక్షిణకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. నగర సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, సింహాచలం ఈవో త్రినాథ రావుతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గిరి ప్రదక్షిణ జరిగే అప్పుఘర్, వెంకోజీపాలెం, సీతమ్మధార, మాధవదార, మురళీనగర్, ప్రహ్లాదపురం, కుమారి కల్యాణ మండపం మీదుగా సింహాచలంలోని తొలి పావంచా వరకు ఆయన సందర్శించి.. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. సింహాచలం తొలిపావంచా వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గెడ్డలో పడి ఆటోడ్రైవర్ మృతి

8 గంటలు శ్రమించిన రెస్క్యూ బృందం

కట్ట వడ్డీకాసులు మృతదేహం

విషాదంలో భార్య రుక్మిణి

కంచరపాలెం: బహిర్భూమికి వెళ్లిన ఆటోడ్రైవర్ నలందనగర్ ప్రధాన గెడ్డలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. రెస్క్యూ(జీవీఎంసీ, ఫైర్, పోలీస్) బృందం సుమారు 8 గంటలు శ్రమించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, అధికారులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధిలోని నలందనగర్‌లో నివాసముంటున్న కట్ట వడ్డీకాసులు(48) ఆటో డ్రైవర్. తన భార్య రుక్మిణితో కలిసి స్క్రాప్ వ్యాపారం కూడా చేస్తుంటాడు. మంగళవారం ఉదయం సుమారు 6.30 గంటల ప్రాంతంలో నలందనగర్ జాతీయ రహదారి వంతెన కింద గెడ్డ పక్కకు బహిర్భూమికి వెళ్లాడు. తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం పడుతుండటంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. ఈ క్రమంలో ఆయన గెడ్డలోకి జారిపడ్డాడు. ఈ క్రమంలో వడ్డీకాసులు గట్టిగా కేకలు వేయడంతో.. భార్య రుక్మిణి వెంటనే అక్కడకు చేరుకుని తన చున్నీని అందించి కాపాడే ప్రయత్నం చేసింది. అయితే నీటి ప్రవాహానికి వడ్డీకాసులు కొట్టుకుపోయి వంతెన కింద గెడ్డలో చిక్కుకుపోయాడు.

ఆటోడ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న రెస్క్యూ సిబ్బంది

సహాయక చర్యలు.. మృతదేహం వెలికితీత

సమాచారం అందుకున్న జీవీఎంసీ, ఫైర్, పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యవేక్షణలో మూడు క్రేన్లు, పొక్లెయిన్ల సహాయంతో వడ్డీకాసులును రక్షించేందుకు ప్రయత్నాలు చేశారు. సుమారు 8 గంటలు శ్రమించినప్పటికీ.. వడ్డీకాసులు ప్రాణాలు కాపాడలేకపోయారు. చివరికి రెస్క్యూ బృందం ఆయన మృతదేహాన్ని వెలికి తీసింది. కంచరపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జోనల్ కమిషనర్ రాము దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కళ్లముందే తన భర్త కాలువలో గల్లంతవడంతో భార్య రుక్మిణి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

రౌడీషీటర్ హత్య

మర్రిపాలెం : జ్ఞానాపురం శ్మశానవాటికలో రౌడీ షీటర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అల్లిపురం ప్రాంతానికి చెందిన నాగమణి ఎల్లాజీ(35)పై గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇటీవల జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన ఎల్లాజీ జ్ఞానాపురం శ్మశానవాటిక సిబ్బందితో మంగళవారం మధ్యాహ్నం వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో తనతో తీసుకువచ్చిన పాకెట్ కత్తిని చూపించి బెదిరించాడు. దీంతో సహనం కోల్పోయిన సిబ్బందిలో ఒకరు చేతిలో ఉన్న గడ్డపారతో ఎల్లాజీ తలపై బలంగా మోదడంతో రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. అయితే మృతదేహానికి దహనసంస్కారాలు నిర్వహించేందుకు సదరు సిబ్బంది పన్నాగం పన్నారని సమాచారం. ఈ క్రమంలో కంచరపాలెం పోలీసులు రంగప్రవేశం చేసి మృతదేహాన్ని కేజీహెచ్‌కు పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.

వన్‌టౌన్ కానిస్టేబుల్ సస్పెన్షన్

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ కానిస్టేబుల్ చెక్క అప్పలకొండ(పీసీ–3937)ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మద్యం దుకాణాలపై దాడి చేసి, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయించినందుకు గానూ చర్యలు తీసుకున్నారు. వివరాలివి.. గత నెల 24న వన్‌టౌన్ కానిస్టేబుల్ చెక్క అప్పలకొండ, హోంగార్డులు పి.ప్రసాదరావు, వెంకట రవికుమార్‌తో కలిసి టౌన్ కొత్తరోడ్డులోని దీప్తి బార్ అండ్ రెస్టారెంట్, సత్య బార్ అండ్ రెస్టారెంట్‌లపై దాడులు చేశారు. ఈ దాడులకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోలేదు. దాడుల అనంతరం వారు మొత్తం 105 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటిలో కేవలం 62 బాటిళ్లను మాత్రమే పోలీస్ స్టేషన్‌కు అప్పగించాడు. మిగిలిన బాటిళ్లను నయన ఉపేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడు. ఈ విక్రయం ద్వారా కానిస్టేబుల్ అప్పలకొండ తన అకౌంట్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.5,600 బదిలీ చేయించుకున్నాడని పోలీసులు గుర్తించారు. విచారణ పూర్తయిన తర్వాత పోలీస్ కమిషనర్ చెక్క అప్పలకొండను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో అప్పలకొండ ప్రధాన కార్యాలయం నుంచి ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు.

‘కూటమి’ కక్కుర్తి

- వర్క్ ఆర్డర్ కూడా లేకుండా వాటర్ ట్యాంక్ కూల్చివేతకు సిద్ధం
- ఒక్కసారిగా కుప్పకూలిన ట్యాంక్.. ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలు
- ప్రాణాపాయస్థితిలో కేజీహెచ్‌కు తరలింపు, గుట్టుచప్పుడు కాకుండా చికిత్స
- రూ.40 వేల కాంట్రాక్ట్ కోసం కూటమి నాయకుల దిగజారుడుతనం
- పెందుర్తి మండలంలో ఘటన

ప్రమాదకర స్థితిలో ట్యాంకును తొలగిస్తున్న కూలీలు

ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కూలీ నవీన్

కుప్పకూలిన ట్యాంక్

పెందుర్తి: అధికార కూటమి నాయకుల కాసుల కక్కుర్తి ఇద్దరు దినసరి కూలీల ప్రాణాల మీదకు తెచ్చింది. పంచాయతీ నుంచి కనీసం అనుమతి, వర్క్ ఆర్డర్ లేకుండా కేవలం కాంట్రాక్టర్‌కు, తమకు లబ్ధి కలగాలన్న దురాశతో పాతబడిన వాటర్ ట్యాంక్‌ను తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ట్యాంక్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అందులో ఉన్న ఇద్దరు కూలీలు తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ బొడ్డునాయుడుపాలెంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యంత్రాలతో తొలగించాల్సిన పాత ట్యాంక్‌ను కేవలం ఇద్దరు కూలీలతో తొలగింపు ప్రక్రియ చేపట్టడంతో పాటు తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో ట్యాంక్‌లో ఉన్న దొగ్గవానిపాలెంకి చెందిన కూలీలు ఆర్.శివప్రసాద్(30), దమ్ము నవీన్(17) తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని కాంట్రాక్టర్, స్థానిక జనసేన నాయకులు కేజీహెచ్‌కు తరలించి గట్టుచప్పుడు కాకుండా చికిత్స చేయిస్తున్నారు. శివప్రసాద్ తలకు తీవ్ర గాయం కావడంతో మంగళవారం వేకువజామున మెదడుకు శస్త్రచికిత్స చేశారు. వెన్నుపూసకు, గజ్జల్లో తీవ్రగాయాలు కావడంతో నవీన్ అత్యవసర చికిత్స విభాగంలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రమాదం విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగింది?

ముదపాక పంచాయతీ బొడ్డునాయుడుపాలెంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.24 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో మంచినీటి పథకాన్ని నిర్మించారు. కాగా అదే గ్రామంలో వినియోగంలో లేని మంచినీటి పథకం ట్యాంక్ ప్రమాదకరస్థితిలో ఉంది. ఈ క్రమంలో దాన్ని తొలగించేందుకు దాదాపు రెండు నెలల క్రితం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. తొలగింపు చేసేందుకు అధికారుల అభిప్రాయం కూడా తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ట్యాంక్ తొలగింపునకు పంచాయతీ పాలకవర్గంతో పాటు కార్యదర్శి అనుమతి కూడా ఉండాలి. ట్యాంక్ తొలగింపునకు పూర్తిస్థాయి అనుమతితో పాటు అయ్యే ఖర్చును కూడా పంచాయతీ నిధులనే వెచ్చించాలి. ఈ క్రమంలో గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ట్యాంక్ తొలగింపునకు రూ.40 వేలు పైచిలుకు అవుతుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఆయా నిధులను కేటాయిస్తూ.. దాన్ని తొలగించే కాంట్రాక్టర్ వివరాలను పొందుపరుస్తూ అధికారికంగా పంచాయతీ నుంచి తీర్మానం రూపంలో అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఇక్కడే స్థానిక జనసేన నాయకులు వేలు పెట్టారు. ‘అనుమతి లేదు ఏమీ లేదు’ మాకు నచ్చిన కాంట్రాక్టర్‌ను పెట్టుకుంటాం.. బిల్లులు ఇవ్వండి అంటూ పరోక్షంగా అధికారులకు చెప్పారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పంచాయతీ పాలకవర్గానికి గానీ, పంచాయతీ కార్యదర్శికి గానీ తెలియకుండా చింతలగ్రహారానికి చెందిన కాంట్రాక్టర్ సత్తిబాబు ఇద్దరు కూలీలు నవీన్, శివప్రసాద్‌ను తీసుకువచ్చి కూల్చివేత ప్రక్రియ ప్రారంభించారు.

అయ్యో పాపం

ఓ వైపు నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా కేవలం కూటమి నాయకుల జోక్యంతో పనులు ప్రారంభించారు. మరోవైపు యంత్రాలతో చేయాల్సిన పనిని కేవలం ఇద్దరు కూలీలను పెట్టారు. ఈ క్రమంలో ట్యాంక్ లోపలకు వెళ్లి శిథిలాలను తొలగిస్తున్న క్రమంలో.. ట్యాంక్ దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా కిందకు పడిపోవడంతో అందులో ఉన్న నవీన్, శివప్రసాద్‌కు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రాణాపాయస్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

అంతా గప్‌చుప్

ప్రమాద సయయంలో గ్రామంలో భీతవహ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ట్యాంక్ ఖాళీ స్థలంలో పడింది కాబట్టి సరిపోయింది గానీ అదే మరోవైపు పడితే అటువైపు ఇళ్లు ఉన్నాయి. నష్టం తీవ్రంగా ఉండేది. కాగా ప్రమాద విషయాన్ని బయటకు పొక్కకుండా కూటమి నాయకులు విశ్వప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. నియోజవర్గంలోని ఓ ముఖ్యనేత ద్వారా జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడంతో కేజీహెచ్‌లో బాధిత కూలీలకు గుట్టుచప్పుడు కాకుండా చికిత్స చేయిస్తున్నారు. అపస్మారకస్థితిలో ఉన్న శివప్రసాద్‌కు కేజీహెచ్ చరిత్రలోనే తొలిసారిగా వేకువజామున శస్త్రచికిత్స చేయించినట్లు తెలిసింది. అదే క్రమంలో బాధిత కుటుంబాలను కూడా విషయాన్ని ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. మొత్తానికి ఆదిపత్యం కోసం, కాసుల కక్కుర్తి కోసం కూటమి నాయకులు వ్యవహరించిన తీరుపై సర్వాత్రాల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్నేహితురాలి ఇంటికే కన్నం

- కబుర్లు చెప్పడానికి వచ్చి 18 తులాల బంగారు ఆభరణాల చోరీ
- నిందితురాలి అరెస్ట్, రూ.15 లక్షల విలువైన సొత్తు రికవరీ

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి : స్నేహితురాలి ఇంటికే కన్నం వేసింది ఓ ఘనురాలు. కబుర్లు చెబుదామని రోజూ ఇంటికి వచ్చి నగలు భద్రపరిచే ప్రదేశాన్ని కనిపెట్టి చాకచక్యంగా ఎత్తుకుపోయింది. దాదాపు మూడు నెలల తరువాత స్నేహితురాలిపై అనుమానం రావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెస్ట్ జోన్ క్రైం విభాగం ఏసీపీ డి.లక్ష్మణరావు ఆయా వివరాలను వెల్లడించారు. సింహచలం సమీపంలోని విరాట్‌నగర్‌కు చెందిన రెయ్య జ్యోతి, చిన ముషిడివాడకు చెందిన ఎస్.వాణి స్నేహితులు. జ్యోతి భర్త కెనరా బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. కాగా వాణి తరచూ జ్యోతి ఇంటికి వచ్చేది. కబుర్లు చెబుతూ ఇంటిలో కలియతిరిగేది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 15న వాణి జ్యోతి ఇంటికి వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లిపోయింది. రాత్రికి ఇంట్లో పడకగదిలో బంగారం మాయం అయినట్లు జ్యోతి గుర్తించింది. తొలుత ఎవరో ఎత్తుకుపోయారని భావించారు. కొద్దిరోజులకు తన స్నేహితురాలు వాణి తన ఇంటికి రావడం మానేసింది. దాంతో పాటు ఆమె నడవడికలో మార్పులు రావడాన్ని గమనించిన జ్యోతి ఆమెను అనుమానించి జూన్ 9న పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల సూచనలతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పెందుర్తి క్రైం పోలీసులు వాణిపై నిఘా ఉంచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వాణి నేరం చేసినట్లు నిర్ధారించుకున్న పోలీసులు.. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకుంది. నిందితురాలిని అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువైన 228.73 గ్రాములు(సుమారు 18 తులాలు) బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. కేసులో ప్రతిభ కనబరిచిన క్రైం విభాగం వెస్ట్ జోన్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీలు జి.నాగరాజు, టి.పద్మజ, పీసీలు పి.పైడిరాజు, జీవీవీ కిషోర్, టి.శివప్రసాద్, బి.దేముడు బాబు, ఎల్.కె తాతారావు, ఆర్.సంతోషిలను ఉన్నతాధికారులు అభినందించారు.

జూలో ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణకు చర్యలు

రాష్ట్ర అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే

జూలో నీటి ఏనుగు ఎన్‌క్లోజరు పరిశీలిస్తున్న అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అవసరమైన ఎన్‌క్లోజర్లు పునరుద్ధరణకు నివేదిక సిద్ధం చేయాలని జూ అధికారులకు రాష్ట్ర అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే సూచించారు. జూ పార్కును మంగళవారం ఆయన సందర్శించారు. విశాఖ సీఎఫ్ మహ్మద్ దివాన్ మైదీన్, జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అధికారులతో కలసి ఆయన జూలో ఎన్‌క్లోజర్లు, వన్యప్రాణులను పరిశీలించారు. ఇటీవల జూలో నిర్మించిన కొత్త ఎన్‌క్లోజర్లు, మరమ్మతులు చేపట్టిన ఎన్‌క్లోజర్లను పరిశీలించి వాటి కోసం ఎంత నిధుల ఖర్చుచేశారు.. సీఎస్ఆర్ నిధులు ఏఏ సంస్థలు నుంచి వచ్చాయి.. తదితర వాటిపై ఆరా తీశారు. ఇటీవల పునరుద్ధరించిన సీతాకోక చిలుకల పార్కు, కొత్తగా నిర్మించిన అడవి కుక్కల పునరుత్పత్తి కేంద్రం అదనపు విభాగాన్ని పరిశీలించారు. వన్యప్రాణులు ఆరోగ్యం, వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన జూ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రాబందుల ఎన్‌క్లోజరు పనులు వేగవంతం చేయాలని సూచించారు. అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని రాబోయే ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విభాగంలో అవసరమైన ఎన్‌క్లోజర్ల పునరుద్ధరణ, సీఎస్ఆర్ నిధుల ద్వారా మరమ్మతులు, సుందరీకరణ చేపట్టడానికి నివేదిక తయారు చేయాలన్నారు. వాటితో పాటు జూలో అక్వేరియం, స్లాత్‌బేర్, రెడ్ నెక్డ్ వాల్లబీ, అడవి పిల్లుల ఎన్‌క్లోజర్‌ను పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్శనలో జూ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, జూ వైద్యుడు డాక్టర్ భాను, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, సుందరీకరణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మహారాణిపేట: పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుదల, ప్రజారోగ్య పరిరక్షణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జిల్లా యంత్రాంగం, జీవీఎంసీ కలిసి పనిచేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. ఆయా సంస్థల మధ్య సమన్వయం లోపించకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రతినిధులను నియమించుకోవాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక సంస్థలు, కేంద్ర సంస్థలు వ్యవహరించాల్సి ఉంటుందని నిర్దేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి కేంద్ర సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కేంద్ర సంస్థలు తప్పకుండా జీవీఎంసీతో అనుసంధానమై పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా పోర్ట్, రైల్వే, గెయిల్, ఎన్‌హెచ్ఏఐ, ఐవోసీఎల్, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, గంగవరం పోర్టు పరిసరాల్లో పారిశుధ్య సమస్యలపై ఇరువర్గాల వారు క్షేత్రస్థాయి పరిశీలన చేసి శాశ్వత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నాలుగు అంశాలపై దృష్టి సారించాలి

ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర సంస్థలు ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయా కేంద్ర పరిశ్రమలు, సంస్థలు, యూనిట్ల పరిధిలో పక్కా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రత్యేక సిబ్బందిని నియమించుకుని నిరంతరం ఈ ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. మురుగునీరు పారేందుకు అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూడిక తొలగింపు పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే పచ్చదనం పెంపుదలకు, సుందరీకరణకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. జీవీఎంసీ సీఎంవో నరేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

12 నెలలుగా రూ.430 కోట్ల బకాయిలు

- బిల్లులు చెల్లించండి మహాప్రభో..
- జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వేడుకోలు

మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి

డాబాగార్డెన్స్: బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.వి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సంజీవరెడ్డి కోరారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన ఎందరో చిన్న కాంట్రాక్టర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల కోసం జీవీఎంసీ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న వారు కొందరైతే.. అనారోగ్యం బారిన పడిన వారు మరికొందరున్నారని తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిందని ఎంతో ఆశపడ్డామని, అయితే ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో చాలా మంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం నిధి పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, అయితే దీని వల్ల కాంట్రాక్టర్లకు పెద్దగా లాభం లేదన్నారు. పాత బిల్లులు అందులో అప్‌లోడ్ కావడం లేదని వివరించారు. గత 12 నెలలుగా సుమారు రూ.430 కోట్లు బకాయిలున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కొన్ని చిన్న పనులకు టెండర్లు పిలిచి రద్దు చేయడం, ఆ పనులను పెద్ద కాంట్రాక్టర్లకు ఒకేసారి అప్పగించడం వల్ల చిన్న కాంట్రాక్టర్లకు పనులు లేకుండా పోయాయన్నారు. అధికారిక ఆమోదం లేకపోయినా పనులు పూర్తి చేసిన తర్వాత ఫైల్ ప్రాసెసింగ్‌లో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఫైల్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడంతో మెయిన్ ఆఫీస్‌కి, జోనల్ ఆఫీస్‌కి మధ్య సరైన కమ్యూనికేషన్ లేక కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యలపై మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్ స్పందించి కాంట్రాక్టర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రమేష్, ప్రతినిధులు శ్రీనివాసరావు, జి.సింహాచలం, బి.కృష్ణ, అప్పలనాయుడు, రవికుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

‘జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ’

కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

మహారాణిపేట: జిల్లాలోని జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారి పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, పలువురు జర్నలిస్ట్ నాయకులు మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో యోగాంధ్ర నమోదైన నేపథ్యంలో కలెక్టర్‌కు అభినందనలు తెలిపి, సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు గతేడాది అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారని, ఈ ఏడాది కూడా కార్పొరేట్ ఆసుపత్రిలో నిర్వహించేలా తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, ఇప్పటికే సంబంధిత విభాగం అధికారులకు ఆ బాధ్యత అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజు రాయితీ కల్పించాలని, ఇప్పటికే వినతి పత్రం అందించామని వివరించగా, ఫీజు రాయితీ కల్పించడానికి తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో జిల్లా విద్యా శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. జర్నలిస్టులు జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎస్ జగన్మోహన్, కార్యనిర్వాహక సభ్యుడు అరుణ్‌కుమార్, రమణమూర్తి, నగేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి ప్రమోటర్స్ వార్షికోత్సవం

స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఎండీ రమేష్ రెడ్డి, సిబ్బంది

తాటిచెట్లపాలెం: స్వాతి ప్రమోటర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో స్వాతి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, డీజీఎంలు, ఏజీఎంలు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా లోపానికి పరిహారం చెల్లించాలి

విశాఖ లీగల్: వినియోగదారునికి సేవా లోపం కలిగించినందుకు వస్తువు ఖరీదుతోపాటు రూ.2 లక్షలు జరిమానా చెల్లించాలని విశాఖ జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్–2 న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి తీర్పునిచ్చారు. జరిమానాతోపాటు వస్తువు ఖరీదు రూ.225, కేసు ఖర్చులు రూ.20 వేలును 12 శాతం వడ్డీతో వాపస్ చేయాలని పేర్కొన్నారు. న్యాయవాది ధనలక్ష్మి అందించిన వివరాలు..

డాబాగార్డెన్స్‌కు చెందిన ఫిర్యాది టీవీ సాయి కృష్ణ భార్గవ 2024 డిసెంబర్ 5న 9.45కు స్విగ్గీలో 5 కాఫీలకు ఆర్డర్ ఇచ్చారు. అరగంటలో కాఫీ డెలివరీ అయింది. వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చిన విధంగా కాఫీ సరిపోలేదని చెప్పినా, కంపెనీ యాజమాన్యం పట్టించుకోలేదు. ఫిర్యాది తనకు జరిగిన సేవా లోపాన్ని ఈమెయిల్ రూపంలో కంపెనీ యాజమాన్యానికి వెంటనే తెలిపారు. యాజమాన్యం ఫిర్యాదును తిరస్కరించింది. దీంతో వినియోగదారుడు కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి కమిషన్ సభ్యులు పి.విజయ దుర్గ, డాక్టర్ వెంకటరమణలు వినియోగదారుడు చెల్లించిన కాఫీ ఖరీదు రూ.225, రూ.2 లక్షల నష్టపరిహారం, రూ.20 వేలు ఖర్చులు ఇవ్వాలని తీర్పునిచ్చింది.

అర్చకుడి అదృశ్యంపై లోతుగా దర్యాప్తు

మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

భీమునిపట్నం: భీమిలిలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి ఆలయ అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్య శాస్త్రి(49) అదృశ్యంపై దర్యాప్తునకు ఎస్ఐ స్థాయి అధికారిని నియమించినట్లు సీఐ తిరుమలరావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. అర్చకుడు ఈ ఏడాది ఏప్రిల్ 24న తిరుపతి బయలుదేరి వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. 26న ఆయన నుంచి ఫోన్ వచ్చిందని, ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని చెప్పారు. కాగా.. అర్చకుడికి మద్యం సేవించే అలవాటు ఉంది. గతంలోనూ ఇలానే పలు ప్రాంతాలను వెళ్లిన శాస్త్రి కొద్ది రోజుల తర్వాత ఇంటికి వచ్చేవారు. అలానే వస్తారని కుటుంబ సభ్యులు వేచి చూశారు. అయినప్పటికీ రాకపోవడంతో మే 4న తిరుపతి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో అర్చకుడి ఆచూకీ పరిశీలించగా లభించలేదు. దీంతో అతని భార్య మాధురి మే 13న భీమిలి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ కేసులో ఎటువంటి పురోగతి కనిపించలేదు. దీంతో గత నెల 23న ‘భీమిలి అర్చకుడు తిరుపతిలో అదృశ్యం’శీర్షికన ‘సాక్షి’లో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పోలీసులు గత నెల 25న తిరుపతి వెళ్లి.. అర్చకుడి కోసం గాలించారు. ఈ క్రమంలో అర్చకుడి ఫోన్ తిరుపతిలో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతన్ని విచారించారు. అర్చకుడి వద్ద డబ్బులు లేకపోవడంతో రూ.700లకు ఫోన్‌ను విక్రయించినట్లు విచారణలో తేలింది. ఫోన్‌తో పాటు నలుగురిని అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించినప్పటికీ.. అర్చకుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు 30న భీమిలికి తిరిగి వచ్చేశారు. ఈ కేసును మరింత లోతుగా విచారించడానికి ఎస్ఐ స్థాయి అధికారిని నియమించినట్లు సీఐ తెలిపారు.

నృసింహావతారంలో జగన్నాథుడు

స్వామికి పట్టువస్త్రాలు అందజేస్తున్న సింహాచలం దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు

డాబాగార్డెన్స్/సింహాచలం: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి మంగళవారం నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వర్షంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజువారీ పూజలతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం తరపున ఆలయ దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు వారు పట్టువస్త్రాలతో ఆలయ బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం టర్నర్ చౌల్ట్రీకి వచ్చారు. కాగా.. జగన్నాథస్వామి ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేషుబాబు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మేయర్ పీలా శ్రీనివాసరావు దంపతులు, ఎమ్మెల్యే పీజీవీఆర్ గణబాబు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. బుధవారం స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో తెలిపారు.

ఆర్సెలర్ మిట్టల్ కంపెనీ ప్రతినిధుల పర్యటన

క్యాప్టివ్ పోర్టు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మిట్టల్ కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి: ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం మండలంలో పర్యటించారు. కంపెనీ కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను వారు పరిశీలించారు. అమలాపురం, డీఎల్ పురం, వేంపాడు, బోయపాడు తదితర గ్రామాల్లో స్టీల్‌ప్లాంట్ కోసం మొదటి విడతలో 2080 ఎకరాలను కేటాయించింది. జాతీయ రహదారి కాగిత నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. దీంతో కంపెనీ ప్రతినిధులు తమకు కేటాయించిన భూములను, అక్కడ ఏపీఐఐసీ వారు చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించిన భూములు, వాటి వివరాలు, భౌగోళిక స్వరూపాన్ని కంపెనీ ప్రతినిధులకు చూపించారు. ముఖ్యంగా డీఎల్‌పురం వద్ద కంపెనీ నిర్మించే క్యాప్టివ్ పోర్టు పరిసరాలను పరిశీలించారు. వెసల్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ కోసం మొదటి విడతలో పోర్టు నిర్మాణం కోసం 168 ఎకరాలు అవసరం కానుంది. వీరి మిట్టల్ కంపెనీ ప్రతినిధుల వెంట తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SRINIVASA RAO GADI Army No. 14405774W, Rank: Ex.NAIK, S/o GADI APPALANAIDU, Residing at F.No. 202, Deva Datta Sai Residency, Jabili hills, Road No.1, Sanivada, Aganampudi, Gajuwaka (Mandal), Visakhapatnam - 530046 (A.P). Sub mits that my Wife Name Wrongly Mentioned in my Army Service Records as VENKATA LAXMI instead of VENKATA LAKSHMI GADI My Wife Correct Name is VENKATA LAKSHMI GADI I Request concerned army authorities to rectefy the mistake and correct my Wife Name as VENKATA LAKSHMI GADI Vide affidavit dated 30-6-2025 Swron before Notary. Gajuwaka.

CHANGE OF NAME
I, SHAIK MOHAMUD GAYAS BASHA (New Name) S/o. Shaik Abdul Gaffar Saheb. Previously called SHAKE MOHAMMED GAYAS BASHA (Old Name) Resident of D.No.44-25-10/4, Akruthi Enclave, Nizam Residency, Railway Colony, Akkayyapalem, Visakhapatnam - 530016, (A.P). Now changed my name from SHAKE MOHAMMED GAYAS BASHA (Old Name) to SHAIK MOHAMUD GAYAS BASHA (New Name). Hence forth I will be called as SHAIK MOHAMUD GAYAS BASHA (New Name) for all purpose.

CHANGE OF NAME
I, PILAKA RAM MOHAN REDDY S/o. Pilaka Apparao Reddy, Resident at D.No. 59-12-23, Reddy Street, Malkapuram, Visakhapatnam - 530011. Now Changed my name from RAMA MOHAN REDDY PILAKA (Old Name) to PILAKA RAM MOHAN REDDY (New Name). Hence forth I will be called as PILAKA RAM MOHAN REDDY (New Name) for all purpose.

Real Estate

FLAT FOR SALE
■ అక్కయ్యపాలెం చెక్కుడు రాయ బిల్డింగ్ దగ్గర్లో కొత్త 2BHK ఫ్లాట్ 52 లక్షలకే అమ్మకం. ఫోన్ : 98663 21992 [V- 14019]

■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+2వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 34, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15195]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

Wanted

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురుషులు), జగదాంబ ఏరియాలో పనిచేయుటకు జీతం: 14,000/- మరియు ఇతర సదుపాయాలు కలవు. సంప్ర।। 96032 16460/63007 25191. [V- 3577]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 2 । జూలై । 2025

వయ్యారిభామతో ముప్పు

రైతులు తెగుళ్ల కంటే అధికంగా భయపడేది వయ్యారి భామ కలుపు మొక్కకే. ఈ మొక్క నెల రోజుల్లోనే పూతకు వచ్చి.. 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. 10లో ▸

నయనానందకరం.. రథోత్సవం

ఏలూరు నగరంలో జగన్నాథుడి రథోత్సవం వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు నృత్యాలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ రథం వెంట నడిచారు. 10లో ▸



పిడుగులతో అప్రమత్తం

వర్షాకాలంలో పిడుగుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాణాపాయంతో పాటు గృహోపకరణాలు కాలిపోయే ముప్పు ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 10లో ▸

అరకొరగా మందు బిళ్లలు

- ప్రభుత్వ ఆస్పత్రులకు పూర్తిస్థాయిలో అందని వైనం
- మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్న రోగులు
- అలంకార ప్రాయంగా హెల్త్ క్లినిక్‌లు
- గత ప్రభుత్వంలో అందుబాటులో అన్ని రకాల మందులు
- జగనన్న సురక్ష శిబిరాలతో చెంతకే మందులు

సాక్షి, భీమవరం: వృద్ధుల్లో రక్తపోటు అదుపునకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ఎటన్‌లాల్ 50 మాత్రలను ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు. గతంలో పీహెచ్‌సీలకు క్రమం తప్పకుండా ఈ మాత్రలు సరఫరా జరిగేవి. కొన్ని నెలలుగా వీటి పంపిణీ అంతంత మాత్రంగానే ఉండడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నొప్పులు తగ్గేందుకు వినియోగించే ప్రిగాబ్లిన్ టాబ్లెట్లు, రోగికి సత్తువ కోసం పెట్టే మెట్రోజిల్ సెలైన్లు, జ్వరాలు, నొప్పులకు వివిధ రకాల వ్యాధులను తగ్గించేందుకు వినియోగించే పారాసిటమాల్ 500 ఎంజీ, ఇన్సులిన్, అమాక్సిలిన్ టాబ్లెట్స్, అమాక్స్‌లిఫ్ ఇంజెక్షన్లు, సిట్రజన్, సిల్వర్ ఎక్స్ తదితర మందులది అదే దారి. ఏ రకం మందులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర మందులతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తోంది. జిల్లాలో ఒక జిల్లా ఆరోగ్య కేంద్రం, మూడు సీహెచ్‌సీలు, ఐదు ఏరియా ఆస్పత్రులు, 34 వరకు పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీల వరకూ ఉన్నాయి. రోజుకు 15,500 వరకూ ఓపీ నమోదవుతుంది. ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులను వైద్యారోగ్య శాఖ అందిస్తుంది. కొంతకాలంగా క్వార్టర్ కోటా విడుదలతో ప్రభుత్వం కోత పెడుతోంది. మూడు నెలలకు అవసరమైన డ్రగ్స్‌తో ఇండెంట్ పెడుతుండగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి పూర్తిస్థాయిలో మందులు రావడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. గతంతో పోలిస్తే మందులకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి.

పత్తాలేని సురక్ష శిబిరాలు

జగనన్న సురక్ష ద్వారా పేద వర్గాల వారికి రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్ట్ వైద్యసేవలు పొందే సౌలభ్యాన్ని గత ప్రభుత్వం కల్పించింది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, అవసరాన్ని బట్టి మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించేవారు. జిల్లాలోని విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచేవారు. స్పెషలిస్ట్ వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది వైద్యసేవలు అందించేవారు. పేదలకు వైద్య భరోసా కల్పించిన ఈ శిబిరాల నిర్వహణను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. గత ప్రభుత్వంలో తమ సమీప ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యసేవల్ని ఉచితంగా పొందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఇప్పుడు వాటి కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

కొన్ని మందులు నిలిపివేసిన ప్రభుత్వం

పీహెచ్‌సీలకు 172 రకాలు ఉంచాల్సి ఉండగా కొన్ని మందులను నిలిపివేసిన వైద్య ఆరోగ్యశాఖ మరికొన్ని అరకొరగానే అందజేస్తోంది. సీహెచ్‌సీల్లో 325 రకాల మందులకు 240 రకాలనే సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. బీపీ, సుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు మందుల పంపిణీ అరకొరగానే ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యాధిని నయం చేసేందుకు సరైన డ్రగ్ లేక బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటోందని రోగులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన సర్వేలో ఉచిత మందులు సక్రమంగా అందడం లేదని 46 శాతం చెప్పగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలపై 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం.

అలంకారప్రాయంగా హెల్త్ క్లినిక్‌లు

సాధారణంగా యూనివర్సల్ (యూ), సబ్ డివిజనల్ (ఎస్), టెరిసరీ (టి) కేటగిరీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలలకు మందుల కేటాయింపు చేస్తుంటారు. స్థాయిని బట్టి అలాట్‌మెంట్, బడ్జెట్ కేటాయింపులుంటాయి. రోజువారీ ఓపీ అధికశాతం నమోదయ్యే పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో మందుల సరఫరా జరగక వీటికి అనుబంధంగా పనిచేసే హెల్త్ క్లినిక్‌లకూ మందుల కొరత వేధిస్తోంది. హెల్త్ క్లినిక్‌లకు రావాల్సిన మందులు అరకొరగానే సరఫరా అవుతున్నాయి. ఆస్పత్రుల్లో మందులకు కొరత లేదని, అలాట్‌మెంట్ మేరకు పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

మూలనపడ్డ 108.. ప్రైవేటు వాహనంలో తరలింపు

తణుకులో లారీ కిందపడి తీవ్రంగా గాయపడ్డ దుర్గాప్రసాద్

తణుకు అర్బన్: లారీ కిందపడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం తణుకులో జరగగా.. స్థానికులు 108కు ఫోన్ చేసినప్పటికీ ఎంత సేపటికీ వాహనం రాలేదు. దీంతో ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సజ్జాపురానికి చెందిన దూసనపూడి దుర్గాప్రసాద్‌ను లారీ ఢీకొట్టింది. అతని కాలు నుజ్జయ్యింది. 108 రాకపోవడంతో స్థానికులు ప్రైవేటు వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ నుంచి రాజమండ్రికి తరలించారు. తణుకు 108 వాహనం కొన్ని రోజులుగా మరమ్మతుల్లో ఉంది. దీంతో ఇరగవరం, ఉండ్రాజవరం వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఆ రెండు వాహనాలు కూడా దూర ప్రాంతాలకు వెళ్లడంతో తణుకులో 108 వాహన సేవలు అందుబాటులో లేవు.

డీఎస్సీ పరీక్షకు 97 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో మూడు పరీక్షాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 97 శాతం హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. ఉదయం పరీక్షకు 385 మందికి 372 మంది, మధ్యాహ్నం పరీక్షకు 386 మందికి 378 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

ఎంపీడీఓల సంఘం కార్యవర్గ ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం ఎంపీడీవో గంగాధరరావు

భీమవరం అర్బన్: భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎంపీడీఓ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎంపీడీఓ ఎన్.గంగాధరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సంఘం అధ్యక్షుడిగా బీఎస్ఎస్ఎస్ కృష్ణ మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్. గంగాధరరావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.స్వాతి, ఎ. శ్రీనివాస్, కోశాధికారిగా సీహెచ్ త్రిశూలఫణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా టీఎస్ మూర్తి, సంయుక్త కార్యదర్శిగా పి.శామ్యూల్‌ను ఎన్నుకున్నారు.

సమ్మెకు మద్దతివ్వాలి

కొయ్యలగూడెం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల తొమ్మిదిన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గంపై బానిసత్వం రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి భారతి కోరారు. అనంతరం బయ్యనగూడెం, పొంగుటూరు, కొయ్యలగూడెం సెక్టార్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు.

వరదను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు(మెట్రో): గోదావరి వరదను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తు నియంత్రణ కార్యాచరణను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గోదావరి వరద నియంత్రణ, సహాయక చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఫైర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల పేర్లు, అత్యవసర ఫోన్ నెంబర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడులో మొదటి, రెండవ, మూడో వరద ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా పునరావాస కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 8, 9 నెలలు నిండిన గర్భిణీల జాబితాను సిద్ధం చేసి సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలి

ఏలూరు (టూటౌన్): పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. నష్టాలు వస్తున్నాయనే సాకుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారని, దీనిని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. పరిశ్రమపై 300 మంది కార్మికులు, 33 వేల ఎకరాల్లో ఉన్న 1100 మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రైవేట్ వ్యక్తుల లాభాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలో భాగంగానే ఈ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. పెదవేగి పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరిస్తే కార్మికులు, రైతులు, ప్రజలు నుంచి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

● మా గోడు పట్టదా?

నరసాపురం : మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్ష చేస్తున్న కార్మికులు

పాలకొల్లు : నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

తణుకు : నరేంద్ర సెంటర్‌లో నినాదాలు చేస్తున్న కార్మికులు

తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరాహార దీక్షలు తొమ్మిదో రోజుకు చేరాయి. ఆందోళనలో భాగంగా వాటర్‌వర్క్స్, వీధి దీపాల నిర్వహణ వంటి అత్యవసర సర్వీస్‌లను బహిష్కరించడంతో ప్రభావం సమ్మె ప్రభావం కనిపిస్తోంది. నరసాపురం పట్టణంలోని మార్కెట్ ఏరియాలో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం తణుకులో నిరాహారదీక్ష శిబిరం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. వేతన సవరణ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలన్నారు. పాలకొల్లు, తాడేపల్లిగూడెంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరసన కొనసాగించారు.

పాలకొల్లు సెంట్రల్/ నరసాపురం/తణుకు అర్బన్/ తాడేపల్లిగూడెం(టీఓసీ)

తాడేపల్లిగూడెం : మున్సిపల్ కార్యాలయం వద్ద జేఏసీ దీక్షలు

ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణ అమానుషం

ఏలూరులో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్ల పాలనలో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ మంగళవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై జులై 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, దుర్గారావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందం 'ట్రిపుల్'

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన గ్రామీణ పేద విద్యార్థులు
- కష్టానికి తగిన ప్రతిఫలం లభించిందని సంతోషం

ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నూజివీడు: రోజువారీ కూలీ కుమారుడు ఒకరు... ఆటో డ్రైవర్ కొడుకు మరొకరు.. తండ్రి లేని నిరుపేద బాలిక ఇంకొకరు.. ఇలా అందరూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే. అద్భుత ప్రతిభ కలిగిన వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతిలో సత్తా చాటారు. గ్రామీణ పేద పిల్లలకు సైతం సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అత్యుత్తమ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందారు. తమ లక్ష్యానికి అనుగుణంగా తొలి అడుగు పడిందనే ఆనందంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు పొందిన కొందరు విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే..

కూలికి వెళ్తూ చదివించారు

మాది ప్రకాశం జిల్లా మార్కాపురం. మా ఊరిలోని ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి చదివా. 591 మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. మా నాన్న కొండయ్య కూలి పనులకు వెళుతూ నన్ను చదివించారు. ట్రిపుల్ ఐటీలో సీటు లభించడం ఎంతో ఆనందంగా ఉంది.

– బొప్పరాజు సాత్విక, మార్కాపురం, ప్రకాశం జిల్లా

కష్టపడి చదువుతా

మా నాన్న ఆటో నడిపి కుటుంబాన్ని పోషించేవాడు. అమ్మ కూలి పనులకు వెళ్తుంది. నేను జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ శాఖ స్కూల్‌లో పదో తరగతి చదివి 592 మార్కులు సాధించా. ఇక్కడ సీటు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇక ముందు కూడా కష్టపడి చదువుతా.

– వాసిరెడ్డి వెంకటలక్ష్మి, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా

సంతోషంగా ఉంది

నా తండ్రి కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. బీఎంఆర్ బాలికల హైస్కూల్‌లో చదివి పదో తరగతిలో 587 మార్కులు సాధించాను. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు రావడం సంతోషంగా ఉంది. ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులను ఆనందంగా ఉండేలా చూడటం నా బాధ్యత.

– మరుకుర్తి శ్రీకీర్తన, పిఠాపురం, కాకినాడ జిల్లా

నా కల నెరవేరింది

మాది ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం గొట్టిపడియ. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ శాఖ స్కూల్‌లో చదువుకుని పదో తరగతిలో 580 మార్కులు సాధించా. మా అమ్మ చాలా కష్టపడి నన్ను చదివించింది. ట్రిపుల్ ఐటీలో చేరాలనే నా కల నెరవేరింది. ఎంతో సంతోషంగా ఉంది.

– సాల్వ హిమచంద్రిక, గొట్టిపడియ, ప్రకాశం జిల్లా

ఉన్నత స్థానమే లక్ష్యంగా..

అమ్మ, నాన్న ఇద్దరూ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 590 మార్కులు సాధించా. తల్లిదండ్రుల కష్టాన్ని రోజూ చూస్తుండేవాడిని. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు ఆనందంగా ఉంది. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగడమే లక్ష్యం.

– దామా చైతన్య, నలదలపూర్, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఉన్నత విద్యకు అవకాశం

మా నాన్న కూలికి వెళ్తేనే మా కుటుంబం గడిచేది. నేను కావలి మున్సిపల్ హైస్కూల్‌లో చదివి పదో తరగతిలో 582 మార్కులు సాధించాను. ఇక్కడ సీటు రావడంతో ఎంతో ఆనందంగా ఉంది. పేద కుటుంబానికి చెందిన నాకు ఉన్నత చదువుకు అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– బొగ్గవరపు తనూజ, లింగనపాలెం, నెల్లూరు జిల్లా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ ఎంపీ శ్రీధర్‌తో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏలూరు సమన్వయకర్త జేపీ, పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే కాలంలో ఏలూరు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ.. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాటం చేసి ప్రజలకు అండగా నిలవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరులోని ఆయన ఇంట్లో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏలూరు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి అరాచకాలు, పార్టీ నేతలపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలపై ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కూటమి నేతలు సూపర్ –6 హామీలు అమలు చేయలేక, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు ఏ విధంగా మేలు చేశామనేది ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామిని దర్శించేందుకు క్యూలో వేచిఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామివారికి ఆలయ అర్చకులు ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు దీరి స్వామివారిని దర్శించి, 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,75,143 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1400 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. ఆలయం వద్ద బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు.

తాడేపల్లిగూడెంలో చోరీ

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని ఝాన్సీరాణి ఆస్పత్రి సమీపంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.7 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. వివరాల ప్రకారం సుబ్బారావు పేటలో ఉంటున్న బల్ల వేణువర్మ, లలిత గత నెల 24వ తేదీన తిరుమల తిరుపతి వెళ్లి మంగళవారం వచ్చారు. ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడం, ఇంటిలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతోపాటు బీరువాలో దాచిన ఆరు కాసుల బంగారు నగలు, కిలో వెండి సామగ్రి కనిపించలేదు. దీంతో బాధితురాలు బల్ల లలిత స్థానిక పట్టణ పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పంట కాలువ నుంచి మృతదేహం బయటకు తీసి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం: పట్టణ పరిధిలోని నరసాపురం –నిడదవోలు ప్రధాన పంట కాలువలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పంటకాలువలో మహిళ మృతదేహం ఉన్నట్టుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టౌన్ సీఐ బి.చాదగిరి, ఎస్సై జయలక్ష్మి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి వయస్సు సుమారు 53 సంవత్సరాలు ఉంటుందని సీఐ వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వివరించారు.

పిడుగులతో అప్రమత్తం

పాలకొల్లు సెంట్రల్: వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుంటాయి. ఆ సమయంలో ఎక్కువగా పిడుగులు పడుతుంటాయి. పిడుగుల మూలంగా ఏటా సుమారు రెండువేల మంది చనిపోతున్నట్లు అంచనా. అలాగే పిడుగుల మూలంగా గృహోపకరణాలు కాలిపోతుంటాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో పిడుగుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులను చూసి కొందరు చాలా భయపడతారు. దీనిని అస్ట్రఫోబియా అంటారు. పిడుగు ఒకసారి పడినచోట రెండోసారి మళ్లీ పడదనుకోవడం అపోహ మాత్రమే. ఒకే చోట ఒకే ప్రదేశంలో ఎన్నిసార్లయినా పడే అవకాశం ఉంటుంది.

పిడుగు పడిందంటే...

పిడుగు శబ్దం వినగలమే తప్ప చూడాలంటే మాత్రం చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. పిడుగు పడే సమయంలో మెరుపు మేఘాల నుంచి భూమికి తాకినట్టుగా కనిపిస్తుంది. అలా తాకినప్పుడు మేఘాలలో తయారైన పాజిటివ్ శక్తి, భూమిలోని నెగెటివ్ శక్తిని చేరుతుంది. ఒకవేళ మేఘాలలో నెగటివ్ శక్తి తయారైతే అప్పుడు భూమిలో ఉన్న పాజిటివ్ శక్తిని చేరుతుంది. ఏ విధంగానైనా సర్క్యూట్ పూర్తవుతుంది. పిడుగు పడిన సమయంలో ఆ ప్రదేశంలో ఉష్ణోగ్రత కొన్ని వేల డిగ్రీల ఫారన్‌హీట్ ఉంటుందని నిపుణులు అంటున్నారు.

కాపర్ ఎర్త్ ముఖ్యం

పిడుగుల ప్రమాదాల నుంచి రక్షించుకోవాలంటే ఎత్తయిన భవనాల నుంచి లేదా టవర్లు, పొగ గొట్టాలు ఇలా ఏదైనా సరే పై నుంచి భూమిలోపలి వరకూ కాపర్ ఎర్త్‌ను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. ఇది దాదాపుగా కిలో మీటరు దూరంలో పడిన పిడుగును సైతం నేరుగా భూమిలోకి లాక్కునే అవకాశం ఉంటుంది. కాపర్ ఎర్త్ వేసే ముందు ఉప్పు, కర్పూర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమిలోపలకు ఏర్పాటుచేయడం వల్ల ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుంది.

పిడుగులు (ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి పిడుగులు పడే అవకాశం ఉందని సమాచారం రాగానే ప్రధానంగా పశువులు లేదా మేకలను చెట్లకింద కట్టకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- రహదారులపై హోర్డింగ్‌లు, ఎత్తయిన, బలహీనమైన చెట్లు కింద నిలబడరాదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు ఆరు బయట తిరగకూడదు.
- ఇంట్లో కేబుల్ టీవీ, కంప్యూటర్లు, ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడకుండా కనెక్షన్‌లు తొలగించాలి.
- పొలం దగ్గర మైదాన ప్రాంతంలో ఉన్నట్లయితే ఎత్తయిన చెట్ల కింద నిలబడకూడదు. ట్రాక్టర్లతో పనులు నిలుపుదల చేసుకోవాలి. లేదంటే పిడుగు పడితే వాహనాల్లో ఉన్న లోహపు పరికరాలను ఆకర్షించే ప్రమాదం ఉంటుంది.
- హైటెన్షన్ వైర్లు, సెల్ టవర్లు కింద ఉండకుండా చూసుకోవాలి.
- చెరువు, కొలనులు ఉన్నట్లయితే దూరంగా ఉండాలి.
- మోటార్‌సైకిల్, స్కూటర్, సైకిల్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ప్రయాణం చేసే సమయాల్లో వాహనాలు పక్కకు ఆపి ఎత్తయిన చెట్లు పక్కన కాకుండా నిలబడడం మేలు.
- ఉరుములతో వర్షం కురుస్తున్న సమయంలో ఇంట్లో షవర్‌బాత్ చేయడం, నీళ్లతో పాత్రలు శుభ్రం చేయడం వంటి పనులను చేయకూడదు. పైపుల గుండా పిడుగు ప్రయాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా ఇంటికి ఎర్తింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

లైట్నింగ్ అరెస్టర్ అవసరం

పిడుగు విద్యుత్ ప్రవాహం అధికంగా ఉండడం వల్ల విద్యుత్ పరివర్తకాలు, సామగ్రిని కాపాడుకోవడానికి లైట్నింగ్ అరెస్టర్ (పిడుగును అరెస్ట్ చేసేది) ఉపయోగిస్తుంటాము. ఎత్తయిన భవనాలకు కూడా ఇది అమర్చుకోవడం వల్ల ఉపయోగంగా ఉంటుంది. సోలార్ ప్యానల్‌లకు లైట్నింగ్ అరెస్టర్ ఏర్పాటుచేసుకోవాలి. సోలార్ ప్యానల్లోనే వీటిని బిగిస్తున్నారు.

– చిటికెన రామకృష్ణ, డీఈఈ తూర్పు ప్రాంత విద్యుత్ శాఖ, పాలకొల్లు

రేపటి నుంచి మూలపాడులో సీనియర్ క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకూ కృష్ణా జిల్లా మూలపాడులో సెంట్రల్ జోన్ సీనియర్ అంతర జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, ఈ అశోక్‌కుమార్, ఎస్‌కే సాకిర్‌హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ మెన్ మల్టీడే జట్టు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఇందులో బి మునీష్‌వర్మ(కెప్టెన్), జీఎస్ స్వామినాయుడు (వైస్ కెప్టెన్), కె రేవంత్‌నాగకుమార్, కేకేఎస్‌ఎన్ హరీష్, ఎం హర్షవర్ధన్, వి జాస్విన్, ఏ దినేష్, పి భువనీశ్వర్, బి చరణ్‌సాయితేజ, ఎండీ మోహబూబ్‌ఆలీ, ఏ ప్రేమ్‌చంద్, జి రుత్విక్, వి దీపక్‌చంద్, వీఎంవీఎస్ రక్షన్, బి జయకృష్ణ ఉన్నారని వెల్లడించారు. పది రోజుల పాటు జరిగే పోటీల్లో జట్టు సభ్యులు ఇతర జట్లుతో తలపడతారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: వర్షం కారణంగా మోటారు సైకిల్‌పై అదుపుతప్పి ఒక వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు నగరం శివారు దుగ్గిరాల సమీపంలో మంగళవారం మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా వర్షం కారణంగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కృష్ణాజిల్లా పెడనకు చెందినవాడిగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావటంతో అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఏలూరు త్రీటౌన్ ఎస్సై రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై విచారణ చేస్తున్నారు.

నల్ల అద్దాలపై నిర్లక్ష్యమేల?

- యథేచ్ఛగా తిరుగుతున్న నల్ల అద్దాల కార్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉండే ప్రమాదం
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు అమలు కాని వైనం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజానీకం

తణుకు ఎక్సైజ్ శాఖ దాడుల్లో అక్రమ మద్యం రవాణాలో పట్టుబడ్డ నల్ల అద్దాలతో ఉన్న కారు

తణుకు అర్బన్ : నల్ల అద్దాలు కలిగిన కార్లు రోడ్లపై చక్కర్లు కొడుతున్నా రవాణా శాఖ, పోలీసు అధికారులు చోద్యం చూస్తుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నల్ల అద్దాలు కలిగి ఉన్న కార్లలో అసాంఘిక కార్యకలాపాలు.. మద్యం అక్రమ రవాణా.. పిల్లల కిడ్నాప్‌లు.. సంఘ విద్రోహశక్తుల కదలికలను గుర్తించేందుకు వీలు పడదు. దీంతో ఈ తరహా అద్దాలను వాడకూడదని సుమారుగా పదేళ్ల క్రితమే ఉన్నత న్యాయస్థానం ఆదేశాలివ్వడంతో అప్పట్లో రవాణా శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కార్లకు ఉన్న నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్‌లను తొలగింపజేశారు. కానీ ఇటీవల రహదారులపై తిరుగుతున్న కార్లు, ట్యాక్సీల్లో 30 శాతంపైగా నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్ ఏర్పాటుచేసుకుని లోపల ఉన్నవారు బయటకు కనిపించకూడదనే ఉద్దేశ్యంతో హల్‌చల్ చేస్తున్నారు. మోటారు వెహికల్ యాక్ట్ 1989/100, సీఆర్‌పీసీ 188 ప్రకారం నలుపు రంగు ఫిల్మ్ వాడకూడదనే నిబంధనలు ఉన్నాయి. ఒకవేళ వేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నా బయటవారికి 70 శాతం విజిబులిటీ ఉండేలా ఏర్పాటుచేసుకోవాలని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

నల్ల అద్దాలతో యథేచ్ఛగా తిరుగుతున్న కార్లు

ప్రస్తుతం జిల్లాలో తిరుగుతున్న సుమారు లక్షన్నరకుపైగా ఉన్న కార్లలో 30 శాతం కార్లకు నల్ల అద్దాలతో తిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మద్యం అక్రమ రవాణాలో కార్లకు నూరు శాతం నల్ల రంగు అద్దాలతో కార్లు తిరుగుతున్న పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి. గతనెలలో యానాం నుంచి వస్తున్న కారులో తణుకు ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ మద్యాన్ని గుర్తించి పట్టుకున్న ఘటనలో సదరు కారుకు పూర్తిస్థాయిలో నల్ల అద్దాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం కారు తణుకు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందే సీజ్ చేయబడి ఉంది. రహదారుల్లో ప్రయాణించే కార్లలో ఉన్న వారు రోడ్డుపై ప్రయాణించే వారికి పూర్తిగా బహిర్గతం కావాలని న్యాయస్థానం ఇచ్చిన నిషేదాజ్ఞలు కొందరు కార్ల యజమానులు పట్టించుకోకుండా యథేచ్ఛగా అదే కార్లలో తిరుగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలే కాకుండా కార్లలో చిన్నారులు ఆడుకుంటూ డోర్ లాక్ అయిపోయి లోపల ఇరుక్కుని ప్రాణాలు వదలిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

జెడ్ ప్లస్‌కు ఓకే

ప్రముఖుల భద్రతా ప్రమాణాల్లో భాగంగా జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న వారికి మాత్రమే బ్లాక్ ఫిల్మ్ వినియోగించుకునే వెసులుబాటును న్యాయస్థానం కల్పించింది. చివరకు మంత్రులు, ఎంపీలు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు సైతం బ్లాక్ ఫిల్మ్‌లేని వాహనాలనే వినియోగించాలనే నిబంధనలు సైతం రవాణా శాఖ నియమావళిలో పొందుపరిచారు. తప్పనిసరి పరిస్థితుల్లో గోప్యంగా ప్రయాణం చేయాల్సి ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర హోం సెక్రటరీ ఆధ్వర్యంలో డీజీపీతోపాటు ఇతర ప్రముఖ అధికారులతో కూడిన కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తుది నిర్ణయం ఆ కమిటీలో ఉన్న వ్యక్తులపై ఆధారపడి ఉంది.

నిబంధనలు మీరితే చర్యలు తప్పవు

కార్లకు ఉండే నల్ల అద్దాల విషయంలో కారులో ఉన్న వారిని బయటనుంచి చూసేవారికి 70 శాతం కనిపించే విధంగా ఏర్పాటుచేసుకోవాలి. నిబంధనలు మీరి వంద శాతం నల్ల అద్దాలు కలిగి ఉన్న వాహనాలకు రూ. వెయ్యి జరిమానా విధించి నల్ల అద్దాలు, నల్ల ఫిల్మ్‌ను తొలగింపజేస్తాం. నిబంధనలు పాటించకుండా రహదారులపై తిరిగే కార్లపై రానున్న రోజుల్లో స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా చర్యలు తీసుకుంటాం.

– ఎస్. శ్రీనివాస్, తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్

నయనానందకరం.. జగన్నాథుని రథోత్సవం

ఏలూరులో జగన్నాథుని రథాన్ని లాగుతున్న భక్తులు

ఏలూరు నగరంలో జగన్నాథుని రథోత్సవం నయనానందకరంగా సాగింది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలు, గానాలు, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల నడుమ రథం వెంట నడిచారు. రథంపై ఊరేగిన జగన్నాథుడు, బలదేవ్, సుభద్ర మహారాణి ఉత్సవ విగ్రహాలను భక్తులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద విందు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

రథంపై ఊరేగుతున్న జగన్నాథ, బలబద్ర, సుభద్ర మహారాణి

ఐదుగురిపై వేధింపుల కేసు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. దొరసానిపాడుకు చెందిన సత్తెనపల్లి శివకృష్ణకు వసంతకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల నుంచి శివకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వేధిస్తున్నాడని, అలాగే అధిక కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, దీనికి కుటుంబసభ్యులు కూడా సహకరిస్తున్నారని బాధితురాలు వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శివకృష్ణతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

■6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005740]



GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2640]

జ్యోతిష్యాలయం

■కేరళ భగవతీ భద్రకాళి మాంత్రిక జోతిష్యం ప: వి.ఫణికర్, స్త్రీ/పు వశీకరణం, ప్రేమ పెళ్ళి, సంతానం, శత్రుబాధ, ప్రేమలో మోసపోవడం మీ ఎటువంటి కఠిన నిఘూడ వ్యక్తిగత గుప్త సమస్యలకు శాశ్వత పరిష్కారం. సెల్: 9573872341 [SCA25005839]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15944]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్దుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావ లెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీ షన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటో అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: ఆటో కనిపించడం లేదని భీమవరం టూటౌన్ 35వ వార్డుకు చెందిన పి గురునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై రహమాన్ చెప్పారు. గురునాయుడు గత నెల 3వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద పెట్టిన ఆటో మరుసటి రోజు తెల్లారేసరికి కనిపించలేదు. మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ట్రాక్టర్ ట్రక్కు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక నిర్మల ఆసుపత్రి ఎదుట సాయి శరత్‌కుమార్ ఇంజనీరింగ్ వర్క్స్ పేరున కె.వెంకటేశ్వరరావు ట్రాక్టర్ ట్రక్కులు తయారు చేయడం, మరమ్మతులు చేయడం చేస్తున్నాడు. ఆర్డర్ మేరకు కొత్త ట్రక్కు తయారు చేసి స్థానిక ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న తన స్థలంలో ట్రక్కును ఉంచాడు. అయితే గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు ఆ ట్రక్కును చోరీ చేశారని వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్తింటివారి వేధింపులపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: అత్తింటి వారి వేధింపులపై ఓ వివాహిత ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మక్కినవారిగూడేనికి చెందిన వెల్లంపల్లి సుజాతకు వెంకటరమణతో 2012లో వివాహమైంది. సుజాతకు సంతానం కలగకపోవడంతో భర్త, అత్తమామ, ఆడపడుచు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళా స్టేషన్ సీఐ యం .సుబ్బారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం పేరుతో మహిళకు బురిడీ

జంగారెడ్డిగూడెం: స్థలం తనఖా పెట్టి ఆ తరువాత విక్రయిస్తానని చెప్పి మహిళ నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడో వ్యక్తి. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న మడా పార్వతికి పట్టణానికి చెందిన ఉద్దగిరి సత్యనారాయణకు పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో 2018లో తనకున్న 250 చ.గ స్థలాన్ని సత్యనారాయణ పార్వతి వద్ద తనఖా పెట్టి రూ.20 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆ స్థలాన్ని మీకే అమ్ముతాను, దాని మార్కెట్ ధర రూ.33 లక్షలు ఉందని చెప్పగా మిగిలిన రూ.13 లక్షలు సత్యనారాయణకు పార్వతి ఇచ్చింది. అయితే స్థలం చూపకుండా 2019 నుంచి సత్యనారాయణ కాలయాపన చేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన పార్వతి రెవెన్యూ వారికి ఫిర్యాదు చేసింది. తీరా చూస్తే సదరు సర్వేలో సత్యనారాయణకు స్థలం లేదని రెవెన్యూ వారు తెలియజేయడంతో తాను మోసపోయానని గ్రహించిన పార్వతి పోలీసులను ఆశ్రయించింది.

వయ్యారిభామతో ముప్పు

- ఈ కలుపు మొక్కతో పంటకు నష్టం, జీవరాశికీ ప్రమాదమే
- పూతకు ముందే తొలగించాలి



యలమంచిలి: రైతులు తెగుళ్ల కంటే అధికంగా భయపడేది వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కకే. ఎక్కడైనా పెరగడం ఈ మొక్క లక్షణం. ఈ కలుపు మొక్క ప్రధాన పంటకు నష్టం కలిగిస్తుంది. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో మొక్క 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు గాలి పాటుకు దూర ప్రాంతాలకు సైతం తేలికగా విస్తరిస్తుంది. ఈ కలుపు మొక్క గురించి మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీమ్ తెలిపిన వివరాలు..

జీవరాశికి ప్రమాదమే

వయ్యారిభామ వల్ల పంటలకే కాదు మనుషులు, పశువులకూ ముప్పే. మనుషులకు జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులతో పాటు చర్మ సంబంధిత అలర్జీ వస్తుంది. జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పల వాపు తదితర సమస్యలు వస్తాయి. ఈ మొక్కలను తింటే పశువులు అయితే హైపర్ టెన్షన్‌కు గురవుతాయి. ఇక పంటలకు నీరు, పోషకాలు అందకుండా వాటి కన్నా ముందుగా ఇవే శోషించుకుంటాయి. తద్వారా దిగుబడులు 40 శాతం వరకు తగ్గుతాయి. వంగ, మిరప, టమాట, మొక్కజొన్న పైర్లు పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడితే ఉత్పత్తి తగ్గుతుంది. పైర్లకు మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్లు సోకే ప్రమాదముంది. ఈ మొక్కలు పశుగ్రాస పంటలకు కూడా నష్టం కలిగిస్తాయి. ఈ మొక్కల్ని నిర్మూలించాలంటే రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

యలమంచిలి మండలం గుంపర్రులో వరి పొలాల మధ్య పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలు

ఇలా తొలగించాలి

వయ్యారిభామ మొక్కలు తక్కువ సంఖ్యలో ఉంటే చేతితో పీకేయాలి. మొక్కలు పూతదశకు రాక ముందే పీకి తగలబెట్టాలి. లేకపోతే వాటి వ్యాప్తిని నివారించడం కష్టం. ఒకవేళ పూత దశకు చేరుకున్న తర్వాత మొక్కలను పీకినట్లయితే వాటిని వెంటనే కుప్పగా వేసి తగలబెట్టాలి.

రసాయనాలతో..

మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలక రాకముందు లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేస్తే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. విత్తనాలు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 2 ఎంఎల్ పేరాక్వాట్ మందును కలిపి పిచికారీ చేసుకోవచ్చు. పశుగ్రాసం వేసేవారు పైరు వేయకముందే లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేయాలి.

కంపోస్ట్ తయారీ చేయవచ్చు

వయ్యారిభామ మొక్కలు ఎంతో హానికరమైనప్పటికీ వాటిని ఉపయోగించి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఇందుకు నీరు నిలవని చోట 3 మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేలా గుంత తవ్వాలి. ఇందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కలను వేసి, వాటిపై 5 కిలోల యూరియా, 50 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కూడా చల్లాలి. ఈ విధంగా పొరలు, పొరలుగా గుంతను డోము ఆకారంలో నింపుకోవాలి. పొరల పైన పేడ, మట్టి, ఊక మిశ్రమాన్ని వేసి కప్పేయాలి. నాలుగైదు నెలల్లో కంపోస్ట్ తయారవుతుంది. దానిని జల్లెడ పట్టి పంటకు వేసుకోవాలి. ఈ కంపోస్టులో నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇలా తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని అన్ని పంటలకు వేసుకోవచ్చు.

– షేక్ అబ్దుల్ రహీమ్, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

రహదారులపై పచ్చ గడ్డి.. పిచ్చి మొక్కలు

తణుకు సజ్జాపురంలో రోడ్డును కమ్మేసిన పచ్చ గడ్డి

తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డు మార్జిన్‌లో ఏపుగా ఎదిగిన పచ్చగడ్డి

- ఏపుగా పెరుగుతున్న వైనం
- ఏ రోడ్డు చూసినా ఇదే దుస్థితి
- దోమలు, క్రిమి కీటకాలు, విషసర్పాలకు ఆవాసాలుగా
- బెంబేలెత్తుతున్న ప్రజానీకం

తణుకు అర్బన్: పొలాల్లోను, ఖాళీ స్థలాల్లోను ఏపుగా ఎదిగే పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు తణుకులో రోడ్లపైనే దర్శనమిస్తోందని నివాసితులు ఆరోపిస్తున్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లోను రోడ్డు మార్జిన్‌లలో పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోయి దోమలతో పాటు క్రిమి కీటకాలకు ఆవాసాలుగా మారాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పచ్చగడ్డి పెరిగిపోవడంతో విషసర్పాలు సైతం అటు నుంచి ఇటువైపునకు రహదారులపై ప్రయాణాలు చేస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. గతంలో లేని విధంగా చేల గట్లపై పచ్చగడ్డిని పెంచే మాదిరిగా రహదారులు, మార్జిన్‌లపై గడ్డి పెంచుతున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ విభాగ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. శానిటరీ విభాగ ఉన్నతాధికారులు ప్రజా సమస్యలపై పూర్తిగా పట్టు వదిలేశారంటూ ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్నారు.

ఎవరి ఇంటిముందు వారే బాగుచేసుకోవాలా?

పారిశుద్ధ్య విభాగ అధికారులకు చెబుతున్నా పట్టించుకోకపోవడంతో ఎవరి ఇంటి ముందు వారే కొడవలి పట్టుకుని దిగుతున్న పరిస్థితి తణుకులో కనిపిస్తోంది. రాత్రి సమయాల్లో ఎవరూ చూడడం లేదని నిర్ధారించుకుని మరీ ఇంటి ముందు మేటవేసిన పచ్చగడ్డిని తొలగించేందుకు ప్రజలు నడుం కట్టాల్సివస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, పాతవూరు, బ్యాంక్ కాలనీ, ఆంధ్ర సుగర్స్ లేఅవుట్ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అరుణాచల యాత్రను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాడమాసం గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రను యాత్రికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ (ట్రాఫిక్) ఏఆర్ఎల్ సుధారాణి వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ జూలై 8వ తేదీ మంగళవారం రాత్రి 7గంటలకు ఆర్టీసీ సూపర్‌లగ్జరీ వీడియో కోచ్ బస్సు డిపో నుంచి గిరి ప్రదక్షిణకు తరలి వెళ్తుందని తెలిపారు. 9వ తేదీ బుధవారం శ్రీకాళహస్తి, కాణిపాక విఘ్నేశ్వర స్వామి క్షేత్రం, అదే రోజు రాత్రి శ్రీపురం శ్రీమహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్, అమ్మవారి దర్శనం, 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి తెల్లవారుజామున 2 గంటలకు అరుణాచలం చేరుతుందని తెలిపారు. 11వతేదీ శుక్రవారం ఉదయం తాడేపల్లిగూడెం చేరుతుందని వెల్లడించారు. ఛార్జీ కేవలం రూ 2,600 మాత్రమే అన్నారు. అన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యంకూడా ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఫొన్ నెంబర్లు 72829 05856, 99597 53102, 99855 44411లను సంప్రదించాలని కోరారు. అదే విధంగా జూలై 6వ తేదీన తెల్లవారుజామున డిపో నుంచి అషాడం దేవి దర్శనాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఒకేరోజు 8 ప్రాంతాలలో దర్శనాలు చేసుకుని అదే రోజు సాయంత్రం తాడేపల్లిగూడెం చేరుతుందని, టిక్కెట్ కేవలం రూ.500అన్నారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వాడాలి

లబ్ధిదారునికి గుడ్డ సంచులను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వాడాలని ఉమర్ ఆలీషా పీఠం సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని గారపాటి అశోక్ ప్రారంభించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆకివీడు గ్రామానికి చెందిన దండు పద్మావతి సౌజన్యంతో 1300 గుడ్డసంచులను సమకూర్చారు. వీటిని గ్రామంలో ప్రతి కుటుంబానికి అందజేస్తున్నామని పీఠం సభ్యులు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం చేసిన నాగేంద్ర తదితరులు

తణుకు అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు అన్నారు. రాష్ట్ర భవన వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు నూకల నాగేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులు, ప్రసవ సమయాల్లో గర్భిణులకు అత్యవసర సమయంలో రక్తం అందక ప్రాణాప్రాయం ఏర్పడే పరిస్థితులను అధిగమించాలంటే ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ 6నెలలకోసారి రక్తం దానం చేయాలని సూచించారు. రక్తదానం చేసిన కార్మిక సోదరులను పేరుపేరునా అభినందించారు. నూకల నాగేంద్ర, పంది కొండయ్య, మాణిక్ రెడ్డి, బాబ్జి, నూకల శివయ్య, వంశీ, వంగా రాధాకృష్ణ, జి సుబ్బరాజు, స్వామి, జి.కృష్ణమూర్తి, నూకల సతీష్ రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని రెడ్ క్రాస్ ఇన్‌చార్జ్ సూర్య అభినందించారు.

నోడల్ ఆడిటింగ్‌పై ఆడిటర్లకు అవగాహన

మొక్కలు నాటుతున్న భీమవరం సహకార డివిజన్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్

అత్తిలి: సహకార మంత్రిత్వశాఖ ఆవిర్భావ దినోత్సవ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పాలూరు సహకార సంఘం వద్ద మంగళవారం భీమవరం సహకార డివిజన్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన తణుకు సబ్‌డివిజన్ పరిధిలోగల ఆడిటర్లకు నోడల్ ఆడిటింగ్‌పై ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ అధికారి పి వెంకటేశ్వరరావు, అఫిషియల్ పర్సన్‌ఇన్‌ఛార్జ్ ఎంఎం రెహమాన్, సీఈఓ ఎంఎన్ఎస్ రామరాజు, సబ్‌డివిజన్ పరిధిలోగల ఆడిటర్లు పాల్గొన్నారు.

శ్రీదేవి మహంకాళమ్మకు విశేష పూజలు

లక్ష పుష్పార్చన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోటలో దేవి మహంకాళమ్మ ఆలయంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం విశేష పూజలు జరిగాయి. ఈతకోట రామయ్య దంపతులచే లక్ష పుష్పార్చన, కుంకుమార్చన జరిగింది. అమ్మవారిని బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు రవి అగర్వాల్, ప్రముఖులు దర్శించుకున్నారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన

నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కళాశాలలో అవినీతి వ్యవహారాలు, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశామనే కక్షతో తమను కళాశాలలోకి రాకుండా నూలి శ్రీనివాస్ అడ్డుకున్నారని ఆరోపిస్తూ మంగళవారం కళాశాల ఎదుట ఆందోళన చేశారు. దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. తమకు రూ.4 వేలు జీతాలే ఇస్తూ రికార్డుల్లో రూ.40 వేలు చూపిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేశామన్న కక్షతో బెదిరిస్తున్నారని ఆరోపించారు.

అత్యాచారానికి పాల్పడ్డ వారిని శిక్షించాలి

తణుకులో తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందిదజేస్తున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: కలకత్తాలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ డిమాండ్‌చేశారు. మంగళవారం తహసిల్దారు కార్యాలయం వద్ద న్యాయవాదులు ధర్నా నిర్వహించి తహసిల్దారు దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ దేశంలో ఈ మధ్యకాలంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని అన్నారు. మెడికల్ విద్యార్థినిపై జరిగిన సంఘటన రూపుమాపకుండా మరో సంఘటన జరగడం విచారకరమని అన్నారు .కాలేజీల్లో మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలని దేశంలోని న్యాయవాదుల రక్షణకోసం సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్‌చేశారు. న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కొండాశ్రీనివాసరావు పుట్ల శ్రీనివాసు, చింతపల్లి నాగేశ్వరరావు, యు.పుల్లేశ్వరరావు, పిట్ట శామ్యూల్, బర్రె విక్టర్‌బాబు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రవీంద్ర,న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏమని సిద్దేశ్వర ప్రసాదు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఆశా వర్కర్లు సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల విస్తృత స్థాయి సమావేశం వై.జ్యోతి అధ్యక్షతన మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జరిగింది. ఆశా జిల్లా కార్యదర్శి ఆర్.జ్యోతి, జిల్లా ఆఫీస్ బేరర్ వై.జయంతిలు మాట్లాడుతూ ఆశా వర్కర్లుకు ప్రభుత్వ సంక్షేమ ఒప్పంద జీఓలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఆశాలకు తల్లికి వందనం, వృద్ధులకు పెన్షన్, వికాలాంగ పెన్షన్, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాలకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని, సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలకు సిద్ధమన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.లూదిఅమ్మ, దీనమ్మ, గౌరీ దేవి, వెంకటలక్ష్మి, సత్యవేణి, అర్చన, సావిత్రి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ మాసోత్సవం ప్రారంభం

తణుకు ఫైలేరియా కేంద్రంలో డెంగీ మాసోత్సవాన్ని ప్రారంభించిన దృశ్యం

తణుకు అర్బన్: జాతీయ డెంగీ మాసోత్సవాన్ని తణుకు ఫైలేరియా కంట్రోల్ యూనిట్ వద్ద మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డెంగీ మాసోత్సవ ముఖ్య ఉద్దేశ్యంగా ఈనెల అంతా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజల ఇంటి గుమ్మంలోకి వెళ్లి డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గృహ ఆవరణలో 7 రోజులపైబడి ఉన్న నీటి నిల్వలు దోమల ఉత్పత్తి స్థావరాలని. ఈ వర్షాకాలం ప్రతీరోజూ డ్రైడేగా పాటించే విధంగా ప్రజలను సంసిద్ధులను చేయడమే ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా దోమ పుట్టుకను అరికట్టే ఖర్చు రహిత విధానమే ×ఫ్రైడే డ్రైడేఅని అయితే ఈ వర్షాకాలం నుంచి ప్రతీ రోజూ డ్రైడేగా పాటించడం తప్పనిసరి అని అన్నారు. వార్డు, విలేజ్ హెల్త్ సెక్రెటరీలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీల పర్యవేక్షక యంత్రాంగం గృహదర్శనాల ద్వారా ప్రజలు డెంగీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కాగిత సత్యనారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, వార్డు ఎన్విరాన్మెంట్ శానిటేషన్ సెక్రెటరీలు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి పరిశీలన

ఆకివీడు: ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ సరిహద్దులో ఉన్న 4.75 సెంట్ల ప్రభుత్వ భూమిని 22ఏ రికార్డుల నుండి తొలగించాలని గ్రామానికి చెందిన బండారు సత్యనారాయణ, సూర్యనారాయణలు చేసుకున్న దరఖాస్తు ఆధారంగా ఆ భూమిని ఆర్డీఓ పరిశీలించారురు. ప్రస్తుతం దీనిలో చేపల చెరువు సాగు చేస్తున్నారని తహసీల్దార్ వెంకటేశ్వరరావు వివరించారు. ఆర్డీఓ నివేదిక అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలన చేపడతారని తహసీల్దార్ వివరించారు. ఆర్డీఓ వెంట ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ ఉన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి

అత్తిలి: స్థానిక బాలికల జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థినీలతో కొంత సమయం ముచ్చటించారు, ఎలా చదువుతున్నారు, ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా, స్కూలు ఆవరణ ఎలా ఉంటుంది మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పథకం ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటుందా అని పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కూడా మన మాతృభాషతో పాటు నేషనల్ భాష అయిన హిందీ కూడా నేర్చుకోవాలని, భవిష్యత్తులో ఉపయోగమని అన్నారు. ప్రతిరోజు ఐదు హిందీ పదాలను క్రమం తప్పకుండా పిల్లలకు నేర్పాలని హిందీ టీచర్‌కి సూచించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా తయారు చేసే వంటకాలను పరిశీలించారు. వంటగది పరిసరాలను ఎప్పుడు పరి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మెనూ ప్రకారం వంటలను శుభ్రంగా చేయాలని, పిల్లలు తినే ఆహారంలో ఎటువంటి పొరపాట్లు జరిగినా ఉపేక్షించేది లేదని ఎండీఎం వర్కర్లను ఆదేశించారు. సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని పరిశీలించి స్వయంగా పిల్లలకు వడ్డించారు. స్కూలు ఆవరణ అంతా క్లీన్ అండ్ గ్రీన్‌గా ఆహ్లాదంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశిక వంశీ, ఎంఈఓ 1 ఎన్ రమేష్, ఎంఈఓ 2 కె. ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని జి.విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు శునకాలకు ఉచిత రేబిస్ టీకా

తణుకు అర్బన్: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6వ తేదీన పెంపుడు శునకాలకు ఉచిత యాంటీ రేబిస్ టీకా ఇవ్వబడుతుందని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.ప్రసాద్ తెలిపారు. అదేరోజు జునోసిస్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టీకా అందుబాటులో ఉంటుందని వివరించారు. కావున తణుకు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో పెంపుడు శునకాల యజమానులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

మాట్లాడుతున్న దళితసేన సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని దళిత సేన డిమాండ్ చేసింది. పట్టణంలో మంగళవారం దళిత సేన ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పోరేట్ శక్తులు విద్యను వ్యాపారంగా మార్చుకొని బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వద్ద నుంచి లక్షలాది రూపాయిలు ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దళితసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దిరుసు పాముల పుష్ప, కిలాడి రవి, గడ్డం సుందర్రావు, మర్లపూడి శ్రీనివాసరావు, కన్నెపో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లులేని నిరుపేదలను గుర్తించాలి

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ

అత్తిలి: ప్రభుత్వ ఇళ్ల స్థలాలు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం అత్తిలి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అత్తిలి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామంలో నూతనంగా ఇంటి స్థలం కొరకు దరఖాస్తు పెట్టుకున్న వారి ఇండ్లకు క్షేత్రస్థాయిలో వెళ్లి ఆయన పరిశీలించారు. అర్హులైన వారిని ఏ విధముగా విచారణ చేయాలి తదితర విషయాలను గ్రామ రెవిన్యూ అధికారులకి సూచించారు. అత్తిలి గ్రామంలో 450 మంది ఇల్లు లేవని దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని తహసీల్దార్ వంశీ జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వివరించారు.దరఖాస్తు చేసుకున్న ప్రతి వారిని విచారించి ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన వారిని గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రెవెన్యూ అధికారులు ఆదేశించారు. అనంతరం కె.ఎస్. గట్టుపాలెంలో రేషన్ షాపు ను సందర్శించి గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు అయినవారికి ఏ విధముగా ఇంటికి తీసుకెళ్లి రేషన్ సరుకులు అందజేస్తున్నారు వివరాలని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఖచ్చితమైన తూకముతో వృద్ధులు, వికలాంగులకు ఇంటికి తీసుకుని వెళ్లి నిత్యవసర సరుకులను అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రేషన్ షాపు డీలర్లను ఆదేశించారు. ఆయన వెంట తహసిల్దార్ వంశి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆరవల్లి ఘటనను వక్రీకరించవద్దు

మాట్లాడుతున్న మాలసమైఖ్య ప్రతినిధులు

అత్తిలి: మండలంలో ఆరవల్లి గ్రామంలో జరిగిన మాల వర్గాలపై దాడిని వక్రీకరిస్తూ సోషల్ మీడియా వేదికగా అబ్బుదాసరి లాజర్ చేసిన ఆరోపణలపై అత్తిలి మండలం మాల సమైఖ్యత ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. అబ్బుదాసరి లాజర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జాతి ప్రయోజనాల కోసం తమ తమ వర్గాలకు అండగా నిలవడంలో తప్పులేదని, కాని ఘోరంగా హత్యాప్రయత్నం చేసిన నింధితులకు కొమ్ము కాసే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. అక్కడ జరిగిన వాస్తవాలను గ్రహించాలని కోరారు. ఇటువంటి వీడియోలుచేసి ఘటనను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయొద్దని కోరారు. నిజంగా దళిత జాతి పట్ల మీకు ప్రేమ ఉంటే ఒకసారైనా బాధితులను పరామర్శించి వారికి తగిలిన గాయాలను చూసి, వారు ఎంతటి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారో, చావుబతుకుల మధ్య ఏ విధంగా కొట్టుమిట్టాడుతున్నారో తెలుసుకోవాలన్నారు. మీరు ఇటువంటి వీడియోలు చేసి ఘటనను తప్పుదోవ పట్టించాలని చూస్తే మేం కూడా ఇదే స్థాయిలో తీవ్రంగా ప్రతిఘటిస్తాం అని ఈ సందర్భంగా హెచ్చరించారు. మండల మాల సమైక్య నాయకులు పొనుగు వినయ్, బట్టు నాగరాజు, బుడితి సుజన్ కుమార్, బుంగా ఇమ్మానియేలు, కోరుకొల్లు వెంకట్రావు, రాపాక నాని,ఈదూరి రాంబాబు, సబ్బితి రాజేష్, కొల్లి చిన్ని, వరిఘేటి చంద్రరావు, ఇల్లూరి సంపదరావు, దాసు, బుంగా పద్మారావు, కోట సూరిబాబు, కుసుమే రాజు,ఉడుమూడి ప్రసాద్, గుడిసే సూరిబాబు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు

తణుకులో సీనియర్ వైద్యులను సత్కరించిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: వైద్యులు ప్రత్యక్ష దైవస్వరూపాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి అన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా తణుకు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలు పోసిన వారు భగవంతుడైతే ఆ ప్రాణాన్ని నూరేళ్లపాటు నిలబెట్టే వైద్యులని దైవంగా భావించాలని సూచించారు. అనంతరం సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ వైద్యులు డాక్టర్ జె.ప్రభాకర రావు, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య, డాక్టర్ ఎం.రాజేందర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి స్వాలిహా, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు శనివారపు చలపతిరావు, ఎం.భారతీ రాధాకృష్ణ, వి.పార్వతి, ఎన్.కృష్ణానందం , ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, అక్కిన బాపినీడు, అక్కిన కాశీ, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తరబడి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వృద్ధులకు వైద్యసేవలందిస్తున్న సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబును ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, ఇవటూరి సాయి, చేబ్రోలు సాధు, కె.రామకృష్ణ, చింతాడ పద్మ, గోపాలకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. బీసీ రాయ్ సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. హోమియోవైద్యులు జోగీబాబు, ఆయుర్వేద వైద్యులు యూ.శాంతి స్వరూప్, వైద్యులు చిట్యాల సురేంద్ర, చిట్యాల పద్మిని, కంచర్ల సాయి పృధ్వి, సురేఖ, నూకల దుర్గ, కమల, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావులను సత్కరించారు. అధ్యక్షుడు జి.రాజేంద్ర కుమార్, మిరియాల కిశోర్, యర్ర ఆంజనేయస్వామి, యెగ్గిన శరత్‌బాబు, బురిడీ సతీష్, పాండురంగారావు, వెంకటచలం, రామకృష్ణలు పాల్గొన్నారు.

వాసవి క్లబ్‌చే డాక్టర్స్‌డే

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డేను, చార్టెడ్ అకౌంటెంట్ డేను నిర్వహించారు. 25 మంది వైద్యులకు సన్మానం గావించారు. డాక్టర్లు కీర్తి, రవిపాల్, రమ్య, స్వర్ణలత, పీటర్, కృష్ణ, ఛార్టెడ్ అకౌంట్స్ నారాయణ వెంకట రమణరావు, చిన్నం ఫణీంద్ర, మానేపల్లి రవి కిరణ్, మాటూరు పంచాక్షరి, కేతల మణికంఠ, నారాయణ రాజాలను సత్కరించారు. వాసవి క్లబ్ తరుపున జ్ఞాపికలు అందజేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు పసుపర్తి, అనిల్, కార్యదర్శి మండ పవన్, కోశాధికారి శ్రీధర్ గుప్తా, సీమకుర్తి రాజశేఖర్ గుప్తాలు, నున్న సుందరం పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం తణుకు
90102 23729
90100 68395
90100 51493
Office mail : tpgadvt@gmail.com



ప్రేమ చిగురించిన చోటే..

ఆ రెండు మనసులను పనిచేసే ప్రాంతమే ప్రేమను చిగురించేలా చేసింది. పెళ్లిపీటల దాకా తీసుకెళ్లింది. కానీ ఇంతలోనే మృత్యువు ఆ ఇద్దరినీ పలకరించింది. - 8లో



ముందుంది శ్రావణం..

గండి వీరాంజనేయ స్వామి ఆలయం అంటే రాయలసీమ జిల్లాల్లో తెలియని వారంటూ ఉండరు. మరీ ముఖ్యంగా శ్రావణ మాసం అంటే గుర్తుకు వచ్చేది కూడా గండిక్షేత్రమే. - 8లో

గరిష్టం/కనిష్టం
34.0 /28.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 28.4 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 19.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

నేటి నుంచి టోల్ ఫీజు

మంగపట్నం వద్ద ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజా

ముద్దనూరు : నూతనంగా నిర్మాణం పూర్తయిన ముద్దనూరు–తాడిపత్రి 4లేన్ల జాతీయ రహదారిలో బుధవారం నుంచి టోల్‌ప్లాజా ప్రారంభించి టోల్ ఫీజు వసూలు చేయనున్నారు. మండలంలోని మంగపట్నం గ్రామ సమీపంలో ఈ టోల్‌ప్లాజా నెలకొల్పారు. ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు సుమారు 55 కి.మీ. రహదారిని 4లేన్ల రహదారిగా నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ రహదారి పనులకు కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు,నిధులు మంజూరయ్యాయి. అనంతరం పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇటీవలే రహదారి నిర్మాణం పూర్తవడంతో నేటినుంచి వాహనాలకు టోల్‌ఫీజు కూడా వసూలు చేయనున్నారు. తాడిపత్రి,అనంతపురం,గుత్తి,బళ్లారి తదితర ముఖ్య ప్రాంతాలకు ప్రయాణించే వాహనాలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది.

జలాశయాల్లో చేపల వేట నిషేధం

గండికోట జలాశయం

కొండాపురం : జిల్లాలోని గండికోట జలాశయం, బ్రహ్మసాగర్, సోమశిల వెనుక జలాలలో చేపల వేట నిషేధించినట్లు ఉప మత్స్యసంచాలకులు నాగయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజంగా చేపల సంతానోత్పత్తి జూలై 1 నుంచి ఆగస్టు31 వ తేది వరకు ఉంటుందని.. ఈ 62 రోజులపాటు మత్స్యకారులు ఎవరు చేపలు పట్టకూడదని ఆయన హెచ్చరించారు. చేపల వేటకు పోతే ప్రభుత్వ నియమ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జలాశయాలల్లో వేటకు వెళ్లితే మత్స్యకారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి కృషి

– మత్స్యశాఖ నూతన డీడీ నాగయ్య

మత్స్యశాఖ డీడీకి అభినందనలు తెలుపుతున్న మత్స్య సంఘం సభ్యుడు శ్రీనివాసులు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్(ఎఫ్‌ఏసీ) నాగయ్య పేర్కొన్నారు. జిల్లా మత్యశాఖ డీడీ గా నాగయ్య మంగళవారం కడప మత్స్యశాఖ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. నాగయ్యకు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

5న మెగా జాబ్‌మేళా

బద్వేలు అర్బన్ : స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5న సియట్ కంపెనీ ద్వారా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ సాయిక్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీసీఏలలో 2022, 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 8297160304, 9703244614 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా విద్యార్థి విభాగ కమిటీని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా సి. సాయి నారాయణరెడ్డి(బద్వేల్), బి. శ్రీకాంత్‌రెడ్డి(జమ్మలమడుగు), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కేసీ పాములేటి(జమ్మలమడుగు, ఆర్. మహేష్(కమలాపురం), శ్యామ్ మంచాల (కడప), నరేంద్రారెడ్డి (ప్రొద్దుటూరు), రాయు డు (మైదుకూరు), జిల్లా కార్యదర్శులుగా టి.మధుసూదన్‌రెడ్డి(మైదుకూరు), చైతన్య (ప్రొద్దుటూరు), పవన్‌కుమార్‌రెడ్డి(పులివెందుల), అబ్దుల్ ఖాదర్ (జమ్మలమడుగు), ఎన్. జయరామిరెడ్డి(కమలాపురం),రాకేష్(బద్వేల్), మహ్మద్ సొహైల్ (కడప)ను నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి. ధీరజ్ గణేష్, ఎస్. లెన్నీ, వి. కార్తిక్ (కడప), విజయ్‌భాస్కర్‌రెడ్డి, కె. శ్రీనివాసులురెడ్డి(కమలాపురం), కె. శివప్రసన్న కుమార్, జి. నారారయణరెడ్డి, కె. రవీంద్రారెడ్డి(బద్వేల్), వి. ఆదిత్యనాథ్‌రెడ్డి, ఎస్. అఖిల్(ప్రొద్దుటూరు), షేక్ మహ్మద్, ప్రకాష్ వేముల(పులివెందుల), భరత్‌కుమార్‌రెడ్డి, షేక్ ఖలీల్‌బాషా (జమ్మలమడుగు), నరసింహారెడ్డి, వై. చైతన్యరెడ్డి(మైదుకూరు)లను నియమించారు.

కాంట్రాక్టర్లపై పచ్చవిషం!

- పులివెందుల కాంట్రాక్టర్లపై పగబట్టిన ప్రభుత్వ పెద్దలు
- బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్లు
- విచారణల పేరిట కోర్టు ఉత్తర్వులు వెలువడకుండా అడ్డుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప : ప్రభుత్వ పెద్దలు కక్ష రాజకీయాలకు తెరతీశారు. ముఖ్యంగా పులివెందుల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారు. 'డబ్బులు వెచ్చించి కాంట్రాక్టు పనులు పూర్తి చేశాం.. బిల్లులు చెల్లించాలని..' ఏడాదిగా అడిగి..అడిగి అలసిపోయిన కాంట్రాక్టర్లు ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆ కేసులు జడ్జిమెంట్ దశకు చేరకున్నాయి. ఈ దశలో ఇంకొంత కాలం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడానికి ప్రభుత్వం మరో కొత్త ఎత్తుగడ వేసింది. టెండర్ వ్యాల్యూయేషన్ ఫర్ విజిలెన్సు అంటూ మరోమారు విచారణకు ఆదేశించింది.

పులివెందులలోని పాడా పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లను సీఎం చంద్రబాబు సర్కార్ వేధిస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టర్లను మానసికంగా, ఆర్థికంగా ఉద్దేశ్యపూర్వకంగా వేధింపు చర్యలు తెరపైకి వస్తున్నాయి. పూర్తి చేసిన పనులకు బడ్జెట్ కేటాయించకుండా, సీఎఫ్ఎంఎస్‌లో ఉన్నటువంటి బిల్లులను క్లియర్ చేయకుండా ప్రభుత్వ పెద్దలు వేధిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పులివెందులలో పనులు చేసిన కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. త్వరలో జడ్జిమెంటు ఉంటుందనుకున్న దశలో ప్రభుత్వం చేసిన పనులపై తొలుత విజిలెన్స్ ఫర్ క్వాలిటీకి ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు తీసుకున్న కోర్ శ్యాంపిల్స్‌ను (సహజంగా జిల్లా కేంద్రాల్లోని ల్యాబ్‌లో పరీక్ష చేయాలి, కానీ కూటమి ప్రభుత్వం ఒత్తిడి వల్ల) విజయవాడకు తీసుకెళ్లి పరీక్ష చేయించారు. అన్ని శ్యాంపిల్స్ (98 శాతం మెరిట్) పాస్ అయ్యాయి. నివేదికలు హైకోర్టుకు చేరితే ఇక బిల్లుల చెల్లింపులే తరువాయి అనుకున్న తరుణంలో జాప్యం కోసం కూటమి ప్రభుత్వం మరో కొత్త ఎత్తుగడ ఎంచుకుంది.

విజిలెన్సు ఫర్ టెండర్ వ్యాల్యూయేషన్

భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పూర్తి అయిన పనులకు టెండర్ వ్యాల్యూయేషన్‌పై విజిలెన్సు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సహజంగా టెండర్ వ్యాల్యూయేషన్ కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసిన తర్వాత ఎల్–1 ప్రకటించకముందే చేపట్టాలి. ఆయా ఇంజినీరింగ్ అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత ఎల్–1, ఎల్–2 ప్రకటిస్తారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లతో అగ్రిమెంటు చేయించి పనులు కొనసాగిస్తారు. అగ్రిమెంటు విధివిధానాల ప్రకారం సంబంధిత పనిని పూర్తి చేసిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ జత చేసి ఆ పనికి బిల్లు చెల్లించాల్సిందిగా ఆర్థికశాఖకు పంపనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యాక కూడా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా వేధిస్తోందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టులో కేసులు జడ్జిమెంటు దశకు చేరుకున్న తరుణంలో అడ్డుకునే ప్రక్రియను చేపడుతున్నారని వారు వాపోతున్నారు.

అవే పనులను కొనసాగిస్తున్న టీడీపీ నేతలు

పులివెందుల పరిధిలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్‌శాఖల పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పెండింగ్ పనులను ప్రస్తుతం తెలుగుతమ్ముళ్లు చేపడుతున్నారు. ఓవైపు బిల్లుల చెల్లింపునకు జాప్యం చేస్తూనే, టెండర్ వ్యాల్యూయేషన్ ఫర్ విజిలెన్సు, క్వాలిటీ ఫర్ విజిలెన్సు అంటూ ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వ పెద్దలు అవే పెండింగ్ పనులను కొనసాగించడం గమనార్హం. తెలుగుతమ్ముళ్లు ఆయా పెండింగ్ పనులు చేపడుతున్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులం, మతం, ప్రాంతం చూడకుండా.. రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించింది. అంతెందుకు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రయోజనాలకు సైతం ఎలాంటి ఆటంకాలు లేకుండా నిధులు కేటాయించింది. కాగా కూటమి సర్కార్ పులివెందులలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధిస్తుండటం, హైకోర్టు ఉత్తర్వులు సైతం జాప్యం అయ్యేలా అడ్డుకుంటూ మైండ్‌గేమ్ ఆడుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

కల.. నిజమైన వేళ!

వారంతా శ్రమజీవుల బిడ్డలు. తల్లిదండ్రుల కష్టాలు కళ్లారా చూశారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని.. కన్న వారి కలలను నిజం చేయాలని కలగన్నారు. కష్టపడి చదివారు.. వారి కష్టానికి ఫలితం దక్కింది. మహానేత వైఎస్సార్ స్థాపించిన ట్రిపుల్ ఐటీలో సీటు దక్కింది. స్వప్నం సాకారమైన వేళ.. వారి కళ్ల నిండా సంతోషం కనిపించింది. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది.

- ట్రిపుల్ ఐటీలో ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ
- మొత్తం 878 మంది అడ్మిషన్లు పొందిన విద్యార్థులు

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాయలం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమ, మంగళవారాల్లో విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకడమిక్ రమేష్ కైలాస్ ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

- రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా 1010 సీట్లకు సంబంధించి అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా.. 878 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. త్వరలో రెండో జాబితా విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. జూలై 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ తెలిపారు.

అడ్మిషన్ల ప్రక్రియలో అధికారులు, విద్యార్థులు

వైఎస్సార్‌ను స్మరించుకున్న విద్యార్థులు

రాష్ట్ర నలుమూలల నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వచ్చారు. ఈ నేపథ్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని వారు స్మరించుకున్నారు. ఆయన ఈ ట్రిపుల్ఐటీలను స్థాపించడం వల్లే తమ లాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అవకాశం వచ్చిందన్నారు. ఆయనను ఎన్నటికీ మరువలేమన్నారు. భావిభారత ఇంజినీర్లుగా దేశానికి సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతామని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తెలిపారు.

కూలి పనులు చేసుకుంటూ చదివించారు..

నా తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. కర్నూలు జిల్లా దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 593 మార్కులు సాధించాను. ఐఏఎస్ కావాలని నా లక్ష్యం. ట్రిపుల్ ఐటీలో ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేస్తాను.

– బి.మహేశ్వరి(అడ్మిషన్ పొందిన విద్యార్థిని), అలారుదిన్నె, కర్నూలు

ట్రిపుల్ ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను

ట్రిపుల్ ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను. వ్యవసాయ కుటుంబంలో ఉంటూ తల్లిదండ్రులు గోవర్ధన్, లక్ష్మీదేవి నన్ను ఎంతో ప్రోత్సహించారు. రైల్వే కోడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 589 మార్కులు సాధించాను. మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

– జి.యశ్వంత్ రెడ్డి(అడ్మిషన్ పొందిన విద్యార్థి), రైల్వేకోడూరు అన్నమయ్య

సివిల్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం

ట్రిపుల్ ఐటీలో రాణించి సివిల్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం. నాది నెల్లూరు జిల్లా పొదపలూరు గ్రామం. తల్లిదండ్రులు సూర్యనారాయణ, కుళ్లాయమ్మలు కూలీ పనులు చేస్తారు. పొదపలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో 10వ తరగతి చదివి 580 మార్కులు సాధించాను.

– బి.గణేష్ నాయక్(అడ్మిషన్ పొందిన విద్యార్థి), పొదపలూరు, నెల్లూరు

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తా

ప్రకాశం జిల్లా దోర్నాల గ్రామంలో ఉన్నత పాఠశాలలో చదివిన నేను 574 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చాను. ట్రిపుల్ ఐటీలో వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ ప్రతిభను కనబరుస్తాను. తల్లిదండ్రులు యాసిఫ్, అమీనా వ్యవసాయం చేస్తారు.

– షేక్.మాబున్నీ(అడ్మిషన్ పొందిన విద్యార్థిని), దోర్నాల, ప్రకాశం జిల్లా

'గురుకులం' పనులు పూర్తి చేయండి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో వెనుకబడిన తరగతుల పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో ఏర్పాటవుతున్న మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయం త్వరలో నిర్వహణలోకి రానుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు సంబంధిత అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని త్వరలో నూతన భవనంలో మారుస్తామని వెల్లడించారు. రెండు నెలల్లో గురుకులంలో ఎలాంటి మౌళిక సదుపాయాల కొరత లేకుండా రోడ్లు, విద్యుత్, నీటి పైప్ లైన్, గ్రీనరీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చాలన్నారు. ఆర్ అండ్ బీ ఈఈ మాధవి, డీఈ జగదీశ్వర్ రెడ్డి, డీఈఓ షంషుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపీసీ ఎ.నిత్యానందరాజులు, కాంట్రాక్టు ఏజెన్సీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రభుత్వ స్థలంపై కన్నేశారు !

- రూ. 10 కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు యత్నం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

వల్లూరు (చెన్నూరు) : ఖాళీ జాగా కనిపిస్తే చాలు పచ్చ నేతలు వాలిపోతున్నారు. వేలు.. లక్షలు కాదు కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. అధికారం అండ చూసుకుంటూ.. అధికారుల తీరును ఆసరాగా మార్చుకుంటూ కబ్జా పర్వం సాగిస్తున్నారు. ఇదిగో ఈ చిత్రంలో కనిపిస్తున్న స్థలం చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె గ్రామ పొలంలో శాటిలైట్ సిటీ సమీపంలో ఉంది. సర్వే నెంబర్ 405/2-68 సెంట్లు, 406/1- 47 సెంట్లు,406/2-2.07 రెండు ఎకరాల ఏడు సెంట్లు, 406/3-11 సెంట్లు వెరసి మొత్తం 3.33 ఎకరాలను ఆక్రమించేందుకు భూబకాసురులు పథక రచన చేశారు. సర్వే నెంబర్ 405 లో 70 సెంట్ల స్థలం కబ్జా విషయమై గత జూన్ 15న 'సాక్షి'పత్రికలో పతాక శీర్షికన కథనం రావడంతో వెనక్కి తగ్గిన కబ్జాకోరులు ప్రస్తుతం 1 బి అడంగల్ లో 3.33 ప్రభుత్వ భూమిగా కనబడుతున్న దానిని ఆక్రమించేందుకు మళ్లీ పనులు మొదలు పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నమాచుపల్లి గ్రామ పొలం ప్రాంతంలో భారీగా వెంచర్లు వెలిసి ఉండడంతో, అక్కడి భూములకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. ఈ విషయాన్ని కూటమి నేతలు తమకు అనుగుణంగా మార్చుకొని ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమి ఆక్రమణదారుల పాలు కాకుండా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆక్రమించేందుకు యత్నిస్తున్న ప్రభుత్వ భూమి ఇదే!

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES-KADAPA
(AUTONOMOUS)
(Approved by AICTE & Affiliated to SBTET, Vijayawada)
Accredited by NBA (B.Tech- EEE, ECE & CSE) & NAAC 'A' Grade
Utukur (P), C.K. Dinne (V & M), Kadapa Y.S.R. Dist.,A.P.
Web : www.aitskadapa.ac.in

AP POLYCET COUNSELING CODE: AITK

Diploma (Polytechnic) Courses Offered :
- Electrical and Electronics Engineering (EEE)
- Electronics and Communication Engineering(ECE)
- Computer Engineering (CME)

Transport facility is available from Kadapa Town, Vontimitta, Rayachoti and Mydukur.
You Can avail free help desk at our campus for web options.
For Details Contact :
9603999591, 8801236667, 7386324079

రాష్ట్రంలో విధ్వంసకర పాలన

కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని, అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేశారని కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతలచెరువు పంచాయతీ బయనపల్లె గ్రామంలో ఇటీవల కూటమి నేతల ఒత్తిడితో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేసిన శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చివేశారని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందనేదానికి ఈ సంఘటనే నిదర్శనమని అన్నారు. అన్యాయంగా ఇంటిని కూల్చివేసి తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. గుడికి, బడికి 50 మీటర్ల దూరంలోనే మద్యంషాపు ఉండడం అసాంఘికమని..అటువంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. సుమారు 8 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటిని నిర్మించుకుంటే అప్పుడు చెరువు స్థలమని కనిపించలేదా అని ప్రశ్నించారు. అలాగే కూల్చివేసిన ఇంటి పక్కనే అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు కూడా ఏర్పాటు చేశారని.. అప్పుడు చెరువు స్థలమని ఈ ప్రభుత్వానికి తెలియదా అని అన్నారు. శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసానిఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, జెడ్పీటీసీ పోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ, ఆయా మండలాల అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, సగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, యద్దారెడ్డి పాల్గొన్నారు.

కూల్చివేసిన శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి

రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

రైతు కుటుంబానికి ఎంపీ పరామర్శ

ఖాజీపేట : కూటమి పాలనలో రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. బి. కొత్తపల్లె పంచాయతీ బక్కాయపల్లె గ్రామానికి చెందిన యువ రైతు పత్తి రామచంద్రారెడ్డి (42) మార్చి 19 న తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య హత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మంగళవారం రోజున బక్కాయపల్లె గ్రామానికి వచ్చి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సరైన దిగుబడి రాక పోవడం, దిగుబడి వచ్చిన సందర్భంలో గిట్టు బాటు ధర లేక నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పత్తి రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ మాజీ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ జోన్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ANNAMACHARYA UNIVERSITY
RAJAMPET, Annamayya District, AP - 516126, India
www.annamacharyauniversity.edu.in
'A' Grade NAAC | NBA FIVE UG PROGRAMMES ACCREDITED | THREE UG PROGRAMMES ACCREDITED | 8th RANK THE WEEK | COUNSELLING CODE AITSPU

COURSES OFFERED: B.Tech | M.Tech | MBA | MCA | B.Sc. (Hons.) Agriculture | B.Sc. AT & OT | B.Sc. Medical Lab Technology | Bachelor of Physiotherapy | B.Sc. (CS, P&DS, AI&DA, AI&ML) | M.Sc (Maths, Physics & Chemistry) | M.A in English | L.L.B. | Ph.D. in all disciplines | B.B.A

PLACEMENT STATISTICS FOR THE AY 2024-25
918 STUDENTS PLACED | ₹30 LPA RECORD PACKAGE | 40+ COMPANIES VISITED | ₹5 LPA AVERAGE SALARY | 2K+ INTERNSHIPS

SOME OF OUR RECRUITERS: Tech Mahindra, tcs, Cognizant, Infosys, Mphasis, ITC Infotech, accenture, wipro

AUET 2025
ANNAMACHARYA UNIVERSITY ENTRANCE TEST for ADMISSION/SCHOLARSHIP
6th July
APPLY NOW

MoU with Foreign Universities: RWTH AACHEN UNIVERSITY, WISCONSIN

ANNAMACHARYA INSTITUTE OF TECHNOLOGY & SCIENCES (AUTONOMOUS)
TIRUPATHI (AITT) | KADAPA (AITK) | HYDERABAD (AITH)

For Admissions: +91 9848998641, 9154147257 Follow us: /Annamacharya Group

క్లుప్తంగా

10న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం జులై 9, 10 తేదీలలో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో లైసెన్సులు జారీ చేసే గండికోట జలాశయం, బ్రహ్మంసాగర్ జలాశయం, సోమశిల వెనక జలాల్లో చేపల సంతానోత్పత్తి కాలమైన జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటకు విరామం పాటించాలని ఉప మత్స్య సంచాలకుడు నాగయ్య తెలిపారు. ఈ సమయంలో ఎవరైనా చేపల వేట కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అవినీతి డీలర్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కర్ణంవారిపల్లె రేషన్ డీలర్ బత్తుల భద్రయ్య పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతుండటంతో కర్నూలులోని లోకాయుక్తలో అదే గ్రామానికి చెందిన మోపూరి మల్లికార్జున సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణంవారి పల్లె గ్రామంలో చౌకదుకాణం నంబర్ 6వ షాప్‌ను డీలర్ బత్తుల భద్రయ్య నిర్వహిస్తున్నాడని తెలిపారు. చనిపోయిన వారు, గ్రామంలో లేని వారు, ఆర్మీలో ఉన్న వారి రేషన్‌ను డీలర్ స్వాహా చేస్తుండటంపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. అతను 15 ఏళ్లుగా డీలర్‌గా ఉంటూ అనేక అవినీతి, అక్రమాలకు చేస్తున్నాడని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి డీలర్ భద్రయ్యపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెల గ్రామంలో మాగిపోగు శౌరికి చెందిన గేదె మంగళవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పొలాల్లోకి మేతకు వెళ్లిన గేదె రైతు రామచంద్రారెడ్డి పొలంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురైంది. గేదె విలువ రూ. 90 వేలు అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేనందువల్లే ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు.

ముందుంది శ్రావణం.. ఏదీ స్వామి దర్శనం.!

- గండి ఆలయ పునః ప్రతిష్ఠపై వీడని ఉత్కంఠ
- నాలుగేళ్లుగా నిరాశలో లక్షలాది మంది భక్తులు
- ఈ ఏడాదీ అదే పరిస్థితి

గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్

95శాతం పనులు పూర్తయిన గండి ఆలయం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి ఆలయం అంటే రాయలసీమ జిల్లాల్లో తెలియని వారంటూ ఉండరు. మరీ ముఖ్యంగా శ్రావణ మాసం అంటే గుర్తుకు వచ్చేది కూడా గండిక్షేత్రమే. లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలి వస్తారు. అయితే గండి వీరాంజనేయుడి మూలవిరాట్ దర్శనం కోసం గత నాలుగేళ్ల నుంచి ఎదురు చూసిన భక్త జనానికి ఈ ఏడాది కూడా నిరాశే ఎదురవుతోంది. ఇందుకు కారణాలు చూస్తే కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆలయం పట్ల కొందరి నిర్లక్ష్యం. మరి కొందరి పంతాలు పట్టింపులు. ఇంకొందరి అసమర్థత ఇందులో బలంగా కనిపిస్తున్నాయి.

గండి వీరాంజనేయ స్వామి దేవస్థానాన్ని 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక టీటీడీలో విలీనం చేసి కొంత వరకు అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఏకంగా రు.28 కోట్లు నిధులు మంజూరు చేసి చరిత్రను తిరగ రాశారు. ముఖ్యమంత్రి హోదాలో తొలి శిలాఫలకం వేశారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే తొలుత పనులు వేగవంతంగా జరిగినా క్రమేపీ మందకొడిగా సాగాయి. నేతలు, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పుణ్య కాలం కాస్తా పూర్తయింది. ఆలయం పనులు పూర్తవలేదు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి.తిరిగి ప్రభుత్వం అధికారం లోకి రాలేదు. ఆలయం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయం పనులు జోరందుకుంటాయని భక్తులు భావించారు. కాని ఇందుకు విరుద్ధంగా గత ప్రభుత్వంలోని పాలక మండలిని రద్దు చేయించి, తాము సీట్లో కూర్చోవాలి తర్వాతనే గుడి పునః ప్రతిష్ఠ పనులు అనే ధోరణితో కూటమి నేతలు ఉన్నట్లు తెలుసుకొని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహా కుంభాభిషేకం జరగాలంటే సుమారు రూ. 5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఖర్చు వస్తుంది. పెండింగ్ పనులు పూర్తి కావాలంటే మరో ఏడాది కాలం పడుతుంది. అంతవరకు కుంభాభిషేకం చేయకూడదని కొందరు చెబుతున్నారు. ఆ నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలనే ఆలోచన ఏ ఒక్క కూటమి నేత చేయకపోవడం విచారకరం.

పునః ప్రతిష్ఠ చేస్తే సరిపోతుంది కదా..

ఆలయం పనులు పూర్తయ్యాకే మహా కుంభాభిషేకం అంటున్నారు. ఇందుకు పనులు పూర్తి కాలేదు అంటున్నారు. అయితే నిత్యం ధూప దీప నైవేద్యాలు మూల విరాట్‌కు అర్చకులు క్రమం తప్పక నిర్వహిస్తున్నారు. ఇన్ని చేసేవారు భక్తులకు స్వామి దర్శనం కూడా చేయించవచ్చు కదా అని చర్చించుకుంటున్నారు. పునః ప్రతిష్ఠ చేసేందుకు చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి మహా అంటే వారం పది రోజుల్లో పూర్తవుతాయి. పైగా నిధుల ఖర్చు కూడా తగ్గుతుంది. భక్తులకు మూల విరాట్ దర్శనం చేయించిన వారు అవుతారు. దీనివల్ల ఆలయ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. ఈ కోణంలో అధికారులు ఎందుకు ఆలోచించడం లేదనే ప్రశ్న భక్తుల నుంచి వినిపిస్తోంది.

పంతాలు పట్టింపులతో సరి..

ఆలయంలో 95 శాతం పైగా పనులు పూర్తయ్యాయని జూన్ నెలాఖరులోపు గుడి పునఃప్రతిష్ఠ కార్యక్రమం పూర్తి చేసేదుకు ముహూర్తపు తేదీని ఖరారు చేయాలని నాలుగు నెలల క్రితం దేవదాయశాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ కర్నూలు డీసీ పట్టెం గురుప్రసాద్‌లు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులకు ఆదేశించారు. అయితే అర్చకుల మధ్య విభేదాలు తారా స్థాయిలో ఉన్నాయి. దీంతో ముహూర్తం నిర్ణయించేందుకు వీరు పట్టించుకున్న పాపాన పోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాలక మండలి చెబుతున్నా పట్టించుకోని అధికారి

పునః ప్రతిష్ఠ చేయించే విషయంపై నాతో పాటు పాలక మండలి సభ్యులు అందరం చెప్పినా ఆలయ అధికారి స్పందించలేదు. ఆర్జేసీ స్వయంగా గండికి వచ్చి చెప్పినా ఆయన ఖాతరు చేయలేదు. ఈయన సకాలంలో స్పందించి ఉంటే పునః ప్రతిష్ఠ ఎప్పుడో జరిగి ఉండేది. నేడు భక్తులు అడిగే ప్రశ్నలకు మేము సమాధానం చెప్పలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– కావలి కృష్ణతేజ, గండి వీరాంజనేయ స్వామి ఆలయ చైర్మన్

నిరాహార దీక్ష చేస్తా

శ్రావణ మాసం మొదటి శనివారం వరకు చూస్తాం. ఆలోపు ఆలయ పునః ప్రతిష్ఠ చేసి భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించాలి. లేని పక్షంలో రెండవ శనివారం నాటి నుంచి గండి మూల విరాట్ ఎదురుగా రాయచోటి–వేంపల్లె ప్రధాన రహదారి వద్ద నిరాహార దీక్ష చేపడతాను.

– శివప్రసాదరెడ్డి, జెడ్పీటీసీ

ఇంత నిర్లక్ష్యం దేవదాయ శాఖ చరిత్రలోనే లేదు

గండి దేవస్థానం విషయంలో దేవదాయశాఖ వహిస్తున్న తీరు అధ్వానంగా ఉంది. ఇంతటి నిర్లక్ష్యం దేవదాయ శాఖ చరిత్రలోనే లేదు. గుడి పట్ల ఇంత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారో అర్థం కాలేదు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. మూల విగ్రహం కదిలించకుండా గుడి నిర్మాణ పనులు చేశారు. నిత్యం మూల విరాట్‌కు ధూపదీప నైవేద్యాలు పెడుతున్నారు. అలాంటప్పుడు కుంభాభిషేకం అవసరం లేదు.

– జీసీ యోగీశ్వరరెడ్డి, కడప దేవదాయ శాఖ రిటైర్డ్ సహాయ కమిషనర్

గండిలో నేడు టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ, స్వాగత తోరణాలు, చలువపందిళ్లు, బారికేడ్ల ఏర్పాటుకు సంబంధించి బుధవారం సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వీటితో పాటు ఫొటో, వీడియో కవరేజి, ప్రత్యేక భజంత్రీల ఏర్పాటుకు కూడా టెండర్లు జరుగుతాయన్నారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

250 గ్రాముల గంజాయి పట్టివేత

సింహాద్రిపురం : వాహనాల తనిఖీలో గంజాయి పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం పోలీసు సిబ్బందితో కలిసి ఆయన సింహాద్రిపురం – పార్నపల్లె రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి దొరికింది. దీనిపై సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరం ఆలంఖాన్‌పల్లె సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓబయ్య (55) మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఆలంఖాన్‌పల్లికి చెందిన ఓబయ్య సొంత పని నిమిత్తం మాచుపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి బైపాస్ రోడ్డు ద్వారా ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఇంటి సమీపంలోకి రాగానే రోడ్డు డివైడర్‌కు బైకు ఢీకొనడంతో కిందపడి బలమైన గాయం తగిలి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్తదాన ప్రాధాన్యతను గుర్తించాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ రక్తదాన ప్రాధాన్యతను గుర్తించి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పిలుపునిచ్చారు.

మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు ప్రచురించిన రక్త వారోత్సవాల కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు కాశి, సురేంద్ర, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు ఈనెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం భాస్కర్ రెడ్డి, సెక్రటరీ పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. జూలై 12వ తేదీ రెండవ శనివారం కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్ 15, అండర్ 17 విభాగాలకు చెందిన బాలబాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. అలాగే 13వ తేదీ ఆదివారం ప్రొద్దుటూరు జార్జ్ క్లబ్‌లో అండర్ 11, అండర్ 13 బాలబాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం లోపు 9440107080 లేదా 9440223908 నంబర్‌కు ఎంట్రీలను పంపాలని అసోసియేషన్ చైర్మన్ బాషా కోరారు.

ఉత్సాహంగా ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు

7 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ వరుణ్ సాయి

6 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్

163 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ రిహాన్

70 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ధీరజ్ కుమార్ రెడ్డి

4 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్

- 7 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ వరుణ్ సాయి నాయుడు
- 6 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో కడప–నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ కొనసాగుతోంది. మంగళవారం రెండవ రోజు తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 129 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించగా 67.3 ఓవర్లలో 303 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ధీరజ్‌కుమార్ రెడ్డి 70 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 4 వికెట్లు, సయ్యద్ షాహుల్ హుస్సేన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 38 ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 144 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ 62 పరుగులు, కారుణ్య ప్రసాద్ 46 పరుగులు చేశారు. దీంతో రెండవ రోజు ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో..

అదే విధంగా వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 179 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 58.2 ఓవర్లలో 260 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రిహాన్ 159 బంతుల్లో 29 ఫోర్లు, 2 సిక్సర్లతో 163 పరుగులు చేశాడు. తమీమ్ 38 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు తీశాడు. మంజునాథ్ 2 వికెట్లు, తేజేష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 34.5 ఓవర్లలో 99 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు అద్భుతంగా బౌలింగ్ చేసి 7 వికెట్లు తీశాడు. టీవీ సాయి ప్రతాప్ నాయుడు 3 వికెట్లు తీశాడు. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 4.2 ఓవర్లకు 29 పరుగులు చేసింది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ డైరెక్ట్10th, Inter, (వయస్సు18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366

SERIVCES
PERSONAL CARE
CHANGE OF NAME
■I BAYAPUREDDY DHEERAJH RREDDE (OLD NAME) S/O BAYAPU REDDY VENU GOPAL REDDY R/O D.NO:-3/647, GAYATHRI NAGAR , YMR COLONY,PRODDATUR TOWN & MANDAL YSR KADAPA DIST AP . I CHANGED MY NAME TO BAYAPUREDDY DHEERAJH REDDY. HENCE FORTH .I WILL BE KNOW AS BAYAPUREDDY DHEERAJH REDDY

■WE BAYAPUREDDY VENU GOPAL REDDY & BAYAPUREDDY SUNANDA PARENTS OF BAYAPUREDDY KESH AVVAA REDDY R/O D.NO.:-3/647, GAYATHRI NAGAR, YMR COLONY, PRODDATUR TOWN & MANDAL YSR KADAPA DIST AP. DECLARE THAT OUR SON NAME HAS CHANGED TO BAYAPUREDDY KESH AVAREDDY (NEW NAME) FROM BAYAPUREDDY KESHAVVAA REDDY (OLD NAME)

LOST
■Passport No:T350221 pedda palli Nagaraju, S/o pedda palli thimmaya D.No: 46-108-5-3-2 sattar colony, Kadapa city, YSR District. పై వివరాలు గల పాసుపోర్టు matari street) నుండి sattar colony కు ఇల్లు మారినప్పుడు పోయి నది. దయచేసి దొరికిన వారు పై చిరునామాలో సంప్రదించండి.

■Passport No:K4157948 Dt:17-07-2012 Issued by The Regional Pass port Office Hyderabad. PATAN MUHIB KHAN, S/O PATAN KHADER KHAN. R/at. D.No:30/22-9-33-3, Alimabad Street, Rayachoty (Town &MDL), ANNAMAYYA (DIST),A.P. అను నెంబరు, చిరునామా కలిగిన పాసుపోర్టు తీసుకొని బస్సు కోసం రాయచోటి బస్టాండ్ నందు ఉన్నప్పుడు ఎక్కడో జారిపోయినది దొరికిన వారు పై చిరునామాకు తెలుపగలరు.

■పావుదిప్పు మహేశ్వర్ రెడ్డి S/o పావుదిప్పు మల్లెంకొండారెడ్డి అను నేను యస్.రామాపురం నుండి బద్వేల్ కు జిరాక్స్ కొరకు బస్సులో వెళ్తుండగా నా ఒరిజినల్ పాసుపోర్టు పోయినది. పాసు పోర్టు నెం:M0230852 ఎవరికైన దొరికిన యెడల ఈ అడ్రస్‌కి తెలుపగలరు మా అడ్రస్ యస్.రామాపురం గ్రామం, గోపవరం మండలం, వె.యస్.ఆర్. కడప జిల్లా సెల్ : 8919523180

WANTED
■రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. ఫో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్లు కమీషన్ 5000/- 92814 52827, 92814 52838

■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ. 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135

■ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యేకంగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఒంటరి మహిళ దారుణ హత్య?

హసీనా(ఫైల్)

పులివెందుల రూరల్ : స్థానిక గుంత బజార్‌లో నివాసముంటున్న ఒంటరి మహిళ హసీనా (46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు హసీనా పట్టణంలోని వివేకానంద పాఠశాల సమీపంలో నివసిస్తోంది. ఆమె కువైట్ నుంచి వచ్చి వివాహం చేసుకోకుండా ఇక్కడే ఒంటరిగా ఉంటూ వడ్డీలకు డబ్బులు ఇచ్చేదని సమాచారం. ఆమె ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. దీంతో సీఐ చాంద్ బాషా, ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి గొంతు, చేతులపై రక్త గాయాలు ఉండడంతో ఆమెను ఎవరైనా హత్య చేశారా? అనే అనుమానం రేకెత్తుతోంది. హసీనా మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో దాదాపు నాలుగైదు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. షబ్బీర్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

జీవితఖైదు పడిన తిప్పాబత్తిని క్రిష్ణయ్య

కడప అర్బన్/మైలవరం : మైలవరం పోలీసు స్టేషన్ పరిధిలో 2022లో ఓ వివాహితపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడు తిప్పాబత్తిని క్రిష్ణయ్య అలియాస్ ఓబులయ్యకు జీవిత ఖైదుతో పాటు, ఒక లక్ష వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కడప ఏడవ అదనపు జిల్లాకోర్టు జడ్జి జీ.ఎస్. రమేష్ కుమార్ తీర్పునిచ్చారు. ఈ కేసులోని ఫిర్యాది వివాహిత మైలవరం మండల పరిధిలో గల వేపరాలలో నివాసం ఉంటూ చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేది. ఆమెకు భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో బెంగళూరులో చికిత్స పొందుతూ వచ్చింది. 2022 జనవరి 11న మధ్యాహ్నం సమయంలో ఆమె ఒక్కతే ఇంటిలో ఉండగా నిందితుడు తిప్పాబత్తిని క్రిష్ణయ్య అలియాస్ ఓబులయ్య (54) ఇంటిలోకి ప్రవేశించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె తన భర్తతో కలిసి మైలవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై అప్పటి మైలవరం ఎస్ఐ బి. రామక్రిష్ణ కేసు రిజిస్టర్ చేసి తదుపరి చర్య నిమిత్తం అప్పటి జమ్మలమడుగు రూరల్ సీఐ కొండారెడ్డికి అప్పగించారు. సదరు కేసు కడప 7వ అదనపు జిల్లా కోర్టు జి.ఎస్. రమేష్ కుమార్ ముందు విచారణకు వచ్చింది. ప్రస్తుత రూరల్ సీఐ కె.గోపాల్ రెడ్డి, ఎస్ఐ సి.శ్యామ్ సుందర్‌రెడ్డి సంబంధిత కోర్టు కానిస్టేబుళ్లను సమన్వయ పరుస్తూ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.యాస్మిన్ బాధితురాలి తరపున వాదనలు వినిపించి నేరస్తునికి శిక్ష పడే విధంగా కృషి చేశారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్.పి ఈ.జి.అశోక్ కుమార్ అభినందించారు.

అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

కలికిరి : అనారోగ్యం, మతిస్థిమితం సరిగ్గాలేని యువతి పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం కలికిరి పట్టణ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కలికిరి గ్రామ పంచాయతీ నగ్రావాండ్లపల్లికి చెందిన ఎర్రయ్య, గంగులమ్మల కుమార్తె కె.చందన(23)తో కలిసి కలికిరి సీఎల్ఆర్సీ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న చందన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అప్పుడప్పుడూ మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ పెట్రోలు బంకులో పెట్రోలు కొనుక్కుని గిరిజన కాలనీ సమీపం కలికిరి వంక వద్ద ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. ఉదయం యువతి మృతదేహాన్ని గుర్తించిన గిరిజన కాలనీ వాసులు పోలీసులకు సమాచారమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

జయరామిరెడ్డి (ఫైల్)

మైదుకూరు/బి.కోడూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బి.కోడూరు మండలం గుంతపల్లెకు చెందిన గుంత జయరామిరెడ్డి (42) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంతపల్లెకు చెందిన జయరామిరెడ్డి జూన్ 29న ఖాజీపేట మండలం శ్రీనివాసపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు ఆయన శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తన బంధువు కొండా వెంకటరమణారెడ్డితో కలిసి మైదుకూరుకు వస్తున్నారు. జాతీయ రహదారి సర్వాయపల్లె అండర్ పాస్ వద్ద సిమెంట్ మిక్చర్ వాహనం వారిని ఢీ కొంది. సంఘటనలో జయరామిరెడ్డి, వెంకటరమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొండా వెంకటరమణారెడ్డి చికిత్స పొందుతున్నాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ జయరామిరెడ్డి మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైకుల దొంగ అరెస్టు

యశవంతపుర : అతని కన్ను పడితే ఎలాంటి బైక్ అయినా మాయం అవుతుంది. ఘరానా ద్విచక్ర వాహనాల దొంగను బెంగళూరు హెచ్ఏఎల్ పోలీసులు అరెస్ట్ చేసి రూ. 40 లక్షల విలువగల 32 బైక్‌లను సీజ్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన హేమంత్ (23) నిందితుడు. ఇటీవల విభూతిపురలో జరిగిన బైకు చోరీ కేసులో విచారించి మదనపల్లి మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న హేమంత్‌ను అరెస్ట్ చేశారు. హొసకోట, విజయపురలోనూ బైకులను చోరీ చేశాడు. 20 బైకులను మదనపల్లెలోని తన స్నేహితులకు అమ్మినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన బైకులను మదనపల్లె మెయిన్ రోడ్డులోని ఖాళీ జాగాలో దాచి ఉంచాడు. వాటిని స్వాధీనం చేసుకుని తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కలికిరి : తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారిలో వాల్మీకిపురం మండల పరిధిలోని గండబోయనపల్లి సమీపంలో గల టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య కుమారుడు వినేష్ సొంత పనుల నిమిత్తం మదనపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గండబోయనపల్లి సమీపంలోని టోల్‌గేటు వద్ద కర్ణాటకకు చెందిన కెఏ36ఎం 9619 తూఫాన్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో వినేష్‌కు తీవ్ర గాయాలు కాగా, తూఫాన్ వాహనం రోడ్డుపైన పల్టీ కొట్టింది.

ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ న్యాయ కళాశాలల విద్యార్థులకు ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె. ఎస్ వి.కృష్ణారావు తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి మాట్లాడుతూ 684 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని 99 గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్ డాక్టర్ వి.రామకృష్ణ కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది పి. చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రేమ చిగురించిన చోటే.. ప్రాణమూ పోయింది

- పాశమైలారం ఫార్మా ప్రమాదంలో యువజంట దుర్మరణం
- మృతుల్లో అబ్బాయిది వైఎస్సార్ కడప జిల్లా పెనికలపాడు
- యువతిది ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల
- ఇరు గ్రామాల్లో విషాద ఛాయలు

అగ్ని ప్రమాదంలో దుర్మరణం చెందిన నిఖిల్,రమ్య(ఫైల్‌ఫొటో)

ముద్దనూరు / పుట్రేల(విస్సన్నపేట) : ఆ రెండు మనసులను పనిచేసే ప్రాంతమే ప్రేమను చిగురించేలా చేసింది. పరిచయంగా మారిన ప్రేమ..మరో రెండు నెలల్లో పెళ్లిపీటల దాకా తీసుకెళ్లింది. కానీ ఇంతలోనే మృత్యువు ఆ ఇద్దరినీ పలకరించింది. ఆ పనిచేసే ప్రాంతంలోనే పాశాన్ని విసిరింది. అనుకోని విపత్తు రూపంలో ఆహుతి చేసింది. ఎన్నో ఆశలతో కొత్త జీవితాన్ని ఆరంభించాలనే ఆ జంట..ఇంట పెను విషాదాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన యువతీ, యువకులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాల్లోకి వెళితే..వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నిఖిల్ కుమార్‌రెడ్డి (25), ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన రామాల శ్రీరమ్య ఫార్మా పరిశ్రమలో ఉద్యోగులు. ఇక్కడే వారి మధ్య పరిచయం ఏర్పడింది. ఇరువురూ తమ పెద్దలను ఒప్పించారు. మరో రెండునెలల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన తరుణంలో విషాదం వెంటాడింది. సోమవారం ఇద్దరూ పరిశ్రమలో విధుల్లో ఉన్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వారిద్దరూ మృతి చెందారు. ఈ ఘటనతో పెనికలపాడు, పుట్రేల గ్రామాల్లో మంగళవారం తీవ్ర విషాదం అలుముకుంది.

రెండునెలల్లో పెళ్లి చేద్దామనుకున్నాం..

రామాల నారయ్య, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె జ్యోత్స్న బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసి ఆరు నెలల క్రితమే సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరింది. ఇంతలో ఘోర విపత్తులో చిన్న కుమార్తె ప్రాణాలు కోల్పోవడాన్ని తలచుకుంటూ తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. నిఖిల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడి ఆషాఢం వెళ్లిన తర్వాత పెళ్లి చేద్దామనుకున్నామని తీరా ఈ విషాద సంఘటనలో ఇరువురు చనిపోయారని మృతురాలి తల్లి పద్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.